# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక


01-11-2023 సంపుటి -1 దీపావళి (నవంబర్) సంచిక -9 రూ.25/-

## దీపావళి శుభాకాంక్షలు





చీఫ్ ఎడిటర్
**శ్రీమతి ఎ. శ్రీవిద్య**






ఎడిటర్
**శ్రీమతి కె. వీణ**

## తెలుగు సాహితీ జగత్తులో
## అనతి కాలంలోనే ధ్రువతారగా నిలిపినందుకు
## సుమతిని
## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)
## ధన్యవాదాలు తెలుపుతూ

- ఎడిటోరియల్ బోర్డ్


# సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన
సుమతి సకుటంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి
కవర్ పేజి కలర్ :రూ.5000/-
కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/-
లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /-
లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /-


# రచనలకు ఆహ్వానం

యువ రచయితలను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కథలు, కవితలు, కార్టూన్లను, సమకాలీన వ్యాసాలను ఆహ్వానిస్తున్నాము. రచనలు తమ సొంతమేనని మరెక్కడా ప్రచురితం కాలేదని హామీ పత్రం తప్పని సరిగా జత చేయాలి. రచనలన్నీ యునికోడ్ లో టైపు చేసి ఈ క్రింది ఇ మెయిల్ కు పంపగలరు


sumathi.kathalu2023@gmail.com

sumathi.kavitalu2023@gmail.com



చీఫ్ ఎడిటర్

**శ్రీమతి ఎ. శ్రీవిద్య**






ఎడిటర్

**శ్రీమతి కె. వీణ**




# సుమతి చందాదారులుకండి

ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది. ఇప్పుడు సుమతి పత్రికను ఆన్లైన్లో కూడా చదవ వచ్చు

https://sumathimasapathrika.com

## సుమతి

కుటుంబ మాసపత్రిక

**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల. **రూ. 25 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారికి 200 విలువచేసే పుస్తకాలను ఉచితంగా పంపబడును

ఈ క్రింది ఫోన్కు గూగుల్ పే కు లేదా ఫోనేపే కు చేయవచ్చు. 7893111985

సుమతి
మాసపత్రిక
సంపుటి :1 సంచిక:8
నవంబర్ 2023

సంపాదకురాలు
ఏ . శ్రీవిద్య
సహసంపాదకురాలు
కె .వీణ
ముఖచిత్రం
దుర్గామాత
చందా వివరాలు
సంవత్సర చందా రూ 250
ఐదేళ్ళ చందా రూ 1200
ప్రకటనలు , చందాలకు మరియు
రచనలు ,అభిప్రాయాలు
పంపవలసిన చిరునామా
SUMATHI.POTILU@GMAIL.COM
ప్రచురణ
సుమతి పబ్లికేషన్స్
c/o SHE & HE SOCIETY
(RC NO.:538/2006 )
హౌస్ నం :26 -46 -79
వేణుగోపాల నగర్ ,గుంటూరు

# సంపాదకీయం

## అసమానతలు తొలగించాలి

దేశం లో సంపన్నులపై హత్యాయత్నం జరగడం, చంపే స్తామంటూ బెదిరింపులకు దిగడం దేశంలో నిత్యకృత్యంగా మారింది. ఇందుకు ప్రధాన కారణం ప్రపంచంలో మరెక్కడా లేని రీతిలో సంపద పంపిణీలో నెలకొన్న తీవ్ర అసమానతలే, గత రెండున్నర దశాబ్దాల్లో భారత్ అనూహ్య వేగంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తోంది. ప్రపంచ అగ్రదేశాల్లో పోటీ పడుతోంది. గ్రేట్ బ్రిటన్ స్థూల జాతీయోత్పత్తిని సైతం భారత్ దాటేసింది. సంపద సృష్టిలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. అమెరికా, చైనాలకంటే కూడా జాతీయ సగటు వృద్ధిలో ఎక్కువ శాతాన్ని నమోదు చేస్తోంది. అయితే ఇలా పెరిగిన సంపద ఈ దేశంలోని కొన్ని కుటుంబాలకే పరిమితమౌతోంది. ఓ వైపు దేశంలో సంపన్నుల జాబితా పెరుగు తుంటే మరోవైపు దారిద్ర్యంలోకి నెట్టబడుతు న్న కుటుంబాల సంఖ్యా వేగంగా పెరుగుతోంది .

ప్రభుత్వాలు సంపన్నుల పట్ల ఒకలా.. పేదల పట్లా మరోలా వ్యవహరించడమే ఈ అంతరాల పెరుగుదలకు కారణం. ఇదే పేదల్లో ధనికుల పట్ల ఈర్ష్యాద్వేషాల్ని పెంచుతున్నాయి. . దేశంలో పెరిగిన సంపద పంపిణీలో వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు సమర్థవంతంగా నియంత్రించాలి. పన్నుల ఆదాయంలో పేదలు, మధ్య తరగతిపై భారం తగ్గించాలి. ఆ మేరకు సంపన్నులపై అదనపు భారం మోపాలి. పరిశ్రమలు, వ్యాపారాల విస్తరణ పేరిట వారికందిస్తున్న భారీ రాయితీలు, ఆర్థిక ప్రోత్సాహకాలకు నియంత్రణ పెట్టాలి. పేదల్ని పన్నుల భారం నుంచి విముక్తి చేస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగౌ తాయి. వారికి సంపన్నుల పట్ల ఈర్ష్యాద్వేషాలు తగ్గుతాయి. ఇది సంపన్నులకు ప్రాణహానిని దూరం చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

-సుమతి

లోపలి పేజీలలో....

# ఈ నెల కుసుమాలు...


## అందరి కోసం

6 ముఖచిత్ర కథ
7 నడుస్తున్న చరిత్ర
14 అంతర్నేత్రం
38 వార్తల్లో వ్యక్తి
43 నాలుగో కోతి
46 సెటైర్
49 కార్టూన్స్ పేజి
51 చూడాల్సిన ప్రదేశం
54 ఫేక్ న్యూస్
77 నమ్మకాలూ –నిజాలు
91 భేతాళ భారతం
94 మన కథానాయకులు
98 కార్టూన్స్ పేజి
16,61 వైరల్
99 జీవన చిత్రాలు
112 వినాల్సిన పాట
114 చదవాల్సిన పుస్తకం
116 చూడాల్సిన సినిమా
118 క్రాస్ రోడ్స్ కబుర్లు
126 కార్టూన్స్ పేజి
155 సాహితీశిఖరాలు
160 పుస్తక వీక్షణమ్
163 ఈ నెల స్మరణీయులు
166 పండుగ
181 ధర్మసందేహాలు
186 రాశి ఫలాలు

## పోటీలు

184 సాహితీ పద సుమతి
185 చిత్రకవిత

## యువత కోసం

80 కరెంట్ అఫైర్స్
78 ఫోటోగ్రఫి పాఠాలు
88 సంగీతం
90 యువతా తెలుసుకో
96 టెక్నాలజీ
153 క్రీడా ప్రపంచం

## మహిళల కోసం

50 వంటా వార్పు
148 మన పురాణాలు

## పిల్లల కోసం

18 2 పిల్లల కథ
18 3 పిల్లలు పిడుగులు

## సీరియల్స్

34 రాణా ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్)
40 గర్భ శోకం (క్రైం సీరియల్)
100 / డెత్ మెసేజ్ (క్రైం సీరియల్ )
122 పరుగులు తీసే నీ వయసునకు (సీరియల్)
169 విధి విన్యాసం ( సీరియల్ )

## కథలు

17 దూరం దగ్గరయ్యింది
29 డామిట్ కథ అడ్డం తిరిగింది (హాస్య కథ )
55 ద్రోహి ( కథ )
67 ది డైరీ అఫ్ రాధ
71 రచయత హత్య
101 ఆశ దోశ అప్పడం ( కథ)
127 హైటేక్ పెళ్ళి (కథ )
130 వెన్నల వెలుగులో ( కథ )
133 దాశాక్షరి (కథ)
137 తెర వెనుక మనిషి (కథ )
140 నిజమైన స్నేహితుడు ( కథ )
143 తియ్యటి తోడు (కథ )
174 దాగని నిజం ( కథ )
178 అవ్యక్తం (వాస్తవ కథ )

## కవితలు

33 మాకు కొంచం సమయమివ్వండి
45 నిను చూడగానే
100 ప్లాస్టిక్ పలకరింపులు
139 ఉత్సవ విగ్రహాలు
167 కర్మయోగి

ముఖ చిత్ర కథ

# దీపావళి తపాసులతో జరా జాగ్రత్త !



సర్వేంద్రియానం... నయనం ప్రధానం అన్నారు. ఎంతో సంతోషంగా రంగురంగుల వెలుగులు జరుపుకోవాల్సిన దీపావళి పండుగ చిన్న చిన్న తప్పిదాలతో జీవితాన్నే చీకటిగా మార్చివేసే ప్రమాదముంది.

భారతీయ పండుగల్లో దీపావళిది ప్రత్యేక స్థానం. దీపావళి రోజు ప్రజలంతా భక్తి శ్రద్ధలతో లక్ష్మీ దేవిని పూజిస్తారు. కుటుంబ సభ్యులకు, స్నేహితులకు బహుమతులు పంచుతూ ఆహ్లాదకరంగా పండుగ వేడుకలు జరుపుకుంటారు. దీపావళి అనగానే ముఖ్యంగా పిల్లల్లో ఎనలేని ఉత్సాహం వస్తుంది. దానికి ప్రధాన కారణం టపాసులే. అయితే పటాకులు కాల్చడంపై పిల్లలకు అవగాహన లేక ఎంతోమంది గాయాల పాలవుతున్నారు. కొంతమంది చూపు కోల్పోతున్నారు.

వాస్తవానికి, బాణాసంచా కాల్చే సమయంలో చేతి వేళ్లతో పాటు కళ్ళు కూడా అత్యంత ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. అందుకే దీపావళి వేడుకల్లో బాణసంచా కాల్చేటప్పుడు ఖచ్చితంగా భద్రతా చర్యలు తీసుకోవాలి. లేదంటే పటాకులు నుంచి వచ్చే కాంతి మీ కంటికి గాయాలు చేసే అవకాశం ఉంది. అంతేకాదు, పటాకులు పేలడం వల్ల వచ్చేపొగ కళ్లలో మంటకు కారణమవుతుంది. తీవ్రతను బట్టి శాశ్వతంగా దృష్టిని కోల్పోవడానికి కూడా దారితీస్తుంది

సర్వేంద్రియానం... నయనం ప్రధానం అన్నారు. ఎంతో సంతోషంగా రంగురంగుల వెలుగులు జరుపుకోవాల్సిన దీపావళి పండుగ చిన్న చిన్న తప్పిదాలతో జీవితాన్నే చీకటిగా మార్చివేసే ప్రమాదముంది. టపాసులు కాల్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు ఈ సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. పటాకులు కాల్చే సమయంలో వారి దగ్గర పెద్దలు ఉండకపోవడం, సరైన మార్గదర్శకాలు లేకపోవడంతో ఇష్టానుసారంగా కాల్చుతారు. ఒక్కోసారి గాయాల పాలవుతారు. నిర్లక్ష్యం వల్ల చాలా మంది కళ్లు పోగొట్టుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

బాణాసంచా కాల్చే సమయంలో వేసుకునే బట్టలు విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పట్టు బట్టలు, నైలాన్ వస్త్రాలు ధరించకూడదు అని, కాటన్ దుస్తులనే ధరించి బాణాసంచా కాల్చాలి అని చెబుతున్నారు. జీన్స్ ప్యాంట్లు, టీ షర్ట్ లు వేసుకోకూడదని అంటున్నారు. ఇక బాణాసంచా కాల్చే సమయంలో, వాటిని వెలిగించేటప్పుడు ముఖాన్ని దగ్గరగా పెట్టకూడదని సూచిస్తున్నారు.

చైనా టపాసుల్లో ప్రమాదకరమైన రసాయనాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండటం మంచిది.

నాణ్యమైన, గుర్తింపు గల కంపెనీలకు చెందిన పటాకులు మాత్రమే కొనుగోలు చేయాలి.

టపాసులు కాల్చేటప్పుడు పిల్లలను ఒంటరిగా వదలకండి. వారి వెంట పెద్దవారు తప్పనిసరిగా ఉండాలి.

బహిరంగ ప్రదేశాలు, మైదానాలు, ఖాళీ స్థలాల్లో మాత్రమే కాల్చాలి.

ముందుజాగ్రత్తగా కనీసం రెండు బక్కెట్ల నీటిని అందుబాటులో ఉంచుకోవాలి. పటాకులను కాల్చే సమయంలో కళ్లకు ప్రొటెక్టడ్ గ్లాసెస్‌ను పెట్టుకోవడం ఉత్తమం.

చిన్నచిన్న కాలిన గాయాలైతే వెంటనే వాటిని చల్లని నీటిని పోయాలి. శరీరానికి మంటలు అంటుకున్న సందర్భంలో శుభ్రమైన కాటన్ బెడ్‌షీట్ లేదా దుప్పటితో వాటిని ఆర్పివేసి వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి. ముఖానికి గాయాలైనప్పుడు ముఖ్యంగా దాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

★★★



# మతం కోసం ,మందిరం కోసం మనుషులు కొట్టుకు చస్తున్నారు

## (ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం )

కుప్పలుతెప్పలుగా మృతదేహాలు, ఆడవారిపై అత్యాచారాలు, నగ్నంగా ఊరేగింపులు.. హమాస్ మిలిటెంట్ల అమానవీయ చర్యలతో ప్రపంచం తల్లడిల్లుతోంది. వేల సంఖ్యలో ఆయుధాలతో సామాన్యులపై విరుచుకుపడుతున్నారు. ఇజ్రాయిల్ నుంచి ఎంతో మంది మహిళల్ని, పిల్లల్ని గాజాకు తరిలించారు. యుద్ధ ఖైదీలుగా అపహరించుకు వెళుతున్నారు హమాస్ మిలిటెంట్లు. మరోవైపు గాజాపై ఇజ్రాయెల్ కూడా తీవ్రస్థాయిలో దాడులు చేస్తోంది. దీంతో దాదాపు ఇరు దేశాల్లో వందల వేల మరణాలు సంభవించాయి. అంతకుమించి క్షతగాత్రులు అయ్యారు. పశ్చిమ ఆసియా చరిత్ర పుటల్లో మరో రక్తచరిత్ర లిఖిస్తున్నాయి ఇరు దేశాలు.

12వ శతాబ్దం తర్వాత క్రైస్తవ ప్రాబల్యం తగ్గి ఇస్లాం ప్రాబల్యం పెరగడంతో కొంతలోకొంతైనా ప్రమాదం నుండి బయటపడ్డామని సంతోషించారు యూదులు ... కానీ..., పాపం... వాళ్ళ పరిస్థితి పెనంమీదనుండి పొయ్యిలో పడ్డట్లైంది ... కనీస మానవ హక్కులు అటుంచి మతం మారుమంటూ నరకయాతనలు పెట్టడం. అధిక పన్నులు విధించడం, మతం ఆధారంగానే శిక్షలు ఖరారు చేయడం, ... లాంటివెన్నో... వీటిని తట్టుకోలేక లక్షలాదిమంది ఫ్రాన్స్ ,పోలాండ్ , ఇంగ్లాండ్ ,అమెరికాలకు ... లకు పారిపోవాల్సివచ్చింది ... కానీ..., ఎక్కడికెళ్లినా చెప్పలేనంత మతవివక్షను ఎదుర్కోవలసి వచ్చింది ... ఒక్క భారతదేశం, అమెరికాల్లోనే ఏ వివక్షాలేకుండా ఉండగలిగామని ..., భారతదేశంలో పొందగలిగినంత గౌరవం మరెక్కడా పొందలేదనీ ఇప్పటికీ గుర్తుచేస్తుండడం ఈ మధ్య పత్రికల్లో కూడా చూసాము కూడా ... అందుకే..., జర్మనీ లోనైతే హిట్లర్ ఏకంగా విష వాయువుల గదులలో బంధించి విషవాయువు వదలడం ద్వారా, ఇంకా అనేక రకరకాలుగా హింసించి సుమారు 60 లక్షల మందిని పొట్టనబెట్టుకున్నాడు ... యూదుడైన చివరకు గొప్ప మేధావి అయిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కూడా వీళ్ళ ఆగడాలు భరించలేక అమెరికాకు పారిపోవాల్సివచ్చిందంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉండేదో ఊహించుకోవచ్చు ..

ఈ యుద్ధానికి వందేండ్ల చరిత్ర ఉన్నది. మొదటి ప్రపంచ యుద్ధ సమయం నుంచి ఇదొక రావణకాష్టంలా రగులుతూనే ఉన్నది. మొదటి ప్రపంచ యుద్ధంలో పాలస్తీనా ప్రాంతాన్ని పరిపాలిస్తున్న ఒట్టొమాన్ సామ్రాజ్యం ఓటమి పాలైంది. బ్రిటన్ ఆ ప్రాంతాన్ని తన నియంత్రణలోకి తెచ్చుకున్నది. ఆ ప్రాంతంలో యూదులు తక్కువ సంఖ్యలోనూ, అరబ్బులు ఎక్కువ సంఖ్యలో ఉండేవారు. పాలస్తీనా ప్రాంతంలో యూదుల రాజ్యాన్ని ఏర్పాటు చేసే బాధ్యత ప్రపంచ దేశాలు బ్రిటన్‌కు అప్పగించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి.

**నడుస్తున్న చరిత్ర**

# ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం



ఇజ్రాయెల్, పాలస్తీనా వివాదం ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన, కొనసాగుతున్న సంఘర్షణలలో ఒకటి. అప్పుడప్పుడు ఘర్షణలు, విధ్వంసాలు, మరణాలు కొనసాగే ఈ ప్రాంతంలో తాజాగా తిరిగి వివాదం చెలరేగింది. దీంతో రెండు ప్రాంతాల్లోనూ వందలాది మంది పౌరులు మరణించారు. ఇజ్రాయెల్ –పాలస్తీనా వివాదానికి అనేక కారణాలున్నాయి.

ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న రక్తపాత సంఘర్షణను అర్థం చేసుకోవాలంటే, ఆ స్థలం, దానితో సంబంధం ఉన్న వ్యక్తుల నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి. ప్రస్తుత సంఘర్షణకు 20వ శతాబ్దంలో మూలాలు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతానికి చెందిన పురాతన చరిత్రను కూడా తెలుసుకోవాలి. అక్కడి మతపరమైన, చారిత్రక ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి. ఇజ్రాయెల్ పశ్చిమాసియాలోని ఒక చిన్న దేశం, ఇది భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాలు మేఘాలయ లేదా మణిపూర్ పరిమాణంలో ఉంటుంది. ఇజ్రాయెల్ దాని పశ్చిమాన మధ్యధరా సముద్రం, దక్షిణాన ఈజిప్ట్, తూర్పున జోర్డాన్, సిరియా, ఉత్తరాన లెబనాన్ సరిహద్దులుగా కలిగి ఉన్నది. ఇజ్రాయెల్‌లో యూదులు, క్రైస్తవులు, ముస్లింలకు మతపరమైన ప్రాముఖ్యత ఉన్న అనేక ప్రదేశాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ జనాభాలో యూదులు మెజారిటీ స్థానంలో ఉన్నారు. క్రైస్తవులు, ముస్లింలు ఆ తరువాతి స్థానంలో ఉన్నారు.

ఇక్కడి జెరూసలేం ఒక పురాతన నగ రం. దీన్ని ఇజ్రాయెల్, పాలస్తీనాలు రెం డూ తమ సొంతమని క్లెయిమ్ చేసుకుంటున్నాయి. ఇజ్రాయెల్ మొత్తం అవిభక్త నగరాన్ని తన రాజధానిగా పేర్కొంటున్నది, అయితే పాలస్తీనియన్లు దీన్ని తిరస్కరిస్తున్నారు. తమ స్వేచ్ఛ, స్వీయ నిర్ణయ హక్కును హరించడమేనన్నది వారి వాద న. ఈ నగరం అబ్రహమిక్ మతాలైన జు డాయిజం, క్రిస్టియానిటీ, ఇస్లాం మతాలకు సంబంధించిన అనేక మతపరమైన ప్రాముఖ్యతలను కలిగి ఉన్న పవిత్ర ప్రాం తంగా పరిగణించబడుతుంది.

ఇజ్రాయెల్.. యూదుల కోసం ప్రత్యేకంగా ఏర్పడిన దేశం. ప్రపంచంలో యూదులు ఏ మూలన ఉన్నా సరే వారు తమ పౌరులేనని ప్రకటించిన దేశం. అదేసమయంలో 1920 నుంచి 1940 వరకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యూదులు పాలస్తీనాకు తరలి వచ్చారు. అయితే, పాలస్తీనాలోని అరబ్బులతో పొసగక ప్రత్యేక దేశం ఏర్పాటుకు ప్రయత్నించారు. దీన్ని స్థానిక అరబ్బులు తీవ్రంగా వ్యతిరేకించారు. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఒట్టోమన్ సామ్రాజ్యం పతనం కాగా పాలస్తీనాపై బ్రిటన్ పట్టుపెంచుకుంది. ఈ క్రమంలో యూదులకు మాతృభూమిని ఏర్పాటు చేసే బాధ్యత బ్రిటన్ పాలకులపై పడింది. ప్రపంచ

నడుస్తున్న చరిత్ర

# ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం

దేశాలలో ఉంటున్న యూదులంతా పాలస్తీనాకు తరలిరావడం మొదలు పెట్టారు. ఇది కాస్తా పాలస్తీనాలో ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుని యూదులు, అరబ్బులకు పాలస్తీనా ప్రాంతాన్ని సమంగా విభజించే ప్రతిపాదన చేసింది.

1948లో ఇజ్రాయెల్ స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత జెరూసలేం పశ్చిమ, తూర్పు భాగాలుగా విభజించబడింది. పశ్చిమ జెరూసలేం ఇజ్రాయెల్ రాజధాని కాగా, తూర్పు జెరూసలేం జోర్డాన్‌లో భాగమైంది.1967లో జరిగిన ఆరు రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ తూర్పు జెరూసలేంను స్వాధీనం చేసుకున్నది. ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్న కొద్దికాలానికే తూర్పు జెరూసలేంకు పొరుగున ఉన్న వెస్ట్ బ్యాంక్ గ్రామాలతో పాటు పశ్చిమ జెరూసలేంలో విలీనం చేయబడింది. అదే సంవత్సరం, ఆక్రమిత స్థలాల నుండి ఇజ్రాయెల్ ఉపసంహరించుకోవాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

### గొడవలకు కారణం

ఒకప్పుడు ఈ కొండపై రెండు పురాతన యూదు ఆలయాలు ఉండేవి. మొదటిదేమో బైబిల్ ప్రకారం కింగ్ సొలమన్ నిర్మించినది. తర్వాత బాబిలోనియన్స్ దాన్ని కూలగొట్టారు. రెండోది నిర్మితమై 600 ఏళ్లున్న తర్వాత తొలి



శతాబ్దిలో రోమన్ చక్రవర్తి చేతిలో ధ్వంసమైంది. మెస్సయ్య తిరిగి వచ్చాక ఇక్కడే మళ్లీ ఆలయం కడతారని, ఇక్కడింకా దైవశక్తి ఉందని యూదుల నమ్మకం. 1967లో జరిగిన అరబ్–ఇజ్రాయెల్ యుద్ధంలో.. తూర్పు జెరూసలెంను జోర్డాన్ నుంచి ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. ఒకప్పుడు కూల్చిన తమ ఆలయాలను పునర్నిర్మించటానికి 1990లో కొంత మంది యూదు అతివాదులు ప్రయత్నించగా, గొడవలు తీవ్రమయ్యాయి.

1994లో జోర్డాన్, ఇజ్రాయెల్ మధ్య.. ఓ శాంతి ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం అల్–అఖ్సా విషయంలో యథాతథస్థితి కొనసాగించాని నిర్ణయించారు. ఇక్కడ ప్రార్థనలకు ముస్లింలకు అనుమతించినట్లుగా.. యూదులు, క్రైస్తవులకు అనుమతించరు. వారు కేవలం.. ఈ స్థలాన్ని సందర్శించి వెళ్లడానికి మాత్రమే అనుమతుంది. అల్–అఖ్సా ప్రాంగణంలో ప్రార్థనలకు అనుమతుల్లో ముస్లిమేతరులపై వివక్ష చూపుతున్నారంటూ.. చాలా కాలంగా వివాదం కొనసాగుతోంది. ఇజ్రాయెల్లోని అనేక యూదు మతసంస్థలు.. తమకూ ప్రార్థనలకు అనుమతి ఇవ్వాలని కోరుతున్నాయి. దీంతో అల్–అఖ్సా ప్రాంగణంలో.. ఇజ్రాయెల్ బలగాలతో పాలస్తీనీయులు గొడవకు దిగి ఘర్షణలు జరిగాయి. కొద్దిరోజులు కిందట ఇజ్రాయెల్ భద్రతాదళాల సాయంతో యూదు అతివాదులు భారీ సంఖ్యలో.. అల్–అఖ్సా ప్రాంగణంలోకి

నడుస్తున్న చరిత్ర

# ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం

అడుగుపెట్టారు. ఫలితంగా ఘర్షణ ముదిరి హమాస్ దాడులకు దారి తీసింది.

వివాదం ఎప్పుడు మొదలైంది?

ఇరవయ్యో శతాబ్దం ప్రారంభంలో ఐరోపాలో యూదులను లక్ష్యంగా చేసుకుని హింస ప్రజ్వరిల్లింది.ఆ పరిస్థితుల్లో యూదులకు ప్రత్యేక దేశం కావాలన్న డిమాండ్ ఊపందుకుంది.మధ్యధరా సముద్రం, జోర్డాన్ నదికి మధ్య ఉన్న పాలస్తీనా ప్రాంతాన్ని యూదులు, ముస్లింలు, క్రైస్తవులు కూడా పవిత్ర స్థలంగా భావిస్తారు. మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు ఈ ప్రాంతాన్ని ఆట్టొమన్ సామ్రాజ్యం పరిపాలించేది. ఈ ప్రాంతం చాలావరకు ముస్లింలు, అరబ్బుల స్వాధీనంలో ఉండేది. ఐరోపాలో తమపై జరుగుతున్న దాడిని తప్పించుకునేందుకు అనేకమంది యూదులు ప్రాణాలు చేతబట్టుకుని పాలస్తీనా ప్రాంతానికి తరలివచ్చారు. క్రమేపీ ఈ ప్రాంతానికి వచ్చే యూదుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దాంతో, స్థానిక అరబ్బులు, యూదులకు వ్యతిరేకంగా నిరసనలు ప్రారంభించారు.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఆట్టొమన్ సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడంతో, ఆ ప్రాంతాన్ని తమ అధికారం కిందకు తెచ్చుకునేందుకు బ్రిటన్, లీగ్ ఆఫ్ నేషన్స్ నుంచి అనుమతి పొందింది.మొదటి ప్రపంచ యుద్ధానికి ముందు, జరుగుతున్న సమయంలో కూడా ఆంగ్లేయులు యూదులకు, అరబ్బులకు అనేక వాగ్దానాలు చేశారు. వాటిలో కొన్నిటిని బ్రిటన్ నెరవేర్చలేకపోయింది. అంతే కాకుండా, మధ్యప్రాచ్యాన్ని ఫ్రాన్స్‌తో ముందే పంచేసుకుంది.ఈ పరిస్థితులన్నీ యూదులు, అరబ్బుల మధ్య ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. రెండు పక్షాల సాయుధ దళాల మధ్య హింసాత్మక ఘర్షణలు ప్రారంభమయ్యాయి.నాజీల చేతిలో యూదుల ఊచకోత, రెండో ప్రపంచ యుద్ధం తరువాత యూదులకు ప్రత్యేక దేశం కావాలన్న డిమాండ్ మరింత పెరిగింది.1947లో పాలస్తీనాను రెండుగా విభజించి యూదులకు, అరబ్బులకు పంచి ఇవ్వాలని, జెరూసలెంను అంతర్జాతీయ నగరంగా ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి సిఫారసు చేసింది. కానీ అరబ్బులు అందుకు సమ్మతించలేదు. ఈ వివాదాన్ని బ్రిటిష్‌వారు రిష్కరించలేకపోయారు.

1948లో బ్రిటిష్ వాళ్లు ఆ ప్రాతాన్ని విడిచివెళ్లిపోయిన తరువాత యూదులు ఇజ్రాయెల్ దేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.1948, మే 14న ఇజ్రాయెల్ దేశం ఏర్పడింది. దాంతో, స్థానిక ఉద్రిక్తతలు ప్రాంతీయ విభేదాలుగా మారిపోయాయి. మరుసటి రోజే ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, ఇరాక్‌లు ఈ ప్రాంతంపై దాడి చేశాయి. ఇదే మొదటి అరబ్-ఇజ్రాయెల్ యుద్ధం. దీన్నే యూదుల స్వాతంత్ర్య సంగ్రామం అని కూడా పిలుస్తారు.ఈ పోరాటం ముగిసిన తరువాత



నడుస్తున్న చరిత్ర

# ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం



ఐక్యరాజ్యసమితి అరబ్ రాజ్యానికి సగం భూమిని కేటాయించింది. అప్పటి నుంచే పాలస్తీనియన్లకు కష్టకాలం ప్రారంభమైంది. ఏడున్నర లక్షల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు చేతబట్టి పొరుగు దేశాలకు పారిపోయారు. కొందరిని ఇజ్రాయెల్ దళాలు బలవంతంగా ఇళ్ల నుంచి బయటకు తరిమికొట్టాయి.ఈ వివాదం అంతటితో ఆగిపోలేదు.

మళ్లీ 1956లో సూయజ్ కాలువ విషయంలో వివాదం ఏర్పడింది. మరోసారి ఇజ్రాయెల్, ఈజిప్ట్ ఒకదానికొకటి ఎదురు నిలిచాయి. అయితే, ఈ వివాదం యుద్ధ భూమికి ఆవలే పరిష్కారమైపోయింది.

1967లో మరోసారి అరబ్ దేశాలకు, ఇజ్రాయెల్‌కు మధ్య ఘర్షణలు చెలరేగి భారీ యుద్ధానికి దారి తీశాయి. ఆ ఏడాది జూన్ 5 నుంచి 10 వరకు జరిగిన సంఘటనల దీర్ఘకాలిక ప్రభావాలు అనేక స్థాయిలలో కనిపించాయి.ఈ యుద్ధంలో అరబ్ దేశాల కూటమిపై ఇజ్రాయెల్ విజయం సాధించింది. గాజా స్ట్రిప్, ఈజిప్ట్‌లోని సినాయ్ ద్వీపకల్పం, వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలెం, గోలన్ హైట్స్ ఇజ్రాయెల్ ఆధీనంలోకి వచ్చాయి. ఐదు లక్షల మంది పాలస్తీనియన్లు నిరాశ్రయులయ్యారు.

1973లో అరబ్ దేశాలకు, ఇజ్రాయెల్‌కు మధ్య 'యోం–కిప్పూర్' యుద్ధం జరిగింది. ఈజిప్ట్, సిరియా కలిసి ఇజ్రాయెల్‌పై దండెత్తి వచ్చాయి. ఈ యుద్ధంలో ఈజిప్ట్ సినాయ్ ద్వీపకల్పాన్ని స్వాధీనం చేసుకుంది.1982లో ఇజ్రాయెల్ సినాయ్ ప్రాంతం నుంచి వైదొలగింది. కానీ, గాజా ప్రాంతపై పట్టు వదల్లేదు.ఆరు సంవత్సరాల తరువాత ఈజిప్ట్, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్‌తో సమస్యలను పరిష్కరించుకున్న తొలి అరబ్ దేశం ఇదే.

తరువాత, జోర్డాన్ కూడా ఈజిప్ట్ బాటలో నడిచింది.

### హమస్ ఎలా పుట్టింది ?

పాలస్తీనాలోని మెజారిటీ భూభాగాన్ని సొంతం చేసుకున్న యూదులు ఇజ్రాయెల్ దేశాన్ని స్థాపిస్తున్నట్లు ప్రకటించారు. పాలస్తీనాలో ఇటు జోర్డాన్ కొంత భూభాగాన్ని, అటు ఈజిప్టు మరికొంత భూభాగాన్ని ఆక్రమించాయి. జోర్డాన్ ఆక్రమణలో ఉన్న ప్రాంతాన్ని వెస్ట్ బ్యాంక్ అని, ఈజిప్టు స్వాధీనం చేసుకున్న ప్రాంతాన్ని గాజా స్ట్రిప్ అని నామకరణం చేశారు.

పాలస్తీనాపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక కమిటీ 1947లో జనరల్ అసెంబ్లీకి సమర్పించిన నివేదికలో వెస్ట్రన్ గ్యాలీ (సమారియా, జుడియా పర్వత ప్రాంతం)ను అరబ్ దేశంలో చేర్చాలని, జెరూసలెం, ఈజిప్ట్ సరిహద్దులో ఉన్న ఇస్దుద్ తీర ప్రాంతాన్ని బయట ఉంచాలని సిఫారసు చేసింది.అయితే 1949లో ఏర్పడిన 'అర్మిస్టైస్ రేఖ' ద్వారా పాలస్తీనా విభజన జరిగింది. ఇజ్రాయెల్ ఏర్పడిన అనంతరం, మొదటి అరబ్–ఇజ్రాయెల్ యుద్ధం తరువాత ఈ రేఖ ఏర్పడింది. పాలస్తీనాలో ఉన్న వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్ ఒకదానికొకటి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. వెస్ట్ బ్యాంక్ వైశాల్యం 5,970 చదరపు కిలోమీటర్లు కాగా, గాజా స్ట్రిప్ వైశాల్యం 365 చదరపు

నడుస్తున్న చరిత్ర

# ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం

కిలోమీటర్లు.వెస్ట్ బ్యాంక్ జెరూసలెంకు, జోర్డాన్‌కు తూర్పు భాగంలో ఉంది. పాలస్తీనా, ఇజ్రాయెల్ కూడా జెరూసలెంను తమ రాజధానిగా ప్రకటించుకున్నాయి.గాజా స్ట్రిప్ 41 కిలోమీటర్ల పొడవు.. 6 నుంచి 12 కిమీ వెడల్పు ఉంటుంది. గాజా సరిహద్దు, ఇజ్రాయెల్ వెంబడి 51 కిలోమీటర్లు, ఈజిప్టు వెంబడి ఏడు కిలోమీటర్లు, మధ్యధరా తీరం వెంబడి 40 కిలోమీటర్లు ఉంటుంది.గాజా స్ట్రిప్‌ను 1967 యుద్ధంలో ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. 2005లో గాజా నుంచి ఇజ్రాయెల్ వైదొలిగినప్పటికీ, ఐక్యరాజ్యసమితి ఆ భూమిని ఇప్పటికీ ఆక్రమిత భూభాగంగానే పరిగణిస్తోంది. ఇక్కడి ప్రజలు, వస్తువులు, సేవలు, గాలి, నీరు, సముద్రంపై ఇంకా ఇజ్రాయెల్ నియంత్రణ ఉంది.ప్రస్తుతం గాజా, పాలస్తీనియన్ తీవ్రవాద సంస్థ 'హమాస్' పాలనలో ఉంది. ఈ సంస్థ ఇజ్రాయెల్‌తో అనేకమార్లు పోరాడింది.

ఈ ప్రాంతాల్లో అరబ్బులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. జెరూసలెం ప్రాంతాన్ని పశ్చిమం వైపు ఇజ్రాయెల్ దళాలు, తూర్పు వైపు జోర్డానియన్ దళాలు పంచుకున్నాయి. తమ భూభాగం కోసం అరబ్బులు తరచుగా ఇజ్రాయెల్‌తో పోరాడుతూనే ఉన్నారు. ఈ పోరాటంలో నుంచి హమాస్ మిలిటెంట్లు పుట్టుకొచ్చారు. 1967లో జరిగిన యుద్ధంలో అరబ్బులు తీవ్రంగా నష్టపోయారు. వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్ ప్రాంతాలు కూడా ఇజ్రాయెల్ ఆధీనంలోకి వచ్చేశాయి. 2005లో గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయెల్ బయటకు వచ్చేసింది. అప్పటి నుంచి గాజా స్ట్రిప్ పాలన వ్యవహారాలను హమాస్ పర్యవేక్షిస్తోంది. ఇస్లామిక్ దేశాలన్నీ హమాస్‌కు నిధులు సమకూరుస్తున్నాయని ఇజ్రాయెల్ పేర్కొంది. ముఖ్యంగా ఖతార్ పేరుని ప్రస్తావిస్తోంది. ఖతార్ ఒక్కటే హమాస్‌కు 1.8 బిలియన్ డాలర్లకు పైగా సాయాన్ని అందించిందని మీడియా నివేదికలు చెబుతున్నాయి. హమాస్‌కు ప్రపంచవ్యాప్తంగా మద్దతుదారులు ఉన్నారు. భారీ మొత్తంలో విరాళాలు కూడా ఇచ్చారు. దీంతో హమాస్ కు బలం చేకూరినట్లు అయి.. శక్తిమంతమైన ఇజ్రాయెల్ వైపు చూసేందుకు.. యుద్ధం చేసేందుకు సాహసించింది. దీంతో ఇప్పుడు అక్కడ భీకర యుద్ధ పరిస్థితి తలెత్తింది.

ఈ సమస్య ఇరు వైపులా వేల మంది ప్రాణాలను తీసేసింది. 1987లో హమాస్ ( హరకత్ అల్ – ముక్వామా అల్ – ఇస్లామియా (ఇస్లామిక్ రెసిస్టెన్స్ మూవ్మెంట్ ) అనే పేరుతో సైనిక సామర్థ్యం కలిగిన ఓ గ్రూపుని పాలస్తీనా మత గురువు షేక్ అహ్మద్ యాసిన్ ప్రారంభించారు. రెండుసార్లు పాలస్తీనా తిరుగుబాట్లు ఇజ్రాయిల్ – పాలస్తీనా సంబంధాలను దిగజార్చాయి. 1990లో శాంతి ప్రక్రియకు విఘాతం కలిగిస్తూ పాలస్తీనా తిరుగుబాటు చేసింది. దీంట్లో హమాస్ ప్రమేయం ఉంది.

గతంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ 2000లో అప్పటి ఇజ్రాయిల్ ప్రధాని ఎహుద్ బరాక్, పాలస్తీనా పాలకుడు యాసర్ అరాఫత్ మధ్య సంధికోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింతగా దిగజార్చింది.

ఇజ్రాయిల్ –పాలస్తీనా మధ్య దశాబ్దాల కాలం నుంచి నిత్య ఘర్షణ ఉంది. ఇజ్రాయిల్ పై యుద్ధంలో చేరాలని ప్రపంచంలోని ఇస్లామిక్ యోధులకు హమాస్ పిలుపునిచ్చింది. అడపాదడపా గాజా స్ట్రిప్ నుంచి ఇజ్రాయిల్ పైకి రాకెట్ల దాడులు జరుతూనే ఉన్నాయి, అయితే ఇజ్రాయిల్ కి ఉన్న ఐరన్ డోమ్ వ్యవస వారి క్షిపణుల్ని నిర్వీర్యం చేస్తుంది. అయితే తాజాగా జరిగిన దాడి మాత్రం గత కొన్నేళ్లలో ఎప్పుడూ జరగని పెద్ద దాడి. పటిష్టమైన ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థ కూడా దీన్ని ఊహించలేదు.

తూర్పు జెరూసలెం. గాజా, వెస్ట్ బ్యాంక్ లోని కొన్ని ప్రాంతాల్లో ఇరు

నడుస్తున్న చరిత్ర

# ఇజ్రాయెల్ – పాలస్తీనా యుద్ధం

ప్రాంతాల మధ్య ఉద్రిక్త పరిస్థితి ఉంది. ఈజిప్టు నుంచి హమాస్ ఆయుధాలు పొందకుండా ఇజ్రాయిల్ గాజా సరిహద్దుల్లో గట్టి నియంత్రణలో భాగంగా అనేక చర్యలు తీసుకుంటుంది. ఇది గాజాలో మానవ సంక్షోభానికి కారణమవుతోంది. ప్రజలు కనీసం తమ ప్రాథమిక అవసరాలు తీర్చుకునేందుకు కష్టపడుతున్నారు. ఇజ్రాయిల్ చర్యల వల్ల తాము నష్టపోతున్నామని పాలస్తీయన్లు ఆరోపిస్తున్నారు. హింస నుంచి తమను తాము తప్పించుకోవడానికే ఇజ్రాయిల్ పై దాడులు చేస్తున్నామని హమాస్ చెబుతోంది.

### ఇజ్రాయెల్, పాలస్తీనియన్ల మధ్య వివాదంలో ప్రధాన అంశాలు ఏమిటి?

ఇజ్రాయెల్‌తో పాటూ పాలస్తీనా రాజ్యం కూడా ఏర్పడాలా, వద్దా? వెస్ట్ బ్యాంక్‌లో యూదుల నివాసాలను ఉంచాలా లేక తొలగించాలా? పాలస్తీనా చుట్టూ పహారా కాస్తున్న ఇజ్రాయెల్.. ఇవే అక్కడి శాంతికి భంగం కలిగిస్తున్న అంశాలు.హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం పాలస్తీనా చుట్టూ ఇజ్రాయెల్ బిగించిన రక్షణ వలయాన్ని విమర్శించింది.2000 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశారు. ఆ సందర్భంగా, పైన చెప్పిన అంశాలు మాత్రమే కాకుండా, ఇరు పక్షాల మధ్య రాజీ కుదరని అంశాలు ఇంకా ఉన్నాయనే విషయం స్పష్టమైంది.ఆ సమయంలో ఇజ్రాయెల్ ప్రధాని ఎహూద్ బరాక్, పాలస్తీనా అధ్యక్షుడు యాసర్ అరాఫత్ మధ్య రాజీ కుదర్చడంలో బిల్ క్లింటన్ విఫలమయ్యారు.

పాలస్తీనియా శరణార్థుల భవిష్యత్తు ఏమిటి? జెరూసలెంను రెండు వర్గాలు పంచుకోవాలా, వద్దా? వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సెటిల్మెంట్లు మొదలైన విషయాల్లో రెండు పక్షాల మధ్య అంగీకారం కుదరలేదు. జెరూసలెంను తమ రాజధానిగా ఇజ్రాయెల్ ప్రకటించుకుంది. కాగా, పాలస్తీనియన్లు తూర్పు జెరూసలెంను భవిష్యత్తు పాలస్తీనా రాజ్యానికి రాజధానిగా పేర్కొన్నారు.


గత 50 ఏళ్లల్లో ఇజ్రాయెల్ ఈ ప్రాంతాల్లో అనేక నివాసాలను ఏర్పాటు చేసుకుంది. ప్రస్తుతం అక్కడ 6,00,000 మందికి పైగా యూదులు నివసిస్తున్నారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం అవన్నీ అక్రమ నివాసాలని పాలస్తీనియన్లు ఆరోపిస్తున్నారు. ఇజ్రాయెల్ ఈ ఆరోపణలను అంగీకరించదు.పాలస్తీనా శరణార్థుల సంఖ్య ఒక కోటి కన్నా ఎక్కువగా ఉంటుందని పీఎల్ఓ చెబుతోంది. ఇందులో సగం మంది ఐక్యరాజ్యసమితిలో తమ పేరును నమోదు చేసుకున్నారు.

ఈ శరణార్థులందరికీ తమ మాతృభూమికి తిరిగి వచ్చే హక్కు ఉందని పాలస్తీనా అంటోంది. వీరు మాతృభూమిగా చెబుతున్నది ప్రస్తుత ఇజ్రాయెల్.వీరంతా స్వదేశానికి చేరుకుంటే అక్కడ వీరి సంఖ్య పెరిగిపోయి, యూదు రాజ్యంగా ఉన్న తమ దేశ ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఇజ్రాయెల్ అంటోంది.

### శాంతికి మార్గమేమిటి? దీనికోసం ఏం చేయాలి?

ఈ ప్రాంతంలో శాశ్వత శాంతి నెలకొనాలంటే ఇజ్రాయెల్, హమాస్ సహా పాలస్తీనియన్ల సార్వభౌమత్వాన్ని అంగీకరించాలని నిపుణులు భావిస్తున్నారు.గాజా నిర్బంధానికి ముగింపు పలకాలి. వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలెంలో ఆంక్షలు ఎత్తివేయాలి.శాశ్వత శాంతి కోసం పాలస్తీనియన్లు హింసను విడిచిపెట్టాలి. ఇజ్రాయెల్‌ను అంగీకరించాలి.సరిహద్దులు, యూదుల సెటిల్మెంట్లు, పాలస్తీనా శరణార్థులు స్వదేశానికి తిరిగి రావడం మొదలైన అంశాలపై రెండు పక్షాలూ ఆమోదయోగ్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకోవాలి.

★★★



అంతర్నేత్రం

# నిన్ను నీవు గెల్చుకో

ఇతరులపై సాధించే విజయాల కంటే, మనపై మనం సాధించే విజయం గొప్పది. తనను తాను ఓడించుకున్న వ్యక్తి సాధించిన విజయాన్ని ఆ దేవతలు కూడా అపజయంగా మార్చలేరు. మనల్ని మనం గెలవాలంటే ముందు అహంకారాన్ని వదులుకోవాలి. అహంకారంతో నిండిపోయిన వారు ఉన్నంత ఖాళీగా మరెవరూ ఉండరు. ఇతరులు మనలో చూడలేని లక్షణాల్ని, గొప్పతనాన్ని మనలో మనమే చూసుకోగలిగితే, అదే అహంకారం.

నిన్ను నీవు గెల్చుకోవాలంటే, నీకు నువ్వే ప్రేరణ కావాలి. నిన్ను నీవే పరీక్షించుకోవాలి. నిన్ను నీవే పరిశీలించుకోవాలి. నిన్ను నీతోనే పరిశోధించుకోవాలి. అలా చేసుకోగలిగితేనే నీ లోపాలు తెలుస్తాయి. వాటిని సరిదిద్దగలిగితే నిన్ను నీవు గెలుచుకున్నట్లే.

ఒకసారి ఒక కూలి కడు నిరుపేద స్థితిలో చిరిగిన బట్టలతో జీవనం సాగించేవాడు. ఒక రోజున తన దారికి ఎదురుపడ్డ సన్యాసులను చూసి, “నేను కూడా సన్యాసినైతే బాగుందును, కాషాయబట్టలు కట్టుకుని గౌరవంగా జీవించవచ్చు” అనుకుని తన మనస్సులో మాట చెప్పాడు. సన్యాసులు అతనిని కొలనులో స్నానం చేయించి, గుండు గీయించి, కాషాయ బట్టలు కట్టి ఆశ్రమానికి తీసుకుపోయారు. అప్పుడు అతను తనపాత బట్టలను ఆశ్రమం బయట ఒక చెట్టు తొర్రలో దాచి ఆశ్రమం లోకి వెళ్ళాడు.

కొంత కాలానికి సన్యాస జీవితంపై విరక్తి కలిగి, పాత జీవితమే మేలనుకుని, ఆశ్రమం బైట చెట్టు తొర్రలో ఉన్న బట్టల్ని బయటకు తీశాడు. వాటిని చూడగానే తన పాత జీవితం గుర్తుకువచ్చింది. కొంతసేపు అటా! ఇటా! అని ఊగిసలాడి, చివరకి బట్టల్ని తిరిగి చెట్టు తొర్రలో పెట్టి మరల ఆశ్రమానికి వచ్చాడు. క్రమేపి కొంత కాలానికి ఆశ్రమ వాతావరణానికి అలవాటుపడి, జ్ఞానోదయం కలిగేకొద్దీ చెట్టు తొర్ర దగ్గరకు వెళ్ళడం మానేశాడు. తోటి సన్యాసులు నీలో ఇంత మార్పు ఎలా వచ్చింది. ఆ చెట్టు దగ్గర ఏముందని ప్రశ్నించారు. దానికి అతడు చెట్టు తొర్రలో నా గురువు ఉన్నాడని సమాధానమిచ్చాడు.

కాబట్టి మీకు మీరె గురువులు. మీ తప్పుల నుంచి మీరు తెలుసుకోగలిగితే మిమ్మల్ని మీరు ప్రేరేపించుకున్నట్లే. నిజమైన ప్రేరణ మనలో నుంచే రావాలి. మనవద్ద ఏ రకమైన శక్తియుక్తులు ఉన్నాయని కాదు, వాటిని మనం ఎంతవరకు వినియోగిస్తున్నాం అనేదే ముఖ్యం. జన్మతః లభించిన బలహీనతలను అధిగమించలేకపోయినా, మనకు అందుబాటులో ఉన్నవాటిని సక్రమంగా వినియోగిస్తే చాలు జీవితాన్ని గెలవవచ్చు.

మనగురించి మనకు ఎంత ఎక్కువగా తెలిస్తే అంత తక్కువ అహంకారం వుంటుంది. ఎన్నడూలేని వాటిని ఉన్నట్లుగా, ఉన్నవాటిని లేనట్లుగా అహంకారం ఊహించుకుంటుంది. కాని నీ గురించి నీకు పూర్తిగా అవతరమైన రోజు ఎప్పుడూ ఉన్నవాటిని ఉన్నట్లుగా, లేనివాటిని లేనట్లుగానే చూస్తుంది.

ప్రపంచాన్ని జయించిన దర్పంతో అలగ్జాండర్ తన గురువు



దండామినే ఎదురుగా నిలబడి, ఏమి కావాలో కోరుకోండి, మీరేం కోరినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నాడు. అలగ్జాండర్ వైపు తురిపార చూసి దండామిసే మౌనంగా ఉండిపోయాడు. అలెగ్జాండర్ పదే పదే రెట్టించి అడిగేసరికి దండామినే నోరుతెరిచి, ఆ సూర్యభగవానునికి, నాకు మధ్యలో నువ్వు అడ్డంగా నిలబడ్డావు. కాస్త పక్కకు తప్పుకుంటే హాయిగా చలికాచుకుంటా, అదొక్కటే నీవు నాకు చేయగలిగిన ఉపకారం! అన్నాడు.

దండామిసే లేనివాడు కాడు, అక్కరలేనివాడని అలెగ్జాండర్కు అర్థమైంది. తాను కేవలం కొన్ని దేశాలను జయించాడు. దండామిసే తననే జయించినవాడు. అలాంటి వానికి తాను ఇచ్చేది ఏమీ ఉండదన్న సత్యం బోధపడింది. తనను తాను గెలవలేని వాడవ్వడూ విజయుడు కాలేడు. ఎన్ని భౌతిక విజయాలు సాధించినా, మానసికంగా విజయం సాధించలేకపోయినప్పుడు ఉపయోగం ఏమిలేదు. జీవితంలో అంతరత విజయం సాధించగలిగితేనే, నిజమైన గెలుపు లభిస్తుంది. అంతర్గత విజయం వల్ల ప్రపంచాన్ని ప్రేమించగలుగుతాం.

★★★

# అవి-ఇవి

## 'దమ్ మారో దమ్'



బాలీవుడ్ సినిమా హరేరామ హరే కృష్ణ సినిమాలోని 'దమ్ మారో దమ్' అనేపాట యావత్ దేశాన్ని ఒక ఊపు ఊపింది. ఈ పాటలో జీనత్ అమన్ నటించారు. ఇక పాకిస్తాన్‌లోని ఒక గుహలో చేతిలో సిగరెట్ తో షబ్నమ్ కూడా దమ్ దమా దమ్ మస్త్ పైకే జరా దేఖో అనే పాటలో నటించారు. ఈ పాట 1974 నాటి పాకిస్తానీ సినిమా 'మిస్‌హిప్పీ' లోది. దమ్మారో దమ్ హిందీపాటను ఆశాభోంస్లే పాడగా, పాకిస్తానీ పాటను నీరా నూర్ పాడారు.

ఈ రెండు పాటలను గుర్తుతెలియని ప్రదేశాలలో చిత్రీకరించారు. ఈ పాటలలో కనిపించినవారంతా యువతీయువకులే. వారు తమ దుస్తులు, ప్రవర్తన విషయంలో స్వేచ్ఛగా ఉన్నట్టు కనిపిస్తారు. ఎందుకంటే వారంతా హిప్పీలు.1960వ దశకంలో హిప్పీలను అమెరికన్ మీడియా బిత్నిక్ అని పిలిచింది. సంప్రదాయ సమాజాన్ని వ్యతిరేకించి కళాతృష్ణతో జీవించేవారిని బిత్నిక్ గా పిలిచేవారు.బిత్నిక్‌లు అమెరికన్ సంస్కృతిని వ్యతిరేకించారు. 1950,60ల మధ్యన వారు తమను తాము సాహిత్యం, కవిత్వం, సంగీతం, చిత్రకళ ద్వారా వ్యక్తపరుచుకున్నారు.వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా, అమెరికా తీరును నిరసిస్తూ వీరంతా గంజాయికి అలవాటుపడ్డారు. జట్టు కత్తిరించుకునేవారు కాదు, లైంగిక స్వేచ్ఛతో జీవించడం మొదలుపెట్టారు.

1965 నుంచి 1980 దాకా హిప్పీలు డ్రగ్స్ కోసం యూరోప్ నుంచి అఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్, ఇండియా, నేపాల్ (శీతాకాలంలో గోవా) దాకా చేసిన యాత్రను బ్రిటన్‌లో హిప్పీ ట్రైల్ గా పిలిచారు.అందుకే, అమెరికన్ మీడియా దీనిని గంజాయి యాత్ర గా అభివర్ణించింది. ఏదేమైనా 1967 నాటికి బిత్నిక్ స్థానంలో హీప్పీ పదం స్థిరపడిపోయింది.1968లో ఈ సంగీత బృందం భారత పర్యటనకు వచ్చినప్పుడు వారితో పశ్చిమ యూరోప్‌కు చెందిన యువకులు ఎక్కువగా రావడం కనిపించింది. వీరిలో కొంతమంది ప్రపంచాన్ని చుట్టాలనే ఆశతో వచ్చినవారు ఉన్నారు.

# వైరల్

## విడాకుల ఊరేగింపు

పెళ్లైన ఏడాదికే కుమార్తె విడాకులు తీసుకుంటే ఆ తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. కానీ, అత్తింటి ఆరళ్లకు భరించలేక.. భర్త నుంచి విడాకులు తీసుకున్న తన కుమార్తెకు ఓ తండ్రి ఘనస్వాగతం పలికాడు. ఆమెను పుట్టింటికి భారీ ఊరేగింపు నడుమ తీసుకొచ్చాడు. భాజాభజంత్రీలు, బాణాసంచాతో ఊరేగింపుగా తన కుమార్తెను తీసుకొచ్చి.. విడాకులను కూడా పెళ్లి మాదిరిగా జరిపించి వార్తల్లో నిలిచాడు. అత్యంత అరుదైన ఈ ఘటన ఝార్ఖండ్ రాజధాని రాంచీలో చోటుచేసుకుంది. విడాకుల ఊరేగింపునకు సంబంధించిన వీడియోను ఆయన సోషల్ మీడియాలో షేర్ చేయగా.. ప్రస్తుతం వైరల్ అవుతోంది. రాంచీకి చెందిన ప్రేమ్ గుప్తా తన కుమార్తె సాక్షి గుప్తాకు గతేడాది ఏప్రిల్‌లో సచిన్ కుమార్ అనే వ్యక్తితో ఘనంగా వివాహం జరిపించారు. పెళ్లైన తర్వాత అతడి నిజస్వరూపం బయటపడింది. అప్పటికే సచిన్‌కు పెళ్లైన విషయం తెలిసింది. అయినా కూడా అతడితో బంధం కొనసాగించాలని సాక్షి నిర్ణయించుకుంది.



కానీ, క్రమంగా అత్తింటి వేధింపులు ఎక్కువ అయ్యేసరికి కలిసి ఉండటం అసాధ్యమని భావించింది. ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో కుమార్తె నిర్ణయాన్ని సాక్షి తండ్రి, ఆమె కుటుంబ సభ్యులు సమర్థించారు.విడాకుల కోసం కోర్టును ఆశ్రయించిన అనంతరం పుట్టింటికి కుమార్తెను తీసుకొచ్చేందుకు ఘనంగా ఏర్పాటు చేశారు. అక్టోబరు 15న టపాసులు కాలుస్తూ ఊరేగింపుగా తీసుకొచ్చారు.

## బస్టాప్‌నే ఎత్తుకెళ్లిన దొంగలు

కర్ణాటకలో బస్టాప్‌ను దుండగులు ఎత్తుకెళ్లిపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే ఆ బస్టాప్ ఏదో మారు మూల ప్రాంతంలో ఉంది అనుకుంటే పొరపాటే. ఎందుకంటే అది రాజధాని బెంగళూరు నడిబొడ్డున కర్ణాటక రాష్ట్ర శాసనసభకు కిలో మీటర్ దూరంలోనే ఉండటం విశేషం. ఇక ఆ బస్టాప్ నిర్మాణానికి రూ.10 లక్షలు ఖర్చు కాగా.. దాన్ని ప్రారంభించిన 10 రోజులకే దాన్ని ఎత్తుకెళ్లిపోయారు. బెంగళూరు నగరంలోని అత్యంత రద్దీగా ఉండే కన్నింగ్‌హామ్ రోడ్‌లో ఈ బస్టాప్‌ను నిర్మించారు. ఈ బస్టాప్ నిర్మాణాన్ని బృహత్ బెంగళూరు మహానగర పాలిక–బీబీఎంపీ.. స్థానికంగా ఉన్న ఓ కంపెనీకి పనులు అప్పగించారు. అయితే ఈ బస్టాప్‌ను రూ. 10 లక్షలు వెచ్చించి నిర్మాణం పూర్తి చేశారు. అయితే ఈ బస్టాప్ నిర్మించిన పది రోజులకే దాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు. అయితే ఈ ఘటనపై బస్టాప్ నిర్మించిన కంపెనీ అధికారు రవిరెడ్డి.. సెప్టెంబర్ 30 వ తేదీన స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఆ బస్ షెల్టర్‌ను స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారు చేశామని.. దానికి మొత్తం రూ.10 లక్షల ఖర్చు వచ్చినట్లు తెలిపారు. అయితే ఆ బస్టాప్‌తోపాటు దానికి ఉన్న స్టీల్ కడీలు మొత్తం దొంగలు ఎత్తుకెళ్లిపోయారని ఫిర్యాదులో తెలిపారు. దీంతో ఆ కంపెనీ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఐపీసీ సెక్షన్ 279 కింద కేసు నమోదు చేశారు. ఆ బస్ షెల్టర్‌ను ఆగస్టు 21 వ తేదీన ఏర్పాటు చేశామని.. అయితే ఆగస్టు 28 వ తేదీన బస్టాప్‌ను చూసేందుకు వెళ్లగా అక్కడ ఏమీ కనిపించలేదని తెలిపారు. .

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

కథ



పెనుమాక రత్నాకర్

ఇంకా సూరిబాబు గారు తెల్లారిందని జనాన్ని లేపకముందే నిద్రలేసి పనులు ముగించుకుని తలారా స్నానం చేసి తడిమడితో సుమన పూజ మొదలెట్టీసరికి మసీదు ఈదిలో మసీదు నించి ‘‘అల్లాహు అక్బర్’’ అంటా నమాజు ఇనిపిత్తాది. అప్పటికి ఆ ఇంట్లో అత్తగారు కాని, మాంగారు కాని, ఆళ్ళ ఆయన కాని లేవరు. ఈవిడ పూజ చేసుకుని అందరికి టిఫిన్లు సిద్దం చేసీసరికి లేత్తారు అందరూ బద్దకంగా! ఆళ్ళాయనైతే మరీనూ, పదింటికి ఆఫీసైతే తొమ్మిదికి లేసి, మంచం మీదే కాఫీ తాగి ఆ తర్వాత తప్పదన్నట్టు స్నానం చేసి వొచ్చీసరికి ఆ రోజు అతను ఏసుకోవాల్సిన బట్టలు, కర్చీఫ్, లోదుస్తులతో సహా అన్నీ తీసిపెట్టాలి. బూట్లకి పాలిష్ చేసిపెట్టాలి. ఆఫీసు ఫైల్స్ అన్నీ బేగ్‌లో సర్ది కారెక్కీముందు చేతికందించాలి. ఇందులో ఏది సరిగా జరక్కపోయినా ఎళ్ళీదాకా తిడుతానే ఉంటాడు.

ఆయన గారు అలా ఆఫీసుకెళ్ళగానే అత్తగారి ఆధిపత్యం మొదలవ్వుద్ది. ఆరోజు ఏమేమి వండాలో పురమాయించీసి, ఆవిడగారు టిఫిన్లు, టీలు తాగీసాక భక్తి టి.వి. పెట్టుకుని మజ్జానం దాకా కాలక్షేపం చేత్తాది. టంచనుగా 12 గంటలకల్లా భోజనం చేసీసి మళ్ళీ ఓ అరగంట టి.వి. చూత్తండగానే ఆవిడ ఏసుకోవాల్సిన మాత్రలు సంవత్సరాల నించి ఆడుతున్నా ఎప్పటికప్పటికి కొత్తే అన్నట్టు, మాత్రలు తీసి నీళ్ళగ్లాసు చేతికందిత్తే, అయ్యి ఏసుకుని అప్పుడెళ్ళి పడుకుని 5 గంటలకు లేచి పక్కింటి కిలారి అనసూయమ్మతో వాకింగ్ కెళ్ళి ఓ అరగంట ఆవిడ ఆళ్ళ కోడలు గురించి, ఈవిడ ఈళ్ళ కోడలు గురించి చెప్పుకుని వొచ్చి స్నానం చేసి టి.వి. దగ్గర కూచ్చుంటాది. రాత్రి ఆఖరి సీరియల్ అయ్యిదాకా చూత్తా, మజ్జలో పుల్కాలు తిని పాలు తాగీసరికి మాత్రలు అందిత్తే ఏసుకుని, ఆవిడ గారి పక్క సర్దితే ఎళ్ళి పడుకుంటాది.

ఇక ఆళ్ళ మాంగారు ఇసయానికొత్తే ఆయనికి ఒంట్లో ఎన్ని రకాల రోగాలుండాలో అన్నీ ఉన్నాయి. ఆయనికీ కూడా అన్నీ కాళ్ళ దగ్గిరికే అందించాలి. ఇంట్లో ఇన్ని పనులు చేత్తానికి, సాయం చేత్తానికి పనిమనిషి లేదు. పొద్దున్న 5 గంటలకు మొదలైన పని రాత్రి 12 అయ్యిదాకా క్షణం తీరిక లేకండా కొనసాగుతానే ఉంటాది.

అలాగని రాత్రి మంచమెక్కాకైనా సుఖపడుతందా అంటే అక్కడా తన ఇష్టానికి చోటు లేదు. అదొొక ప్రహసనంలా సాగుతాది. సాధారణంగా మొగోళ్ళు పొద్దత్తమాను ఎంత రుసరుసలాడినా మంచమెక్కాక కొంచం సున్నితంగా ప్రేమగా ఉంటారు. పాపం సుమనకి అక్కడ కూడా అలాంటిదేం లేదు. అలా అని ఆళ్ళాయన చేలా అందగాడనుకుంటే పొరపాటే. పెద్దలు కుదిర్చిన పెళ్ళి కాబట్టి కట్నాల గోల వొల్ల, ఇచ్చుకోలేక తక్కువకొచ్చిన డేమేజ్‌పీస్ లాంటోడీ అంబటి జనార్దన్. సుమనకి ఏమాత్రం ఈడుజోడు కాని వాడీ జనార్ధన్. పిల్ల

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

తెల్లవారు జామున మంచులో వికసించిన గులాబీలా ఉంటాది. అతనేమో నల్లగా బండగా ఎర్రని కళ్ళతో ఆమెకి పుట్టుమచ్చలా, కాలిపోయిన తుమ్మ మొద్దులా ఉంటాడు.

నిజానికి పాతివ్రత్యం అనీ పిచ్చి ఇమేజ్ కోసం పాకులాడీ సగటు భారతీయ స్త్రీ మనస్తత్వం ఉన్న సుమన ఆ ముసుగు లేపోతే, తన మనసులో మాట చెప్పమంటే టక్కున "ఛీఛీ!" అంటా అతన్ని ఛీ కొడుతాది. సాధారణంగా మన కుటంబాల్లో ఆడపిల్లని చిన్నప్పటి నించి పెళ్ళికి సిద్ధం చేత్తారు. పనులు నేర్పిత్తా, నేర్చుకోపోతే అత్తోరింట్లో "మీ అమ్మ నాన్నలు ఏమీ నేర్పలేదా?" అంటారంటారు. ఆడపిల్లకి పెళ్ళయ్యాదాకా ఎవరినీ ప్రేమించకండా శీలం చెడిపోకండా పిల్ల తల్లిదండ్రులు కాపలాకాత్తారు.



కొంతమందైతే ఎక్కువ చదివితే ఆ పిల్ల కంటే ఎక్కువ చదివిన పెళ్ళికొడుకుని కొనడం కష్టమని ఆడపిల్లని చదివించరు.

ఆడపిల్ల అలంకరించుకుని మొగుడిని రంజింపచేయాలని అందం గురించి, అణుకువుగా ఉండటం గురించి ట్రైనింగిత్తారు.

ఆడపిల్ల అందం మొగుడినో, మగాడినో రంజింపచేయటానికి కాదు. తనమీద తనకి ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం పెరగటానికి.

ఆడపిల్లకి ఇల్లు పెళ్ళికి ట్రైనింగ్ సెంటర్ లాంటిది మన ఇళ్ళల్లో. నిజానికి మొగాడి కంటే ఆడపిల్లకే చదువు, స్వయం సంపాదన అవసరం. తన కాళ్ళ మీద తను నిలబడే స్థితి వొచ్చాకే పెళ్ళి చేయాలి కానీ సుమన విషయంలో అలా జరగలేదు. ఆమె బిటెక్ ఇండస్ట్రియల్ కెమెస్ట్రీ చదివినా కట్నం ఇవ్వలేక ఒక ఇన్సూరెన్స్ కంపెనీలో కేషియర్ కిచ్చి పెళ్ళి చేసారు. ఒకేళ సుమ ఉద్యోగం చేత్తే ఆళ్ళాయన కంటె రెండు రెట్లు

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గరైంది

జీతం తీసుకోగలదు. ఇలాంటియ్యి పెద్దలు కుదిర్చిన పెళ్ళిళ్ళలోనే జరుగుతుంటాయి. అందుకే భాగస్వామి ఎలాంటోడైనా, ఎలాంటిదైనా అన్నీ మూసుకుని, అన్నీ సర్దుకుని బతుకంతా బతికేత్తారు. ఒక్కరోజూ జీవించరు.

అందుకే నేనంటాను ఆడపిల్ల తండ్రికి మహారాణి భర్తకి బానిస అని. అది సుమ విషయంలో అక్షరసత్యం. ఆ ఇంట్లో అందర్నీ ఆమె పట్టించుకోవాలి కానీ ఆమెని కనీసం "తిన్నావా" అని కానీ, నీరసంగా ఉంటే "ఎందుకలా వున్నావని" అడిగేవోళ్ళే లేరు ఆ ఇంట్లో.

ఆరోజు సుమన సాయంత్రం 5 గంటలకి బయటకెళ్లింది. రాత్రి అయినా రాలేదు. ఇంట్లో ఎవరికీ ఆందోళనగా లేదు. కానీ ఆళ్ళ అవసరాలు ఆమెను గుర్తు చేసాయి. ఫోను చేసింది ఆళ్ళ అత్తగారు, రింగౌతుంది కానీ ఎత్తలేదు. అప్పుడు మొదలైంది కంగారు. ఎందుకంటే ఇంట్లో వోళ్ళ పనులన్నీ చక్కబెట్టే "పనిమనిషి" ఇంట్లో లేదుగా! ఆమె ఇంతసేపైనా రాలేనందుకు కాదు ఈ ఆందోళన, ఆళ్ళకి టైముకి జరగాల్సిన పనులు ఆగిపోయాయని.

రాత్రి పదయ్యింది. ఆళ్ళందరికీ మెయిన్ రోడ్‌లో భీమాస్ నించి టిఫిన్లు తెచ్చాడు జనార్ధన్. అందరూ తిన్నాక తాయితీగా సుమ ఆళ్ళ స్నేహితురాళ్ళకి ఒక్కొక్కరికి ఫోన్ చేసాడు. రమాకి, వాణికి, జయకి చేత్తే ఆళ్ళెవరూ తను రాలేదని చెప్పారు. ఆ తర్వాత గేదెల్లంకలో ఉండే సుమ ఆళ్ళన్నయ్య నాగార్జునకి ఫోన్ చేసాడు. అతను కూడా రాలేదని చెబుతా "చెల్లి ఎక్కడికెళ్ళింది? ఎందుకెళ్ళింది?" అంటా కంగారుగా అడిగాడు. ఎంటనే "బావగారూ నేను వెంటనే బయల్దేరుతున్నాను" అంటా ఫోన్ పెట్టేసాడు.

అప్పటిదాకా మామూలుగా ఉన్న జనార్ధన్‌కి కూడా కంగారు మొదలైంది. నాగార్జున పడుతున్న కంగారు చూసి ఇతనికీ అనిపించింది ఇది కంగారు పడాల్సిన సంగతేనని. బండేసుకుని ఎతకటానికి బయల్దేరాడు. ఆవిడ ఎప్పుడూ ఎళ్ళీ మెయిన్‌రోడ్డంతా ఎతుక్కుంటూ, ఆమె తరచుగా పుస్తకాలు కొనుక్కునే విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనశాలకి ఎళ్ళి చూత్తే అది కట్టేసి ఉంది.

డబ్బులడిగింది. బొటిక్ నించి చీరా జాకెట్ తెచ్చుకుంటానని అది గుర్తొచ్చింది జనార్ధన్‌కి. తన బర్తడేకి కొన్న చీర, జాకెట్ కుట్టటానికి ఇచ్చిన ఫ్యాషన్ డిజైనర్ షాపు గాంధీ పార్కు దగ్గరున్న ఆద్య బొటిక్ దగ్గరకెళ్ళాడు. అదీ కట్టేసే ఉంది.

అక్కడ బోర్డు మీద ఉన్న కాంటాక్ట్ నెంబర్‌కి కాల్ చేత్తే 3 సార్లు డైల్ చేత్తే కానీ ఎత్తలేదు.

ఫోన్ ఎత్తిన విణ్ణి "మేడమ్ మీకు సుమ తెల్సుకదా, అదేనండి ఎత్తుగా తెల్లగా ఉంటది!" అంటే, ఆవిడ "అదే కంతేటి సుమన, జగన్నాథపురం నించి వొత్తారు ఆవిడేనా?" అంటే "అవును ఆవిడే ఈ రోజు మీ షాపు కొచ్చారా?" అంటే "అవును వొచ్చారు". "ఎన్ని గంటలకి" అంటే "ఏడు గంటలకొచ్చారు బట్టలు అయిపోయాయి పట్టుకెళ్ళిపోయారు" అని చెప్పింది. "ఎందుకు సార్ అలా అడుగుతున్నారు? ఇంతకీ మీరెవరు?" అంటే "నేను ఆవిడ భర్తని ఆవిడ సాయంత్రం 5 గంటలకి ఇంటినించి బయటికెళ్లింది ఇంకా రాలేదు అందుకని!" "ఓ! అదేంటి రాత్రి 11.30 అవుతున్నా రాకపోవటమేంటి? అయ్యో ఏమైందో పాపం" అంటూ ఆమె కూడా ఆందోళన పడిరది. "వాళ్ళ ఫ్రెండ్స్‌కి, చుట్టాలకి ఫోన్ చేసారా" అనడిగింది. "చేసాను, రాలేదన్నారు". "ఆవిడ ఫోన్‌కి చేసారా?" అంటే "ఇందాకటి దాకా రింగయింది ఇప్పుడు స్విచ్ఛాఫ్ వస్తుంది" అంటా విసుగ్గా "సరే మేడమ్ ఉంటాను" అంటా ఫోన్ పెట్టేసాడు. ఇక ఇంటికొచ్చేసాడు.

అప్పటికే సుమ

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

అన్నయ్య నాగార్జున వొచ్చాడు. జనార్ధన్ తను ఎక్కడెక్కడికెళ్ళి ఎతికింది, బొటిక్ అమ్మాయితో మాట్లాడిరది చెప్పాడు. నాగార్జున ''సుమ వచ్చిందా'' అంటూ బంధువులందరికీ ఫోన్‌లు చేసి అడిగాడు. ఎక్కడికి రాలేదన్నారు. నాగార్జునకి ఆలోచనలు ఎక్కడెక్కడికో పోతున్నాయి. జనార్ధన్‌కి ఆళ్ళ అమ్మా నాన్నలకీ సుమ రాలేదన్న ఇసయం కంటె ఫోన్ ఎత్తకపోవడం చాలా విసుగ్గా చిరాగ్గా ఉంది. ఆమె కావాలనే ఫోనెత్తలేదని తిట్టటం మొదలెట్టారు.

అయ్యన్నీ అసహనంగా ఇంటా బదులు చెప్పలేక భరిత్తన్నాడు నాగార్జున. ఆ రాత్రి ఎలాగో గడిచింది. పొద్దుటే బయల్దేరి జగన్నాధపురం వంతెన దగ్గరున్న 1 టౌన్ పోలీస్ స్టేషన్‌కెళ్ళి మిస్సింగ్ కేసు పెడదామంటే జనార్ధన్, ''ఏమని పెడతాం బావగారు అది కావాలనే ఫోనెత్తకండా, అత్తమానం చేసేత్తన్నామని స్విచ్చాఫ్ చేసుకుని ఎక్కడికో పోయింది'' అన్నాడు. ''అదేంటి బావ ఫోను ఎత్తలేని పరిస్థితి ఏమొచ్చిందో! లేక ఏ ఆపదలో చిక్కుకుందో'' అంటే ''ఫోనీ సెల్ స్విచ్చాఫ్ అయిపోయిందనుకున్నా ఏదొక టైముకి ఇంటికి రావాలిగా! తప్పి పోవటానికి నీ చెల్లేమైనా చిన్నపిల్లా? లేక ఊరు తెలియదా? ఊరంతా ఒంటరిగా తిరుగుతాది'' అన్నాడు చిరాగ్గా! అంతేగాని తను ఒంటరిగా తిరగటానికి కారణం ఇంట్లోకి కావాల్సినయన్నీ తనే ఎళ్ళి తెచ్చుకుంటాది. మేమెవరం ఆవిడికి సాయిం చెయ్యం అనీ నిజం చెప్పట్లేదు. ''సరే బావా! అసలేమి జరిగిందో అర్థం కాకండా ఉంది. అందుకే కంప్లయింట్ ఇత్తే పోలీసులే ఎంక్వైరీ చేత్తారు'' అన్నాడు. ''ఏమనిత్తాం కావాలని పారిపోయిన దాన్ని ఎదికి పట్టుకోమనా'' అంటా ఎటకారమాడాడు. దానికి నాగార్జునకి కోపం వచ్చింది. ''ఇంతకీ నువ్వు వొత్తావా రావా?'' అనడిగాడు. ''సరే పొద్దున్నే ఎళ్దాం'' అన్నాడు. అప్పటికి టైం రాత్రి 3 గంటలు.

ఆ మరుసటి రోజు పొద్దున్నే ఇద్దరూ నాగార్జున కారులో స్టేషనుకెళ్ళారు. ఇసయం చెబితే ఎస్.ఐ. బూరాడి విశ్వనాథ్ కేసు రిజిష్టర్ చేయమని రైటర్ పల్లి సత్యనారాయణకి చెప్పాడు. సుమ వివరాలు, ఫొటో ఇచ్చి కంప్లయింట్ రిజిష్టర్ చేసారు.

నిజానికి ఇలాంటి కేసుల్లో 24 గంటలు దాటితేనే కాని కేసు నమోదు చేయరు. కానీ కనిపించకండా పోయింది ఒక ఆడపిల్ల కాబట్టి ఇసయం సీరియస్. సి.ఐ. కలిదిండి అమర్ ఎంక్వైరీ ప్రారంభించాడు. సుమ సెల్ నెంబర్ తీసుకుని కాల్‌డేటా కోసం సైబర్ సెల్‌కి పంపారు. ఇంటికొచ్చి అత్తమామల్ని ప్రశ్నించటం మొదలెట్టారు. ''ఆవిడ ఎలాంటిది'' అనడిగితే ''మంచిదే'' అన్నారు. ''ఆవిడకి ఎవరితోటైన అక్రమసంబంధం ఉందా?'' అనడిగితే ''అబ్బే అలాంటిదేమీ లేదు'' అన్నారు. ''ఆమెకు ఫోన్లు ఎక్కువ వస్తుంటాయా?'' అనడిగితే ''పెద్దగా ఫోన్లు రావు ఎప్పుడైనా చేత్తే ఆళ్ళ ఫ్రెండ్స్ రమ కానీ, వాణీ కానీ, జయ కానీ చేత్తారు. ఎక్కువగా 2 రోజులకొకసారి ఆళ్ళ అన్నయ్య, వదిన చేత్తారు'' అని చెప్పారు.

''వాళ్ళ తల్లిదండ్రులు?'' అనడిగితే, ''ఆళ్ళు రెండేళ్ళ క్రితమే చనిపోయారని'' చెప్పారు.

ఆమె కనిపించకండా పోయిన రోజు ఏం జరిగిందో చెప్పమన్నారు.

''ఆరోజు పొద్దున్నే లేచి రోజులాగే పూజ చేసుకుని టిఫిన్లు చేసి మా అందరికి పెట్టి ఆళ్ళాయనికి కేరేజి రడీ చేసి పంపింది. మజ్జానం కూడా రోజూలాగే మాకు భోజనాలు పెట్టి తను తిని ఇల్లంతా కడిగి బట్టలు ఇస్త్రీ చేసి సాయంత్రం 5 గంటలకు సూపర్ మార్కెట్‌కెళ్ళి వత్తాను అంటా ఎళ్ళింది. ఆ తరువాత ఇంటికి రాలేదు'' అని చెప్పారు. అయ్యే ప్రశ్నలు జనార్ధన్‌ని అడిగినా ఆమె మీద అనుమానం ఉన్నట్టు

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

పోలీసులకి అనిపించలేదు. ఇంట్లో అందరూ సుమ మంచిదనే చెప్పారు. మరి ఫోనెందుకు ఎత్తలేదు అనీదానికి ఎవరి దగ్గరా సమాధానం లేదు. బహుశ ఎక్కడైనా మర్చిపోయి ఉండొచ్చు అనుకుంటున్నారు పోలీసులు. ఫోను సహాయంతో లోకేషన్ సెర్చ్ ద్వారా కొంత సమాచారం ఎతికి తీయొచ్చనే ఆలోచనతో ఆమె నెంబర్ సైబర్‌సెల్‌కి పంపారు. "సరే సూపర్‌మార్కెట్ కెళ్ళాం" అంటూ మెయిన్‌రోడ్డులో సూపర్‌మార్కెట్‌కెళ్ళారు. అక్కడి సి.సి.కెమెరాలలో ఆమె ఎక్కడా కనబడలేదు. అత్తమామలతో ఆమె సూపర్ మార్కెట్‌కెళ్తానని, వాళ్ళాయనతో రాజభవన్‌కెళ్తానని అంది. అందుకని రాజ్‌భవన్‌కెళ్ళి సి.సి. ఫుటేజ్ చూత్తే అక్కడికి వొచ్చి ఎళ్ళినట్టు నమోదైంది. బయటి సి.సి. ఫుటేజ్‌లో ఆమె జగన్నాథపురం వైపు కాకండా టౌన్ లోపలికెళుతున్నట్టు నమోదైంది. ఆవిడ ఎక్కడెక్కడికెళ్ళచ్చో ముందే జనార్ధన్ని అడిగి తెలుసుకున్న విధంగా మెయిన్ రోడ్డులో జిల్లా గ్రంథాలయం పక్కన సంవత్సరం పొడవునా జరిగీ విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన అని రాసున్న షాపుకెళ్ళి ఆమె ఫోటో చూపించి "ఈవిడ వొచ్చిందా?" అనడిగారు. అందులో ఓ కుర్రాడు గుర్తుపట్టి "అవును సార్ ఈవిడ వొచ్చారు. పి.వి.నరసింహారావు గారి ఇన్‌సైడర్, రత్నాకర్ పెనుమాక గారి గౌతమీతీరం కొన్నారు. శశిథరూర్ గారి పారాడాక్సికల్ ప్రైమ్ మినిస్టర్ పుస్తకం గురించి అడిగారు. స్టాకు లేదంటే ఎప్పుడు రావొచ్చు అంటూ చాలా ఇదిగా అడిగారు. అందుకే ఈవిడ నాకు గుర్తుండిపోయారు" అంటూ ఆవిడ కొన్న పుస్తకం రశీదు కార్బన్ కాపీ చూపించాడా కుర్రాడు.

ఆ తర్వాత జనార్ధన్ చెప్పిన వివరాలను బట్టి గాంధీనగర్‌లో ధ్యానముద్రలో కూర్చున్నట్టు గాంధీ గారి విగ్రహం ఉండే గాంధీ పార్కు ఎదురుగా ముత్తా గోపాలకృష్ణ గారి ఇంటికెదురు లైన్లో ఆద్యా బొటిక్ కెళ్ళి సుమ గురించి అడిగారు. అందులోని ఫ్యాషన్ డిజైనర్ అనిశెట్టి నవ్య, సుమ సుమారు 8.30 గంటలకి వచ్చిందని తన జాకెట్ చీర తీసుకుని వెళ్ళిందని చెప్పింది. "ఎక్కడికైనా వెళ్తానని చెప్పిందా?" అనడిగితే "అలా ఏమి చెప్పలేదంది". ఆ రాత్రి వాళ్ళాయన ఆమె గురించి కనుక్కోవటానికి ఫోన్ చేసినట్టు చెప్పింది. ఆ షాపు సి.సి. ఫుటేజ్‌లో కూడా సుమ కనిపించింది. కానీ ఆమె నుదుటి మీద బాండేజ్ వేసుకున్నట్టు స్పష్టంగా కనిపించింది. డిజైనర్‌ని అడిగాడు సి.ఐ. "ఆవిడ నుదుటి మీద ఆ బాండేజ్ ఏంటి?" అని "అవును ఆవిడని నేనూ అడిగాను, టాపిక్ డైవర్ట్ చేసింది తప్ప కారణం చెప్పలేదు" అంది.

ఆ గాయం ఏంటో కనుక్కుందామని మళ్ళీ జన్ధాన్‌ని స్టేషన్‌కి పిలిచారు.

ఏమో మరి ఏమైందో నాకు తెలియదన్నాడు. వాళ్ళ అమ్మా, నాన్నలనడిగినా వాళ్ళూ తెలియదన్నారు. అమర్‌కి అనుమానమొచ్చింది. సుమ అన్నయ్య నాగార్జునని అడిగితే అతనూ తనకి తెలియదన్నాడు. "సుమకి, వాళ్ళాయనికి సంబంధాలు ఎలా ఉంటాయి?" అనడిగారు. అతను నిజమే చెప్పాడు. "మా చెల్లెలు బి.టెక్. ఇండస్ట్రియల్ కెమిస్ట్ చదివింది. భర్తని ఎక్కడ డామినేట్ చేత్తాదో అని జాబ్ మాన్పించేసాడు. ఆ యింట్లో మా చెల్లొక పనిమనిషి. పెళ్ళై ఆరేళ్ళైనా సెటిల్‌మెంట్ వొంకతో తను గర్భం దాల్చకండా లూప్ ఏయించాడు ఆమెకి ఇష్టం లేపోయినా. మా అమ్మ, నాన్నల ఆస్తి కోర్టులో ఉంది. ఆ కేసులో మొన్ననే డిక్రీ అయ్యింది. చెల్లి వాటాకి 50 లక్షలు వొచ్చాయి. అది మొన్ననే క్లెయిమ్ చేసుకుంది. ఆ ఇసయంలోనే జనార్ధన్ ఆమెను హింసిత్తున్నాడని తెలిసింది. కానీ ఏరోజు తన భర్త పెట్టే హింసల గురించి కానీ అత్తమామల సూటిపోటి మాటల గురించి కానీ మాకు చెప్పదు. తను బాగా లోగుట్టు మనిషి సార్! బహుశ ఆ నుదుటి మీద బాండేజ్ అలాంటి గాయమే అయ్యుంటుంది"

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

అన్నాడు. అమర్, సుమ స్నేహితులందరి నంబర్లు తీసుకొని ఫోన్లు చేసి, నేరుగా ఎళ్ళి ఎంక్వైరీ చేత్తే నాగార్జున చెప్పినయన్నీ నిజాలేనని నిర్ధారణ అయ్యింది. సి.ఐ. అమర్ కానిస్టేబుల్ కేతాడి రాజ్యలక్ష్మి సుమ ఇంటిప్రక్కల వాళ్ళ నుండి రహస్యంగా వివరాలు సేకరించమని పురమాయించాడు. ఆవిడ ఎంక్వైరీ చేత్తే పక్కింట్లో ఉండే సవరపు అనంతలక్ష్మి "సుమ చాలా నెమ్మదైన పిల్లమ్మా, మొగుడు ఎంత కొట్టినా, అత్తమామలు ఎంత హింసించినా బయటకి తెలివనివ్వదు. నెలరోజుల నించి ఆ యింట్లో ఏదో ఒక ఇసయం గురించి రోజూ గొడవ జరుగుతంది. మొన్న ప్రొద్దుట ఆళ్ళాయన కొట్టినట్టున్నాడు. అతని బూతులు ఆ అమ్మాయి ఏడుపులు ఇనిపించాయి" అని గుట్టు విప్పింది. ఆళ్ళింటికి ఎడమవైపున నామన రాధారావు డాబాలో కింద పోర్షన్లోకి రెండు నెలల కితమే అద్దెకొచ్చిన గిరజాల కృష్ణవేణిని అడిగితే "నాకూ ఆరోజు అలాగే అనిపించింది. నేనొచ్చిన కాణ్ణించి చూత్తన్నా రోజు ఏదో వొంకన అతను ఆ పిల్లపై అరుత్తాడు బూతులు తిడతాడు. చీటికిమాటికి బెదిరిత్తాడు. ఆ పిల్ల మాత్రం ఏడుపు తప్ప ఎదురు చెప్పదు. ఈ కాలం పిల్లలాంటిది కాదు బిడ్డ" అంటా అనంతలక్ష్మికి చెప్పినదానిని బలపరిచింది.

సి.ఐ. అమర్ జనార్దన్ని స్టేషన్కి పిలిచాడు. "ఆరోజు గొడవ జరిగిందా? ఆవిడను మీరు కొట్టారా?" అని అడిగాడు. "మీకెవరు చెప్పారు సార్?" అని ఎదురు ప్రశ్నించాడు. "అడిగిన దానికి ముందు సమాధానం చెప్పండి ఆవిణ్ణి మీరు కొట్టారా? లేదా?" అనడిగితే "లేదు సార్" అన్నాడు. "మరి కొట్టకపోతే ఆవిడ నుదురు మీద బాండేజ్ ఏంటి?" అనీసరికి గతుక్కుమన్నాడు. "మీ ఇద్దరి మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయ్? ఆవిడని మీరు కొడతారని మా దగ్గర ఆధారాలున్నాయ్" అనీసరికి "అదేంటి సార్ భార్యాభర్తలన్నాక కొట్టుకోరా ఏంటి?" అన్నాడు అక్కడికేదో పెళ్ళి చేసుకోటమంటే పెళ్ళాన్ని కొట్టటానికి లైసెన్స్ తీసుకోటమే అన్నట్టు. "ఆరోజు ఎందుకు కొట్టావు?" అనడిగాడు. "ఆరోజు నాకు ఆఫీసు టైమైనా కేరేజ్ రడీ చెయ్యలేదు ఎందుకు" అనడిగితే "అసలు వంటే చెయ్యను ఈరోజు నించి ఏమి చేసుకుంటావో చేసుకో అంటా రెచ్చగొట్టింది. నాకు కోపం వచ్చి ఒక్క దెబ్బ కొట్టాను. తల గోడకి తగిలి దెబ్బతగిలిందంతే" అన్నాడు. అదేదో సహజమైందన్నట్టు. "ఏమైనా భార్యని కొట్టటం గృహ హింస కిందకొస్తాది తెలుసా నీకు?" అంటే "సార్ అన్నీ చట్ట ప్రకారమే జరుగుతున్నాయా? చట్టప్రకారం పిల్లల్ని కొట్టడం కూడా నేరమే అలాని భయభక్తులతో పెంచకపోతే ఆళ్ళు నాశనమైపోతారు" అంటా లాజిక్కు మాట్లాడాడు. "మీకు పెళ్ళై ఆరేళ్ళైనా పిల్లలెందుకు లేరు?". "అదేంటి సార్ ఆ ఇసయం మా పర్సనల్ మీకెందుకు?" అన్నాడు. "ఈ కేసులో అదీ కీలకమే కాబట్టి చెప్పాలి" అన్నాడు సి.ఐ. "మేమిద్దరం ఫైనాన్షియల్గా సెటిలయ్యే దాకా పిల్లలు వొద్దనుకున్నాం" అన్నాడు. "మరి దానికి ఏమి చేత్తన్నారు?". "ఆవిడ లూప్ ఏయించుకుంది" అన్నాడు. "అది ఆవిడకి ఇష్టమేనా?" అనడిగాడు. "ఈ ఇసయాలన్నీ మీకు ఆడు ఆళ్ళన్నయ్య నాగార్జున గాడేనా చెబుతా?" అనడిగాడు. "అవును నిజాలు ఎవరు చెబితే ఏంటి? ఆవిడకి లూప్ వేయించుకోటం ఇష్టం లేదటకదా?" అంటే "లేద్సార్ అది ఇష్టపడే ఏయించుకుంది" అంటా అబద్దం కూడా బల్లగుద్దినట్టు చెప్పాడు.

"లేదు ఆవిడకిష్టం లేకండానే లూపేయించావ్ మా దగ్గర ఆధారాలున్నాయ్, లూప్ ఏసిన డాక్టర్ చదలవాడ చైత్ర చెప్పారు. ఆరోజు హాస్పటల్ దగ్గిర ఆవిడని నువ్వెంత భయపెట్టావో! నీ వ్యవహారాలన్నీ చూస్తుంటే ఆవిడ కనిపించకండా పోవటానికి నువ్వే కారణం కదా? నిజం చెప్పు" అంటా గొంతు పెంచాడు. అప్పటిదాకా గౌరవంగా మాట్లాడినా సి.ఐ.

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గరైంది

''అదేంటి సార్ అది కావాలనే ఎక్కడికో పారిపోయింది. అయినా మీకు అబద్ధాలు చెప్పిన ఆ ఎధవ ఆళ్ళ ఆస్థి కోర్టులో ఈ మజ్జే నెగ్గిన కేసులో ఆళ్ళ చెల్లి లేపోతే మొత్తం కోటి రూపాయలు ఆడే నొక్కేయొచ్చు. ఆ డబ్బులింకా కోర్టు నుంచి రాలేదు కాబట్టి నాకు ఆడిమీదే అనుమానం అసలు హంతకుణ్ణి వొదిలేసి మీరు నన్నట్టుకున్నారు'' అంటా నేరం నాగార్జున మీదికి తోసాడు. ''అవునా ఆ విషయం చెప్పలేదు అయినా ఎవర్ని ఎలా విచారించాలో నువ్వు మాకు చెప్పక్కర్లేదు నీకు రెండు గంటలు టైమిత్తన్నా ఈలోగా నిజం చెబితే సరేసరి లేకపోతే ఎలా చెప్పించాలో మాకు బాగా తెల్సు'' అంటా ఎస్.ఐ.ని పిలిచి ''నాగార్జునని ఎంటనే తీసుకురండి ఇంటరాగేట్ చేద్దాం'' అంటా పురమాయించాడు.

★★★

నాగార్జునని ఇంటరాగేట్ చేయిటం మొదలెట్టాడు సి.ఐ. ''మీ చెల్లి డబ్బులు క్లెయిమ్ చేసుకుంది అన్నావు ఆడేమో క్లెయిమ్ చేసుకోలేదంటున్నాడు ఎవడు నిజం చెబుతున్నాడు'' అంటా కేకలేసాడు. ''సార్ క్లెయిమ్ చేసుకుందనే నాకు తెలుసు సార్'' అన్నాడు. ఈలోగా కోర్టుకెళ్ళి ఆ కేసు ఆ డబ్బు వివరాలు తెలుసుకున్న ఎస్.ఐ. ఫోన్ చేసి ''సార్ డబ్బు క్లెయిమ్ చేసుకోలేదు. మనకి ఆ నాగార్జున గాడు చెప్పింది అబద్ధం. ఈ కేసు చిక్కుముడి ఆ డబ్బుతోనే ముడిపడిఉంది. ఆవిధంగా ఈళ్ళిద్దరూ అనుమానితులే'' అంటా అతను విశ్లేషణ చెప్పాడు. అది విన్న సి.ఐ.కి జనార్ధన్, నాగార్జున ఇద్దరి మీదా అనుమానం ముదిరింది. ఈళ్ళతో నిజం చెప్పించటానికి క్రైం కానిస్టేబుల్ కుందుర్తి ఆంజనేయులికి అప్పగించాడు ఎస్.ఐ. ఇతను ఇలాంటి కేసుల్లో ముద్దాయిల నించి నిజాలు చెప్పించటానికి రకరకాల టెక్నిక్స్ వాడతాడు. వాళ్ళ చేతులు కట్టేసి పచ్చి మిరపకాయలు నోటిలో కుక్కటం, పచ్చి మిరపకాయలు నూరి కాళ్ళు, చేతులు కట్టేసి కంట్లో పెట్టటం, మనిషిని పడుకోబెట్టి అరికాళ్ళ మీద కొట్టటం ఇలాంటి చిత్రవిచిత్రమైన హింసలు పెట్టి నిజం చెప్పించటంలో ఆ స్టేషన్‌లోనే కాదు మొత్తం టౌన్ లోనే పేరెళ్ళిపోయాడు.

ఇలా ఈళ్ళ మీద థర్డ్ డిగ్రీ ప్రయోగించమని ఎస్.ఐ. పురమాయించాడని సి.ఐ. అమర్‌కు తెలీదు. ఆయన ఇలాంటి ఆటికి ఇరుద్ధం. అసలు థర్డ్ డిగ్రీ అనేది చట్ట వ్యతిరేకమని ఒక్కోసారి దానికి అమాయకులు బలౌతారని దాన్ని ఆయనేమాత్రం అంగీకరించడు. నిజానికి పోలీస్ (నియమ నిబంధనల్లో) కాని సి.ఆర్.పి.సి.లో కాని ఎక్కడా థర్డ్ డిగ్రీ అనీ పదం ఉండదు. చట్టం దాన్ని ప్రోత్సహించదు. కాని ఉగ్రవాదం, తీవ్రవాదం లాంటి కేసుల్లో ఇది అలిఖిత ఆమోద చట్టం. ఇది అమాయకుల మీద ప్రయోగిస్తే నిర్దోషులు కూడా ఆ హింస తట్టుకోలేక నేరం అంగీకరించే ప్రమాదం ఉంది.

ముద్దాయిలు తను పెట్టే టార్చర్‌కి ఎంత ఏడ్చినా, అరిచినా ఏమాత్రం జాలి కలగని కుందుర్తి ఆంజనేయులు నాగార్జునని, జనార్ధన్‌ని విడివిడిగా పచ్చిమిరపకాయల ట్రీట్‌మెంట్‌తో హింసించినా ఆళ్ళు ఒప్పుకోలేదు. ఆళ్ళని అరెస్ట్ చేసి ఇరవై నాలుగ్గంటలు దాటింది. చట్టప్రకారం అరెస్టైన 24 గంటల్లో ముద్దాయిలని కోర్టుకి అప్పగించాలి. చట్టాన్ని భగవద్గీతలా భావించే అమర్, ఎస్.ఐ.తో ''ఈళ్ళ మీద బలమైన ఆధారాలు దొరకలేదు కాబట్టి ప్రస్తుతానికి వదిలేసి ఆళ్ళ మీద ఇద్దరు కానిస్టేబుళ్ళను నిఘా పెడదాం'' అని చెప్పి ఆళ్ళని వొదిలేత్తా ''మీ మీద ఆధారాలు దొరకని కారణంగా వదిలేస్తున్నాము. కానీ మీరు ఊరు దాటి వెళ్ళొద్దు అవసరమైనప్పుడు మళ్ళీ పిలుస్తాం రావాలి'' అంటా ఆళ్ళని వొదిలేసాడు.

ఆళ్ళపై నిఘా పెట్టాడు.

★★★

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

ఎస్.ఐ. బూరాడ విశ్వనాథ్‌కి కాల్ వచ్చింది "సార్ మీరు పంపిన మిస్సింగ్ కేసుకి సంబంధించి ఫొటోలోని అమ్మాయిని ఎవరో బండి మీద తీసుకొచ్చి వొదిలేసి పోయారు. ఆ అమ్మాయికి మంకీ కేప్ పెట్టి, కళ్ళకి గుడ్డ కట్టి ఇక్కడ ప్రతాప్ నగర్ బ్రిడ్జి కాడ వదిలేసారు. నేను ఆటో డ్రైవర్‌ని. ఆవిడకి చేతులు వెనక్కి కట్టేసి ఉండటం, కళ్ళకి గుడ్డ మంకీ కేప్ చూసి విప్పాను. ఈవిడ ఫొటో బస్టాండులో చూసిన గుర్తొచ్చి మీకు ఫోన్ చేత్తన్నాను" అంటూ 100 నెంబర్‌కి ఫోన్ చేసి చెప్పాడు. అతను ఫోను చేసిన అరగంటలో పోలీసులు ఆళ్ళ డొక్కు జీపేసుకుని వొచ్చారు ప్రతాప్ నగర్ బ్రిడ్జి కాడికి. అది ఇంద్రపాలెం స్టేషన్ లోకొత్తాది కాబట్టి ఆ పోలీసులొచ్చి అతన్ని, ఆవిణ్ణి స్టేషన్‌కి తీసుకెళ్ళారు. ఆ కేసు ఒన్‌టౌన్‌దని తెలుసుకుని ఆళ్ళిద్దర్నీ కానిస్టేబుల్ కిచ్చి ఆ తెల్లవారుజామున 4 గంటలప్పుడే జగన్నాధపురం వంతెన కాడున్న వార్ఫ్ రోడ్డులో ఒన్‌టౌన్ స్టేషన్‌కి తీసుకొచ్చారు. ఎస్.ఐ.కి, సి.ఐ.కి ఎంటనే ఫోన్ చేసి కబురందించాడు సెంట్రీ మడికి నాగరాజు. ఓ అరగంటలోనే ఎస్.ఐ., సి.ఐ. స్టేషనుకొచ్చారు.

"ఈ ఆటో అతనేనా నిన్ను కిడ్నాప్ చేసింది?" అంటే "అబ్బే కాదండి అతను నా కట్లు విప్పి స్టేషన్‌కి ఫోన్ చేసాడంతే నా కిడ్నాప్‌కి ఇతనికి సంబంధం లేదు" అంది. "మరి నిన్నెవరు కిడ్నాప్ చేసారు?". "ఏమో తెలియదు?". "మరెవరు తీసుకొచ్చారు?". "ఏమో తెలియదు నా కళ్ళకు గంతలు కట్టాడు, మంకీ కేప్ తొడిగాడు, నా చేతులు వెనక్కి కట్టాడు. తీసుకొచ్చి ప్రతాప్‌నగర్ బ్రిడ్జి కాడ నన్నొదిలేసి పోయాడు" అంటూ కష్టంగా చెబుతా నీరసంగా పదిరోజుల నించి తిండి తిప్పలు లేని దానిలా నిస్సత్తువగా మాటాడతా స్పృహ కోల్పోయింది. ఆవిడ బట్టలు చిరిగిపోయి మాసిపోయి ఉన్నాయి. ఒంటిమీద గాయాలున్నాయి. చేతులకు కాళ్ళకు చెయిన్‌తోనో తాళ్ళతోనో కట్టేసిన ఆనవాళ్ళున్నాయి. కళ్ళు లోతుకుపోయి నిద్రలేనట్టు తెలుస్తున్నాయి. పెదాలు రక్తం లేనట్టు పాలిపోయున్నాయ్. మొత్తంగా శరీరమంతా భరించలేనంత బడలికగా ఉంది. స్పృహ తప్పిన ఆమెను తీసుకొని జీపులో లేడీ కానిస్టేబుల్ తోరాటి గంగాభవాని తీసుకొచ్చి గవర్నమెంట్ హాస్పటల్ కాజువాలిటీలో జాయిన్ చేసింది. ఆవిడని జాయిన్ చేసుకున్న రంగరాయలో పి.జి. చదువుతున్న డ్యూటీ డాక్టర్ ఇమందివర్ష వెంటనే డి5 సెలైన్ పెట్టింది. ఆవిడ కేసు గురించి వివరించిన సి.ఐ.తో "పొద్దుట డాక్టర్ గారొస్తారు. వాళ్ళు మీరడిగినట్టు ఆవిడపై సెక్సువల్ ఎసాల్ట్ ఏమైనా జరిగిందో లేదో చెక్ చేస్తారు. నేను ప్రైమరీ మెడికేషన్ ఇస్తాను" అంది.

గంగాభవాని అక్కడే సుమన దగ్గర కాపలాగా ఉండిపోయింది. ఎస్.ఐ., సుమ ఆళ్ళాయనకి, అన్నయ్యకి ఫోన్లు చేసి ఆమె దొరికిందని హాస్పటల్‌లో ఉందని చెప్పటంతో ఆళ్ళు ఆగమేఘాల మీద వొచ్చేసారు. సుమ ఇంకా స్పృహ లోకి రాలేదు. వొచ్చాక ఎస్.ఐ.కి ఫోన్ చేద్దామని గంగాభవాని చూత్తంది.

మజ్ఞానానికి కాని సుమకి మెలకువ రాలేదు. స్పృహ రాగానే గంగాభవాని ఆళ్ళ ఎస్.ఐ. విశ్వనాథ్‌కి ఫోన్ చేయటంతో ఎస్.ఐ., సి.ఐ. ఇద్దరూ హాస్పటల్ కొచ్చారు. "మిమ్మల్నెవరు కిడ్నాప్ చేసారో చెప్పండి" అనీసరికి "ఎవరో తెలీదు నన్ను కిడ్నాప్ చేసినకాణ్ణించి నా కళ్ళకి గుడ్డ కట్టేసి, చేతులు వెనక్కి కట్టేసారు. అందుకే ఆళ్ళనెవర్ని నేను చూళ్ళేదు". "వాళ్ళు మిమ్మల్ని సెక్సువల్ అసాల్ట్ చేసారా?" అడిగాడు ఎస్.ఐ. "లేదు?" "మరెందుకు కిడ్నాప్ చేసారు?" "మీకు రేన్‌సమ్ కాలేమైనా వచ్చిందా?" అనడిగాడు సి.ఐ. జనార్ధన్‌ని, నాగార్జునని. "అంటే ఏంటి సార్" అడిగాడు నాగార్జున. "కిడ్నాపర్లు డబ్బులు డిమాండ్ చేస్తూ ఏదైనా కాల్ చేసారా? అని". "లేదు సార్". మరెందుకు

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గరైంది

కిడ్నాప్ చేసినట్టు? అనుకుంటూ "డాక్టర్ ఈవిడ పైనేమైనా సెక్సువల్ అసాల్ట్ జరిగిందేమో టెస్ట్ చేసి రిపోర్టు ఇవ్వండి" అని పురమాయించి సుమనతో "అసలు ఆ రోజు ఏం జరిగిందో మొత్తం చెప్పండి" అన్నాడు. దానికి డాక్టర్ "సార్ ఆవిడకి రెండ్రోజులు రెస్టు అవసరం. ఈ రెండ్రోజులు వదిలేయ్యండి. ఇప్పుడు వద్దు. ఆవిడ పరిస్థితేమీ బాలేదు" అంటూ వారించింది. సి.ఐ. అమర్ ఆమె మాటను గౌరవించి "సరే మేడమ్ రెండ్రోజుల తర్వాత విచారిస్తామ్ ఈలోగా రిపోర్ట్ వొచ్చేలా చూడండి" అన్నాడు.

సుమ దొరికిందన్న ఇసయం తెల్సిన తన స్నేహితురాళ్ళు, ఆద్యా బొటిక్ నవ్య అందరూ వొచ్చి సుమని పరామర్శించారు. ఆళ్ళ వొదిన సుమని కనిపెట్టుకునే ఉంది. ఆళ్ళిద్దరూ వొదినామరదళ్ళే కానీ స్నేహితులకంటే ఎక్కువ. అందుకే ఆవిడ సుమతోటో హాస్పటల్లోనే ఉంటంది.

ఉప్పుడు సుమ కొంచం ఆరోగ్యం గానే ఉంది. మాటాడే స్తితిలోనే ఉంది. అందుకే "ఆరోజు ఏం జరిగిందే సుమా? ఈ పోలీసోళ్ళు మీ అన్నయ్యని, మీ ఆయిన్ని కూడా అనుమానించి ఒక రోజంతా స్టేషన్లో ఉంచి నానా హింసలు పెట్టారు. అసలేం జరిగింది?" అనడిగింది. "అయ్యో వొదినా అన్నయ్యని కూడా అరెస్టు చేసారా? అయ్యో! సోరీ వొదినా నావల్లే ఇదంతా" అంటూ నొచ్చుకుంది. "అయ్యయ్యో అదేంటే తల్లీ అసలు ఇన్ని రోజులు ఆళ్ళు నిన్నెన్ని కష్టాలు పెట్టారో, ఏదేమైనా ఆ అమ్మవారి దయ వల్ల నువ్వు మళ్ళీ మాకు దక్కావ్. నువ్వు సోరీ చెప్పటమేంటే బాబూ మన రాత అలా వుంటే ఎవరేం చేయగలరు?" అంటంటే సుమ కళ్ళల్లో గుండెల్లోనూ చెమ్మ. "ఆరోజు నేను బొటిక్ లోంచి బయిటికొచ్చి ఆటో ఎక్కాను. ఆ ఆటోవోడు రామారావు పేట మీంచి కాకుండా పెద్దగా జనాలు తిరగని కలెక్టరాఫీసు ఎనకాల ఈది లోంచి ఆటో పోనిత్తా ఈట్ స్ట్రీట్ దగ్గరకొచ్చేసరికి ఓ ఇద్దరు ఎక్కారు. ఆళ్ళిద్దరూ మొగోళ్ళే. ఆళ్ళిద్దరూ ఏదో సైగ చేసుకుని అకస్మాత్తుగా జేబులోంచి క్లోరోఫిన్ పెట్టిన కర్చీఫ్ తీసి బలవంతంగా పట్టుకుని నా ముక్కు దగ్గర పెట్టటంతో నాకు మత్తు మొదలైంది. ఆళ్ళని ఎదిరించే బలం లేకండా నిస్సత్తువగా అయిపోయాను. ఈలోగా నా చేతిలోంచి పర్సు, కవరు లాక్కుని అందులోంచి సెల్ తీసి సిమ్ ఒకచోట, సెల్ ముక్కముక్కలు చేసి ఎక్కడో బిడ్జిమీంచి వెళ్తున్నపుడు పక్కనున్న డ్రైనేజీలో పాడేసారు. ఇయ్యన్నీ నేను చూత్తన్నా కానీ ఏమి చేయలేని, వ్యతిరేకించలేని నిస్సత్తువ, మత్తు నన్ను ఆవహించేసాయ్. ఆటో, జనం అట్టే తిరగని గొదారి గుంట మీంచి వాకలపూడిలో ఇప్పుడే ఏర్పడతన్న కోలనీలో అక్కడొక ఇల్లు అక్కడొక ఇల్లు ఉండి ఏ ఇంట్లో ఏమి జరిగినా ఎవరికీ పట్టని, ఎవరికీ తెలియని ఓ రెండంతస్తుల ఇంటిముందు ఆపారు. ఆ కోలనీ అంతా చీకటిగా ఉంది. ఆ ఇంట్లో ఎవరూ లేరు. ఆటోవోడు దిగి గేటు తాళం ఇంటి తాళం తీసాడు. ఇంతలో నా పక్కన కూర్చున్నోడు కర్చీఫ్ తీసి నా ఎదురుగా క్లోరోఫిన్ కొట్టి ఈసారి కష్టపడకండానే నాకు పీల్చించాడు. బహుశ ఒకేసారి క్లోరోఫిన్ ఎక్కువ డోస్ పెట్టేత్తే చచ్చిపోతానని భయమేమో. ఈసారి పూర్తిగా స్పృహ కోల్పోయాను. చేలా సేపుటికి కానీ మెలకువ రాలేదు. వచ్చేటప్పటికి చూస్తే తెల్లారినట్టుంది. బయట మాటలు ఇనిపిత్తన్నాయి. కళ్ళు తెరిచి చూసేసరికి నాకాళ్ళు చేతులు గొలుసులతో కుక్కని కట్టినట్టు కట్టేసి ఉన్నాయ్. కట్లిప్పండన్నా నన్నొదిలేయండి ప్లీజ్ అంటూ అరిచేసరికి ఓరియబ్బా దీనికి మెలుకువొచ్చేసింది అనుకుంటూ ఇద్దరు మంకీకేప్‌లు మాస్కులు ఏసుకున్నోళ్ళు లోపలికొచ్చారు. ఏంటే అరుత్తున్నావ్, నువ్వు పడుకున్నావని నోటిలో గుడ్డలు కుక్కలేదు. ఉప్పుడు నోటికి ప్లాస్టరేసాస్తానుండు అంటూ ప్లాస్టర్ కోసం ఎతుకుతుంటే ఇంకోడు వొద్దులే టిఫిన్ పెట్టాక అప్పుడు

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

ఏద్దాం అందాక వొదిలేయ్ అంటా ఎప్పుడో పొద్దుట తెచ్చిన చల్లారిపోయిన ఇడ్లీ పొట్లాం ఇప్పి నా ముందెట్టాడు. మట్టిమట్టిగా ఉన్న వాటర్ బోటిల్ సగం నీళ్ళతో అక్కడ పెట్టాడు. నేను మొఖం కడుక్కోవాలి అన్నాను. నువ్వు నీ యమ్మ గారింటికి రాలేదే నిన్ను కిడ్నాప్ చేసాం అయన్నీ కుదరవు తింటే తిను లేపోతే మానెయ్ అంటా బయిటికి పోయి తలుపేసాడు. నాకు ఎంత ఆకలిగా ఉన్నా ఆ ఇడ్లీ తినలేదు మంచినీళ్ళు తాగి కడుపు నింపుకున్నాను.

మజ్జానం మళ్ళీ తలుపు తీసి నేను పొద్దుట తినని ఆ ఇడ్లీలనే ఇప్పుడు తినమని పొట్లం ముందెట్టి నీళ్ళ బోటిల్ పెట్టాడు. ఆకలి తట్టుకోలేక తిన్నాను. ''బాత్‌రూం కెళ్ళాలి చైన్ తీస్తారా'' అని బతిమాలాను అయినా కరగలేదు. ''అలాగే ఎళ్ళు మేము బయటికి పోతున్నాం'' అంటా తలుపేసుకున్నారు. అందులో ఒకడొచ్చి గొలుసులిప్పి బయటకెళ్ళి గెడపెట్టాడు. అలా నాలుగు రోజులు గడిచాయి. నా గొలుసులు ఇప్పలేదు బాత్‌రూంకెళ్ళినప్పుడు తప్ప ఎప్పుడు గొలుసులతోనే ఉంచేవోరు. నాలుగో రోజు ''అన్నా అసలు నన్నెందుకు కిడ్నాప్ చేసారన్నా ప్లీజ్ చెప్పండి'' అని బతిమాలాను. ఆ ఇద్దరూ లోపలికొచ్చి గుడ్లురుముతూ ''నీ మొగుడే నిన్ను కిడ్నాప్ చెయ్యమన్నాడు. ఈరోజు ఫోన్ చేస్తే పోలీసులకి తెలిసిపోయింది దాన్ని చంపేత్తేనే డబ్బులిత్తా నంటన్నాడు. నువ్వింత బాగున్నా ఆడు కిడ్నాప్ మాత్రమే చెయ్యిమన్నాడని కంట్రోల్ చేసుకున్నాను. ఇంక ఆగను నిన్ను అనుభవించాక చంపి పడేత్తాను అన్నాడొకడు. మనకి కిడ్నాప్‌కే డబ్బులివ్వలేనోడు చంపితే డబల్ అమౌంట్ ఎలా ఇత్తాడ్రా ఇదంతా నాటకం. దీన్ని తీసుకెళ్ళి బొంబాయిలో అమ్మేత్తే మనకి కిట్టుబాటవ్వద్ది అన్నాడిరకోడు. ఏం చెయ్యాలన్నా రాత్రి దాకా ఆగాలి అనుకున్నారిద్దరు. ఇదంతా ఇంటన్న నాకు ఒక్కసారి అమ్మవారు గుర్తొచ్చారు. ''అమ్మా ఏదొక అద్భుతం చేసి నన్ను కాపాడు తల్లి'' అనుకున్నాను. చీకటి పడిరది. ఆళ్ళు మజ్జాన్నం మాటాడుకున్నట్టు నన్ను పాడు చేసి చంపెయ్యటానికో లేదా బొంబాయిలో అమ్మెయ్యటానికో వొచ్చారు. ఈ నాలుగు రోజులైనా ఇద్దరిలో ఎవరినీ కూడా నేను గుర్తించలేపోతన్నాను. ఆళ్ళు నా దగ్గిరికి వొత్తండగా దడాలున తలుపు తోసుకుంటా ఒకతను పొడుగ్గా ఉన్నతను లోపలికొచ్చాడు. అందులో ఒకతన్ని చూసి అన్నయ్యా అమ్మ నీకోసం వారం రోజుల్నించి పచ్చి మంచి నీళ్ళు ముట్టకండా ఎదురుచూత్తంటే నువ్వేంటి ఇక్కడున్నావ్ ఈ వేషం ఏంటి మళ్ళీ ఏం నేరం చేత్తన్నావ్ అంటంటే అందులో ఒకడు అసలు నువ్వక్కడికి కెందుకొచ్చావ్? నేనిక్కడున్నానని ఎవరు చెప్పారు'' ''అంటే నీకోసం అన్ని ఊళ్ళు తిరిగి ఇక్కడే సాయినగర్‌లో మా ఫ్రెండ్‌ని దించి ఎళ్తా కింద నీ బండి చూసి వొచ్చాను. రా అన్నయ్య ఇంటికి పోదాం. ఈ నేరస్తులతో నేరాలతో జీవితం పాడుచేసుకోకు అంటుంటే నువ్వెళ్ళరా మాకిక్కడ చాలా పనులున్నాయ్ దీన్ని అనుభవించి తీసుకెళ్ళి బొంబాయిలో అమ్మేయాలి అన్నాడు. అన్నయ్యా ఇలాంటి నేరాలు మనకొద్దు పోదాం పద అని బతిమాలాడు. ఈలోగా పక్కనున్నోడు ఆ మాస్క్ లేని పొడవాటి మనిషిని ఒరేయ్ మీ వోణ్ణిక్కణ్ణించి పొమ్మను లేదంటే మర్యాదగా ఉండదు. ఉంకో క్షణం ఉంటే దీనితో పాటు మీవోణ్ణి కూడా పొడిచిపారేత్తాను నేనసలే తిక్కోణ్ణి అన్నాడు. ఇదంతా నా ముందే జరుగుతంది. ఆ పొడుగాటి అబ్బాయికి కోపం వచ్చింది. నువ్వెలా పోయినా పర్లేదు. మా అన్నయ్యని ఇంకో నేరం చెయ్యనివ్వను అంటా అతని చేతిలో ఉన్న తాళాలు, చాకు లాక్కున్నాడు. తాళాలు జేబులో వేసుకున్నాడు. కత్తితో వాణ్ణి బెదిరించబోతే ఆడు ఆ అబ్బాయి మీద కలబడ్డాడు. ఇద్దరూ దెబ్బలాడుకుంటంటే మూడోవోడు ఇడదీత్తన్నాడు. ఆ పెనుగులాటలో ఆ పొడవాటి అతను ఆ ఇద్దర్ని కత్తితో పొడిచాడు. ఆ పోట్లు వాళ్ళని చంపుతాయో లేదో

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

తెలివదు కానీ ఆళ్ళు కదలలేకుండా పడిపోయారు. ఇంతలో అతను నా గొలుసుల తాళాలు తీసి అడుగుతీసి అడుగెయ్యలేని స్థితిలో ఉన్న నన్ను భుజం మీదేసుకుని సెల్లార్లోకి తీసుకొత్తా ఆళ్ళిద్దరూ ఆ రూంలోనే ఉండగా గెడపెట్టేసి నన్ను బండెక్కించుకుని తీసుకొచ్చాడు. నా ఇవరాలడిగితే మొత్తం జరిగిందంతా చెప్పాను. నా గురించి మాత్రం పోలీసులకి చెప్పకండి ప్లీజ్ నా కెరీర్ నాశనమయిపోద్ది అన్నప్పుడు అద్దంలోంచి అతన్ని చూసాను. చాలా హుందాగా, చదువుకున్నోడిలా ఉన్నాడు. మీరేం చదువుకున్నారు అనడిగాను. నేను వరంగల్ ఆర్.ఇ.సి.లో బి.టెక్ చేసి ఇప్పుడు టి.సి.ఎస్. కంపెనీలో పనిచేత్తన్నాను. మిమ్మల్ని కిడ్నాప్ చేసినోళ్ళలో ఒకడు మా అన్నయ్య వాడు చిన్నప్పట్నించి వివ్చీరియస్ ప్రోబ్లమ్ చైల్డ్. వాడి స్నేహితులు అలాంటి వాళ్ళు. ఎప్పుడూ ఏదొక క్రైం చేసి పోలీసుల్ని ఇంటి మీదికి తోల్తాడు. ఇప్పుడు కూడా వారం రోజుల్నించి ఇంటికి రాకపోతే వీణెవడైనా ఏమైనా చేసారేమోనని అమ్మ బెంగెట్టుకుని తిండితినట్లేదని తెలిసి వచ్చి వెదుకుతున్నాను. ఈరోజు దొరికాడు అన్నాడు. బండాపి నన్ను దింపి ఆ చీకట్లో నా కాళ్ళు పట్టుకుని వాళ్ళళన్నయ్య చేసిన నేరానికి నేను పడిన ఇబ్బందికి క్షమాపణ అడుగుతుంటే, మగాళ్ళలో మా ఆయనలాంటి వెదవన్నరవెధవలే కాదు ఇలాంటి సంస్కారులు కూడా ఉన్నారని నా కళ్ళు చెమర్చాయి. అతని చేతి స్పర్శ నా కాళ్ళకు అమ్మ చేతిలాలనగా అనిపించింది. అప్పుడు నేను అయ్యో అతను చేసిన నేరానికి మీరు క్షమాపణ అడగటమేంటి అసలు మీరు ఆ క్షణం రాకపోయి ఉంటే ఇప్పటికి నేను మానభంగానికి గురై వాళ్ళ చేతుల్లో చచ్చిపోవటమో లేదా రేపటికి ముంబాయ్ వేశ్యా గృహంలో అమ్మబడుదును. మా అమ్మ జన్మనిస్తే మీరు పునర్జన్మనిచ్చారు. నా జీవితంలో మీస్థానం మా అమ్మ తర్వాతి స్థానం. మీరు జీవితాంతం గుర్తుంటారు అంటా ఏడ్చేసాను. అతను సంస్కారం అడ్డొచ్చి ముట్టుకోలేదు. కానీ మీరు ఏడ్వకండి మీరు ఏడిస్తే నేను చూడలేకపోతున్నాను. మీరు మంచివారు అందుకే మీకంతా మంచే జరిగింది అంటా తీసుకొస్తుంటే నేను అతనికి ఐడియా ఇచ్చాను. నన్ను కట్టెయ్యమని తనని బండికి తగిలించిన హెల్మెట్ పెట్టుకోమని. అతనావిధంగా చేసి నాకు తన నెంబరిచ్చాడు. అవసరమైనప్పుడు కాల్ చెయ్యమన్నాడు. కొత్త సెల్ కొన్నాక చెయ్యాలి అంటూ జరిగిందంతా చెప్పింది.

ఆడు నా చెడ్డీ దోస్త్. క్లాసులో అందరికన్నా ఎత్తుగా బలంగా ఉంటంవొల్ల అన్నయ్య అనటం అలవాటు. ఆళ్ళమ్మ చాలా మంచిది నన్ను చిన్నప్పటినించి సొంతబిడ్డలా చూసింది. నా చదువుకి ఎంతో సాయం చేసింది. అమ్మ లేని లోటు తీర్చింది.

పోలీసులొచ్చారు అనేక వికట ప్రశ్నలేసారు. కానీ సుమకి ఆ వివరాలు చెప్పటం ఇష్టం లేదు. ఎందుకంటే తనకి తెలుసు సూత్రధారి తన భర్తే కాబట్టి ఆళ్ళన్నయ్యకి చెప్పి డైవోర్స్ పిటిషన్ వేసింది. పోలీసులు ముద్దాయిల రూపురేఖలు చెబితే స్కెచ్ ఆర్టిస్ట్ వేస్తాడని చెబితే, "సరేనని" తనకి గుర్తొచ్చిన రూపురేఖలు చెబితే స్కెచ్ ఆర్టిస్ట్ వేసిన ఆ బొమ్మలు ఒకడు టైటానిక్ డికాప్రియో లాగ, ఇంకోడు హృతిక్ రోషన్ లాగ వొచ్చారు. కేసుకి ఏ ఆధారాలు లేవని కొట్టేసారు. ఈలోగా రోజూ సుమ ఆ పొడవాటి అబ్బాయితో రోజు చాట్ చేత్తంది. ఎందుకంటే అతను కూడా అదే కాలేజీలో తను చదివిన సంవత్సరాల్లోనే చదివాడు కానీ అతనిని సుమ ఎప్పుడూ గమనించలేదు. వారి పరిచయం ప్రేమగా పరిణమించింది. ఇంతలో తాను విడాకులు ఇవ్వనంటూ బడాయి చేసిన వాళ్ళాయన్ని నువ్వే కిడ్నాప్ చేయించినట్టు కిడ్నాపర్స్ చెప్పారు. అయినా నువ్వు నన్ను ఏరోజైనా భార్యలా చూసావా స్టేటస్ సింబల్‌గా వాడుకున్నావ్ కోర్టు నించి వొచ్చిన యాభై లక్షలు గురించి రోజూ కొట్టడం మొన్న

బహుమతి పొందిన కథ

# దూరం దగ్గిరైంది

తెల్లవారుజామున తలగడతో నొక్కి చంపటానికి ప్రయత్నించిన సంగతి చెప్పనా? అంటూ ఆళ్ళాయన చేసిన దుర్మార్గాలన్నీ గుర్తు చేసి నీ దుర్మార్గాలింక భరించలేను విడాకులివ్వకపోతే కిడ్నాప్ విషయం పోలీసులకి చెబుతాననేసరికి ఒప్పుకున్నాడు. ఆళ్ళకి ఇడాకులైపోయాయి. మూడు నెలల తిరక్కుండానే సుమ ఆ పొడవాటి అతన్ని అంటే చంద్రగిరి సిద్దార్ధ అనీ సిద్దూని ఆళ్ళింట్లో ఒప్పించి పెళ్ళిచేసుకుంది.

★★★★

సుమ, సిద్దూ బెంగుళూరు ఎళ్ళిపోయారు. సిద్దూ సుమని దేవతలా కాకండా మంచి స్నేహితుడిలా మంచి సహచరుడిలా అప్పుడప్పుడు తండ్రిగా రాత్రిళ్ళు భర్తగా చక్కగా చూసుకుంటన్నాడు. ఉప్పుడావిడ తనింటికి బానిస కాదు. తండ్రి దగ్గరున్నట్టే ఆ సామ్రాజ్యానికి రాణి.

కానీ సుమ ఇంజనీరింగ్ చదివటప్పటి నుంచే సిద్దూ ఆమెను పిచ్చిగా ప్రేమించాడని కాని రహస్యంగా ఉంచాడని తన ఉద్యోగం సంపాదించాకొచ్చి ఆళ్ళ పెద్దోళ్ళతో మాటాడి పెళ్ళిచేసుకుందామనేలోగానే సుమకి పెళ్ళైపోయిందని అయినా తన వివరాలు ఆద్యా బొటిక్ నవ్య ద్వారా ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తనే కొందరు కిరాయి వ్యక్తులతో కిడ్నాప్ చేయించాడని ఆ కిడ్నాప్‌లో తన భర్తకు సంబంధం లేపోయినా తను భర్తను వొదిలెయ్యాలంటే ఇంతకంటే మార్గం లేదని కిడ్నాపర్లతో అలా మాటాడిరచినట్టు సిద్దూ ఎప్పటికీ సుమకి చెప్పడు కాబట్టి ఇంకెప్పటికి తనకి తెలియదు.

★★★

నవ్యతో సిద్దు తన ప్లాన్ చెప్పినపుడు "ఏరా నీకు పిచ్చా కిడ్నాప్ చేస్తే సుమ నిన్నెలా ప్రేమిస్తుంది" అంటూ కయ్యమంది. దానికి సిద్దు సైకాలజిలో స్టాక్ హోమ్ సిండ్రోమ్ అనుంది. అదేంటంటే అమ్మాయిలు 8% మంది తమను కిడ్నాప్ చేసినోళ్ళనే ప్రేమిస్తారు. అలాంటిది తనని పొందటానికి 1% చాన్స్ ఉన్నా వదులుకోను. తను దొరక్కపోయినా నాక్రైమ్ పట్టుబడి పోయి, నేను జైల్లో ఉండటానికైనా సిద్ధమే కానీ తను లేకుండా బతకలేను. అందుకే ఎంత రిస్కైనా ఇలాగే చేస్తాను, కొంచెం హెల్ప్ చెయ్యవే చాలు జీవితాంతం ఋణపడి ఉంటాను" అంటూ బతిమాలితే తనకి నచ్చకపోయినా సిద్దు కోసం ఒప్పుకుంది. ఎందుకంటే కిడ్నాప్ చేసినోళ్ళనే ప్రేమించగలిగినపుడు బందిఖానా నించి, మాన, ప్రాణాలను కాపాడినోడిని ప్రేమించకండా ఎలా ఉంటుంది? అని నవ్య అంచనా! ఈ నిజం తెలిసినోళ్ళెవరూ సుమకి పరిచయం లేదు. ఈళ్ళిద్దరూ తప్ప. ఈళ్ళు కానీ ఆళ్ళు కానీ సుమకి ఆ నిజం చెప్పరు. కాబట్టి అది కాలగర్భంలో కలిసిపోయింది. అయినా ఆ నిజం తెలుసుకుని సుమ ఏమి చేస్తుంది. ఈ జీవితాన్ని నరకం చేసుకోవటం తప్ప. అయినా సిద్దు ప్రేమలో కానీ చూపులో కానీ లోపముంటే ఏరే ఆలోచనలు వొత్తాయి. ఆటికి అవకాశమే లేకండా సిద్దు చూసుకుంటంటే ఆ ప్రేమకు సుమ ఉక్కిరిబిక్కిరై పోతంది. సిద్దు కూడా సుమను పొందానన్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోతన్నాడు. అందుకే ఎవరికీ ఆ నిజం తెలుసుకోవాలనే ఆలోచన కానీ అవసరం కానీ లేవు.

కొన్ని నిజాలంతే అవి తెలియటం వొల్ల జీవితం నరకమౌతుందనుకున్నపుడు అది ఎంతో మంది జీవితాలని నాశనం చేస్తుందనుకున్నపుడు దాన్ని చంపేయడమే మంచిది. ఆళ్ళకి పెళ్ళై పదిహేనేళ్ళౌతంటే ఉప్పుడు మాత్రం తెలుసుకుని ఏంచేత్తారు? మీరూ చెప్పకండి నేనూ చెప్పను ఎప్పటికీ!

(సమాప్తం )

బహుమతి పొందిన కథ

# డామిట్! కథ అడ్డం తిరిగింది

కామెడీ కథ



నంద రేవతి

వెధవది నాకు చాలా అసహనంగా ఉండి చచ్చింది. కోపంగా కూడా ఉంది. ఎవరిమీదో తెలియని కోపం,కసి. ఎవరిమీదో ఏమిటి నా శ్రాద్ధం! నామీద నాకే కోపం. నా అజాగ్రత్త పై నాకే కోపం. దీనికి తోడు వెధవ ఆకలి. నక నక లాడే ఆకలి. కడుపు మండే ఆకలి. నక లాడే ఆకలి. కడుపు మండే ఆకలి.

ఆ హోటల్ దగ్గర ఒక పక్కగా నిల్చున్నాను. పింజారీ మొహంతో అందర్నీ చూడడమే నా పనయ్యింది.నిజానికి నేను కూడా ఈ పాటికి వీరందరితో కలిసి భోజనం చేయాల్సినవాడ్ని. నా ఖర్మకాలి ఇలా అందరివైపుదీనంగా చూడాల్సిన పరిస్థితి దాపురించింది. నాలాంటి దుస్థితి పగోడికి కూడా రాకూడదు.

నేనొక ఆఫీస్లో గుమాస్తా గిరీ వెలగబెడుతున్నాను. ఇంకా పెళ్లి కాలేదు. నా గదికి కాస్త దగ్గరగా ఉన్న ఈ హోటల్లో భోజనం చేస్తుంటాను. ఈ హోటల్ ఎప్పుడూ జనంతో కిట కిట లాడుతూ ఉంటుంది.

తెల్లవారితే జనం తిర్నాళ్ళలా ఈ హోటల్ ముందు క్యూ కట్టేస్తారు. ఒకరకంగా చెప్పాలంటే ఈ హోటల్అమ్మలాంటిది. ఒక్కసారి మనం ఓ ఏభై మనవి కాదనుకుంటే చాలు. ఓ పూట మనం తిననంత భోజనం,కూరలు, పప్పు, సాంబారు, పెరుగు, పచ్చడి, స్వీట్. ఇలా మనకు కావాల్సినవి కావల్సినంత వడ్డిస్తారు. అదీఎంతో రుచిగా, శుచిగా, శుభ్రంగా, ఇంటి వంటలా, స్వచ్ఛ మైన బ్రాహ్మణ భోజనంలా ఉంటాయి. నేను వెజ్ ని కాబట్టి ఈ హోటల్ ని ఎంచుకున్నాను.

ఈ సోదంతా ఎందుకంటే నా భోజన టిక్కెట్ ఎక్కడో పడిపోయింది. వెధవది అది నా పర్స్ తో పాటూ పోయింది. మళ్లీ మరో టిక్కెట్ కొందామంటే నా దగ్గర డబ్బులేవాయె! ఫోన్ పే లో బేలన్స్ నిల్. ఉన్న కాస్త డబ్బులు ఆ పర్స్ లోనే ఉండి చచ్చాయి. అదెక్కడో పడి చచ్చింది.

నేనా ఆకలితో ఉండి చావలేను. అసలే భోజన ప్రియుడ్ని. అప్పటికే మిట్ట మధ్యాహ్నమైంది. సూర్యుడు నడి నెత్తిన భగ భగా మండుతున్నాడు. నా కడుపులో ఆకలి కూడా అలాగే మండుతోంది. తట్టుకోలేని ఆకలి.

శోషొచ్చి పడిపోయేంత ఆకలి. అప్పటికే రెండుసార్లు మంచినీళ్లు తాగి చచ్చాను. కానీ వెధవ కడుపుమంట చల్లారలేదు. అందరి మొహాల వైపు చూస్తున్నాను గోతికాడి నక్కలా. తెలిసిన వాళ్ళు ఎవరైనా కనిపించి చస్తారేమోనని. ఊహూ ఎవరూ కనిపించి చావడం లేదు.

ఏం చేయాలో తెలియక అలా తింటున్నవాళ్ళవైపు దేబిరిగొట్టు మొహంతో చూస్తుండి పోయాను. హోటల్మొత్తం నిండు కుండలా ఉంది. ఒకే ఒక టేబుల్ దగ్గర మాత్రం ఒక సీట్ ఖాళీగా కనిపించి చచ్చింది అది నా కోసమే అన్నట్టు. ముందుగా అక్కడ వాలిపోయా. నా ఎదురుగా ఉన్న ఓ శాల్తీ భోజనం చేయడంలో యమబిజీగా ఉన్నాడు. అతడ్ని చూస్తూంటే



“వివాహ భోజనంబు వింతైనా వంటకంబు” పాటలో ఎస్వీ రంగా రావు గారు గుర్తుకొచ్చారు. అన్ని రకాల పదార్థాలూ రుచి చూస్తూ, భోజనం చేయడంలో ఉన్న మజాని ఆస్వాదిస్తున్నాడు. నిజం చెప్పొద్దూ అతను తినే పద్ధతికి నాకూ నోట్లో నీళ్ళూరాయండోయ్. గ్లాస్ తో మంచి నీళ్ళు తాగి అతని మొహం కేసి చూసాను.

ప్రపంచంలో ఉన్న మంచితనమంతా నాకు అతని మొహంలో కనిపించి చచ్చింది. చాలా మంచివాడిలా ఉన్నాడు. అప్పటికే నేను రెండుసార్లు మంచినీళ్లు తాగడం చూసి, “మాస్టారూ... మీరు త్వరగా భోజనం ఆర్డర్ఇవ్వాలి. కాసేపయితే మీకు భోజనం దొరకదు. ఈ హోటల్ గురించి మీకు ఆట్టే తెలిసినట్టు లేదు. ఇది ఈ ఊళ్ళోనే మనలాంటి మధ్య తరగతి వాళ్లకి చాలా మంచి హోటల్” అన్నాడు ఓ పక్క లాగించేస్తూనే.

నేను “గురువు గారూ...” అన్నాను. అతనికి మాత్రమే వినిపించేటట్టుగా నా మొహంలో విపరీతమైన జాలి కురిపించేస్తూ. అతడు నా వైపు తలెత్తి చూసి, “చెప్పండి మాస్టారూ” అన్నాడు మెల్లగా. నేనిక నా ఆకలి బాధ భరించలేక నా గోడు ఆయనకి వెళ్లబోసుకున్నాను. ఒక భోజన టిక్కెట్ కి సరిపడే డబ్బులిమ్మని వేడుకున్నాను అనడంకంటే అడుక్కున్నాను అంటే బాగుంటుందేమో! అతడు నా వైపు నఖశిఖ పర్యంతం చూసాడు.

“చూడండి మాస్టారూ... మీరు అడుక్కోవాలంటే హోటల్ బయట నుంచే అడుక్కోవాలి. ఇలా లోపలికి వచ్చి, దర్జాగా టేబుల్ ఎదురుగా కూర్చొని కాదేమో? “ అన్నాడు కాస్త కోపంగా.

నేను ఖంగు తిన్నాను. వీడి అసాధ్యం గూలా! వెధవది వీడి మొహం చూసి మంచివాడేమో అనుకున్నాను.

“గురువు గారూ... అదీ... నేను అడుక్కునే వాడిని కాదండీ... నేనూ మీలాంటి వాడినే. అదీ ఏమయిందంటే..”అంటూ జరిగింది చెప్పబోతూంటే, అతడు నాకేసి మళ్లీ చిరాగ్గా చూసి చచ్చాడు.

“మీ సోదాపండి. మీలాంటి వాళ్ళు నాకు రోజూ చాలా మంది తగులుతూనే ఉంటారు రోడ్లపై, బస్టాపుల్లో, రైల్వే స్టేషన్లలో. కానీ మీరు కొంచెం క్లాస్ గా అడుక్కుంటున్నారంతే!”అన్నాడు మొహం ధుమధుమలాడిస్తూనే. వార్నీ బండబడ! ఎందుకు ఇతగాడ్నిఅడిగి చచ్చానా అన్పించింది నాకా క్షణంలో. కొంచెమైనా మంచీ మర్యాద లేకుండా ఇలా

మాట్లాడుతున్నాడేమిటి వెధవది అనుకున్నాను. కానీ అవసరం నాది. ఆకలి నాది. తప్పదు కదా!

"అయ్యా... మీరనుకుంటున్నట్టు నేను అడుక్కునే వాడిని కాదండి. నేనొక ఆఫీస్లో..." అతడు నా మాటలేవీ పూర్తిగా విని చావడం లేదు.

"ఎంత కావాలి?"అన్నాడు చిరాగ్గా మొహం పెట్టి. నా మొహం ఒక్కసారి మతాబులా వెలిగిపోయింది.

"ఓ ఏభై... "; అన్నాను గొణుక్కుంటున్నట్టు.

అప్పటికే అతడన్న మాటలు నా పక్క టేబుల్ వాళ్ళు విని చచ్చినట్టున్నారు. నన్ను అదోలా చూస్తున్నారు. ఇద్దరు ముగ్గురు ఫక్కున నవ్వి చచ్చారు. నాకు తల కొట్టేసినట్టయ్యింది. వెధవది ఇంతబతుకూ బతికి ఇంటెనెకాల చచ్చినట్టయ్యింది నా పరిస్థితి. కాని ఓపికతో ఓర్చుకున్నాను. ఓ చేత్తో భోజనం చేస్తూనే, మరో చేత్తో వెనక జేబునుండి అతగాడు డబ్బులు తీసిచ్చాడు. అది అందుకొని వెంటనే ఓ భోజనం తీసుకున్నాను. అతని ఎదురుగా కూర్చొని నేనూ ఓ పట్టు పట్టడం మొదలు పెట్టాను.

అతడు నన్ను తిట్టినా నాకు భోజనం పెట్టించాడు. అదే చాలు. అప్పటికే అతని భోజనం పూర్తికావొచ్చింది.

"అయ్యా... మీరు రోజూ ఇక్కడికి వస్తూంటారా?"అన్నాను మెల్లగా.

"ఏం? రోజూ కూడా నేన్నీకు తినిపించాలా ఏమిటి కొంపతీసి?" అన్నాడు వ్యంగ్యంగా.నేను సిగ్గుతో చచ్చాను. "అదికాదండీ... రేపు మీ డబ్బులు మీకు తిరిగికిచ్చేద్దామని..."అన్నాను సణుక్కుంటున్నట్టు.

"అవసరం లేదులే. నువ్వు మళ్లీ నన్నడక్కుండా ఉంటే అదే పది వేలు" అన్నాడు కొంచెం కోపంగా.

";అదికాదండీ... ఉచితంగా నేనేదీ తీసుకోను. తిరిగిచ్చే మనస్తత్వం నాది. నేనైతే రోజూ ఇక్కడికి వస్తూంటాను. మీరూ వచ్చేవారైతే మీ డబ్బులు మీకు తిరిగిచ్చేద్దామని..."అన్నాను అర్థోక్తిగా.

"నేనీ రోజే ఇక్కడ కొచ్చాను. రోజూ రాను. అయినా బోడి నువ్విచ్చే ఏభై కోసం, నేను అయిదొందలు ఖర్చు చేస్కొని మళ్లీ ఇక్కడకు రావాలా? ఏమిటి? "అన్నాడు వెటకారంగా.

నా మనసు చివుక్కుమంది. అయినా నేను బాధ పడ్లేదు. మాటల్ని పడడం, ఓర్చుకోవడం నాకు ఈక్షణంలోనే అలవాటయ్యిపోయింది. అతని మీద నాకు కోపంగా లేదు. ఎంతయినా అతగాడు నా ఆకలి తీర్చిన నా అన్నదాతాయె!

"పోనీ మీ నెంబరిస్తే నేనే వచ్చి మీకు డబ్బులిచ్చేస్తానయ్యా" అన్నాను.

అతని భోజనం పూర్తయ్యింది. తృప్తిగా రెండు మూడుసార్లు అన్నాలు, కూరలు, పప్పులు అన్నీ వేయించుకొని లాగించాడేమో పొట్ట బయటకొచ్చి అతని ఆత్మారాముడు శాంతించినట్టున్నాడు. నాపై కాస్తంత జాలి చూపించాడు. చిన్నగా నవ్వేడు. తన భోజనం పూర్తయినా నాతో కాసేపు మాటలు కలిపాడు. నా గురించి అన్ని విషయాలు అడిగి తెల్సుకున్నాడు. తన గురించి కూడా కొన్ని చెప్పాడు. నా నెంబర్ తీసుకున్నాడు.

తన నెంబరిచ్చాడు. మనిద్దరం ఫ్రెండ్స్ అన్నాడు. డబ్బులు ఉంచుకోమన్నాడు.

నేను పట్టు పట్టేసరికి నా బాధ పళ్ళేక మళ్లీ రేపొస్తానన్నాడు. అప్పుడు నా డబ్బులతో తనకు తనివితీరా భోజనం తినిపించమన్నాడు. మనస్ఫూర్తిగా తింటూ ఆస్వాదిస్తున్నప్పుడు, తనని డిస్టర్బ్ చేశాననే కోపంతోనే కొంచెం కఠినంగా మాట్లాడానని, ఏమీ అనుకోవద్దని చెప్పాడు. ఇంతలో నా భోజనం కూడా పూర్తయ్యింది. నేను కూడా పొట్ట ఊదొచ్చేలా అన్ని పదార్థాలు రెండేసి సార్లు వేయించుకొని మరీ పట్టు పట్టాను. చేతులు కడుక్కోవడానికి వాష్

**బహుమతి పొందిన కథ**

రూమ్ కి వెళ్ళొచ్చాను.

అతడు లేదు! బ్రేవ్ మని త్రేంచి, ఇక వెళ్ళిపోబోతూంటే అప్పుడు చూసాను టేబుల్ పై అతని పర్స్! “అరే అతను పర్స్ మర్చిపోయాడు. చూసుకోలేదు. నా పర్స్ పోయి నేను, ఎంతో ఇబ్బంది పడి చచ్చాను. అలాంటి ఇబ్బంది అతడు పడకూడదు”అనుకుంటూ వెంటనే ఆ పర్స్ తీసుకొని, జేబులో పెట్టుకొని గబ గబా హోటల్బ యటకి పరిగెత్తాను. దూరంగా అతడు వెళ్ళిపోతూ కనిపించాడు.

“గురువు గారూ…”అంటూ గట్టిగా కేక పెట్టాను. అప్పటికే అతగాడు చాలా దూరం వెళ్ళిపోయాడు. వెంట వెంటనే అతనికి రెండు మూడు సార్లు ఫోన్ కూడా చేశాను. లైన్ కలవ లేదు.

నేను చూస్తూండగానే అతడు ఆటో ఎక్కి వెళ్ళిపోయాడు. నేను చాలా బాధ పడ్డాను. చాలా మంచి వ్యక్తిలా ఉన్నాడు. మాట కఠినంగా ఉన్నా మనసు మాత్రం వెన్న. అతని నెంబర్ నా దగ్గరుంది కాబట్టి పర్వాలేదు.

అతడు ఎక్క దున్నా ఫోన్ చేసి పర్స్ తిరిగిచ్చేద్దాం అనుకున్నాను.

ఆదివారం కాబట్టి ఆఫీసుకు సెలవు ఏడ్చి చచ్చింది. భుక్తాయాసంతో రూమ్ కి చేరి రెస్టీ సుకున్నాను. ఈ పూటకి ఎలాగో గడిచింది. రాత్రి భోజనానికి డబ్బులు చూసుకోవాలి. రేపు ఆఫీస్లో అడ్వాన్సు కొంత ఎమౌంట్ తీసుకోవాలి అనుకున్నాను. అప్పుడు గుర్తొచ్చింది నాకు అతని పర్స్ నా దగ్గరుందనే సంగతి. అవును ఆ పర్స్ లోంచి మరో ఏభై తీసుకొని, మొత్తం వంద ఆ పర్స్ లో పెట్టి రేపు అతనికిచ్చేస్తేపోలా. నా వెధవ ఐడియాకి నాకు నేనే శెభాష్ అనుకున్నాను.

ఇప్పుడు నా మనసు కాస్త తేలికయ్యింది. తప్పు చేయటం లేదనే భావన కలిగింది. మొదట అతని పర్సూ్చ డకూడదనే అనుకున్నాను. కాని తప్పదు. చూడాల్సిన పరిస్థితి. జేబులో నుండి మెల్లగా అతని పర్స్ తీసి చూసాను. అది అచ్చం నాలాంటి పర్స్ లానే ఉండి చచ్చింది. గులాబి రంగు పర్స్! నాకెంతో ఇష్టమైన రోజ్క లర్. నేనెంతో ముచ్చట పడి కొనుక్కున్న నా పర్స్ లాంటి పర్స్. లోపల డబ్బులు చూసాను. అవీ నా డబ్బులంతే ఉన్నాయి. ఆశ్చర్యపోయాను. కొన్ని పేపర్లు, ఫోటోలున్నాయి. అరే అవి కూడా నావే. అన్నీ నాలాంటివే ఉన్నాయి. ఇదెలా సాధ్యం? అనుకున్నాను.

అప్పుడు జాగ్రత్తగా పరీక్షగా చూసాను. దిమ్మ తిరిగిపోయింది నాకు. అది నా పర్స్ లాంటి పర్స్ కాదు. నా పర్సే! వార్నీ వాడి పిండాకూడు కాకులెత్తుకెళ్ళా. నా పర్స్ వాడి దగ్గర కెలా వచ్చింది చెప్మాఅనుకున్నాను?పడిపోయిన నా పర్స్ అతగాడికి దొరికి చచ్చిందా? లేక నా పర్స్ కొట్టి చచ్చాడా? అంటే అతగాడు జేబుదొంగా?చూడ్డానికి అలా లేడే? వీడి తస్సాదియ్యా ఎంత డిగ్నిఫైడ్ గా ఏడ్చి చచ్చాడు? ఇలా సాగేయి నా ఆలోచనలు. పర్స్ లో డబ్బులు చూసాను. అన్నీ అలాగే ఉన్నాయి. రూపాయి కూడా పోలేదు. ఒక ఏభైమాత్రం తక్కువయ్యింది. అది అతడు నాకిచ్చిందే. నా భోజన టిక్కెట్ మాత్రం లేదు! అంటే దాంతో అతడు తనభోజనం కానిచ్చాడు.

సరిగ్గా అప్పుడే నా మొబైల్ కి ఒక మెసేజ్ వచ్చింది. చదివాను.”;క్షమించండి గురువు గారూ... నేను దొంగని కాదండోయ్. నేను భోజనం చేసి రెండ్రోజులయ్యింది. ఆకలికి తట్టుకోలేక మీ భోజనం టిక్కెట్ కోసం మాత్రమే మీ పర్స్ ని కొట్టి మిమ్మల్నిఇబ్బంది పెట్టాను. మీరు దాన్ని పర్స్ లో పెట్టడం చూసాను. నాక్కావాల్సింది నేను తీసుకున్నాను. ఒక్కసారి నేను మిమ్మల్ని అన్న మాటలు, మీరు నన్ను అనేసి మీ కడుపు మంట తీర్చేసుకోండే. ఉంటాను సర్” అలా ఆ మెసేజ్ వైపే చూస్తూ ఉండి పోయాను ‘డామిట్! కథ అడ్డం తిరిగింది’ అనుకుంటూ.

(సమాప్తం )

బహుమతి

పొందిన

కవిత

# మాకొంచెం సమయమివ్వండి..!

**బి.కళాగోపాల్**

మెదడు పొరల్లో చిక్కుకుపోయిన ఆలోచనా దారాలు పుటుక్కున తెగకముందే..

రాసుకుందామన్న అభిలాష పాలపొంగులా చల్లారక ముందే..

గడవులోగా పదం గడబిడమంటూ గుండెదడనే రేపింది!

కొలిక్కి రాని వస్తువు ఎంపిక ఏదీ నచ్చని చీరల షాపింగులా నిరాసక్తతను కల్గించినా..

మాసిన బట్టలు,అంట్లగిన్నెలు,కుక్కరు విజిల్సూ మాటిమాటికి కక్ష్య సాధిస్తున్నా..

ఉక్కపోత ఐపిఎల్ మ్యాచుల బెడద చెవినిల్లు కట్టుకొని హోరెత్తిస్తున్నా..

రాసే సమయం ఇవ్వబడదు–తీసుకోవాలన్న ఒడంబడికకు కట్టుబడిన అక్షరాలు..

అప్పుడప్పుడు భోజనాల బల్లపై ఆవురావురంటూ..

మరోచోట తిరగమోత ఘుమఘుమల్లో చిటపటలాడుతూ రాలిపడతాయి!

విందులూ..వినోదాలను కాసేపు ఆవలకు నెట్టి,

ఫోన్ మర్యాదలకు అలకరానీయకుండా..

పిల్చిన పేరంటానికి కట్టడి విధించుకొని,

పరాకన్న బాస్ గుర్రు చూపులను తప్పించుకొని,

చూడవస్తానన్న ప్రయాణాన్ని చూస్తానంటూ వాయిదా వేసుకోగా..

చిక్కిన కాసింత సమయాన దొరికిన ఏకాంతంలో..

చిక్కుపడిన దారపు ఉండ కొస దొరికినంత ఆనందంలో భావాలు తీవలై సాగగా..

నిద్ర లేని రాత్రుల్లో నలిపిన కాగితం ఉండల్లో..

ఉస్సూరనుకున్న ఆ నాలుగు కవిత్వ పాదాలు

బీరపాదులా పందిరి పైకి చకచకా అల్లుకు పోయాయి.

రాయాలన్న ఆలోచనే అంకురమై పాదులు వేయగా..

రాసే సమయాన్ని సృష్టించుకొని టాయిలెట్ పేపర్లు,

రసీదీ టికట్లు,ఆదాలిఖా దస్తావేజుల్లో

తమ ఆత్మకథల్ని అద్భుతంగా ఆవిష్కరించిన రచయిత్రుల అంతరంగం నేర్పిన సత్యం..

గది ఇరుకైనా,స్థలం అనుమతించకున్నా,షరతులు విధిస్తున్నా,

సమయ పేదరికమంటూ వెక్కిరించే

పరిహాస చూపులు పక్కదారి పట్టిస్తున్నా..

రాయాలన్న తపన ముందు ఓడిపోవాల్సిందేనంటూ..

తమ సృజనను తక్కువ అంచనా వేయనివ్వని ఆత్మ నిర్భరతను ప్రకటించాయి!

ఔరా!రచయిత్రుల అంతరంగాన్ని తొలుచుకొని..

కలం రాపిడిలో మధించిన నాలుగక్షరాలు

వెలుగులోనికి రావాలంటే ఎన్నెన్ని అడ్డంకులు?ఎన్నెన్ని అవరోధాలు?

గుండె గొంతులో తారట్లాడే కూసిన్ని ఆలోచనలను పోగేసుకొని..

గడువు లోగా పంపిన కవిత మాత్రం శుభమస్తంటూ కోటి ఆశల్ని రేకెత్తించింది..!!

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్ సీరియల్





డా. పులిచెర్ల సాంబశివరావు

మహోదారుడైన చక్రవర్తి అక్బర్! భారత బానిసత్వపు సంకెళ్ళను దృఢతరం చేసిన మొఘల్ పాదుషా! అజ్మీర్లోని మెయినుద్దీన్‌ఛిష్ట దర్గాకు పవిత్రయాత్ర చేయ సంకల్పించాడు.

ప్రతి సంవత్సరం ఒకటి రెండుసార్లు వెళ్ళి మొక్కుబడులు చెల్లించడం అలవాటే! వెళ్ళినప్పుడుల్లా పెద్దమొత్తంలో ధనాన్ని పేదసాదలకు పంచుతాడు. కాలినడకన కొంతదూరం ప్రయాణించి మొయినుద్దీన్ పై తనకుగల భక్తిప్రపత్తులను ప్రకటిస్తాడు.

యుద్ధంలో 'యామియిన్!' అనేది అక్బర్ నోటివెంట వచ్చే కేక! అంత భక్తి! అక్బర్ అజ్మీర్ని తన ప్రధాన కేంద్రంగా చేసుకున్నాడు. కోటను దృఢతరం గావించాడు.

తనకోసం విలాసవంతమైన సౌధాలను నిర్మించాడు. నెమ్మదిగా అజ్మీర్ చుట్టుపట్ల ఉన్న రాజపుత్రులతో సంబంధం కలుపుకున్నాడు.

అజ్మీర్లోని దర్గాకు అక్బర్ ఈసారి యాత్రకు వెడలింది కేవలం భక్తితో మాత్రమే గాదు.

రాజపుత్రస్థానంలో రాజకీయాలు పరిశీలించడం ఆయన మదిలో దాగిన పరమార్థం! మేవాడు ప్రభువు ప్రతాపుడు జోధ్పూర్ రాజు చంద్రసేన్తో చేయి కలిపాడు! అగ్నికి వాయువు తోడైంది! ఏ క్షణాన్నైనా గుజరాత్తు వాళ్ళు ఆహుతి గావించగలరు!

రాయ్సింగ్ను అజ్మీర్ ప్రతినిధిగా నియమించి జోధ్ పూర్, ఈచర్ ప్రాంతాల్లో గొప్ప సైన్యాన్ని నిలిపాడు అక్బర్.

ఈదర్ ప్రభువు నారాయణదాస న్నూ, దుంగర్ పూర్ రాజు రావల్ అస్కరన్నూ అక్బర్ రాజ్యభ్రష్టులను గావించాడు. వీళ్ళిద్దరూ అడవుల్లో వుండి సమయం కోసం కాచుకొని వున్నారు.

అక్బర్ దెబ్బకు వరుసగా అందరూ లొంగిపోతున్నారు.

రణనీతికోవిదులు రారోడ్లు! అక్బర్ దర్బార్లో చేరి తమ చెల్లెళ్ళను అతని అంతః పురానికి పంపారు! బికనీరు, జోధ్పూర్లు అక్బర్ రాజ్యంలో అంతర్భాగమయ్యాయి! కదనరంగంలో ఎదురులేని వీరవరులు కచవాహలు! మెదలకుండా తోడబుట్టిన ఆడపడుచులను షాహిన్షా జనానాలో చేర్చారు. అంబర్ను అక్బర్ కలుపుకున్నాడు.

భండన భీములు భాటియాలు! అన్నెంపున్నెం ఎరుగని కన్నెలను మొఘలులకు నజరానాగా సమర్పించారు! జైసల్మీర్ రాజ్యం చక్రవర్తికి వంగి సలాం కొట్టింది! వరుసగా అందరూ అక్బరి పాదాక్రాంతులవుతున్నారు. కానీ – ఒక్కడు మాత్రం అక్బర్ అంతః పురానికి 'డోలా' పంపడానికి తిరస్కరించాడు! అతడే మహారాణా ప్రతాపుడు!

కోటలు కూలిపోవచ్చు గాక, ఆస్తులు హరించుకొని పోవచ్చుగాక, సైన్యం సమసిపోవచ్చు. గాక! బొందిలో తుది నెత్తుటిబొట్టు ఉన్నంతవరకు శిశోదియా వంశంవారి రక్తం సంకరం కారాదు! కులగౌరవం కూలిపోరాదు! రసపుత్ర సంప్రదాయాలు సమసిపోరాదు! మేవాడ స్వాతంత్య్ర పరిరక్షణకు ఏ త్యాగమూ గొప్పది కాబోదు!

ఇదే ప్రతాపుని నిశ్చయం! అతనికి తోడు బుంది, సిరోహి రాజ్యాలు. అక్బర్ చిత్తోడ్ని జయించి, మొత్తం మేవాడ్ ప్రాంతాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకోవ డానికి ప్రయత్నాలు. ప్రారంభించాడు. ఎదిరించి నిలిచిన రాణాప్రతాపుణ్ణి లొంగదీసు కోవడానికి పెక్కు ప్రయత్నాలు గావించాడు. అజ్మీరు అక్బర్ కేంద్రంగా చేసుకున్నాడు. కోటను కట్టుదిట్టం గావించాడు. రాజప్రాసాదాలు నిర్మించాడు. రక్షకదళాన్ని నెలకొల్పాడు.. మహారాణాప్రతాప్ నగరాలను వీడి

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్

**జరిగిన కథ** అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు! ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా చిత్తోడ్ వదిలి నేను చుపించాచోట కోట నిర్మంచమని చెపుతాడు . దానికి ఉదయసింహుడి మంత్రులు అది పిచ్చి ఆలోచన అంటారు .కాని ఉదయ సింహుడి కొడుకు మాత్రం తండ్రి ఆజ్ఞ పాటించలంటాడు. అక్బర్ అనుమతితో బైరాంఖాన్ తన కరకు కరవాలంతో హేమూ శిరమును ఒక దెబ్బతో తెగనరికాడు .చిత్తోడ్ అక్బర్ వశంఅయ్యింది . అగ్ర కోటకి ఇరు వైపులా జయమల్, పత్తా విగ్రహాలను నిలిపాడు అక్బర్ .చిత్తోడ్ మొత్తం శ్మశానంలా మారిపోయింది.దానితో దిగులుతో మంచం ఎక్కాడు ఉదయ సింహుడు .చిన్నరాణి తనకొడుకు జగమ్మల్లుడికి పట్టాభిషేకం చెయ్యమంటుంది .మాట ఇచ్చి మరణిస్తాడు ఉదయ సింహుడు. కాని అక్కడి సర్దారులు అందుకు ఒప్పుకూరు . రాణాప్రతపుడికే పట్టం కడతారు .దానితో జగంల్లుడు కోపంతో అక్బర్ తో చేతులు కలుపుతాడు . రాణాప్రతాప్ తన ప్రజలను కన్నా బిడ్డల్లా చూసుకుంటూ పరిపాల సాగిస్తున్నాడు ..శక్తీ సింహుడు అది ఓర్చుకోలేక ఎలాగైనా ప్రతుపుడిని చంపాలని చూస్తాడు . అ కుట్రలో భాగంగా హరి భట్టు మరణిస్తాడు **ఇక చదవండి**

అడవుల్లోకి చేరాడు! మైదానప్రాంతాల్లో యుద్ధానికి అలవాటుపడిన అక్బర్ అడవుల్లో వున్న ప్రతాపుని గూర్చి ఆరాతీయలేక నానా అగచాట్లుపడ్డాడు.

మేవాడ్ ప్రాంతం అంతా కొండలతో, గుట్టలతో, చిట్టడవులతో నిండి వుంటుంది. ప్రతాపుడు ఒకచోట వుండేవాడు కాదు! అతనితో యుద్ధం ఒకనాటితో పూర్తయ్యేది కాదు! మైదానప్రాంతానికి ప్రతాప్ రాడు. తను కొండల్లోకి వెళ్ళి ప్రతాప్తో తలపడితే తిరిగి రావడం కల్ల! కానీ ప్రతాపిని ఊరికే వదలడానికి వీల్లేదు! అతణ్ణి చూచి ఇతరులు గూడా ఎదిరించే ప్రమాదం వుంది. ఎంతకాలమైనా సరే! ప్రతాప్ యుద్ధం సాగించవలసిందే!.

రాణాప్రతాప్ సామాన్యరసపుత్రవీరుడు కాదు! శిశోడియా వంశంవాడు. ఆ వంశం అంటే మిగిలిన రసపుత్రవీరులకు ఎందుకో ప్రేమా, గౌరవమూ, భక్తి! తన అనుచరులూ, సేనాపతులు రసపుత్రులే! వాళ్ళు ప్రతాపునిపై పోరాటానికి సిద్ధపడతారా అనేది అక్బర్ అనుమానం.

ఈ ఆలోచనలతో సతమతమవుతూ, ఎటూ తేల్చుకోలేక ఆత్మీయులతో అభ్యంతర మందిరంలో సమావేశమయ్యాడు అక్బర్! ఆయన అనుచరుల్లో ముఖ్యులైన రసపుత్ర సేనానులు భగవాన్ దాస్, మాన్సింగ్, రాయింగ్! అందరూ ఉద్ధండులే!

"జహాపనా! మీ క్షేమమే మా క్షేమం! మీకోసం మా సర్వస్వాన్ని సమర్పించ డానికి సిద్ధంగా వున్నాం!" భగవాన్దాస్ వినమ్రుడై అన్నాడు.

"మేవాడు విషయం గూర్చి మీ అభిప్రాయం తెలుసుకోవడానికి మిమ్మల్ని పిలిపించాం!" "మేవాడా...!!" నీళ్ళు నమిలాడు భగవాన్ దాస్,

"అవును! లోగడ మీరు హాడాప్రభువును హడలగొట్టి మా పాదాక్రాంతుణ్ణి గావించారు! మీరు తలుచుకుంటే ప్రతాపుణ్ణి ఒప్పించగలరు. కావాలనుకుంటే నొప్పించ గలరు!"

"జహాపనా! ప్రతాపుడు అందరిలాంటివాడు కాడు. రసపుత్రులకు భగవంతుడితో సమానుడైన బప్పరావల్ వంశీయుడు!" రాయిసింగ్ అన్నాడు.

"తొందరపడి యుద్ధానికి దిగడం మంచిదిగాదని నా మనవి!" భగవాన్ వైపు చూస్తూ అన్నాడు. మాన్ సింగ్ "అవును" అంటూ తల వూపాడు.

దీంతో అక్బరికి ప్రతాపుని స్థాయి ఏమిటో స్పష్టంగా తెలిసిపోయింది. రసపుత్రులకు ప్రతాప్ అంటే ఏ మూలనో కొంత గౌరవమూ, మరికొంత భయమూ ఉన్నాయని అక్బర్. గుర్తించాడు. ప్రతాపుని అభిప్రాయం తెలుసుకోవడానికి ఒక రాయబారిని పంపాడు.

పేరు జలాలాఖాన్ ఖోర్చి! జలాల్ అక్బర్ అంతరంగికుడు! అక్బర్ ఆస్థానంలో సరదాగా అందర్నీ నవ్విస్తూ సంచరించే జలాల్ అంటే అందరికీ ఇష్టమే! అతడి మృదుభాషిత్వం అక్బర్ని ఆకర్షించింది.

మెత్తటిమాటలతో జలాలా ఖాన్ ప్రతాపుణ్ణి లొంగదీయగలడని షాహిన్షా

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్

విశ్వాసం. ఉదయపూర్లో జలాల్లో ఖాన్ ప్రతాపసింహుణ్ణి దర్శించాడు..
"హిందూదేశ చక్రవర్తి అక్బర్ మాతో సంధికోసం నన్ను రాయబారిగా పంపారు!"

"మీరు తిరిగివెళ్ళిన తరువాత మొఘల్ ప్రభువుకు మా నమస్కారములు అందజేయండి!

"ఇప్పుడు ప్రపంచంలో అందరికంటే సంపన్నుడు షాహినాయేనన్న సంగతి మీకు తెలుసుననుకుంటా!"

"శాంతస్వభావులైన హిందువులను దోచుకొని కూడబెట్టిన సొమ్ము అది!"
"అందరూ వారికి లొంగిపోయారు! మా చక్రవర్తి ఉదారులు! అనవసర రక్తపాతం వారికి ఇష్టంలేదు! మీరు మాత్రం ఎందుకు ఎదురుతిరగడం?!

"మేము ఎదురుతిరగడం లేదు! దేశ స్వాతంత్ర్యాన్ని రక్షించుకుంటున్నాం!!!
"భిన్న భాషలు విభిన్న ప్రాంతాలు గల ఈ దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యం క్రిందకి తేవడం కోసం షాహిన్షా ఎంతో కృషిచేస్తున్నారు! ఇంత మేలు మీకు ఎవరూ ఇంతవరకూ చేసి ఉండలేదు!"..

"ఎన్ని భాషలున్నా, ఎన్ని ప్రాంతాలున్నా మాది ఒకటే జాతి! హిందూ జాతి! ఆసేతుహిమాచలం రామనామం మాకు తారకమంత్రం! ఏ ప్రాంతంలో వున్నా మా వీరులకు హరహరమహాదేవ్ అనేది పవిత్రమంత్రం! మమ్మల్ని విదేశీయులెవరో వచ్చి సంఘటితం చేయవలసిన పనిలేదు!"

"అక్బర్ చక్రవర్తి ఎంతో ఉదారులు! హిందువులను హింసించడంలేదు!" ప్రతాప్ కుపితుడయ్యాడు.

"మా యింట్లో జొరబడిన దొంగలు మమ్మల్ని హింసించకుండటం ఉదారతా? తరతరాలుగా మీరు మా దేవాలయాలను ధ్వంసం గావించారు! అక్కడ మసీదులను నిర్మించారు! అది ఉదారతా! పోయి మీ చక్రవర్తికి చెప్పు! ఈ దేశాన్ని విడిచి పొమ్మను! బాబరు సమాధి వున్నచోట రాజ్యాన్ని నిర్మించుకొని తన వుదారత చాటుకొనమను! చిత్తోడ్ దుర్గంలో దేవాలయాల్లో ప్రాణభయంతో దాగిన వృద్ధుల్నీ, పసిపిల్లల్నీ ముప్పయి వేల మందిని చంపాడే... దానికి క్షమాపణ వేడుకొని తన ఉదారత చాటుకొనమను! వందలమంది స్త్రీలు అక్బర్ వారిని పడకూడదని అగ్నికి ఆహుతి అయ్యారే, అందుకు పశ్చాత్తాపపడమను ! అప్పుడు ఆయన ఉదారతను విశ్వసిస్తాం!".
"మీరు లొంగిపోవలసిన పనిలేదు! మీరు అక్బరు ఆస్థానానికి రావలసిన పని కూడా లేదు! మీ ప్రతినిధిని పంపండి చాలు!"
"జలాలా ఖానో! మా ప్రతినిధి కాదుగదా, ఆఖరికి మా గుర్రం తోకవెంట్రుక కూడా గోమాంస భక్షకునికి సలామ్ చెయ్యదని చెప్పండి!"

రాయబారం విఫలమయింది..
27 నవంబర్ 1572. అహమ్మదాబాద్.. జలాల్ ఖాన్ ఖోర్చి ఏడుపు ముఖంతో అక్బర్ దగ్గరకు తిరిగివచ్చి, పూసగ్రుచ్చినట్లు ప్రతాప్ జరిగిన సంభాషణను అప్పజెప్పాడు.
రాయబారి వచ్చివెళ్ళగానే ప్రతాపుడు వ్యూహం మార్చాడు. అనుచరులను సమావేశ పరచాడు.

"... రాబోయేది గడ్డుకాలం! ఈ సమరం ఎంతకాలం సాగుతుందో చెప్పలేం! మొఘలాయీలు మనపై దండయాత్రకు వచ్చినప్పుడు మన రాజ్యంలోని గ్రామాలను దోచుకుంటారు! వాళ్ళు మన రైతులు దాచుకున్న ధాన్యాన్ని తీసుకొని, తిని, మనపై యుద్ధంచేస్తారు. కాబట్టి శత్రువులకు ఆ అవకాశం లేకుండా చేయాలంటే మన ప్రజలు పల్లెలు వదలి మనవెంట కొండల్లోకి రావాలి! అక్బరైసైన్యం ఆహారానికి అలమటించి తిరిగిపోయేట్టు చెయ్యడానికి ఇదొక్కటే మార్గం"
సర్దారులందరూ రాణా చెప్పిన మార్గాన్ని ఆమోదించారు. వెంటనే మేవాడ ప్రాంత మంతటా చాటింపువేయబడింది. దీన్ని వ్యతిరేకించినవారు శిక్షింపబడతారు! ప్రజలంతా పిల్లాజెల్లలతో ప్రతాపుని వెంట కొండలదారి పట్టారు.

ఈ సంగతి తెలిసి గ్రామం విడిచిరాక, మేకలను పెంచుతున్న వ్యక్తిని శిక్షించి ప్రతాపుడు తన ఆజ్ఞను తు.చ. తప్పక అమలుపరిచాడు.

సస్యశ్యామలమైన మైదానాలు బీడువారిపోయాయి. బనాస్, బీరచ్ నదుల నడుమ ప్రాంతాల్లో జనసంచారమే లేదు! సూరత్ రేవు గుండా యూరప్కి సాగే మొఘలుల వ్యాపారం మూలబడింది. అక్బర్ చిత్తోడ్ను జయించీ, మేవాడలోని ఇరవైనాలుగు సర్కారులలో కనీసం కొలతల పని కూడా పూర్తిగావించలేకపోయాడు.

చిత్తోడ్ పరగణాను వశంచేసుకోవడమైతే పూర్తయింది గాని తద్వారా తాను సాధించ దలచుకున్నది మాత్రం సాధించలేక అక్బర్ అసంతృప్తిచెందాడు. చేతికందిన పండు నోటికి చేరలేదే అని కలతచెందాడు. భూములు కొలతలు వేయించి, శిస్తులు నిర్ణయించాడు. చిత్తోడ్ సర్కారులో 26 'మహలులున్నాయి. మొత్తం 1,679,802 బీగాల భూమి వున్నది. తనకు వశమైన ప్రాంతాన్ని జిల్లాలుగా విభజించాడు. ఆ ప్రక్కనే ఉన్న బదనూర్, షాహీపూర్, రాయిలా జిల్లాలతో మేవాడ్ ప్రాంతం నుండి తను వశంచేసుకున్న కొన్ని ప్రాంతాలను కలిపివేశాడు.

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్

తురుష్క అధికారులను నియమించి. ముస్లిం ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. ఈ జిల్లాలపై వచ్చే ఆదాయంతో కొంతభాగాన్ని అజ్మీర్లో వున్న దర్గాకు దానం ఇచ్చే ఏర్పాటు గావించాడు!

రాణాప్రతాప్ మేవాడ్ స్వాతంత్ర్య పరిరక్షణకోసం సకలచర్యలు తీసుకున్నాడు. ఇందులో ప్రధానమైనది బిల్లుల సహాయం స్వీకరించడం! పసితనం నుండి తమతో కలిసి మెలిసి వున్న తమ 'కీకా' అంటే భిల్లులకు ప్రాణం! దేశభక్తి లేని రసపుత్రరాజు కంటే, దేశభక్తి గల నిరుపేద బిల్లుడే ప్రతాపునకు ఇష్టం! రాజచిహ్నంలో ఏకలింగేశ్వరుడు, తాను, భిల్లుడు వుండే విధంగా చిత్రింపజేశాడు!. రాణాప్రతాప్ కుంభల్ గఢ్, గోగుండా ఖిల్లాలను తన ముఖ్యకేంద్రాలుగా ఎంచుకొని, అక్బర్ చక్రవర్తిని ఎదిరించి నిలిచాడు. ఆ సుదీర్ఘకాల యుద్ధంలో బనాస్, బీరచ్ నదీపరీవాహక ప్రాంతాల్లో ఎక్కడా దీపం పెట్టే దిక్కు కూడా లేకుండా పోయింది. అక్బర్ నిర్జనారణ్య ప్రాంతాలను వశంచేసుకొని తెల్లముఖంతో తిరిగిపోవలసివచ్చింది!

★★★

"ప్రభూ! అక్బరచక్రవర్తి సైన్యం లక్షల సంఖ్యలో ఉన్నట్లు వింటున్నాం! అదీగాక నేడు ప్రపంచంలో అందరికంటే ధనవంతుడు ఆ సార్వభౌముడే అని వినికిడి! నిర్ధనులూ, స్వల్పసంఖ్యాకులూ అయిన మన వీరులు ఢిల్లీ పాదుషాను ఎదిరించి నిలవగలరా?" రాణి పాటేశ్వరీదేవి ప్రతాపుని పాదములదగ్గర కూర్చుని ప్రశ్నించింది.
"రాణీ! దేశభక్తిముందు మరేదీ గొప్పది కాదు! చూడు! మన వీరుడు స్వాతంత్ర్య కాంక్షతో సమరం గావిస్తాడు! మరి పాదుషా సైనికుడు? డబ్బుకోసం యుద్ధం చేస్తాడు. మేవాడ వీరునికి ప్రాణభయంలేదు! రణరంగంలో మరణిస్తే వీరస్వర్గం వస్తుందని మన విశ్వాసం! వీరమాతలు మనవారిని దీవించి పంపుతారు. వీరపత్నులు తమ పతులకు వీరతిలకం దిద్ది యుద్ధభూమికి పొమ్మంటారు. ఆ అదృష్టం అక్బర్ అనుచరులకు లేదు గదా! ప్రాణభీతి వారిని నిత్యమూ వెన్నాడుతూ వుంటుంది! వారికి మానాభిమానాల కంటే ప్రాణాలే ముఖ్యం!"కుటీరం వెలుపల భటుడు గంట మ్రోగించాడు. "ఎవరక్కడ?" ప్రతాపుడు ప్రశ్నించగా ప్రతీహారి లోనికివచ్చి వంగి నమస్కరించి. "చిత్తం మహారాణా! మీ దర్శనంకోసం అక్బర్ చక్రవర్తి దూత రాజామాని సింగ్ వచ్చి వున్నాడు. ఏమి సెలవు ?" అన్నాడు.

"ప్రవేశపెట్టు!".

మహారాణి పాటేశ్వరీదేవి ఆ ప్రదేశం విడిచి వెడలిపోయింది. రాజామాన్సింగ్ అమితాశ్చర్యంతో ఆ కుటీరాన్ని చూస్తూ లోనికి ప్రవేశించాడు, మట్టితోకట్టిన చిన్నగోడలు! పైన ఆకులతో వేసిన కప్పు! నేలమీద మెత్తనిగడ్డి పరచివుంది. మహారాణా ప్రతాప్ మాన్సింగిని లోనికి ఆహ్వానించాడు. "విదేశీ ఆక్రమణదారుల దూతగా వచ్చిన రాజపుత్రులు రాజామాన్ సింగ్గ వారికి అభివాదము!" మాన్సింగ్ చురుక్కుమన్నది.

"మహారాణాప్రతాపుల వారికి షాహినావారి పక్షాన నమస్కారాలు! మీ క్షేమాన్ని ఆశించి మేము రాయబారానికి వచ్చాం!"'క్షేమం' అనే పదాన్ని నొక్కి పలుకుతూ అన్నాడు మాన్ సింగ్.

రాణాప్రతాప్"క్షేమాన్ని ఆశించి ఈ కుటీరానికి వచ్చినందుకు కృతజ్ఞతలు! ఇప్పుడు చెప్పండి! మమ్మల్ని ఏమిచేయమంటారు?" ప్రతాప్ నేలపై కూర్చుంటూ మాన్సింగ్ను కూడా సరసన కూర్చోమని ఆహ్వానించాడు. మా సింగ్ చుట్టూ పరిశీలించాడు. పేడతో అలికి, ముగ్గులు పెట్టిన గోడలు! వాటిపైన రాజపుత్ర వీరగాథలను తెలిపే జానపద శైలిలో వేసిన చిత్రపటాలు! పరిచారికలు రెండు మామిడిపండ్లు, మట్టిలోటాలతో నీరు తెచ్చి ముందు పెట్టారు. "ప్రతాపీ! ఏమిటి ఈ దారిద్ర్యం?"

"నా సోదర మేవాడ ప్రజలకు లేని భోగభాగ్యాలు నాకెందుకు? నేను మేడమాత సేవకుణ్ణిగాని, నా దేశప్రజల కష్టార్జితాన్ని భుజిస్తూ సుఖించే ప్రభువును కాను! తురుష్కుల బారినుండి నా ప్రజలను పూర్తిగా విముక్తులను గావించేదాకా నేను భవనాలలో వివసించను! సుఖాల ననుభవించను!".
"బాగున్నది! ఇన్ని త్యాగాలుచేసి మీరేం సాధించారు? అక్బర్ చక్రవర్తి నెదిరించి బ్రతికి బట్టగలవాడు ఈ భూమిమీద పుట్టలేదు! షాహినా ఆజ్ఞమేరకు దుంగర్పూర్, ఉదయపూర్లను స్వాధీనంచేసుకోవడానికి సైన్యంతో వచ్చాను! ఈ వార్త తెలిసిన మరు నిమిషంలోనే దుంగర్ పూర్ రాజు కోటవీడి పారిపోయాడు! ఇక ఉదయపూర్ మిగిలింది!".
"ఉదయపూర్ వీరులు గాజులు తొడుక్కొని కూర్చోలేదు!"
"నేనూ రాజపుత్రుణ్ణి...!"
"అందుకే ప్రాణాలతో ఇక్కడకు రాగలిగారు!".

... మీరూ రాజపుత్రులే! మనం బంధువులం! ఒక ప్రాంతానికి చెందిన వాళ్ళం!"

"అందుకే ఇంతసేపు మాట్లాడనిచ్చాం!".

"ఉదయపూర్ని వశపరచుకొమ్మని షాహినావారు గొప్ప సైన్యాన్ని మావెంట పంపారు"
"మరి సైన్యంలేకుండా ఒంటరిగా వచ్చారేం?"
(ఇంకా ఉంది )

వార్తల్లో వ్యక్తి

# జాన్ ఫోసే
## నోబెల్ బహుమతి గ్రహీత



సాహిత్యంలో ఈ సంవత్సరం నార్వేకు చెందిన రచయిత జాన్ ఫోసు.. ఈ ఏడాదికి గానూ ప్రఖ్యాతి గాంచిన నోబెల్ బహుమతి వరించింది. మానవుల స్థితిగతులను ఆధారంగా చేసుకుని తన కథనాలను రాసినందుకు గానూ జాన్ ఫోసేకు ఈ అవార్డు దక్కింది.

నార్వేలో పుట్టిన జాన్ ఫోసే తన కథనాలతో ఎంతో ప్రఖ్యాతి గాంచారు. మన చుట్టూ జరిగే సంఘటనలే ఆయన కథనాలకు ఆధారం చేసుకోవడమే జాన్ ఫోసే ప్రత్యేకత. నార్వే వెస్ట్ కోస్ట్ ప్రాంతంలో 1959లో జాన్ ఫోసే పుట్టారు. నార్వేయన్ నినార్క్ శైలిలో జాన్ ఫోసే రచనలు ఉంటాయి. ఆయన రచనల్లో కవిత్వాలు, నాటకాలు, వ్యాసాలు, నవలలు, పిల్లల పుస్తకాలు, వివిధ భాషల నుంచి తర్జుమాలు ఉంటాయి. జాన్ ఫోసే ఎంతో వినూత్నంగా నాటకాలు, పద్యాలను రాశారు. మాటల్లో వినిపించలేని ఎన్నో అంశాలకు ఆయన రాసిన కథనాలు, నాటకాలు, పద్యాలు గళంగా మారాయని ఈ అవార్డు ఎంపిక చేసిన సందర్భంగా నోబెల్ కమిటీ పేర్కొంది.

ఏడేళ్ల వయస్సు ఉన్నప్పుడు జోన్ ఫోస్సే ఓ ప్రమాదానికి గురయ్యారు. అందులో నుంచి కోలుకున్న తరువాత సాహిత్యం వైపు మొగ్గు చూపారు. ముఖ్యంగా తన రచనలతో ఆయన నోరు లేని వారి పక్షాన నిలిచి, వారికి ఒక గళంగా నిలిచారని తెలిపింది. కథలు, నాటకాలు, నవలలు, కవిత్వం, వ్యాస రచన, అనువాదాలు, చిన్నపిల్లల సాహిత్యం.. ఇలా దాదాపు అన్ని మార్గాల్లో ఆయన తన సాహిత్యాన్ని సృజించారని ప్రశంసించింది. ఆయన రాసిన నాటకాలు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషల్లోకి అనువదించబడ్డాయని, ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా ప్రదర్శించబడిన నాటకాలుగా ఆయన నాటకాలు చరిత్ర సృష్టించాయని వివరించింది. తన కథలు, నవలలు కూడా ప్రసిద్ధి గాంచాయని ఒక ప్రకటనలో వివరించింది. 1983 లో విప్లవాత్మక కథాాంశంతో ఆయన రాసిన తొలి నవల "రాట్, స్వార్ట్"తోనే ఆయన ఎంతో గుర్తింపు సంపాదించారని తెలిపింది.

జాన్ ఫాసీ వయస్సు ప్రస్తుతం 64 ఏళ్లు. ఇప్పటివరకు ఆయన 40 కి పైగా నాటకాలు రాశారు. పెద్ద ఎత్తున కథలు, నవలలు, కవిత్వం, వ్యాస రచన, అనువాద రచనలు చేశారు. నోబెల్ సాహిత్య కమిటీకి ఈ సంవత్సరం ఆండర్స్ ఓల్సన్ నేతృత్వం వహించారు. నార్వే చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను జాన్ ఫాసీ రచనలు ప్రతిబింబిస్తాయని ఆయన ప్రశంసించారు. నోబెల్ పురస్కారం ద్వారా 11 మిలియన్ల స్వీడిష్ క్రొనర్లు (దాదాపు 10 లక్షల డాలర్లు), మెడల్, ప్రశంసాపత్రం లభిస్తాయి. 2022 సంవత్సరానికి గానూ నోబెల్ సాహిత్య పురస్కారం అన్నీ ఎర్నాక్స్ కు లభించింది.

సాహిత్య బహుమతి విజేత జాన్ ఫోస్సే 'ఫోస్సే మినిమలిజం' అని పిలువబడే శైలిలో నవలలు రాశాడు. ఇది అతని రెండవ నవల 'స్టాంగ్ గిటార్' (1985) లో చాలా పేరుగాంచింది. 2022 సంవత్సరానికి గాను సాహిత్యంలో నోబెల్ బహుమతి ఫ్రెంచ్ రచయిత అన్నీ ఎర్నాక్స్‌కు లభించింది. అన్నీ 1 సెప్టెంబర్ 1940న జన్మించింది. ఆమె ఫ్రెంచ్ రచయిత, ఆమె సాహిత్యంలో ప్రొఫెసర్. ఆమె సాహిత్యం ఎక్కువగా ఆత్మకథ, సామాజిక శాస్త్రంపై ఆధారపడి ఉంటుంది.

★★★

**వార్తల్లో వ్యక్తి**

## దామోదర్ మౌజో



గోవా చిన్న కథా రచయిత, నవలా రచయిత, విమర్శకుడు మరియు కొంకణిలో స్క్రిప్ట్ రైటర్ అయిన దామోదర్ మౌజో , భారతదేశ అత్యున్నత సాహిత్య గౌరవమైన 57వ జ్ఞానపీఠ్ అవార్డును అందుకున్నారు . మౌజో 2008లో రవీంద్ర కేలేకర్ తర్వాత ఈ అవార్డును అందుకున్న రెండవ గోవా వ్యక్తి. మౌజో యొక్క 25 పుస్తకాలు కొంకణిలో మరియు ఒక ఆంగ్లంలో ప్రచురించబడ్డాయి. అతని అనేక పుస్తకాలు వివిధ భాషలలోకి కూడా అనువదించబడ్డాయి. మౌజో రాసిన ప్రసిద్ధ నవల 'కార్మెలిన్' 1983లో సాహిత్య అకాడమీ అవార్డును అందుకుంది. గోవా రాజధాని పనాజీ సమీపంలోని రాజ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ కవి గుల్జార్ పాల్గొన్నారు.

మౌజో 1944లో గోవాలోని అల్దోనా గ్రామంలో జన్మించారు. అతను 1960 ల ప్రారంభంలో చిన్న కథలు రాయడం ప్రారంభించాడు మరియు అతని రచనలు ఇంగ్లీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ మరియు ఇతర భాషలలోకి అనువదించబడ్డాయి.

మౌజో యొక్క పని తరచుగా గోవాలోని సాధారణ ప్రజల జీవితాలతో వ్యవహరిస్తుంది మరియు అతను సామాజిక మరియు ఆర్థిక సమస్యల యొక్క వాస్తవిక చిత్రణకు ప్రసిద్ధి చెందాడు. అతని కథలు వారి అంతర్దృష్టి మరియు కరుణ కోసం ప్రశంసించబడ్డాయి.

అతను బాంబే విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు, అక్కడ అతను ఆంగ్లంలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పొందాడు. గ్రాడ్యుయేషన్ తర్వాత, అతను పూర్తి సమయం రచయితగా మారడానికి ముందు కొన్ని సంవత్సరాలు జర్నలిస్టుగా పనిచేశాడు.

మౌజో యొక్క మొదటి చిన్న కథ, "ది ఎండ్ ఆఫ్ ది నైట్" 1965లో ప్రచురించబడింది. అప్పటి నుండి, అతను నవలలు, చిన్న కథా సంకలనాలు మరియు వ్యాసాలతో సహా 25 పుస్తకాలను ప్రచురించాడు. అతని రచనలు ఇంగ్లీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ మరియు ఇతర భాషలలోకి అనువదించబడ్డాయి.

మౌజో సాహిత్య అకాడమీ అవార్డు, పద్మశ్రీ మరియు పద్మ భూషణ్‌తో సహా అనేక అవార్డులను అందుకున్నారు . అతను సాహిత్య అకాడమీ మరియు గోవా కొంకణి అకాడమీ సభ్యుడు కూడా.

మౌజో యొక్క కృషి సాహిత్య ప్రపంచానికి విలువైన సహకారం. అతని కథలు తెలివైనవి, దయగలవి మరియు అందంగా వ్రాయబడ్డాయి. అతను చిన్న కథలో నిజమైన మాస్టర్, మరియు అతను జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత.

★★★+

క్రైం సీరియల్

# గర్భ శ్లోకం

--ఈదర శ్రీనివాస రెడ్డి

“అది నన్నే దగ్గరకు రానివ్వక పోతుంటే మధ్యలో మీ గొడవేమిటయ్యా” గ్లాసులో మందు పోసుకుంటూ గోణి గాడు ముసలి హీరో నవీన్

"ఏం,మందు ఎక్కువయ్యి మాట్లాడుతున్నావా ? మనం. చేసుకున్న ఒప్పందం అప్పుడే మరచిపోయావా? నాయాల ..' అంటూ ఘర్జించాడు అంబుంజం.

“అలా గడ్డి పెట్టండి, పెళ్ళయ్యి ఆర్నెల్లయ్యింది ఇంత వరకు శోభనం జరగ లేదని కథలు చెపుతున్నాడు. గురూ "అంబుజాన్ని రెచ్చగొట్టాడు అనిల్

'నేను నిజం చెప్పినా నమ్మరెంటి రా బాబు. అది పెళ్ళైన మొదటి రాత్రే నాకు వార్నింగ్ ఇచ్చింది, ముట్టుకుంటే మర్యాదగా వుండదని"

'మరి ఏం పీకుదామని దాన్ని పెళ్ళి చేసుకున్నావు". చిరాగ్గా అన్నాడు అంబుజం.

"దాన్ని అడ్డం పెట్టుకుని హీరోగా ఓ పది సినిమాలు చేద్దామనుకున్నాడు. నేను కూడా అది నమ్మాను , కాని వీడి మొఖం ఒక్కడు చూసినాళ్ళు లేరు. పైపెచ్చు సుస్మితకు వచ్చే అవకాశాలు కూడా వీడి వల్ల రాకుండా పోతున్నాయి “ జరుగుతున్నది చెప్పాడు.

" ఎందుకు రావట్లేదు, దానికి బాగానే ఆఫర్లు వస్తున్నాయి. ఈ మధ్య ఐటమ్ సాంగ్స్ కూడా ఒప్పుకుంటంది. షూటింగ్ పేరు చెప్పి నెలకు పది రోజులు బయటే గడిపాస్తోంది “ అనిల్ ఆరోపణల్లో నిజం లేదన్నట్టు చెప్పుకొచ్చాడు నవీన్



“అది నెలకు పదిరోజులు బయట తిరుగుతుంటే నువ్వు ఇంట్లో కూర్చుని గోళ్ళు గిల్లుకుంటున్నావా “ వెక్కిరించాడు అంబుజం

“నువ్వు కూడా వెళ్ళచ్చుగా, అందరూ నీకు పరిచయమేగా “” అనిల్ వంత పాడాడు.

“అది రానిస్తేగా, ఆ డ్రైవర్ గాడు ఒకడున్నాడుగా, ప్రతి దానికి వాడ్ని తోడు తీసుకెళుతుంది “ తనలో తనే గొణుక్కున్నాడు నవీన్

“అవును సార్, నేను గమనిస్తున్నా. సుస్మిత ఆ డ్రైవర్ తో ఎక్కువ చనువుగా వుంటోంది. అంతకు ముందు అతను మా దగర పని చేసినవాడే. అ చనువుతో కలివిడిగా వున్నాడనుకున్నా కాని ఈ మధ్య అతని వాలకం చూస్తుంటే, కొద్దిగా ఎక్కువ చేస్తున్న ట్టు వున్నాడు” చెప్పుకొచ్చాడు అనిల్

“అయితే వాడ్ని ఒక కంట కనిపెట్టి వుండండి. ఎదన్నా తేడావస్తే. ఏదోఒక కేసుపెట్టి లోపలేస్తే సరి “

★★★

“ఎదో మొదట్లో బాగానే వుందనిపించింది కాని, ఇలా ఎన్నాళ్ళని మనం ఈ దొంగ కాపురం చేస్తాం” కారులో నుంచి సామాను దింపుతూ అన్నాడు వేణు.

“అందుకనే, ముందే చెప్పాను ఇలా బతకటం చాలా కష్టమని, అయినా నువ్వు ఒప్పుకుంటేనేగా మనం పెళ్ళి చేసుకుంది “ కారు దిగుతూ అంది సుస్మిత

క్రైం సీరియల్

# గర్భ శ్లోకం

**జరిగిన కథ**

ఓ గుర్తు తెలియని మహిళ , పోలీసులు వెంబడిస్తుంటే తన బిడ్డతో సహా కృష్ణా నదిలోకి దూకుతుంది .ప్రముఖ హీరోయిన్ సుస్మిత హత్యకు గురవుతుంది .డి సి పి శ్రీనివాస రావు కేసు టేక్ అప్ చేస్తాడు .సుస్మితను పెళ్లి చేసుకోమని హీరో నవీన్ బ్లాక్మెయిల్ చేస్తుంటాడు .జూనియర్ ఆర్టిస్ట్ కాంతం తన కూతురు సుస్మితని ఇండస్ట్రిలోపెద్ద స్టార్ని చెయ్యాలని ప్రయత్నిస్తుంది.డి . సి పి మళ్ళి ఒకసారి హత్యా జరిగిన ఇంట్లో వాళ్ళఅందరిని ప్రశ్నిస్తాడు . ఊరి శివార్లలో ఎవరిదో శవం ఉన్నాడని తెలిసి అక్కడకు వెళతాడు డి .సి .పి.అక్కడ శవం పక్కన పోలీసులు పెట్టుకునే స్టార్ పడి ఉంటుంది. సుస్మితను పెళ్లి చేసుకోవటానికి నవీన్ ఇష్టపడకపోతే సి .ఐ. అంబుజం ఒప్పిస్తాడు. సి సి టి వి ఫుటేజిలు పరిశీలించిన డి . సి .పి ఎదో అర్ధమయిన వాడిలా తన బృందంతో ముందుకు కదులుతాడు. ఎంత ప్రయత్నించినా ఒక్క సాక్ష్యం కుడా సేకరించలేక పోవటంతో సుస్మిత నటించిన సినిమాల్లో పనిచేసిన వాళ్ళను ఇంటరాగేట్చెయ్యాలని నిర్ణయించుకుంటారు. తీర వాహిని స్టూడియో కి వివేక్ వెళ్లేసరికి డైరెక్టర్ అనిల్ కుమార్ తన కారవాన్ లో చచ్చిపడి ఉంటాడు . డి.సి.పి తన బృందం తో అక్కడి కెళ్ళి దర్యాప్తు చేస్తే అనిల్ ని చంపిందికుడా ఒక ఆడదే అని తెలుస్తుంది

**చదవండి**

"అదే నేను చేసిన తప్పు.." నిష్ఠురంగా అన్నాడు వేణు.

"అలా అయితే విడాకులిచ్చేయ్. ఏ ఇబ్బంది లేదు' వెనుక నుంచి దిగుతూ అంది ఉష

" ఉష నువ్వు నోర్ముయ్, తనేదే ఫ్రస్టేషన్లో అంటేనువ్వు కూడా...." ఉషను సముదాయించింది.

" మీరు ఉండండి మేడమ్, ఈ మగాళ్ళంతే ప్రతి దానికి మనల్ని బ్లాక్ మెయిల్ చేస్తారు"కోనసాగించింది..

"ఇందులో బ్లాక్ మెయిల్ ఏముంది. నాబాధ నేను చెప్పాను "ఉక్రోషంగా అన్నాడు వేణు.

"అంత కంటే ఎక్కువ బాధ మేడమ్ గారు పడుతున్నారు. నీకెప్పుడన్నా చెప్పారా? లేదు కదా?" ప్రశ్నించింది ఉష

" చెపితే కదా తెలిసేది "

" కట్టుకున్న వాడివి ఆ మాత్రం గ్రహించలేవా" ఈసారి కాస్త కోపంతో అంది సుస్మిత

సిగ్గుతో తలవంచుకున్నాడు వేణు

"ఓ పక్క ఆ గుంట నక్కలు ఎప్పుడు మేడం గారిని లొంగ దీసుకుందామా అని చూస్తున్నారు. మరో పక్క మీ ఇద్దరి విషయం ఇప్పటికే ఇండస్ట్రీలో చాలా మంది కథలు, కథలుగా చెప్పుకుంటున్నారు" తన అనుమానం బయటపెట్టింది ఉష

'ఎవడో ఏదో అనుకుంటే నా కేంటి ఇక గుంట నక్కలంటావా వాళ్ళ సంగతి నేను చూసుకుంటాను"ఆవేశంతో ఉగిపోయాడు వేణు.

" ఇద్దరూ కాసేపు నోరు మూస్తారా? ఇక్కడికెందుకు వచ్చామో ఆపని చూడండి ముందు "అంటూ హోటల్లోకి నడిచింది సుస్మిత

వాళ్ళిద్దరూ సుస్మితను అనుసరించారు మౌనంగా

కొత్త సినిమా షెడ్యూల్ కోసం సుస్మిత ఊటిలో పది రోజులు మకాం వేసింది. అమె తో పాటు వేణు, ఉష కూడా అక్కడే దిగారు.

ఇలా ప్రతి సారి నెలకో అవుట్ డోర్ షూటింగ్ పెట్టుకుని సుస్మిత్ వేణు కాపురం చేస్తున్నారు .

★★★

'ఆ సినిమా డైరెక్టర్ మర్డర్ కేసు ఎంత వరకు వచ్చింది " ఎదురుగా వున్న డి.సి.పి శ్రీనివాసరావు ని

క్రైం
సీరియల్

# గర్భ శ్లోకం

అడిగాడు ఐ.జి

'దర్యాప్తు చేస్తున్నాం సార్"

" ఏమి దర్యాప్తో ఏమిటో, రెండు నెలల్లో ఇది మూడో ముర్డర్ ఏ ఒక్కటి మీరు సాల్వ్ చేయలేక పోయారు. మీకు చేతకాక పోతే చెప్పండి, మిమ్మల్ని ఈ కేసుల నుండి తప్పించి వేరే వాళ్ళకు అప్పగిస్తాను" అసహనంతో అన్నాడు ఐ.జి

ఆ మాటలతో అవమానంగా ఫీలైన శ్రీనివాసరావు "ఇవన్నీ వేరు వేరు కేసులు కాళ్ళు.కావు సర్ , అన్నీ ఒక దానితో ఒకటి ముడిపడి వున్నాయి. పైపెచ్చు వీటిలో మనవాళ్ళు, కూడా ఇన్వాల్వ్అయ్యి ఉన్నారు ". బయటపెట్టాడు అసలు విషయం అందుకనే కాస్త ఆలస్యం అవుతోంది

" మన వాళ్ళు ఇన్వొల్వ అయ్యారా?" ఆశ్చర్య పోతు అడిగాడు ఐ.జి .

."ఎస్. సార్, ఈ హత్యలన్నిటికీ కారణం సి.ఇ. అంబుజమే అని మా అనుమానం " జవాబి చ్చాడు. శ్రీనివాసరావు

"సాక్షాలున్నాయా? " తన అనుమానం బయటపెట్టాడు ఐ.జి

" సాక్ష్యాలే వుంటే ఈ పాటకి అరెష్టు చేసే వాళ్ళం, అందుకనే అతనిమీద నిఘా పెట్టాం' తను చేసిన పని చెప్పుకొచ్చాడు.

"ఒకే, బట్ బే కేర్ఫుల్ ఈ విషయం. బయట కొస్తే , ఛానల్స వాళ్ళు మనల్ని ఏకేస్తారు'

"ఎస్.సారీ, ఐనో ఇట్, అందుకనే చాలా జాగ్రత్తగా హాండిల్ చేస్తున్నాము"

"ఒకే గుడ్ లక్.." అన్నాడు ఐ.జి

తను వచ్చిన పని అయిపోయినట్టు లేచి నిల్చుని సెల్యూట్ చేసి బయట పడ్డాడు శ్రీనివాసరావు.

బయట తనకోసమే వెయిట్ చేస్తున్న వివేక చూసి నవ్వాడు

" ఏం వివేక్, ఎమన్న విశేషాలున్నాయా?' పలకరింపుగా అన్నాడు.

"ఏమి లేవు సార్, ఏమంటున్నారు సార్. ఐ.జి గారు"

" ఏమంటారు, రోజూ వుండేదే, మనం అయన ఒక్కడికే జవాబు చెప్పాలి. ఆయన వందమందికి చెప్పాలి . ఆయన బాధ ఆయనది. అయినా.. ఇదంతా చెస్తోంది ఒక ఆడది అంటే నమ్మబుద్ధి కావట్లేదు .

ఎస్ సార్...

" మరి అలాంటప్పుడు మనమేమన్న తప్పుదారిలో ఆలోచిస్తున్నామా ?"

నో సర్ , ఫోరెన్సిక్ వాళ్ళు కుడా హత్యలు చేస్తోంది ఆడదే అని స్పష్టం చేసారు "

" మరి అలాంటప్పుడు ఒక ఆడదానికి మరొక అడదాన్ని చంపాల్సిన అవసరం ఏముంటుంది"

" అవును సర్ , ఎంతో తీవ్రమయిన అన్యం జరిగితే తప్ప అలా చేయ్యారు. ఎందుకంటే ఆడవాళ్ళకు కాస్త సహనం ఎక్కువ "

'యూ ఆర్ రైట్ అంటే సుస్మిత వల్ల ఎవరికో తీవ్రమయిన అన్యాయం జరిగిందన్న మాట. ఆ డైరక్షన్లో ఎందుకు దర్యాప్తు చెయ్యకూడదు"


'ఎస్ సర్ వి విల్ డు" అంటూ శ్రీనివాస రావు ని అనుసరించాడు వివేక్

(ఇంకా ఉంది )

# నాలుగో కోతి

# షోషల్ ఐసోలేషన్

**ఎపిసోడ్ -3**



రావుగారికి ఇద్దరే సంతానం : పెద్దమ్మయి పెళ్ళికి ఏదిగింది. రెండో సంతానం పదవ తరగతి చదువుతున్నాడు. రావుగారి దంపతులిద్దరూ డాక్టర్లు కావటంతో పిల్లలతో గడిపే సమయం చాలాతక్కువ. పెద్దమ్మాయికి, చిన్నవాడికి వయసులో తేదా వుండటంతో, ఎవరి దారి వాళ్లది .

పెద్దమ్మాయి నిశ్చితార్థం రోజున జరిగిన సంఘటను నాకింకా గుర్తుంది. నిశ్చితార్థం పనులతో అందరూ బిజీ బిజీగా తిరుగుతున్నారు. ఒక్క రావుగారి రెండే కొడుకు మాత్రం ఏ పని లేనట్టు, ఒంటరిగా తన గదిలో గేమ్సు ఆడుకుంటూ గడుపుతున్నాడు . బహుశా ఇది ఎవరూ గమనించలేదేమో, అదే వాళ్ళకు శాపం అయ్యింది.


తాంబూలాలు తీసుకునేటప్పుడు మాత్రం కిందకి కేక వేస్తే రావుగారు, మేడమీద నుండి కిందకి రమ్మని,వచ్చి ఓ అయిదు నిమిషాలు నిలబడి ఫోటోలకు ఫోజులిచ్చి వెళ్ళి పోయాడు. ఆతరువాత ఆర్నెల్లకి ఆ కుర్రాడు మేడ మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దీనికి కారణం ఎవ్వరు? డబ్బు సంపాదన లో పడి పిల్లలను పట్టించుకోని తల్లి దండ్రులదా ? పిల్లల స్థాయి తెలుసు కోకుండా వారి నెత్తిన అలవికాని చదువులు రుద్దు తున్న ఉపాధ్యాయులదా ? పబ్జి , బ్లువేల్ వంటి ఆటల్ని, పోర్న్ ఫిలిమ్స్, న్యూడు ఫిలిమ్స్ ను పెంచి పోషిస్తున్న సామాజిక మాధ్యమాలదా?

మన మూడు కోతులు ఉమ్మడి కుటుంబంలో నుండి రావటం వల్ల, వాటికి చెడు వినద్దు , చెడు కనవద్దు , చెడు అన వద్దు అని వాటి తాతయ్యలు, అమ్మమ్మలు, చెప్పడం వల్ల అవి బుద్దిగా అందరితో కలిసి మసులుకోవటం అలవాటు చేసుకున్నాయి కాని మన నాలుగో కోతి మాత్రం చిన్న కుటుం బం, ఇంకా చెప్పాలంటే సూక్ష్మం కుటుం బం (అంటే తల్లి తండ్రి పిల్లల వుంటారు) నుండి రావటం వల్ల, దానికి నలుగురితో కలసి మసులుకోవటం, సంతోషంగా గడపటం తెలియని విషయం. అందుకే అది ఎప్పుడూ ఒంటరిగా గిదిలో తలుపులేసుకుని సెల్ఫోనే లోకంగా గడిపేస్తూ వుంటుంది..

సామాన్యంగా మనుషులైనా లైనా, జంతువులైన సాముహ జీవులు . నలుగురు కలిసి సుఖ సంతోషాలు వుంచుకుంటు గడపుతూ వుంటారు. మనం ఎక్కడన్న తీర్థ యాత్రలకు వెళ్ళినప్పుడు అక్కడ కోతులు గుంపులు గుంపులుగా కనపడతాయి , కాని ఇందుకు విరుద్ధంగా కలిసి మెలిసిన సమాజంతో నడవటానికి ఇష్టపడక ఏకాంతంగా గడుపుతున్నాయి కొన్ని కోతులు, వాటి లోకం మొత్తం ఫేస్బుక్కు, వాట్సప్పు వంటి సామాజిక మాధ్యమాల్లోనే .

ఒక మనిషి సమాజానికి దూరంగా ఏకాంతంగా గడుపుతున్నాడంటే. అతనికి ఆరోగ్య సమస్యనా అయి వుండాలి లేదా మానసిక సమస్య అయినా అయివుండాలి. సామాన్యంగా వయసు మళ్లిన వారికి శరీరం ఉడికి, ఆరోగ్యం సహకరించక, కళ్ళు కనపడక, కాళ్ళు కదపలేక, ఒంటరిగా మిగిలిపోతారు. అదే విధంగాకోవిడ్ వల్ల ఏర్పడిన ప్రత్యేక పరిస్థితలలో కరోనా నుండి ప్రాణాలు కాపాడు కోవటానికి ఎవరికి వాళ్ళం సామాజిక దూరం పాటించి ఒంటరిగా మిగిలిపోయాము అందరం. ఒంటరి తనం ఎంత భయంకరమైన దో మనందరికీ కరోనా పరిచయం చేసిందని వేరే చెప్పనక్కరలేదు. కాని ఏ సమస్యలు లేని నేటి యువత తమకు తామే శిక్ష వేసుకుని ఒంటరిగా మిగిలిపోవటానికి ఇష్టపడుతున్నారంటే కారణాలు ఏమిటి ?అసలు ఈ ఒంటరితనాన్ని వాళ్ళు కోరుకుంటున్నారా లేక వాళ్ళు

# నాలుగో కోతి





బలవంతంగా ఏకాంతంలోకి నెట్టు బడుతున్నారా? ఏది ఏమైనా, ఒంటరి తనం వల్ల మానసికంగా వత్తిడికి లోనై ఆత్మహత్యలు కూడా చేసుకునే వాళ్ళు కోకొల్లలు .

నేటి అంతర్జాల యుగంలో భార్య భర్తలు ఇద్దరు ఉద్యోగాలు చేస్తేకాని ఇల్లు గడవని పరిస్థితి .ఇద్దరూ ఉద్యోగాలకు వెళితే పిల్లలను పలకరించే నాథుడు లేక సామజిక మాధ్యమాల్లోని అపరిచితులను ఆశ్రయిస్తూ తప్పదారిలో నడుస్తున్నారు. పిల్లలు మొదట సెల్ ఫోన్ పట్టుకున్నప్పుడు తల్లిదండ్రులు మురిసిపోతున్నారు కాని, వాళ్ళ పతనానికి అదే మొదటి మెట్టు అని తెలుసుకోలేక పోతున్నారు. తీరా వాళ్ళు పూర్తిగా వాటికి బానిసలైన తరువాత, వాటిని వాళ్లకు దూరం చెయ్యటం వల్ల ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు.

నలుగురిలో తిరిగినప్పుడు, సమస్యలను ఎదుర్కొన్ పుడు మానసిక ధైర్యం పెరుగుతుంది. కానీ రోజంతా ఒంటరిగా గడపటం వల్ల వాళ్ళల్లో భయం పెరుగుతుంది. కనీసం మార్కెట్టుకు వెళ్ళి కూరగాయలు కూడా తీసుకురావటం తెలియదు నేటి యువతకు, ఎక్కువ సేపు సామాజిక మాధ్యమాల్లో గడపటం వల్ల , వాటిలో ప్రదర్శించే అభూత కల్పనలే నిజం అని నమ్ముతున్నారు తప్ప వాస్తవం తెలుసుకోలేక పోతున్నారు. అసత్యాలు ఎప్పుడూ సంతోషం కలిగిస్తాయి, కాని నిజాలు కఠినంగా ఉంటాయి అరాయించుకోటానికి. ఒక తాగుబోతు ఎప్పుడూ మత్తులో ఉండటానికి ఇష్టపడతాడు. అ మత్తులో తనకు నచ్చిన ప్రపంచాన్ని సృష్టించుకుని అనందిస్తాడు తప్ప,అందులోనుంచి బయటపడి వాస్తవాన్ని ఎదుర్కొనే ధైర్యం చెయ్యడు. ప్రస్తుతం నేటి యువత పరిస్థితి కూడా ఇదే

కొంత మంది తమకు అందం లేదని, డబ్బు లేదని బాధ పడుతూ బయటకు రావటానికి కూడా ఇష్టపడక ,తమకు తామే సామాజిక ఒంటరి తనానికి దగ్గరౌతున్నారు. మరికొంత మంది వయసుకు మించిన కోరికలతో సతమతమౌతూ, వాటిని బయట తీర్చుకునే అవకాశం లేక సామాజిక మాధ్యమాల ద్వారా తృప్తి పొందుతూఒంటరిగా జీవితాన్ని గైపెస్తున్నారు .ఇంకొంత మంది చదువుల వల్ల ఏర్పడిన వత్తిడిని ఎవరికీ చెప్పుకోలేక ,చెప్పుకున్నా పరిష్కారం దొరకక ఒంటరితనాన్ని ఆశ్రయిస్తున్నారు.

తాము ఆశించింది, కోరుకున్నది దొరకనప్పుడు, తీవ్ర మనస్తాపానికి గురై ఒంటరిగా మిగిలిపోవటానికి ప్రయత్నిస్తాడు మానవుడు, కొన్ని కుటుంబాల్లో పిల్లల్ని స్నేహితులు లేకుండా పెంచుతా రు. పోనే తల్లి తండ్రులైనా వాళ్ళతో ఎక్కువ సమయం గడుపుతారా అంటే అది లేదు .కాని అటు వాళ్ళతో ఎక్కువ సమయం గడపక, స్నేహితులతో తిరగనివ్వక పోవటంతో వేరే దారి లేక వాళ్ళు సామాజిక మధ్యమాల్లోని అపరిచితులతో ఎక్కువ కాలం గడుపుతూ చెయ్యకూడని పనులు చేస్తున్నారు.

కొంతమంది యువత మదక ద్రవ్యాలకు అలవాటుపడి , సమాజానికి భయపడి ఒంటరిగా గడుపుతున్నారు . ఇంకొందరు పబ్జి బ్లూవెల్ వంటి ఆటలు ఆడుతూ, మానసికంగా వాటికి లొంగిపోయి చివరకు ప్రాణాలు తీసుకుంటున్నారు.

ఇంటికి దూరంగా వుండటం, చదువులు లేదా పని వత్తిడి భరించలేనంతగా వుండటం, వయసుకు మించిన కోరికలు వంటి వాటి వల్ల మానసిన వత్తిడి ఎక్కువగా వుంటుంది. ఇటువంటి పరిస్థితుల్లో వీరి ప్రవర్తనాలో తేడా వస్తుంది. ముభావంగా వుండటం, ఎక్కువసేపు ఫోన్లలో గడపటం, ఒంటరిగా తమ గది నుండి బయటకు రాకపోవటం వంటి లక్షణాలు గుర్తిస్తే వెంటనే తల్లితండ్రులు వారితో ఎక్కు సేపు గడపటం, విహారయాత్రలకు తీసుకెళ్ళటం వంటివి చేస్తే

# నాలుగో కోతి

కొంత  ఉపశమనం లభిస్తుంది. ఇటువంటి వారి పట్ల సున్నితంగా వ్యవహరించాలి తప్ప తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటే వాళ్ళు ప్రాణాలు తీసుకునే ప్రమాదం లేక పోలేదు. దీని ఉదాహరణే ఇటీవల ఒక పదవ తరగతి కుర్రాడు 35వ అంతస్థు నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు . ప్రతీరోజూ సగటున 36 మంది యువ త తమ ప్రాణాలు  పోగొట్టుకుంటున్నారు.

తల్లి తండ్రుల కోరికలు తీర్చలేక పోతున్నామని మానసిక వత్తికి వల్ల, ఇతరులతో పోల్చుకుని తాము అథమలమనే అపోహల వల్ల, ఒంటరిగా గడపటానికి ఇష్టపడుతున్నారు. ఇటువంటి వారిని జన జీవన స్రవంతి లోకి తీసుకు రావల్సిన బాధ్యః తల్లిదండ్రులదే  లేక పోతే నష్ట పోయేది వాళ్ళే .

★★

# నిను చూడగానే..!

వడ్డాది రవికాంత్ శర్మ

పంచదార   పాకపు   ప్రాయం ..

పెదవి చుట్టూ దాగిన ప్రణయం ..

కరుగుతున్న కొద్దీ కదలకుండా చేసి .

తీపితో  స్వాగతం పలికిన

ప్రియురాలి పండుగ పిలుపు ....

గతం చేసిన గాయాలకు ...

కంటి చూపుతోనే మందుపూసి ...

రహస్యాల కథల్ని కనుసైగతో విప్పి ..

నాట్యంలోని సారాన్ని కనుబొమ్మల
ఎగిరేతలో చూపిస్తూ

నను రమ్మని పిలిచిన ప్రాణసఖి
నయనాలలో

దసరా శోభ మరింత కొత్తగా
దర్శనమిచ్చింది

బిగి కౌగిట్లను దాచిపెట్టే

బంగారు వర్ణపు చీర

దాటిపోనివ్వదు నా ధ్యాసను
ఆమెనుండి ...

మెరుస్తున్న బుగ్గల కాంతులు

ఐశ్వర్య చిహ్నాలుగా
కట్టిపడేస్తున్నాయి నన్ను

నవరాత్రుల కోలాహలంలో...

నవయవ్వనపు నయప్రపంచంలో ..

చెవిరింగుల సవ్వడి ..

అటు ఇటు కదిలే నడుము చేసే

పసందైన నాట్యానికి  తాళం
వేసినట్టు

చెక్కెరకేళి ఫలాలు ...

మరచిపోలేని మిఠాయి వాసనలు ..

దేహంలో అన్నీ ప్రతిభింబిస్తూ...

నా దేవి నన్ను ఆకర్షిస్తుంది

ప్రతిరోజూ మరింత కొత్తగా

ప్రతీ నిమిషం మరింత కవ్వింతతో .

★★★.

.

సెటైర్

# నెట్టింటి రామాయణం

## గ్రేట్ఇండియన్ ఫెస్టివల్

-ఈ. సాయి అలేఖ్య

మా పక్కింటి మాధవరావుగారికి ఒక్కతే కూతురు . అందుకనే కూతురి పెళ్ళి ఎవ్వరూ చెయ్యనంత ఘనంగా చేశారు. పెట్టు పోతల్లో కుడా మాధవ రావు గారిది పెద్ద చెయ్యే. పెళ్ళయిన దగ్గర నుండి అల్లుడిని ప్రతి పండుగకి పిలిచి మర్యాదలేవీ తక్కువ కాకుండా చూసుకునేవాళ్ళు. ప్రతి పండక్కి ఏదోఒక కానుక కొనిచ్చే వాళ్లు .మొదట్లో కాస్త సిగ్గుపడ్డా, తర్వాత తర్వాత పిలవక పోయినా, పండగొస్తే చాలు మామ గారింట్లో వాలిపోయేవాడు. అల్లుడు.

సంక్రాంతి, దసరా, దీపావళి లాంటి పెద్ద పండగలకు తెలుగు కుటుంబాలలో మామగారు అల్లుళ్ళని ఇంటికి పిలిచి తగురీతిన సత్కరించటం ఆనవాయితీ. కాని, తినమరిగిన కోడి ఇల్లెక్కి కూసింది అన్నట్టు , మాధవరావు గారి అల్లుడు చిన్న చితక పండగలకి కుడా మామగారి ఇంట్లో వాలిపోయేవాడు. ఎప్పుడు




చూసినా మావగారి ఇంటి వరండా లోనే కనపడే వాడు, మరి ఉద్యోగానికి ఎప్పుడు వెళ్తున్నాడో అర్థమయ్యేది కాదు.

మొన్నీ మధ్య వినాయక చవితికి, కనపడి మావగారు బట్టలు పెట్టారని చూపించాడు. మళ్ళీ వారం తిరక్కుండా ప్రత్యక్ష మయ్యాడు. దసరా ఇంకా చాలా రోజులుంది కదా విషయమేమిటి అని అడిగితే దేశంలోనే అతి పెద్ద పండుగ జరుగుతోంది అందుకనే వచ్చానన్నాడు.

దేశంలోని అతి పెద్ద పండుగ ఏమిటబ్బా ? అని ఆలోచనలో పడ్డాను.

భారతీయులు ఎవరికైనా సంక్రాంతి ,దసరా , దీపావళి పండుగలే పెద్ద పండుగలు. శ్రీరామ నవమి, వినాయక చవితి. కృష్ణాష్టమి వంటి వాటిని కూడా పెద్ద పండగల కింద లెక్క వేసుకున్నా, అవేవి ఇప్పుడు కావు. ఇంకేం పెద్ద పండగ వుంది అని ఎంతగా బుర్ర చించుకున్నా అర్థం కాలేదు . ఇక లాభం లేదనుకుని తెలుగు కాలండర్లు,

సెటైర్

# నెట్టింటి రామాయణం

పంచాంగాలన్నీ తిప్పి చూసాను .ఎక్కడా, ఏరోజు పండగ అనే పదం నాకు తారస పడలేదు .

నా బాధ చూడలేక, ‘ మీకెందుకండీ ఈ బాధ ‘ఏ మాస శివరాత్రో , శని త్రయోదశో అయింటుంది. వాళ్ళ మావగారు వాళ్ళిష్టం . ఊరకే వుండక తెగ హైరానా పడుతున్నారు’ అంటూ చివాట్లు పెట్టింది శ్రీమతి

“మాసశివరాత్రి, శని త్రయోదశ “ అనుకుంటూ మళ్ళీ పంచాగం విప్పాను. అవేవి కనపడలేదు .

ఇదేదో ‘కౌన్ బనేగా కరోరపతి కోటి రూపాయల’ ప్రశ్న లాగా తయారయ్యింది నా పాలిట అనుకుంటు వుండగా , ఈ గోలంతా ఎందుకు వాళ్ళ మావగారినే అడిగితే సరిపోతుందిగా అంది మా ఆవిడ.

నిజమే కదా, లైఫ్ లైన్ లాంటి సలహా ఇచ్చింది శ్రీమతి అనుకుంటూ, ఓ రోజు మాధవరావుగారు వాకింగ్ కి వస్తే ఇదే విషయం కదిలించాను.

అల్లుడి పేరెత్తగానే మాధవ రావుగారి మొఖంలో రంగులు మారిపోయాయి..

“పండగా నా బొంధా ” ? అదేదో అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ అట అందుకని దిగబడ్డాడు “కాస్తంత ఆవేశంగా అన్నాడు.




అమాటలు వినగానే నోరు వెళ్ళ బెట్టటం నా వంతు అయ్యింది.

అసలు అతన్ని అనడం ఎందుకులే, తప్పంతా నాదే. ఏదో పాపం అల్లుడు కదా అని పండగలకి పబ్బాలకి పిలిచి మర్యాద చేస్తే, ఇప్పుడు నా నెత్తికే ఎక్కి కూర్చున్నాడు” అంటూ ఆయన కడుపు చించుకున్నాడు.

“ఎందుకుసార్ అంత బాధపడతారు, నెత్తిన ఎక్కిన వాడ్ని కిందకు దించేయండి “ అన్నాను ఆయన బాధ చూడ లేక

అది అయ్యింది, మొదట్లో అల్లుడు కదా అని నలుగు రాకల్ పిండి వంటలు చేసి పెట్టేది మా ఆవిడ .రాను రాను రెక్కలు ముక్కలు అవుతున్నాయి , నేను చెయ్యలేనని ముఖాన చెప్పేసింది”అంటూ ఆయాసం తీర్చుకోటానికి కాస్త ఆగాడు.

“మరింకే సిగ్గున్న వాడేవడయినా, పెట్టి బేడా సర్దుకు పోతాడు “ అన్నాను వుండ బట్ట లేక

‘అది సిగ్గు వున్న వాళ్ళు చేసేపని “అరిచినంత పని చేశారు మాధవరావుగారు.

“వెళ్ళలేదా అండి” అంటూ మెల్లిగా గొణిగాను,

‘ వాడెందుకు వెళతాడు”

‘మరి భోజనాలు గట్రా “.

‘ఏముంది అదేదో స్విగ్గీ నా గిగ్గినో వుంది కదా? “

‘జమాటా కూడా ఉందండి”

‘అ అదే, అక్కడి నుండి ఆర్డర్లు పెట్టి పిండి వంటలు తెప్పించి, బిల్లు మాత్రం నా చేతుల్లో పెడుతున్నాడు” అంటూ ఏడ్చినంత పని చేశారు మాధవరావుగారు.

అయినా ఈ రోజుల్లో పండగలకి పబ్బాలకు పిండి వంటలు వండటానికీ ఎవరికి ఓపికలున్నాయి. ఒకప్పుడంటే,

# సెటైర్

అరిశలు, బూరెలు, జంతికలు వంటి వాటిని పండగలకి పది రోజులు ముందే అందరూ కలసి వండే వాళ్ళు. అప్పట్లో ఉమ్మడి కుటుంబాలు వుండేవి కాబట్టి అటుతూ పాడుతూ తలా ఒక చెయ్యి వేసే వాళ్ళు ,పెద్ద కష్టం అనిపించేది కాదు.

రాను రాను ఉమ్మడి కుటుంబాలు మాయమై. న్యూ క్లియస్ ఫామిలీలు ఏర్పడటంతో, రోజు వారి వంట వండుకోవటమే కష్టంగా మారింది . భార్య భర్తలు ఇద్దరు ఉద్యోగాల కెళ్ళటంతో, రోజు వారి భోజనాలకు కూడా స్విగ్గీ, జమాటాల మీద ఆధార పడుతున్నారు. కొన్నాళ్ళక్రితం వరకు స్వగృహ ఫుడ్స్ , అతిథగృహ ఫుడ్స్ మీద పిండి వంటలకు ఆధారపడే వాళ్ళు, ఇప్పుడు అక్కడకు కూడా వెళ్ల లేక స్విగ్గీ, జమాటాల మీదా ఆధారపడుతున్నారు.

వింత ఏమిటంటే 'బిగ్ ఫెస్టివల్ ' అని ప్రచారం చేసే వాళ్ళ దగ్గరే ఫెస్టివల్ కి వన్నీ దొ ఎుకుథున్నాయి .ఆవుపిడకల దగ్గర నుండి ఎండు కొబ్బరి చిప్పల వరకు, ఆవకాయ దగ్గర నుండి అరిసలు ,బూరెలు, బొబ్బట్లు ఒకటేమిటి అన్నీ ఆన్లైన్ లో అమెజా న్లో దొరుకుతున్నాయి. కాకపోతే కాస్త ఖర్చు అంతే .చివరికి అట్ల తడికి కావలసిన అట్లు కూడా,అమెజాన్ లో దొరుకుతున్నాయి .




## సుమతి సాహితీ స్రవంతి

కవులకు ,సాహిత్య ప్రియులకు ఇక నెలల పండగే . ప్రతి నెల 2 వ, 4 వ ఆదివారం జూమ్ లో సాహిత్య గోష్టులు జరప తలపెట్టింది సుమతి. కవులు తమ కవితలను , కథలను , సాహితీ విమర్శలను , ఇతర సాహిత్య ప్రక్రియలను సుమతి సాహితీ స్రవంతిలో ఆన్లైన్ లో శ్రోతలకు వినిపించవచ్చు .ఒక రకంగా సుమతిరేడియో అన్నమాట .తదనంతరం . సాహితీ స్రవంతిని రికార్డు చేసి సమతి ఛానల్ లో(యు ట్యూబ్ ) ప్రసారం చెయ్యబడును .సుమతిచందా దారులకు ముందుగా అవకాశం ఇవ్వబడును .


ఒకప్పుడు పండగలకి కొత్త బట్టలు , కొత్త వస్తువులు కొనటం రివాజుగా వుండేది. ఇప్పుడు మాత్రం అసలు పండగలప్పుడు కొనడం మానేసి, కొనరు పండగలకు అదేనండి అమెజాన్, ఫ్లిప్ కార్ట్ బిగ్ ఫెస్టివల్ కి మాత్రం కొంటున్నారు. ఎందుకంటే అప్పుడు వాళ్ళు ప్రతి వస్తువు మీద డిస్కౌంట్లు ఇస్తారు కాబట్టి .ఈ మధ్య ఓ షాపు వాడు దసరా పండగకి బట్టలు కొనండి , దీపావళి బట్టలు ఉచితం అని బోర్డు పెట్టాడు" తెలివిగా .అంతే మన పిచ్చి జనాలు ఆ షాపు ముందుక్యూ కట్టారు . ఒకే రేటుకు రెండు వస్తువులు ఎందుకిస్తారు అని ఒక్క క్షణం ఎవ్వరూ ఎందుకు ఆలోచించరు. "డబ్బులు ఎవ్వరికి ఊరికిరావు కదా ?

ఇంక సెలవ్ ఇప్పటికే బోరు కొట్టించినట్లున్నా. పండగ పేరు చెప్పి...

★★★

కార్టూన్స్


# నవ్వండి ప్లీజ్ !



## నవ్వటం ఒక యోగం ,

నవ్వలేక పోవటం ఒక రోగం ,ఆ తరువాత మీ ఇష్టం





గోపాలకృష్ణ









# 'దీపావళి ' స్పెషల్ వంటకాలు

## రసమలై



కావలసిన పదార్థాలు:

పాలు – 1 ltr ,పంచదార – 2 cup ,చ్చికోవా – 50 grms

కుంకుమపువ్వు – చిటికెడు

1. ముందుగా పాలను బాగా కాచి.. అందులో రెండు నిమ్మ చుక్కల రసం పిండి పాలను విరగ్గొట్టాలి. 2. తరువాత ఒక సన్నటి క్లాత్‌లో పాల మిశ్రమాన్ని పోసి మూతి బిగగట్టి వేలాడ దీయాలి. నీళ్లన్నీ పోయి గట్టి ముద్ద మిగులుతుంది. దాంట్లో పచ్చికోవాను వేసి మెత్తగా కలిపి ఉండలుగా చేసి.. గారెల్లాగా వత్తుకోవాలి.3. ఈలోగా పంచదారను లేతపాకం పట్టి ఉంచాలి. ఉడుకుతున్న పాకంలో పైన తయారు చేసిన ఉండలను వేసి సన్నటి మంటమీద ఉడికించాలి. 4. ఇవి ఉడికేలోగానే వేరే గిన్నెలో పాలుపోసి దాంట్లో సగం కప్పు పంచదార, చిటికెడు కుంకుమపువ్వు, పచ్చికోవా వేసి చిక్కబడేంతదాకా మరిగించాలి. 5. ఆపై పాకంలో ఉడికించిన ఉండలను కోవా మిశ్రమంలో కలిపి చల్లారబెట్టి, ఫ్రిజ్‌లో ఉంచి.. చల్లబడిన తరువాత తీసి సర్వ్ చేయాలి. అంతే రుచికరమైన రసమలై రెడీ.

## మలై గులాబ్ జామూన్

కావల్సిన పదార్థాలు:



క్రీమ పౌడర్ మిల్క్: 1cup సూజి: 4tbsp మైదా: 4tbsp పాలు: 1cup(పిండి తయారుచేయడానికి) బేకింగ్ పౌడర్: ½tsp వేయించడానికి నెయ్యి ఫిల్లింగ్ (నింపడం) కోసం: క్రీమ్/మలై: 1cup కొబ్బరి తురుము : ½ పందార సిరప్ కోసం చక్కెర: 2 cups నీళ్ళు: 2 cups

తయారుచేయు విధానం: 1. ముందుగా మైదాపిండి, సూజి(రవ్వ), పాలపొడి, పాలు, బేకింగ్ పౌడర్ మరియు నెయ్యి అన్నింటిని ఒక బౌల్లోకి వేసి మెత్తగా, మ్రుదువుగా చపాతీ పిండిలా కలిపి 2నుండి 3గంటలపాటు పక్కన పెట్టుకోవాలి. 2. మూడు గంటల తర్వాత తిరిగి కొద్దిగా పాలు పోసి మళ్ళీ సాఫ్ట్ గా కలిపి పెట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల పిండి స్టిఫ్ గా తాయారవుతుంది. 3. ఇప్పుడు స్టౌ మీద ఫ్రైయింగ్ పాన్ పెట్టి అందులో నెయ్యి వేసి వేడి చేయాలి. మీడియం మంట పెట్టి నూనె కాగనివ్వాలి. 4. అంతలోపు ముందుగా కలిపి పెట్టుకొన్న పిండి నుండి కొద్ది కొద్దిగా తీసుకొని చిన్న చిన్న ఉండలుగా చుట్టుకొని ఒక ప్లేట్ లో పెట్టుకోవాలి. చిన్న ఉండలు చుట్టే ముందు, చేతికి నెయ్యి రాసుకోవడం వల్ల తేలికగా సాఫ్ట్ గా జామూన్ బాల్స్ తయారవుతాయి. 5. ఇప్పుడు గ్యాస్ మరో బర్నల్ మీద ఫ్రయింగ్ పాన్ పెట్టి, నెయ్యి వేసి, వేడయ్యాక అందులో జామూన్ బాల్స్ వేసి, బ్రౌన్ కలర్ వచ్చేవరకూ ఫ్రై చేసుకోవాలి. బ్రౌన్ కలర్ లోకి మారగానే వాటిని తీసి, షుగర్ సిరప్ లో వేసి, పదినిముషాలు నాననివ్వాలి. తర్వాత ఒక్కొ గులాబ్ జామ్ కి చిన్న గాటుటా పెట్టి లోపల మలైను నింపాలి, తర్వాతా గులాబ్ జామూన్ల మీద తాజా కొబ్బరి తురుమును చిలకరించి సర్వ్ చేయాలి.

చూడాల్సిన ప్రదేశం

# శ్రీ కూర్మం



శ్రీ కూర్మనాథస్వామి దేవస్థానం శ్రీకాకుళం నుండి 15 కి.మీ. దూరానగల శ్రీకూర్మం గ్రామంలో ఉంది. శ్రీమహావిష్ణువు కూర్మావతారం రూపంలో ఇక్కడ పూజింపబడుతాడు. భారతదేశంలో ఈ మాదిరిగా కల కూర్మావతారం మందిరం ఇదొక్కటే. ఈ మందిరం శిల్పకళాశైలి విశిష్టమైనది. చిత్రంగా ఇక్కడి స్వామి పడమటి ముఖముగా ఉంటారు. మరొక విశేషం ఈ ఆలయంలో రెండు ధ్వజ స్తంభాలు గలవు.

దక్షిణ సముద్ర తీరమున శ్వేతపురమనే పట్టణమును శ్వేతచక్రవర్తి పరిపాలించేవాడు. ఆయనకు విష్ణుప్రియ అనే భార్య ఉండేది. ఆమె మహా విష్ణు భక్తురాలు. ఆమె ఒకనాటి ఏకాదశి వ్రత దీక్షలో ఉండగా ఆమె భర్త అయిన శ్వేతమహారాజు కామమోహితుడై ఆమె వద్దకు వచ్చెను. అప్పుడు విష్ణుప్రియ భర్తను సాదరంగా ఆహ్వానించి, కూర్చుండబెట్టి, పూజా మందిరానికి పోయి విష్ణువును ధ్యానించి, స్వామీ! అటు నా భర్తను కాదనలేను, ఇటు నీ వ్రతమును భంగపడనివ్వలేను. నువ్వే నన్ను రక్షించమని పరిపరి విధముల వేడుకొంది. స్వామీ! కూర్మరూపమున భూమిని ధరించలేదా? అట్లే నన్ను ఆదుకోమని ప్రార్థించింది. శ్రీమన్నారాయణుడు దర్శనమిచ్చి, అక్కడనే గంగను ఉద్భవింపజేసెను. ఆ గంగ మహా ఉధృతంగా రాజు వేపు రాగా మహారాజు భయంతో పరుగిడి ఒక పర్వతము మీదకు చేరి తమ మంత్రిని విషయము అడుగగా, ఆతను రాజుకు విషయమంతా వివరించెను.

అప్పుడు రాజు పశ్చాతాపంతో మరణమే తన పాపమునకు ప్రాయశ్చిత్తమని తలచి, శ్రీమహా విష్ణువును ధ్యానించుచుండెను. అప్పుడు నారదుడు అటుగా వచ్చి, రాజును విషయమడుగగా, రాజు తన బాధను వివరించెను. అప్పుడు నారదుడు రాజుకు శ్రీకూర్మ మంత్రమును ఉపదేశించి దీక్షతో ధ్యానించమని చెప్పెను. ఈ గంగా ప్రవాహము వంశధార అను పేరుతో సాగరములో లీనమగునని, ఇది సాగరసంగమ ప్రదేశమని చెప్పెను. రాజు

చూడాల్సిన ప్రదేశం

# శ్రీ కూర్మం

వంశధారలో స్నానమాచరించి, అక్కడే వెలసి ఉన్న జ్ఞానేశ్వరుని, సోమేశ్వరుని పూజించి, ఘోర తపస్సు చేసినా, మహావిష్ణువు కరుణించలేదు. అప్పుడు నారదుడు కూడా స్వామిని ప్రార్థించి రాజుకు దర్శనమివ్వవలసిందిగా కోరగా శ్రీమహావిష్ణువు, కూర్మావతారంలో చక్రతీర్థగుండము నుండి వెలువడి, శ్వేతమహారాజుకు దర్శనమిచ్చెను. స్వామి నాలుగు చేతులతో, శంఖము, చక్రము, గద, పద్మములు ధరించి ఉన్నాడు. రాజు స్వామిని వేడి అక్కడ కొలువై ఉండుమని ప్రార్థింపగా శ్రీమహావిష్ణువు కొలువై ఉండేందుకు తనకు తగిన మంచి స్థానమునకై రాజు, నారదునితో కలిసి ఒక వటవృక్షము వద్దకు వచ్చి, ఆవృక్షముపై చక్ర ప్రయోగము చేసెను. అక్కడ క్షీర సమానమైన జలము ఉద్భవించెను. ఈ గుండమునే కూర్మగుండము లేక శ్వేత గుండము అంటారు. చక్రము వెళ్ళిన మార్గము నుండి శ్రీమహాలక్ష్మి ప్రత్యక్షమై, స్వామివారి వామభాగములో వసించెను. అంత శ్రీకూర్మనాధుడు లక్ష్మీ సమేతుడై అక్కడనే నిత్యనివాసమేర్పరుచుకొనెను.

ఒకనాడు అటుగా వచ్చిన ఒక కిరాత స్త్రీ కూర్మగుండములో దాహముతీర్చుకొని, శ్రీకూర్మనాథుని దర్శించుకొని, తన భర్త అయిన భిల్లురాజుకు ఈ విషయము తెలుపగా, ఆతను వచ్చి చూడగా ఆ గుండముపైన చక్రాకారములో తేజము కనుపించెను. ఆ వెలుగు క్రమముగా కూర్మనాథుని ఆకృతిని దాల్చెను. భిల్లురాజు ఆశ్చర్యముగా ఆ స్వామిని చూస్తూ, మహాపురుషుడా లేక ఏదైనా విచిత్ర జలచరమా అని ఆలోచిస్తుండగా, అక్కడకు వచ్చిన శ్వేతమహారాజు, నీ పూర్వపుణ్యమున శ్రీమన్నారాయణుడు, కూర్మరూపములో నీకు సులభముగానే దర్శనమిచ్చాడు అని చెప్పెను. అంత భిల్లురాజు సంతోషముతో స్వామిని పూజించెను. స్వామి సంతోషించి, భిల్లురాజును కూర్మగుండమునకు కట్టడము, సోపానములు కట్టించవలసిందిగానూ, శ్వేతమహారాజును దేవాలయ నిర్మాణము గావించవలసిందిగానూ ఆజ్ఞాపించెను. వారట్లే చేసిరి. భిల్లురాజును, స్వామి, పశ్చిమదిక్కుగా సదంగ మహాముని ఆశ్రమ సమీపములో నివాసమేర్పరుచుకోమని ఆజ్ఞాపించెను. అంతట భిల్లురాజు, తనవైపు ఎల్లప్పుడూ కరుణాదృష్టితో చూస్తూ ఉండమని స్వామిని వేడుకొనెను. శ్రీకూర్మనాథుడు అట్లే ఆభిల్లురాజుకు వరమిచ్చెను. అప్పటినుండి స్వామి పశ్చిమాభిముఖుడుగా తిరిగెను.

ఒకనాడు నారదుడు కూర్మనాథుని సేవించుటకు రాగా, శ్వేతమహారాజు, స్వామిని అర్చారూపమున ఆరధించుటకు ఏ మంత్రముతో ప్రతిష్ఠించవలెనని అడిగెను. అంతట నారదుడు, బ్రహ్మదేవుని కోరగా బ్రహ్మదేవుడే శ్రీకూర్మనాథుని, సుదర్శన మంత్రముతో ప్రతిష్ఠించెను. అప్పుడు స్వామి అగ్నిజ్వాలలచే భయంకరముగా ప్రకాశిస్తున్న శ్రీకూర్మనాథుని చూసి దేవతలందరూ భయకంపితులైరి. అప్పుడు శ్వేతమహారాజు, స్వామిని, గోపాలమంత్రంతో ప్రతిష్ఠించవలసిందిగా బ్రహ్మను కోరగా, బ్రహ్మదేవుడు అట్లే శ్రీకూర్మనాథుని గోపాలమంత్రంతో పునహ ప్రతిష్ఠచేసెను. అప్పుడు స్వామి శాంతరూపములో దర్శనమిచ్చి, తనకు నారాయణ మంత్రముతో అభిషేకము, సంకర్షణ మంత్రముతో వస్త్ర సమర్పణ, వాసుదేవ మంత్రముతో ఏక హారతి, అనంత మంత్రముతో ధూపము, పద్మనాభ మంత్రముతో పంచహారతి సమర్పించవలెనని బ్రహ్మకు చెప్పగా, బ్రహ్మ స్వామిని అట్లే ఆరాధించెను. శ్రీకూర్మనాథుడే ప్రాకారాది దేవతా స్థాపనకు ఆజ్ఞనిస్తూ, తూర్పున పార్వతీ సమేతంగా శివుని, ఆగ్నేయమున నరశింహుని, దక్షణమున గోపాలమూర్తిని, నైరుతి దిక్కున వైకుంఠనాథుని, వాయవ్యమున వైష్ణవీ దుర్గను, ఆమెకు ముందు భాగమున విశ్వక్షేనులను, తరువాత అనంతుని స్థాపించమనగా, బ్రహ్మ అట్లే చేసెను.

తిలోత్తమ స్వర్గము నుండి శ్రీకూర్మనాథుని

చూడాల్సిన ప్రదేశం

# శ్రీ కూర్మం

పూజించుటకు వచ్చి అక్కడనే ఉండిపోయింది. బ్రహ్మ, స్వామికి నివేదించిన ప్రసాదము ఆమెకు లభించకపోవుటచే దుఖితురాలై, వక్రాంగ మహామునిని ఆశ్రయించగా, ఆయన, తిలోత్తమకు నారశింహమంత్రమును ఉపదేశించెను. ఆమె ఆమంత్రముతో తపమాచరించగా, ఆమె కాలిబొటనవ్రేలు దగ్గర ఒక గుండమేర్పడింది. అందుండి, శ్రీకూర్మనాథుడు, నరశింహరూపమున ఉద్భవించి, ఆమెకు దర్శనమిచ్చెను. తిలోత్తమ ఆనందంతో స్వామిని అక్కడ అట్లే వెలయవలసిందిగా కోరగా స్వామి అక్కడ అలాగే వెలసెను. ఆకుండము, నరసింహతీర్థమని, అక్కడ వెలసిన స్వామి, పాతాళ నరసింహుడని అందురని స్వామి చెప్పెను. అంత తిలోత్తమ తనకు ప్రసాదము లభించలేదని వివరించగా స్వామి ఆమె భక్తికు మెచ్చి, తన ప్రసాదముపై శాశ్వత ఆధిపత్యమును ఆమెకు ప్రసాదించెను. అప్పటినుండి స్వామివారి ప్రసాదమును తిలోత్తమే అందరికీ పంచేదట.

ఈ ఆలయం యొక్క పెద్ద ప్రాకారా నికి వెలుపల 'శ్వేత పుష్కరిణి' ఉంది. క్రీస్తు శకం నాలుగో శతాబ్ది నాటికే ఈ ఆలయం ఇక్కడ ఉందని చారిత్రిక ఆధారాలు స్పష్టం చేస్తు న్నాయి. ఈ ఆలయంలోని ప్రతీ శిల్పం ఒక అపూరూప కళాఖండంగా చెప్పవచ్చు. ఎంతో మంది రాజులు వేసిన శిలాశాసనాలు శిథిలమై పోకుండా ఇప్పటికీ లభిస్తాయి. ఇవి కళింగాంధ్ర చరిత్రకు అమూల్యా ధారాలుగా నిలుస్తాయి. అత్యద్భుతమైన వాస్తు కళతో ఆలయం అలరా రుతూ ఉంటుంది. ఈ ఆలయ మండపంలోని 108 రాతి స్తంభాలు అన్నీ ఏకశిలతో రూపు దిద్దుకున్నవే. ఒకదానికి ఒకటి పోలిక లేకుండా విభిన్నంగా వీటిని శిల్పులు అత్యంత రమ ణీయంగా మలిచారు.

ప్రతీ ఆలయంలోనూ గర్భగుడిలో ఎదురుగా మూలవిరాట్ ఉంటే ఈ ఆలయంలో మాత్రం గర్భ గుడిలో ఎడమవైపు గోడ మూలగా శ్రీకూర్మనాధుని అవతారంలో శ్రీమహావిష్ణువు భక్తులకు సాక్షాత్కరి స్తారు. భక్తులు నేరుగా గర్భగుడిలోకి వెళ్తే అడుగు ఎత్తు, ఐదడు గుల పొడవు, నాలుగడుగులు వెడల్పు కొలతలు గల రాతిపీఠం పై కూర్మనాథస్వామి దర్శనమిస్తారు. రెండున్నర అడుగుల పొడవు, అడుగు ఎత్తులో మొదట తల మధ్యలో శరీరం చివరిగా పశ్చిమా భిముఖంగా తోకతో మూడు భాగాలుగా శ్రీకూర్మం కన్పిస్తుంది. మధ్య తక్కు వ ఎత్తులో శిరస్సుకలిపి ఒకటిగా కన్పిస్తా యి. చివర తాటిపండు పరిమాణంలో తోక వేరే శిలగా ఉంటుంది. విగ్రహమంతా దట్టంగా గంధపు పూతను పూసి అలంకరి స్తారు. గర్భగుడిలోకి భక్తులు నేరుగా వెళ్లడం వైష్ణవ సంప్రదాయానికి భిన్నమైనా ఇక్కడ మాత్రం నేరుగా గర్భగుడిలోనే స్వామిని దర్శించుకోవచ్చు



ఫేక్ న్యూస్







## మూడు నెలల పాటు ఫ్రీ రిచార్జి .. కొత్త పథకం

దేశంలో ఎన్నికల శంఖారావం మోగుతోంది. ప్రస్తుతం 5 రాష్ట్రాల ఎన్నికలు జరుగుతుండగా.. వచ్చే ఏడాది మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీలతోపాటు లోక్‌సభకు కూడా ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త కొత్త పథకాలు, హామీలు అన్ని పార్టీలు గుప్పిస్తున్నాయి. ఇందులో భాగంగానే కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. దేశ ప్రజలకు ఉచితంగా రీఛార్జ్ చేయనుందనే వార్త ప్రస్తుతం తెగ సంచలనంగా మారింది.భారత దేశ ప్రజలందరికీ 3 నెలల పాటు ఉచిత రీఛార్జ్ చేయనున్నారని అందులో ఉంది. ఇక ఈ ఉచిత రీఛార్జ్ పథకం ద్వారా 2024 ఎన్నికల్లో మరింత మంది ఓటర్లు బీజేపీకి ఓటు వేస్తారని.. తద్వారా బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారాన్ని చేపడుతుందని పేర్కొంది. కింద ఉన్న లింక్‌ను క్లిక్ చేస్తే 3 నెలల ఫ్రీ రీఛార్జ్‌ను పొందవచ్చని ఒక ఫేక్ లింక్‌తో కూడిన ఓ వాట్సాప్ మెసేజ్ తెగ సర్క్యులేట్ అవుతోంది. దీనికి అక్టోబర్ 31 వ తేదీ చివరి తేదీ అని కూడా అందులో ఉండటం గమనార్హం.సార్వత్రిక ఎన్నికలకు ముందు 3 నెలల పాటు ఈ రీఛార్జ్ చేయనున్నారని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. బీజేపీ ప్రభుత్వం 2024 ఎన్నికలకు ముందు ఫ్రీ రీఛార్జ్ యోజన అనే కొత్త పథకాన్ని ప్రారంభించబోతోందని వస్తున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అంతా అసత్య ప్రచారమేనని కొట్టి పారేశాయి.

బహుమతి పొందిన కథ

# ద్రోహా?

కథ



భాగవతుల భారతి

పల్లెటూరు కావటంవల్లనేమో! నిముషాల్లో వార్త దావానలంలా వ్యాపించింది.

ఊరంతా అట్టుడకటమే కాదు భయంతో బిగుసుకుపోయింది....

ఆడామగా పనులు మానేసి, ఇదేచర్చ.

"నిన్నామొన్నటిదాకా బానేఉన్నారుగా! ఇంతలోనే అంతద్రోహం ఎలా చేయగలిగారు? "

"ఎవర్నీ నమ్మేటట్టు లేదు. స్నేహంలోనూ అంతద్రోహమా? "

"ప్చ్...ఇంతలో ఎంత ద్రోహం చేసారూ?"

చర్చలు వేడివేడిగా ఉండగానే,"అదిగో!

శవం వచ్చేసిందట!పంచాయితీ ఆఫీసుదగ్గర

రచ్చబండ దగ్గర పడేసారుట" అరుచుకుంటూ పోయారెవరో!

ఊరుఊరంతా పరుగుపరుగున జేరిపోయారు.

ఎవరికీ అక్కడ శవం కనబడలా! పెద్ద కవర్లో చుట్టిన మూటలాంటిదే కనబడింది.

ఆ మూటే ఈశ్వర్ అంటే నమ్మబుద్ది కాలేదెవరికీ! వాసన రాకుండా,ఏదో స్ప్రే చేస్తున్నారు.బ్లీచింగ్ వాసన కూడా గుప్పుమంటున్నా, అన్ని వాసనలనూ డామినేట్ చేస్తోంది అందరిమానసికస్థితి.

భయంకరమైన భయం మనసుల్లో గుబులు రేపుతోంది.

నిన్నటివరకూ మనమధ్యలోనే మసలిన ఈశ్వర్ గుడ్డల మూటలో?!....

అసలేంజరిగింది?

స్నేహితుల కథనం ప్రకారం....

ఈశ్వర్ మొన్నరాత్రి సూర్యాపేటనుండి వస్తుండగా, లోక్యాతండా దగరకు వచ్చేసరికి, స్నేహితుడు ప్రణీత్, రోడ్డుమీద నిలబడిఉన్నాడు.

"ఇక్కడ నిలబడ్డావ్ ఏడకిరా? "అడిగాట్ట ఈశ్వర్.

"రామచంద్రాపురం పోవాలి" అన్నాట్ట.

"నేను వెళ్ళేదారేగా! మధ్యలో నిన్ను దింపేసి పోతాపద! " అని బండి ఎక్కించుకున్నాడు.

"ఇద్దరూ బయలుదేరారు. కొంతదూరం వెళ్ళేసరికి.... ఇంకో ఇద్దరు దోస్తులు...దారిలో రెండు టూ వీలర్స్ మీద కలిసారు.

అందరూ మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ, జోక్ లేసుకుంటూ వెడుతున్నారు.

మధ్యలో కసిరాజు మామిడితోట కనిపించింది.

"రేయ్! కాసేపు ఆగి దమ్ముకొట్టి బయలుదేరదాం ఆగండిరా! " ప్రణీత్

మామిడితోటలోకి దారితీసాడు.

**బహుమతి పొందిన కథ**



పొలోమని అందరూ తోటలోకి దారితీసారు.కాసేపు ఆ ఊరిముచ్చట్లు ఈ ఊరిముచ్చట్లు చెప్పుకుంటూ సిగరెట్లు కాల్చారు.ఓ దోస్తు బీర్ బాటిల్స్ తీసాడు.

"ఏరా!చెప్పనే లేదూ!"అనుకుంటూ అందరూ తాటికల్లు తాగీతాగీ నోరు సవిసచ్చిందిరా! లాగించండిరా " తాగేసారు.

కాసేపు ఏదేదో వాగారు.

ప్రణీత్ " సరేరా! లేటవుతోంది. చీకటిపడకముందే ఇల్లుచేరదాం "

అందరూ బళ్ళుఎక్కారు.

ప్రణీత్ ను రామచంద్రాపురం లో దింపి,ఈశ్వర్ ఇల్లుచేరాడు. ఇల్లుచేరుతూనే ఈశ్వర్ వాంతి భళ్ళున చేసుకున్నాడు .

పెళ్ళాం లచ్చుమాంబ కంగారుపడి..."ఏటయినాది!" అంది.

"తలతిప్పుగా ఉంది "అనిపడుకున్నాడు ఈశ్వర్.

" దారిలో నాటుసారా తాగావా కంపుకొడతా ఉంది. సెబితే వినవుగా! నీ అసుమంటోళ్ళకి పెళ్ళాలెందుకు? " సణుగుతూనే ఉంది .

గంట ఆగాక లచ్చుమాంబ లేపితే,

ఈశ్వర్ లో చలనం లేదు.

కంగారుపడి నలుగురినీ పోగుచేసింది.

అందరూ కలిసి పట్నం హాస్పటల్ కి తీసుకుపోయారు ....కానీ అప్పటికే ప్రాణం పోయింది అని చెప్పారు డాక్టర్.

ఈశ్వర్ తల్లీదండ్రీ కన్నీరుమున్నీరుగా ఏడుస్తున్నారు. లచ్చుమాంబ గుండెలుబాదుకుని, విలపిస్తోంది.

"స్నేహితులు వచ్చి, నిన్న మామిడితోపులో అందరం కలిసేఉన్నాం. కలిసే తాగాం.

మేం బాగానే ఉన్నాం. ఈశ్వర్ ఇలా అయ్యాడేం? " ఏడుస్తున్నారు వాళ్ళూనూ.

"దొంగసచ్చినోళ్ళల్లారా! మీరంతా దోస్తులేగా? అంతద్రోహం చేస్తారా? "

ఊరుఊరంతా దుమ్మెత్తి పోస్తోంది.

పోలీసులు కష్టడీలోకి తీసుకున్నారు వాళ్ళని.శవాన్ని పోస్ట్ మార్టానికి

బహుమతి పొందిన కథ

# ద్రోహి?

పంపారు.

ఇవాళ శవాన్ని ఇచ్చేసారు. లచ్చుమాంబ ఏడ్చీ, ఏడ్చీ సొమ్మసిల్లిపోయింది. ఉపచారాలు చేసిలేపి కూర్చోబెట్టారు.

ఒక్కక్షణమైనా భర్తశవం మూటలోంచి తీసి చూపించమని ప్రాధేయపడింది.

చూస్తే తట్టుకోలేవని ఎంతచెప్పినా వినకుండా, పట్టుబట్టింది.మూట క్షణంపాటు ఊడదీసి మూసేసారు.

నల్లకప్పేసిన భల్లూకంలాంటి భయంకరమైన ఆకారాన్ని, చూసి కెవ్వుమని అరిచారంతా. భయంకరమైన దుర్వాసన. ముక్కుమూసుకున్నా తెములుచ్చుకుని వస్తున్న భళ్ళున వాంతులు.

మళ్ళీ మూటకట్టేసారు. ఈశ్వర్ శవం ఊరు దాటింది.

పోలీసులు ఇన్వెస్టిగేషన్ మొదలెట్టారు.ఇనస్పెక్టర్ మంగేష్ రంగంలోకి దిగాడు.

ఇటువంటి కేసుల్లో క్లూస్ రాబట్టటానికి అతణ్ణే నియమిస్తుంది డిపార్టుమెంటు. అతడు ఊరంతా ఓరౌండ్ తిరిగివచ్చాడు.

ఈశ్వర్ తల్లిదండ్రీని స్టేషన్ కి పిలిచి విచారణ చేసాడు.ఈశ్వర్ తండ్రి ఓ వ్యవసాయదారుడు. ఈశ్వర్ తో కలిపి నలుగురు సంతానం.వాళ్ళతో మన:స్పర్థలు ఏంలేవు. ఈశ్వర్ ఓ రైస్ మిల్లులో పనిచేస్తున్నాడు.

రైస్ మిల్లు యజమానిని పిలిచి, విచారించాడు. ఈశ్వర్, మంచివాడనే చెప్పాడు. ఎవరితోనూ గొడవలు లేవు.

భార్య లచ్చుమాంబ వెక్కిళ్ళమధ్యనేఅనేకప్రశ్నలకు సమాధానాలు చెప్పింది.

మామిడితోపుకు వెళ్ళి, అణువణువూ గాలిస్తూ, ఓ ఆకులగుంపుమీద కాలువేసి, గలగలల మధ్య ఏదో కాలికి తగిలితే తీసి చూసి, ఆవస్తువులను అనుమానంగా చూసి, కర్చీఫ్ లో చుట్టి, జేబులో పెట్టుకుని, మళ్ళీ ఓ రౌండ్ తిరిగి, స్టేషన్ కి వచ్చి, ఫోరెన్సిక్ నిపుణుడిని పిలిచి, ఏదో చెప్పాడు.

మర్నాడు రామచంద్రాపురం లోకి వచ్చి,యూ ఆర్ అండర్ అరెస్ట్ అని ....

ప్రణీత్ ను అరెస్ట్ చేసి, సుకుపోయిఇంటరాగేషన్ చేసి.... నిజం రాబట్టారు.

ప్రణీత్ కు 302 ప్రకారం యావజ్జీవ కారాగార శిక్ష పడింది.

కేసును ఛేదించినందుకు మంగేష్ ను అభినందించింది కోర్ట్.

అసలేం జరిగింది?

ఈశ్వర్ భార్య లచ్చుమాంబ చక్కనిచుక్క.లచ్చుమాంబ పెళ్ళి కాకముందు ఏదో పనిమీద ఆ ఊరు వెళ్ళి, ఆమె అందానికి, ముగ్ధుడై మనసుపారేసుకుని, ఆమెనే పెళ్ళిచేసుకోవాలని,ఎంక్వైరీచేస్తే,

ఆమెకు పెళ్ళిసంబంధం కుదిరిందని చెప్పారు. ఆ పెళ్ళికొడుకు ఎవరో తెలుసుకుని, ఈ పెళ్ళి చెడగొడదామని వెళ్ళాడు. కానీ తన ప్రాణస్నేహితుడు ఈశ్వరే ఆమెను పెళ్ళాడుతున్నాడని తెలిసి, రెండు అక్షింతలువేసాడు.

కానీ లచ్చుమాంబ మీద మోజుమాత్రం తగ్గించుకోలేకపోయాడు. అడపాదడపా ఆఊరువచ్చి, ఈశ్వర్ ను లచ్చుమాంబనూ చూసిపోతూనే ఉన్నాడు .

ఆమధ్యకాలంలో ఈశ్వర్, ప్రణీత్,కలిసి వ్యాపారం పెడదామనుకున్నారు. మూడోవాటాగా రైస్ మిల్లు యజమానినీ కలుపుకున్నారు.

తన రైస్ మిల్లు వ్యాపారం ఎక్కడ దెబ్బతింటుందోనని అతను భయపడుతూనే,వీళ్ళతో కలిసి వ్యాపారానికి ఒప్పుకున్నాడు. ఊళ్ళోని, రైతుల నుండి

బహుమతి పొందిన కథ

# ద్రోహి?

మెరపకాయలు,మొక్కజొన్న సేకరించి, పట్నంలో అమ్మకు రావటం...

దీనిలో వెహికల్ పెట్రోల్ ఖర్చు,మిల్లుఓనర్ ది. మిగిలిన కాయకష్టం అంతా ఈశ్వర్, ప్రణీత్ లదీనూ.... వ్యాపారం బాగానే సాగుతుండేది.

కానీ రెండేళ్ళక్రితం అకస్మాత్తుగా ఈశ్వర్ ఆరోగ్యం పాడయింది. ఊపిరితిత్తులు పాడయి... శ్వాస తీసుకోటానికి కూడా ఇబ్బంది పడుతున్న ఈశ్వర్ ను సిటీలో హాస్పటల్ లో ట్రీట్మెంట్ చేయించారు.

చేతిలోని డబ్బంతా, మంచినీళ్ళలా ఖర్చుయిపోయింది. ఈశ్వర్ తల్లీదండ్రీకూడా,డబ్బులులేక, కొడుకుకువైద్యం చేయించలేక, బాధపడుతూ, కోడలిని రైస్ మిల్లులో కూలికి పంపటానికి సిద్దపడ్డారు.

లచ్చుమాంబ, భర్త వైద్యం గురించి బాగా మథనపడుతూ, భర్త స్నేహితుడైన ప్రణీత్ ను, "అప్పు ఇస్తే నేను పాచిపని చేసైనా నీ బాకీ తీరుస్తాను " అని అడిగింది.

కానీ ప్రణీత్ తన అసలు రంగును బయటికి తీసి, "మొదటిసారిగా నిన్ను చూసినప్పుడే ఇష్టపడ్డాను. నువ్వు ఈశ్వర్ సొంతమైనా, నీమీద కోరికచంపుకోలేకపోయాను. ఒక్కరోజు నాతో గడిపితే, నీ భర్తను బతికించుకోటానికి డబ్బులిస్తా"నన్నాడు.

లచ్చుమాంబ "ముందుగా డబ్బులివ్వు. తను బాగుపడినవెంటనే, నీకాడికి వచ్చి, నీకోరిక తీరుత్తా... నేను మాటతప్పను "

అని డబ్బుపట్టుకుపోయింది. భర్తకు ఆపరేషన్ చేయించింది. ఈశ్వర్ మునుపటి లాగానే తిరుగగలుగుతున్నాడు.

కానీ లచ్చుమాంబ మాత్రం ప్రణీత్ ను కలవలేదు. తన భర్తతోనే కష్టసుఖాలు గానీ, పరాయిమగాడు తనకువద్దనుకుంది.

కానీ ప్రణీత్ మాత్రం వదల్లేదు. లచ్చుమాంబ ను వేధిస్తూనే ఉన్నాడు.

ఇదేమీతెలీని ఈశ్వర్ మాత్రం ప్రణీత్ తో స్నేహంగానే ఉంటున్నాడు.

టైంప్రకారం మందులు వాడుకుంటూనే, వ్యాపార భాగస్వామ్యంలో ఉంటూ ఉన్నాడు.

ఓ ఇంజక్షన్ రెండురోజులకోసారి,పొద్దున,సాయంత్రంతప్పనిసరిగా తీసుకోవాలి. పొద్దుటి ఇంజక్షన్ తీసుకుని, రాత్రికి ఇంజక్షన్ తీసుకోవాలికాబట్టి, వచ్చేసరికి లేటవుతుందేమోనని, ఇంజెక్షను, బాటిల్, డిస్పోజల్ సిరంజ్ జేబులో వేసుకుని, పనిమీదవెళ్ళాడు.

దోస్తులతో కలిసి, మామిడితోపుకు వెళ్ళేసరికి,రాత్రి అవుతుండగా, ఇంజక్షన్ మాట గుర్తుకువచ్చి, దాన్ని బయటకు తీసాడు. అప్పటికే తాగినమత్తులో ఉన్న, ప్రణీత్ చేతికిచ్చి, "ఎలాగోలా, ఇంజక్షన్ చేసేయరా!" అన్నాడు.

సిరంజిలోకి, మందులాగి స్పిరిట్, దూదీ, లేకుండానే, జబ్బకు పొడిచి, సిరంజిని అక్కడ పడేసి, ఎవరిదారిన వారు పోయారు

మామిడితోపులో ఇనస్పెక్టర్ మంగేష్ కు దొరికింది ఆ సిరంజ్... ఇంజెక్షను బాటిలే.

ఇటువంటి ఇంజక్షన్ లైసెన్స్ లేకుండా చేయటం ఓ నేరమయితే, లాబ్ రిపోర్ట్ లో

ఆ ఇంజక్షన్ లో విషం కలిసిందని రావటం...

ఇది ముమ్మాటికీ హత్యేనని తేలటం

సంచలనమై, ప్రణీత్ కు శిక్షపడింది.

ప్రణీత్ తప్ప, స్నేహితులంతా నిర్దోషులని కోర్ట్ తేల్చింది.

ఆరోజు లచ్చుమాంబ ప్రణీత్ ను కలపటానికి జైలుకు రావటం ఇన్స్పెక్టర్ మంగేష్ దృష్టిని

బహుమతి పొందిన కథ

# ద్రోహి?

దాటిపోలేదు. ఎందుకువచ్చిందీ?

ఇన్స్పెక్టర్ మంగేష్ కి ఏదో అనుమానం వచ్చింది. సిరంజ్ మందులోకి విషం ఎలావచ్చింది? ప్రణీత్ కు ఇంజక్షన్ చేయటం ఎలావచ్చు? అతను ఎక్కడ ఎందుకు నేర్చుకున్నాడు? నేర్చుకున్నాడా? చాలామందిలాగా మన శరీరం కాదులే అని ఇంజక్షన్ చేసేసాడా? చాలామంది ఇలాంటిప్రయోగాలే చేస్తున్నారు. కానీ, ముమ్మాటికీ ఇది ఎవరో కావాలని చేసిన హత్యే .లచ్చుమాంబ ,ప్రణీత్ తో కలిసి భర్తను హత్యచేయించలేదుకదా?!

ఇదిమామూలువిషయంకాదు. సైన్స్ లేబరేటరీవర్క్ లో ఎంతో నైపుణ్యం ఉన్న మనిషికి తప్ప, ఇంత పకడ్బందీగా హత్యచేయటం ప్రణీత్ కి సాధ్యమేనా?

ప్రణీత్ కి న్యాయస్థానం శిక్ష విధించినప్పటికీ, రహస్యంగా తన,ఇన్వెస్టిగేషన్ తను చేస్తున్నాడు మంగేష్. శిక్షపడిన ప్రణీత్ మౌనం, మంగేష్ కు అనుమానం రెట్టింపుచేసింది.

మళ్ళీ ప్రణీత్ ను కలిసాడు. పరిపరివిధాల అడిగాక, లచ్చుమాంబకూ తనకూ, జరిగిన ఒప్పందం చెప్పి," లచ్చుమాంబ తన భర్తను ఎంతగానో ప్రేమిస్తోంది. నేను ఆమెను ఇష్టపడ్డమాట వాస్తవం.వేధించింది వాస్తవమే! తన భర్తమీద ఆమెమమకారం చూసాక, అలాంటి భార్యనాకూ ఉంటే బాగుండేది కదా! అని మనసులో అనుకుని కూడా, ఆమెమీద ఇంకా ఇష్టం ఏర్పడి,వేధించటం మానలేకపోయాను. కానీ ఈ హత్య నేనుచేయలేదు. అందులో విషంకలిసిన విషయమూ నాకుతెలీదు.

కానీ లచ్చుమాంబలాంటి మనిషిని వేధించించినందుకు, ఆమెను మానసికంగా నరకానికి గురిచేసినందుకు, ఈశిక్ష నాకుపడాల్సిందేనని, నేను మౌనంగా ఉండిపోయాను. " అన్నాడు.

"కానీ!నీవల్ల ఓహంతకుడు తప్పించుకున్నాడుగా!... ఇంతకీ ఎవరు చేసుంటారు?
""తెలీదుసార్!"

★★★

వందమంది హంతకులు తప్పించుకోవచ్చుగానీ... ఓ నిర్దోషికి శిక్షపడకూడదనే.... భారత శిక్షాస్మృతి ప్రకారం... ఇంత కీలకమైన కేసును ఛేదించినందుకు మంగేష్ కు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, అసలు నేరస్థుడైన, రైస్ మిల్లు యజమాని,నరసింహకు యావజ్జీవ కారాగార శిక్షవిధిస్తూ, నిరపరాధి, ప్రణీత్ ను విడుదల చేయటమైనది." కోర్టు తీర్పుఇచ్చింది..

"ప్రణీత్ కు శిక్షపడ్డాక, చేయి దులుపుకుని మీదారిన మీరు పోకుండా...అతడు హంతకుడు కాడేమో! అని మీరు చేసిన పరిశోధన సూపర్ సార్.... ఈ కేసును ఇలాఎలా సాల్వ్ చేయగలిగారు సార్ "

జర్నలిస్ట్ లు అడిగిన ప్రశ్నకు,

"ప్రణీత్ కి శిక్ష పడినరోజున లచ్చుమాంబ, కోర్టు దగ్గర తచ్చాడుతూ... అతణ్ణి కలవటానికి ప్రయత్నంచేయటం చూసాను.

నాకు లచ్చుమాంబ మీదే అనుమానం వచ్చింది. ప్రియునితో కలిసి భర్తలను హత్యలు చేయించిన వారిని ఎంతోమందిని ఇన్వెస్టిగేషన్ చేసాను. అందుకే ఆమెమీద నిఘాపెట్టాను. జైలుకు,వచ్చిన ఆమె ప్రణీత్ తో ఏం మాట్లాడుతుందో ?ఓ పోలీసుద్వారా రికార్డ్ చేయించా!

"దాంట్లో "నువ్వు ఆ ఇండీషనేదో నాకే ఇత్తే సరిపోయేదిగా! నీ కోరికతీర్చలేదనే కసీ తీరేదీ!నా భర్తా బాగుండేవాడుగా!? అని భోరుభోరున ఏడుస్తూ తిడుతోంది ప్రణీత్ మాత్రం మౌనంగా నిలబడ్డాడు.

ఏమీ మాట్లాడకుండా,ఎందుకంత మౌనంగా ఉన్నాడూ? అనేచోట నా ప్రశ్న మళ్ళీ మొదలయింది.

బహుమతి పొందిన కథ

# ద్రోహి?

ప్రణీత్ ఇంట్లోవాళ్ళమీద నిఘాపెట్టాను.

వాళ్ళల్లో అందరూ వ్యవసాయదారులే తప్ప,ఇంత తెలివితేటలు ప్రదర్శించే వారు కనబడలేదు.

నేనే పొరబాటు పడ్డానేమో అనుకుని, సిటీకెళ్ళిపోదామని, చెట్టుకింద, బస్సుకోసం నిలబడ్డాను. ఆసమయంలో ఓ స్టూడెంట్ కూడా బస్సుకోసమే పుస్తకాలతో అక్కడికి వచ్చింది. పుస్తకాలలోంచి, ఓ జర్నల్ నన్ను ఆకర్షించింది.

దగ్గరకెళ్ళి అదేం పుస్తకం అడిగాను. ""మెడికల్ జర్నల్ చూస్తారా!" అంటూ ఇవ్వబోతే నేను "వద్దుగానీ!నువ్వు ఎవరమ్మాయివీ? ఏం చదువుతున్నావు? ఎక్కడ? అనడిగాను.

"నేను రైస్ మిల్లు ఓనర్ గారులేరూ! నరసింహగారి అమ్మాయిని సిటీలో బి. ఫార్మసి చదువుతున్నాను." అంటూనే బస్సువస్తే ఎక్కేసింది.

నేనూ అనుసరించాను.

ఆ అమ్మాయి బస్సు ఆగగానే ఫార్మసీ కాలేజీలోకి వెళ్ళింది .నేనూ వెళ్ళి అక్కడ పరిశీలనలో భాగంగా కాలేజ్ లో లెక్చరర్ తో చాలా విషయాలు మాట్లాడాను.

సంభాషణల ద్వారా ...రెండు రసాయనాల కలయికలో మనిషిని చంపే ఓరసాయనం తయారవుతుంది... ఇలా ఇంకా చాలా మాట్లాడాడు. దొరికిన ఇంజెక్షను బాటిల్ లోని, మందు విషపూరితమైందని, ఆయన మాటల్లో....అక్కడే తయారయిందని కూడా

గ్రహించి,నరసింహని పోలీసు భాషలో ప్రశ్నించా. నిజం కక్కాడు.

ఈశ్వర్, ప్రణీత్, నరసింహ వ్యాపారం మొదలెట్టాక,అతను భయపడ్డట్లుగానే తన మిల్లు లాభాలు తగ్గటం మొదలయింది. ఎందుకంటే ఊరిలోని ధాన్యమంతా సిటీకి అమ్మకానికి వెళ్ళిపోతోంది. మిల్లులో ధాన్యం పట్టించటం తగ్గిపోయింది. పైగా లాభం మూడువాటాలు చేయాల్సివస్తోంది. తను వ్యాపారంలోంచి తప్పుకున్నా,వాళ్ళిద్దరూ తనను వదిలేసి, వ్యాపారం చేసుకుంటారు. మరి ఎలాతప్పించాలి? ఈశ్వర్ జబ్బుపడి డబ్బులన్నీ ఖర్చయి, లచ్చుమాంబ ప్రణీత్ దగ్గర అప్పు అడగటం, ఆప్రణీత్, లచ్చుమాంబను వేధించటం అన్నీ తన మిల్లులోనే జరగటం గమనించి, ఎప్పటిలాగానే ఈశ్వర్ తనకూతురు దగ్గరకు ఇంజక్షన్ కోసం వచ్చినప్పుడు, అప్పటికే కూతురుకి అనుమానం కాకుండా సేకరించిన విషపు ఇంజక్షన్నుతెచ్చి..."

"పాప ఊళ్ళోలేదు. ఈ ఇంజక్షన్ ఎవరిచేతనైనా చేయించుకోమంది. రెండోది రేపు పొద్దున చేయించుకుందుకు రా! ఈశ్వర్ "అని ఇంజక్షన్ ఇచ్చిపంపాడు. సరైన మెడికల్ నాలెడ్జ్ లేని, ఈశ్వర్ దాన్ని జేబులో వేసుకుని బయలుదేరాడు. ఈశ్వర్,ఈ ఇంజెక్షనుతో చనిపోతే, లచ్చుమాంబ మీద మోజుతో ప్రణీతే చేయించాడని, ఖచ్చితంగా పోలీసులు అతణ్ణే అనుమానించి అరెస్ట్ చేస్తారని, ముందే ఊహించాడు. దెబ్బకు రెండు పిట్టలు. ఇద్దరూ వ్యాపారంలో లేకపోతే తనదే లాభమంతా అనే, కుతంత్రంతో ఇదంతా చేసానని చెప్పాడు.కానీ నేరం ఎంతోకాలందాగదు.

నేరస్థుడూ తప్పించుకోలేదు."

"ఇలాంటి చిన్న చిన్న లాభాలకోలమే ప్రాణస్నేహితులనూ చంపేయటం చాలా దారుణం. ఇక స్నేహమనే పదానికి అర్థమేముంది? ఎవర్ని నమ్మాలి? ప్చ్..." అనిముగించాడు ఇన్స్పెక్టర్ మంగేష్.

హంతకుడైన, నరసింహ శిక్షింపబడినా, నిర్దోషిగా ప్రణీత్ విడుదలైనా,పెద్దగా ఒరిగిందేంలేదుగా!?పూడ్చలేని వెలితితో...

భర్తను,బంగారంలాంటి జీవితాన్నే కోల్పోయిన లచ్చుమాంబ మాత్రం గోడుగోడున విలపిస్తూనే ఉంది.

(సమాప్తం )

# చిల్లర నాణేలతో ఐఫోన్ కొన్న బిచ్చగాడు

## వైరల్



ఒంటిపై మాసిపోయిన బనియన్, కింద లుంగీతో ఒళ్లంతా మురికిగా ఉన్న ఓ బిచ్చగాడు.. రద్దీగా, హై ఫైగా ఉండే యాపిల్ స్టోర్‌కు వచ్చాడు. తన భుజానికి ఓ సంచీని వేసుకుని చూడటానికే అసహ్యం వేసేలా ఉన్నాడు. అయితే అసలు అక్కడ ఏం జరుగుతుందో అర్థం కాక.. యాపిల్ స్టోర్ సిబ్బంది, అక్కడికి వచ్చిన కస్టమర్లు ఒక రకంగా చూడటం ప్రారంభించారు. కొత్తగా విడుదలైన ఐఫోన్ 15 ప్రో మాక్స్ ఫోన్ కొనేందుకు తాను స్టోర్‌కు వచ్చినట్లు ఆ బిచ్చగాడు చెప్పడంతో అక్కడ ఉన్న వారంతా మొదట అదంతా జోక్ అనుకుని లైట్ తీసుకున్నారు. అయితే తన సంచీలో ఉన్న డబ్బులను అక్కడ ఓపెన్ చేసి చూపడంతో వారంతా షాక్ అయ్యారు. తాను తీసుకువచ్చిన సంచుల్లో ఉన్న చిల్లర నాణేలన్నింటినీ యాపిల్ స్టోర్‌లోని ఫ్లోర్‌పై పోశాడు. వాటిని తీసుకుని తనకు ఐఫోన్ 15 ప్రో మాక్స్ ఫోన్ ఇవ్వాలని అడిగాడు. దీంతో ఆ యాపిల్ స్టోర్‌లో ఉన్న సిబ్బంది అంతా ఆ చిల్లర నాణేలను లెక్కించడం ప్రారంభించారు. కొన్ని గంటలపాటు లెక్కించి రూ.1.59 లక్షల మొత్తంతో ఐఫోన్ 15 ప్రో మాక్స్ కొనుగోలు చేశాడు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వీడియోను తీసి సోషల్ మీడియాలో ఉంచడంతో అది తెగ వైరల్ అవుతోంది.

# నోట్ల వర్షం



ఆకాశంలో నుంచి డాలర్ల నోట్లు వర్షంలా వచ్చి పడుతుంటే..? చూసిన వారెవరైనా ఏం చేస్తారు? ఆత్రంగా వచ్చి ఏరుకుంటారు..! అచ్చంగా చెక్ రిపబ్లిక్‌లో జరిగిందిదే.. ఆ దేశానికి చెందిన ఆ టీవీ వ్యాఖ్యాత, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ఇదే తరహాలో హెలికాప్టర్ నుంచి అక్షరాలా లక్ష డాలర్ నోట్లను జార విడిచాడు. . సినిమా ప్రమోషన్ లో భాగంగా యూజర్ల కోసం ఓ కాంటెస్ట్ నిర్వహిం చాడు. ఆ సినిమా చూసి, అందులో ఉన్న పజిల్ను పరిష్కరించిన మొదటి వ్యక్తికి లక్ష డాలర్లు బహుమతిగా ఇస్తానని ప్రకటించాడు. అందుకోసం యూజర్లు తమ పేర్లను ప్రత్యేక వెబ్సైట్లో నమోదు చేసుకోవాలని సూచించాడు. కాంటెస్ట్లో చాలామంది పాల్గొన్నప్పటికీ ఆ పజిల్ను ఎవరూ పరిష్కరించలేకపోయారు. దీంతో, బహుమతిగా ఇవ్వాలనుకున్న లక్ష డాలర్లను పేర్లను రిజిస్టర్ చేసుకున్న వారికి ఇవ్వాలనుకున్నాడు. ఇందుకోసం వారందరికీ సీక్రెట్ కోడ్తో మెయిల్ పంపారు. అందులో హెలికాప్టర్ నుంచి నగదును జార విడిచి క్లూ ఇచ్చాడు. ప్రాంతానికి సంబంధించిన క్లూ మెయిల్లో తెలిపినట్లుగానే కామిల్ ఆదివారం ఉదయం 6 గంటలకు నింబుర్క్ జిల్లా లైసా నాడ్ లబెమ్ అనే ప్రాంతంలోని ఖాళీ ప్రదేశంలో డాలర్ల నోట్లను జార విడిచాడు. డబ్బును ఉంచిన ఒక పెద్ద కంటెయినర్ను హెలికాప్టర్తో ఆకాశంలోకి తీసుకెళ్లి ముందుగా ప్రకటించిన ఖాళీ ప్రదేశంలో నగదును జార విడిచాడు. అప్పటికే అక్కడ బ్యాగులు, ఎక్కువ నోట్లు పోగేసుకోవాలనే ఆలోచనతో కొందరు గొడుగులతో అక్కడికి చేరుకున్నారు. సుమారు నాలుగు వేల మంది ఆ డబ్బు మొత్తాన్ని గంటలోపే సేకరించుకున్నారని, ఆ సమయంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని కామిల్ తెలిపాడు.

బహుమతి పొందిన కథ

# ది డైరీ ఆఫ్ రాధ

కథ

జి.రంగబాబు

రాధ రాసిన డైరీ :

నా అందమే నాకు శత్రువైంది..! అందంగా పుట్టడం నా తప్పా..? ఆ మాటకొస్తే నన్నింత

అందంగా పుట్టించి నా అందానికి తగ్గట్టుగా ఏ డబ్బున్న ఇంట్లోనో పుట్టించకపోవడం ఆ బ్రహ్మ చేసిన తప్పు. అలా పుట్టించి ఉంటే నా అందానికి సార్ధకత ఉండేది. డబ్బుతో కూడుకున్న అందానికి విలువెక్కువ..తావితో కూడుకున్న పూవు లాగా. మధ్య తరగతి..ఇంకా చెప్పాలంటే దిగువ మధ్యతరగతి కుటుంబంలో పుట్టించి నేను కూడా ఉద్యోగం చేస్తే గానీ గడవని ఇంట్లో పుట్టిస్తే ఎలా..?

ఆఫీసులో స్టెనో పోస్టులో చేరిన దగ్గర నుండీ అందరి కళ్లు నామీదే.. నేనిలా ఆఫీసులోనికి అడుగు పెట్టానంటే చాలు.. కొన్ని జతల కళ్ళు నా ఒంటికి గుచ్చుకుంటాయి..నా వైపు ఒళ్ళు..పరిసరాలు మర్చిపోయి చూస్తుంటాయి ఆ కళ్ళు..ముఖ్యంగా బాస్..! అసలు బాస్సు నన్ను అపాయింట్ చేసిందే నా అందానికి ఫిదా అయిపోయి..నన్ను చూడగానే అతడి కళ్ళలో కనిపించిన మెరుపు నా కన్ను దాటిపోలేదు. అసలు ఆడవాళ్ళందరికీ ..ముఖ్యంగా నా లాంటి అందమైన యువతులకు అలా కనిపెట్టగల శక్తి భగవంతుడిస్తాడేమో..! మొదటి చూపులోనే నేనతనికి నచ్చేశానన్న విషయం అతడు నన్ను చూసి మైమరచిపోయినప్పుడే తెలిసిపోయింది.

అందమైన ఆడవాళ్లంటే ఇష్టపడని పురుషులెవరుంటారు..? ఆ అందాన్ని చూసేవరకే అయితే పరవాలేదు.. కానీ చూసిన ప్రతి అందాన్నీ తన సొంతం చేసుకోవాలని ఆరాటపడటమే తనకు నచ్చదు. భార్యల అందాలు నచ్చవనుకుంటా..బయటి వారిని కోరుకుంటారు ఈ మగ మహారాజులు.

బాస్ నన్ను చూసే చూపులో ఒక రకమైన ఆకలి వుంటుంది. నన్ను చూడటమే అతడి కళ్ళల్లో ఒక రకమైన మైమరపు. నేను ఆఫీసు కి ఎప్పుడు వస్తానా , ఎప్పుడు తన ఛాంబర్ కి రప్పించుకొని డిక్టేషన్ పేరుతో నన్ను ఎదురుగా కూర్చోబెట్టుకుని చూపులతో తినేద్దామా అని ఎదురు చూస్తుంటాడు. నేను నవ్వకపోయినా నన్ను చూసి నవ్వుతాడు. నాకూ నవ్వక తప్పదు.

ఏదో వంకన మాట కలపాలని చూస్తాడు. " సాయంత్రం నీ ప్రోగ్రాం ఏమిటి ? " అంటాడు.

"అలా కేంటీన్ కి వెళ్ళి కాఫీ త్రాగుదామా " అంటాడు. నాకేం చెప్పాలో తెలియదు.

" ఇంటిదగ్గర పని ఉంది " అని తప్పించుకుంటూ ఉంటాను.

" నీకేమైనా ఇబ్బందులు ఉన్నాయా.? " అని అడుగుతాడు నా కళ్ళలోకి సూటిగా చూస్తూ. ఏ ఇబ్బందుల గురించి అడుగుతున్నాడో నాకైతే అర్ధం కాదు. " నాకేం లేవు ," అనేసి అతడి చూపులనుండి తప్పించుకోవడానికి ప్రయత్నం చేస్తుంటాను. అతడి చూపులో మాత్రం అదో రకమైన మత్తు.నన్ను చూస్తే చాలు మైమరచి పోతాడు. ఎంతసేపు కూర్చున్నా తనివి

తీరనట్లుంటాడు. ఏదైనా మాట్లాడమంటాడు. ఫ్యామిలీ

బహుమతి పొందిన కథ


# ది డైరీ ఆఫ్ రాధ

విషయాలు , పర్సనల్ విషయాలు చెప్పమంటాడు.

పడకటింటి ముచ్చట్లు సైతం వివరించమంటాడు.నాకు ముళ్ల పై కూర్చున్నట్లుంటుంది.ఏ ఆడదైనా తన వ్యక్తిగత ప్రయివేటు విషయాలు పరాయి మగాడి దగ్గర పంచుకుంటుందా..?అలాంటివి అడక్కూడదు అన్న ఇంగిత జ్ఞానం అతడికుండొద్దు..? అదేం లేకుండా " మీ ఆయన నిన్ను బాగా చూసుకుంటాడా.? రాత్రి డిన్నర్ అయ్యాక ఏం చేస్తుంటావ్..? బుక్స్ చదువుతావా..? టి వీ చూస్తావా..? అవన్నీ అయ్యాక ఏం చేస్తుంటావ్. " ఇలా సాగుతుంటుంది అతడి సంభాషణ.

అతను దేని గురించి తెలుసుకోవాలనుకుంటున్నాడో అర్థం చేసుకోలేనంత అమాయకురాలిని కాదు కదా..! అతడి టార్చర్ భరించలేక పోతున్నాను. అతనికెదురుగా కూర్చున్నప్పుడు నా శరీరంలోని అణువణువూ కళ్ళతో జుర్రేసుకుంటాడు.అతని చూపులు ఎక్కడెక్కడో తడుముతూ ఉంటాయి. నాకు భరించలేనంత ఇబ్బందికరంగా ఉంటుంది.

" నేనిక వెళ్లనా సార్..? ," అంటే " ఇంకా నీ పని అయిపోలేదు.." అంటూ కొత్త డిక్టేషన్మొదలుపెడతాడు. నా బాధ ఎవరికి చెప్పుకోను..? మొదట్లో నా భర్త ఫణి భూషణ్ కి చెబుదామనిపించింది. మళ్ళీ



ఎందుకో ఆగిపోయాను. అతడో అనుమానం మనిషి. కానీ పైకి కనబడడు. కానీ చూపుల్లో మాత్రం తెలిసిపోతూ ఉంటుంది.

ఒకరోజు ఆఫీసులో బాగాలేటయితే వొద్దు వొద్దన్నా వినకుండా బలవంతంగా నన్ను తన కారులో మా ఇంటి వదకు దింపాడు మా బాస్ మన్మథరావు. నేను బాస్ కారులోనుండి దిగడం నా భర్త చూశాడు.

బహుమతి పొందిన కథ

# ది డైరీ ఆఫ్ రాధ

ఇదే అదను అనుకుని ఇక తెగించి చెప్పేశాను నా భర్తకి. బాస్ చేష్టలన్నీ ఏకరవు పెట్టాను. "

ఈ ఉద్యోగం నేనింక చెయ్యలేనండీ..నేను ఉద్యోగం మానేస్తాను.." అన్నాను కళ్లలో నీరు తిరుగుతుండగా.. అప్పుడన్నాడు " ఈ రోజుల్లో ఇవన్నీ కామన్ రాధా..! మనమే చూసీ చూడనట్లు తప్పించుకు పోవాలి. లేకపోతే బ్రతకలేం. ఆడదానివి.. అందులోనూ అందమైన దానివి. కచ్చితంగా మగవాళ్ల అందరి కళ్లు నీ మీద ఉంటాయి. అయితే మన హద్దుల్లో మనం ఉంటే ఏ గొడవా

ఉండదు. మనమే సర్దుకుపోవాలి. అతడు నీ బాస్. ఏమైనా చేస్తాడు.. చెయ్యగలడు. అతడి మీద కోపం తెచ్చుకుంటే మనకే నష్టం. ఉద్యోగానికే హాని. అందుకని అతడు నిన్ను శారీరకంగా హింసించనంత వరకూ మనం కూడా పట్టించుకోనవసరం లేదు. ఇలాంటి బాస్లు ప్రతి చోటా వుంటారు. అందమైన లేడీ ఉద్యోగులకు వలపు వలలు వేస్తుంటారు. వారి అందాలను సొంతం చేసుకోవాలని చూస్తారు. కొంతమంది బలహీనులు లొంగిపోతారు. కానీ నువ్వంత బలహీనురాలివి కాదు కదా..! అందుకని నీ పని నువ్వు చేసుకుని పోతుంటే ఎవ్వరూ నిన్నేమీ చేయలేరు.." ఇదీ అతని సమాధానం.

చేతకాని మొగుడు మంచం నిండా వున్నాడని ..ఇలాంటి మొగుడుంటే ఇక భార్యలకి తమ మానాన్ని కాపాడుకునే దారేది..? పైగా 'నువ్వంత బలహీనురాలివి కాదని నా నమ్మకం ' ఇలాంటి మాటలతో ప్రలోభపెడితే ఎవరు మాత్రం ఏమనగలరు..? నేను ఉద్యోగం మానకుండా వుండటానికి అతడు వేస్తున్న బిస్కెట్ ఆ మాట. కేవలం డబ్బు కోసం ఆత్మాభిమానాన్ని కూడా చంపేసుకోవాలి అనే టైపు మగాడు. ఇలాంటివారికి చెప్పుకున్నా వేస్ట్. నా బాధలు నేనే పడాలి. అందంగా వుండే ఆడవాళ్ల గతి ఇంతేనా..? అందంగా లేకున్నా ఆడదయితే చాలు..ఎక్కడ లేని మగతనం బుసలు కొడుతుంది ఈ పురుష పుంగవులకు.

భార్యల దగ్గర ఎందుకు కొట్టదో..? మా బాస్ లాంటి వాళ్ళని ఇలాగే వదిలేయాలా..?

ఇలాంటివారికి ఎలా బుద్ధి చెప్పాలి..? నాకేం తోచడం లేదు.

ఫణి భూషణ్ రాసుకున్న డైరీ :

రాధ నా భార్య. చెప్పుకోకూడదు కానీ రాధ అంత అందగత్తెను నేనింత వరకూ చూడలేదు.

మొదటిసారి పెళ్లి చూపుల్లో రాధను చూసి ఆమె అందానికి ఆశ్చర్య పోయాను.

ముగ్ధుడనైపోయాను.ఔరా..! ఆడవారిలో అప్సరసల్ని పోలిన ఇంత అందగత్తెలుంటారా అనిపించింది మొదటిసారిగా. రాధ కూడా నన్ను చూసి వెంటనే తల తిప్పేసుకుంది. నచ్చానో లేదో..? ఆమె కళ్ళలో ఏ భావమూ కనబడలేదు. నేను వెంటనే ఓకే చెప్పేశాను. రాధ వాళ్ళది చాలా పేద కుటుంబం. మట్టిలో పుట్టిన మాణిక్యం రాధ. ఎక్కువ కట్న కానుకలు ఇచ్చుకోలేమంటే నా తల్లిదండ్రులు " పరవాలేదు లెండి..అమ్మాయి చదువుకుంది. ఉద్యోగం చేస్తోంది. వేన్నీళ్లకు చన్నీళ్ళలా ఇద్దరి జీతాలతోనూ జీవితాన్ని గడుపుకుంటారు లెండి. మీకు కలిగింది పెట్టండి. పెళ్లి కాస్త ఘనంగా జరిపించండి చాలు.." అన్నారు. వాళ్ళు అన్నట్లే

ఉన్నంతలో పెళ్లి బాగానే జరిపించారు.

మొదటిరాత్రి అలంకరణ లో రంభలా ఉంది రాధ.. సింపుల్ గా వున్నా సహజమైన అందంతోమెరిసిపోతోంది. ఆమెను మంచంపై కూర్చోబెట్టి పాలు త్రాగించి అడిగాను. " నువ్వు నిజంగా నే నన్ను ఇష్టపడి పెళ్లి చేసుకున్నావా..? " అని. ఆమె ఏం సమాధానం చెప్పలేదు.

" అయితే నేనంటే నీకిష్టం లేదా..? "

" అహ.. అదేం కాదు. ఇష్టం

బహుమతి పొందిన కథ

# ది డైరీ ఆఫ్ రాధ

లేకపోతే మీతో పెళ్ళికెందుకు ఒప్పుకుంటాను..? నాకిష్టమే.!"అంది ఎటో చూస్తూ. ఆమె ముఖంలో పెళ్లికూతురు కుండాల్సిన కళ లేదు. మొదటి రాత్రి అన్న బిడియం లేదు. మామూలుగా ఉంది. ముభావంగా ఉంది. ఆమె పద్ధతే అంత కాబోలు అని సరిపెట్టుకున్నాను.

ఇక ఆలస్యం చేయకుండా ఆమెను సొంతం చేసుకున్నాను. ఆమె కళ్ళు మూసుకుని ఎటువంటి ప్రతిఘటనా లేకుండానే నాకు సహకరించింది. స్త్రీ పొందు నాకు మొదటిసారి కాకపోయినా ఇంతటి అందగత్తె తో అనుభవం మొదటిసారే. ఆమెతో పొందిన శృంగార అనుభవం నాకెంతో తృప్తినిచ్చింది. ఇంత అందంగా ఉన్న యువతులకు పెళ్లికి ముందు ఎఫైర్స్ వుండే వుంటాయని నా అనుమానం. ఎందుకంటే ఇంతటి అందగత్తెని ఎవరూ ట్రై చెయ్యకుండా ఉండటం అసంభవం. బలహీనులైతే లొంగిపోతారు కూడా.. మరి రాధ కూడా అదే కోవకు చెందుతుందా..? ఏమో...!అడిగితే మాత్రం చెబుతారా ఏంటి..? పెద్ద రాద్ధాంతం చేస్తారు. ఎప్పుడో ఒకప్పుడు అదే తెలుస్తుంది. అంతవరకూ కామ్ గా ఉండటమే మంచిది.

ఏదో చిన్న ఉద్యోగం వెలగబెడుతోందిగా..పెద్ద జీతం కాకపోయినా పరవాలేదు. కానీ ఈమధ్య ఒక కొత్త గొడవ తెచ్చిపెట్టింది. తన బాస్ తనని హెరాస్ చేస్తున్నాడని చెప్పింది. శారీరకంగా కాకపోయినా చూపులతో , మాటలతో హింసిస్తున్నాడట. అదీ రాధ ఎలిగేషన్. ఔను మరి...తమ దగ్గర పని చేసే ఆడవాళ్లంటే బాస్ లకు లోకువే. అందునా అందంగా ఉంటే మరీనూ. అందగత్తెలతో ఇదే తంటా. వాళ్ళ అందంతో అవతలివాళ్లను చిత్తు చేస్తారు. నిద్ర పట్టనివ్వరు.కుదురుగా వుండనివ్వరు. అందుకే బాస్ లు వాళ్ళని లొంగదీసుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తారు. కాస్త బలహీన మనస్కులైతే లొంగిపోతారు.మధ్యతరగతి

వాళ్ళకైతే డబ్బు, ప్రమోషన్ ఆశలు చూపిస్తారు. వాటికోసం ఆశపడేవారు తమ శీలాన్ని కూడా లెక్క చేయరని వారి భావన.

కానీ రాధ అలా కాదు. శీలానికి విలువ నిచ్చే రకమని తెలిసిపోతోంది. అదే బలహీనురాలైతే నేరుగా వాడికే లొంగిపోకుండా నాకెందుకు చెబుతుంది..? ఉద్యోగం మానేస్తానని ఎందుకంటుంది..? అందుకని రాధ నిప్పే..! నేనే అనవసరంగా అనుమానించాను. పెళ్లికి ముందు కూడా ఎఫైర్లు ఉండకపోవచ్చు. ఆ విషయంలో అదృష్టవంతుడినే. రాధ మలినమైన అమ్మాయి కాదు..ఇంకా చాలా తెలివైంది కూడా.

అందుకే ఈ బాస్ దగ్గర చూసీ చూడనట్లు పొమ్మని సలహా ఇచ్చాను. నా సలహా నాకే ఎబ్బెట్టుగా అనిపించినా రాధ లాంటి తెలివైన అమ్మాయిలు ఎలాగోలా నెగ్గుకురాగరన్న నమ్మకం నాకుంది. బాస్ తో గొడవ పడితే మనకే నష్టం కదా..! ఉన్న ఉద్యోగం కాస్తా ఊడుతుంది. పైసలు కరువౌతాయి. డబ్బు లేకపోతే ఎలా బ్రతుకుతాం..? అందుకని తన సమస్యని తానే పరిష్కరించుకుంటుందని ఆమెకే వదిలేశా. ఉద్యోగం పోకుండా మేనేజ్చే సుకోమని మెత్తగా హెచ్చరించి వదిలేశా. చూద్దాం..! రాధ ఏం చేస్తుందో..!

మన్మథరావు డైరీ :

రాధ అనే గొప్ప అందాలరాశి నా దగ్గర స్టెనోగ్రాఫర్ గా జాయిన్ అయిన దగ్గరనుండీ నా జీవితమే మారిపోయింది. ఆరోజు..రాధ ఇంటర్వ్యూ కి వచ్చిన రోజు ఆమెను చూసి ఆశ్చర్య పోయాను. ఆమె అందానికి నిజంగా మతి పోయింది నాకు. పాలరాతి శిల్పం లా ఉంది.

ఆమెను ఒక్కసారి చూస్తే ఇక చూపు తిప్పుకోలేనంత అందంతో మెరిసిపోతోంది. మెడలోని మంగళసూత్రం పలుచటి సింథటిక్ శారీ లోనుండి బయటకు

బహుమతి పొందిన కథ

# ది డైరీ ఆఫ్ రాధ

కనబడుతూ ఆమె వివాహిత అని చెప్పకనే చెబుతుంది. ఆమె ఎద పొంగులు సూటిగా గుండెల్ని తాకుతున్నాయి. మంచి శరీర సౌష్టవంతో ఆరోగ్యంగా ఉంది. పద్మినీ జాతి స్త్రీ అంటే ఇలాగే ఉంటుందేమో.

ఇలాంటి అమ్మాయి ని స్టెనోగ్రాఫర్ గా అపాయింట్ చేసుకుంటే రోజూ డిక్టేషన్ పేరుతో తన ఛాంబర్ కి రప్పించుకొని తనివితీరా ఆమె అందాన్ని చూస్తూ ఎంజాయ్ చెయ్యొచ్చు. అసలే అందమంటే పిచ్చి తనకి. అందుకేనేమో విధి నన్ను వెక్కిరించింది. ఒక అనాకారిని నాకు భార్యగా చేసి కసి తీర్చుకుంది. దీనికంతకూ కారణం నాన్న. నా చిన్నప్పుడు స్నేహితునికిచ్చిన మాటకోసం , మా అస్తి పాస్తులు పెరిగి కోట్లకు అధిపతిగా కావడానికి కారణమైన స్నేహితుని కూతురిని చేసుకోవలసి వచ్చింది. ఫలితంగా కోట్లకు వారసురాలైన కాంచన మా ఇంటి కోడలిగా అడుగుపెట్టింది.

కాంచనది పేరుకు తగినట్లుగా బంగారు మేను ఛాయ కాదు.. చామన ఛాయగా ఉంటుంది.

అందగత్తె కాదు కానీ మొహంలో కళ ఉంటుంది. కానీ నాకు నచ్చలేదు.ఎందుకంటే నాకు బ్యూటీ అంటే పాషన్. వెర్రి వ్యామోహం. అందం ఎక్కడ ఏ రూపంలో కనిపించినా ఆస్వాదించ వలసిందే. మా కంపెనీ లో కూడా మేగ్జిమం అందమైన యువతులనే నియమిస్తాను. కానీ రాధ..! రాధ ముందు వీళ్ళెవరూ సరిపోరు. రోజూ కాంచన మొహం చూస్తున్న నాకు రాధను చూసేసరికి దాహంతో సముద్రంలో ప్రయాణిస్తున్న వ్యక్తి కి ఒక్కసారిగా అమృతం దొరికిన ఫీలింగ్. రెండు మూడు సింపుల్ ప్రశ్నలు అడిగేసి రాధను అపాయింట్ చేసేశాను.

మొదటిరోజు ఆఫీసుకి వచ్చినప్పుడు నా ఛాంబర్ కి వచ్చి థాంక్స్ చెప్పింది. అప్పుడు మొదటిసారిగా రాధతో మాట్లాడాను.

“ నిన్ను చూడగానే చాల తెలివయిన దానివని అనిపించింది. అందుకే రెండో ఆలోచన

లేకుండా నిన్ను అపాయింట్ చేశాను..” మొదటి బిస్కెట్ వేశాను. ఆమె ఏం మాట్లాడలేదు. “నీ అంత అందమైన యువతి ని నేనింత వరకూ చూడలేదు. అప్సరసల్ని సైతం తలదన్నే అందం నీది. అది నీకు ఏడెడ్ క్వాలిఫికేషన్..! “ అన్నాను మరలా.. ఇది రెండో బిస్కెట్. ఆమె వింతగా చూసింది నా వైపు. మొదటి పరిచయం లోనే అంత చనువు తీసుకుని ఏక వచనంలో సంబోధిస్తూ ఆమె అందానికి కాంప్లిమెంట్స్ కూడా ఇవ్వడం ఆమెకు ఆశ్చర్యం అనిపించడంలో వింత లేదు. దాంతో సరిపెట్టలేదు.

“ నిన్ను చూస్తుంటే పెళ్లయిన దానిలా కనిపించడం లేదు..పెళ్లి కాని అమ్మాయిలా ముద్దుగా ,

నాజూకుగా వున్నావు..” అన్నాను మళ్లీ. ఆమె నొసలు చిట్లించి “ నేను వెళ్తాను సర్..! “ అనేసి వెళ్ళిపోయింది. నేనేంటో మొదటి పరిచయం లోనే అవతలివారికి అర్థం అయిపోతుంది. మన వ్యవహారమే అంత. చాలా మంది ఆడవాళ్లు తమ అందాన్ని పొగిడితే మునగ చెట్టు ఎక్కేస్తారు. కానీ రాధ అలా అనిపించలేదు. ఎందుకంటే ఆమె రియల్ బ్యూటీ. ఎంతమంది ఆమె అందాన్ని పొగిడి వుంటారో..!

నా ఛాంబర్ లోనుండి చూస్తే గ్లాస్ డోర్ లోనుండి ఆమె నాకు నేరుగా కనిపించేలా సీటు ఎరేంజ్ చేయించాను. నేను పదే పదే ఆమెను చూడటం ఆమె కనిపెడుతోంది. అదే నాకూ కావలసింది. నేనామెను ఆరాధిస్తున్నానని ఆమెకి తెలియాలి. డిక్టేషన్ పేరుతో రోజూ ఆమెను నా కేబిన్ కి రప్పించుకుంటున్నాను. నాకెదురుగా కూర్చుని తల దించుకుని తను తెచ్చుకున్నస్క్రిబ్లింగ్ ప్యాడ్ లోకి చూస్తూ ఉంటుంది. నేనామెనే చూస్తుంటాను. ఆమె అందాన్ని కళ్ళతోనే త్రాగుతుంటాను. ఆమెతో మాట్లాడటానికి ప్రయత్నిస్తే ముక్తసరిగా సమాధానం

బహుమతి పొందిన కథ

# ది డైరీ ఆఫ్ రాధ

చెప్పి తప్పించుకుంటుంది. కాఫీ కు పిలిస్తే రాను, పని ఉందని అంటుంది . పర్సనల్ విషయాలు అడిగినా చెప్పదు. ఆర్ధిక ఇబ్బందులు గురించి అడిగినా స్పందించదు. దేనికైనా లొంగుతుందేమో అనుకుంటే అలా కనిపించడం లేదు. అసలు ఈమెను ముగ్గులోకి దించడం సాధ్యమా అనిపిస్తుంది. ఆమె మొండిగా వుంటూ దేనికీ స్పందించక పోయేసరికీ నాలో పట్టుదల ఇంకా పెరిగిపోయింది. ఎలాగైనా రాధ ను గెస్ట్ హౌస్ కి రప్పించుకోవాలి.ఒక్కసారైనా రాధతో పడక సుఖం పంచుకోవాలి.ఆమెపై ఉన్న కోరికను తీర్చుకోవాలి. సమయం చూసి తన కోరికను ఆమె ముందు బయట పెట్టాలి ఎలాగైనా ఆమెను అడిగెయ్యాలి..ఆడిగెయ్యాలి..!

రాధ డైరీ :

బాస్ రోజూ నన్ను , నా అందాన్ని , నా ఒంపుసొంపులను దొంగచాటుగా చూస్తూ ఎంజాయ్చే స్తున్నాడనుకున్నాను గానీ నా మీద విపరీతమైన కోరికతో మరిగిపోతున్నాడని వూహించలేదు. “ కాఫీ కి వస్తావా ? “ “ మీ ఇంట్లో విషయాలు ఏంటి “ “ నీ భర్త నిన్ను బాగా చూసుకుంటాడా..? “ ఇలాంటి ప్రశ్నలతో విసిగించే బాస్ ఈరోజు దానికి పూర్తిగా విరుద్ధంగా మరో మెట్టు పైకి ఎగబ్రాకి నన్ను హింసించడం మొదలుపెట్టాడు. డిక్టేషన్ చెబుతున్న వాడల్లా సడెన్ గా కుర్చీలో నుండి లేచి కర్టెన్లు అన్నీ మూసేశాడు..బయటి వారికి లోపల ఏం జరుగుతుందో కనబడకుండా. నా వెనక్కు వచ్చి నా భుజాలపై చేతులు వేశాడు. నేను ఉలిక్కిపడి వెంటనే కుర్చీ లోనుండి లేచి అతని చేతులు విదిలించుకుంటూ “ ఏంటి సార్ఇది..?ఏంచేస్తున్నారు..?” అన్నాను .

“ రాధా..నేను నీ బాస్ ని. నీకు తెలుసు నువ్వంటే నాకెంత ఇష్టమో..! రోజూ నిన్ను చూడందే నాకు నిద్ర పట్టదు. నీకు దగ్గరగా మెలగకపోతే నాకు పొద్దుపోదు. నిన్ను కలవని రోజు నాకు నరకం. నువ్వంటే నాకంత పిచ్చి. నీ అందం నన్ను రోజురోజుకూ పిచ్చివాణ్ణి చేసేస్తోంది.

అందుకని నువ్వు..నువ్వు ..నాకు కావాలి..” అన్నాడు.

నేను నిర్ఘాంతపోయాను. అంతకుతెగిస్తాడని వూహించలేదు.

“ ,నేను వివాహితను.. మీరిలా కోరడం సమంజసం కాదు..” అన్నాను నెమ్మదిగా.

“ నేను నీ బాస్ ని. నువ్వంటే ఇష్టపడుతున్న వాణ్ణి. నీ అంతటి అందమైన భార్య నాకుంటే నిన్నిలా కోరేవాణ్ణి కాదు. కానీ నా భార్య అందగత్తె కాదు. బాగుండదు.నా దాంపత్య జీవితం ఒక నరకం. మనసుకు నచ్చిన భార్య అయితేనే కదా శృంగార జీవితం కూడా బాగుంటుంది..అందుకే ఆమెను చూస్తే నాకు మూడ్ రాదు. కోరిక కలగదు. కానీ నువ్వు పరిచయం అయిన దగ్గరనుండీ ఆమెతో గడుపుతున్నాను..ఆమెలో నిన్ను వూహించుకుంటూ..!”

“ ఛీ.! అలా చెప్పుకోవడానికి సిగ్గులేదూ..? పరాయి వాడి భార్యను వూహించుకుంటూ చేసేదిసంసారం కాదు..మానసిక వ్యభిచారం..! “ అన్నాను. “ ఓహో..అలాగే అనుకో..” అన్నాడు.

“ అయితే ఇంకేం.. మీకు నచ్చినట్లు మీరు వూహించుకుంటూ తృప్తి పడుతున్నారు గా..నాతో పనేంటి..?” అన్నాను చిరాకుగా. “ నో..ఊహ వేరు..వాస్తవం వేరు. ఆ వూహే నిజమైతే ఎంత ఆనందం..? నీ అందమైన , సుకుమారమైన శరీరం నా కౌగిలిలో నలుగుతూ ఉంటే..ఓహ్..నాకెంత తృప్తి..! నువ్వు కూడా నామీద ఇష్టంతో ఒప్పుకున్నావనుకో..ఇద్దరం సుఖపడొచ్చు..స్వర్గం మన ముందు సాక్షాత్కరిస్తుంది..!”

“ సార్..! మీరు మా యజమానులు. మీరిలా మాట్లాడకూడదు. ఒక కంపెనీ కి బాస్ గా మీరు హుందాగా వ్యవహరించాలి. మీ క్రింది

బహుమతి పొందిన కథ

# ది డైరీ ఆఫ్ రాధ

ఉద్యోగుల పట్ల ఆత్మీయ భావమే ఉండాలి గానీ చులకన భావం ఉండకూడదు. మీ క్రింద పనిచేసే ఉద్యోగులను..అందులోనూ మహిళలను గౌరవించడం నేర్చుకోవాలి.వారిని మీ సోదరీ సమానులుగా , కన్న బిడ్డల్లా చూసుకోవాలి.అంతేగానీ ఇలా కాముక దృష్టి తో చూస్తూ మీ వృత్తి కీ , వ్యక్తిత్వానికి కళంకం తెచ్చుకోకండి..” అని సున్నితంగా మందలించాను.

“ చూడు రాధా..! నువ్వు తప్ప అందరూ నాకు సోదరీ సమానులే. నువ్వు వేరు.నీ అందంతో నన్ను కట్టి పడేసి నన్ను విపరీతమైన కాంక్ష తో రగిలిపోయేలా చేశావు.. నేను నిన్ను చూస్తూ నిగ్రహంతో ఉండలేకపోతున్నాను. అందుకని నువ్వు ఎలాగైనా నా కోరిక తీర్చాలి. నీకు కావలసినంత డబ్బిస్తాను. ప్రమోషన్ ఇస్తాను..నువ్వేం కోరుకుంటే అది..! ”

“ ఛీ..! నేనలాంటిదాన్ని కాదు..!”

“ నేనూ అలాంటి వాణ్ని కాదు. కేవలం నువ్వంటేనే నాకు మోజు. అందుకని నువ్వు ఎలాగైనా నా ఫార్మ్ హౌస్ లోనున్న గెస్ట్ హౌస్ కి వచ్చి నా కోరిక తీర్చాలి..కాదనకు.. ప్లీజ్..! “ అంటూ నన్ను తన ఉక్కు కౌగిలిలో బంధించి తన పెదాలతో నా పెదాలు అందుకున్నాడు. ఒక్క క్షణం ఏం జరుగుతుందో తెలుసుకునే లోపలే అతను నా పెదాలను చప్పరించేశాడు..!
అతని కౌగిలి నుండి బలవంతంగా విడివడి అతణ్ణి దూరంగా తోసేసి “ ఛీ..! “ అంటూ పెదాలు చీర చెంగుతో తుడుచుకుని ఛాంబర్ తలుపు తీసుకుని బయటకు వచ్చేశాను. చుట్టూ చూశాను.

ఎవరి పనుల్లో వారు నిమగ్నమై వున్నారు. ఇక అక్కడ వుండబట్టలేక ఇంటికి వచ్చేశాను.

తొందరగా ఇంటికి చేరిన నన్ను చూసి నా భర్త “ ఏమైంది..? ఒంట్లో బాలేదా..? “ అని అడిగాడు. “ ఏం లేదు..కాస్త తలనొప్పి గా ఉంటే వచ్చేశాను. కాస్త టీ పెట్టుకుని త్రాగితే అదే తగ్గిపోతుంది..” అనేసి వంటింట్లోకి వెళ్లి పోయాను. అతడు నా వైపు అదోరకంగా చూసి తన పనిలో మునిగిపోయాడు.

ఇలాంటి వాడికి ఆ గోలంతా చెబితే ?మరింత రాద్ధాంతం చేస్తాడు. ఇంతవరకూ శారీరకంగా

హింసించని మా బాస్ ఈరోజిలా చేశాడని తెలిస్తే ఏమంటాడో..? రేపటినుండీ నన్నెలా చూస్తాడో..? సమస్యకి పరిష్కారం ఆలోచించకుండా నానా మాటలూ అంటాడు. కావాలనే లొంగిపోయానంటాడు.. నీకూ ఇష్టం కనుకనే ముద్దు పెట్టించుకున్నావంటాడు.అవన్నీ భరించడం నా వల్ల కాదు. అందుకే అతనికేమీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయాను.

కానీ ఆ కామాంధునికి బుద్ధి చెప్పాలి. అవసరార్ధం ఉద్యోగానికి వచ్చే ఆడవాళ్ళని ఇంత నీచంగా చూస్తాడా..? తన క్రింద పనిచేసే మహిళలను అందునా వివాహితలను సైతం పడక మీదకి పిలిచే ఆ మానవ మృగానికి ఏ విధమైన ట్రీట్మెంట్ ఇవ్వాలి..? అని ఆలోచిస్తూ నిద్రపోయాను. నిద్రలో అన్నీ పీడ కలలే. వాడు మరింత విజృంభించి తనను లైంగికంగాహింసిస్తున్నట్లు.. తను గింజుకుంటున్నట్లు..! చాలా సేపు ఆలోచించి ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చాక నిద్ర పట్టింది.

కాంచన డైరీ :

నేను ఒక ఎంటర్ ప్రెన్యూర్ మన్మథరావు భార్యను..నా పేరు కాంచన. ఒక పెద్ద మల్టీ మిలియనీర్ కూతుర్ని..కోట్లకు వారసురాలిని. నా క్వాలిఫికేషన్ ఎం.బి.ఏ. నా తండ్రి తన

స్నేహితుని కొడుకైన మన్మథరావు కి నన్నిచ్చి పెళ్లి చేశారు. వారి మధ్య స్నేహం బంధుత్వం గా మార్చుకోవాలని నా చిన్నప్పుడే అనుకున్నారట. నేను డబ్బున్నదాన్నే గానీ అందమైన దాన్ని కాదు. నా భర్త కు నేనంటే ఇష్టం లేదని మొదటి రాత్రే నాకు అర్థమైపోయింది. అసలు నాతో ఏమీ మాట్లాడకుండా , ముఖమైనా చూడకుండా యాంత్రికంగా దాటించేశాడు

బహుమతి పొందిన కథ

# ది డైలీ ఆఫ్ రాధ

మొదటిరాత్రిని.ఎన్నో వూహించుకుంటూ జీవితంలోకి ప్రవేశించిన నేను అతని ధోరణికి విస్తుపోయాను.

ఆరోజు నుండీ నన్ను ఇంట్లో ఒక మనిషి గానే చూస్తున్నాడు తప్ప అతని జీవితంలో ఒక భాగంగా చూడటం లేదు. అన్నిటికీ సర్వెంట్స్ ఉన్నారు. దేనికీ నన్ను పిలవడు. ఏ విషయం నాతో చర్చించడు. అలాంటిది కొన్ని రోజులుగా నన్ను దగ్గరకు తీసుకుంటున్నాడు. నాతో శృంగార జీవితం గడుపుతున్నాడు. హుషారుగా ఉంటున్నాడు పడక దగ్గర. హఠాత్తుగా అతనిలో ఎందుకింత మార్పు వచ్చిందో కొద్దిసేపటి క్రితమే అర్ధం అయింది. అతనికి ఆడవాళ్లంటే పిచ్చి. అతడి బలహీనత లు నాకు కొద్ది కొద్దిగా తెలుస్తున్నాయి.

ఈరోజు ఒక సంఘటన జరిగింది. నా భర్త ఆఫీసు లో పని చేస్తున్న ',రాధ' అనే అమ్మాయి ఇంటికి వచ్చింది. చాలా అందంగా ఉంది. ఆడవాళ్ళకే ఆహా..అనిపించే సౌందర్యం ఆమెది.

ఆమె తన బాధ చెప్పుకొచ్చింది. ఆమె ఆఫీసులో జాయిన్ అయిన దగ్గరనుండీ మన్మథరావు ఎలా వేధించిందీ చెప్పింది. నిన్నటి రోజున ఆమెను కౌగలించుకొని ముద్దు కూడా పెట్టుకున్నాడట. నాలో ఆమెను వూహించుకుంటూ నాతో గడుపుతున్నాడట. ఆ విషయం వినగానే సిగ్గుతో చితికిపోయాను. పరాయి ఆడదానితో చెప్పవలసిన మాటలేనా ఇవి..?

అతడీ మధ్య నన్ను దగ్గరికి తీసుకుని ఎందుకు హుషారుగా వుంటున్నాడో నాకు అర్ధం అయింది. స్వయంగా నా భర్త మాట్లాడిన మాటలు ఆమె తన సెల్ లో రికార్డు చేసి వినిపించకపోతే నమ్మేదాన్ని కాదు. ఎంత దారుణంగా ప్రవర్తించాడో ఆ ఆడియో వినగానే అర్ధమైంది. అతనికి ఆడవాళ్ళ పిచ్చి ఉందని తెలుసుగానీ ఇలా ఉద్యోగుల్ని వేధించి , హింసించి అనుభవించాలని చేసేంత అని తెలియదు.

ఇంక ఉపేక్షించకూడదని నా భర్త ఇంటికి రాగానే భోజనం వడ్డించి తినడం అయిపోయాక ఆ ఆడియోను వినిపించాను. నిర్ఘాంతపోయాడు. షాక్ లో ఉండిపోయాడు కొద్దిసేపు. రాధ వచ్చి అన్ని విషయాలూ నాకు చెప్పేసినట్లు అతనికి అర్ధం అయిపోయింది." ప్లీజ్.. నన్ను క్షమించు కాంచనా..! నేను చేసింది తప్పే. ఇకముందు ఇలాంటి పనులు చెయ్యను. నన్ను నమ్ము.ఈ ఒక్క సారికీ నన్ను క్షమించు.నా పరువు తియ్యకు.నేను నిన్ను నిర్లక్ష్యం చేశాను.ఒప్పుకుంటున్నాను." అన్నాడు మన్మథరావు. "

ఛీ..! మీకు సిగ్గు లేదూ.. పరాయి ఆడ పిల్లలపట్ల ఇలా ప్రవర్తించడానికి..? తమ కుటుంబ అవసరాల కోసం మీ దగ్గర ఉద్యోగం చేస్తున్నఆడవాళ్లంటే ఎంత చులకన..? వాళ్ళను లైంగికంగా వేధించడానికి మీకు మనసెలాఒప్పుతోంది..? పెళ్లయి భర్త తో కాపురం చేసుకుంటున్న ,స్త్రీలను ఇలాంటి నీచమైన కోరికకోరడం , గెస్ట్ హౌస్ కి రమ్మనడం ఏం పనులు..?

ఒక కంపెనీ కి బాస్ అయి ఉండీ ఇలాంటి పనులు చెయ్యడం ఏం బాలేదు..ఆడవాళ్ళను మరీ అంత చులకనగా చూడకు . ఆ అమ్మాయి మంచిది కాబట్టి దీన్ని నేరుగా పోలీసులకు అప్పగించకుండా నా దగ్గరకు వచ్చింది. ఆమె అందంగా ఉందని, మీకు నచ్చిందని మీకు లొంగిపోవాలా.? అంత ఆడ పిచ్చి వున్నపుడు నన్నెందుకు చేసుకున్నారు.? అసలు.

మీలాంటి మగాళ్లకు పెళ్ళెందుకు.. ? మీ చేష్టలతో నన్నూ బాధపెట్టారు..! ఇక మీతో కాపురంచెయ్యడం నా వల్ల కాదు.. మనం విడిపోదాం..! " అన్నాను కోపంగా.

" అలా అనకు కాంచనా..! నా ఘోరమైన తప్పు నాకు తెలిసి వచ్చింది. ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చెయ్యను. నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను.నన్ను

బహుమతి పొందిన కథ

# ది డైరీ ఆఫ్ రాధ

క్షమించు." అంటూ ఆమె కాళ్లపై పడ్డాడు. " నువ్వు క్షమాపణలు అడగవలసింది నన్ను కాదు. రాధను..! " అన్నాను.

," అయితే ఆమెకే చెప్పుకుంటాను.." అన్నాడు. " రాధా..ఇలా రామ్మా..! " అని పిలిచాను.

అంతవరకూ ప్రక్క గదిలోనే ఉన్న రాధ బయటకొచ్చి నిలబడింది.

" సారీ సిస్టర్..! ఇంకెప్పుడూ నీ పట్ల అమర్యాదగా, అసభ్యంగా ప్రవర్తించను. నేను చేసిన దానికి సిగ్గు పడుతున్నాను. మీలా ఉద్యోగాలు చేసుకుంటున్న ఆడవాళ్ళని చులకనగా చూసి అవమానించి నందుకు నాకు సరి అయిన గుణపాఠం నేర్పావు.నన్ను క్షమించు రాధా..!" అన్నాడు తల వంచుకుని.

" ఇది నీకు ఫైనల్ వార్నింగ్ మన్మథ్.. ఇంకెప్పుడైనా మహిళలతో అనుచితంగా ప్రవర్తించినట్లు తెలిసిందో నేనే నిన్ను నేరుగా పోలీసులకు అప్పగిస్తాను,తెలిసిందా..? అలాగే నువ్వు పరాయి ఆడదాన్ని మనసులో వూహించుకుంటూ చేస్తున్న కాపురం నాకు అవసరం లేదు..! "అన్నాను కళ్ళలో నిప్పులు కురిపిస్తూ..!

" దానిక్కూడా నీకు క్షమాపణలు చెప్పుకుంటున్నాను. ఇక ముందు నిన్నే మనస్పూర్తిగా భార్యగా స్వీకరిస్తూ ఎటువంటి చెడు ఆలోచనలు లేకుండా నడుచుకుంటాను..నన్ను నమ్ము." అంటూ నా చేతులు పట్టుకున్నాడు.

" సరే..! నేనూ నిన్ను నమ్ముతున్నాను..! " అని కళ్ళతోనే నా అంగీకారాన్ని తెలిపాను. అతణ్ణి క్షమించేశాను.

ఆడది కార్యేషు దాసీ , కరణేషు మంత్రీ...మొదలైనవే కాకుండా ' క్షమయా ధరిత్రి ' కూడా కదా..!

(సమాప్తం )

## పాఠకులకు విజ్ఞప్తి

సుమతి సకుటుంబ వార పత్రికకు పాఠకులే మూల స్థంభాలు . మీరిచ్చే ప్రోత్సాహమే సుమతికి ఆయువు . మీరు కట్టే చందాలే సుమతికి ఆధరవు. అందుకనే పాఠకుల అభిప్రాయాలకు సుమతి ఎప్పుడు అత్యంత విలువనిస్తుంది. కావున సుమతి పాఠకులు తమ తమ అభిప్రాయాలను ఈ కింది మెయిల్ కు పంపండి . పాఠకుల కోసం ఇకనుండి ఒక పేజిని కేటాయించటం జరుగుతుంది. పాఠకుల అభిప్రాయాలతో పాటుగాphoto కుడా ప్రచురించ బడును. ఉత్తమ అభిప్రాయానికి రు 116 /- బహుమతిగా ఇవ్వ బడును .

sumathi.salahaalu@gmail.com

సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ

# రచయత హత్య

కథ

శరత్ చంద్ర

ప్రముఖ రచయిత మల్లేశ్వరరావ్ హత్యకు గురయ్యాడు. ఈ వార్త మీడియా సంచలనానికి కారణమయింది. ఒక రచయితకే రాష్ట్రంలో దిక్కులేకపోతే సాధారణ ప్రజల గతేంటి? ప్రతిపక్షాలు మీడియాలో గగ్గోలు పెట్టాయి. దాంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేశవనాయుడు సి.ఐ.డి సుధీర్ వర్మతో బేటీ అయ్యాడు.

"మల్లేశ్వరరావ్ హత్యకు కారకులెవరో కూపీ లాగండి ఆఫీసర్.." చెప్పాడు. దాంతో వర్మ నేరుగా రంగంలోకి దిగాడు. నేర పరిశోధనకు ఒక టీమ్ని ఏర్పాటు చేసాడు. టీమ్ సభ్యులు జ్యోతిర్మయి, రాహుల్, అబ్బాస్లతో ప్రత్యేక సమావేశం జరిపాడు. అందరూ డి.సి.పి స్థాయి వ్యక్తులే. వారం రోజులు వాళ్లకి సమయం ఇచ్చి మళ్లీ సమావేశం అయ్యాడు.

"మల్లేశ్వ్రరావు గారింట్లో ఎవరుంటున్నారు?" అడిగాడు. "అతడి భార్య చనిపోయి మూడేళ్లవుతుంది సార్.. పిల్లలు యు.ఎస్ లో సెటిలయ్యారు. ఫ్యునరలు వచ్చి వెళ్లారు." చెప్పింది జ్యోతిర్మయి. "అతని భోజన వసతి ఎవరు చూసుకుంటున్నారు?" అడిగాడు.

"అతడే స్వయంగా వంట చేసుకుంటాడు సర్. వంటల మీద మంచి బుక్ కూడా రాశాడు.." చెప్పాడు రాహుల్. "అతడికి ఎవరితోనైనా ఇల్లీగల్ రిలేషన్స్ వున్నాయా?" అడిగాడు అబ్బాస్ ను చూస్తూ. అబ్బాన్ సమాధానం చెప్పేలోపు "అతడు వుమనైజర్ సర్. తాను సంపాదించిన డబ్బును ఎక్కువ భాగం అమ్మాయిలకే ఖర్చు పెడతాడు" చెప్పింది జ్యోతిర్మయి తాజాగా అతడు ఎవరితోనైనా రిలేషన్లో వున్నాడా?" అడిగాడు. "తాజాగా అతడు చాట్ చేసిన వ్యక్తి ఒక ట్రాన్స్ జెండర్." చెప్పింది జ్యోతిర్మయి. "ఇంట్రస్టింగ్.."అన్నాడు కొద్దిగా ముందుకు వంగి వర్మ. "మరో ఇంట్రస్టింగ్ విషయం వుంది సర్. ఇటీవల భర్తకు డైవోర్స్ ఇచ్చిన రవీనా అతడితో టచ్ వుంది" చెప్పాడు రాహుల్. "ఆ సమాచారం తాలూకూ డీటైల్స్ ఇవే సర్." చెప్పాడు అబ్బాస్. రవీనాతో అతడు వెళ్ళిన ఫంక్షన్ ఫోటోలు చూపాడు. "అతడు రాసిన రచనలు ఎక్కువగా ఏ పత్రికలో పడుతుంటాయ్." అడిగాడు వర్మ.

"అన్నీ వీక్లీస్లో అతడి సీరియల్స్ వస్తుంటాయి సర్. బట్ ఒక్కోసారి అతడు రాయడం ఆలస్యం చేస్తే ఎవరో ఒకరి చేత రాయించి పబ్లిషర్స్ ప్రింటు చేస్తుంటారట.."చెప్పాడు రాహుల్. వర్మ వెనక్కి వాలి "అసలు హత్యకు కారకులెవరో అన్న సమాచారం తప్పా మిగతా అంతా బాగనే సేకరించారు" అన్నాడు నవ్వుతూ

"అదే అర్థం కావడం లేదు సర్.." చెప్పాడు అబ్బాస్.. "అతడి ఇంట్లో ఎవరైనా పనివారు వుంటారా?" అడిగాడు. "పనివాళ్లు పని చేసి వెళ్లిపోతుంటారు సర్..చెప్పాడు అబ్బాస్. "పని వాళ్లని హాజరు పరచండి.. "చెప్పి ఆరోజు మీటింగ్ ముగించాడు వర్మ. ప్రక్కరోజు అతడింట్లో పనిచేసే అలివేలూ, తోటపని చేసే రాములు సి.ఐ.డి కార్యాలయానికి వచ్చారు. "మీ యజమాని ఎలాంటి వాడు.?" అడిగాడు రాహూల్

"ఆయన చాలా మంచివాడు సర్. మా మంచి చెడ్డలు కూడా బాగనే చూసుకొనేవాడు" అంది అలివేలు. ఆమెకు నలభైఐదేళ్లుంటాయ్. నల్లగా వున్నా ఆకర్షణీయంగానే వుంది. "మంచి చెడ్డలు.. అంటే?"

సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ

# రచయిత హత్య

అడిగాడు ముందుకు వంగి వర్మ. "ఈ మధ్య మా అమ్మాయి కాన్పుకి వచ్చింది సర్. మంచి హాస్పెటల్లో జాయిన్ చేయించి పురుడు పోయించాడు."చెప్పింది. "ధర్మాత్ముడు సర్..మా మనవడికి కూడా గ్రామ సచివాలయంలో జాబ్ పెట్టించాడు.." చెప్పాడు రాములు. ఇద్దర్నీ మార్చి మార్చి చూసి "పిలిచినప్పుడు మీరు మళ్లీ రావాలి.." అని చెప్పి పంపించాడు. తిరిగి తన టీమ్ వైపు చూస్తూ. "మల్లీశ్వరరావు గురించి చుట్టు ప్రక్కల విచారణ చేసారా?" అడిగాడు వర్మ. "ఎక్కువ సేపు ఆయన ఒంటరి గానే గడుపుతాడట సర్. రాత్రి మూడు గంటల వరకూ కూడా రాసుకుంటూ వుంటారట.." చెప్పింది జ్యోతిర్మయి. "అతని పిల్లలతో ఇంట్రాక్ట్ అయ్యారా?" అడిగాడు రాహుల్ను చూస్తూ. "మన అబ్బాస్ మాట్లాడాడు సర్. ఎలాగైనా డాడీ హంతకుల్ని పట్టుకోమని వాళ్లు ప్రాధేయ పడుతున్నారట" చెప్పాడు రాహుల్. "ఫ్యామిలీకి శత్రువులెవరైనా వున్నారా?" అడిగాడు. "అలాంటి డీటైల్స్ ఏమీ ట్రేస్ కాలేదు సర్." చెప్పాడు. "అతడు ఎక్కువగా చాట్ చేసిన ట్రాన్స్ జెండర్ ప్రియాంక సింగ్ని పిలిపించండి." చెప్పాడు.

మరుసటి రోజు ప్రియాంకా సింగ్ని పిలిపించారు. ప్రియా సింగ్ని చూసిన సుధీర్ వర్మ బిత్తరపోయాడు. అంత అందంగా అమ్మాయిలు కూడా వుండరు. ర దీనితో తెరువు అందం ఆమెలో వుంది. ఎవరైనా చెబితే తప్పా ప్రియాంకా సింగ్ ట్రాన్స్ జెండర్ అంటే నమ్మరు. సుధీర్ వర్మ నేరుగా రంగంలోకి దిగి. "ఎందుకు మల్లీశ్వర్ రావుని మర్డర్ చేశారు?" అడిగాడు. ప్రియాంక బెదిరిపోలేదు.

"అలా మీరు డింకీలు ఇస్తే ప్రియాంక భయపడదు."అంది. ఆ అమ్మాయి ఎంత అందంగా వుందో ఆమె స్వరం అంత గీరగా వుంది. "అడిగిన దానికి మాత్రమే సమాధానం చెప్పండి. మీ గొప్పలు తర్వాత.." అన్నాడు అబ్బాస్ తను ఎంటరై. "ఎలా అడిగినా ఒకటే సమాధానం ఆయన చావుతో నాకు ఎలాంటి సంబంధం లేదు." చెప్పింది. "ఎందుకు మీరు తరచుగా కలిసేవాళ్లు?" అడిగాడు రాహుల్. "ట్రాన్సజెండర్ వాళ్ల జీవన విధానం మీద ఆయన ఒక నవల రాయాలనుకున్నాడు. ఒక యూట్యూబ్ చానల్ నా ఇంటర్యూ చూసి చానల్ వాళ్లని కాంట్రాక్ట్ చేసి నా నెంబర్ తీసుకున్నాడు. మా కమ్యూనిటీ మీద సింపతీ వున్న వ్యక్తని ఆయన ఫోన్ చేసినప్పుడల్లా మాట్లేడేదాన్ని. వీలున్నప్పుడు చాట్ చేసేదాన్ని" చెప్పింది ప్రియాంక.

"మరి చంపాల్సిన అవసరం ఎందుకొచ్చింది. "మళ్లీ అడిగాడు వర్మ. తిప్పి తిప్పి అడిగినా ఒకటే సమాధానం చెప్పింది. ప్రియాంక వెళ్లాక రాహుల్ వైపు తిరిగి"ప్రియాంకను ట్రాన్స్ జెండర్గా మార్చిన హాస్పెటల్ డీటైల్స్ తీసుకోండి" చెప్పాడు వర్మ. "ఎస్.. సర్.." అన్నాడు రాహుల్. ప్రక్కరోజు ప్రియాంక జెండర్ మార్చిన స్టార్ హాస్పెటల్ డీన్ అరవిందతో సమావేశం అయ్యాడు వర్మ. "రైటర్ మల్లీశ్వరరావు తెలుసా మీకు?" అడిగాడు. "ఆయన పేరు విన్నాను కానీ ఎప్పుడూ చూడలేదు.." అన్నాడు. "అతడి కాల్ డేటాలో మీ నెంబర్ ఎందుకుంది?" అడిగాడు.

"ఎందుకుందో నాకెలా తెలుస్తుంది సర్.." అన్నాడు. వర్మలో కోపం కట్టలు తెంచుకుంది. "మిమ్మల్ని అరెస్ట్ చేసి మా పద్ధతులో విచారణ చేయాల్సి వస్తుంది.." అన్నాడు కాస్త కటువుగా. "అప్పుడు మా అడ్వకేట్ మీతో మాట్లాడతాడు." చెప్పాడు అరవింద్. రాహుల్ ముందుకు వచ్చి..

"లీగల్గా అరెస్ట్ చేసినప్పుడు మాత్రమే అలాంటి ఫార్మాలిటీస్ నడుస్తాయ్. మిమ్మల్ని లిఫ్ట్ చేస్తే ఆ విషయం మీ ఆవిడకు కూడా చెప్పం."అన్నాడు. భయంగా చూశాడు అరవింద్. "ప్లీజ్ నన్ను అరెస్ట్ చేయకండి సర్. చెబుతాను." అన్నాడు. "చెప్పండి.." అన్నాడు కూల్ వర్మ. "రైటర్ మల్లీశ్వరరావు ఫోన్ చేసి ఒక అబ్బాయిని ట్రాన్స్ జెండర్ గా మార్చడానికి

సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ

# రచయత హత్య

ఎంత చార్జ్ చేస్తారు?" అని అడిగాడు. "కేస్ బై కేస్ వుంటుందని " అన్నాను. "అంటే..?" అడిగాడు వర్మ. "కాస్త డబ్బున్న వాళ్ల దగ్గర ఎక్కువ తీసుకుంటాం. కొందరు తక్కువలో అయిపోతుందని బాంబేకి కూడా వెళ్తూంటారు" చెప్పాడు. అతడితో కాసేపు మాట్లాడాక. "మళ్ళీ మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాం." చెప్పాడు. "అలాగే సార్.." చెప్పాడు డీన్. అరవింద్ వెళ్లిపోయాక అబ్బాస్ వైపు తిరిగాడు. "ఇదో మాఫీయాలా వుంది. రైటర్ ఎం కెలికాడో. మామూళ్ళ కుర్రాళ్ళని కూడా ట్రాన్స్ జెండర్ మార్చి గాంజా అమ్మిస్తూ వుంటారట. రైటర్ డైరీలోని డేటాలో ఇదంతా వుంది. బుర్ర వేడెక్కు తుంది." అని అబ్బాస్ వైపు చూస్తూ.. "టీ చెప్పు అబ్బాస్." అన్నాడు. అబ్బాస్ బయట వున్న సెంట్రీకి చెప్పాడు. పదినిమిషాల తర్వాత పొగలు కక్కే 'టీ' వాళ్ల దగ్గరకొచ్చింది.

"ఎవరు చంపి వుంటారు ఈ రైటర్ని. గాంజా మాఫీయా ఇందులో వుందా?రైటర్ తమ గురించి తవ్వుతున్నాడని లేపేశారా? ఎనీ ఐడీ గెస్..?" అడిగాడు వర్మ.

"క్లూస్ టీమ్ ఇచ్చిన రిపోర్టు బట్టి 'పాలి'తో అతని గొంతులో పొడిచి చంపారు సర్. నిజానికి ఇప్పట్లో ఎవరూ 'సిరా' పెన్నులు వాడడం లేదు. బాల్ పాయింట్ పెన్నులే వాడుతున్నారు." చెప్పాడు అబ్బాస్. "ఫోన్లో అతడి ఫ్రెండ్స్ లిస్ట్ చూద్దాం సర్. వాళ్లందరితో మాట్లాడితే 'సిరా' పెన్ను ఎవరు వాడుతున్నారో అర్థమవుతుంది.."అంది జ్యోతిర్మయి. "గుడ్.. మీరా పనిలో వుండండి.." చెప్పాడు. మూడురోజుల తర్వాత ఆ బృందం భేటీ వేసింది. "ఎవరూ సిరా వాడుతున్నట్లు చెప్పలేదు సర్.." చెప్పింది జ్యోతిర్మయి. "హత్య చేసిన వాడు నేను సిరా పెన్ను వాడుతున్నానని ఎందుకు చెబుతాడు?" అన్నాడు రాహుల్.

"మనది లూజ్ ఎఫెర్టేనా" అన్నాడు వర్మ. వాళ్లు మాటల్లో వుండగానే డి.జి.పి నుండి ఫోన్ వచ్చింది. "ఏం చేసారు? ఆ రైటర్ మర్డర్ విషయం." అడిగాడు. "క్లూస్ కోసం ట్రై చేస్తున్నాం సర్.." అన్నాడు వర్మ. "హోం మంత్రిగారి భార్య కూడా ఆ రైటర్ ఫ్యానే నటయ్యా. ఇన్విస్టిగేషన్ స్పీడ్ చేయండి" అన్నాడు. రాహుల్ వైపు తిరిగి "రైటర్ కాంట్రాక్ట్ లిస్ట్లో వున్న వాళ్లందరినీ రమ్మన మని చెప్పండి.." అన్నాడు. "అంతమందిని ఎలా పిలిపించగలం సర్.." అంది జ్యోతిర్మయి. "తప్పదు.. లేదా మనమన్నా వాళ్ల దగ్గరకి వెళ్లాలి." అన్నాడు "అది హెవీ ఎక్స్ పెండిచర్ సర్. పైగా టైమ్ టేకింగ్ ప్రాసస్. పిలిపించడమే బెటర్. ఒకవేళ ఎవరికన్నా రావడం ఇబ్బందిగా వుంటే కన్వేన్స్ ఏర్పాటు చేద్దాం.." అన్నాడు రాహుల్, "గుడ్ ఐడియా" చెప్పాడు వర్మ. రెండ్రోజుల తర్వాత అందర్నీ అసెంబుల్ చేశారు. దరిదాపు కాంటాక్ట్ లిస్ట్లో వున్న వాళ్ళందరూ వచ్చారు. కొందరు ఔట్ ఆఫ్ స్టేట్ లో వున్నారు. వాళ్ళ ట్రావెల్ హిస్టరీలో ఇండియాకి వచ్చిన దాఖలాలు లేవు. కేవలం మూడు నెంబర్లకు చెందిన వాళ్ళు మాత్రమే హాజరు కాలేదు. ప్రియాంకని మళ్ళీ పిలిచారు. నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చి వెళ్ళింది. మరోసారి విచారణకు పిలిస్తే తమ కమ్యూనిటీ వ్యక్తులతో వచ్చి సి.ఐ.డీ ఆఫీస్ ముందు ధర్నా చేస్తాను అంది. "ఆ ప్రియాంకని ఇక పిలవొద్దులే సార్.. హాజరుకాని ఈ ముగ్గుర్లోనే హంతకుడు వుంటారు సార్.." అంది జ్యోతిర్మయి. "దట్స్ రైట్ .వాళ్ళని ట్రేస్ చేయండి.."చెప్పాడు వర్మ. ఇద్దరి ఫోన్లు స్విచ్ ఆఫ్ వున్నాయి. మరో నెంబర్ లిఫ్ట్ చేశారు. జ్యోతిర్మయి తన ఐడెంటిటీ చెప్పింది. ఎవరో ఇరవై ఏళ్ళ కుర్రాడు ఫోన్ లిఫ్ట్ చేసి..

"తాతయ్యకి ఆరోగ్యం బావోలేదు.." చెప్పాడు. "మాట్లాడే స్థితిలో లేరా?" అడిగింది జ్యోతిర్మయి. "డాక్టర్లు మాట్లాడవద్దని చెప్పారట.." చెప్పాడు. "ఒకసారి మీ లోకేషన్ పెట్టండీ.." అంది జ్యోతిర్మయి. ఆ కుర్రాడు ఏదో ఆలోచిస్తుంటే.. "ఎవరూ..?" ప్రక్క నుంచి ఎవరో అడుగుతున్నారు. "పోలీస్

సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ

# రచయత హత్య

డిపార్ట్మెంట్ అట నానమ్మా.. ”చెప్పాడు. “పోలీస్ డిపార్ట్మెంట్కి మీ తాతయ్యతో ఏం పని?” అంది. ఆవిడ మాటలు జ్యోతిర్మయికి విన్పిస్తూనే వున్నాయి. ఆ కుర్రాడు ఫోన్ కట్ చేశాడు.

‘స్విచ్ ఆఫ్ చేసిన వాళ్ళ అడ్రస్కి పంపిస్తే ఆ చిరునామాలో వాళ్లు లేరు సార్..” “ఫేక్ నెంబర్ సిమ్ తీసుకోవాల్సిన అవసరం ఏముంది. ? అంటే ఇద్దరిలో ఒకరు హంతకుడు అయివుండవచ్చు. లేదా ఇద్దరు కూడా ఈ హత్యలో పాలు పంచుకొని వుండవచ్చు. ఇట్స్ యే ప్లాన్ మర్డర్.” అన్నాడు వర్మ. “ప్లాన్ మర్డర్ అయితే ‘పాలి’తో ఎందుకు పొడుస్తారు సర్.?ఏ కత్తినో తుపాకినో తెచ్చి హంతకుడు వేసేసే వాడు” చెప్పాడు రాహుల్. “నువ్వు చెప్పేది కూడా కాద నలేం రాహుల్. ఎమోషనల్ అటాక్ కూడా అయ్యి వుండవచ్చు. అయినా అందర్నీ అనుమానించడం మన ప్రొఫెషన్లో “సహజమే కదా” అన్నాడు వర్మ. అప్పుడే ఎంటరై ఇద్దరికి చెందిన కాల్ లిస్ట్ ప్రింటు తీసుకొని వచ్చాడు సి.ఐ ఇగ్బాల్.

“సర్.. హత్య జరిగిన ముందు రోజు వరకూ వాళ్ళ ఫోన్ నెంబర్లు యాక్టివ్గానే వున్నాయ్. “చెప్పాడు ఇక్బాల్, “వాళ్ల డీటైల్స్ ఇవ్వండి..” చెప్పాడు వర్మ. ఇక్బాల్ వాళ్లకు సంబంధించిన వివరాలు ఇచ్చాడు. “సర్..మల్లేశ్వరరావు గారి ఫోన్లో ఆ ఇద్దరి పేర్లలో ఒకటి ‘కాళీ’ అని వుంది సర్. అసలు వర్జినల్ రిజిస్ట్రేషన్ పేరు సునంద రెండో నెంబర్ అల్తాఫ్ అని వుంది” చెప్పాడు ఇక్బాల్ ఇక్బాల్ వైపు తిరిగి “వాళ్లిద్దరినీ పట్టే బాధ్యత నీదే అన్నాడు” ఫోన్ చూసుకుంటూ జ్యోతిర్మయి వైపు తిరిగి “జ్యోతి లెట్స్ గో కమ్ విత్ మి..”. అని బయటకు నడిచాడు వర్మ. “ఎస్.. సర్..”ఆమె అతడి వెంట నడిచింది.

బయటకు వచ్చాక “జ్యోతీ హోటల్ తాజ్లో ఉప్మా బాగుందట వెళ్లామా?” అడిగాడు నవ్వుతూ. అంగీకార సూచకంగా నవ్వింది. కాసేపట్లో ఇద్దరూ హోటల్ తాజ్ లో వున్నారు. కేవలం ఉప్మాకోసం వర్మ సర్ తనను తేరని ఆ అమ్మాయికి అన్పించింది. ఆ అమ్మాయి మొఖంలోని ప్రశ్నార్థకాలు చూసి “నీ అనుమానం నిజమే..” అన్నట్టు చూశాడు.

“ఎవరొస్తున్నారు సర్..?” అడిగింది. “సస్పెన్స్.. కాసేపు వెయిట్ చెయ్..” చెప్పాడు. ఇరవై ఏళ్ల కుర్రాడ్ని తీసుకొని ఒక వృద్ధుడు లోపలికి వచ్చాడు. ఆమె భృకుటి ముడిపడింది. “మార్కేండేయులు కదా సర్..” అంది. “అవును ” అన్నట్టు చూశాడు. మూడో ఫోన్ నెంబర్ అదే. ఆ వృద్ధుడు కూడా ఉప్మా ఆర్డర్ ఇచ్చాడు. అతని మనవడు రవ్వ దోసెకు ఆర్డర్ ఇచ్చాడు. రవ్వ దోసె వచ్చింది. ఉప్మా వచ్చేలోపు చెయ్యి కడుక్కోవడానికి షింక్ దగ్గరకు వచ్చాడు వృద్ధుడు. వర్మ వెనగ్గా వచ్చి నిల్చొని “తాతగారూ.. మీరు నాతో రావాలి..” ‘అన్నాడు. ముసలోడు బిత్తరపోయి చూశాడు. “అంతా మాకు తెలుసు. ప్లీజ్ గొడవ చేయకుండా రండి..” చెప్పాడు. మార్కేండేయులు రెసెస్ట్ చేయలేదు. “ఒక్కసారి కాకపోతే వందసార్లు వస్తా. నాకేమన్నా భయమా..” అన్నాడు. “మీరు భయపడాలని నేను కోరుకోలేదే.. చెప్పాడు. జ్యోతిర్మయి వర్మని ఫాలో అయ్యింది. కార్లో కూర్చున్నాక

“మీ మనవడికి ఫోన్చెయ్యండి..” అన్నాడు. “వాడు కంగారు పడతారు. వద్దు..” అన్నాడు. “జ్యోతి నువ్వు దిగి ఆ పిల్లాడ్ని ఇంటి దగ్గర దిగబెట్టిరా. నే చెప్పే వరకూ అక్కడే వుండు” చెప్పాడు. “ఎస్.. సార్” అంది వాష్ బేసిన్ దగ్గర నుండి తాతయ్య రాకపోవడంతో లేచి అటువైపుగా వెళ్లబోతుంటే “నువ్వు మార్కెడేయులు మనవడివికదా..” అంది. “అవును.. మీరెవరు?” అడిగాడు.

“మీ తాతయ్య మా బావగారితో కలిసి ఏదో అర్జంట్ పని వుందని వెళ్లాడులే. నీకొచ్చిన రవ్వ దోసె తిన్నాక నిన్ను ఇంటి దగ్గర దిగబెడతాను” అంది. “మీరు దిగబెట్టడమెందుకు నాకు బైక్ ఉంది కదా..” అని ఫోన్ చేసాడు. “తాతయ్యా.. ఎక్కడ మీరు?” అడిగాడు. “చిన్నపని వుండి

సాధారణ ప్రచురణకు ఎంపికయిన కథ

# రచయతత హత్య

వెళ్తున్నాను. నువ్వు ఇంటికెళ్లి పో..” చెప్పాడు.

“నేనూ నీతో వస్తాను. మీరొక్కరే ఎందుకు వెళుతున్నారు? అమ్మ నన్ను తిడుతుంది..” అన్నాడు.

“పర్వాలేదులే. ఒక ఆంటి నీ దగ్గరకు వచ్చింది కదా. ఆమెను కూడా తీసుకెళ్లు. తనే డీటైల్స్ చెబుతుంది” అన్నాడు.

ఆ కుర్రాడి మొబైల్కి ఒక మెసేజ్ వచ్చింది. “ఐ యామ్ విత్ పోలీస్ ..” వర్మ వృద్ధుడ్ని చూస్తూ.. “మీరు చాలా షార్ప్ సార్..” అన్నాడు. వృద్ధుడు నవ్వుతూ చూశాడు. వాళ్లు మాటల్లో వుండగానే ఇగ్నాల్ ఫోన్ చేసాడు. “కాళీ ఫోన్ స్విచ్ ఆన్ అయ్యింది సర్. అతడే తీశాడు..” అన్నాడు.

“మనకేమన్నా ఉపయోగపడతాడేమో తీసుకొచ్చి మర్యాదలు చేయండి” చెప్పాడు మార్కేండేయుల్ని చూస్తూ.. “మీ పోలీస్ బాష అర్ధం కానంత పూల్ని కాదు..” అన్నట్టు చూశాడు. అతడ్ని తీసుకొని ఒక అజ్ఞాత ప్రదేశానికి తీసుకొచ్చాడు. అప్పటికే అక్కడికి రాహుల్, అబ్బాస్ వచ్చారు.

“రేపో మాపో ప్రాణాలు పోయే వాడి మీద థర్డ్ డిగ్రీ ప్రవేశపెడతారా?” అన్నాడు. “మేం అలా అనలేదే..” అన్నాడు వర్మ. “పోలీసులు తెచ్చి చేసేది అదేగా. మా మల్లేశ్వరరావ్ ఎన్ని నవలల్లో రాయలేదు” అన్నాడు. హ్యాండ్ కప్స్ వేసారు. “నేనం పారిపోను. అలా పరుగెత్తే శక్తి కూడా నాకు లేదు..” చెప్పాడు.

వృద్ధుడ్ని కుర్చీలో కూర్చోబెట్టి “చెప్పండి ఎందుకుచేశారీ హత్య..” అడిగాడు వర్మ. “నేను ప్రత్యేకంగా చంపాల్సిన పని లేదు. వాడు ఎప్పుడో నైతికంగా చనిపోయాడు.” అన్నాడు. “నైతికంగా చనిపోవడం వేరు. భౌతికంగా చనిపోవడం వేరు..” అన్నాడు వర్మ.

“రచయిత అనే వాడు బ్రహ్మకి ప్రతి రూపం. సృష్టికి ప్రతి సృష్టి చేసేవాడు. వాడేం చేసాడో తెలుసా?” అడిగాడు. “మీరు చెబితేగా తెలిసేది..”చెప్పాడు వర్మ. “ప్రజలని మోసం చేస్తున్నాడు చాలాసార్లు చెప్పి చూశాను. వాడు వినలేదు”చెప్పాడు. “ఏం మోసం చేసాడు.. మీరేం చెప్పారు?” అడిగాడు రాహుల్ ముందుకు వచ్చి.. “వాడు రాసే రచనల్లో చాలావరకూ కాపీనే. లేదా గూగుల్ తల్లి సాయంతో తప్పా వాడు స్వంతంగా రాయలేదు. పూర్తిగా వాడిలో సృజనాత్మకత కొరవడింది. వాడికి అక్షరాభ్యాసం చేసిన మాస్టర్గా వాడికి చాలాసార్లు చెప్పి చూశాను. వాడు నామాట వినలేదు.”అని ఆరోజు జరిగిన సంఘటని రివీల్ చేసాడు. “ఏంటి గురువుగారూ వచ్చారు?” అడిగాడు మల్లేశ్వరరావ్ “ఎన్ని సార్లు చెప్పినా నువ్వు మారడం లేదు మల్లీ.” అన్నాడు. మార్కండేయులు. “ఏం విషయంలో గురువుగారూ?” అడిగాడు. “రాయదల్చుకుంటే మన జీవితాల్లో కావలసినంత మెలో డ్రామా, ఐరనీ వుంది. అదెందుకు రాయకూడదు?” అడిగాడు.

“మనం స్ట్రెయిట్గా తీసిన సినిమాలు పోవడం లేదనేగా డబ్బింగ్ సినిమాలు చూస్తున్నాం.” అన్నాడు మల్లేశ్వరరావ్. “సినిమాకి బాషా ప్రాంతం లేదు మల్లీ.. మంచి సినిమా ఏ భాషలో వున్నా మనం ఆహ్వానిస్తాం. అది ఏ భాషా చిత్రమో మనకి తెలిసిపోతుంది. బట్ నువ్వు చేసేది కరెక్ట్ కాదు. నీకు రెండు మూడు భాషలు వచ్చు కాబట్టి వాటిని కాపీ చేసి నీపేరు మీద వేసుకుంటున్నావ్..” చెప్పాడు. పక పకా నవ్వాడు మల్లేశ్వరరావ్. “ఎందుకురా నవ్వుతున్నావ్?..” అడిగాడు. “నవ్వక ఏం చేస్తాను.. నవ్వా నీ నీతి మాటలు. ఏదో అక్షరాభ్యాసం చేసిన మాష్టరువని మర్యాదగా మాట్లాడుతున్నాను. నువ్వు బయలు దేరితే నా పని నేను చూసుకోవాలి” అన్నాడు. “ఏంట్రా నీ పని కాపీ కొట్టడమా?” అన్నాడు కోపంగా. “మీరు బయలు దేరండి మహాను భావా” అన్నాడు మల్లేశ్వరరావ్. “నీలాంటి కాపీ గాళ్లని ఈలోకంలో

# రచయిత హత్య

వుండనీకూడదురా అని అతని జేబులో వున్న సిరా పెన్ను క్యాప్ తీసి 'పాళీ'తో గొంతులో పొడిచాడు. కిక్కురు మనకుండా కాలం చేసాడు. మల్లేశ్వరరావ్"

"ఇది జరిగింది " చెప్పాడు మార్కేండేయులు. ఎక్కడ్నుంచో ఫోన్ వచ్చింది. "ఎస్ సర్.. అన్నాడు అటెన్షన్ పే చేస్తూ వర్మ. "మీరు బయలు దేరవచ్చు.." చెప్పాడు హ్యాండ్ కఫ్స్ తీసేస్తూ. "ఎవరు డ్రాప్ చేస్తారు నన్ను.." అడిగాడు. "మా వాళ్లు వస్తారు..." చెప్పాడు. "నన్ను అరెస్ట్ చేయరా?" అడిగాడు.

"మీ స్టేట్మెంట్ తీసుకున్నాం కదా బాబాయ్.. అవసరమైతే మళ్లీ పిలిపిస్తాం. "చెప్పాడు. అతడెళ్లిపోయాక "మర్డర్ చేసినట్టు కమిటయ్యాడు కదా పంపించేస్తున్నారు ఏంటి సర్.." అడిగాడు రాహుల్. "అసలు హంతకుల్ని పట్టుకోవాలి కదా.." అన్నాడు. నివ్వెర పోయారు రాహుల్, అబ్బాస్ లు.

"జ్యోతిర్మయికి కాల్ చేసి వచ్చేయమని చెప్పండి.."చెప్పాడు. కాసేపటి తర్వాత జ్యోతిర్మయి వచ్చింది. "ఏంటి సర్.. వచ్చేయమన్నారు?" అడిగింది. "ముసలాడు కేసుని పక్కదారి పట్టించాడు. అతడి ఫోన్ నెంబరు మనం ట్రాక్చే స్తున్నామని తెలిసే డైవర్ట్ చేసాడు. "చెప్పాడు. వారం తర్వాత ప్రియాంక సింగ్ని అరెస్ట్ చేసారు పోలీసులు.

"ఇజ్రాల జీవితం గురించి రాయడానికి ప్రియాంకతో స్నేహం చేసాడు మల్లేశ్వరరావ్. అదను చూసి ప్రియాంకపై అత్యాచారానికి ప్రయత్నించాడు. తనని తను రక్షించుకోవడానికే ప్రియాంక రచయితను హత్య చేసింది. "ప్రాసిక్యూషన్ కథనం విన్పించింది. "సర్.. హత్య చేసింది మార్కేండేయులు కదా.." అడిగాడు రాహుల్.

వర్మ కేస్ ఫైల్ క్లోజ్ చేస్తూ. "అతడ్నితీసుకొచ్చిన రోజు డి.జి. పి నుండి నాకు ఫోన్ వచ్చింది. డిజిపి కూడా ఆయన స్టూడెంట్ అట.అతడు అల్జిమర్ పేషెంట్. పైగా క్యాన్సర్ బాధితుడు. ఆ రోజు స్వయంగా హత్య చూసాడు. ఎలాగూ పొయ్యే వాడ్ని కదా అని హత్యానేరం తనమీద వేసుకున్నాడు.


"ఆ పెన్ను మార్కేండేయులుది కదా సర్" అడిగింది జ్యోతిర్మయి. "అతడిదే.. ఆరోజు మల్లేశ్వరరావ్ ఇంటికొచ్చి ఏదో మాట్లాడి వెనక్కి వచ్చాడు. అతడితో కాపీ కథలు రాయొద్దని హెచ్చరించడానికి ఆరోజు అతడొచ్చినమాట నిజమే అతడితో మాట్లాడే సమయంలో జేబులో పెన్న అక్కడ పెట్టి మర్చిపోయాడు. అతడెళ్లిన కాసేపటికి ప్రియాంక వచ్చింది. వాళ్ల పెనుగు లాట సమయంలో విధిలేని స్థితిలో ఆ క్యాప్ తీసి ఆ పెన్నుతో రైటర్ గొంతులో పొడిచింది. సరిగ్గా ఆ సమయంలో మర్చిపోయిన పెన్ను కోసమే మార్కండేయులు వచ్చాడు. సంఘటన చూశాడు. పాళీ దిగబడి కిక్కురుమనకుండా రైటర్ చనిపోయాడు.

మిగతా కథ మీకు తెలుసు కదా?" కంక్లూడ్ చేసాడు సుధీర్ వర్మ.

( సమాప్తం )

# నమ్మకాలు- నిజాలు

## హస్త సాముద్రికం -అంజనం -ప్రశ్న




ఈ మధ్య అలా బజారున వెళుతుంటే ఒక పేరుమోసిన లాడ్జి ముందు 'హస్తం' మార్కు కటౌట్ పెట్టబడి వుంది. ఇంకా ఎన్నికలు రాలేదు కదా అప్పుడే హస్తాలు వచ్చాయేమిటబ్బ అనుకుంటూ కాస్త దగ్గరకెళ్ళి గమనిస్తే అవి 'ఢిల్లీ హస్తాలు' కావని తేలింది. ఒక గొప్ప హస్త సాముద్రికుడట. ఆ లాడ్జిలో పది రోజులపాటు ఉంటాడట 'భవిష్యత్తేనా.. కూడా చెప్తాడా' అని వాకబు చేశాను. ఒక్క విషయం కూడా తప్పు పోకుండా చెప్తాడని నమ్మకంగా చెప్పారు. “అనుభవించినవారు."

దాంతో ఒక చిన్న ప్రయోగం చేయాలని నిర్ణయించుకున్నాము. పది మంది బయలు దేరాము. మాలో ఒకతను 50 రూపాయలు చెల్లించి చేయి చూపించి "నా కొక అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని వుంది. ఆమెది వేరే మతం. నాకసలు పెళ్ళి అవుతుందో లేదో "చెప్పండని" అడిగాడు. "తప్పకుండా అవుతుంది. నాలుగు నెలలు అగి ప్రయత్నాలు మొదలుపెట్టు ఈ లోపల నీ జీవితంలో వున్న శని మహత్యం పోతుంది." అన్నాడు విశ్వ విఖ్యాత హస్తసాముద్రికుడు. చేయి చూపించిన ఆ మిత్రుడికి పెళ్ళయి అప్పటికి ఐదేళ్ళయింది. ఇద్దరు పిల్లలు కూడా.

ఇంకో స్నేహితుడు ఒక కాగితం మీద చేతి ముద్రవేయించి తీసుకొని వచ్చి మా అవ్వది రోగంతో తీసుకుంటూంది. క్యాన్సరు జబ్బు అని డాక్టర్లు చెప్పారు. ఇంకా ఎక్కువ కాలం బ్రతకదని చెప్పారు. ఏమవుతుందో కాస్త చెప్పండి" అన్నాడు. ఇతగాడు. కూడా యాభై సమర్పించాడని మరలా చెప్పే పనిలేదుగా, క్యాన్సరు జబ్బు అనగానే ఇచ్చారు. అంజనం చెప్పే అతర అర్ధమయినట్లుంది. “ఈమె కొద్ది రోజులకంటే జీవించదు. అయినా మందులిప్పించండి వచ్చ పెట్టాడు, దాన్ని చిన్న పిల్ల అన్నాడు. ఇంతకీ ఆ హస్తం ఆ స్నేహితుని చనిపోయిన తాతది.

అప్పుడు ఆ సాముద్రికుణ్ణి నిలేశామనుకోండి. 'అన్నీ తప్పులు చెప్తున్నావు. జనాన్ని ఇంకెంత మందిని మోసం చేస్తావు. ముందు బిచాణా ఎత్తేస్తావా లేదా? లేదంటే మేమొక పందెం నిర్వహిస్తాం. ముందుకొస్తావా" అన్నాం. "మేము వంద చేతి ముద్రలు తీసికొని అవి పురుషులవో – స్త్రీలవో చెప్పాలి. వారు జబ్బుతో వున్నారో, ఆరోగ్యంలో మనుషులు వున్నారో చెప్పాలి? అలాగే పెళ్ళి అయిందో, కాలేదో చెప్పాలి, ఈ మూడూ ప్రశ్నలు ఆ వంద మందికి సరిగ్గా చెప్పాలి. నీ హస్త సాముద్రికం సరైంది అయితే అలా చెప్పే ప్రశ్నకు యాభై చొప్పున మూడు వందల ప్రశ్నలకు 15 వేల రూపాయలు ఇప్పిస్తాము. ఒక్క ప్రశ్నకు నీవు చెప్పకపోయినా పైసా ఇచ్చేదిలేకపోగా ఆ బహిరంగ వేదిక మీద పొట్ట కూటి కోసం జనాల చేతులు పట్టానని ప్రకటించి దిగిపోవాలి అని అడిగే సరికి. చివరకా సాముద్రికుడు కాళ్ళ బేరానికి వచ్చి మరుసటి రోజే దుకాణం ఎత్తేశాడనుకోండి.

ఈ ఘటన గురించి ఒక చదువుకున్న మిత్రుడితో చర్చిస్తే “హస్త సాముద్రికము సైన్సండీ,

మేలుకొలుపు

# హస్త సాముద్రికం -అంజనం -ప్రశ్న

వాడేదో చిన్నవాడయ్యుంటాడు. ఆ విద్యలో గొప్ప గొప్ప పండితులున్నారు. వాళ్ళయితే ఖచ్చితంగా చెప్తారు." అన్నాడు.

" ఎంత గొప్పవారయినా "ఇంతకు ముందిచ్చిన వంద హస్తాల ప్రశ్నఇస్తాను" –కి ఐదేళ్ళవారని చెప్పమనండి. అంతకంటే గొప్ప ప్రయోగం అవసరంలేదు.

అంజనం వేసి చెప్పడ

ఒకరి ఇంట్లో బంగారు వస్తువులు పోయాయి. ఎవరు దొంగతనం చేశారో తెలుసుకోవాలనుకుంటే ఫలానా ఊరు వెళ్ళి అంజనం వేసి చెప్పించుకోండని సలహా ఇచ్చారు. అంజనం చెప్పే అతడు కోడిగుడ్డు మీద కాటుకతో నయాపైసంత వెడల్పయిన మచ్చ పెట్టాడు, దాన్ని చిన్న పిల్లలే చూడాలి. ఉదయం పది గంటలకు సూర్యుడి ఎదురుగా ఆ మచ్చ పెట్టిన గుడ్డును పట్టుకొని చూస్తుంటే ఆ దొంగతనం ఘటనంతా సినిమా రీలులాగా కన్పడుతుందట.

ఆ రోజు అంజనం ప్రశ్నకు వెళ్ళిన వారిలో ముగ్గురు పిల్లలున్నారు. వారిలో ఒకడికి అసలేమీ కన్పించలేదు. ఇంకో అమ్మాయికి దొంగతనం సినిమాలో ఘటనలన్నీ కన్పించాయి. కాని మనుషులు గుర్తుచిక్కలేదు. మూడో అబ్బాయికి మనుషులు కూడాస్పష్టంగా కన్పడ్డారట..

అసలు జరిగిందిది. ఈ పసి పిల్లల్ని వెంట తీసుకెళ్ళిన పెద్దవాళ్ళు తమకు ఎవరి ' మీద అనుమానముందో వారి గురించి చర్చించుకుంటూ




వెళ్ళారు. ఆ విషయాలే . పసిమనసులో నాటుకుపోయాయి. అంజనం చెప్పే పెద్ద మనిషి మరీ మరీ "చెప్పు... చెప్పు కన్పడుతున్నారు కదా నీకు...." ఇలా మాట్లాడుతుంటే అంతకు ముందు తాము విన్న విషయాలు, తమ మనసుల్లో నాటుకుపోయిన సంగతులు కన్పించినట్లు అయింది.

ఈ ఘటనలో బంగారం పోగొట్టుకున్న వాళ్ళకు, దొంగతనము చేశారేమోననుకున్న వాళ్ళకు ప్రత్యక్ష, పరోక్ష శతృత్వాలు మొదలయ్యాయి. నాలుగేళ్ళ తర్వాత తేలింది అసలు రహస్యం. ఆ బంగారాన్ని ఆ ఇంట్లోనే ఉన్న ఇంటి దొంగ కైంకర్యం చేశాడని. అందువలన "ఇంటి దొంగ ఈశ్వరునికి కూడా చిక్కడు" కాబట్టి అనవసరంగా వీధిలో వారి మీదపడి శతృత్వము తెచ్చుకున్నారు.

రోడ్డుప్రక్కన చిలకపంజరం ప్రక్కనో మనిషి, పంజరం ముందు నలభై అట్టముక్కలు, చిలక ప్రశ్న అడగ్గానే చిలకను బయటకు పిలుస్తాడు. అట్టముక్కల దొంతరలోంచి రెండో మూడో అట్టలు లాగేసి, ఒక దాన్ని ముక్కుకరుచుకుని ప్రశ్న చెప్పే అతనికిచ్చి మరలా లోనికెళ్తుంది. చిలుక. ఆ అట్టముక్కలో రాసింది. (ముందే రాయబడి ఉంటుంది) చెప్పి, నిన్ను వదిలించు కుంటాడు. ఎన్ని వేలమందయినా చిలక ప్రశ్న వేయండి మీ బ్రతుకంతా నలభై అట్టముక్కల్లో రాయబడ్డ దాంట్లోకి కుదించబడ్తుంది అంతే. శ ఆ తెలుస్తుం

ప్రశ్న చెప్పడం

# హస్త సాముద్రికం -అంజనం -ప్రశ్న

"గేదెలు తప్పించుకు పోయాయండి. ఎటుపోయాయో చెప్పండి" అని వస్తారు కొంత, మంది. ఉండేది నాలుగు దిక్కులు. వాటిలో ఒక దిక్కు చెప్తాడు ప్రశ్నవాడు. ఆ దిక్కులో చెడ తిరుగుతాడు. ఆ దిక్కులో దొరికాయనుకొండి గేదెల ఆసామి కొన్ని వందల మందికి చెప్తాడు. ప్రశ్న చెప్పేవాని గొప్పతనం గురించి. ఒకవేళ ఆ దిక్కులో దొరక్కపోతే మాత్రం ప్రశ్న చెప్పినవారిని ఏమీ అనరు. పైగా "వారూ మానవ మాత్రులేగదా! ఒక్కొక్కసారి పొరపాటు పడవచ్చు." అని సమర్ధిస్తారు. మన మనస్తత్వం ఇలా వుంటుంది.

పత్రికలలో ప్రకటనలు వస్తుంటాయి. "నికిష్టమైన పువ్వు పేరు రాసి మా అడ్రసునకు దురూపాయలు మనియార్డరు చేయండి. మీ అడ్రసుగల కవరు పంపండి" అయిదు రూపాయలేగాక కవర్లు కూడా దండగే మరి!

ముఖం చూసి నీభూత, భవిష్యత్తులు చెప్పటం ఇవన్నీ జ్యోతిష్యంలో భాగాలే.

ఈ జ్యోతిష్యం కైపు సామాన్య మానవులకే అనుకోవద్దండీ, దేశప్రధానులూ, దేశాధ్యక్షులూ, . మంత్రులూ, పార్లమెంటు సభ్యులూ, శాసనసభ్యులూ లాంటి రాజకీయాల్లో చేతులూ, కాళ్ళూ తిరిగినవారు, డాక్టర్లూ, లాయర్లూ, లెక్చరర్లూ, ఉద్యోగస్తులూ లాంటి చదువుకున్నవారూ వున్నారు. వీరెటూ చదువుకున్నవారు కాబట్టి జ్యోతిష్యంలో "సైన్సును" వెదుకుతూ ఉన్నారనుకోండి ప్రస్తుతం. అంతటితో ఆగకుండా జోతిష్యం లో డిగ్రీపెట్ట మని యునివర్శిటీలకు హుకుం జారీ చేశారు.

జీవితం ఈ రోజు అనేక కష్టాలతో నిండివుంది. అనేక సమస్యలూ, ఆందోళనా, ఏమౌతుందో అన్న అనిశ్చిత పరిస్థితి. అప్పుడేదయినా జవాబు దొరుకుదుందేమోనని ద ఆశ. ఆ ఆశను దృష్టిలో పెట్టుకునే జ్యోతిష్యం చెప్పేవారు. హస్తసాముద్రికం చెప్పేవారు వచ్చేవారి "ఆశ" చావకుండా చెప్పి పంపుతారు. వాడు మరలా మరలా రావాలంటే ఆశ చావకూడదు, మనిషీ చావకూడదు.

సమస్యల యెడల శాస్త్రీయ అవగాహన గలవాడు ఆలోచిస్తాడు. ఆందోళన పడడు.
* సమస్యను ఎలా పరిష్కారం చేసుకోవాలో ప్రయత్నం చేస్తాడు. తన చేతులూ, కాళ్ళూ కళ్ళూ, ముఖమూ ఇంకొకడి చేతిలో పెట్టరు. నీ గురించి నీకంటే ఇంకొకనికి ఎక్కువ తెలుస్తుందనుకోవటం భ్రమ.

జ్యోతిష్యం నమ్మటంగానీ దాన్ని మొండిగా సమర్ధించటంగానీ, అందులో సైన్సును 'వెదకటంగానీ 'న్యూరోసిస్' (అనే మానసిక రుగ్మత స్థితి నుండి వస్తుందని మనస్తత్వ శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. ఆ రుగ్మత పెరిగి పిచ్చాసుపత్రి పాలు కాకముందే సర్దుకుంటే సరిపోతుంది!

★★★★

## జోక్స్&జోక్స్

వెంగళప్ప తన కారులో ఇంటికి వెళ్తున్నాడు..

తమ అభిమాన నాయకుడిని కొందరు కిడ్నాప్ చేశారంటూ ఫ్యాన్స్ వాహనాలను ఆపుతున్నారు..


మా నేతను విడిపించుకోవాలంటే భారీ మూల్యం రూ.1 కోటి వరకు ముట్టజెప్పాలి. నీ వంతుగా ఏం ఇస్తావో చెప్పు. లేకపోతే నీ కారు తగలబెడతామని' వెంగళప్పకు వార్నింగ్ ఇచ్చారు..

నా వంతుగా అంటే అతి విలువైన కేజీ ఉల్లిపాయలున్నాయి. ఇవి తీసుకోండంటూ తాపీగా బదులిచ్చాడు వెంగళప్ప

కరెంట అఫైర్స్

# "అసమాన భారత దేశం "





కొండేటి వీణ

అసమానతలు మొత్తం ప్రపంచాన్ని పీడిస్తున్నప్పుడు, భారతదేశం అత్యంత అసమాన దేశాలలో ఒకటిగా మారింది, ఆర్థిక వ్యవస్థను ఎలా నడపకూడదనే దానికి ఉదాహరణ. అయినప్పటికీ అసమానతలు పెరుగుతున్నాయని గత మూడు దశాబ్దాలుగా విధాన చట్రం మరియు అభివృద్ధి నమూనాతో అవి కొనసాగుతున్నాయని మన విధాన నిర్దేతలను ఆశ్చర్యపరిచేలా కనిపించడం లేదు. ఈ లోపభూయిష్ట విధానాల ఫలితంగా నేడు అసమానతలు మరింత పదునుగా ఉన్నాయి, ముఖ్యంగా గత దశాబ్దంలో. ప్రపంచంలోని అత్యంత సంపన్నులు ఇప్పుడు ప్రపంచ సంపదలో 11% కలిగి ఉన్నారు, ఇది ఇటీవలి చరిత్రలో అతిపెద్ద ఎత్తుకు గుర్తుగా ఉంది. ధనవంతులైన 10% మంది అమెరికన్లు మొత్తం ఆదాయంలో సగం సంపాదిస్తున్నారు. ఒక కొత్త నివేదిక ప్రకారం, 2021లో భారతదేశంలోని అగ్రశ్రేణి 1% మంది దాని మొత్తం సంపదలో 40.5% కంటే ఎక్కువ కలిగి ఉన్నారు.

భారత్‌లోని పది మంది అగ్ర కుబేరులు తల్చుకుంటే.. 25 ఏళ్ల పాటు దేశంలోని పిల్లలందరికీ ఉన్నత విద్య అందించగలరని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. 98 సంపన్న కుటుంబాలపై ఒకశాతం అదనంగా పన్ను విధిస్తే 'ఆయుష్మాన్ భారత్' పథకానికి ఏడేళ్ల పాటు సరిపోయేంత బడ్జెట్ సమకూరుతుందని లెక్కగట్టింది. వీటితో పాటు అసమానతలకు అద్దంపట్టే ఆసక్తికరమైన గణాంకాలను వెల్లడించింది. ఆ పది మంది సంపదతో పిల్లలందరికీ 25 ఏళ్లు విద్య ఫ్రీ!

మానవ జాతి చరిత్రలో ఎన్నడూ లేనంత ఎక్కువ స్థాయిలో ప్రస్తుత ఆర్థిక అసమానతలు ఉన్నాయని మంత్లీ రివ్యూ తాజా పత్రిక పేర్కొంది. విపరీతంగా పెరిగిపోతున్న ఆర్థిక అసమానతల గురించి ఈ మధ్య కథనాలు చాలా వచ్చాయి. "చంపుతున్న అసమానతలు" అన్న పేరుతో ఇటీవలే ఆక్స్ ఫామ్ ఒక నివేదికను విడుదల చేసింది. ఆ నివేదిక ప్రకారం 2021లో 84 శాతం కుటుంబాల ఆదాయం పడిపోయింది. అయితే అదే సంవత్సరంలో బిలియనీర్ల సంఖ్య 102 నుంచి 142కి పెరిగింది. దేశంలో 100 మంది కుబేరుల సంపద అదే సంవత్సరంలో 57.3 లక్షల కోట్లకు పెరిగింది. దిగువ 50 శాతం కుటుంబాల సంపద జాతీయ ఆదాయంలో 6 శాతం మాత్రమే కలిగి ఉన్నారు. 1 శాతం కుటుంబాల వద్ద జిడిపిలో 33

# "అసమాన భారత దేశం "



శాతం సంపద పోగుపడింది. 10 శాతం కుటుంబాల వద్ద జిడిపిలో 73 శాతం సంపద ఉంది. ధనవంతులైన 100 కుటుంబాల సంపదలో ఐదవ వంతు పెరుగుదలకు ఒకే వ్యక్తి మరియు వ్యాపార సంస్థ అయిన అదానీల సంపద పెరుగుదల కారణమని ఆక్స్ ఫామ్ ఎత్తి చూపింది.

ప్రతి సంవత్సరం, దావోస్‌లో జరిగే వార్షిక వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌కు ముందు, ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ తన వార్షిక అసమానత నివేదికను విడుదల చేస్తుంది. ప్రతి నివేదిక అసమానత యొక్క విభిన్న కోణాన్ని సంగ్రహిస్తుంది ( "పబ్లిక్ గుడ్ లేదా ప్రైవేట్ వెల్త్?" అనే 2019 నివేదిక వంటిది ) కానీ ప్రాథమికంగా ఇప్పుడు సర్వవ్యాప్తి చెందిన అసమానత యొక్క వివిధ రూపాల చుట్టూ తిరుగుతుంది. అసమానత అంటే ఏమిటి మరియు దాని ప్రభావం మన దైనందిన జీవితంపై ఎలా ఉంటుందో మనం మొదట ఈ వెలుగులో చూస్తాము. ఆక్స్ఫాం ఇండియా నివేదిక మేరకు 2022 డిసెంబర్ చివరి నాటికి భారతీయ సంపదలో 63.8 శాతం కేవలం ఒక శాతం లోపు సంపన్నుల వద్దే కేంద్రీకృత మైంది. ధనవంతులైన ఒక్క శాతం భారతీయులు ఈ దేశంలోని 58 శాతం మధ్యతరగతి ప్రజలందరి సంపద మొత్తం కంటే 13 రెట్లు అధికంగా కలిగున్నారు. అలాగే దేశ సంపదలో మొత్తం 71.8 శాతం అగ్రశ్రేణిలో ఉన్న ఐదు శాతం సంపన్నుల వద్దే ఉంది. సర్వేవల్ ఆఫ్ రిచ్చెస్ట్ అనే ప్రభుత్వేతర సంస్థ అధ్యయన నివేదిక మేరకు 1981లో భారతీయ సంపదలో 45 శాతం మాత్రమే అగ్రశ్రేణిలో ఉన్న ఒకశాతం సంపన్నుల వద్ద ఉండగా నాలుగు దశాబ్దాల్లో ఇది 63. 8శాతానికి పెరిగింది. అదే సమయంలో దేశంలోని 50 శాతానికి పైగా గల మధ్య తరగతి కుటుంబాల సంపద సగానికి పైగా పడిపోయింది.

## అసమానత అంటే ఏమిటి?

కేంబ్రిడ్జ్ నిఘంటువు అసమానతను "కొంతమందికి ఇతర వ్యక్తుల కంటే ఎక్కువ అవకాశాలు ఉన్నప్పుడు సమాజంలో అన్యాయమైన పరిస్థితి" అని వివరిస్తుంది . ఐక్యరాజ్యసమితి దీనిని మరింత సరళంగా "సమానంగా లేని స్థితి, ముఖ్యంగా హోదా, హక్కులు మరియు అవకాశాలలో" అని వివరిస్తుంది . ఈ పదం చాలా విస్తృతమైనది మరియు వివిధ వివరణలను కలిగి ఉన్నప్పటికీ, సరళత కోసం, అసమానతను మనం వర్గీకరించగల రెండు పెద్ద గొడుగులు ఆర్థిక అసమానత మరియు సామాజిక అసమానత. ఈ రెండు వర్గాలు లోతుగా ముడిపడి ఉన్నాయి మరియు ఒకదానిలో అసమానత తరచుగా మరొకదానిలోని అసమానతను ప్రభావితం చేస్తుంది. సంవత్సరాలుగా, ఆక్స్‌ఫామ్ తన అధ్యయన కోర్సు ద్వారా అసమానతను తీవ్రమైన సామాజిక అన్యాయంగా అధ్యయనం చేసింది మరియు ప్రపంచ స్థాయిలో ఈ అసమానత యొక్క సంఘటనలు మరియు స్థాయిని డాక్యుమెంట్ చేసింది.

## ఆర్థిక అసమానత

బహుశా అసమానత యొక్క అత్యంత పరిమాణాత్మక మరియు

# "అసమాన భారత దేశం "

లెక్కించబడిన రూపం ఆర్థిక వైవిధ్యం. ఇక్కడ కూడా, ఆదాయ అసమానత మరియు సంపద అసమానతలను కొలిచే అసమానత యొక్క అత్యంత ప్రధానమైన రూపాలు. ఆదాయ అసమానత అనేది అట్టడుగు శాతాలతో పోల్చిచూస్తే జనాభాలోని టాప్ పర్సంటైల్ ఆదాయాల్లో అసమానత మరియు సంపద అసమానత చర్యలు అదే విధంగా చేయాలని చూస్తాయి కానీ ఆదాయానికి బదులుగా సంపదలో అసమానతలను లెక్కించడం ద్వారా మాత్రం కాదు .

ఓ పక్క దేశంలో ఆకలి, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆరోగ్య విపత్తులు వంటి బహుళ సంక్షోభాల్తో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. పేదలు కనీస అవసరాల్ని కూడా కొనుగోలు చేయలేక పోతున్నారు. దేశంలో ఆకలితో అలమటిస్తున్న జనం సంఖ్య 2018లో 19 కోట్లుంటే 2022 చివరి నాటికిది 35 కోట్లకు పెరిగింది. జివిస్టిస్లాట్లు కూడా పేద, మధ్య తరగతి ప్రజల ఆదాయంపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి.

గత రెండున్నర దశాబ్దాల్లో భారత్ అనూహ్య వేగంతో ఆర్థికాభివృద్ధి సాధిస్తోంది. ప్రపంచ అగ్రదేశాల్లో పోటీ పడుతోంది. గ్రేట్ బ్రిటన్ స్థూల జాతీయోత్పత్తిని సైతం భారత్ దాటేసింది. సంపద సృష్టిలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. అమెరికా, చైనాలకంటే కూడా జాతీయ సగటు వృద్ధిలో ఎక్కువ శాతాన్ని నమోదు చేస్తోంది. అయితే ఇలా పెరిగిన సంపద ఈ దేశంలోని కొన్ని కుటుంబాలకే పరిమితమౌతోంది. ఓ వైపు దేశంలో సంపన్నుల జాబితా పెరుగు తుంటే మరోవైపు దారిద్ర్యంలోకి నెట్టబడుతు న్న కుటుంబాల సంఖ్య మరింత వేగంగా విస్తరిస్తోంది. దేశంలోని సంపన్నులు కార్పొరేట్ పన్ను మినహా యింపులు, ఇతర ప్రోత్సాహకాల నుంచి అనూహ్యంగా లబ్ధి పొందుతున్నారు.. పేద, మధ్య తరగతి కుటుం బాలు ప్రభుత్వాదాయంలో అధిక భాగాన్ని మోయాల్సొస్తోంది. సంపన్నుల కిచ్చే ఆర్థిక ప్రయోజనాల భారం పేద, మధ్య తరగతి వర్గాల్ని మరింత పేదరికం లోకి నెట్టేస్తోంది.

ఫోర్బ్స్ నివేదిక మేరకు 1990లో అంతర్జాతీయ సంపన్నుల అగ్రజాబితాలో భారత్ కు చెందిన ఒక్కరు కూడా లేరు. కానీ ప్రస్తుతం ఈ జాబితాలో 166 మంది బిలియనీర్లు భారతీయు లే. 2000వ సంవత్సరంలో ప్రపంచ సంపన్నుల్లో భారత్కు చెందిన 9మంది ఉంటే 2017నాటికి ఈ సంఖ్య 119కి చేరింది. ఐదేళ్ళ వ్యవధిలోనే ఇది 166కు పెరిగింది. దేశంలో తీవ్ర ఆర్థిక మాంద్యం తలెత్తిన సమయంలో కూడా సంపన్నుల సంపద అనూహ్యంగాదేశంలో ఒక్క శాతం లోపున్న సంపన్నులు దేశ సంపదలో సింహభాగాన్ని కలిగున్నప్పటికీ పన్నుల రూపంలో వారు చెల్లిస్తున్న మొత్తం చాలా స్వల్పం. వస్తువులు మరియు సేవల పన్ను రూపంలో కేంద్రానికి జమౌతున్న మొత్తంలో 64.8 శాతం ఈ దేశంలోని 52 శాతమున్న మధ్యతరగతి కొనుగోలుదార్ల ద్వారానే లభిస్తోంది. ఆర్థికంగా ఎగువనున్న పదిశాతం సంపన్న వర్గాల్నుంచి ఈ పన్నుల ఖాతాకు జమౌతున్నది కేవలం 4 శాతం మాత్రమే. జనాభాలో సుమారు 38 శాతం ఉన్న పేద వర్గాలు. పరోక్షంగా చెల్లిస్తున్న పన్నులు అగ్రశ్రేణి 10 శాతం ధనవంతులు కడుతున్న మొత్తంకంటే 60 రెట్లు అధికం..

ఆర్థికవేత్త జాన్ డ్రెజ్ ఇటీవల సార్వత్రిక ప్రాథమిక విద్యను "ఆర్థిక పురోగతి" సాధించడంలో మరియు "సామాజిక అసమానతలను తగ్గించడంలో" సహాయపడే విధానానికి "ప్రధాన ఉదాహరణ"గా అభివర్ణించారు. నిజానికి, భారతదేశం అక్షరాస్యత రేట్లను మెరుగుపరిచింది, కానీ అది ఉనికిలో ఉన్న అసమానతలను వెల్లడించలేదు. సమానత్వం యొక్క హేతువు స్పష్టంగా కనిపించవచ్చు,

# "అసమాన భారత దేశం "

కానీ అది అభివృద్ధికి ఆధారం న్యాయం తప్ప ఏమీ కాదు. పరిగణనలోకి తీసుకోవలసిన అంశాలు ఇప్పుడు మరింత క్లిష్టంగా ఉన్నందున జాగ్రత్తగా ప్రణాళిక చేయవలసిన అవసరం పెరిగింది. ఇంతకుముందు వనరులు మరియు వాటి దోపిడీపై ఆధారపడిన నమూనా ప్రమాణంగా ఉండవచ్చు–ఇప్పుడు అవసరాలు మరియు వాటిని అందించడానికి అందుబాటులో ఉన్న కార్బన్ స్థలం గురించి కూడా ఆలోచించాలి.

ప్రభుత్వాలు సాధారణ పౌరుల మాట వినాలి మరియు అసమానతలను తగ్గించేందుకు అర్థవంతమైన చర్యలు తీసుకోవాలి. అన్ని ప్రభుత్వాలు తప్పనిసరిగా: అసమానతపై సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్ (SDG) 10 కింద వారి కట్టుబాట్లలో భాగంగా అసమానతను తగ్గించడానికి ఖచ్చితమైన, సమయ–పరిధి లక్ష్యాలు మరియు కార్యాచరణ ప్రణాళికలను నిర్దేశించుకోవాలి . ఈ ప్రణాళికలు క్రింది మూడు ప్రాంతాలలో చర్యను కలిగి ఉండాలి:

ఆక్స్ ఫామ్ ఇంటర్నేషనల్ తాజా నివేదిక 'ఇన్ ఇక్వాలిటి కిల్స్'ను ఏప్రిల్ 17న విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం రోజుకు వేలమంది మరణాలకు కారణమైన హింసాత్మక ఆర్థిక విధాన ఫలితంగా అసమానతలు తీవ్రమయ్యాయి. అత్యంత సంపన్నులు–పేదల మధ్య అంతరం బాగా పెరిగింది. పెరుగుతున్న అసమానత వల్ల మహిళలు, మైనారిటీలు, బడుగు, బలహీన వర్గాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, . ప్రపంచ బ్యాంక్, సెంటర్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ అంచనాలపై, పరిశోధనలపై ఆధారపడి ఆక్స్‌ఫామ్ తన నివేదికను రూపొందించింది.

పాలకవర్గాలు ఘనంగా చెప్పుకున్న సరళీకరణ ఆర్థిక విధానాలు సామాన్యుల మూలుగులను పిండేశాయి. ఫలితంగా అసమానతలు అనూహ్యంగా పెరిగాయి. కరోనా కష్టకాలంలోనూ సంపన్నుల సంపద మరింతగా పెరగడానికి, సామాన్యుడిని మరింత దీనంగా మారడానికి కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలే కారణమని ఆక్స్ ఫామ్ తాజా నివేదిక కుండ బద్దలు కొట్టినిది. 'ఇనీక్వాలిటీ కిల్స్ 2022' పేరుతో ఏప్రిల్ 18న విడుదల చేసిన ఈ నివేదికలో ఆక్స్ ఫామ్ దిగ్భ్రాంతికరమైన ఎన్నో విషయాలను వెలుగులోకి వచ్చింది. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే ఈ విధానాలపై పునరాలోచించాలని సూచించడంతో పాటు తక్షణ సంపద పన్నును విధించాలని సూచించింది.

ఆక్స్ ఫామ్ నివేదిక ప్రకారం దేశ వ్యాప్తంగా ఏడాది కాలంలో 84 శాతం మంది ప్రజానీకం ఆదాయం గణనీయంగా తగ్గింది. జీవితాలు కష్టాల ఊబిలో చిక్కుకున్నాయి. ఏదో రకంగా బతకడానికి నానా ఇబ్బందులు పడ్డారు. అదే సమయంలో శత కోటీశ్వరుల సంఖ్య 102 నుండి 142కు పెరిగింది. 2021 వ సంవత్సరంలో దేశంలోని వంద మంది సంపన్నుల సంపద 57.3 లక్షల కోట్ల రూపాయలకు పెరిగింది. కరోనా కష్టకాలంలోనూ (మార్చి 2020 నుండి నవంబర్ 2021) వరకు వీరి సంపద 23.14 లక్షల కోట్ల రూపాయలు పెరిగిందని నివేదిక పేర్కొంది. సామాన్యులు కష్టాలు పడుతుంటే వీరి సంపద ఇంతలా పెరగడానికి మోడీ ప్రభుత్వం అనుసరించిన ప్రైవేటీకరణ విధానాలే కారణమని విశ్లేషించింది. ప్రైవేటీకరణ ఫలితంగా భారతీయ కుటుంబాలు చేస్తున్న మొత్తం ఖర్చులో 43 శాతం ఔషధాలకు, 28 శాతం ప్రైవేట్ హాస్పిటల్స్‌కు ఖర్చు చేయాల్సి వస్తోందని నివేదిక పేర్కొంది. పేదలు, మధ్య తరగతి... ఆర్థిక, సామాజిక పరిస్థితుల్ని కరోనా సంక్షోభం తీవ్రంగా దెబ్బకొట్టింది. ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేక ప్రైవేట్‌ను అనివార్యంగా ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొంది. 'మొత్తం వైద్యరంగాన్ని ప్రైవేట్ హాస్పిటల్స్

# “అసమాన భారత దేశం “

నియంత్రిస్తున్నాయి. అవుట్ పేషెంట్ వైద్య సేవల్లో 74 శాతం, ఇన్ పేషెంట్ వైద్య సేవల్లో 65 శాతం ప్రైవేట్ వాటాగా ఉంది. ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్య చికిత్సలపై, అవి వేసే బిల్లులపై పాలకులు ఎలాంటి నియంత్రణా విధించటం లేదు' అని పేర్కొంది. 'వైద్యంపై ప్రపంచ దేశాల సగటు వ్యయం 10 శాతం ఉంటే, భారత్‌లో మాత్రం మొత్తం జిడిపిలో 1 శాతం నిధుల వ్యయం కూడా లేదు' అని తెలిపింది.

మహిళలు తమ కుటుంబాలు మరియు ఇళ్లను చూసుకోవడానికి ప్రతిరోజూ వెచ్చించే మిలియన్ల కొద్దీ చెల్లించని గంటలను తగ్గించడం ద్వారా వారి సమయాన్ని ఖాళీ చేయండి. ఈ ముఖ్యమైన పనిని చేసే వారు బడ్జెట్ నిర్ణయాలలో తమ అభిప్రాయాన్ని తెలియజేయండి మరియు మహిళల సమయాన్ని ఖాళీ చేయడాన్ని ప్రభుత్వ వ్యయం యొక్క ముఖ్య లక్ష్యంగా చేసుకోండి. ఈ చెల్లించని పని చేయడానికి అవసరమైన సమయాన్ని తగ్గించే నీరు, విద్యుత్ మరియు పిల్లల సంరక్షణతో సహా ప్రజా సేవల్లో పెట్టుబడి పెట్టండి. తక్కువ సమయం ఉన్న వారికి పని చేసే విధంగా అన్ని పబ్లిక్ సర్వీస్‌లను రూపొందించండి.

సంపన్న వ్యక్తులు మరియు సంస్థలపై తక్కువ పన్ను విధించడాన్ని ముగించండి. సరసమైన స్థాయిలలో పన్ను సంపద మరియు మూలధనం. వ్యక్తిగత ఆదాయం మరియు కార్పొరేట్ పన్నులపై అట్టడుగు స్థాయికి రేసును ఆపండి. కార్పొరేట్లు మరియు అతి ధనవంతుల పన్ను ఎగవేత మరియు ఎగవేతను తొలగించండి. అభివృద్ధి చెందుతున్న దేశాలు పట్టికలో సమాన స్థానాన్ని కలిగి ఉండటంతో పన్ను వ్యవస్థను న్యాయంగా మార్చడానికి ప్రాథమికంగా పునఃరూపకల్పన చేయడానికి కొత్త ప్రపంచ నియమాలు మరియు సంస్థలకు అంగీకరించండి.

ప్రభుత్వాలు సంపన్నుల పట్ల ఒకలా.. పేదల పట్లా మరోలా వ్యవహరించడమే ఈ అంతరాల పెరుగుదలకు కారణం. ఇదే పేదల్లో ధనికుల పట్ల ఈర్ష్యాద్వేషాల్ని పెంచుతున్నాయి. దీన్ని గుర్తించిన ధనికులకు ఇప్పుడు ఇక్కడ ఆర్జించిన సంపదతో విదేశాల్లో జీవించేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటికే అడానీ కుటుంబం విదేశాల్లో స్థిరపడింది. అలాగే పలువురు సంపన్నులు విదేశీ గడ్డలపైనుంచే భారత్లో వ్యాపార, పారిశ్రామిక సామ్రాజ్యాల్ని పర్యవేక్షిస్తున్నారు. రాన్రాను సంపన్నులకు ప్రాణభయంతో పాటు హాని కూడా అధికమయ్యే పరిస్థితులున్నాయి. ముందుగానే గుర్తించిన పలువురు సంపన్నులు ఇప్పటికే తమ మదుపును వివిధ మార్గాల్లో దేశం దాటించేస్తున్నారు. అయితే సంపన్నులకున్న ప్రాణహానిని తొలగించేందుకు ఇది మార్గం కాదు. దేశంలో పెరిగిన సంపద పంపిణీలో వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు సమర్థవంతంగా నియంత్రించాలి. పన్నుల ఆదాయంలో పేదలు, మధ్య తరగతిపై భారం తగ్గించాలి. ఆ మేరకు సంపన్నులపై అదనపు భారం మోపాలి. పరిశ్రమలు, వ్యాపారాల విస్తరణ పేరిట వారికందిస్తున్న భారీ రాయితీలు, ఆర్థిక ప్రోత్సాహకాలకు నియంత్రణ పెట్టాలి. పేదల్ని పన్నుల భారం నుంచి విముక్తి చేస్తే వారి జీవన ప్రమాణాలు మెరుగౌ తాయి. వారికి సంపన్నుల పట్ల ఈర్ష్యాద్వేషా లు తగ్గుతాయి. ఇది సంపన్నులకు ప్రాణహానిని దూరం చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

★★★

ఫోటో గ్రఫి

# ప్రయాణాల్లో ఛాయాచిత్రరచనకు కొన్ని చిట్కాలు



మూడో కన్ను

తమ్మ శ్రీనివాస రెడ్డి

ట్రావెల్ ఫోటోగ్రఫి – ఆగష్టు నుండి మార్చి వరకు అనుకూలం

ప్రజా బాహుళ్యానికి సుందరమైన ప్రదేశాలు సందర్శించటమనేదొక గొప్ప అనుభూతి. అనేకమంది శోభాయమాన ప్రదేశాలు ప్రతిరోజూ సందర్శిస్తూ ఛాయాచిత్రాలు తీస్తుంటారు. కాని, కొద్దిమంది మాత్రమే అద్భుతంగా చిత్రించటంలో సఫలీకృతులవుతారు. ఈ ప్రయత్నంలో విఫలమైన వారికి సైతం గొప్పగా చిత్రించాలనే తపన మాత్రం వుంటుంది వారిలో. సందర్శనాస్థలాలను చిత్రీకరించాలనే కోరిక వున్న ప్రతివారూ కూడా కొన్ని ముఖ్య విషయాలను మననం చేసుకోగలిగితే వారి ప్రయోజనం నెరవేరుతుంది.

1. ప్రతి ఒక్కరికీ వారు సందర్శించే ప్రదేశాల గురించిన విజ్ఞానం కలిగి వుండాలి. అంటే ఆ ప్రదేశపు నైసర్గిక లక్షణాలు, ఆయా ప్రాంతాల వృక్ష, జంతుసంపద, చారిత్రక నేపథ్యం, అక్కడి ప్రజలు, వారి సంస్కృతి గురించిన అవగాహన అవసరం. ఇది వారు తీయబోయే ఛాయాచిత్రరచనలో సక్రమ విధానానికి సహాయకారిగా వుంటుంది. అలాంటి సమాచారాన్ని సందర్శనామార్గదర్శి పుస్తకాల ద్వారా లేదా అంతర్జాలం నుండి స్వీకరించవచ్చు.

2. ఛాయా చిత్రీకరణ స్థలాల్లో వాటికవసరమైన పై లక్షణాలను



ఫోటో గ్రఫి

# మూడో కన్ను

ఫోటోగ్రఫీ అనేది ఒక కళ, కెమెరాచేతిలో ఉన్న ప్రతి ఒక్కరు ఫోటోగ్రాఫర్ కాలేరు.అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ తమ్మ శ్రీనివాస రెడ్డి గారు సుమతి పాఠకులకు ప్రతి నెల ఫోటోగ్రఫి లో మెలకువలు నేర్పనున్నారు.



వాస్తవరీతిలో ఎప్పుడూ మననం చేసుకోగలగాలి. అలా చేయగలిగినపుడు, మన ఛాయా చిత్రాలను వేరుగా విశదీకరించనవసరం వుండదు. ఆ చిత్రాలే సందేశాన్ని చక్కగా అందిస్తాయి.

3. ప్రాతఃకాల సమయం లేదా సాయం సంజె వేళలు ఆదర్శవంతమైన చక్కటి ఛాయాచిత్ర రచనకనువైన సమయాలు ఈ సమయాల్లోని లలితమైన వెలుగు ప్రసారాలు ఛాయాచిత్రాలకు పూర్తి వివరణలనందిస్తూ రంజనాత్మకంగా వుంటాయి. మధ్యాహ్నవేళల్లో గూడా మంచి వివరణలతో కూడిన చిత్రాలు సంతృప్తికరంగా తీయగలిగినా, అవి కొద్దిమందికి మాత్రమే, పరిమితంగా సఫలీకృతులవుతారు.

4. కొన్ని ప్రదేశాలలో డ్రోన్లు ఉపయోగించటం నిషేదం కావున ముందుగా ఆ విషయం తెలుసుకుని వాటిని ఉపయోగించాలి.

5. రాత్రిపూట ముఖ్యంగా వారణాసి మరియు తిరుపతిలాంటి క్షేత్రాలలో హారతి కార్యక్రమం మరియు వీధులలో ఊరేగింపులు లాంటివి జరిగే సమయంలో ప్రత్యేకంగా ఆకర్షణీయమైన విధంగా కొన్ని క్లోజప్లు మరియు కొన్ని ఛాయాచిత్రాలు అంతా కవర్ అయ్యేవిధంగా వైడ్ యాంగిల్స్ తీస్తే ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. 6. సాధారణంగా రంగులమయంలో దేవతామూర్తులుగాని, రాత్రివేళల్లో ప్రముఖ పర్యాటకప్రాంతాలు అన్ని



ఫోటో గ్రఫి

## మూడో కన్ను

అద్భుతమైన లైటింగ్ అలంకరణ జరుగుతాయి. సంధ్యాసమయంలో పూర్తిగా చీకటిరాక ముందే లైట్లు వేసి ఉంటే పగలు, రాత్రి.. మిళితం అయ్యేటట్లుగా చిత్రీకరిస్తే ఆకాశమంతా ఎంతో ఆహ్లాదంగా నీలిరంగుగా మారి ఫొటో చూడటానికి ఎంతగానో ఆకట్టుకునేవిధంగా ఉంటుంది.

7. సాధారణంగా భారతదేశంలో ఆగష్టుమాసం నుండి మార్చి చివరి వరకు ఉత్తరభారతదేశంలో ఏప్రియల్ మాసం వరకు రకరకాల పండుగలతో పట్టణాలు పల్లెలు కళకళలాడుతుంటాయి. గ్రామీణక్రీడలు, పట్టణాలలో వీధులలో అలంకరణలు 12 సం||లకు ఒకసారి జరిగే నదీ ఉత్సవాలు దసరా దీపావళి పండుగలకు ప్రత్యేక ఉత్సవాలను తీస్తే అది కూడా ఓ డాక్యుమెంటరీగా ఫొటోలు తీసి వాటిని ఓ ప్రత్యేక ప్రదర్శనకు సమకూరిస్తే ఎగ్జిబిషన్ తిలకించేవారు తదుపరి సంవత్సరం ఆవిధంగా తీసే ప్రయత్నంచేస్తారు.

8. మన ఛాయా చిత్రాలను నిరాడంబరంగా సమ్మేళనం చేయాలి. చిత్రీకరణలో వివిధ విషయాంశాలను జతచేయరాదు. ఒకటి, లేదా ఏవోకొన్ని విషయాంశాలను మన దృష్టిలో వుంచుకుని మన దృష్టిని కేంద్రీకరించాలి. మన దృష్టి మరల్చే కొన్ని వస్తువులు లేదా అంశాలు, అంటే విద్యుత్ స్తంభాలు, విసిరేసే వస్తువుల్లాంటి వాటిని మన చిత్రప్రతిమలకు అడ్డురాకుండా క్షణం (Click) చేయాలి. ఒక వ్యక్తిని లేదా ఒక నిర్మాణాన్ని (గుడిసె లేదా దేవాలయం లాంటి వాటిని) మనం చిత్రించే క్షేత్రస్థాయిల్లో నిక్షిప్తం జేయాలంటే, వాటిని చిత్రం యొక్క కేంద్రస్థానానికి పరిమితం చేయరాదు. వీటిని చిత్ర కేంద్రస్థానానికి దూరంగా వుంచాలి. అప్పుడే ఆ చిత్రానికి సమతుల్యత లభిస్తుంది. ఇంకా, సందర్శనాస్థలం యొక్క వైశాల్యం ఏకోన్ముఖంగా వుండాలి.

వీటన్నికంటే ముఖ్యంగా సమ్మేళనంలో తాజాదనం ఉట్టిపడాలి.


9. మనవద్ద సంపూర్తిగా ఛార్జింగ్ చేయబడిన బ్యాటరీలను సిద్ధంగా వుంచుకోవాలి. అందువలన సంక్షోభ సమయంలో మనల్ని నిరాశకు గురికాకుండా జేస్తుంది.

10. యాత్రాసమయంలో మనకు కెమేరా చాలా అవసరం; అందుకోసం అందుకు తగిన జాగ్రత్తను పాటించాలి. బాధ్యతారహిత ధోరణి మన సంవిధానాన్ని దెబ్బతీస్తుంది.

★★★



సంగీతం



# వెండి తెరపై వేణు గానాలు



డా.బెల్లంకొండ నాగేశ్వరరావు.

వేణువు, మురళి లేదా పిల్లనగ్రోవి ఒకరకమైన సంగీత వాద్యము. మానవుడు తొలిసారి కనుగొన్న వాద్య పరికరం ఇదేనేమో!

'ఒక వేణువు వినిపించెను అనురాగ గీతిక ' అని ఒకవి అంటే , ' వేయి వేణువులు మ్రోగేటి వేళ ' అన్నాడు మరోకవి.నిజమే వేణు గానం విని అందరం ఆనందించేవాళ్ళమే .

నలభై వేల సంవత్సరాలనాటి ఎముకలతో చేయబడిన వేణువు నియాండర్థల్ లుబ్జానాలోని నేషనల్ మ్యూజియం ఆఫ్ స్లోవేనియాలో ప్రముఖ ప్రజా ప్రదర్శనలోఉంది.

వాయిద్యాలలో వేణువుకు ప్రత్యేక స్థానం ఉంది. ఇది వాయిద్యాలలో పురాతనమైనది మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్కృతులలో కనిపించే ఏకైక సంగీత వాయిద్యం కూడా. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో పురావస్తు త్రవ్వకాలలో కనుగొనబడిన అనేక వేణువులలో, పురాతన వేణువు కనీసం 35,000 సంవత్సరాల నాటిదని చెప్పబడింది. రాబందు రెక్క ఎముకతో తయారు చేయబడిన, ఐదు రంధ్రాల వేణువు జర్మనీలోని ఉల్మ్‌లోని ఒక పూర్వ-చారిత్రక గుహలో కనుగొనబడింది. మానవ జాతి చరిత్రలో ఇది అత్యంత పురాతనమైన సంగీత వాయిద్యం అని కనుగొన్న శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. చైనా, సుమేరియా, భారతదేశం మరియు ఉత్తర అమెరికాలోని అనేక ఇతర పూర్వ-చారిత్రక వేణువులు కూడా కనుగొనబడ్డాయి.

ఇది కర్ణాటక, హిందూస్థానీ సంగీతాలలో ఉపయోగించే వాద్యపరికరం. బాగా ఆరబెట్టిన వెదురుతో తయారు చేస్తారు. ఊదేందుకు పీకలాంటివి ఉండని వాద్యపరికరం ఇది. ఈ వెదురు గొట్టాన్ని ఒకవైపు తెరిచి మరొక వైపు మూసి ఉంచుతారు. పై బాగాన గాలి ఊదేందుకు రంధ్రం ఉంటుంది. ఈ రంధ్రంతో పాటు స్వరాల మార్పుకొరకు, వేళ్ళతో మూసి తెరిచేందుకు కొన్నిట్లో మూడు మరికొన్నిట్లో ఎనిమిది రంద్రాలు కలిగి ఉంటాయి.




## సంగీతం

భారతీయ శాస్త్రీయ సంగీతంలో వెదురు వేణువు ఒక ముఖ్యమైన పరికరం. ఇది పాశ్చాత్య వేణువు కంటే భిన్నంగా, స్వతంత్రంగా అభివృద్ధి చెందింది. శ్రీకృష్ణుడిని సాంప్రదాయకంగా వేణుగాన లోలుడని అంటారు. పాశ్చాత్య వేణువులతో పోలిస్తే భారతీయ వేణువులు చాలా సరళమైనవి. అవి వెదురుతో తయారవుతాయి. వాటిని ట్యూణు చేసేందుకు చెవులేమీ ఉండవు. భారతీయ వేణువులలో రెండు ప్రధాన రకాలు ప్రస్తుతం ఉపయోగంలో ఉన్నాయి. మొదటిది, బాన్సురి. దీనిలో వేళ్ళ కోసం 6 రంధ్రాలు, ఒక ఊదే రంధ్రం ఉంటాయి. దీనిని ప్రధానంగా ఉత్తర భారతదేశంలోని హిందూస్థానీ సంగీతంలో ఉపయోగిస్తారు. రెండవది, వేణువు లేదా పిల్లనగ్రోవి. దీనికి ఎనిమిది వేళ్ళ రంధ్రాలుంటాయి. దక్షిణ భారతదేశంలోని కర్ణాటక సంగీతంలో ప్రధానంగా దీన్ని వాయిస్తారు. ప్రస్తుతం, క్రాస్-ఫింగరింగ్ టెక్నిక్‌తో ఎనిమిది రంధ్రాల వేణువు కర్ణాటక ఫ్లూటిస్టులలో చాలా సాధారణం. దీనికి ముందు, దక్షిణ భారత వేణువుకు ఏడు రంధ్రాలు మాత్రమే ఉండేవి. 20 వ శతాబ్దం ప్రారంభంలో పల్లడం శైలికి చెందిన శరభశాస్త్రి అభివృద్ధి చేసిన వేళ్ళ రంధ్రాల ప్రమాణంతో ఇవి ఉంటాయి వేణువు వెలువరించే శబ్ద నాణ్యత దానిని తయారు చేయడానికి ఉపయోగించే వెదురుపై కొంతవరకు ఆధారపడిఉంటుంది.

దక్షిణ భారతదేశంలోని నాగర్‌కోయిల్ ప్రాంతంలో ఉత్తమ వెదురు పెరుగుతుంది. భారతీయ నాట్య శాస్త్ర శరణ చతుష్టాయ్ ఆధారంగా, అవినాష్ బాలకృష్ణ పట్వర్ధన్ 1998 లో భారతీయ శాస్త్రీయ సంగీతంలో ప్రస్తుతం ఉన్న పది 'థాట్స్' కోసం కచ్చితంగా ట్యూన్ చేసిన వేణువులను ఉత్పత్తి చేసే పద్ధతిని అభివృద్ధి చేశాడు. వేణువును గుజరాతీలో పావో అని అంటారు.

మన పెద్దలు పిల్లలకు 'వేణు ''వేణుగోపాల్ 'అనిపేర్లు పెట్టడంకూడా మనకు తెలిసిందే!

మన సినిమాల్లో సందర్భోచితంగా వేణుగానాలు అనేకం వచ్చాయి. 'వేణు గానంబు వినిపించెనే 'సిరి సంపదలు. (1962)' వేణు గానలోలునిగన 'రెండు కుటుంబాల కథ. (1970)' తీయని వేణువు 'చింతామణి .(1956)'మౌనముగానీ మనసుపాడిన వేణుగానమును వింటినే 'గుండమ్మకథ. (1962) వాయించకోయి ముఇరళి 'వీర కంకణం. (1957)'నామది పిలిచింది 'ఆరాధన.( )'మురళి గానమిదేనా 'చింతామణి(1956 )'పిల్లనగ్రోవి పిలుపు' శ్రీకృష్ణ విజయం(1971 )'జయ జయ




గోకుల బాలా 'పాండురంగ మహత్యం .(1957)'రేపల్లె వేచెను 'శారద .(1973) వంటి చిత్రాలలో వేణువు గీతాలు చిత్రికరణ జరిగింది.

విశ్వనాధ గారి చిత్రాలలో ఎక్కువగా వేణు గానాలు వినిపిస్తూ ఉంటాయి . కథా నాయకులు వేణువును పలికించ టం లో నిష్ణనుతులై ఉంటారు .సప్తపది , సిరి వెన్నల తదితర చిత్రాలలో అద్భుతమైన పాటలు ఉన్నాయి .

అమెరిక అమ్మాయి (1976) చిత్రంలో "ఒక వేణువు వినిపించెను అనురాగ గీతికా.." అనే పాట 40 ఏళ్లగా శ్రోతలను ఉర్రుతలుగిస్తోంది అంటే వేణుగానానికి ఉన్న మహిమ అటువంటిది.

★★★

## యువత తెలుసుకో




# భయాన్ని వీడండి

మీ భవిత్తుకు ముఖ్యమైన అడ్డంకి మీలో వున్న భయం చాలా మంది ఓడిపోతామనే భయంతో బతుకులీడుస్తుంటారు. ఓటమి వెంటాడుతుంటే జీవితాన్ని సంతోషంగా ఆస్వాదించలేరు. మనసులో దాగివున్న అంతర్గత భయాలను వదిలించుకుంటే మీరు అనుకున్నది సాధించవచ్చు. ఎలాంటి భయాలు, ఆందోళనలు లేని వ్యక్తులే జీవితంలో విజేతలుగా నిలుస్తారు. భయాలను జయించాలంటే చేయాల్సింది ధైర్యంగా ముందుకెళ్ళడం. భయాన్ని సృష్టించే పరిస్థితులను ఎదిరించడం, తెలివిగా వాటిని అధిగమించడం, మీకు నీళ్ళంటే భయం? అయితే ధైర్యంగా ఈతనేర్చుకోండి. నలుగురిలో మాట్లాడాలంటే భయం. ఏ చిన్న అవకాశం వచ్చినా, ఎవరేమనుకున్నా లెజ్జచేయకుండా నిర్భయంగా మాట్లాడటానికి ప్రయత్నించండి.

భయం అంటే.... తప్పుడు ఊహలను వాస్తవాలుగా భ్రమించడం భయం అనేది కేవలం మనసులో జనించే ఒక నిరర్ధకమైన ఊహ మాత్రమే. దాన్ని పూర్తిగా వదించుకోవడానికి ప్రయత్నించండి. రోడ్డు మీద వెళు న్నప్పుడు ఒక కుక్క మిమ్మల్ని చూసి మొరుగుతుంది. మీరు దానికి భయపడి పరుగెడితే మీ వెంట పడుతుంది. అదే మీరు దానికి ఎదురుగా నిలబడి, ఒకరాయి తీసుకోండి అది తోక ముడుస్తుంది. ఈ సమాజం కూడా కుక్కలాంటిదే. మిమ్మల్ని భయపెట్టి లొంగదీసుకోవాలనుకుంటుంది. నిర్భయంగా ఎదురుతిరగండి.

చాలామంది భయాలకు భయపడి వాటికి దూరంగా పారిపోతుంటారు. మీరు ఎక్కడికి పారిపోయినా మీ చుట్టూ ఈ సమాజం వుంటుంది. భయపెట్టే వాళ్ళు వున్నంత వరకు భయాలు వుంటూనే వుంటాయి. మీరు పారిపోయే కొద్ది అతి విలువైన సమయాన్ని, జీవితాన్ని కోల్పోతున్నారు.

1990లో లండన్లోని లార్డు మైదానంలో భారత్, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ సిరీస్ జరుగుతోంది. మొదటి ఇన్నింగ్స్లో ఇంగ్లాండ్ నాలుగు వికెట్లకు 653 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. భారత్ 9 వికెట్లు కోల్పోయి 430 పరుగులు వద్ద వుంది. ఫాలోఆన్ని తప్పించాలంటే 24 పరుగులు చేయాలి. అప్పుడు కపిల్ మైదానంలో కొచ్చాడు. చేతిలో ఒకటే వికెట్. భారత జట్టులో భయం, ప్రేక్షకులో ఆందోళన అరుపులు. విపరీతమైన ఒత్తిడి కాని కపిల్కివేవి పట్టలేదు. నిర్భయంగా ఆటమీద దృష్టి పెట్టాడు. నాలుగు సిక్సులు బాదాడు. ఇలాంటి సంఘటనలెన్నో. ముఖ్యంగా భయాన్ని ఎదుర్కోవాలంటే స్పోర్ట్స్మన్ స్పిరిట్ కావాలి. ఆటగాడు ప్రతి ఆట గెలుస్తామనే ఆడతాడు. తన శక్తులన్నీ కేంద్రీకరిస్తాడు. ఒక్కోసారి విజయం సాధించకపోవచ్చు. అంతేకాని ఓడిపోతానని భయపడుతూ కూచుంటే అసలు ఆడలేడు.

జీవితం కూడా ఒక ఆటలాంటిదే. గెలుపు ఓటమి దైవాధీనం. ఓడిపోతామన్న భయం లేకుండా ఆడినప్పుడే గెలుపుకి దగ్గరౌతాము. అసూయ, ద్వేషం, అనవసరమైన విషయాలలో ఆసక్తివంటివి మన మీద మన నమ్మకాన్ని తగ్గిస్తాయి. గతంలోని అపజయాలు, ఎదురుదెబ్బలు, వైఫల్యాలు నిన్ను మరింత బలహీనుడ్ని చేస్తాయి. వాటి గురించి ఆలోచించకుండా ప్రస్తుత సమస్య మీదే దృష్టి సారిస్తే ముందుకు వెళ్ళగలవు.

ఒకళ్ళతో మనల్ని పోల్చుకోవటం, మన తప్పులను పెద్దవిగా చూడటం, నిరాశావాదంతో కృంగిపోవడం. ఇవి అన్ని నీలో భయాన్ని రేకెత్తిస్తాయి. సమస్య వచ్చినప్పుడు దాని మూలాలను అర్థం చేసుకుని ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూపోతే భయపడాల్సిన అవసరం ఉండదు. నీ ఆత్మబలం, ధైర్యం, నీ బలాలు. బలహీనతలు తెలుసుకున్నరోజు నీలో భయం ఎన్నటి ప్రవేశించదు.

భేతాళ భారతం

# ఊడలమర్రి ఉపన్యాసాలు -1



## రాజకీయ వేలం పాటలు

పట్టు వదలని విక్ర మార్కుడు భేతాలుడి కోసం మళ్ళీ మర్రి చెట్టు దగ్గరకు వచ్చాడు.

మర్రి చెట్టు మీద ఎక్కడా భేతాళుని జాడ కనపడ లేదు .

అక్కడే వున్న ఓ పిల్ల దెయ్యాన్ని వాకబు చేస్తే, స్మశానం మధ్యలో నున్న పాడు బడిన గుడి దగ్గరకి తీసుకెళ్ళాడు.

అప్పటికే అక్కడికి స్మశానం లో వున్న దెయ్యాలన్నీ గుంపులు గుంపులుగా చేరి గుస గుస లాడుకుంటున్నాయి.

విక్రమార్కుడ్ని చూడగానే, భేతాళుడు లేచి వచ్చి సాదరంగా ఆహ్వానం పలికి పక్కనే వున్న ఓ సమాధి మీద కూర్చోబెట్టాడు.

ఏమిటి భేతాళా విశేషం, దెయ్యలన్నీ ఇక్కడ పోగయ్యాయి, ఎవరైనా పోయారా?" ఆశ్చర్యపోతూ అడిగాడు

ఇప్పటికే చచ్చి దెయ్యాలమయ్యాం. మళ్ళీ మాకు వ్దావు ఎందుకుంటుంది రాజా?' ఎదురు ప్రశ్న వేశాడు.

"నిజమే కదా? " అని నాలుక కర్చుకుని, 'మరి ఇంతకీ విషయ మేమిటి? అన్నట్టు మొహం పెట్టాడు.

విక్రమార్కుడి అంతరంగం అర్ధమయిన వాడిలా ,

“రాజా మా భూతాల రాజ్యానికి మళ్ళీ ఎన్నికలొచ్చాయి. నీకు తెలుసు కదా, ఇక్కడ రెండు పార్టీలే వున్నా యి. ఒకటి నాది , రెండవది అద్దిగో ఆ జిని గాడిద్ "అంటూ జిని వంక చూపిస్తూ చెప్పుకొచ్చాడు. భేతాళుడు.

'ఇంకో రెండు మూడు పార్టీలున్నాయని విన్నానే” సందేహం వెలిబుచ్చాడు విక్రమార్కుడు.

“అ వుండటానికి వున్నాయిలే పిల్ల పిత్తిరిపార్టీలు ”

“పిల్లవో పెద్దవో .. ఎన్నికల్లో పాల్గొంటాయి కదా”

“ఏమో రాజా కాసేపు పాల్గొంటాం అంటాయి.కాసేపు విలీనం అంటాయి, వాళ్ళ మీద వేళ్ళకే నమ్మకం లేదు”

“సరే, ఇంతకీ ఏంటి మీ గోల” విక్రమార్కుడు విసుగ్గా అడిగాడు

“గోల ఏమిలేదు రాజా, ఎన్నికల్లో మేము నిలబడి కోట్లుకు కోట్లు ప్రచారలకు, ఓట్లు కొనుగోలుకు ఖర్చుపెట్టి ,వళ్ళు గుల్ల చేసుకునే కన్నా, ఎన్నికల్లో నిలబడే వాళ్లకు అంటే నాకు జిని గాడికి ,ఇద్దరికీ వేలం పాత పెడితే, ఇద్దరిలో ఎవరు ఎక్కువకు పాడుకుంటే వాళ్ళదే అధికారం. ఆ వేలం డబ్బుపెట్టి మా స్మశానాన్ని బాగు చేసుకుంటాము. ఏమంటావు “

భేతాళుడి ప్రతిపాదన విన్న మెదట ఆలోచనలో పడ్డాడు విక్రమార్కుడు

అదేలా కుదుర్తుంది , అది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం.” అంటూ పెద్దగా అరిచిందో పిల్ల దెయ్యం

భేతాళ భారతం

# ఊడలమర్రి ఉపన్యాసాలు -1

" మాకు లేని నొప్పి నీంకెదుకు నోర్ముయ్ "అంటూ ఆ పిల్ల దెయ్యం నోరు మూయించింది జిని భూతం

"ఆలోచిస్తే పిల్ల దెయ్యం చెప్పినదే నిజమనిపిస్తోంది. ఒక రకంగా ఇది డబ్బు పెట్టి కొనుక్కోవటమే కదా? ప్రజాస్వామ్యానికి విరుద్ధం కదా ?

" ఏది ప్రజాస్వామ్యానికి విరుద్ధం. మీరు మాత్రం వేలం పాటలు పెట్టుకుని అన్నీ కొనుక్కోవచ్చు. మేము మాత్రం చెయ్యకుడదా "విసుక్కున్నాడు భేతాలుడు

. " అవునవును సారా పాటల దగ్గర నుండి ఇళ్ళ స్థలాల వరకూ అన్నీ వేలం వేస్తున్నారు కదా? " వంత పాడాడు జిని

'అది ప్రభుత్వ వ్యాపారం, ఎవరు ఎక్కువకు పాడుకుంటే వాళ్ళకే వస్తాయి. లేకపోతే ప్రభుత్వం నష్ట పోతుంది కదా ?" జవాబిచ్చాడు. విక్రమార్కుడు

"మరి కేజి నుండి పిజి వరకూ, ఇంజనీరింగు, మెడికల్ 'సీట్లు అన్నీ వేలం వేస్తున్నారు. వాటి మాట" ఓ కుర్ర భూతం సందేహం

"అది ప్రైవేటు వ్యాపారం, మరి విశ్వవిద్యాలయాలు నడపటం అంటే మాటలా డబ్బులు కావద్దు?

'విక్ర మార్కుడు. " సమర్ధించాడు

"ఇసుక దగ్గర మంచి ఇనుప ఖనిజం వరకు వేలం వేస్తున్నారు. దానిమాటో" ఓ ముసలి దయ్యం నోరు విప్పింది.

"ప్రభుత్వ పథకాలకు డబ్బులు ఎక్కడనుంచి వస్తాయి. ఊరికే రావుగా మరి" విక్రమార్కుడి విశ్లేషణ



"మొన్న జరిగిన పంచాయితీ ఎన్నికల్లో ప్రెసిడెంటు గిరి కి వేలం పాటలు వేసారు కదా " ఉండ బట్టలేక అడిగాడు భేతాళుడు

"అవి వేలం పాటలు కావు, ఏకాగ్రీవాలు " తెలివిగా సమాధానం ఇచ్చాడు విక్రమార్కుడు.

'మీవేమో ఏక గ్రీవాలు, మావేమో వేలం పాటలు, ఇదెక్కడి న్యాయం

విక్రమార్క ?" నిల దేశాడు భేతాళుడు

"నిన్నటికి నిన్న మేనిఫెస్టోలు కూడా వేలం వేస్తున్నారు. మీ రాజకీయ నాయకులు మరోనిజం బయటపెట్టాడు.

"మానిఫెస్టో వేలం పాటలా ? "అర్ధం కానట్టు మొఖంపెట్టాడు విక్రమార్కుడు

"రాజా ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల ముందు మానిఫెస్టో ప్రకటించటం అనవాయితీ "చెప్పటం మొదలు పెట్టాడు జిని

"అందులో వింతేముంది " తెలిసిందే కదా అన్నట్టు చూసాడు. విక్రమార్కుడు

"చెప్పనివ్వు రాజా. ఒకరి మేనిఫెస్టో మరొకరు కాపీ కొట్టి. ఒకడు పదిస్తానంటే మరోడు ఇరవై ఇస్తాననటం వేలం పాటు కాక మరేమిటి ?" పూర్తి చేశాడు జిని

"కొద్దిగా అర్ధమయ్యేట్టు చెప్పండి " బుర్ర గోక్కుంటూ 'అడిగాడు విక్రమార్కుడు.

"ఈమాత్రం కూడా అర్ధం కాకుండా నువ్వు రాజువు ఎలా అయ్యావురా బాబు ??

# ఊడలమర్రి ఉపన్యాసాలు -1

వెక్కిరించింది ఓ పిల్ల దుతం.

"ఇష్, నోర్ముయ్యండి " అంటూ పిల్ల భూతాన్ని గదమాయించాడు భేతాళుడు

తనే మళ్ళీ కొనసాగిస్తూ

"రాజా పక్క రాష్ట్రం వాళ్ళు ప్రకటించిన మానిఫెస్టో తో అక్కడ విజయం వరించిందని ఓ పార్టీ దాన్ని మక్కికి మక్కీ కాపీ కొట్టి ఇక్కడ ప్రకటించారు.అవి చూపి ఇంకో పార్టీ దాన్నే కాపి కొట్టి, వాళ్ళు మూడవెలు ఇస్తానంటే , వీళ్ళు ఐదువెలిస్తామంటున్నారు. మరి ఇది వేలం పాటే కదా రాజ ? వివరంగా చెప్పాడు భేతాళుడు

"పైపెచ్చు, ఎసీలకి, ఫ్యాన్లకి ఇచ్చినట్టు గ్యారంటీ కార్డు కూడా ఇస్తున్నారు.'మరి కొంతమంది రాజకీయ నాయకులు ఇంటింటికి తిరిగి, వాళ్ళ కుటుంబాలకు ఎంత లబ్ది చేకూరుతుంది. అంత మొత్తానికి బాండ్లు రాసిస్తున్నారు " మరో దెయ్యం అరిచింది వెనుకనుంచి ఇంకా భూతం గొణిగింది.

" మనుషులకు, వాళ్ళ మాటలకే గ్యారెంటి లేనప్పుడు, వాళ్ళిచ్చే వాగ్దానాలకు గ్యారెంటి ఏముంటుంది లే వెక్కిరించాడు మరో భూతం

" రాజా మీ మనుషులు మాట మీద నిలబడరు కాని , మా భూతాలు మాత్రం మాట ఇచ్చాం అంటే మాత్రం , ఆరు నూరైన మాట తప్పం " అన్నాడు భేతాళుడు

" అందుకునే కదా నేను చాల సంవత్సరాలు అల్లాఉద్దీన్ కు కట్టుబడి ఉన్నాను " గతం గుర్తు చేసింది జిని

దెయ్యాల మాటలు విన్న తరువాత, విక్రమార్కుడికి ఏం జవాబు చెప్పాలో అర్ధం కాలేదు. మనుషుల కన్నా దెయ్యాలే నయమనిపిస్తున్నాయి అనుకుంటా మౌనంగా వుండిపోయాడు.

అదే సందని, దెయ్యాలన్నీ ఎగిరిపోయాయి చెట్టు కోటి పుట్టకోటిగా,

--అఘోరా

★★★

## జోక్స్&జోక్స్

చంటి: నాన్నా నేను చదువుకోను. నాకు చదువంటే ఇష్టం లేదు..

నాన్న: చదువుకోకుండా ఏం చేస్తావు మరి..

చంటి: ఏదో చిన్నాచితకా పనులు చేస్తా. వీలైతే బస్సు డ్రైవర్ అవుతాను

నాన్న: ఆ తర్వాత..

చంటి: కొన్ని రోజులకు బస్సులకు ఓనర్ అవుతాను. నా భార్యను కలెక్టర్‌ను చేస్తాను. ఎలాగైనా మీ పేరు మీద హాస్పిటల్ కట్టిస్తా నాన్నా..

నాన్న: యెదవ.. ఈరోజు మళ్లీ సూర్యవంశం సినిమా చూశావా ఏంటి?. తిక్కతిక్కగా మాట్లాడుతున్నావు..


# మహా కవుల మానస పుత్రులు

## బారిస్టరు పార్వతీశం



ఎంట్రన్స్ పరీక్షలో రెండవ తరగతిలో ఉత్తీర్నులవ్వటం వాళ్ళ ఎడింబరో విశ్వ విద్యాలయం లో సీతు దొరుకుతుంది .అక్కడే ఇండియన్ అసోసియేషన్ ఉందని తెలిసి, అక్కడకు తరచుగా వెళ్ళటం అలవాటు. చేసుకున్నాడు. అందులో 30 – 40 మంది తెలుగువాళ్ళు. నూనెకుడా ఉన్నారు . దానికి కార్యదర్శి గా దుగ్గిరాల గోపాలు కృష్ణయ్యగారు ఉన్నారు . అక్కడ జరిగే సభలు సమావేశాల్లో పాల్గొనటం వల్ల పార్వతీశం గోపాల కృష్ణయ్య గారికి దగ్గరయ్యాడు . విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్లు పాఠాలు ఉపన్యాసాల రూపంలో అద్భుతంగా చెప్పటంతో పార్వ తీశానికి చదవాల్సిన అవసరం లేకుండా పోయింది. మూడేళ్ల బారిష్టరు కోర్సుతో పాటు ఇతర గ్రంధాలు, సాంఘికి రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు సంబంధించినవి చదవటం నేర్చుకున్నాడు. సారస్వతానికి, కళలకు, తర్క శాస్త్రానికి సంబంధించినవి ఎక్కువగా చదివేవాడు. తాను బయలుదేరిన వళ మంచిది,అందువల్లే చదువులు చక్కగా సాగిపోతున్నాయి అవి సంతోషించాడు పార్వతీశం .కాని ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు.

]జర్మనీ ఫ్రాన్స్ మీద దాడి చెయ్యటంతో యద్ధం మొదలయ్యింది. యుద్ధం లోకి బ్రిటన్ కూడా పాల్గొనటంతో దేశంలోని వాతావరణం మొత్తం మారిపోయింది. దానితో ప్రజల జీవితాలన్నీ అతలాకుతులమై పోయాయి. ఏ 'క్షణాన ఏం జరుగుతుందోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుని బ్రతక సాగారు .




యుద్ధం మరింత ఎక్కువ కావడంతే దుగ్గిరాల గోపాల క్రిష్ణయ్య మనం మన దేశానికి వెళ్ళి పోతే బాగుంటుంది . నేను వేల్లిపోదమనుకుంటున్న మీలో ఎవరన్న అంతో వాచేట్టు అయితే రండి ,అని పిలుపు నిస్తాడు. బారిస్టరు పట్టాపుచ్చుకోవడంతో, తిరిగి స్వదేశానికి, బయలుదేరతాడు పార్వతీశం .

మూడు సంవత్సరాల తరువాత తిరిగి దేశంలో అడుగు పెట్టాడు పార్వతీశం, ఒక పక్క యుద్ధం జరుగుతుండగా ఏఅపాయం లేకుండా ప్రాణాలతో తిరిగిరావటంతో అందరు సంతోషించారు.. బొంబాయి నుండి రాయటంతోనే. హైదరాశారు, హైదరాబాదు , అక్కడినుండి బెజవాడ మీదుగా రైలులో నిడుదవోలు చేరుకుని అక్కడమంచి పడవలో మళ్ళీ నరసాపురం చేరుకుంటాడు .వర్సాపురం నుండి బండి కట్టించుకుని మొగలితుర్రు గ్రామంలోకి ప్రవేశించగానే, ఎవరో తాసిల్దారో , కలక్టరో వచ్చివుంటారని అందరూ అతని బండి వెంట పడతారు..

వీధిలో బండి ఆగిన చప్పుడు విని, తలుపుతీసి పార్వతీశం తల్లి ఆనందంతో నోట మాట లేకుంగా కన్నీరు కారుస్తూ నిలబడి పోయింది. పార్వతీశం కుడా ఇన్నాళ్ళకు తల్లిని చూడగానె. ఏడుపు తన్ను కొచ్చి, వలవల ఏచ్చేసాడు. వెనుకే వచ్చిన తండ్రి పర్వతీసాన్ని చూసి నిస్చేస్టుడై నిలబడిపోయాడు. ఒక నిమిషం తరువాత తేరుకుని అందరూ ఇంట్లోకి అడ్డగుపెడుతుండగా, బండి వాడు, వెనకాలే సామాన్లు తీసుకొచ్చి లోపల పెడతాడు.

మన
కథా
నాయకులు

# మహా కవుల మానస పుత్రులు

"నాయనా! క్షేమంగా వచ్చావా! దారి పొడుగునా ప్రమాదములూ భయపెట్టలేదుగదా. అటువంటిదేమీ జరగదనీ, పరమేశ్వరుడు మనయందు ఉన్నాడనీ నాకు దృఢవిశ్వాసం. అందుకనే స్థిరచిత్తంతో రోజులు లెక్క పెట్టుకుంటూ నీ రాకకు ఎదురుచూస్తున్నాను అన్నారు పార్వతీశం తండ్రి .

ఒక్క క్షణం అలాగే పుట్టి పెరిగిన ఆయింటి గోడలను చూస్తూ కూర్చున్నాదు పార్వతీశం ఎంతసేపో తెలియలేదు. తండ్రి దేవతార్చన పూర్తి కావస్తూ సూచనగా గణగణ గంట మ్రోగింది. పార్వతీశం ఉలిక్కిపడి మైకంలోనుంచి లేచినట్లు లేచి నిలబడ్డాడు. మూడేళ్ల క్రితం వరకూ ఎన్నోసార్లు విన్న మంత్రపుష్పం నేడు మళ్ళీ తండ్రి కంఠంలోంచి వెలువడుతూంటే ఒళ్ళు జలదరించింది. అప్రయత్నంగా చేతులు జోడించి నిలబడ్డాను. మంత్రపుష్పం పూర్తికాగానే, స్నానానికి బట్టలు విడిచి తువ్వాలు తీసుకొని చిన్నప్పుడు లేని అలవాటు ఇప్పుడు కొత్తగా వచ్చినది. సబ్బు కూడా తీసుకుని వంట ఇంటిలో నుంచి వెళ్ళవచ్చునో, వెళ్ళకూడదో అనని సందేహం కలిగి సావిడి పక్కనున్న సందులొ నుంచే నూతి దగ్గరకు వెళ్లాదు

మూడు సంవత్సరముల అలవాటయిన స్నానాలగది. స్నానాల తొట్టే, దిగంబర స్నానం. మరచిపోవలసివచ్చింది. ఒక్కక్షణం తటపటాయించి తువ్వాలు, అక్కడున్న దండెంమీద వేసి, సచేల స్నానం చేశాను. పూర్వపు అలవాటు జ్ఞాపకం వచ్చి, తువ్వాలు తడిపి మొలకు చుట్టుకుని పంచ. నీళ్ళలో జాడించి, అక్కడ దండెంమీద అర వేసి, లోపలకు వచ్చాడు.

భోజనానికి కూర్చోబోతుంటే 'నాయనా చొక్కా విప్పేసి కూర్చో' అన్నది చొక్కా విప్పబోతుంటే కొంచెం దగ్గరకు వచ్చి యజ్ఞోపవీతం ఉన్నదా? అని అతి రహస్యంగా అడిగింది. "ఉన్నదని" చెప్పాడు . భోజనం అయ్యేవరకూ నాక్కావలసినవన్నీ ఒకటికి పదిసార్లు అడుగుతూ, సావిడీ వంటింటి మధ్యన అమ్మ తిరుగుతూనే ఉన్నది.

ఉత్తరాపోశన కాగానే కన్నీటితో, రుద్ధకంఠంతో, "ఆ విస్తరి తీసేసే వీధిలో పారేయి నాయనా" అంది. తరువాత నే "నిక్కడ పేడ నీళ్ళు చల్లుతా కాస్త చేత్తో రాసేయ్ బాబూ. ఎంత దురవస్థ వచ్చింది నాయనా. ఈ నాడు నీచేత ఈ పనులు చేయించవలసి వచ్చింది. అవి ఎంతో వాపోయింది. పార్వతీశం నవ్వుతూ మెతుకులు ఎత్తేసి విస్తరి మడుస్తూ 'ఏవిటమ్మా? ఇదేదో నాకు కొత్తయినట్టు అలా బాధపడతా వెందుకూ! చిన్నప్పటి నుంచీ నీవు బయట చేరినప్పుడు ఎన్నిసార్లు చేయలేదీ పని ఆ అలవాటు మరచిపోలేదులే ఇంకా' అన్నాడు నవ్వుతూ. "మర్చిపోలేదు నాయనా ఇంకా జ్ఞాపకముందిరా పిచ్చినాన్న' అంటూ లాలనగా పెదవులపై హాసం చిందిస్తూ కంటతడి పెట్టుకుంటూనే అన్నది. ఇంతలో తండ్రి కూడా భోజనం ముగించుకుని ఇవతలకు వచ్చాడు. ఆయన కూడ పార్వతీశం కూర్చున్న బల్లమీదనె "కూర్చున్నారు. ఆయన కాళ్ళు పైన పెట్టుకొన్నారు. వారి కెదురుగా సాష్టాంగ నమస్కారం చేశాడు. "ఎందుకురా అబ్బాయీ? ఇప్పుడెందుకు?" అన్నారు పార్వతీశం లేచి నిలబడి కంపిత గాత్రంతో "నా అపరాధాన్ని మన్నించలేరా నాన్న! చేసినది అంత ఆకార్య కారణమా? విదేశాలలో విద్యనేరిస్తే యెంతో విజ్ఞానమూ నాగరికతా అబ్బుతుందనీ తరువాతను పెద్ద ఉద్యోగమై పెద్ద హోదాలోకి రావచ్చుననీ, కొందరు పెద్దలు పదేపదే చెప్పగా విని క్షణికోద్రేకంలో తొందరపడి వెళ్ళిపోయినాను అంటూ తండ్రిని క్షమాపణ వేడుకొంటాడు .

(ఇంకా ఉంది)

టెక్నాలజీ

# కృత్రిమ మేధా ఉపకరణాలు -3

## META-AI

పి. దేవకాంత్

మెటా సంస్థ టెక్స్ట్‌ని డిజిటల్ పెయింటింగ్ మార్చే కొత్త AI టూల్‌ని అందుబాటులోకి తీసుకొచ్చింది. జస్ట్ ప్రాంప్టింగ్ ఇస్తే, వెంటనే డిజిటల్ ఇమేజ్ ఇచ్చేస్తుంది ఈ టూల్. Meta AI అనేది మీరు ఒక వ్యక్తిలాగా ఇంటరాక్ట్ చేయగల కొత్త సహాయకుడు, WhatsApp, Messenger, Instagram లో ఇది అందుబాటులో ఉంది మరియు త్వరలో Ray-Ban Meta స్మార్ట్ గ్లాసెస్ మరియు క్వెస్ట్ 3కి అందుబాటులోకి వస్తుంది.

ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో అద్భుతాలు చేయొచ్చని ఇప్పటికే నిరూపించాయి టెక్ సంస్థలు. రకరకాల AIటూల్స్‌తో రకరకాల ఎమోజీలను, ఎక్స్‌ప్రెషన్స్‌ను క్రియేట్ చేసింది మెటా (Facebook)సంస్థ. ఇప్పుడు మరో కొత్త AI టూల్‌తో ముందుకొచ్చింది. దీని పేరు మేక్ ఏ సీన్ (Make a Scene). అంటే డిజిటల్ పెయింటింగ్ అన్నమాట. బ్రష్ పట్టుకోకుండానే క్షణాల్లో పెయింటింగ్ చేయొచ్చు. జస్ట్ మీరు అనుకున్నది ఊహించుకుని ప్రాంప్ట్ చేస్తే చాలు. చకచకా డిజిటల్ పెయింట్ సిద్ధమైపోతుంది. ఈ టూల్‌తో ఏకంగా స్టోరీబుక్స్‌నే క్రియేట్ చేసుకోవచ్చు అంటోంది మెటా సంస్థ. AI రీసెర్చ్‌ను ఈ టూల్ మరింత అడ్వాన్స్‌డ్‌గా మార్చుతుందని స్పష్టం చేస్తోంది. టెక్స్ట్ డిస్క్రిప్షన్‌ను ఇన్‌పుట్‌గా

ఇచ్చినా అందుకు సంబంధించిన పెయింట్ రెడీ అయిపోతుంది. అయితే...ఇక్కడో సమస్య ఉంది. మీరు చెప్పింది చెప్పినట్టుగా పెయింటింగ్‌లో కనపడకపోవచ్చు అంటోంది సంస్థ. ఊహకు కూడా అందని ఇన్‌పుట్ ఇచ్చిన సందర్భాల్లో ఇది అక్యురేట్‌గా పని చేయక పోవచ్చు. ఉదాహరణకు మీరు “మోటార్ సైకిల్‌పై గుర్రం” అనే ఇన్‌పుట్ ఇచ్చారనుకుందాం. అది ఏ మేరకు ఆ ఇన్‌పుట్‌ని పెయింటింగ్‌లా మార్చుతుందనేది చెప్పటం కష్టమే. కాకపోతే... భావాలను ఎక్స్‌ప్రెస్ చేయటానికి, మనం ఊహించుకున్నది ఇమేజ్ రూపంలో చూడాలనుకున్నప్పుడు గానీ...ఈ టూల్ బాగా ఉపయోగపడుతుంది.

ఇందులో పెయింటింగ్‌కు సంబంధించిన లే అవుట్‌లు కూడా ఉంటాయి. మనకు నచ్చిన కలర్స్‌ని ఇన్‌పుట్‌గా ఇచ్చుకోవచ్చు. ఈ టూల్ దానంతటఅదే లే అవుట్‌ను జనరేట్ చేయటమే కాకుండా, వాటిని అందంగా చూపిస్తుంది. ఈ మేక్ ఏ సీన్ టూల్ కేవలం ఆర్టిస్టులకే కాదు. అసలు పెయింటింగ్‌పై అవగాహన లేని వారి కోసం కూడా అంటోంది

మెటా సంస్థ. మెటా సంస్థ గతంలోనూ ఓ ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చింది. త్వరలోనే “మెటా అవతార్ స్టోర్స్“ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. అంటే మనరూపంలో ఉన్న ఓ మెటావర్స్అవతార్‌ను క్రియేట్ చేసుకుని మనకు ఏ ఫ్యాషన్ నప్పుతుందో చూసుకోవచ్చు. సింపుల్‌గా చెప్పాలంటే ఈ మెటా అవతార్ స్టోర్స్ డిజిటల్ డిజైనర్‌గా వర్క్ అవుతుందన్నమాట. ఇన్‌స్టాగ్రామ్ ఫ్యాషన్ పార్ట్‌నర్‌షిప్స్ వైస్ ప్రెసిడెంట్ ఎవా చెన్‌తో ఇన్‌స్టా లైవ్‌లో ఉన్న సమయంలో ఈ విషయం ప్రస్తావించారు జుకర్‌బర్గ్. ఫ్యాషన్ విషయంలో యువత ఏం కోరుకుంటోందో అదే వాళ్లకు చేరువ చేయాలని, ఈ మెటా అవతార్ స్టోర్స్ ద్వారా వాళ్లకు నచ్చిన ఔట్‌ఫిట్‌లను సెలెక్ట్ చేసుకునే అవకాశముంటుందని చెప్పారు. మెటావర్స్‌లో మనల్ని మనం కొత్తగా ఆవిష్కరించు కోవచ్చని అంటున్నారు జుకర్ బర్గ్. క్రియేటివ్ ఎకానమీని పెంచుకునేందుకు ఇలాంటి ఆలోచనలు ఎంతో ఉపకరిస్తాయంటూ ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు.

AI అసిస్టెంట్‌తో పాటు, Meta తన కొత్త స్మార్ట్ గ్లాసెస్‌ను కూడా లాంచ్ చేసింది, ఇది

టెక్నాలజీ

# ME-




రే-బాన్ సంస్థ సహకారంతో రూపొందించబడింది. ఈ కళ్ళ అద్దాలు సంగీతాన్ని ప్లే చేయగలవు, ఫోటోలను క్యాప్చర్ చేయగలవు మరియు వీడియోలను రికార్డ్ చేయగలవు. అలాగే, మీరు నేరుగా చూసే వాటిని Facebook మరియు Instagramలో లైవ్ ప్రసారం చేయగలవు. రికార్డింగ్ సమయంలో, లెన్స్ చుట్టూ పల్సేటింగ్ వైట్ లైట్ రికార్డింగ్ ప్రోగ్రెస్‌లో ఉందని సూచిస్తుంది.

ఈ Meta స్మార్ట్ గ్లాసెస్‌లో Meta AI కూడా అమర్చబడి ఉంటుంది మరియు మీరు “హే మెటా” అని చెప్పడం ద్వారా వర్చువల్ అసిస్టెంట్‌తో మాట్లాడవచ్చు.

★ ఈ స్మార్ట్ గ్లాసెస్ ధరించి మీరు చూసే ప్రతి దానిని ఫెస్ బుక్, ఇన్ స్టాగ్రాంలో లైవ్ స్ట్రీమింగ్ చేయవచ్చు.

★ ఈ స్మార్ట్ గ్లాసెస్ కు కెమెరా ఉంటుంది. ఫోటోలు తీయవచ్చు. వీడియోలు రికార్డు చేయవచ్చు.

★ మ్యూజిక్ కూడా ప్లే చేయవచ్చు.

★ ఈ స్మార్ట్ గ్లాసెస్ లో మెటా ఏఐ అసిస్టెంట్ ఉంటుంది. దీని ద్వారా మీరు వాట్సాప్, మెసెంజర్ లో ఇతరులతో ఇంటరాక్ట్ కావచ్చు. బ్రౌసింగ్ కూడా చేసుకోవచ్చు. మెటా ఏఐ అసిస్టెంట్ మీకు అవసరమైన సాయాన్ని అందిస్తుంది.

★ మెటా ఏఐ సాయాన్ని పొందాలనుకుంటే ‘హే మెటా’ అంటే సరిపోతుంది. మీ వాయిస్ ద్వారా సంభాషణలు కొనసాగించవచ్చు. మీరు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు పొందవచ్చు.

★ ఈ స్మార్ట్ గ్లాసెస్ లో 12 మెగా పిక్సెల్ అల్ట్రావైడ్ కెమెరాను ఉపయోగించారు.

★ క్వాల్కామ్ స్నాప్ డ్రాగన్ ఏఆర్ 1 ప్లాట్ ఫారంను ఉపయోగించడం వల్ల ఫొటోలు, వీడియోలో మంచి క్లారిటీతో వస్తాయి.

★ ఈ స్మార్ట్ గ్లాసెస్ తో పాటు ఛార్జింగ్ కేస్ వస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 36 గంటల వరకు ఉపయోగించుకోవచ్చు.


★ మటె బ్లాక్, షైనీ బ్లాక్ కలర్స్ తోపాటు జీన్స్, రెబల్ బ్లాక్, కారామెల్ ట్రాన్సపరెంట్ రంగుల్లో స్మార్ట్ గ్లాసెస్ అందుబాటులో ఉంటాయి.

★ 150 రకాలకు పైగా కస్టమ్ ఫ్రేమ్స్, లెన్స్ కాంబినేషన్లు ఉన్నట్లు మెటా పేర్కొంది.



# కార్టూన్స్

## నవ్వండి ప్లీజ్!


















# జీవన చిత్రాలు

## సురేఖ యాదవ్ మహిళా లోకో




ఆసియా తొలి మహిళా లోకో పైలట్ సురేఖ యాదవ్ మరో రికార్డును సొంతం చేసుకున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన సెమీ-హై స్పీడ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడిపిన తొలి మహిళగా నిలిచారు.

అవకాశం ఇచ్చి చూడు మగువ తనని తాను ఆవిష్కరించుకుంటుంది.. చరిత్రలో తనకంటూ ఓ పేజీని లిఖించుకుంటుంది. తాజాగా ఆసియాలోనే తొలి మహిళా లోకో డ్రైవర్ సురేఖ యాదవ్ రికార్డ్ సృష్టించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్మాత్మకంగా ప్రారంభించిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హైస్పీడ్ రైలును సురేఖ యాదవ్ అనే మహిళా లోకోపైలట్ నడిపి రికార్డు నెలకొల్పారు. ఈ రైలు నడిపి తొలి మహిళా లోకోపైలట్‌గా నిలిచారు. సోలాపూర్ స్టేషన్ నుంచి ముంబయి ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్ వరకు దాదాపు 450 కి.మీ దూరం ఆమె ఎక్స్‌ప్రెస్‌ను నడిపారు. షెడ్యూల్ టైమ్ కంటే 5 నిమిషాలు ముందుగానే రైలును గమ్యస్థలానికి చేర్చారని కేంద్ర రైల్వే శాఖ తెలిపింది.

ఈ ఘనత సాధించిన సురేఖ యాదవ్ ను ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌లో తోటి రైలు డ్రైవర్లు సత్కరించారు. 2023 మార్చి 13న షోలాపూర్-CSMT వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును మహిళా లోకో పైలట్ నడిపారు. దీంతో దేశంలో మాత్రమే కాదు ఆసియాలోనే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ను సక్సెస్ ఫుల్ గా నడిపిన మొదటి మహిళా పైలట్‌గా అవతరించారుసురేఖ.

సురేఖ యాదవ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా విద్యనభ్యసించారు. సెంట్రల్ రైల్వేలో ఉద్యోగంలో చేరారు. సురేఖను అత్యాధునిక వందే భారత్ రైలు డ్రైవింగ్ చేసిన మొదటి అనుభవం గురించి అడిగినప్పుడు, “వందే భారత్ సెమీ హైస్పీడ్ రైలు, అధునాతన సాంకేతికతతో కూడిన రైలు, కాబట్టి సాంప్రదాయ రైళ్లతో పోలిస్తే మరింత అప్రమత్తత అవసరం” అని అన్నారు. వందే భారత్ రైలులో డ్రైవర్‌గా చేరడానికి ముందు.. ఆమె ఫిబ్రవరి 2023లో వడోదర రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణను తీసుకున్నారు.

1986 సంవత్సరంలో, ఆమె రైల్వేలో ఇంటర్వ్యూ కోసం వెళ్లిన సురేఖ యాదవ్ సెలక్టయ్యారు. కళ్యాణ్ ట్రైనింగ్ స్కూల్‌లో ట్రైనీ అసిస్టెంట్ డ్రైవర్‌గా నియమితులైన ఆమె అక్కడ ఆరు నెలల పాటు శిక్షణ పొందింది. 1989 నాటికి, ఆమె పూర్తి స్థాయి రైలు డ్రైవర్‌గా మారింది. మరియు ఆమె భారతదేశంలో రైలు నడిపిన మొట్టమొదటి మహిళగా నిలిచింది. 1998 సంవత్సరం నుంచి ఆమె గూడ్స్ రైలు డ్రైవర్‌గా నియమితులయ్యారు. ఆమె పదేళ్లకు పైగా గూడ్స్ రైలు డ్రైవర్‌గా పనిచేసింది. ఆ తర్వాత 2010లో వెస్ట్రన్ ఘాట్ రైల్వే

లైన్ కోసం రైళ్లను నడపడానికి ఆమెకు శిక్షణ ఇచ్చారు. ఇది ఆమెకు సవాలుతో కూడుకున్న పని. ఆమెకు 'ఘాట్ లోకో' డ్రైవర్‌గా బాధ్యతలు అప్పగించారు. ఇంతకు ముందు ఏ మహిళలకు కూడా ఆ పదవి ఇవ్వలేదు, కాబట్టి కొంతమంది అధికారులు ఆమె సామర్థ్యాలను అనుమానించారు. తరువాత 'ఘాట్ లోకో' డ్రైవర్‌గా నియమించారు. 2011 నాటికి, ఆమె ఎక్స్‌ప్రెస్ మెయిల్ డ్రైవర్‌గా పదోన్నతి పొందింది. ఆమె 2011లో కూడా కళ్యాణ్‌లోని డ్రైవర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో బోధించడం ప్రారంభించింది.8 మార్చి 2011న, ఆమె 'డెక్కన్ క్వీన్'ను పూణె నుండి CSTకి నడిపింది మరియు ఆసియాలో మొదటి మహిళా రైలు డ్రైవర్‌గా నిలిచింది. సురేఖ అత్యంత నైపుణ్యం గల రైలు డ్రైవర్‌లలో ఒకరిగా ఖ్యాతిగాంచారు. అయితే సురేఖ కారు డ్రైవింగ్‌లో లేదా ద్విచక్ర వాహనం నడపడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. అయితే ఇదే విషయంపై సురేఖ యాదవ్ ను ఎవరైనా అడిగితే తాను.. "పురుషులు చేయగలిగినవన్నీ చేయగలనని ఖచ్చితంగా అనుకుంటున్నాను.. అయితే ఇంతవరకు కారు లేదా బైక్ నడపడానికి ప్రయత్నించలేదు ఎందుకంటే నేను వాటిని డ్రైవ్ చేయాల్సిన అవసరం అనిపించలేదన్నారు సురేఖ.

# ప్లాస్టిక్ పలకరింపులు

**కొమ్ముల వెంకట సూర్యనారాయణ**

వెతికాను అనుబంధాల
తనూలతలకై

కనిపించాయి వృద్ధాశ్రమ
ఊచలకు అతుక్కుని

వెతికాను ఉగాది
ఉషస్సులు,కోయిల రాగాలకై

దొరికాయి చరవాణిలో

సందేశాల సరాగాల రూపంలో

పరితపించా పక్షుల
కిలకిలరావాలకై

చేరాయి చరవాణి రింగ్ టోన్ ల
రూపంలో

వెతికాను కడసారి చూపులకై

కనిపించాయి ఆర్.ఐ.పి ల
రూపంలో

వెతికాను ప్రతిచోట ఆత్మీయ
స్పర్శకై

కనిపించాయి వెంటిలేటర్స్
కరచాలనం చేస్తూ

వెతికాను పల్లెలో పండుగ
సంబరాలకై

కనిపించాయి చరవాణిలో
శరపరంపర గా

వెతికాను అమ్మ,నాన్న అనే
పిలుపులను

కనిపించాయి అంతరించిపోతున్న
పదాల నిఘంటువులో

వెతుకుతూనే ఉన్నా.... ఆత్మీయ
పలకరింపులకై

కనిపిస్తున్నాయి ప్లాస్టిక్
పలకరింపులే దారి పొడవునా

దారితీస్తున్నాయి డాలర్లకై

వలస విహంగ పక్షులు

పలకరిస్తున్నాయి

నిస్తంత్రి రూపంలో నిస్తేజంగా

ఎవరిని పలకరించినా అద్భుతమైన
నటన

ఫ్రాయిడ్ రక్షకతంత్రాలను

ఒంటినిండా కప్పుకుని

**బహుమతి పొందిన కథ**

# ఆశ..దోశ..అప్పడం

హాస్య కథ



**పెనుమాక నాగేశ్వరరావు**

"అదికాదే ఎక్కడికి వెళ్ళినా నిన్నూ పిల్లల్నీ సామాన్ని, ఆ బండి మీదే కుక్కేసి తిరక్కపోతే సుబ్బరంగా ఓ కారు కొనమనరాదుటే మీ ఆయన్ని" ఫోనులో అడిగింది జానకమ్మ

"అమ్మా నీకు దండం పెడతా ఆ మాట ఎత్తకు. కొంపదీసి రేపు మేము పండక్కి వచ్చినప్పుడు నువ్వు కానీ, నాన్న కానీ ఆ వూసే ఎత్తదు. ఒకవేళ మీరు ఆ మాట ఆయనతో అనేశారే అనుకో, ఇక ఇంటికి వచ్చినప్పటినుంచీ నా ప్రాణం తోడేస్తాడు నేను సగం ఇస్తాను, మీ నాయన్ని సగం ఇమ్మను, కారు కొనేద్దాం అంటూ నన్ను వేధిస్తాడే. ఇప్పటికే రెండు మూడు సార్లు అన్నాడు కూడా. అందుకే ఆ కారు మాట మీరు ఎత్తనేవద్దు" ఆవేశం, ఆవేదనా వున్నా అభ్యర్ధనగా అడిగింది తల్లిని శశికళ.

"బాగుంది సంబడం. ముక్కు కారుతున్నదంటే తుడవమన్నట్లుంది మీ ఆయన వాలకం. సరే నాకెందుకు వచ్చిన గొడవలే, మీ తిప్పలేవో మీరు పడండి. పండుగ రోజు కాకుండా ఓ రెండు రోజులు ముందే ఇక్కడ వుండేటట్లు రండి. మీ నాన్న కూడా అదే చెప్పమన్నాడు. నువ్వు అన్నీ డ్రెస్సులే కాకుండా ఓ రెండో మూడో చీరెలు కూడా తెచ్చుకో. ఊళ్ళో ఎవరైనా పిల్లలు, బొమ్మలు పెట్టుకున్నారంటూ పేరంటం పిలిస్తే వెళ్ళేందుకు వుంటై. మర్చిపోకు" హెచ్చరింపుగా అన్నది జానకమ్మ

"అలాగే ఉంటా మరి" అని ఫోన్ పెట్టేసి మరో సారి కాఫీ కలుపుకునేందుకు వంటగదిలోకి నడిచింది అవునే ఈ సారి మీ నాన్నని నాకో మాంచి ఫోన్ కొనిపెట్టమని నువ్వే ఓ సలహా ఈరాదూ !. ఎప్పుడూ బట్ట లేనా ? అయినా బీరువా నిండా బట్టలేగా, ఏమంటావ్" అడిగాడు విష్ణుమూర్తి భార్యను

"వాళ్ళు సంతోషం కొద్దీ ఏది ఇస్తే అది తీసుకోవటమే గానీ, నాకు గాజులు కొనీయండి. మా ఆయనకు సెల్ కొనీయండి మా పిల్లలకు గొలుసులు చేయించండి అని అడగటం నాకు ఇష్టం వుండదండి" పెట్టె సర్దుతూ భర్తకి సమాధానం చెప్పింది శశికళ.

"నీకు ఆ మాత్రం తెలివే వుంటే నాకీ తిప్పలెందుకూ.... సర్లే గానీ ఆ బ్యాగు ఇటు నెట్టు నేను కూడా సర్దుతా" అంటూ ఆమె పక్కనే కూర్చున్నాడు.

"మీ సర్దుడు తిరుగు ప్రయాణం లో కదా" అంటూ భర్త వైపు అదోరకంగా చూసింది శ సికళ

"అవునవును మీ నాయన ఇచ్చే లచ్చల కొద్దీ డబ్బు మూటలు సర్దటానికి నీకు సాయం చేయొద్దూ"వ్యంగ్యంగా అన్నాడు విష్ణుమూర్తి

"అవును మా నాన్నకు నువ్వొక్కడివే.

బహుమతి పొందిన కథ

# ఆశ..దోశ..అప్పడం

నీకు రేపు ఇద్దరు అల్లుళ్లు వస్తారు. ఆ సంగతి ఆలోచించుకో ముందు. చెరోపక్క చేరి నీ లాగే అది కొనివ్వు, ఇది కొనివ్వు అని పీక్కుతింటారు జాగ్రత్త"

"అంటే ఏంటే నీ ఉద్దేశం. నేను మీ నాయన్ని పీక్కుతింటున్నానా? పీల్చి పిప్పిచేస్తున్నానా!. మీ నాయన్ని చూడు నిండు బస్తాలా వస్తాడు లా వున్నాడు. ఆయన్ని నేనేం పీక్కు తినటంలా, అయినా ఇవన్నీ నీ మాటలా, మీ వాళ్ళు అనుకునే మాటలా నిజం చెప్పు".

"అయ్యో వాళ్ళు ఇలాంటి మాటలు కూడా మాట్లాడతారా పాపం. అల్లుడు గారంటే వాళ్ళిద్దరికీ బోలెడంత ఇష్టం. పైగా మీ ముందే నన్ను ఎన్నిసార్లు కోప్పడలేదూ మా అమ్మా,నాన్నా, మిమ్మల్నే వెనకేసుకొస్తుంటారుగా " రుసరుసలాడింది. ఎందుకైనా మంచిదనుకుని పిసరంత తగ్గేడు విష్ణుమూర్తి.

అంతలోనే పిల్లలిద్దరూ ఆటలు ముగించి తినటానికి ఏమైనా పెట్టమని వాళ్ళ అమ్మని అడుగుతూ పెట్టె సర్దనీయకుండా అడ్డం పడ్డారు.

"అయ్యో కూతుళ్ళకి ఎప్పుడూ తినే పనే. పదండి వంటగదిలోకి " అంటూ అక్కడినుంచి లేచివెళ్లింది.

వెనకాలే వెళ్ళిన విష్ణుమూర్తి "ఇదిగో రేపు తిరుగు ప్రయాణం లో తినటానికి తీపి వస్తువులతోపాటు కాసిని కారం తగిలేటట్లు ఏమైనా చేసి ఇవ్వమను మీ అమ్మని. పిల్లలు నాలుగు రోజులు తింటారు పాపం" అన్నాడు

"మీరు తినరా పాపం" అంటూనే డబ్బా మూత తెరిచి చేగోడీలు పళ్ళెంలో పోసి భర్తకి అందించింది.పిల్లలిద్దరూ చెరో ప్లేటు తీసుకుని వెళ్ళి టీ.వీ ముందు కూర్చుండిపోయారు.

"ఇదిగో నా బట్టలు ఎక్కువ పెట్టకు. ఓ రెండు లుంగీలు, బనీన్లు, ఓ టవలు అంతే. నేను వేసుకుని వచ్చే పేంటు,షర్టు మీ ఇంటికి వెళ్ళగానే విప్పి వంకెకి తగిలిస్తే, మళ్ళీ వచ్చేటప్పుడు వంకెనుండి తీసి వంటికి తగిలించుకోవటం బయలుదేరటం అంతే. అక్కడున్న నాలుగు రోజులూ అత్తయ్య గారు ఏమేం చేసి పెడితే అవి సుష్టుగా లాగించేయటం, మంచానికి ఈ శరీరాన్ని అప్పచెప్పటం అంతే నా పని."

"అవునుగానీ సెల్ ఫోన్ విషయం మర్చిపోకు. అక్కడికి వెళ్ళాక తడవ తడవకీ నీకు గుర్తుచేయటం బాగుండదు. " అని కిసుక్కున నవ్వేసి హాల్లోకి వెళ్లిపోయాడు విష్ణుమూర్తి. విస్తుబోయి భర్తనే చూస్తూ నిలుచుండిపోయింది శశికళ.

మనవరాళ్ళిద్దరినీ చెరోకళ్లూ బండి మీదనుంచే తీసుకుని ఎత్తుకున్నారు. ముద్దులతో ముంచెత్తారు. అమ్మమ్మా తాతయ్యా. బండి దిగి కాళ్ళు కడుక్కుని లోపలికి నడిచాడు విష్ణుమూర్తి వెనకనే శ శికళ.ఉభయకుశలోపరి పూర్తయ్యింది. వేడివేడి కాజా, ఉల్లి పకోడీ నిండుగా పెట్టిన ప్లేటు అందుకున్నాడు విష్ణుమూర్తి పిల్లలిద్దరూ అమ్మమ్మ తో పాటు వంటగదిలోకి పరుగెత్తారు.

మామా అల్లుళ్లు మాటల్లో పడ్డారు. పంటల గురించి, దిగుబడిగురించి కాసేపు కబుర్లు చెప్పాడు. మామగారు. అటుతర్వాత కాసేపు రాజకీయాలు, అటుతర్వాత ధరల పెరుగుదల, అసెంబ్లీ లో రా.నా.ల భాష,వగైరాల గురించి మాట్లాడుకుంటూనే ప్లేట్లు ఖాళీ చేసి, కాఫీ కప్పులు కూడా ఖాళీ చేసి కాసేపు నడుం వాల్చాడు విష్ణుమూర్తి షికారుగా బయటకు నడిచాడు మామగారు గురుమూర్తి.

గురుమూర్తి, జానకమ్మ లది ఆదర్శ దాంపత్యం. ఆలుమగలిద్దరూ ఒక మాట మీద, ఒకే ఆలోచన మీద సంసార సాగరాన్ని ఈదుకొస్తున్నారు. శశికళ, వంశీధర్ ఇద్దరు పిల్లలూ, అమ్మానాన్నల పట్ల ప్రేమాభిమానాలతో మెలుగుతుంటారు. అబ్బాయి

బహుమతి పొందిన కథ

# ఆశ..దోశ..అప్పడం

వంశీధర్ అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం. కోడలు కూడా అక్కడే ఉద్యోగం చేస్తున్నది. వాళ్ళకి ఓ మగ పిల్లవాడు. మూడేళ్ళకో, నాలుగేళ్ళకో ఓ సారి తల్లితండ్రుల్ని చూసి వెళుతుంటారు. వచ్చిన ప్రతిసారి ఓ నెల రోజులు ఇక్కడే వుండి వెళుతుంటారు. ఆర్ధికంగా వెతుక్కోవాల్సిన పని లేదు గురుమూర్తికి కూతురు శశికళ,అల్లుడు విష్ణుమూర్తి, దగ్గర్లోని పల్లెలో వుంటారు. అల్లుడు గవర్నమెంటు ఉద్యోగి. కూతురు ఇంటిపట్టూనే వుంటుంది. పిల్లలిద్దరూ ఎలిమెంటరీ చదువుల్లో వున్నారు. పండుగలకు, వేడుకలకూ కుటుంబసమేతంగా పుట్టింటికి వచ్చివెళుతుంటుంది శశికళ కొడుకు ఎటూ దూరాన వున్నాడు, కూతురయినా తమకు దగ్గర్లో వున్నదని ధైర్యంగా, సంతోషంగా వుంటారు గురుమూర్తి దంపతులు.

అన్నీ బాగానే వున్నె కానీ అల్లుడు నోరు కాస్త పెద్దది. తినే విషయంలోనేలే పాపం )మనసు కొంచం చిన్నది. ఆశ ఎక్కువ. అలాగని కూతుర్ని కష్టపెట్టడు. కానీ పుట్టిటినుంచి ఇంకా ఇంకా ఏవేవో తీసుకురమ్మని నస పెట్టటం ఒక్కటే శశికళ కు ఇష్టం వుండదు. ఆశకు హద్దు వుండాలంటుంది. ఆశించటం తప్పుకాదు కానీ, హద్దులో వుండాలనేది ఆమె అభిప్రాయం. అందుకు విరుద్దం విష్ణుమూర్తి.

ఉన్నది కాబట్టి ఇస్తున్నారు. ఇవ్వగలరు కాబట్టి అడుగుతున్నాం....ఇదీ అతగాడి వాదన. వుంటే మనకి ఇవ్వాలని వుందా? మనకున్నది మనకి చాలదా ? అయినా ఎంత ఇస్తే మనకి తృప్తి? అని అడుగుతుంటుంది ఆమె. అప్పటికి మవునమే అతగాడి సమాధానం. అటుతర్వాత షరా మామూలే.

అందుకే విష్ణుమూర్తి ధోరణికి అందరూ అలవాటుపడ్డారు. అతగాడు ఏం మాట్లాడినా, తాను ఇవ్వదలుచుకున్నదేదో ఇచ్చే పంపుతుంటాడు గురుమూర్తి అడ్డు చెప్పదు జానకమ్మ.

"ఇదిగో శశీ అత్తయ్యని చేపల పులుసు చెయ్యమని చెప్పవే... చాలా రోజులయ్యింది ఆమె చేతి చేపల పులుసు తిని. ఎంత బాగా చేస్తుందో ..అబ్బ తలుచుకుంటేనే నోట్లో నీళ్లూరుతున్నయ్యే ..

"చాల్లే వూరుకోండి. కడుపుతో వున్న ఆడపిల్ల లాగా ఏమిటా కోరికలూ" మందలింపుగా అన్నది శశికళ

"ఏంటే ఏదో ముచ్చటపడి అడిగితే ఎగతాళి చేస్తున్నావ్..... నువ్వు చెప్పలేదనుకో, నేనే అడుగుతా అత్తయ్యని, నాకేం కొత్త, " అంటూ మంచం మీదనుంచి లేచే ప్రయత్నం చేశాడు విష్ణుమూర్తి

"మీరు లేవకండి, నేనే చెబుతా. ఇవ్వాళ కాకపోతే రేపు.. సరేనా" భర్తని ఒప్పించేందుకు సతమతమైపోయింది శశికళ,

అలా అక్కడున్న నాలుగు రోజులు జానకమ్మ చేసిపెట్టిన రకరకాల నాన్ వెజ్ పదార్థాలన్నీ లొట్టలేసుకుంటూ తినేశాడు విష్ణుమూర్తి. తినేటప్పుడు అత్తగారిని పొగడ్డలతో ముంచేస్తాడు. ఆమె అల్లుడి మాటలకి ఉబ్బితబ్బిబ్బైపోతుంటుంది. అల్లుడు అడిగినవీ, అడగనివి కూడా చేసి పెడుతుంటుంది జానకమ్మ. తల్లి అలా ఒళ్ళు హూనం చేసుకుని వైనవైనాలుగా చేసి పెట్టటం కొంచం బాధగా వుంటుంది శశికళ కి. అయినా తల్లిని వారించలేక మిన్నకుండిపోతుంటుంది.

"నీ చేతి వంట తిని నోరు చవి చేడింది నాలుగు రోజులు సెలవ పెడతా వుండు. అత్తయ్య వాళ్ళింటికి వెళ్ళి ఆమె చేతి వంట తింటేనే గానీ నేను కొంచం కోలుకొను" అంటూ వేళాకోళం ఆడుతుంటాడు అప్పుడప్పుడు భార్యతో విష్ణుమూర్తి.

"నేను రాలేను గాని, మీరు వెళ్ళి నాలుగు రోజులు కాకపోతే పది రోజులు వుండి తిని రండి. నేను మాత్రం మా అమ్మలా రకరకాలు చేసి పెట్టలేను అనక మీ ఇష్టం" అంటూ దెప్పిపొడుస్తుంది శశికళ.

**బహుమతి పొందిన కథ**




“శశీ ఎల్లుండేగా మన ప్రయాణం. నా సెల్ ఫోన్ సంగతి చెప్పావా మీ నాయనకి “ రహస్యంగా అడిగాడు విష్ణుమూర్తి

సరిగ్గా అదే సమయానికి “ఏమ్మా శశీ అలా బజారు వెళ్ళి వద్దాం రండమ్మా.. మీకు పిల్లలకీ, మీ అమ్మకీ బట్టలు కొనుక్కుని వద్దాం” అంటూ ఆ గదిలోకి వచ్చాడు గురుమూర్తి.

“ఇంటినిండా బట్టలే మామయ్యా...ఎందుకు ఎప్పుడూ బట్టలు” అన్న విష్ణుమూర్తి మాటల్లో అర్థం ఒక్క శశికళ అర్థం అయ్యింది.

“భలేవాడివే అల్లుడూ... పండుగకు ఇంటికి వచ్చిన పిల్లలకి బట్టలు కొనకుండానా....మీ అత్తయ్య నన్ను బతకనిస్తుందా. అయినా మీకు లేవనా నేను కొనటం పదండి పదండి.” అంటూ హాల్లోకి నడిచాడాయన.

సెల్ ఫోన్ అడగమంటూ సైగలు చేశాడు భార్యతో విష్ణుమూర్తి

ఎంత ప్రయత్నం చేసినా అడగటానికి నోరు రాలేదు శశికళకి . అలా బజారు వెళ్ళి అందరికీ బట్టలు కొనుక్కుని వచ్చారు. పిల్లలిద్దరూ కొత్త బట్టలు చూసుకుంటూ మురిసిపోసాగారు.

మర్నాడు పొద్దున్నే కందులు, మినిములు, పెసలు, కాసిని గోధుమలు వగైరాలన్నీ మూట లు కట్టి సిద్ధం చేశాడు గురుమూర్తి. తాను చేసిన స్వీట్లు, జంతికలు చేగోడీలు,చెక్కలు వగైరా తినుబండారాలు జాగ్రత్తగా డబ్బాల్లో సర్ది ఓ సంచి తయారుచేసింది జానకమ్మ.

బండికి ఏ మూటలు ఎక్కడ పెట్టాలో, ఏ సంచీ ఎక్కడ తగిలిస్తే అనుకూలంగా వుంటుందో బాగా తెలిసిన విష్ణుమూర్తి అన్నీ సక్రమంగా సర్దుకున్నాడు. పిల్లలూ, భార్య కూర్చోటానికి ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాడు. క్రితం రోజునే మామగారు ట్యాంకు నిండా పెట్రోల్ పోయించుకు వచ్చాడు. ఆ బండి కూడా రెండేళ్ల క్రితం సంక్రాంతి పండుగకు మామగారు కొనిచ్చినదే. అంతకు ముందు వాడిన స్కూటీని అమ్మేశాడు విష్ణుమూర్తి.

గంటన్నర ప్రయాణం. మధ్యలో ఆగే అవసరం వుండదు పిల్లలు ఏమన్నా తినాలని గోల చేస్తే తప్ప. అందుకే జానకమ్మ చేసి ఇచ్చిన తినుబండారాల సంచీ మధ్యలో తీసుకునేందుకు వీలుగా పెట్టాడు ముందుచూపుతో విష్ణుమూర్తి.

పిల్లలిద్దరూ కొత్త బట్టలు వేసుకున్నారు. శశికళ కొత్త చీరె కట్టుకున్నది. కాసేపు బ్రతిమాలించుకుని తనూ కొత్త డ్రెస్ వేసుకున్న విష్ణుమూర్తి ముందుగా బండి స్టాండ్ తీసి ఎక్కి కూర్చున్నాడు. పిల్లలిద్దర్నీ ఎక్కించింది శశికళ. అమ్మానాన్నలకు వీడుకోలు చెప్పి తనూ బండి ఎక్కింది.

“ఈ సారి కొత్త సంవత్సరం రాగానే ఓ కారు కొందాం లే ఈ బాధలు వుండవ్” అన్న మామగారి మాటలు వీనుల విందుగా వినపడినై విష్ణుమూర్తికి.

**బహుమతి పొందిన కథ**

# ఆశ..దోశ..అప్పడం

"నువ్వే చెప్పి వుంటావ్ అన్నట్లుగా అమ్మ వంక చూసింది శశికళ. అవునన్నట్లు కూతురు వంక చూసి మూసిముసిగా నవ్వింది జానకమ్మ

'అల్లుడంటే విష్ణుమూర్తి గారే' మనసులో అనుకుంది శశికళ. బండి స్టార్ట్ చేశాడు విష్ణుమూర్తి అమ్మమ్మ తాతయ్యలకు చేతులూపుతూ బై చెప్పారు పిల్లలు.

"కొంచం వెనక్కి జరుగు" జరిగింది శశికళ. ముందు కూర్చొబెట్టుకున్న పిల్లని కొంచం పక్కకి జరిపాడు. శశికళ ఒడిలో పిల్ల నిద్రలోకి జారుకున్నది. చల్లగాలి. చక్కటి వాతావరణం. నిజానికి శశికళ కి కూడా కళ్ళు మూతలు పడుతున్నె కానీ విష్ణుమూర్తి సణుగుడు తో కోపం వచ్చి నిద్ర ఎటో వెళ్లిపోయింది

సెల్ ఫోన్ కొనివ్వమని మామగారిని అడగలేదని బయలుదేరినప్పటినుంచీ ఒకటే సణుగుడు.భరించలేకపోతున్నది ఆమె."ఏమండీ నాలుగు రోజులూ మీరు ఏది కావాలంటే అది చేసి పెట్టింది మా అమ్మ. మీరు అడక్కుండానే వచ్చే ఏడాది కారు కొనిస్తానన్నాడు మా నాన్న. ఇంకా బోడి సెల్ ఫోన్ కావాలంటూ అడగలేదని మీ నస ఏమిటండీ" అన్నది కాస్త కోపంగానే శశికళ

"ఇంగ్లీషులో ఓ సామెత వుంది తెలుసా ఏ బర్డ్ ఇన్ ద హేండ్ ఈజ్ బెటర్ దేన్ టు ఇన్ ద బుష్..అంటే ఏమిటో తెలుసా"

"తెలుసులే పదండి" దురాశ దుఖం చేటు అంటారు గుర్తు పెట్టుకోండి" అంతలోనే నాలుగు గ్రామ సింహాలు అడ్డురావడం, కంగారుపడటం, బండి కింద పడటం క్షణం లో జరిగిపోయింది. కింద పడ్డ విష్ణుమూర్తి విలవిల్లాడిపోయాడు. పిల్లలిద్దరికీ ఏమీ కాలేదని నిర్ధారించుకున్నాక, తనూ బానే వున్నట్లు చెప్పింది శశికళ. కొంతవరకు ఊరట చెందాడు విష్ణుమూర్తి. అతడు మాత్రం లేచి నిలబడలేకపోయాడు. కాలికి ఏదో అయిందని అర్థం అయ్యింది. వెంటనే తండ్రికి ఫోన్ చేసి చెప్పింది శశికళ.అరగంట లోపే టాక్సీ లో గురుమూర్తి, జానకమ్మ, వాళ్ళకి తెలిసిన డాక్టరూ వచ్చారు.

విష్ణుమూర్తి కాలికి ఫాక్చర్ అయినట్లు చెప్పాడు డాక్టర్. వెంటనే కార్లో తీసుకు వెళ్ళి తగిన వైద్యం చేయించారు. మూడు నెలలు బెడ్ లోనే వుండాలని చెప్పారు డాక్టర్. దిగాలుపడిపోయాడు విష్ణుమూర్తి. ఎలాగో ఇంటికి చేరి మంచం లో పడుకోవటం అదీ మూడు నెలలు అనుకున్నప్పుడల్లా దిగులూ, బాధ కలిగినై పాపం విష్ణుమూర్తికి, శశికళకి కూడా. గురుమూర్తి, జానకమ్మ ఓ వారం వుండి వెళ్ళిపోయారు. కడుపు నిండా తినటం, కాంతి నిండా నిద్రపోవడం విష్ణుమూర్తి కి అలవాటైపోయింది.

మరుసటి వారంలోనే కొత్త కారు తీసుకు వచ్చి అల్లుడి వాకిట్లో పెట్టాడు గురుమూర్తి. పడితే పడ్డాను, వచ్చే సంవత్సరం రావాల్సిన కారు ఇప్పుడే వచ్చిందిగా అని స్వ గతంలో అనుకోవాల్సిన మాటని కొంచం గొనిగినట్లు పైకే అనేసి విరగబడి నవ్వాడు విష్ణుమూర్తి.

భర్త మాటలకి విస్తుపోయి చూసింది శశికళ "కొట్టకారులో అందరం అన్నావరం వెళ్లివద్దాం అత్తయ్యగారూ " అని ప్రయాణానికి సంసిద్ధం చేశాడు. అందర్నీ. స్టీరింగ్ గిరగిరా తిప్పుతూ ఎదురుగా వస్తున్న లారీ ని చూసి హటాత్తుగా బ్రేక్ వేసిన విష్ణుమూర్తి కి కాలు కలక్కుమనటంతో మేలుక వచ్చింది.

"శేపీ " అంటూ కేక పెట్టాడు. వంటింటిలో నుంచి ఒక్క ఊదుటన వచ్చిన భార్యతో తన కల గురించి కానీ, కారు గురించి కానీ చెప్పలేని విష్ణుమూర్తి కాలు నొప్పి గురించి చెప్పి తలదించుకున్నాడు. కాసేపు సపర్య చేసి మళ్ళీ వంటగదిలోకి నడిచింది.

"ఆశ.... దోశ... అప్పడం " తనలో తనే అనుకుని నవ్వుకున్నాడు విష్ణుమూర్తి. (సమాప్తం)

క్రైం
సీరియల్

# డెత్ మెసేజ్





క్రైం
సీరియల్

కొండగుంట వెంకటేష్.

తరువాత మాలతికి కాల్ చేశాడు.

"సాగర్ కు ఎలాఉంది"క్యాజువల్ గా అడిగాడు.

"ఇప్పుడు ఫర్వాలేదు. ఇంకా గాయాలు తగ్గలేదు. తరువాత ప్లాస్టిక్ సర్జరీ చెయ్యాలి"అందామే.

"ప్రకాష్ ఫోన్ నెంబర్ ఏమిటి? అడిగాడు. చెప్పింది.

"ఒకే అవసరమైతే మళ్ళి కాల్ చేస్తాను"అని లైన్ కట్ చేశాడు.

మాలతి వెంటనే ప్రకాష్ ఫోన్ నెంబర్ పంపించింది.

అది ఏయిర్ సెల్ సర్వీసు నెంబర్.

వెంటనే ఆ కంపెనికి కాల్ చేశాడు. రెండు నిమిషాలు వాళ్ళతో మాట్లాడాడు.

మరునాడు ఏయిర్ టెల్ కంపెని హాస్పటల్ కు వచ్చారు.

"మేడం మీ భర్త బైయో మెట్రిక్ తీసుకోవాలి" అన్నాడు.

"ఎందుకు? అడిగింది మాలతి.

"ఒక రికార్డ్ కోసం"అని సాగర్ వెలిముద్రలు తీసుకున్నారు. తరువాత రిపోర్ట్స్ తీసుకుని సుయోధన్ రావు దగ్గరకు వచ్చారు. రిపోర్ట్ చదివి కళ్ళు తేలేశాడు రావు. వృతీ పరంగా ఎన్నో కేసులను పరిశోధించాడు. కాని ఇలాంటి కేసును అతను చూడలేదు. కేవలం నవలలో సినిమాలలో మాత్రమే అలాంటి సంఘటనలు చూశాడు చదివాడు. కాని మొదటిసారి ప్రత్యేక్షంగా చూశాడు.

రెండు వేలిముద్రలు టాలికాలేదు.

రికార్డ్స్ లో ఉన్న వెలిముద్రలు సాగర్ వెలిముద్రలతో టాలీ కాలేదు. అంటే గాయపడింది సాగర్ కాదు.ప్రకాష్. కాలిపోయింది సాగర్.

ఇప్పుడు సుయోధనరావుకు మాలతి పధకం పూర్తిగా అర్ధమైంది.

మాలతికి ప్రకాష్ కు నిజంగానే అక్రమ సంబంధం ఉంది. ఈ విషయం సాగర్ కు తెలిసిపోయింది. దాంతో భార్యభర్తల మద్య మనస్పర్ధలు మొదలయ్యాయి. ఒక రోజు సాగర్ అనుకోకుండ ఇంటికి వచ్చాడు. మాలతి ప్రకాష్ ఇద్దరు బెడ్ రూంలో ఉండటం చూశాడు. కోపంతో మాలతిని కొట్టాడు సాగర్. తరువాత ప్రకాష్ మీద పడ్డాడు. ఇద్దరి మద్య వాలి సుగ్రివుల యుద్ధం జరిగింది. అంతకుముందే ప్రకాష్ సాగర్ ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఆ అవకాశం ఆ రోజు వచ్చింది.

తరువాత ఇద్దరు కలిసి అతన్ని చంపి అడవిలోకి తీసుకువెళ్ళారు. అక్కడ కాల్చి చంపేశారు. సాగర్ మీద అంతకుముందే సూర్యుడి పచ్చబొట్టు ఉంది. దాన్ని ప్రకాష్ కు ఆపాదించారు. చనిపోయింది ప్రకాష్ అని అందరిని నమ్మించారు. వాళ్ళ ప్లాన్ ఒక్కటే. ప్రకాష్ తన మొహాన్ని తనకు తానే పెట్రోల్ తో కాల్చుకుంటాడు. తరువాత ప్లాస్టిక్ సర్జరితో మొహాన్ని సరిచేసుకుంటాడు. దాంతో ఎవరికి

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్

**జరిగిన కథ**

పోలీసు డిపార్ట్మెంటు లో పనిచేసిన సుయోధనరావు ను ఎవరో అనుసరిస్తూ ఉంటారు .అవినాష్, కుసమలు ఒకరిని ఒకరు ఇష్టపడతారు. సుయోధనరావును వెంటాడుతున్న వ్యక్తే అవినాష్ ని కుడా అనుసరిస్తూ ఉంటాడు. సుయోధన రావ్, ఒక కుటుంబాని అన్యాయం చెయ్యటంతో అ కుటుంబం లోని వాళ్లు ఆత్మహత్య చేసుకుంటారు . అ కుటుంబం లోని వారసుడు అతని మీద పగబడతాడు.కుసుమకు అతడు ఫోన్ చేసి బెదిరిస్తుంటాడు.సాగర్ భార్య ప్రమీల ఫోన్ చేస్తే సుయోధన రావు అక్కడికి వెళతాడు.అక్కడసాగర్చచ్చిపడిఉంటాడు.ఫ్యామిలీడాక్టర్ప్రకాష్కిప్రమీలకి సంబంధం ఉండనేఅనుమానంతో ప్రకాష్తో గొడవపడతాడు సాగర్.కోపం లో ప్రకాష్సాగర్ని చంపేస్తాడు . ప్రకాష్కోసం సుయోధన రావు వెళితే అతను కనిపించుడు. చివరకు అతను చచ్చి శవమై తేలతాడు . **ఇక చదవండి**

అనుమానం రాదు. ప్లాస్టిక్ సర్జరీ వల్ల మొహం మారిందని అందరు అనుకుంటారు. కాని ఎవరికి అతను సాగర్ కాదని ప్రకాష్ అని అనుమానం రాదు.చాల పటిష్టమైన ప్లాన్.పెర్ ఫెక్ట్ మర్డర్ ప్లాన్.

సాగర్ స్నేహితుడికి అనుమానం రాకపోతే నిజంగానే అది పెర్ ఫెక్ట్ మర్డర్ అయిఉండేది.

కాని అతనికి వచ్చిన చిన్న అనుమానం పెద్ద మిస్టరీని చేధించింది. అందుకే అంటారు. క్రైమ్ నెవర్ పేస్ .అది మాలతి విషయంలో రుజువైంది.

నిజం తెలిసిన తరువాత సుయోధన్ రావు షాక్ కు గురి అయ్యాడు. ఒక స్త్రీ ఇంత దారుణం చెయ్యటం అతన్ని ఆశ్చర్యానికి గురిచేసింది. ఆమె ఇంత సాహసం చెయ్యటానికి కారణం అక్రమసంబంధం. ఇంతకంటే దారుణమైన విషయం ఇంకోకటి ఉండదు.

అన్ని ఆధారాలతో మాలతిని అరెస్ట్ చేశారు. ఆమె ఎక్కువసేపు ఇంటరాగేషన్ తట్టుకోలేకపోయింది. నిజం చెప్పేసింది. ఈకేసు మీడియాలో టీవిలో ఎంతో ప్రాచుర్యం పొందింది. కొన్నిరోజులపాటు ఈ కేసు గురించి జనాలు చర్చించుకున్నారు.

ఇప్పుడు మాలతి ప్రకాష్ హత్యానేరానికి జైలు శిక్ష అనుభవిస్తున్నారు.

కేసు ఫైలు మూసి వెనక్కి వాలాడు సుయోధనరావు.

★★★

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది. సూర్యుడు తన డ్యూటి ముగించుకున్నాడు. అప్పుడే మెల్లగా చీకటి ఆవహిస్తోంది. సిటికి ఇరవైకిలోమీటర్ల దూరంలో ఒక ఫారమ్ హౌజ్ ముందు కారు అగింది. మెయిన్ గేటు దగ్గర పదికార్లు పార్క్ చేసిఉన్నాయి. సుయోధన్ రావు కారి దిగి లోపలికి వెళ్ళాడు. అప్పుడే పార్టీ మొదలైంది. దాదాపు ఇరవైమంది వచ్చారు. అందరు తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. జ్యూక్ బాక్స్ లోంచి విదేశీ సంగీతం వినిపిస్తోంది.

“రండి సుయోధనరావు గారు”సాధరంగా ఆహ్వానించాడు అతని స్నేహితుడు ప్రసాద్.

“హాపీ రిటైర్డ్ లైఫ్”అన్నాడు సుయోధనరావు.

“ద్యాంక్యు. నీ భార్య కొడుకు ఎలా ఉన్నారు.”

“అందరు బాగున్నారు”అన్నాడు సుయోధనరావు. నీ కూతురికి సంబంధం కుదిరిందా.”

“దాదాపు కుదిరినట్టే. సరే నీ కొడుకు గురించి చెప్పు”సుయోధనరావు చెప్పాడు.

“ఇంకో నాలుగు రోజులలో అబ్బాయి స్టేట్స్ నుంచి వస్తున్నాడు. నెలరోజుల తరువాత పెళ్ళి”అన్నాడు. నీకు తప్పకుండ శుభలేఖ పంపిస్తాను.”

“రా. నా స్నేహితులకు పరిచయం చేస్తాను” అని సుయోధనరావును

క్రైం
సీరియల్

# డెత్ మెసేజ్

తన స్నేహితుల దగ్గరకు తీసుకువెళ్ళాడు. పరస్పర పరిచయాలు పూర్తి అయ్యాయి. తరువాత అందరు డ్రింక్స్ చేశారు.

దాదాపు పదిగంటల వరకు జరిగింది పార్టీ. సుయోధనరావు ఎక్కువ తాగలేదు. రెండు పెగ్గులు మాత్రం పుచ్చుకున్నాడు. అందరు ఒక్కొక్కరే బయలుదేరారు. వాళ్ళందరిని గేటు వరకు వచ్చి సాగనంపాడు ప్రసాద్. చివరగా సుయోధనరావు బయలుదేరాడు.

“గుడ్ నైట్ ప్రసాద్. మనం తరుచు కలుసుకుందాం”అన్నాడు సుయోధనరావు.

“తప్పకుండ. ఒకసారి నా కుటుంబంతో మీ ఇంటికి వస్తాను”అన్నాడు ప్రసాద్.

“తప్పకుండ. భారతి కూడా ఎంతో సంతోషపడుతుంది”అన్నాడు రావు.

తరువాత ఇద్దరు కారు దగ్గరకు చేరుకున్నారు.

“బై అని చెప్పి కారులో కూర్చుని స్టార్ట్ చేశాడు.

“అప్పుడే ఆయన సెల్ ఫోన్ చప్పుడు చేసింది. భారతి చేసింది.

“ఇప్పుడే బయలుదేరాను. ఒక గంటలో వచ్చేస్తాను. నువ్వు భోజనం చేశావా?అడిగాడు.

“లేదు. అకలి వెయ్యలేదు. అందుకే మీ కోసం కాచుకున్నాను. మీరు వచ్చినతరువాత ఇద్దరం కలిసిభోజనం చేద్దాం”అంది.

“ఓకే అని చెప్పి లైన్ కట్ చేశాడు.

చెప్పినట్టుగానే గంట తరువాత ఇంటికి చేరుకున్నాడు. కారు పార్క్ చేస్తూ అప్రయత్నంగా అగిపోయాడు. అతని కనుబొమ్మలు ముడివడ్డాయి. కారు అద్దం మీద ఒక కాగితం అంటించి ఉంది. దాని మీద గుండ్రటి అక్షరాలతో ఇలా రాసుంది.

“మీ కుటుంబానికి ఆపద తప్పదు.”

★★★

కాగితాన్ని తీసుకుని తన బెడ్రూంలోకి వచ్చాడు సుయోధనరావు. బట్టలు మార్చుకుని కూర్చున్నాడు. కాగితాన్ని క్యాజువల్ గా చూశాడు. అక్షరాలు చాల అందంగా క్రమపద్ధతిలో ఉన్నాయి. ఇలాంటి హెచ్చరికలు చాల చూశాడు అతను. చాల మంది నిన్నుచంపుతాం. నువ్వు చస్తావ్ లాంటి పదాలు వాడారు. కాని ఒక్కరు కూడా మీ కుటుంబానికి ఆపద తప్పదు అని హెచ్చరించలేదు.

ఇది వింతగా ఉంది అతనికి.

దీన్ని మాములుగా కొట్టిపారాయ్యాలా లేక సీరియస్ గా తీసుకోవాలా అర్థంకాలేదు.

ఒక పోలీస్ అధికారి అతను. సీరియస్ గా తీసుకోమని మనస్సు హెచ్చరించింది. కాని దానికి సహేతుకమైన కారణం కనిపించలేదు. ప్రస్తుతం సుయోధనరావు ఉద్యోగంలో లేడు. రిటైర్ అయ్యాడు. ప్రశాంతంగా భైరవలంకలో గడుపుతున్నాడు. వృత్తి పరంగా ఎవరితోను శుత్రుత్వం లేదు. వ్యక్తిగతంగా కూడా ఆయనకు కానివాళ్ళు లేరు. అందరితోను మంచిగానే ఉన్నాడు. కొడుకు అవినాష్ కూడా మంచివాడే. ఎవరితోను ఎక్కువ మాట్లాడడు. పలకరిస్తే జవాబు ఇస్తాడు. ఒక రకంగా మితభాషి అని చెప్పాలి.

ఈ హెచ్చరికలో ఒక వింత కనిపిస్తుంది.

“నీకు ఆపద తప్పదు అని రాయాల్సింది. కాని రాసినవాడు నీ కుటుంబానికి ఆపద అని రాశాడు. అంటే అందరిని టార్గట్ చేస్తున్నట్టుగా ఉంది. ఎందుకు? ఎవరు?

“ఏమిటండి ఆలోచిస్తున్నారు? ఆ కాగితం ఏమిటి? లోపలికి వస్తూ అడిగింది భారతి.

చెప్పాలా వద్దా అని సందిగ్ధంగా చూశాడు. ఏ రోజు భార్య దగ్గర

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్

ఏ విషయం దాచలేదు. ఆఫీసు విషయాలు కూడా చెప్పేవాడు. ఆమెతో చర్చించేవాడు. కొన్నిసార్లు ఆమె సలహాలు కూడా తీసుకున్నాడు.

మౌనంగా కాగితం ఇచ్చాడు.

ఆమె తీసుకుని చదివింది.

"ఏమిటండి ఇది? ఎవరు రాశారండి? అంది కంగారుగా.

ఆమె మొహంలో కళ తప్పింది. భయం ఉద్వేకం కలిసికట్టుగా కనిపిస్తున్నాయి.

"నాకు భయంగా ఉంది. పోలీసులకు చెప్పుదాం"అంది తిరిగి.

సుయోధనరావు నవ్వి"నేనే పోలీసును. నువ్వేం కంగారుపడకు. ఎవడో సరదాకు రాసినట్టు ఉన్నాడు. ఇలాంటివి పట్టించుకోకూడదు"అన్నాడు.

"పట్టించుకోకుండ ఎలా ఉండమంటారు. ఇది మాములు విషయం కాదు. మిమ్మల్ని బెదిరించాడంటే ఇది మాములు విషయం కాదు. దయచేసి పోలీసుల సహాయం తీసుకోండి. మీకు ఎంతో మంది ఆఫీసర్స్ తెలుసు. వాళ్ళకు చెప్పండి"అంది.

"సరే రేపు వెళ్ళి మాట్లాడతాను. నువ్వు అనవసరంగా భయపడకు. అంతా నేను చూసుకుంటాను. ఇప్పటికే పొద్దుపోయింది పడుకో"అన్నాడు.

భారతి ఏం మాట్లాడలేదు.

రేపు అవినాష్ కు కాల్ చెయ్యాలి. ఈ విషయం చెప్పి అతని సలహా తీసుకోవాలి అనుకుంది. అప్పుడు కాని ఆమె మనస్సు శాంతించలేదు.

★★★

మరునాడు సుయోదనరావు తన కొలిగ్ ప్రసాద్ కు కాల్ చేశాడు. ముందు మాములు కుశలం మాట్లాడుకున్నారు. తరువాత సుయోధనరావు అసలు విషయానికి వచ్చాడు. రాత్రి వచ్చిన హెచ్చరిక గురించి చెప్పాడు.

"ఇది ఎవరు రాశారో నాకు తెలియదు. నా ఊహకు కూడా అందటం లేదు. ఏం చెయ్యాలో అర్ధంకావటం లేదు. క్యాజువల్ గా తీసుకోవాలో సీరియస్ గా తీసుకోవాలో కూడా తెలియటం లేదు. అందుకే నీకు కాల్ చేశాను"అన్నాడు సుయోధనరావు.

"కంగారుపడకు. మనం పోలీస్ ఆఫీసర్స్. ఎన్నోకేసులను పరిశోధించాం. నేరస్థులను పట్టుకుని చట్టానికి అప్పగించాం. వాళ్ళలో ఎవరికో మన మీద కోపం ఉండిఉండవచ్చు. అప్పుడు ఉద్యోగంలో ఉన్నాం కనుక ధైర్యం చెయ్యలేదు. ఇప్పుడు పదవి విరమణ చేశాం. వాళ్ళకో వాడికో ధైర్యం వచ్చిఉంటుంది. అందుకే ఇది రాశాడు. కాని నాకు ఎందుకో ఇది సీరియస్ గా తీసుకోవలసిన విషయం కాదనిపిస్తుంది. అలాగని తేలికగా తీసుకోమని చెప్పటం లేదు. కొన్నిరోజులు ఆగు. ఇంకో సారి ఇలాగే జరిగితే అప్పుడు చర్య తీసుకుందాం. ఈ లోగా జాగ్రర్తగా ఉండు"అన్నాడు ప్రసాద్.

"నా భార్యతో కూడా ఇదే చెప్పాను. కాని తను చాల భయపడుతుంది. అందుకే నీకు కాల్ చేశాను."

"ఆ కాగితాన్ని ఫోటో తీసి నాకు వాట్స్ ప్ చెయ్యి. "

"అలాగే వెంటనే పంపిస్తాను"అన్నాడు రావు.

"బై ఉంటాను"అన్నాడు ప్రసాద్.

"ఎవరితో మాట్లాడారు"అంది భారతిదేవి కాఫీ ఇస్తూ.

"ప్రసాద్ తో మాట్లాడాను. అంతా తను చూసుకుంటానని చెప్పాడు. నిన్ను కంగారుపడవద్దని చెప్పాడు"అన్నాడు.

తేలికగా నిటుర్చింది భారతి.

రెండు రోజులు గడిచాయి. ఎలాంటి సంఘటనలు జరగలేదు. ఇంకో హెచ్చరిక ఉత్తరం రాలేదు. ఆ రోజు రాత్రి సుయోధనరావు భారతి

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్

బెడ్ రూంలో కూర్చున్నారు. రేపు ఉదయం ఏడుగంటలకు అవినాష్ వస్తున్నాడు. సాయంత్రం వస్తున్నాడు. మొన్న ఉదయం మెసెజ్ చేశాడు. అది చూసి ఇద్దరు సంతోషపడ్డారు. పెద్ద భారం దిగిపోయినట్టుగా ఫీలయ్యారు. ముఖ్యంగా భారతి మనస్సు తేలికపడింది. నిజానికి రావు ఉద్యోగం చేస్తున్నప్పుడు ఇలాంటి బెదిరింపులు చాల వచ్చాయి. దీని కంటే చాల భయంకరంగా హెచ్చరించారు. సినిమాలలో లాగా పంచ్ డైలాగ్స్ కూడా వాడారు. ఈ విషయం రావు భార్యకు చెప్పాడు. ఆవిడ పెద్దగా స్పందించలేదు. కొంచం కూడా భయపడలేదు. దానికి కారణం భర్త హోదా అధికారం. అంత పెద్ద పోస్ట్ లో ఉన్న వాళ్ళను ఎవరు ఏం చెయ్యలేరు. వాళ్ళ దగ్గరకు కూడా వెళ్ళలేరు. ఇది ఆమె నమ్మకం. కాని ఇప్పుడు అలా కాదు. భర్త రిటైర్ అయ్యారు. ముందున్న అధికారం హోదా ఇప్పుడు లేవు. కేవలం రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ అన్న టైటిల్ మాత్రం ఉంది.

రాత్రి ఇద్దరు పెందళాడే భోజనం చేశారు. మూడు గంటలకు అలారం పెట్టుకున్నారు. ముందు సుయోధనరావు ఒక్కటే ఏయిర్ పోర్ట్ కు వెళ్లామని అనుకున్నాడు. కాని భారతి ఒప్పుకోలేదు. తను వస్తునని మొండికేసింది. ఒంటరిగా ఉండటం ఆమెకు ఇష్టంలేదు. పైగా భయం కూడా. ఈ విషయం రావు గ్రహించాడు. అందుకే సరే అన్నాడు.

★★★

"ప్రయాణం ఎలా జరిగింది రా"అడిగాడు సుయోధనరావు.

"బాగానే జరిగింది"అన్నాడు అవినష్.

"అన్ని సెటిల్ చేసుకున్నావా?

"చేశాను. అక్కడ ఇంట్లో ఉన్న సామానులు కూడా అమ్మేశాను. బ్యాంకు అకౌంట్ క్లోజ్ చేశాను. "

"గుడ్. ప్రాజెక్ట్ గురించి ఆలోచించావా"అడిగాడు సుయోధనరావు. కొడుకు వ్యాపారం మొదలుపెట్టబోతున్నాడని అయనకు తెలుసు.

"రిపోర్ట్ తయారయింది. రెండు రోజులలో బ్యాంకు అధికారులను కలుసుకుంటాను. వాళ్ళు లోన్ ఇస్తే ఫర్వాలేదు. లేకపోతే మన డబ్బు పెట్టుకోవాలి"అన్నాడు అవినాష్.

అతను అప్పుడే ఫ్లైట్ దిగాడు. సుయోధనరావు అతన్ని రిసివ్ చేసుకున్నాడు. సుయోధనరావు డ్రైవ్ చేస్తున్నాడు. అవినాష్ పక్కన కూర్చున్నాడు.

తనకు వచ్చిన హెచ్చరిక గుర్తుకువచ్చింది సుయోధనరావుకు. కొడుకుకి చెప్పాలా వద్దా అని సందిగ్ధంలో పడ్డాడు. అదే ఆలోచన అవినాష్ కు కూడా వచ్చింది. ఇద్దరు ఒకే డైలామాలో ఉన్నారు. కాని ఎవరు చొరవ తీసుకోలేదు.

కారు ఇంటి ముందు ఆగింది.

కొడుకుని చూసి భారతి నవ్వుతూ ఎదురువచ్చింది.

"ఎలా ఉన్నావురా"అడిగింది.

"బాగున్నాను."

"ముందు స్నానం చేసిరా. కాఫీ తీసుకువస్తాను"అంది.

బెడ్రూంలోకి వెళ్ళాడు అవినాష్. పది నిమిషాలలో రిఫ్రెష్ అయ్యాడు. బట్టలు మార్చుకుని బెడ్ మీద కూర్చున్నాడు. నవ్వుతూ కాఫీ తీసుకువచ్చింది భారతి.

"నాన్నగారు పంతులుగారితో మాట్లాడారు. వచ్చే నెల మంచి ముహూర్తం ఉందని చెప్పారు. నువ్వు ఏమంటావు?అడిగింది.

"నాదేముంది అమ్మా. మీ ఇష్టం"అన్నాడు.తల్లి వెళ్ళిపోయిన తరువాత కుసుమకు కాల్ చేశాడు.

"ఎప్పుడు వచ్చావు? అంది ఉత్సాహంగా కుసుమ.

"గంట అయింది. ఎలా ఉన్నావు?

క్రైం
సీరియల్

# డెత్ మెసేజ్

"బాగానే ఉన్నాను. ఎందుకు అడుగుతున్నావు"అంది నవ్వుతూ.

"నీకు తెలుసు"అన్నాడు.

"నీ అనుమానం అర్థమైంది. కాని దేవుడి దయవల్ల ఏం జరగలేదు."

"ఈ రోజు సాయంత్రం మినర్వ కాఫీ హౌజ్ లో కలుసుకుందాం."

"అలాగే ఎన్ని గంటలకు?

"అయిదు గంటలకు వచ్చేయ్."అని లైన్ కట్ చేశాడు అవినాష్.

బయట వర్షం పడుతోంది. కిటికి దగ్గర నిలబడి ఉన్నాడు రవి. అతని చేతిలో సెల్ ఉంది. అందులో ఉన్న ప్రభ ఫోటోను చూస్తున్నాడు. ఆ ఫోటో రహస్యంగా సెల్ తో తీశాడు. ఈ విషయం ప్రభకు తెలియదు. అతను చెప్పలేదు. అనుకోకుండ ఆ రోజు ఆమెను కలుసుకున్నాడు. మెస్మరైజ్ అయ్యాడు. తెలియని ఆకర్షణ కలిగింది. ఆమెతో చాల సేపు మాట్లాడాలనిపించింది. అది మొదటిపరిచయంలో. సభ్యత కాదనిపించింది. అందుకే బలవంతంగా తిరిగివచ్చేశాడు.

కావాలని తన కార్డ్ ఆమెకు ఇచ్చాడు. ఏదో ఒక రోజు రింగ్ చెయ్యకపోతుందా అనిపించింది. అందుకే ఓపికగా కాచుకున్నాడు. కాని ఆమె దగ్గరనుంచి ఒక్క కాల్ కూడా రాలేదు. ఇందులో ఆశ్చర్యం ఏంలేదు. మొదటి పరిచయంలోనే ఎవరు అంతగా స్పందించరు. లవ్ ఎట్ ఫస్ట్ సైయిట్ కూడా కలగదు. అలాంటివి సినిమాలలో మాత్రమే జరుగుతాయి. నిజజీవితంలో చాల అరుదుగా జరుగుతాయి. తన విషయంలో కూడా జరుగితే బాగుంటుందని పించింది. వర్షం ఇంకా ఎక్కువైంది. ఆకాశం చిల్లుపడినట్టు కురుస్తోంది.

ఎదురుగా గోడ మీద తల్లి తండ్రి ఫోటో ఉంది. వాళ్ళిద్దరు కొన్నిరోజుల తేడాలో వెళ్ళిపోయారు. దాంతో రవి పూర్తిగా ఒంటరివాడయ్యాడు. బందువులు స్నేహితులు ఎవరులేరు. ఉన్నా కూడా రాలేదు. స్నేహితులు అంతంత మాత్రం. విపరీతమైన ఒంటరితనం ఫీలయ్యాడు. రాత్రివేళ నిద్రపట్టేది కాదు అతనికి. కన్నవాళ్ళను తలుచుకుని విపరీతంగా బాధపడేవాడు.

కొన్ని రోజుల తరువాత దానికి అలవాటుపడ్డాడు. తరువాత పెద్దగా ఇబ్బందిపడలేదు. అనుకోకుండ ప్రభతో పరిచయం అయింది. ఆమెకు తన మీద ప్రేమ ఉందో లేదో తెలియదు. కాని అతనికి మాత్రం ఆమె మీద ఉంది. గాఢంగా ఆమెను ఇష్టపడుతున్నాడు. జీవితాంతం తనకు తోడు ఉంటే బాగుంటుందని అనుకుంటున్నాడు. కాని దానికి ఒక అడ్డు అతని లక్ష్యం ఆశయం. అది సుయోధనరావును చంపటం. అది పకడ్బందీగా. పోలీసులకు ఏ చిన్న ఆదారం దొరకకూడదు. చరిత్రలో అది ఒక ఫెర్ ఫెక్ట్ మర్డర్ గా నిలబడిపోవాలి. ఈ పథకం ఒక రోజు వేసింది కాదు. కొన్నిసంవత్సరాలనుంచి తయారుచేసింది. అప్పుడు ప్రభ పరిచయం కాలేదు. అందువల్ల అతను కొంచం కూడా అయోమయంలో పడలేదు. స్థిరమైన అభిప్రాయంతో ఉన్నాడు. కాని ఇప్పుడు అలాకాదు. ప్రభ పరిచయం అయింది. దాంతో డైలామాలో పడ్డాడు. ప్రేమలో నిజాయితి ఉండాలి.నిబద్ధత ఉండాలి. ఇద్దరిలో ఎవరి దగ్గర రహస్యాలు ఉండకూడదు. ఉంటే వాటిని చెప్పుకోవాలి. అంతే కాని దాచుకోకూడదు.

అదే నిజమైతే ఇప్పుడు రవి తన ప్లాన్ గురించి ప్రభకు చెప్పాలి. ఆమె ఒప్పుకుంటుందా. తెలిసి తెలిసి ఒక హంతకుడిని క్రిమినల్ ను ఇష్టపడుతుందా. ఖచ్చితంగా ఇష్టపడదు.అందుకే అయోమయంలో పడ్డాడు రవి.

అదే విషయం గురించి ఆలోచిస్తున్నాడు. ఎటు తేల్చుకోలేకపోతున్నాడు. ఒక వైపు ప్రభ, ఇంకోవైపు తన లక్ష్యం. నలిగిపోతున్నాడు. ఏ వైపు వెళ్ళాలో అతనికి తెలియటం లేదు.

(ఇంకా ఉంది )

**వినాల్సిన పాట**

# ఆ పాత మధురాలు..

## చక్కని దాన ..చిక్కని దాన

చిత్రం:శాంతినివాసం
సంగీతం :మాస్టర్ వేణు
సాహిత్యం: సముద్రాల
పాడిన వాళ్ళు: పిఠాపురం
దర్శకత్వం :సి .ఎస్ .రావు



దీకొండ చంద్రకళ

ఆకారంలో నిండుదనం
ఆహార్యంలో నిరాడంబరం!
నడకతో నవ్వులు పూయిస్తాడు
భుజాలెగరేసి, చేతులు,కళ్ళు
తిప్పుతూ హావభావ విన్యాసాలతో
హాస్యం పలికించి, ఆహ్లాదాన్ని
అందిస్తాడు ఆయన!

తైలం-తైలం అంటూ వెంటపడే
దేవయ్య(మిస్సమ్మ)
శ్రీమతే రామనుజాయనమః అనే
భార్యవిధేయుడు(వెలుగునీడలు)
కథనాయకుడికి సమస్యల్లో
సలహాలనందించే
విదూషకుడు(పాతాళభైరవి)
ప్రగల్భాలు పలికే
ఉత్తరకుమారుడు(నర్తనశాల)
మాయా శశిరేఖను చూసి
పిరికితనంతో వణికిపోయే
లక్ష్మణకుమారుడు
(మాయాబజార్)
జీరగొంతుతో పచ్చని
సంసారంలో చిచ్చులు పెట్టే
రంగపోడు!(కలిసి ఉంటే కలదు
సుఖం)
ఈయనకు తోడుగా గెడకర్రలా
ఉండే గంటయ్య(రమణారెడ్డి)
జత కలిసాడంటే ఇంక ప్రేక్షకుల
కడుపులబ్బిపోవాల్సిందే వారి
చెణుకులతో!జాలు వారే
గజారోహణ సత్కారాన్ని
అందుకున్న హాస్యనటులు పద్మశ్రీ
రేలంగి వెంకట్రామయ్య గారు!

హాస్యనటులంటే ఇప్పటిలా
ప్రత్యేక ట్రాక్ అంటూ ఉండేది
కాదు ఆనాటి చిత్రాల్లో.కథతో
సమాంతరంగా నడిచేవి వారి
పాత్రలు...కథనాయకుడి
స్నేహితుడిగానో,బావమరిది
గానో చిత్రకథలో భాగమౌతూనే
ఆటవిడుపుగా తమ హాస్యంతో
అలరించేవారు. ఈ ఉపోద్ఘాతం
ఎందుకంటే... ఈసారి మీకో
హాస్యగీతాన్ని పరిచయం
చేయబోతున్నాను కనుక!

చక్కనిదానా-చిక్కనిదానా ఇంకా
అలకేనా
నీ మాయలన్నీ చాలించు నాతోనా
అంటూ సురభి బాలసరస్వతితో
కలిసి ఆయన అభినయించిన గీతం
శాంతినివాసం చిత్రం లోనిది.
బి.ఎస్.రామయ్య రచించిన
తమిళ నాటకం మల్లియమ్
మంగళం ఆధారంగా సుందర్
లాల్ నెహతా మరియు టి.అశ్వత్థ
నారాయణ గార్లు నిర్మించిన ఈ
తెలుగు భాషా నాటక చిత్రానికి
సంగీతం అందించినవారు
మాస్టర్ వేణు అయితే చిత్రానికి
సంభాషణలు,సాహిత్యం
సమకూర్చినవారు సముద్రాల
జూనియర్ గారు!

విశేషమేమంటే సుందర్
లాల్ నహతా గారికి గల హిందీ
పాటలపై మక్కువ వల్ల ఈ
చిత్రంలో నాలుగు పాటలు హిందీ
పాటలను స్ఫూర్తిగా తీసుకుని
స్వరపరిచారు,కొద్ది మార్పు,
చేర్పులతో!

వినాల్సిన పాట

# ఆ పాత మధురాలు



హిందీ పాటలకు హస్రత్ జైపురి సాహిత్యం అందించగా,శంకర్ జైకిషన్ సంగీతం సమకూర్చారు.

14,జనవరి 1960 లో విడుదలైన ఈ చిత్రం వంద రోజులపైగా ఆడింది.మలయాళం భాషలోకి డబ్ చేయబడింది. ఇక పిఠాపురం నాగేశ్వరరావు, స్వర్ణలత పాడిన ఈ యుగళ హాస్యగీతం విషయానికి వస్తే... ఒక ఆసక్తికరమైన నేపథ్యం ఉంది.

ఈ పాటకు స్ఫూర్తి...1958 లో మాక్ గ్వయిర్ సిస్టర్స్(ముగ్గురు) పాడిన sugar in the morning, sugar in the evening sugar times ఆంగ్లగీతం విడుదలైన కొద్దిరోజుల్లోనే ఒక మిలియన్ రికార్డ్స్ అమ్ముడుపోయిందట! ఆ గీతం యొక్క పల్లవిని స్ఫూర్తిగా తీసుకుని,వేగం పెంచి,చరణాలకు,ఇంటర్లూడ్స్ కు ప్రత్యేకమైన ట్యూన్ తో అందించారు ఉషాఖన్నా!ఆ చిత్రమే 1959 లో విడుదలైన దిల్ దేకె దేఖో !

ఆ టైటిల్ గీతాన్ని మన తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా మార్పు,చేర్పులతో అందించిన ఈ గీతం చరణాలు చూడండి!

పోతా పోతానంటే నేనేమైపోతానే
ఎనిమిది గంటల గడువు పోయింది
నిన్నటితోనే తమరి
నాన్న హే–హే–
హే–విడువలేదే

ఇలా ఎనిమిది గంటల గడువు అంటూ కథని ప్రస్తావిస్తూ,అలతి పదాలతో ఎంతో హుషారుగా సాగుతుంది పాట ఇలా...

అమ్మగారి ఇంట మా నాన్నతోటి తంటా
అత్తగారి ఇంట–హే–హే–పోరంట
జతగ ఉంటే ఏ తంటా మనకు లేదంట




చూడండి...అందరికీ అర్థమయ్యేలా, చివరిలో సందేశమిస్తూ ఎంత చక్కగా సాగిందో చక్కెర(sugar times) పదాల పూత పూసుకున్న చక్కని పాట!

అల్పాక్షరాలలో అనంతార్థాన్ని నింపిన ఆపాతమధురగీత రచయితలకు వందనాలు

दिल लेने वालों दिल देना सीखो जी
हो दिल लेने वालों दिल देना सीखो जी

समझो समझो समझो दीवाने की जबान
प्यार जो ना होता ना होता ये जहाँ
समझो समझो समझो दीवाने की जबान
प्यार जो ना होता ना होता ये जहाँ
ओहोहो तुम भी दिल देके ये गाना सीखो जी
आहाहा तुम भी दिल देके ये गाना सीखो जी क्या
दिल देके देखो दिल देके देखो दिल देके देखो जी
दिल लेने वालों दिल देना सीखो जी
हो दिल लेने वालों दिल देना सीखो जी
दिल देके देखो दिल देके देखो दिल देके देखो जी
दिल लेने वालों दिल देना सीखो जी
हाय दिल लेने वालों दिल देना सीखो जी

# 'యేల్ నీడ్స్ విమెన్'





పద్మావతి రాంభక్త


ఈ మధ్య నేను చదివిన మంచి పుస్తకం ఆనీ గార్డినర్ పెర్కిన్స్ రాసిన "యేల్ నీడ్స్ విమెన్". "ఐవీ లీగ్ ను ఒకప్పుడు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన పురుష ప్రపంచంలోకి స్త్రీలు ఎలా చొరబడ్డారో, కొందరు నవ యువతులు ఏల్ అండర్ గ్రాడ్యుయేట్ చదువుతో సరికొత్తగా ఎలా చరిత్ర సృష్టించారో తెలుసుకోవడానికి ఈ పుస్తకం తప్పక చదవాలి" అంటూ "Rise of the Rocket Girls" అనే పుస్తకం ద్వారా పేరు తెచ్చుకున్న రచయిత Nathalia Holt రాసిన మాటలు "యేల్ నీడ్స్ విమెన్" ఎందుకు చదవాలో మొదటి పేజీలో చెప్పారు. మరికొందరు ప్రముఖుల మాటలు కూడా ఈ పేజీలో జత చేయబడ్డాయి. రచయిత్రి తన యాభై రెండేళ్ళ వయసులో పిహెచ్ డి చేద్దామనుకున్నారు. ఇరవై ఏళ్ళ వయసులో పరిచయమైన తన స్నేహితురాలు హేజల్ తో కలిసి రచయిత్రి చరిత్రలో గ్రాడ్యుయేషన్ చేసాక పిహెచ్ డి చేద్దామని అప్పుడే నిర్ణయించుకున్నారు. కానీ మాస్టర్స్ చేసాక ఒక హై స్కూల్ లో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం రావడంతో అందులో చేరిపోయారు. ముప్పై ఏళ్ళ తరువాత మసాచుసేట్స్ పబ్లిక్ స్కూల్స్ యునివర్సిటీల ప్రోగ్రామ్స్ పాలిసీల కోసం పని చేసారు. ఆ తరువాత మళ్ళీ ఆమెకు పిహెచ్ డి చేయాలనే కోరిక మొదలైంది. ఆమె సోమవారం నుండి గురువారం వరకు ఉద్యోగం చేసి, శుక్రవారాలు మాసాచుసెట్స్ యూనివర్సిటీలో తరగతులకు వెళ్ళి చదవుకోవడం మొదలుపెట్టారు. ఆమె భర్త వంటతో పాటు ఇంటిపనులన్నీ చక్కబెట్టి ఆమెకు సౌలభ్యం కల్పించారు. అప్పుడు ఆమెకు ఒక ప్రాక్టికల్ టాపిక్ పై పరిశోధన చేయాలనిపించింది. ఫైనల్ క్లాస్ పేపర్ కోసం ఒక టాపిక్ కావలసివచ్చింది. 1969లో యేల్ లో చేరిన మొట్టమొదటి విద్యార్థి యువతుల గురించి తెలుసుకుంటే, ఎన్నో అద్భుతమైన కథలు దొరుకుతాయని ఆమె మనసు చెప్పింది. అది ఆమెకు అనుకోకుండా తట్టిన ఆలోచన. ఎన్నో ఏళ్ళ అనంతరం ఆమె యేల్ లో చదివిన మొట్టమొదటి విమెన్ అండర్ గ్రాడ్యుయేట్స్ గురించి చెప్పగలిగే పుస్తకం కోసం వెతికారు కానీ ఆమెకు ఆ విషయాలు దొరకలేదు. స్త్రీలను యేల్ కాలేజ్ లోకి అనుమతించిన చారిత్రాత్మక నిర్ణయం గురించి మాత్రమే పుస్తకాలలో కనబడ్డాయి. 268 సంవత్సరాల నుండి మగవారు మాత్రమే చదువుకున్న కాలేజీలో మొట్టమొదటిసారి స్త్రీలు అడుగుపెట్టారు. ఇదంతా ఎలా మొదలైందో ఆమె వివరంగా పుస్తకంలో రాసారు. ఐదేళ్ళుగా యేల్ కు ప్రెసిడెంట్ గా ఉన్న కింగ్ మెన్ బ్రూస్టర్ తన బలమైన నాయకత్వంలో ఒక మార్పుకు తెరతీసారు. ఆ మార్పులో భాగంగా బ్లాక్స్ ను(ఆఫ్రికన్ అమెరికన్స్) కాలేజీ చదువుకు ప్రవేశం కల్పించడం, ఆఫ్రికన్ అమెరికన్ చరిత్రను కాలేజీలో చదువుకోవడానికి అనుమతించడం ముఖ్యమైనవి.

## చదవాల్సిన పుస్తకం



అప్పట్లో నల్లవారి పట్ల వివక్ష ఎక్కువగా ఉన్నప్పుడు బ్రూస్టర్ తీసుకున్న నిర్ణయాలు అమెరికాలో పెద్ద సంచలనం. అలాగే మంచి పేరున్న అధ్యాపకులను నియమించి యేల్ ప్రఖ్యాతిని మరింత పెంచారు. దానితో ఆయన దేశంలోనే ప్రముఖ వ్యక్తిగా గౌరవించబడ్డారు. కానీ ఇంత చేసిన ఆయనకు యేల్ లో మహిళలు చదువుకోవడం పట్ల విముఖత ఉండేది.

ఇంకా చెప్పాలంటే అప్పట్లో చాలా కాలేజీలలో మహిళలు చదువుకోవడానికి వీలు లేదు. అవి మగవారికే పరిమితం ఎందుకంటే విలువైన చదువు మగవారికే దక్కాలనే ఆలోచన అందరిలో లోతుగా నాటుకుపోయింది. అదొక్కటే కాదు, యేల్ లో చదివిన ప్రతి ఒకరూ ఎంతో ఉన్నత పదవులలోకి వెళ్ళి యేల్ గొప్పదనాన్ని మరింత పెంచారు. ఆ సమయంలోనే డెరెక్ అనే యేల్ సీనియర్ విద్యార్థికి "మహిళలకు యేల్ కాలేజీలో చదివేంత సమర్థత లేదు" అనే విషయాన్ని అందరూ నమ్మడం చాలా హాస్యాస్పదంగా అనిపించింది. ఎందుకంటే స్వయానా డెరెక్ చెల్లెలు హైస్కూల్ చదువులో ఎంతో రాణించింది. అతడి తల్లి ప్రాంతీయ, దేశీయ పత్రికలకు తరచూ రాసేది. అతడు మునుపు చదివిన స్కూలులో ఆడపిల్లలు కూడా ఉండడంతో, అతడికి వారెంత ప్రతిభావంతులో తెలుసు. కానీ స్త్రీలను అనుమతిస్తే ఎందరో అమెరికా ప్రెసిడెంట్స్ ను తయారు చేసిన యేల్ గౌరవం దెబ్బతింటుందని బ్రూస్టర్ భయం. అందువల్ల డెరెక్ ఎన్నిసార్లు నచ్చజెప్పాలని ప్రయత్నించినా ఆయన వినడానికి సైతం ఇష్టపడలేదు. డెరెక్ తను పట్టభద్రుడై కాలేజీ వదిలినా, తను పట్టిన పట్టు విడవకుండా విద్యార్థులను అందరినీ సంఘటితపరచి "ప్లీజ్ మిస్టర్ బ్రూస్టర్" అనే పోస్టర్లు కాలేజీ అంతా నింపాడు. 1968లో యేల్ కాలేజీలో వచ్చిన సీట్లను వదులుకుని మరీ నలభై శాతం విద్యార్థులు ప్రిన్స్ టన్ , హార్వార్డ్ కాలేజీలకు తరలి పోవాలనుకుంటున్నారని బ్రూస్టర్ కు తెలిసి ఖంగారుపడ్డాడు. అదే సమయంలో అవీ అనే మరొక సీనియర్ విద్యార్థి నాయకుడై " ఆపరేషన్ కోఎడ్యుకేషన్" అనే పేరుతో విద్యార్థులను సంఘటిత పరచడం మొదలుపెట్టాడు. చాలా మంది విద్యార్థులు అతడి వైపు నిలబడడంతో బ్రూస్టర్ కు ఏం చెయ్యాలో పాలుపోలేదు. మరి కొందరు అధికారులు కూడా బ్రూస్టర్ తో నిలబడ్డారు. మొత్తానికి అతికష్టం మీద యేల్ లో మహిళలకు అనుమతి లభించింది. అది ఎంత సంచలనం సృష్టించిందంటే ఆ కాలేజీలో సీట్ సంపాదించిన




విద్యార్థినులను "సూపర్ విమెన్" అనడం మొదలుపెట్టారు. మహిళల పట్ల, వారి సామర్థ్యం పట్ల అంత వివక్షతో వ్యవహరించడం శోచనీయం. కానీ కథ అక్కడితో ఆగలేదు, యేల్ లో ప్రవేశించిన స్త్రీలకు అక్కడ పలు రకాల వివక్ష ఎదురైంది. వాటిని అధిగమిస్తూ వారు అక్కడ కొనసాగి చదువు కష్టపడి పూర్తి చేసారు. రచయిత్రి ఎంతో శ్రమ తీసుకుని ఆ "సూపర్ విమెన్" ను కలిసి, వారందరి అనుభవాలు ఈ పుస్తకంలో రికార్డ్ చేసారు. ఇప్పుడు సైతం ప్రపంచమంతా దృష్టి సారిస్తే ఎన్నో కోణాలలో కళ్ళకి కనపడుతూనో, అదృశ్యంగానో మహిళల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉండడం విచారకరం. మనం మారుతూ, చుట్టూ ఉన్న సమాజంలో కూడా మార్పు తేవాల్సిన బాధ్యత మనదే.

★★★

SUMATHI TV Channel
సుమతి

చూడాల్సిన సినిమా

ఆణిముత్యాలు

# 'అంకురం'



ఈదర శ్రీవిద్య

**దర్శకత్వం** సి. ఉమామహేశ్వరరావు

**తారాగణం** ఓం పురి ,రేవతి

**సంగీతం** హంసలేఖ

**నిర్మాణ సంస్థ** ఫిల్మ్ ఇండియా ఆర్ట్ కగరియేషన్స్

''వినాస్త్రీయా.. జననం నాస్తి, వినాస్త్రీయా.. గమనం నాస్తి, వినాస్త్రీయా.. జీవం నాస్తి, వినాస్త్రీయా.. సృష్టియేవా నాస్తి''.. స్త్రీ లేకపోతే జననం లేదు, స్త్రీ లేకపోతే గమనం లేదు, స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు, స్త్రీ లేకపోతే సృష్టే లేదు.

అలంటి ఆదది సత్యాన్ని గెలిపించటం కోసం చేసిన పోరాటమే అంకురం చిత్ర కథ .నిజానికి ఈ చిత్రం లో ని ఒక ఆపత్ర పేరు సత్యం , అతన్ని అన్యంగా పొలిసూ అర్రేసు చేస్తే , అతన్ని విడిపించటానికి చేసే పోరాటం ఇది .

సింధూర తన భర్తతో ట్రైన్‌లో వెళ్తుండగా సత్యం బిడ్డకు పాలు తెస్తా అని సింధూర చేతిలో బిడ్డను పెట్టి దిగేస్తాడు. కాని కారణాలు తెలీకుండా సత్యంను పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్ళిపోతారు. బిడ్డను ఇంటికి తీసుకెళ్లిన సింధూర




అవమానాల మధ్యే ఆ పాప ఆలనా పాలన చూసుకుంటూ సత్యం ఆచూకీ కోసం ప్రయత్నిస్తుంది.

అడుగు అడుగులో అడ్డంకులు ఎదురవుతుంటే వాటికి నెరవక ధైర్యంగా ముందుకు సాగి ఆత్మవిశ్వాసంతో సింధూర సత్యం కోసం వెదుకుతుంది. ఒక చిన్న క్లూ వల్ల సత్యం ఉండే ఊరేదో తెలుస్తుంది. ఇంతలో పౌరహక్కుల నాయకుడైన లాయర్ రావు సహాయంతో సత్యం కోసం కోర్టులో కేసు వేస్తుంది. రావుతో పాటు సత్యం ఉండే గిరిజన ప్రాంతానికి వెళ్తుంది. సత్యం విప్లవకారుడని ముద్ర పడ్డ గిరిజన నాయకుడని తెలుసుకుంటుంది. పోలీసులు సత్యాన్ని పట్టుకోలేక అతని భార్యను అరెస్ట్ చేసి ఆచూకీ కోసం

చూడాల్సిన సినిమా

# ఎరువాకో సాగారో...

ఆణిముత్యాలు

వేధిస్తారు. దీనిని సహించలేని గిరిజనులు పోలీసులపై దాడికి ప్రయత్నిస్తారు. అయితే డాక్టర్ మిత్ర వారిని నిలవరిస్తాడు. ఒక శాడిస్టు పోలీసు అమానవీయ చర్యలతో సత్యం భార్య బిడ్డకు జన్మ ఇచ్చి చనిపోతుంది. దాంతో ఆవేశపడిన గిరిజనులు ఆ పోలీసుని చంపేస్తారు. దీనికి ప్రతిగా గిరిజనులకు అండగా నిలిచిన డాక్టర్ మిత్రను పోలీసులు చంపుతారు. సత్యం బిడ్డతో పారిపోతుండగా రైల్వే స్టేషన్‌లో పట్టుకుంటారు. ఇదంతా సింధూర, రావులకి ఎంక్వయిరీలో తెలుస్తుంది. చివరికి అతి కష్టం మీద కోర్టుకు సూర్యం వచ్చేలా చేస్తుంది సింధూర. అప్పటికే పోలీస్ చేతుల్లో దెబ్బలు తిన్న సత్యం నిజాలు బయట పెట్టి కోర్టు లోనే కన్ను మూయటం, భర్త హరిబాబు బిడ్డతో సహా సింధూరను మళ్ళీ తన జీవితంలోకి ఆహ్వానించడంతో కథ ముగుస్తుంది.

ఈ చిత్రం లో సిరివెన్నెలగారి కలం నుండి గొప్ప పాట వెలువడింది , అది

"ఎవరో ఒకరు... ఎపుడో అపుడు..

ఎవరో ఒకరు ఎపుడో అపుడు

నడవరా ముందుగా... అటో ఇటో ఎటో వైపు

అటో ఇటో ఎటో వైపు..

అ... అ... అ... అ... అ

మొదటివాడు ఎప్పుడు ఒక్కడే మరి

మొదటి అడుగు ఎప్పుడు ఒంటరే మరి

వెనుక వచ్చు వాళ్ళకు బాట అయినది

ఎవరో ఒకరు ఎపుడో అపుడు

నడవరా ముందుగా అటో ఇటో ఎటో వైపు

అటో ఇటో ఎటో వైపు.."

నిజంగా నిజం కోసం , నిర్భయంగా ఎవరో ఒకళ్ళు నడిస్తే కదా అది నిలబడేది . నిజం మీద నిలబడి ఇబ్బందులు పడే వాళ్ళకు గప్పఉత్సాహాన్ని ,స్ఫూర్తిని ఇస్తుంది పాట.

ఇందులో నిజాన్ని నిలబెట్టాతనికి కుటుంబాన్ని కూడా వదిలేసినా ఆడదిగా రేవతి , అన్యాయంగా పోలీసులచే చిత్ర హింసలకు గురి అయిన వ్యక్తిగా ఓంపురి నటన అద్భుతం .చిత్రం చూస్తేనే కాని అ నటనను మనం ఆస్వాదించ లేము .

★★★



# క్రాస్ రోడ్స్ కబుర్లు - 1



## అడ్డ రోడ్డు ఆకాశవాణి

దేరా హాలు తగలబడి పోవటంతో, అడ్డరోడ్డుకు ఆనుకుని వున్న చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు, ముఖ్యంగా యువతకు వినోదం లేకుండా పోయింది. అంతా మళ్ళి హరికథలు, బుర్రకథలను ఆశ్రయించక తప్పలేదు. ఊళ్లలోని ఉబుసుకు పోనీ ముసలి ముతక హరికథలతో కాలక్షేపం చెయ్యటం మొదలు పెట్టారు కాని, కుర్ర కారుకి మాత్రం సుతరాము అవి నచ్చలేదు. నచ్చకపోతే నచ్చానట్లు వుంటే ఈ కథ ఉండేది కాదు. హరి కథలు, బుర్రకథలు జరిగే టప్పుడు మధ్యలో చేరి గొడవలు చేయటం, కథకుణ్ణి ఏడిపించటం చేస్తుండటంతో, అడ్డ రోడ్డుకు వచ్చి కథలు చెప్పే వాళ్ళు కూడా కరువయ్యారు.

హరికథ అంటే గుర్తు కొచ్చింది , ఆదిభట్ల నారయణ దాసు గారని ఉండేవాళ్ళు, హరికథ చెప్పాలంటే ఆయనే . అందుకే ఆయన్ని హరికథ పితామహుడు అని కూడా అనేవాళ్ళు. మా చిన్నతనంలో తెలుగు పుస్తకం లో యాన్ గురించి పాఠం కూడా ఉండేది . హరికథని వెలుగులోకి తెచ్చింది దాసు గారే . మొదటి హరికథా కాలక్షేపానికి రంగం సిద్ధమైంది. మొదటిది రాజమండ్రిలో ఏర్పాటు చేశారు. ఇప్పటిలా కరెంటు



లేదు. మైకులు, సౌండ్ బాక్స్ లు లేవు. ఉన్నదల్లా, ఇసుక వేస్తే రాలనంత జనం, మధ్యలో వేదిక మీద నారాయణ దాసు. అంతే ఉన్నట్లుంది మ్రోగింది కంచు కంఠం . ఊరంతా ఉలిక్కిపడింది. గంభీరమైన ఆకారం, ఒక చేతిలో చిడతలు, కాళ్ళకి గజ్జెలు. అలా మొదటి హరికథకి అంకురార్పణ జరిగింది. కవిత్వం, సంగీతం, నాట్యం అనే మూడు రంగాలలోనూ తనకున్న ప్రతిభను జోడించి నారాయణదాసు హరికథ అనే కళను అత్యున్నత శిఖరాలకు కొనిపోయాడు. ఈ మూడింటి కలయికకూ భక్తి అనే భావం ప్రాణంగా హరికథలు రచించాడు, చెప్పాడు, నేర్పాడు. ఆయన హరికథ వినడం ఒక గొప్ప అనుభూతిగా అప్పటివారు చెప్పుకొనేవారు.

1919లో అప్పటి విజయనగరం మహారాజు స్థాపించిన శ్రీ విజయరామ గాన పాఠశాలకు మొదటి ప్రధానాధ్యాపకునిగా నారాయణదాసును

# అడ్డ రోడ్డు ఆకాశవాణి

నియమించారు. ప్రసిద్ధ వయొలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడు ఈయనకు సహాధ్యాపకునిగా ఉన్నాడు. ఎందరో ప్రముఖ కళాకారులు ఈ విద్యాసంస్థనుండి ఆంధ్రదేశానికి లభించారు. వారిలో ఘంటసాల వెంకటేశ్వరరావు ఒకడు. నారాయణదాసు ఆధ్వర్యంలో నడిచే పాఠశాలలో చదువుకొన్నామని చెప్పుకోవడం అప్పట్లో ప్రతిష్ఠాత్మకంగా భావించేవారు.

ఆనంద గజపతి, నారాయణ దాసును తన ఆస్థాన విద్వాంసునిగా నియమించాడు. ఒకసారి సభలో ఆయన దాసును ఏదో రాగం పాడమని అడిగాడట. కానీ ఆయన నేను పాడను అని సభలో నుండి వెళ్ళిపోయాడట. రాజు గారు కూడా దానికి ఏమి కోపం తెచ్చుకోలేదు. ఐతే తరువాత ఆయన వ్యాయామశాలలో వ్యాయామం చేస్తున్నప్పుడు, ఎందుకో ఆ రాగం గుర్తుకు వచ్చి, పాడడం మొదలుపెట్టారట. నిమిషాలు గడుస్తున్నాయి, గంటలు గడుస్తున్నాయి. చుట్టూరా జనాలు ఉన్నారు. కానీ ఇవేవీ పట్టించుకొనే స్థితిలో లేదు నారాయణ దాసు. చివరికి పాడడం అయినతరువాత చూసుకుంటే ఒంటి మీద కేవలం గోచీ తప్ప ఏది లేదట. ఆ రాగం విన్న ప్రజలంతా ఆనందంతో ఇంటికి వెళ్ళిపోయారు. వెళ్ళిపోయిన ఆ జనంలో, ఆనంద గజపతి రాజు కూడా ఉన్నాడట.

నారాయణదాసు హిందూస్థానీ భైరవి రాగాలాపనను గురుదేవులు రవీంద్రనాథ టాగూరు ఎంతగానో ప్రశంసించాడు. ఈ విజయనగరం కళాశాల పాఠ్యాంశాలు శాంతినికేతన్లో ప్రవేశపెట్టబడ్డాయి.ఈయన సకల కళా నైపుణ్యానికి ముచ్చటపడిన బ్రిటీష్ వారు ఆయనను నోబుల్ పురస్కారానికి నామినేట్ చేద్దామనుకున్నారట. కానీ నారాయణదాసు ఒప్పుకోలేదట. తన జీవితం మొత్తం, తాను జన్మించిన తెలుగు గడ్డకి తన వంతు సేవ చేసి, 1945, జనవరి 2వ తేదీన మరణించాడు.

కోట సచ్చిదానంద శాస్త్రి ప్రసిద్ధ హరికథా విద్వాంసుడు. ఆదిభట్ల నారాయణ దాసు యొక్క ప్రశిష్యుడు. ఈయన హరికథా శైలి ప్రత్యేకం అని చెబుతారు. 1960లు చివరి భాగం,, 1980 లలో చాలా ప్రసిద్ధుడు. సచ్చిదానందశాస్త్రి



# అడ్డ రోడ్డు ఆకాశవాణి



గుంటూరు నివాసి. ఈయన హరికథలు, సినిమా చూస్తున్నట్లు ఉంటాయి అంటే అతిశయోక్తి లేదని చెప్పుకుంటారు. హరికథలో పాటలు, అప్పటి సినిమా హిట్ పాటలనుసరించి పాడేవారట. ఆంటే, ఆయన హరికథ చెప్తుంటే, అంత వినోదాత్మకంగా ఉంటుందన్నమాట. హరికథ చెప్తూ, ఆయన నృత్యం చేసేవారు, చక్కగా పాటలు పాడేవారు, హాస్యంగా జోక్స్ చెప్పేవారు. చెప్పే విషయం మీద అప్పటి తరం ప్రజలను ఆకట్టుకోవటానికి పూర్తి ప్రయత్నం చేసి సఫలీకృతులయ్యేవారు. ఆంధ్రప్రదేశ్ లోను, ఇతర రాష్ట్రాలలోను 1500 పై చిలుకు ప్రదర్శనలు ఇచ్చి అనేకుల ప్రశంసలు, సన్మానాలు అందుకొన్నారు.ఆయనకు భారత ప్రభుత్వం 2023లో పద్మ భూషణ్ అవార్డును ప్రకటించగా, ఆయన ఆ అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా 2023 మార్చి 22న అందుకున్నాడు.

హరి కథలతో పోలిస్తే బుర్ర కథలకు అంతగా పేరు రాలేదనే చెప్పవచ్చు . దానికి కారణం కథల్లో తీసుకునే అంశాలే కావచ్చు. పైపెచ్చు హరి కథ అంటే గొప్ప సంగీత విద్వాంసులు చెప్పే కళగా మొదట నుండి గుర్తించ బడింది. అనుకే హరికథ చెప్పే వాళ్ళు కొద్దో గొప్పో సంగీతం నేర్చుకునే వాళ్ళు .కాని బుర్రకథ కు ఆ అవసరం లేదు. బుర్రకథ చెప్పేవారిని బుడగజంగాలు అంటారు. సమాజంలో వెనుకబడిన కులాలకు చెందినా వాళ్ళు కావటంతో ఈ కళ కుడా వెనుకబడింది. కళల్లో కుడా అగ్రవర్ణాల కళలు , బడుగు వర్గాల కళలు ఉండటం మన సమజం లోనే చూస్తాము .

బుర్రక్రథ అనగానే తెలుగువారికి స్మరించదగ్గ మహనీయ కళాకారుడు ఒకరు గుర్తొస్తారు. ఆయనే 'బుర్రకథ పితామహుడు షేక్ నాజర్. 'వినరా భారత వీర కుమారా విజయం మనదేరా' అంటూ అతను పాడే పాట విని జనం ఊగిపోయేవారు. నిరుపేద ఇంటిలో పుట్టిన నాజర్ కపిలవాయి రికార్డులు విని 'కోరి భజింతు గోవిందు నామది' అనే పాటను వీధుల్లో పాడుకొంటూ బడికి వెళుతున్నప్పుడు ఆ గానమాధుర్యానికి మెచ్చిన పలువురు కోరికోరి పాడించుకొని పప్పు, బెల్లాలను బహుమతిగా ఇచ్చేవారు. తండ్రితో పాటు పీర్ల పండుగలో వీధి భాగవతాలలో ఆడి పాడేవారు.

మద్రాసు ఆంధ్ర మహాసభలో ఏర్పాటు చేసిన బెంగాల్ కరువు బుర్రకథకు సినీ, నాటకరంగ ప్రముఖులందరూ హాజరయ్యారు. ప్రదర్శనను చూసిన సినీనటులు గోవిందరాజుల సుబ్బారావు ప్రదర్శన అనంతరం నాజర్ ను కౌగిలించుకొని 'ఇది గుంటూరు గోంగూర దెబ్బ' అని ప్రశంసించారు. ఈ కథను విన్న ప్రముఖ సినీ దర్శకులు గూడవల్లి రామబ్రహ్మం తాను సినీమా కోసం సేకరించిన పల్నాటి చరిత్ర స్క్రిప్టును నాజర్ కు బహుకరించి బుర్రకథగా రచించి ప్రదర్శించమని ఆశీర్వదించారు.

'ఎప్పుడూ జనాన్ని నమ్ముకోవాలి. పెద్దలు, ప్రభుత్వాలు అవన్నీ నీ కళకు చెక్క అవార్డులు ఇవ్వడానికి పనికి వస్తారు.

# కబుర్లు

కళాకారునికి పట్టెడన్నం పెట్టేది జనం' అనే ఆత్మవిశ్వాసంతో బ్రతికిన వాడు నాజర్. 1981లో ఉగాది వేడుకల్లో సన్మానానికి ముఖ్యమంత్రి టి. అంజయ్య ఆహ్వానించగా నాజర్ వ్రాసిన లేఖ నాజర్ ఆత్మాభిమానానికి అద్దంపట్టింది. "పూజనీయ పేదల బాధలెరిగిన ముఖ్యమంత్రికి కళాభివందనాలు. మహాశయా! మొదటిసారిగా ప్రభుత్వం వేదిక మీదుగా ఆహ్వానించి శ్రీ కాసు సన్మానించి ఓ చిన్న కానుక ఇచ్చారు. అది మెమెంటో అట. నేను లోనికి రాగానే పేరు రాసిస్తానని పట్టుకెళ్లారు. మళ్లీ ఇచ్చిన పాపాన పోలేదు. ఆ తరువాత జలగం వారు చాటంత రేకిచ్చారు. అది తామ్రపత్రమట. ఆ తర్వాత మర్రిమారేడు చెక్క ఇచ్చారు. అది మెమెంటో అట. అయ్యా! దేశంలో కడుపునిండకనే కీర్తి చాలా పోగొంది. ఇప్పుడు నాకు 51 సంవత్సరాలు వచ్చినా ఇంకా నెలకు రెండు, మూడు కథలు చెబితే తప్ప ఇల్లు గడవదు. ఉగాది రోజున బళ్లారి వద్ద పల్లెలో కథ చెప్పడానికి అడ్వాన్స్ తీసుకొన్నాను. అవకాశం వచ్చినప్పుడు వస్తాను' అంటూ ఉత్తరం వ్రాశారు. కళాకారులను ప్రభుత్వాలు కుడా మోసం చేస్తాయి అనటానికి ఇదో ఉదాహరణ .


1986 రిపబ్లిక్ దినోత్సవాలలో అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైలసింగ్ చేతులమీదుగా పద్మశ్రీ



పురస్కారాన్ని అందుకొన్నారు. 1986లోనే కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని ఉపరాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ ద్వారా అందుకొన్నారు. 1987 ఉగాది సందర్భంగా ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్. నాజర్కు స్వంత ధనం రూ. 5వేలను బహూకరించారు.

మళ్ళీ మన అడ్డ రోడ్డు దగ్గరకొస్తే , ఈ కాలం , ఏ ఆకాలం కుర్రాళ్ళకు , ఇంకా చెప్పాలంటే ఏకాలం కుర్రాళ్ళు అయినా హరి కథలు , బుర్రకథలు అంటే వింటారా చెప్పండి .అందుకే వాళ్ళు ఏదన్న కొత్తగా చెయ్యాలని ఆలోచించటం మొదలుపెట్టారు

అప్పటికే దేశంలోకి రేడియో ప్రవేశించింది . దేశంలో మొదట బొంబాయి క్లబ్బు వాళ్ళు రేడియో ప్రసారాలను మొదలుపెట్టారు, అటు తరువాత కలకత్త క్లబ్బు వాళ్ళు అలా అలా దేశమంతా పాకటంతో ,మన అడ్డ రోడ్డు కుర్రాళ్ళంత కలసి ఓ రేడియో అడ్డరోడ్డు దగ్గర ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించుకున్నారు. అప్పట్లో రేడియో కొనాలంటే అది డబ్బు ఉన్నవాళ్లకే సాధ్యమయ్యేది మనదేశంలో ఆకాశవాణి పేరుతో రేడియో ప్రసారాలు.కొనసాగేవి. దానికి కొనసాగింపుగా 'అడ్డ రోడ్డు ఆకాశవాణి 'తన ప్రసారాలను మొదలు పెట్టింది.



సీరియల్

# పరుగులు తీసే నీ పయనానికి ..!



యలమర్తి అనూరాధ

ఈ లోపు ధృతికి
ఏదో అనుమానం వచ్చి అక్కడే ఉన్న తండ్రి సెల్లో చివర ఫోన్ ఎవరి దగ్గరి నుంచీ వచ్చిందని చూసింది. అది బాబాయి దగ్గర్నుంచి అని తెలుసుకున్నాక పెరట్లోకి వెళ్లి బాబాయ్ కి ఫోన్ చేసి విషయం అడిగింది.అప్పుడు ఆయన చెప్పిన విషయం విన్నాక తండ్రి అలా ఎందుకు ఉన్నాడో అర్థమైంది.

అమ్మకి కూడా ఆ విషయం చెప్పి ఎంతో బాధపడింది.

" మనుషులు అంతా ఇలా ుతున్నారేమిటి?మనస్తత్వాలలో ఇన్ని మార్పులు వస్తున్నాయేమిటి?ఇదివరకు రోజుల్లో చెడు చేయటానికి భయపడేవారు.మరి ఇప్పుడు చెడు చేసి దాన్ని తప్పించుకునే మార్గాలను ముందే వెతుక్కుంటున్నారు తెలివిగా"అని విలవిలలాడింది మధురిమ.

"అవునమ్మా!"

"మీ నాన్న తమ్ముడి పిల్లలను కూడా సొంత పిల్లల్లానే చూసుకున్నారు. అందుకే అంత బాధ"

"అవునమ్మా!హర్షిత,వర్షిత కూడా మనతో అలాగే ఉంటారు. హర్షిత జీవితం అలా అయిందంటే ఎలా తట్టుకుంటాం?"

" అందుకే ఈ ప్రేమలూ పెళ్లిళ్లుకి దూరంగా ఉండమని మొత్తుకునేది. కానీ పిల్లలు వినే పరిస్థితుల్లో ఉన్నారా? వెంటపడి వెంటపడి పెళ్లి దాకా తీసుకురావటం ఆ తర్వాత వాళ్ళ బుద్ధులన్నీ ఒక్కొక్కటి బయట పెట్టడం ఇప్పటి అబ్బాయిలకి రివాజు అయిపోయింది"

అమ్మ ఆవేశంగా ఉందని ధృతి మౌనంగా ఉండి పోవడంతో

" పెళ్లికి ముందు కట్నం వద్దని ఇప్పుడు కోటి రూపాయలు కావాలి అనటం ఏంటి? అయినా ప్రేమ పెళ్లికి ఈరోజుల్లో కట్నం ఎవరు ఇస్తారు?"

తను చెప్పిన మాటలే తనకు అప్పచెప్తుతోంది అన్న విషయం కూడా గమనించనంత కోపం లో ఉంది అమ్మ అనుకుంది ధృతి మనసులో.

"దీనికేనా హర్షిత వెంట ఒక సంవత్సరం తిరిగాడు?ఇంతా చేసుకుని దాంతో కాపురం చేయకుండా టార్చర్ పెడతాడా? చెల్లి పెళ్లి అవ్వదని ఈ పిచ్చి ముఖం అన్నీ భరిస్తుందా?ఆ శాడిస్ట్ తో ఎలా ఆరు నెలలు ఉందో అర్థం కావటం లేదు"

" పోనీలేమ్మా .అక్క ఇప్పుడు మన దగ్గరే ఉందిగా.భయం లేదులే. నాన్న కాస్త తేరుకున్నాక ఇద్దరూ బాబాయి వాళ్ళ దగ్గరికి వెళ్లి రండి. వాళ్లకూ కొంత ధైర్యంగా ఉంటుంది మీ ఇద్దరినీ చూస్తే"

"అదే చెయ్యాలి.ఈ విషయం తెలిసి వాళ్ళిద్దరూ ఎంత బెంబేలు పడిపోతున్నారో?అసలే రోహిణి ఏ విషయమూ విని తట్టుకోలేదు"

"అసలు బాబాయి చిన్నమ్మకి ఈ సంగతి చెప్పాడో లేదో? తెలియకుండా నువ్వు బయటపడకు" అంటూ తల్లికి సలహా ఇచ్చింది ధృతి.

" అలాగే లే అక్కడికి వెళితే అన్ని విషయాలు వివరంగా తెలుస్తాయి కదా"

" అవునమ్మా!"అంది ధృతి ఆలోచిస్తూ. "అలాగే లే.అక్కడికి వెళ్తే అన్ని విషయాలు వివరంగా తెలుస్తాయి కదా"

" అవును" అంది ధృతి ఆలోచిస్తూ.

★ ★ ★

# పరుగులు తీసే నీ

**జరిగిన కథ** ధృతి ఇంజనీరింగ్ కాలేజిలో చేరుతుంది. కాలేజిలో రాగ్గింగ్ గురుంచి ఆందోళన చెందుతుంది .కాలేజిలో తన మొదటి రోజు అనుభవాలాను తన తల్లి, అన్నలతో పంచుకుంటుంది ధృతి. కాలేజిలో ధృతి కి ప్రవాహ పరిచయం అవుతుంది.పక్కింటి ప్రభాకర్ కూతురు సరసు కనిపించకుండా పోతుంది. ధృతి వెతకటానికి బయలుదేరుతుంది .సరసు ఒక ఆటో డ్రైవర్ తొ వెళ్లిందని తెలిసి ప్రభాకర్ దంపతులు బాధపడతారు . తిరిగి వచ్చిన సరసును ఆమె బావ బర్గవ్ కిచ్చి పెళ్లిచేస్తారు . ధృతి కి సామ్రాట్ , కృపాల్ , బాంధవ్ స్నేహితులవుతారు .ధృతి , సామ్రాట్ సి .ఆర్ లు గా ఎన్నుకోబడతారు . వారి ఆరుగురి స్నేహం మరింత బలపడుతుంది . కాలేజిలో ఫెస్ట్ జరుగుతుంది . హీరో రాకేశ్ ను గెస్ట్ గా పిలుస్తారు .అందారు ఫెస్టులోఆది పాడి ఆనందంగా గడుపుతారు . పని మనిషి గంగ లంకెబిందలు కోసం ఒ స్వామిజిని ఆశ్రయిస్తుంది . ప్రవాహ , అనన్య పుబ్బుకు వెళతారు . ఆ అలవాటు మనోకమని సలహా ఇస్తుంది ధృతి

**ఇక చదవండి**

మర్నాటికి కానీ మామూలు మనిషి కాలేదు ధర్మతేజ. వెంటనే ప్రయాణమయ్యారు దంపతులిద్దరూ.

అన్నయ్యను చూడగానే గట్టిగా కావలించుకుని భోరుమన్నాడు బభ్రువాహన్.

“ ఎంత పని జరిగిందో చూసావా అన్నయా!” అంటూ బావురుమన్నాడు.

“కంగారు పడకు తమ్ముడూ. అంతా సర్దుకుంటుంది.నేను వచ్చానుగా.వెళ్లి వాళ్ళతో మాట్లాడదాం” అన్నాడు అతన్ని ఓదారుస్తూ ధర్మతేజ.

“ ఇక మాట్లాడటానికి ఏముంది బావగారూ?పిల్లకి తిండి కూడా పెట్టకుండా మాడ్చేశారట. వండుకోకూడదు.ఆర్డర్ పెట్టుకోకూడదట.పిచ్చిది ఇన్నాళ్లు ఎలా భరించిందో అర్థం కావడం లేదు”అంది కన్నీళ్లు పెట్టుకుంటూ రోహిణి.

ఎప్పుడూ తనతో ఎక్కువ మాట్లాడని ఆమె బాధను తట్టుకోలేక అలా మాట్లాడుతుంటే ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదాయనకి.ఒక్కొక్క విషయం వాళ్ళు చెప్తుంటే ఆశ్చర్యపోవటం వీళ్ళ వంతవుతోంది.

“అల్లుడు ఈ విషయాలు మాకు చెబితే దాని పేరు రాసి చచ్చిపోతానని బెదిరించాడట. ఇంకా ఇంతకన్నా ఘోరం ఇంకేముంటుంది అన్నయ్యా?”

“అంతటితో సరిపోలేదు బావగారూ.అందరి ముందు ఎంతో ప్రేమ ఉన్నట్లు నటించటంతో ఇతని సంగతి చెప్తే అసలు ఎవరైనా నమ్ముతారా అని హర్షితకు సందేహం వచ్చేదట.అలా దీని పేరు రాసి అతను చచ్చిపోతే ఇది జీవితాంతం జైల్లోనే గడపాలిగా. అందుకే పిచ్చి పిల్ల భయపడి పోయిందట”అని కొంగుతో కళ్ళమ్మట కారుతున్న కన్నీళ్లను తుడుచుకుంటూ రోహిణి.

వాళ్ళు అలా ఒక్కొక్క విషయం బయట పెడుతుంటే ఇద్దరు నోట మాట రాని పరిస్థితుల్లో పడిపోయారు ధర్మతేజ,మధురిమ. ఇలాంటివి అక్కడక్కడ వినటమే కానీ తమ కుటుంబాల్లో ఇప్పటివరకు చూడలేదు ఎక్కడా. అందుకే అంతా అయోమయంగా ఉంది వాళ్ళిద్దరికీ.

“ రిజైన్ చేయమని బలవంతం పెట్టడంతో ఇక ఆలస్యం చేస్తే లాభం లేదని హర్షిత తెగించి ఇంటికి వచ్చేసింది అన్నయ్యా!”

“పోనీలే మంచి పని చేసింది.ఆ పని మొదట్లోనే చేసి ఉంటే ఇంకా బాగుండేది”అన్నాడు ధర్మతేజ.

మంచం మీద బోర్లా పడుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న హర్షిత దగ్గర చేరింది మధురిమ.

“హర్షిత తల్లీ.భయపడకు రా. నీకు మేమంతా ఉన్నాము”అనగానే లేచి “పెద్దమ్మా!” అంటూ ఆవిడ ఒళ్లో చేరిపోయింది పసిపిల్లలా.

“ఎందుకిలా చేశావు?ఈ కాలంలో ఆడపిల్లలు పెళ్లిళ్ల గురించి ఆలోచించాల్సిన అవసరమే లేదు. చెల్లి గురించి అంతలా ఊహించుకొని ఇన్నాళ్ళూ ఆ నరకంలో ఉన్నావా?”

“ ఏమో పెద్దమ్మా! కాలాలు మారినా ఆడపిల్లలను తప్పు పట్టడంలో మాత్రం ఈ లోకం మారలేదు.అదే తప్పు చేసినా మగవాడిని మాత్రం

సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

క్షమించేస్తుంది. సహనంతో భరించే స్త్రీని మాత్రం దుయ్యబడుతుంది"

" అది మాత్రం నిజమే. అయినా అతను నిన్న అలా బెదిరించినప్పుడు నీ దగ్గర ఉన్న సెల్ లో రికార్డ్ చేసి ఉండొచ్చుగా"

"ఏమో పెద్దమ్మా.అక్కడ అందరూ ఒకటి.నేనొక్కదాన్నీ ఒకటి.అసలు మైండ్ పనిచేసేది కాదు.లోలోపల కుమిలిపోతూ ఎప్పుడూ బాధలోనే ఉండేదాన్ని. ఇటు అమ్మ వాళ్ళకి చెప్పుకోలేను"

" కనీసం మా కన్నా చెప్పొచ్చుగా?"

" మీకు చెప్తే మీరు అమ్మ వాళ్లకు చెప్పకుండా ఉండగలరా?నిజం చెప్పాలంటే వాళ్ళ కంటే నా గురించి మీరే ఎక్కువ బాధపడతారు అన్న విషయం నాకు తెలియదా?కన్నది వాళ్ళైనా నేను పెరిగింది మీ దగ్గరేగా ఎక్కువ"

"ఇంత చిన్న వయసులోనే నీ కెంత కష్టం వచ్చింది?" అని వాపోయింది మధురిమ.

ఆరోజు సాయంత్రం దాకా ఉండి హర్షితను తీసుకెళ్తామని ఇంటికి తీసుకువచ్చేశారు మధురిమ, ధర్మతేజ్ లు .

ధృతి సహచర్యంలో ఇంట్లో అందరి ఆప్యాయతల మధ్య తన కష్టాన్ని మెల్లమెల్లగా మరిచిపోవడానికి ప్రయత్నిస్తోంది హర్షిత.హార్దం మరిచిపోయిన ఆమె వదనంలో శుష్కమందహాసం బదులు అసలైన చిరునవ్వు నెమ్మది నెమ్మదిగా చోటు చేసుకోసాగింది. సన్నగా పీలగా తయారైన ఆమె శరీరం ఇప్పుడిప్పుడే వడిలిన పువ్వులు కాసేపు నీటిలో వేస్తే తాజాగా తయారైనట్లు మళ్లీ ఆరోగ్యాన్ని పుంజుకుంటోంది. ఎంత పైకి అలా ఉన్నా లోలోపల తను చవిచూసిన నరకం ఊహల్లోకి వచ్చినా మనసు గజగజ వణికి పోతోంది.తన ధైర్యం అంతా ఏ మూలకు వెళ్లిపోయిందో ఆమెకే అర్థం కావటం లేదు.పాత హర్షితలా మారటానికి తనూ ప్రయత్నిస్తోంది.అందరి కోరికా అదే.

తమను కాదని వెళ్లిపోయిందని, మాకు ఎవరికీ చెప్పకుండా పోయి పుట్టింట్లో కూర్చుందని ఆమెకు తెలిసిన వీళ్ళ బంధువులందరికీ పనిగట్టుకుని మరీ ఫోన్లు చేసి చెప్తోంది వాళ్ళ అత్తగారిని అందరూ చెప్పటంతో మరింత దిగ్భ్రాంతి చెందాయి ఈ రెండు కుటుంబాలు.

వాళ్లేగా ఇంట్లోంచి తరిమేసేలా ప్రవర్తించింది.పొమ్మని ప్లాన్ ప్రకారం పంపిందీ వాళ్లే.ఈ పుకారు వ్యాపింప చేయడానికి ఇది వాళ్ళు వేసిన ఎత్తు అని వీళ్లు ఆలస్యంగా తెలుసుకున్నారు.

ఎవరు తిట్టుకున్నా మరెవరు మెచ్చుకున్నా కాలం తన పని తాను తీసుకు వెళ్లిపోవటమే తన ధ్యేయమన్నట్లు సాగిపోతోంది.

హర్షిత అతని ప్రేమను నమ్మి మోసపోయానని ఇక ఎట్టి పరిస్థితుల్లో అక్కడికి వెళ్ళనని తెగేసి చెప్పటంతో కోర్టులో గృహహింస చట్టం కింద కేసు వేశారు. కోర్టులు లాయర్లతో వ్యవహారాలు ముందు వద్దనుకున్నా చెడును సంస్కరించాలి అన్న ఉద్దేశంతో ముందడుగు వేశారు. అలాగే విడాకులు కావాలని కూడా. అందులో అతను 'గే'అని అనుమానం కూడా ఉందని,దాన్ని ప్రధాన అంశంగా తీసుకోవాలని అభ్యర్థించారు.తమ పిల్లతో కాపురం చెయ్యకపోవటమే దీనికి కారణం అని వక్కాణించారు.

.పరువు కోసం తమ బెదిరింపులకు లొంగి వీళ్ళు ఏ అడుగూ ముందుకు వేయారని ఆశించిన వారికి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లయింది.కొన్నాళ్ళు తప్పించుకు తిరిగినా చట్టం చేతుల్ని దాటుకొని ఎవరు ఎంత దూరం పోగలరు? డబ్బుతో న్యాయాన్ని కొనేయాలని ప్రయత్నించారు.వారి ఇంటి చుట్టుపక్కల వాళ్ళ స్వచ్ఛందంగా మానవత్వంతో వచ్చి సాక్ష్యం చెప్పడంతో వాళ్లంతా కటకటాల వెనక్కి లాగబడ్డారు.మరో అమ్మాయికి ద్రోహం చేసే వీలు లేకుండా దోషులుగా ముద్రింప బడటం అంత కష్టంలోనూ కొంత సంతోషాన్ని ఇచ్చింది వీళ్ళకి. ఇదంతా జరగటానికి ఒక సంవత్సరం పట్టినా మొత్తానికి జలగల్లాంటి వారిపట్టు నుంచి

సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

విడిపించుకోవటమే కాకుండా వాళ్ళ అన్యాయాన్ని బయటకు పెట్టగలిగాం అన్న తృప్తిని మిగిల్చింది.

ప్రేమిస్తున్నానని కుర్ర కారు వెంట పడటంతో అదంతా తమ మీద ప్రేమేనని మురిసిపోయే అమ్మాయిలకు ఈ కేసు ఓ అనుభవ పాఠంలా మిగిలింది. పోనీలే తన జీవితం నాశనమైనా తను అందరకు ఆదర్శంగా నిలబడగలిగానని హర్షిత ఆనందించింది.

యుక్తవయసు ఎంతో ప్రమాదకరమైంది.చాలా జాగ్రత్తగా అడుగులు కదపాల్సిన సమయం. ఆ వయసులో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తు నిలబెడతాయో కూలుస్తాయో నిర్ధారిస్తాయి. జారుతున్న నేలపైన నడక లాంటిది ఈ సమయం.జాగ్రత్త,మంచి ఆలోచనలను ఆధారం చేసుకుని ముందుకు నడవాలి.అందుకు పెద్దలు సహకారం,అనుభవాన్ని ఆలంబనగా తీసుకోవాలి. అంతేకానీ అన్నాళ్ళ వాళ్ళ ప్రేమ కన్నా తమ ప్రేమే గొప్పదాన్ని గుడ్డి నమ్మకంతో వాళ్ళను కాదని వదిలేసి ముందుకి వెళితే ఇలాగే ఉంటుంది పర్యవసానం.అన్ని కేసుల్లో కాకపోయినా చాలా వాటిల్లో ఇలాగే జరుగుతుంది. కాబట్టి తస్మాత్ జాగ్రత్త జెండా యువత మదిలో ఎప్పుడూ ఎగురుతూనే ఉండాలి.

★ ★ ★

ధృతి నాలుగో సంవత్సరంలోకి ప్రవేశించింది. స్నేహితులందరితో అనుబంధాలు పెనవేసుకుపోయాయి.కాలేజీలో ఉండే సమయం తక్కువ. ఇంటెన్సివ్ కోసం కొన్నాళ్లు వెతుకులాట,ప్రాజెక్టు గురించి ఆలోచించడంతో సమయం గడిచిపోయింది.చివరకు బీహెచ్ఈఎల్ ని ఎన్నుకుని ముందుకు సాగుతున్నారు వీళ్ళ బ్యాచ్ అంతా. ఇంతలోనే క్యాంపస్ సెలక్షన్స్ ప్రారంభమయ్యాయి. ఒకరి తర్వాత ఒకరికి జాబులు దొరకు తున్నాయి. ప్రవాహ కి కృపాల్ కి మాత్రం ఉద్యోగాలు రాకపోవటం అందరికీ బాధగా ఉంది.ప్రవాహ కి అసలు అవసరమే లేదు కానీ స్నేహితులందరికీ వచ్చి తనకే రాకపోవడంతో చదువు పట్ల తనకు శ్రద్ధ తక్కువగా ఉండటమే దానికి కారణం అని ఎంత నచ్చ చెప్పుకున్నా ఆమె మనసు అంగీకరించడం లేదు.


మనసు అంతే తప్పు చేస్తుంటే హెచ్చరిస్తుంది.పట్టించుకోకపోతే వదిలేస్తుంది.విచిత్రంగా తను చేసింది తప్పు అని తెలిసినప్పుడు కూడా అంగీకరించటానికి ఇష్టపడదు.రెండు మూడు నెలలు ఆలస్యమై ఏడిపించినా వారిద్దరికీ మంచి కంపెనీల్లో అందరికన్నా ఎక్కువ జీతంతో ఉద్యోగాలు రావటం స్నేహితులందరికీ మరింత సంతోషాన్ని ఇచ్చింది.ఈ నాలుగేళ్లలో ధృతి,కృపాల్ చాలా దగ్గరయ్యారు.ఎంత అంటే తామిద్దరూ పెళ్లి చేసుకుంటే జీవితం సాఫీగా సాగుతుంది అన్నంత. కానీ అది పెద్దలను ఎదిరించే అంత కాదు.తమ కులాలు కూడా ఒకటి కాదు.కులాల పట్టింపు తమ వయసు వారికి పెద్ద సమస్య కాదు. కాకపోతే ఆ వయసులో తమకోసం ఎన్నో త్యాగాలు చేసిన తల్లిదండ్రులని బాధపెట్టడం అన్నమాట ధృతిని అడుగు ముందుకు వేయనివ్వటం లేదు.

ఎవరిదో ప్రేమ వివాహం అంటేనే వణికిపోతున్న అమ్మానాన్నలని, తనంటే ప్రాణంలా చూసుకునే తల్లిదండ్రులని బాధపెట్టాలనే ఊహ భరించలేక తన ఆలోచనలు వెళ్లువని కట్టడి చేసే పనిలో పడింది ధృతి.అంతే ఒకటి కావాలనుకుంటే ఒకటి వదులుకోవాల్సిందే.ఆమె ప్రేమను చిగురు వేసే దశలోనే చిదిమేసింది.ఇలాంటివాళ్ళు ఈ కలికాలంలో చాలా అరుదు.

(ఇంకా ఉంది )

**కార్టూన్స్**


# నవ్వండి ప్లీజ్ !







నాగిశెట్టి










బహుమతి పొందిన కథ

# హైటెక్ పెళ్లి

కథ

కోటమర్తి రాధా హిమబిందు

"హలో సార్..నాపేరు లింగం.. శంభులింగం..అబ్బాయి మేనమామని"

"హలో..నాపేరు స్వామి.. గోవిందస్వామి..అమ్మాయి మేనమామని" అంటూ పరిచయం చేసుకుని చేతులు కలుపుకున్నారు ఇద్దరూ

"అమ్మాయి మేనమామ అమ్మాయిని గంపలో వేదిక మీదికి తీసుకురావాలి" మైకులో గట్టిగా అన్నాడు పురోహితుడు

"గంపలేదు..గింపలేదు.. మా అక్క గంప వద్దన్నది.. రోడ్డుమీద కారు దిగి బయట గేటు దగ్గరకు అమ్మాయి వస్తుంది ఫొటోస్ వీడియో తీసుకున్న తర్వాత హాలు ముందు దిగుతుంది.. అక్కడ ఇంకో ప్లాన్ వుంది" అంటుండగానే మేళతాళాలు విన్పించాయి.. స్వామి పరుగెత్తుకెళ్ళాడు. కొద్దిసేపట్లో పెళ్ళికూతురు హాలు ముందు పల్లకీ దిగింది.

"రండి..రండి" అంటూ మగపెళ్ళి వాళ్ళను హడావుడి చేసింది స్వామి భార్య మహంకాళి. మగపెళ్ళి వాళ్లంతా పరుగున వెళ్తుంటే బిక్కముఖాలు వేసుకుని కూర్చున్నారు అబ్బాయి తల్లి తండ్రి అబ్బాయి. పెళ్ళికొడుకుకు కాబోయే బావమరిది జమదగ్ని అతని భార్య కాళేశ్వరి వచ్చి వీళ్ళ ముగ్గుర్నీ బలవంతంగా లేపి అక్కడికి తీసుకెళ్లారు. డీజే మొదలైంది.

ఫోటోలు వీడియో కోసం అంతవరకు తలదించుకొని కూర్చున్న సంపంగి ఒక్కసారిగా సివంగిలా మారిపోయింది. పాట ప్లే అయింది. "సామీ..నా సామీ" పాట వస్తుంటే స్టెప్పులు వేస్తూ వీరంగం సృష్టిస్తున్న సంపంగిని అంతా కళ్ళు పెద్దవి చేసి నోరు తెరిచి చూశారు. కొంతమంది చప్పట్లు కొడుతూ పూనకాలు వచ్చిన వాళ్ళలా ఊగిపోయారు.

"అక్కా.. వాళ్లు ఎలా నోళ్ళు వెళ్లబెడుతున్నారో చూసావా? అద్దీ..నా మేనకోడలు అంతా నా పోలికే. ఇంకో సాంగ్ ను ఇరగతీస్తుంది చూడు" అంటూ సైగచేసాడు. "నీ బుల్లెట్టు బండెక్కి" పాట స్టార్ట్ అయింది. ఇంకా పెచ్చుమీరిపోయింది పెళ్ళికూతురు. తమ్ముడ్ని ప్రేమగా చూసింది అక్క.

"ఈరోజులలో ఇవన్నీ కామనే.. అప్పట్లా పెళ్ళికూతుళ్లు ఎవరు సిగ్గుపడుతున్నారు?" ఎవరో అంటున్న మాటలకు పెళ్ళికొడుకు అతని తల్లి తండ్రి అవమానంగా ఫీలయ్యారు. ఇంకో పాట మొదలైంది.. పెళ్ళికూతురు వచ్చి పెళ్ళికొడుకుని లాక్కెళ్లి తనతోపాటు డాన్స్ చేయమని కొన్ని టిప్స్ నేర్పి అతనితో డాన్స్ చేయించి చప్పట్లు కొట్టించింది. పెళ్ళికూతురు తల్లి తండ్రి కాబోయే వియ్యంకుడు వియ్యపురాలు దగ్గరకు వచ్చి వాళ్ళను లాక్కుపోయారు. అమ్మాయి తల్లి తండ్రి పెళ్లికోసం మూడురోజుల ప్యాకేజీ మాట్లాడుకొని డాన్సులు నేర్చుకున్నారు. ఆ ప్రతిభ అంతా పెళ్ళిలో చూపారు.

డీజేపాటతో పాటు వాళ్లిద్దరి డాన్స్ మొదలైంది. వీళ్లకు నేర్పబోతే వీళ్ళు ముఖం గంటు పెట్టుకున్నారు. సరదా తీరింది.

★★★

వెల్కమ్ డ్రింక్ వచ్చింది. ఎప్పుడు వచ్చినా మొదటి రెండు వరుసలకి ఇవ్వటం వెళ్లటం. మగ పెళ్లి వాళ్ళలో మూడో

బహుమతి పొందిన కథ

# హైటెక్ పెళ్లి

వరుసలో ఉన్న పరశురాంకు చాలా కోపం వచ్చింది

"ఏంటి బాబూ అంతవరకే వచ్చి వెళ్లిపోతున్నావు? మాకు ఇవ్వవా?"

"అంతవరకే కాంట్రాక్ట్ కుదుర్చుకున్నారు..మీకు వాటర్ తెమ్మంటారా?" "వద్దు" అన్నాడు పరశురాం

"ఏంటి? పెళ్ళికూతురు కుంటుతుంది.. కుంటిదా?" ఎవరో అడిగారు.

"ఛీ..ఛీ..కాదు కాదు.. మూడురోజుల రిహార్సల్ బ్రహ్మాండంగా జరిగింది. ప్రాక్టీస్ అద్భుతంగా చేసింది. అలవాటులేని డాన్సు కదా..ఇప్పుడే కాస్తా కాలు బెణికింది అంతే" అన్నాడు స్వామి. పెళ్ళికొడుకుని పెళ్ళికూతుర్ని వేదికమీద కూర్చోబెట్టారు. ఇక పెళ్లి కావాలి. స్టేజీ అంతా ఫోటోగ్రాఫర్లు.. వీడియో గ్రాఫర్ లతో నిండిపోయింది. పెళ్ళికూతురు వైపు ముగ్గురు బ్యూటీషియన్స్ పెళ్ళికొడుకు వైపు ఇద్దరు ఉన్నారు. వాళ్లంతా ఒకే ప్యాకేజీ కాబట్టి అంతా కలిసిమెలిసి ఉన్నారు. ప్రతీ రెండు నిమిషాలకోసారి వాళ్లకు టచ్ అప్ లు ఇస్తూ స్టేజి మీదనే అటు ఇటు తిరిగారు. రాజ్యం కోల్పోయిన మహారాణి మహారాజు యువరాణిలా పెళ్లి కొడుకు తల్లి తండ్రి ఆడపడుచు స్టేజి మీద ఓ మూలకు కూర్చొని ఉన్నారు. ముఖ్యంగా కొడుకు పెళ్ళికూతురు వైపు వాళ్లతో కలవటం మనసులకు భగ భగ కలిగించింది. ఫోటోలు వీడియోలు బాగా రావటంకోసం వాళ్లు చాలా కృషి చేసే విధానంలో భాగంగా అంత అందంగా లేని పెళ్లికూతురుని టార్గెట్చే శారు. రకరకాల ఫోజులు ఇమ్మన్నారు. వాళ్లు ఎలా చెబితే అలా విన్నది. పెళ్లికూతురు పెళ్లి కొడుకు ఒడిలో కెమెరాలు పెట్టి ఫోటోలు తీశారు. జుట్టు.. పైట.. చేతులు..పాదాలు సవరిస్తూ పెళ్లికూతురుని వాళ్లు తాకుతుంటే పెళ్ళికొడుకు తండ్రికి తెగకోపం వచ్చి అతని కాలర్ పట్టుకొని చెంపలు వాయించి గొడవ పెట్టుకున్నాడు.

"అయ్యో.. ఇవన్నీ మామూలే అన్నయ్యగారూ.. ఈ ఫోటోలు వీడియోలు చూసుకొని మనమంతా మురిసిపోమా?..

కొన్నింటిని మనం ఈజీగా తీసుకోవాలి.. మీరు కానివ్వండి..వెరీ సారీ" అంటున్న వియ్యపురాలివైపు కోపంగా చూడటం తప్ప ఏమీ చేయలేకపోయాడు పెళ్ళికొడుకు తండ్రి. బ్యూటీషియన్స్ పెళ్ళిచేసుకోబోతున్న ఇద్దరికీ మెరుగులు దిద్దే పనిలో పడ్డారు. పెళ్ళికి వచ్చిన ఏ ఒక్కరూ పెళ్లి చూడలేదు. గొడలా కట్టిన వాళ్ల మధ్య పెళ్లేం చూస్తారు? వాళ్ళలో పెళ్లి చూడాలన్న ఆసక్తి కూడా లేదు. పుస్తె పడే సమయంలో అమ్మాయి వెనుక అమ్మాయి తరపు వాళ్లు అబ్బాయి వెనుక ఎవరో గ్రూప్ కూర్చునేసరికి వియ్యపురాలిని నిలదీసి అడిగారు. "ప్యాకేజీ మాట్లాడాం" అంటూ తప్పించుకుంది ఆమె.

ఆడబిడ్డ అలిగినా ఆడపెళ్ళి తరపువాళ్లు ఎవరూ లెక్కచేయలేదు. భోజనానికి పిలిస్తే మాట్లాడకుండా వెళ్లారు అంతా.

★★★

బఫే తినటం ఇష్టం లేని వాళ్ళకు టేబుల్ భోజనాలు వున్నాయని తెలవడంతో అప్పటి రోజుల్లో సినిమా రిలీజ్ రోజు టిక్కెట్లకు పరిగెత్తినట్లుగా జనాలు ఎక్కువమంది అటు పరిగెత్తారు. ఇక్కడ కూడా రెండు వరుసల వరకే ప్రాధాన్యత నాలుగో వరుసలో వున్న పెళ్ళికొడుకు తల్లి తండ్రిని పట్టించుకునే దిక్కే లేదు.

"ఏంటండీ ఇంత ఘోరం.. ఈ ప్యాకేజీ ఏంటి ఈ పరిస్థితి ఏంటి? నాకు అస్సలు నచ్చటం లేదు. పిల్ల మేనమామని పిలవండి.. నేను అడుగుతాను మీరు ఎలాగూ అడగలేరు" భర్తను చూస్తూ ఆవేశంగా అంది పెళ్ళికొడుకు తల్లి

"అతను ఏదో పోజు కొట్టాడు. అతనిది ఇక్కడ ఏమీ లేదు. వియ్యపురాలు చూసావా? ఎలా

బహుమతి పొందిన కథ

# హైటెక్ పెళ్లి

దడ దడ లాడిస్తుందో..

ఎక్కడైనా తగ్గేదేలే అన్నట్లుంది. పాపం ఇంటి ఆడపిల్ల.. అది ఎప్పటినుండి కలలు కంటుంది? ఒక్కటి కూడా నెరవేరలేదు. అల్లుడు హోటల్లో తిందాం పద అంటూ దాన్ని తీసుకెళ్లాడు.. ఎలాగో ఈ నాలుగు ఘడియలు గడవనీ.. బాబూ.. ఏంటి.. ఇటు రావు.. అటే వడ్డిస్తావు.. ఏ వంటకాలు మాదాకా రావట్లేదు" వాటర్ పోస్తున్న అతన్ని అడిగాడు

"సార్..తరువాత బ్యాచ్ లో మీరు వచ్చి ముందు రెండు వరుసలలో కూర్చోండి..మీరు ఇప్పుడు తిననివన్ని తినొచ్చు" అంటున్న అతన్ని ఎగాదిగా చూస్తూ "మనం బఫేలో తిన్నా బాగుండేది" చిరాగ్గా అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అదొక్కటే తక్కువ అయింది. జైల్లో నిలబడినట్లు ప్లేట్లు పట్టుకొని క్యూలో నిలబడాలి. అది ఇంకా అవమానం మనకు"

"సార్.. ఎలా వున్నాయి భోజనాలు?" పాను నములుతూ వచ్చాడు గోవిందస్వామి

"ఏం తిన్నామని? చెప్పుకోటానికి ఏముంది? మీరు మేనమామ కదా అసలు మమ్మల్ని పట్టించుకున్నారా?"

"సార్.. వాస్తవం చెబుతున్నాను. తల్లి తండ్రి లేరు.. మేనమామలు లేరు.. పెళ్లికూతురు.. పెళ్లి కొడుకు.. ఈవెంట్మే నేజ్మెంట్ వాళ్లు ఉంటే పెళ్లి జరుగుతుంది. ఇదే ఇప్పుడు జరుగుతున్న తంతు. పెళ్ళికి రమ్మంటూ ఎందుకు పిలుస్తున్నారో తెలియదు.. అంతా ఎందుకు వస్తున్నారో తెలియదు. పెళ్లిచూడటం అంటూ ఎప్పుడో పోయింది. ఏం కనపడుతుంది? ఏం చూస్తాం? డైనింగ్.. మ్యారేజ్ హాల్లో స్క్రీన్స్ పనిచేయలేదు. ఎవరు పట్టించుకుంటారు? చెప్పాం.. వాళ్లు ఏదో చెప్పారు.. ప్యాకేజీ ప్యాకేజీ అంటూ ఫోనునెంబర్లు సంపాదించి ఎవరెవరినో పిలిచి మాట్లాడుకుంది మా అక్క. ఆమె డబ్బు.ఆమె ఇష్టం అనుకున్నాం.. పిల్లను మేనమామ గంపలో తీసుకువస్తే మేనమామకు బట్టలు పెడతారు. ఏ ఒక్క వేడుక లేదు. ఒకళ్ళను చూసి ఒకళ్లు నేర్చుకుంటున్నారు. సార్ మీరూ వచ్చారా? భోజనం అయిందా?"

"వద్దులేండి సార్ ఈ మర్యాదలు? కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది అని.. చెప్పటం వల్ల ఫలితం లేదు కదా?.. మేం మాత్రం మా అమ్మాయి పెళ్లి ఇలా చేయం" అంటూ మాట్లాడబుద్ధిగాక చిరాగ్గా వెళ్లిపోయాడు శంభులింగం.

"నేను మీలాగే పెళ్ళికి వచ్చాను.. మేనమామనని కాస్తా గొప్పలకు పోయాను. మా అమ్మాయి పెళ్ళి నేను కూడా ఇలా చేయను" అంటూ అక్కడ వాళ్ల ముఖం చూస్తూ ఉండలేక వెళ్ళిపోయాడు గోవిందస్వామి. అందరి భోజనాలు ముగిసిన తర్వాత పిల్ల అప్పగింతలు మొదలయ్యాయి. ప్యాకేజీలో మాట్లాడుకున్న ఆరుగురు వచ్చి దుఃఖపడుతూ పెళ్ళికూతుర్ని పెళ్ళికొడుకు తల్లికి అప్పగిస్తూ అమ్మాయిని ఎలా చూసుకోవాలో జాగ్రత్తలు చెబుతుంటే అవాక్కయింది పెళ్ళికొడుకు తల్లి పెళ్ళికూతురు తల్లి ఠీవీగా సోఫాలో కూర్చొని కార్యక్రమం ఎలా జరుగుతుందో పర్యవేక్షిస్తూ వుండిపోయింది. ఆమె పక్కనచేతులు కట్టుకొని నిలుచున్న ఆమె భర్తను రెండు సైడ్ల మేనమామలు జాలిగా చూడసాగారు.

(సమాప్తం )

SUMATHI TV Channel
సుమతి

సాధరణ
ప్రచురణకు
ఎన్నికైన
కథ

# వెన్నెల వెలుగులో

సరసమైన
కథ



డా.అంబల్ల జనార్దన్

కృష్టయ్యకు అసహనంగా ఉంది. ఉండదూ మరి? ఓ పెద్ద జున్ను ముక్క ఇచ్చినట్టే ఇచ్చి వెంటనే లాక్కుంటే?

ఇంతకీ కథేంటంటే పాతికేళ్ల కిష్టయ్య కు ఇరవై ఒక్క ఏళ్ల రుక్కవ్వతో ఇటీవలే పెళ్లైంది. శోభనమై ముచ్చటగా మూడు రాత్రులు కాగానే రుక్కవ్వ మూలన కూర్చుంది. ఆ తర్వాత నేనున్నానంటూ ఆషాఢ మాసం వచ్చేసింది. ఇంకేముంది? రుక్కవ్వ పుట్టింటికి, కిష్టయ్య విరహతాపంలోకి.

ఆషాఢంలో అత్తా-కోడలు ఒకే గడప తొక్కొద్దనే ఆచారం ఎలా మొదలైందో కాని, అది వేసవిలో పెళ్లైన ఎన్నో జంటల పట్ల శాపమై కూర్చుంది. కిష్టయ్య – రుక్కవ్వ కూడా దానికి బలయ్యారు. రుక్కవ్వ, స్త్రీ సహజ బిడియం వల్ల బయటపడలేదు కానీ, కిష్టయ్య మాత్రం తన నిరసనని బాహాటంగానే వ్యక్త పరిచాడు. కాని అతని పప్పు ఉడక లేదు.

ఆ దంపతులకు ఈ మధ్యే పెళ్లైనా, వారిది ఆరేళ్ల అనుబంధం. ఉండేది ఇరుగు పొరుగు ఊళ్లల్లో ఐనా, వారు కలుసుకున్నది మాత్రం జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ కాలేజీలో. రుక్కవ్వ, కిష్టయ్యకు రెండేళ్లు జూనియర్. కాలేజీ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వేసిన నాటకంలో వారు, శకుంతల, దుష్యంతుల పాత్రలు పోషించారు. ఆ నాటకం ప్రేమ, వారి నిజ జీవితాల్లోకి కూడా పాకింది. అది ఆరేళ్లపాటు దినదినప్రవర్ధమానంగా వెలిగి పరాకాష్టకు చేరుకుంది. ఇద్దరి సామాజిక వర్గం, స్థాయి ఒకటైనందున వారి పెళ్లికి ఏ ఆటంకం లేకపోయింది. రుక్కవ్వ డిగ్రీ పూర్తి కాగానే వారిద్దరి పెళ్లి కనుల పండువలా జరిగింది. ఐతే ఆషాఢ మాసం సైందవుడిలా అడ్డు పడింది.

ఆ పరిస్థితి నుండి ఎలా బైట పడాలా? అని ఆలోచించడంలో వారిద్దరి బుర్రలు వేడెక్కాయి. సెల్ ఫోన్ చాట్లు, వాట్ సాప్ సందేశాలతో ఎంతసేపని కాలక్షేపం చేస్తారు? కైపెక్కించే చిత్రాలతో, వీడియోలతో వారి సెల్ ఫోన్ల మెమొరీ నిండి పోయింది. అదనపు టాక్ టైం, డాటాకి వేల రూపాయలకు రెక్కలొచ్చాయి, ఐనా మనసులు పొడిగానే ఉన్నాయి. పరిష్కార మార్గం కనుచూపుమేర కనిపించ లేదు. ఓ రాత్రంతా తీవ్రంగా ఆలోచించాడు కిష్టయ్య. చిట్ట చివరకు, చీకటి సొరంగం చివర, వెలుగు పురి విప్పింది. హుర్రే అని గట్టిగా అరిచాడతను. అంత రాత్రి ఏమైందో అని ఇంట్లో వాళ్లు ఆందోళన చెందారు. వారికి సంజాయిషీ ఇచ్చేసరికి కిష్టయ్య తల ప్రాణం తోకకొచ్చింది.

★★★

"అయ్యగారూ! నాకు పది దినాలు రజ (సెలవు) కావాలె" కిష్టయ్య తండ్రిని అడిగాడు వారి పాలేరు ఆశయ్య.

"గన్ని దినాలేంటికిరా?" గర్జించాడు కామందు.

"మా ఇంటి దానికి యోడు నెలలు పడ్డె దొరా! తొలుత కాన్పుకు దాని పుట్టింటికి తోలియ్యాలె గదా? గందుకని"

"గదానికి పది దినాలేంటికి రా? పోను ఒక దినం, రాను ఒక దినం, మీ అత్తగారింటికాడ ఒక దినం. మూడు దినాలు సాలు. పది దినాలేంటికి రా?

**సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ**

# వెన్నెల వెలుగులో

"శాన నెలలకు పోతున్న గదా? నేనాదుండంగనే పోశవ్వకు, మైశవ్వకు సేసుకుంటరట. గందుకని పది దినాలన్న రజ ఇయ్యుండ్రి దొరా."

" నువ్వు పది దినాలు లేకుంటే, రాత్రి తోటల కావలికి ఓల్లు పోతర్రా? ఓ నాలుగు దినాలల్ల వాపస్ రా."

"పోక పోక మా అత్త గారింటికి పోతున్న. ఎట్లన్న ఒక పది దినాలు రజ ఇయ్యుండ్రి. నీ కాల్మొక్త బాంచెన్ దొరా."

"ఆశయ్య గంతగానం బతిమిలాడుతున్నడు, సరే అను బాపూ. ఆల్లు గూడా మనుషులే కదా? ఆల్లకు గూడా సుట్టరికం, బంధురికం ఉంటయి. అంత లావుంటే గా పది దినాలు తోటలకు నేను కావలికి పోతా." అక్కడే ఉన్న కిష్టయ్య, అన్నాడు.

"డిగ్రీ నేర్సినోడివి. నీకు కావలికి పోయే గాశారం ఏంటికి బెటా? నేనే ఏదన్న బందవత్తు జేత్త."

"మన తోటల మనం కావలికి ఉండకపోతే ఎట్ల బాపూ? రాత్రికి కావలికి పోతే నాకు సుదా అనుబగమత్తది. నువ్వేం ఫికరు జెయ్యకు, అంత నేను జూసుకుంట గదా?" అన్నాడు కిష్టయ్య.

"సరే మంచిది బేటా!"

"ఆశయ్యా! పది దినాలల్ల ఎట్లన్న రావాలె. ఏదో మా కిష్టయ్య అన్నడని గన్ని రోజులు రజ ఇత్తున్నా. పో పోయి దొరసానిని పిలు." దొరసాని రాగానే.." ఇగో ఆశడి పెండ్లం పొట్టతోనున్నదట. కాన్పుకు పుట్టింటికి పోతదట. ఆడికి తవ్వెడు నువ్వులు, ఇంత బెల్లం, శేరు సింతపండు, గొంత వక్క కారం, ఇయ్యి. యాద్ జేత్తరు."

★★★

"మా దోస్తు పక్కూరి సెంద్రవ్వ, దాని బిడ్డె బార్సకు(బారసాలకు) ఓ పది దినాలు ఆల్ల ఇంటికి రమ్మన్నదవ్వా!" రుక్కవ్వ వాళ్ల అమ్మకు టెండరేసింది.

"బార్సకు ఒక్క దినం సరిపాయె, గన్ని రోజులేంటికే?"

"దాని మొగడు మస్కట్ ల ఉన్నడు గదా? బార్స ఇన్తెజాం జేసెతందుకు ఓల్లు లేరు. నాకు గుడా ఈడ ఏం తోత్త లేదు. బాగ దినాలకు నా సిన్నప్పటి దోస్తుకు గొన్ని దినాలు సాయంగ ఉంట."

"కొత్తగ లగ్గమైందానివి. గన్ని దిన్నాలు పరాయోల్లింట్ల ఉంటే మందేమనుకుంటరు? మీ అత్త గారికి గిన తెలిత్తే మర్యాదుంటదే?" రుక్కవ్వ తల్లిలో సంకోచం.

"నేనేం పరాయి దేశం పోతున్ననా? పక్కూర్లె మా సిన్నప్పటి దోస్తింటికి పోతాంటున్న. ఇండ్ల మందనేదేమున్నది? సెంద్రవ్వ, ఆల్ల అత్త ఇద్దరు ఆడోల్లేనాయె. ఏదో ఇంత సదుకున్నదాన్ని. నాలుగు ముచ్చట్లు తెలిసిన దాన్ని. ఆల్లకు ఆసర గమ్మని బతిమిలాడింద్రు. ఆల్లకు సాయం బోతె అరిగి పోతనా? కరిగి పోతనా?" రుక్కవ్వ దబాయించింది.

"ఏమోనెవ్వ. నీ తోని మాట్లాడుడు నాకు శాత గాదు. మీ నాయినను అడిగి యాడికి పోయేదుంటే ఆడికి పో" రుక్కవ్వ తల్లి కూడా తక్కువ తిన లేదు. రుక్కవ్వ ఖంగు తింది. ఆమె తండ్రి అసలే కోపిష్టి. ఆయన ససేమిరా ఒప్పుకోడు. అందుకే రుక్కవ్వ కాళ్ల బేరానికి వచ్చింది.

"అవ్వ, అవ్వ! నీ కాల్మొక్తనే. నువ్వే ఎట్లన్న నాయిన్నకు జెప్పి నన్ను సెంద్రవ్వ ఇంటికి పోనియ్యే."

"అట్లనే. అట్నే. రాత్రి మీ అయ్యతోని మాట్లాడ్త. గీ బియ్యం ఏరు. నాకు సాయిమాన్ల(వంట గదిలో) పనున్నది."

★★★

కిష్టయ్య భోంచేసి రాత్రి తొమ్మిది గంటలకు తమ తోటలోని మంచె మీదికి చేరుకున్నాడు. అక్కడి ఏర్పాట్లతో తృప్తి చెంది, కిందకు దిగి, కారును సెంద్రవ్వ ఊరు వైపు పరుగెత్తించాడు. అర గంటలో రుక్కవ్వతో తిరిగి

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# వెన్నెల వెలుగులో

వచ్చాడు. మంచెపై నవారు మంచం. దానిపై మెత్తని పరుపు. పరుపునిండా పరుచుకున్న మల్లె పూలు. రుక్కవ్వ కళ్లు విప్పారాయి. అభినందిస్తున్నట్టుగా కిష్టయ్య వైపు ఓరగా చూసింది. అతని మనసు నిండింది. ఇద్దరిలో ఏదో ఉద్వేగం. దేని కొరకో తహ తహ.

ఇగ ఆగలేనట్టు కిష్టయ్య, రుక్కవ్వను గట్టిగా హత్తు కున్నాడు. వారి మధ్య చొరబడడానికి గాలి కూడా సాహసించలేకపోయింది. ఇద్దరిలో పరవశం. అలాగే వారు పరుపుపై వాలారు. కౌగిలి ఏ మాత్రం సడలించలేదు. పైన పున్నమి చంద్రుడు నవ్వి, మేఘం చాటుకు తప్పుకున్నాడు. చుక్కలు మాత్రం మినుకు మినుకు మంటూ ఆ జంటను చోద్యంగా చూస్తున్నాయి.

కిష్టయ్య చేతులకు పని చెప్పాడు. రుక్కవ్వ కూడా ఏ మాత్రం తగ్గ లేదు. ఇద్దరూ ఒకరినొకరు తడుముతూ స్వర్గాలోకంలో తేలియాడాడారు. మధ్యలో వలువలేందుకున్నారేమో? వాటిని వదిలించుకోవడానికి పరస్పరం సహరించుకున్నారు. ఒక్కొక్క వస్త్రం విడివడ్డప్పుడల్లా ఏదో తన్మయత్వం. ఇంకా ఏదో కావాలనే తపన. ఏదో సాధించాలనే పట్టుదల. వెన్నెల చల్లదనం, వారి శరీరాల్లోని వేడికి తట్టుకోలేక పోతోంది. ఎలాగైతేనేం, వారు తమ మొదటి పుట్టిన రోజుకి మారారు. ఒకరిలో ఒకరు లీనమయ్యారు. ఉప్పెనలా పొంగిన కడలి, కాసేపైన తర్వాత శాంతించింది. వారు కొంతసేపు సేద దీరారు. నిద్రలోకి జారుకున్నారు. నిద్రనో, మెలకువనో తెలియని స్థితిలో వారు రాత్రంతా మళ్లీ మళ్లీ ప్రణయాంబుధిలో జలకాలాడారు. కోడి కూసేసరికి ఇహలోకంలోకి వచ్చారు. మామూలు బట్టల్లోకి మారి మంచె దిగారు. కిష్టయ్య, రుక్కవ్వను సెంద్రవ్వ ఇంట్లో దింపి తమ ఇంటికి చేరాడు.

ఆశయ్యకు ఇంకో ఐదు రోజులు సెలవు పొడిగించమని ఫోన్ చేశాడు కిష్టయ్య. అదే అదనుగా ఆశయ్య అత్తవారింట్లో అల్లుడి మర్యాదలు పొందుతూ రోజూ విందులతో తూలతూగాడు. కిష్టయ్య తన తండ్రితో ఆశయ్య తరఫున వాదించాడు. రుక్కవ్వ కూడా తన తల్లికి ఏదో సాకుతో నెచ్చెలి ఇంట్లో తన మకాం పొడిగించింది. ఇంకో ఐదు రోజులు బోనస్ గా లభించాయి ఆ జంటకు.

అలా వారు పదిహేను రోజులపాటు, వెన్నెల వెలుగులో తమ దాంపత్య సామ్రాజ్యాన్ని అదిరోహించారు. ఏ ఐదు నక్షత్రాల హోటలు గదిలో కూడా లభించని శయ్యాసుఖం, వారికి ఆ ప్రకృతి ఒడిలో సమకూరింది. ఆ విధంగా వారు ఆషాఢమాసం అడ్డకింని అధిగమించగలిగారు.

తన ప్రోద్బలంతోనే తమ పాలేరు పది రోజుల సెలవుపై వెళ్లాడని తన తండ్రికి తెలియకుండా జాగ్రత్త పడ్డాడు కిష్టయ్య.

అలాగే సెంద్రవ్వ కూతురి బారసాల కూడా కట్టు కథ అని తన తల్లి దండ్రులకు తెలియకుండా చూసింది రుక్కవ్వ,

వారిద్దరికీ తెలియని విషయం ఏమంటే, వారి నిర్వాకం రెండు రోజుల్లోనే ఇరు కుటుంబాలకు తెలిసింది. పల్లె టూరిలో అలాంటి విషయాలు దాగుతాయా? క్షణాల్లో దావానలంలా పాకుతాయి. కామందుల కుటుంబాలు కాబట్టి జనాలు పెద్దగా చెవులు కొరుక్కోలేదు. పెళ్లైన దంపతులే కదా? కొత్తగా పెళ్లైన జంటకు ఆ మాత్రం ఆత్రం సహజమే అని మిన్నకున్నారు వారు.

( సమాప్తం )

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# దశాక్షరి

## కథ



శింగిరాజు శ్రీనివాసరావు

"బావా..వీడసలే తింగర వెధవ. వీడికి నరహరి అని పేరు పెట్టావు గానీ, సందేహం అని పెడితే బాగుండేది. వీడికి అన్నీ అనుమానాలే, ప్రతిదీ సందేహమే. వీడికి ఆ పిల్లనిచ్చి పెళ్ళి చేస్తే, దాన్ని వీడి ప్రశ్నలతో చంపుకుతింటాడేమో"

"భయపడకురా లోకేశం..మీ అక్క చాలే వాడిది. మొదట్లో నేను మాత్రం మీ అక్క ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక పిసుక్కుని చచ్చేవాడిని. క్రమంగా ఆ శరాఘాతాలు తట్టుకుని పిడిరాయిలా నిలబడ్డానా.. లేదా. కాకపోతే వాడికి ఆ ధైర్యం రావాలంటే, వధూవరుల జాతకాలను చూసి ఫెవికాల్ వేసి అతుక్కుపోయేటంత గట్టి ముహూర్తం పెట్టి పెళ్ళి చేయాలి. అలాంటివాడిని చూడు. మంచి హస్తవాసి కల బ్రాహ్మడిని వెతుకు ఫో"

"అలాంటివాడు ఒకడున్నాడు బావా. కాకపోతే వాడికి మాట బలమే గానీ, మంత్రబలం తక్కువ. వాడిప్పటికి వంద పెళ్ళిళ్ళు చేస్తే, వాటిలో వంద జంటలూ జంట పక్షులలా కాపురాలు చేస్తున్నాయి. వీడి పిచ్చి ప్రశ్నలకు సమాధానాలు కూడ అతను సమయస్ఫూర్తితో చెప్పగలడు. కాకపోతే తైలం కొంచెం ఎక్కువ"

"తైలానిదేముందిలేరా. వాడి కాపురం నవనీతంలా ఉంటే చాలు. సరే..వెళ్ళి ఆ పంతులును ఖాయం చేసుకురా. ఎంత అడిగితే అంత ఇస్తామని చెప్పు. పిల్లల కాపురం నాటునాటుగా, ఆస్కార్ పొందేలా ఉండాలని చెప్పు" అని బావమరిది లోకేశును పంపేశాడు పరమేశు.

పరమేశుకు ఉన్నది ఒక్కగానొక్క పిండె నరహరి. ఏ పెళ్ళిచూపులకు పోయినా అతని ప్రశ్నలకు జడిసి ఏ పిల్లా నరహరితో నాలుగు అంగలు వేయడానికి ముందుకు రాలేదు. కానీ ఏ మాయో, మంత్రమో తెలియదుగానీ, మాయావిని చూసి ఆమెను ప్రశ్నలే వేయకుండా పెళ్ళికి ఒప్పేసుకున్నాడు నరహరి. ఏ మాటకు ఆమాట చెప్పుకోవాలి కానీ, చక్రాల్లాంటి మాయావి కళ్ళు చూస్తే ఎవరైనా జావగారాల్సిందే. ఆ కళ్ళే మన నరహరి గుండెలను కుళ్ళబొడిచి నోట మాట రాకుండా చేశాయి. నెలలోపే పెళ్ళి చేయాలనే సంకల్పంతో లోకేశుకు నరహరి పెళ్ళి బాధ్యత అప్పచెప్పాడు పరమేశు.

★★★

"పంతులు గారూ..ఒక చిన్న సందేహం" పెళ్ళిపీటల మీద కూర్చుంటూ అడిగాడు నరహరి.

"అడుగు నాయనా"

"పెళ్ళి అనే మాట ఎందుకొచ్చింది"

"పెళ్ళామనే గొళ్ళాన్ని తెచ్చుకుంటున్నావు కనుక"

"ఓహో..మరి ఇప్పుడు ఆ పెళ్ళికూతురిని నడచి తీసుకురాక బుట్టలో పెట్టుకుని తెస్తారట ఎందుకు?"

"ఇప్పటిదాక ఆ అమ్మాయిని మేము మోశాము, ఇకనుంచి మీరు మోయాలని సింబాలిక్ గా చెప్పడానికి"

"అంటే ఇకనుంచి ఆ పిల్లను నేను మోయాలా?"

"తప్పదు కదా నాయనా..భారాన్ని నువ్వు మోయాలి కనుక ఆమెను నీ భార్య అంటారు"

**సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ**

# దశాక్షరి

"అబ్బో..మంచి లాజిక్కే. పంతులు గారూ..జీలకర, బెల్లం పెట్టిస్తానని ఇందాక చెబుతున్నారు ఎందుకు?"

"మీ ఇద్దరూ ఒకరి తల మీద ఇంకొకరు ఆ జీలకర, బెల్లం కలిపిన ముద్దను పెట్టుకుంటే దాని అర్థం.. ఒకరి చేతికింద మరొకరం అణిగిమణిగి ఉంటామని ప్రమాణం చేయడం"

"అంటే నా భార్య నాకు అణిగిమణిగి ఉంటుందా?"

"ముందు నీ చేత పెట్టిస్తాను కాబట్టి నువ్వు ఎలా ఉంటే ఆమె అలా ఉంటుంది నాయనా"
పంతులు గారి మాట పూర్తయేలోపు మాయావిని తీసుకువచ్చి పీటల మీద కూర్చోబెట్టారు.

ఇక మరో ప్రశ్నకు అవకాశం లేకపోయింది నరహరికి. తనకు వచ్చిన పది మంత్రాలను అటు తిప్పి, ఇటు తిప్పి చదువుతూ, తతంగంలో లోపం లేకుండా వివాహం జరిపించారు పంతులు గారు. తలంబ్రాలు, అగ్ని ప్రదక్షిణ, అరుంధతిని చూపడం,



కొంగుముడి, సప్తపది వంటి తతంగాలన్నిటిని జరిపించి కాస్త ఊపిరి పీల్చుకోవాలని వెళ్ళి కుర్చీలో కూర్చున్నారు పంతులు గారు.

చీర మార్చుకు రావాలని వెళ్ళిన అమ్మాయి రావాలంటే కనీసం గంట సమయమైనా పడుతుంది కదా..ఈ లోపుగా ఏ.సి గాలిని ఆస్వాదిద్దామనుకున్న పంతులు గారి పక్కన వచ్చి చేరాడు నరహరి. వంటికి వేడిగాలి సోకినట్టు అనిపించి కళ్ళు తెరిచాడు పంతులు గారు.

"మిమ్మల్ని డిస్టర్బ్ చేశానా" అడిగాడు నరహరి.

"లేదు నాయనా.. మరల సందేహమా"

"అవును గురువు గారూ. మామూలుగా సప్తపది అంటే ఏమిటో తెలుసు. కానీ మీరు వర్తమాన సప్తపది సూత్రాలని చెబుతారట కదా.. అవేవో నాకు చెప్పరా"

"ఏమీ లేదు నాయనా..కాలం మారింది కదా. ఈ రోజులలో ఆ వేసే ఏడడుగులకూ అర్థాలు మారిపోయాయి. భర్త, భార్యతో ఎలా ఉండాలో నేటి పరిస్థితులను ఆకళింపు చేసుకుని, వారికి అర్థమయే రీతిలో సప్తపది ప్రమాణాలకు అర్థం చెప్పడమే నా

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# దశాక్షరి

ప్రత్యేకత. నువ్వు అడగక పోయినా అంపకాలు అయ్యాక నీకు క్లాసు తీసుకునేవాడిని. నీకు జిజ్ఞాస, నోటిదూల, రెండూ ఎక్కువే కనుక ముందుగానే అడిగావు" అని గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టాడు. ఇవి భర్త, భార్యకు చేసే ప్రామిస్సులు..

" మొదటి అడుగుకు అర్థం.. మా ఇంటికి నువ్వు వచ్చినప్పటి నుంచి ఆవు వెంట దూడలా నీవెంటే తిరుగుతానని,

రెండవ అడుగుకు.. నువ్వు అడిగినదే తడవుగా మీ పుట్టింటికి పంపుతానని,

మూడవ అడుగుకు.. నువ్వు ఎప్పుడు చెబితే అప్పుడు వేరే కాపురం పెట్టేస్తానని,

నాలుగవ అడుగుకు..నువ్వు మా వాళ్ళను తూలనాడినా, మీ వాళ్ళను నేను పల్లెత్తు మాట అనని,

అయిదవ అడుగుకు.. నువ్వు ఎప్పుడంటే అప్పుడు షాపింగుకు తీసుకు వెళతానని,

ఆరవ అడుగుకు... పిల్లల మోత బరువు నాదేనని,

ఏడవ అడుగుకు.. మరణం వరకు నీ మాట జవదాటనని" చెబుతూ, భర్త, భార్యతో కలిసి వేసే ఏడడుగులే నేటి సప్తపది నాయనా"

"అయితే అవేవీ నేను అనలేదే"

"నేను ఏదనమంటే అదే అన్నావా లేదా"

"అన్నాను"

"అవే ఇవి. ఎవరికీ అర్థం కాకుండా పదాలను తిరగసి నీతో చెప్పించాను. నీతో సహా అందరూ అవే మంత్రాలనుకున్నారు. పిచ్చివాడా..ఏ మంత్రమైనా సుఖసంసారానికే కదా. మీ కాపురం చల్లగా పదికాలాలు ఉండాలంటే, ఆ ఇంటి ఇల్లాలి కరుణ ఉండాలి. ఆమెకు ఎదురుచెబితే, నీ కాపురం సముద్రంలో సునామీనే. కనుక నేను చెప్పిన ఈ సప్త సూత్రాలనూ మననం చేసుకుంటూ, ఆమె అడుగులో అడుగు వేస్తూ గడిపావంటే, నీకూ మనశ్శాంతి, ఆమెకూ ప్రశాంతి. ఏమాత్రం తేడా కొట్టినా అరుంధతి కాస్తా అగ్నిహోత్రి అవుతుంది. అర్థమయిందా" అని చెప్పి ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నారు పంతులు గారు.

ఇప్పుడు పంతులు గారు నరహరి కళ్ళకు గీత బోధించిన కృష్ణ పరమాత్మలా కనిపించాడు. అయినా ఈ ఏడు సూత్రాలూ ఏకబిగిన గుర్తు పెట్టుకోవడం కష్టంగా అనిపించింది. ఇంత క్లిష్టంగా కాకుండా సూక్ష్మంలో మోక్షంగా ఏదైనా కిటుకు అడగాలనుకున్నాడు నరహరి.

"గురువు గారూ..మీరు చెప్పింది బాగానే ఉంది. కానీ గుర్తుపెట్టుకోవడం చాలా కష్టంగా ఉంది. పండంటి కాపురానికి ఏదైనా తారకమంత్రం చెప్పండి. మీరు మామూలుగా ప్రతి పెళ్ళిలో పెళ్ళికొడుకు చెవిలో ఏదో మంత్రోపదేశం చేస్తారని, దాని ప్రభావం వలనే మీరు కలిపిన జంటలన్నీ, అరాల్డైట్ వేసి అతికించిన చెక్కల్లా, విడిపోకుండా ఉంటాయని ఎవరో చెబితే విన్నాను. మీరు చెప్పినదాక ఆగలేక అడుగుతున్నాను" ఎంతో క్యూరియాసిటీతో అడిగాడు నరహరి.

"నాయనా..నువ్వు చాలా ఫాస్టుగా ఉన్నావే. మొత్తానికి నీ వాలకం చూస్తుంటే, కోతికి కొబ్బరిచిప్ప దొరికినట్టు అనిపిస్తున్నది. నేను మంత్రం చెప్పకపోయినా, నీ కాపురం బ్రేకుల్లేని బండిలా సాగిపోయేటట్టే ఉంది. అయినా అడిగావు కనుక, అధిక సంభావన పొందుతున్నందుకు చెప్పాలి కనుక చెబుతున్నాను"

"అదేదో..తొందరగా కక్కండి గురువు గారూ..జపిస్తూ జన్మ తరింప చేసుకుంటాను" ఉత్సాహపడ్డాడు నరహరి.

"ఒరి నీ తొందర తగలెయ్యా.. అక్కడికే వస్తున్నా..ఇది 'దశాక్షరి

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# దశాక్షరి

మంత్రం'. దీనిని నీ భార్య ఏదైనా నీతో చెప్పినప్పుడల్లా, దానికి నీ సమాధానంలా ఆ తారకమంత్రాన్ని వాడాలి"

"అంటే..'ఎఫ్ 2' సినిమాలోలా..'అంతేగా', 'అంతేగా' అనాలా"

"అది అవుట్ డేటెడ్..పాత చింతకాయ"

"మరి మీరు చెప్పేదేమిటి గురువు గారూ"

"నేనూ అదే అనుకుంటున్నాను"

"అదేమిటి"

"అదే దశాక్షరి నాయనా. ఇందులో పది అక్షరాలు ఉంటాయి. నీ భార్య ఏంచెప్పినా 'అదే నేనూ అనుకుంటున్నాను' అనేసెయ్. అంటే ఆమె ఏమంటున్నా నువ్వు ఆమోదం తెలిపినట్టేగా. అదే 'అంతేగా' అన్నావనుకో, గంగిరెద్దులా తలూపినట్టు. అలాకాక 'నేనూ అదే అనుకుంటున్నాను' అంటే, నువ్వు కూడ దాన్ని గురించి ఆలోచిస్తున్నట్లు బిల్డప్ ఇస్తూ, ఆవిడది, నీది ఒకే ఆలోచన అయినట్లు మేనేజ్ చెయ్యొచ్చు. దానివల్ల ఆమె తానొక మేధావిలా ఫీలవుతుంది, ఆమె అహం చల్లబడుతుంది. అవునా.. కాదా.." అని చెప్పి నరహరి ముఖంలోకి చూశాడు.

"అబ్బ..ఏం బుర్ర గురువు గారూ మీది. ఇంత తెలివి మీకు ఎలా వచ్చింది" ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు నరహరి.

"వారసత్వం నాయనా..ఈ తెలివి ఉపయోగించే మా నాన్న, మీ నాన్నకు పెళ్ళిచేసి కాపురాన్ని నిలబెట్టాడు. ఇప్పుడు మీ మామ కోరిక మేరకు నేను మీ కాపురం నిలబెడుతున్నాను" అని పంచె సర్దుకుని లేచాడు పంతులు గారు.

"అంటే మా నాన్న కూడ"

"పదాలు మార్పు..అదే భావంతో సాగారు అందరూ. మీ నాన్నే కాదు నాయనా..మా నాన్న కూడ. ఆ మాటకొస్తే..భర్తలయిన ప్రతి పురుష పుంగవుడు కూడ ఇటువంటి మార్గాలను అనుసరించినవారే..సరే పద.. నీ భార్యామణి అలంకరణ పూర్తయినట్టుంది" అన్నాడు పంతులు గారు.

"నేనూ అదే అనుకుంటున్నాను" అప్రయత్నంగా అన్నాడు నరహరి.

"ఇది వాడాల్సింది మీ ఆవిడ దగ్గర..అందరి దగ్గర కాదు" అని పంతులు గారు అనడంతో

"సారీ గురువు గారూ.." అని నవ్వుతూ పంతులును అనుసరించాడు నరహరి. ఏది ఏమైనా మాయావి ఆలిచిప్పల కళ్ళల్లో కదలకుండా కాపురం ఉండడానికి మంచి దశాక్షరి దొరికిందని తెగ సంబరపడి పోయాడు నరహరి.

(సమాప్తం )

## జోక్స్&జోక్స్

ఉదయం సిగరెట్ పొగ వాసన రాగానే నిద్ర లేచాడు పరందామయ్య...

తను కాకుండా ఇంట్లో సిగరెట్ కాల్చడానికి ఎవరున్నారబ్బానని ఇల్లంతా తిరిగాడు.. ఎవరు కనిపించలేదు.. వంట రూములోంచి పొ

గ వస్తుందని వెళ్లి చూసి షాకయ్యాడు..

పరందామయ్య భార్య రింగులు రింగులు తీస్తూ సిగరెట్ కాలుస్తుంది మరి..

'నిజమేనండీ సిగరెట్ అలవాటైతే మానడం చాలా కష్టమే' భర్తను చూస్తూ చెప్పింది పంకజం..

సిగరెట్ మానాలని తనని భార్య అడగదని సంతోషించాలో.. లేక భార్య కూడా స్మోకింగ్ మొదలుపెట్టిందని బాధపడాలో తెలియక అయోమయంగా చూస్తుండిపోయాడు

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# తెరవెనుక మనిషి

కథ

కట్టా రాంప్రసాద్ బాబు

ఫంక్షన్ హాలంతా అందంగా అలంకరించబడిరది. రంగు రంగుల పూలతో స్టేజ్‌నీ అందంగా తయారుచేసారు. నేను హాల్లోకి అడుగుపెట్టే సరికి చల్లని గాలి శరీరాన్ని తాకింది ఏ.సి హాల్ కావడంతో. అప్పటికే చాలామంది జనం అక్కడ కూర్చున్నారు. నేను వెళ్ళి ఓ పక్కగా కూర్చున్నాను. నా దృష్టి స్టేజికి కట్టిన బేనర్ మీద పడిింది. అందులో 'పితృదినోత్సవ శుభాకాంక్షలు' అని పెద్ద పెద్ద అక్షరాలతో వున్నాయి. ఈరోజు ఫాదర్స్‌డే కావడంతో ఆ ఉత్సవాన్ని నామిత్రుడు మాధవరావు నిర్వహిస్తున్నాడు. మాధవరావు ఈ వూళ్ళోనే వున్న బిజినెస్ మాగ్నెట్స్‌లో ఒకడు. సిటీలో పెద్దఫాక్టరీ వుంది. ఇంకా ఇతర సంస్థల్లో భాగస్వామ్యాలు కూడావున్నాయి. నేను రియల్‌ఎస్టేట్ చేస్తుంటాను. మేమిద్దరం పక్కపక్కవూరివాళ్ళం. కలిసి చదువుకున్నాం. ఇద్దరం సిటీకొచ్చి చెరో రంగంలో స్థిరపడి పోయాం.

నిన్నఫోన్ చేసి ఈరోజు ఎస్.వి.ఫంక్షన్‌హాల్లో ఫాదర్స్‌డే సెలబ్రేషను తన ఆధ్వర్యంలో జరుగుతుందని అందులో కొంతమంది ప్రముఖుల తండ్రుల్ని సన్మానం చేస్తున్నానని రమ్మన్నాడు. మీ ఫాదర్‌కి చేయడంలేదా అని అడుగుదామనుకున్నాను గాని అంత మందికి చేస్తేన్నప్పుడు తన తండ్రిలేకుండా ఎలా వుంటాడని అడగలేదు.

హాల్లోకి జనం వస్తూనే వున్నారు. మాధవరావింకా రాలేదు. ముఖ్యఅతిధులతో పాటు వస్తుంటాడు అనుకుని హాలంతా ఒకసారి చూసాను. అందరికీ స్నాక్స్,డ్రింక్స్ సప్లయి చేస్తున్నాడో డెబ్భై ఏళ్ళ వ్యక్తి అతను సాదా బట్టల్లో, కొద్దిగా పెరిగిన గెడ్డంతో వున్నాడు. అతన్నెక్కడో, ఎప్పుడో చూసినట్టనిపించింది కానీ గుర్తుకు రాలేదు. నా దగ్గరకొచ్చి ''సార్ ఇది తీసుకొండి'' అంటూ స్నాక్స్ పాకెట్, డ్రింక్ పాకెట్ ఇచ్చాడు. అందరికీ అన్నీ అందాయా లేదో నని చూస్తూ వచ్చే, జనాలకు కుర్చీలు సరిపోకపోతే వాటిని వేయిస్తూ బిజి బిజీగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

అంతలో హడావిడి మొదలైంది. వరుసగా అరడజను కార్లు ఫంక్షన్ హాల్ ఎంట్రన్స్ దగ్గర ఆగాయి. మాధవరావు దంపతులు ఓకార్లోనుంచి దిగారు. మిగిలిన కార్లలో నుంచి సన్మాన గ్రహీతలు వాళ్ళవాళ్ళ కుటుంబ సభ్యులతో దిగారు. సభ ప్రారంభమయ్యింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన కలెక్టరుగారు ఫాదర్స్‌డే విశిష్టతను గురించి వివరిస్తూ పిల్లల పెంపకంలో తండ్రుల పాత్ర చాలా గొప్పదైనా వారి ప్రాధాన్యత తల్లికి లభించినంతగా కనపడదని, తండ్రులంతా తెరవెనుకే వుండిపోతారని, వారిసేవలను గుర్తించి ఇక్కడ కొంత మంది తండ్రులకు సన్మానం చేయడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా మాధవరావు గారిని ఎంతయినా ప్రశంశించాలని అన్నారు.

తర్వాత వరుసగా ఆరుగురు తండ్రులకు సన్మానం జరిగింది ప్రతి ఒక్కరికి ఖరీదైన శాలువా కప్పి మెమెంటో అందించారు.

SUMATHI TV Channel
సుమతి

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# తెరవెనుక మనిషి

ఆ ఆరుగురూ ప్రముఖవ్యక్తుల తండ్రులే. బిజినెస్ పరంగా వాళ్ళందరితోను మాధవరావుకి అవసరం బాగా వుంటుంది మాధవరావు మనుషుల్ని అవసరానికి ఎలా వాడుకుంటాడో నాకు బాగా తెలుసు. అందుకే అంత గొప్పవాడయ్యాడు సన్మానంతరం కలెక్టరుగారు తమ మలి పలుకులు చెబుతూ 'మాధవరావుగార్ని ఓవిషయం అడిగాను వారి తండ్రికి కూడా ఇక్కడ సన్మానం చేసుంటే బాగుండేది కదా అని. ఆయన ఆవిషయంలో చాలా బాధ పడుతూ చెప్పారు వారి తండ్రికి ఆరోగ్యంబాగోలేదని. తీవ్ర అనారోగ్యత కారణంగా వారిస్వగ్రామంలోనే వుండిపోయారని లేకపోతే ఆయన్నికూడా ఘనంగా సన్మానించుకునేవాడినని చెప్పారు. ఆ విషయం విన్న తర్వాత నాకు చాలా బాధ కలిగింది. వారి తండ్రిగారు త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని భగవంతుడ్ని కోరుతున్నానని చెప్పి తన ఉపన్యాసాన్ని ముగించారు. తర్వాత కొంతమంది వక్తలు ఫాదర్స్‌డే గొప్పదనాన్ని చెబుతూ ఈకార్యక్రమాన్ని నిర్వహించిన మాధవరావుని పొగడటం ప్రారంభించారు. మాధవరావు కోరుకునేదికూడా అదే.

వాటిని వినలేకపైకి లేచి వెనుక సీట్ల వైపుకి వచ్చాను. ఫంక్షన్ హాలులో చివర ఓ పక్కగా ఇంతకుముందు స్నాక్స్ పంచిన పెద్దాయన కూర్చుని ఉన్నారు. ఆయనకు అటూ ఇటూ కూర్చుని ఎవరూ లేరు. వెళ్ళిఆయన ప్రక్కన కూర్చుని ఆయన వంక చూసాను. ఆయన ముఖమెందుకో దిగులుగా, బాధగా వున్నట్లుంది. కళ్ళు చమర్చినట్లుగా కూడా వున్నాయి.

"ఏమిటి అలావున్నారు మీయజమానిగారు అంత భారీ ఎత్తున ఈఫంక్షన్ చేసారుగా మీకు సంతోషంగా లేదా". అడిగాను

"అబ్బే నేను బాగానే వున్నానండి. మాపెద్దయ్యగారు కూడా వుంటే బాగుండేది అనిసించిందంతే" అన్నాడాయన. నాకెందుకో ఆయన బాగాతెలిసిన వ్యక్తిగానే అన్పిస్తున్నారు కానీ ఎవరోగుర్తుకు రావడంలేదు. మొత్తాంమీద సూచాయిగా గుర్తొచ్చింది.

"మీ పెద్దయ్యగారికి అనారోగ్యం అంత ఎక్కువగా వుందా". అని అడిగాను.

"అవును.. అవును" అని అక్కడ నుంచి లేవబోయాడు.

"కూర్చోండి వీరరాఘవయ్యగారు" అన్నాను.

ఆయన కంగారుగా " నేనా ... వీరరాఘవయ్యను కానే" అన్నాడు

"కూర్చోండి అంకుల్ మీరెవరో ముందు గుర్తుపట్టలేక పోయాను గాని ఇప్పుడు గుర్తుకొచ్చారు మీరు మాధవరావు తండ్రి గారని" అన్నాను ఆయన్నికూర్చోపెడుతూ.

ఆయన కూర్చుని బుజంమీద వున్న తువాలుని ముఖంమీద వుంచుకుని నిశ్శబ్దంగా రోదిస్తున్నాడు.

"ప్లీజ్ వూరుకోండి ఎవరైనా చూస్తే బాగోదు."

"నేను నాకొడుకు సన్మానం చేయలేదని బాధపడటం లేదు బాబు ఆరోగ్యంగా కళ్ళెదురుగా వున్న తండ్రిని పట్టుకుని ఓ రోగిష్టివాడిగా చెప్పడం మనసుకి చాలా కష్టాన్ని కల్గించింది. అందుకే నా బాధంతా".

ఆయన మాటలు వింటుంటే నాకూ చాలా బాధ వేసింది.

మాధవరావు ఎంత పేదరికంలో పుట్టాడో నాకు తెలుసు. చిన్నప్పుడే తల్లి పోయింది. వీరరాఘవయ్యగారు ఎంతమంది చెప్పినా మరో పెళ్ళి చేసుకోకుండా అన్నీ తానే అయి పెంచాడు. కూలి పనులు చేస్తూ కొడుకుని కష్టపడి చదివించాడు. ఆయన తిన్నా తినకపోయినా కొడుక్కి ఏలోటూ రానివ్వలేదు. బీటెక్ వరకు చదివించాడు. అంతే మాధవరావు తండ్రిని

**సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ**

పట్టించుకోవడం మానేసాడు. ప్రేమించిన అమ్మాయిని పెళ్ళిచేసుకుని జీవితంలో సెటిలయిపోయాడు. తండ్రి పల్లెటూరులో వుంటున్నాడు. నెలకింత అని పంపిస్తూ ఉంటాడు. అప్పుడప్పుడు వచ్చి రాఘవయ్యగారే కొడుకుని చూసి వెళుతుంటారు. కలెక్టరు గారన్నట్లు రాఘవయ్యగారు మాధవరావు అభివృద్ధికి తెరవెనుక మనిషే. ఈయనే అన్నమాటేమిటి ఎంతో మంది జీవితాల్లో తండ్రులంతా తెరవెనుక మనుషులే.

(సమాప్తం)

# ఉత్సవ విగ్రహాలు

ఈదర శ్రీనివాస రెడ్డి

అవకాశాల కోసం
ప్రతిక్షణం ముసుగులు తొడగలేక

అవసరాల కోసం అనుక్షణం రంగులు మార్చలేక

అబద్దాలకు మసి పూసి నిజాలను ఏమార్చలేక

కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది లోపల దాగిన మనసు

నరకయాతన పడుతున్నాడు నిఖార్సైన మనిషి

స్వార్థపు చెదలు లోపలకు చొరబడి ఎముకల్ని కోరుకేస్తుంటే

చిక్కటి ఆలోచనల రక్తం పలుచబడి పచ్చగా మారుతోంది

అంగుళాల లెక్కన లోపల ఖాళీ అవుతున్నాడు మనిషి

చిరిగిన తోలు సంచికి అతుకులు వేసుకుంటూ పోతే

ఉరేగిమ్పులకే పనికొచ్చే ఉత్సవ విగ్రహంలా మిగిలిపోతాడు

అస్తమానం అలంకరణలు ఆడంబరాల మధ్య జీవితం
ఒరిగిపోతుంది

మనిషి మొత్తం డొల్లగా మారి మొదలంటూ
కులిపోతున్నాడు

రోజుకొక్క సారైనా లోపలికి తొంగి చుడకుంటే

కాలి బూడిదయ్యే మాంసపు మూటలో ఎందుకని

ఎగిరిపోతుంది మనసు స్వచ్ఛమయిన మనిషిని

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# "నిజమైన స్నేహితుడు"

కథ



కొమ్ముల వెంకట సూర్యనారాయణ

"ఏం, రాజా? అలా అంతమంది స్నేహితులనేసుకుని తిరుగుతూ నీ చదువు ని నిర్లక్ష్యం చేసుకుంటున్నావేమో చూసుకో , ఇప్పటికే ఇంజనీరింగ్ కి వచ్చేవు,నీకు ఏది మంచి, ఏది చెడు నేను చెప్పవలసిన అవసరం లేదనుకుంటా " అన్నారు వెంకట్రావు గారు కొడుకు రాజా నుద్దేశించి.ఇద్దరూ స్నేహితుల్లాగే ఉంటారు

"లేదు నాన్నా, వాళ్ళంతా నా ప్రాణస్నేహితులు, నేనంటే ప్రాణమిస్తారు ఏ పరిస్థితులలోనైనా" అన్నాడు రాజా

"లేదు రాజా, నువ్వనుకుంటున్నట్లు అందరూ ప్రాణ స్నేహితులు ఎప్పటికీ కాలేరు, సరే! ఒక పని చేయి, నీ పది మంది ప్రాణ స్నేహితులతో ఒక వాట్సప్ గ్రూప్ ఉంది కదా, నేను ఇప్పుడొక పోస్ట్ ని నీకు ఫార్వార్డ్ చేస్తా. అది వాళ్ళకి నీ వాట్సప్ గ్రూప్ లో ఫార్వార్డ్ చేయి. వాళ్ళ ప్రతి స్పందన చూడు. దానిని బట్టి కొంతవరకు నీకు అర్ధమవుతుంది,వారిలో ఎంతమంది నీ ప్రాణ స్నేహితులో" అని ఈ విధంగా మెసేజ్ ఫార్వార్డ్ చేసారు వెంకట్రావు గారు తన కొడుక్కి.

"మా అబ్బాయి కి చికెన్ పాక్స్ తో ఒళ్ళంతా పొక్కులు వచ్చి చీము కారుతున్నాయి. నేను తీవ్రమైన జ్వరంతో, విపరీతమైన నీర్సంతో కనురెప్పలు కూడా పైకి లేవలేని పరిస్థితులలో ఉన్నాను.దయ ఉంచి మా అబ్బాయిని హాస్పిటల్కి తీసుకెళ్ళటానికి రాగలరు. అతి కష్టంతో ఈ మాటలు టైప్ చేయగలిగాను" దానిని రాజా తన ప్రాణ స్నేహితుల గ్రూప్ లో ఫార్వార్డ్ చేసాడు. కాసేపటికి పది మందికి చేరినట్లు, ఇంకాసేపటికి పది మంది చూసినట్లు తెలిసింది. తరువాత ఒక్కొక్కరి మెసేజ్ లు ఇలా రాసాగాయి "ఒరేయ్ రాజా,నేనూ ఊర్లో లేనురా, చాలా దూరంగా ఉన్నాను, రాలేకపోతున్నానురా" రవి నుంచి మెసేజ్

"రాజా, ఇంట్లో నేనే ఉన్నానురా మా నాన్నమ్మకి తోడుగా. అమ్మా,నాన్నలు ఊరెళ్ళారు, రెండు రోజుల వరకు రారురా, ఏమనుకోకు, మన స్నేహితులలో వేరెవరైనా వస్తారామో ప్రయత్నించు." వినోద్ సమాధానం

అంటకదరా, మా అమ్మానాన్నలు వెళ్తానని ఎంత చెప్పినా వినిపించుకోవటం లేదురా, రాలేకపోతున్నాను" కిషోర్ గ్రూప్ లో పోస్ట్ చేసాడు.

" నాకు ఒంట్లో అస్సలు బావుండలేదురా,నీర్సంగా ఉంది. రాలేకపోతున్నాను రా" ఫోన్ లో చెప్పాడు సురేష్ఇ ద్దరైతే గ్రూప్ లో మెసేజ్ చూసినా ఇటు గ్రూప్ లో గానీ, అటు ఫోన్ చేసి గానీ ఏ విధంగానూ ప్రతిస్పందించ లేదు.

ఆఘమేఘాల మీద చేరుకున్నాడు విహార్. అతని వెనుకే సాయి, తరుణ్, ఆదిత్య లు.

" ఒరేయ్!సారీరా, అది మా నాన్నకి వాళ్ళ స్నేహితుడునించి వచ్చిన పోస్ట్. నాన్న ఊళ్ళో లేకపోవటంతో అది నాకు ఫార్వార్డ్ చేసారు. దాన్ని నేను పొరపాటున మన గ్రూప్ లో ఫార్వార్డ్ చేసాను. సారీరా, జరిగిన విషయమిది" అని వాళ్ళకి చెప్పి పంపించివేసాడు రాజా

ఆ తర్వాత ఇంటికి చేరిన వెంకట్రావు గారితో రాజా,

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# నిజమైన స్నేహితుడు

గ్రూప్ లో వచ్చిన మెసేజ్ లు, ఎవరైతే స్నేహితులు ఇంటికి వచ్చారో చెప్పిన తరువాత "రాజా! చూసావా, ఆ మిగిలిన ఆరుగురిలో ఇద్దరైతే ఆ విషయాన్ని అస్సలు పట్టించుకోలేదు, మిగతా నలుగురిలో ముగ్గురు మరో రకంగా పాజిటివ్ గా రెస్పాండ్ కావచ్చు ఎలా అంటే రవి అయితే మా వాళ్ళనెవరినైనా రమ్మనమననా అనో లేదా నేనే బయలుదేరి వస్తాను కాస్త ఆలస్యం అవుతుంది ఓపికపట్టు అనో.

వినోద్ అయితే పక్కింటి వారినెవరినో ఒకరిని సాయం మా నాన్నమ్మకి పెట్టి వస్తానని చెప్పవచ్చు. కిషోర్ కి అయితే వాళ్ళ అమ్మానాన్న వంకన రావటానికి ఇష్టమే లేదనే విషయం చెప్పకనే చెప్పేసాడు." అన్నారు

చూసావు కదూ! స్నేహితుడు అనారోగ్య బారిన పడినాడు అని తెలిసిన తరువాత కూడా వెన్నంటి ఉండేవారు

నిజమైన స్నేహితులు. అంతే కాదు ఇంకో రెండు సందర్భాలలోనూ నిజమైన స్నేహితులు ఎవరో తెలుస్తారు.ఆ సందర్భాలు వస్తాయి అప్పుడు తెలుసుకుందివిగానీ" అన్నారు వెంకట్రావు గారు.

★★★

తలుపు చప్పుడైతే వెళ్ళి తలుపు తీసింది రాజా చెల్లాయి శాంతి. ఎదురుగా విహార్.

"శాంతీ, అన్నయ్య ఉన్నాడమ్మా, సరదాగా బయటకెళదామని రమ్మని మెసేజ్ పెట్టాడు" అన్నాడు విహార్ "లేదు, అర్జంటుగా మావయ్యకు ఒంట్లో బాగుండలేదని ఫోన్ వస్తే అమ్మా,నాన్నలను తీసుకుని వెళ్ళాడు" అంది శాంతి.

"సరేనమ్మా, ఇంట్లో ఎవరూ లేరు కదా, తర్వాత వస్తాలే అని వెళ్ళిపోయాడు. తర్వాత వచ్చిన సాయి అదే రీతిలో ప్రవర్తించాడు కానీ ఆ తర్వాత వచ్చిన తరుణ్ , ఆదిత్యలు మాత్రం ఇంట్లో ఎవరూ లేరని చెప్పేసరికి చొరబాటుగా లోపలికి వచ్చి వెకిలిగా ప్రవర్తించేసరికి శాంతి ,వాళ్ళ చెంప చెల్లుమనేలా సమాధానమిచ్చేసరికి చల్లగా జారుకున్నారు. లోపల వెనుక గదిలో ఉండి రాజా, వాళ్ళ అమ్మానాన్నలు వచ్చిన వాళ్ళ ప్రవర్తనను పరిశీలిస్తూనే ఉన్నారు.

"చూసావా,రాజా? స్నేహితుడి చెల్లి అయినా ఒంటరిగా కనిపించేసరికి ఆ సందర్భంలో స్నేహితుల ప్రవర్తన ద్వారా అసలు రంగు బయటపడుతుంది " అని వెంకట్రావు గారు చెప్పేసరికి రాజాకి నిజమైన స్నేహితుడు తెలుసుకొనే మరొక సందర్భం అర్థమైంది.

★★★

కొన్ని రోజులు గడిచాయి. విహార్,సాయి,రాజాలు ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్నారు. విహార్ మంచి పేకేజి తో ప్రైవేట్ కంపెనీ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా జాయిన్ అయితే ,సాయి అసిస్టెంట్ ఇంజనీర్ గా గవర్నమెంట్ జాబ్ లో జాయిన్ అయ్యాడు. రాజా కి క్యాంపస్ సెలెక్షన్ రాకపోవడంతో సాఫ్ట్ వేర్ ప్రోగ్రామ్స్ లో ప్రత్యేక శిక్షణ పొంది ఎట్టకేలకు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా ఒక ప్రైవేట్ కంపెనీ లో సెలెక్ట్ అయి జాయిన్ అయ్యాడు. ఇంతలోనే ఇంటి నుంచి చెల్లెలి ఫోన్.

"అన్నయ్యా! నాన్నకు గుండెపోటు వచ్చింది,హాస్పిటల్ లో అడ్మిట్ చేసాం . పరీక్షలు చేసారు. వాల్వ్స్ బ్లాకయినాయంట. స్టంట్స్ పడతాయంటున్నారు. అన్నీ కలుపుకుంటే మూడు లక్షలు వరకు ఖర్చు అవ్వచ్చొంటున్నారు. మాకు భయంగా ఉంది అన్నయ్యా! నాన్న పొదుపు చేసినవన్నీ కలిపితే లక్షకు మించటంలేదు.వెంటనే బయలుదేరిరా"అని.

వెంటనే బయలుదేరి వచ్చి బంధువులందరి దగ్గర అప్పుకోసం ప్రయత్నించాడు, ఎవరూ ముందుకు రాలేదు. ఇక తప్పని పరిస్థితులలో విహార్ని అడిగాడు.

"ఇల్లు లోన్ పై కట్టడానికి ప్రయత్నిస్తున్నానురా,సారీరా" అని

**సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ**

చేతులెత్తేసాడు. అప్పటికి ఇంకా ఇల్లు మొదలుపెట్టకబోయినా తన చేతిలో ఇంటికోసం ఉంచిన డబ్బులు యివ్వడం యిష్టం లేక ఎంత స్నేహితుడైనా. చివరి

ప్రయత్నంగా సాయి కి ఫోన్ చేసాడు. వెంటనే "ముందు అర్జంటుగా ఆపరేషన్ చేయించు,నేనూ వస్తున్నాను. నేను లక్ష వరకు సర్దగలను, ఏం వర్రీకాకు, మిగతా డబ్బు నాన్నని అడిగి తీసుకుంటా."అన్నాడు సాయి. రాజా కళ్ళవెంబడి కన్నీళ్ళు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.

★★★

ఆపరేషన్ విజయవంతం అయ్యింది. వెంకట్రావు గారు బాగా కోలుకున్నారు. జనరల్ వార్డ్ కి తరలించారు.అదుగో మరల వచ్చాడు సాయి, వెంకట్రావు గారిని చూడటానికి.

"నాన్నా!సాయే నీ ఆపరేషన్ కి రెండు లక్షలు సర్దాడు " అని రాజా చెప్పేసరికి "నేను చెప్పాను చూడు ఇదుగో ఇటువంటి సందర్భంలో నిజమైన స్నేహితుడు ఎవరనేది తెలిసేది.ఆర్థిక ఇబ్బందులెదురైనపుడు మొహం చాటేయకుండా ఆదుకునేవాడే నిజమైన స్నేహితుడు."ఆ ఒక్కడే నీ నిజమైన స్నేహితుడు సాయి రా" అంటూ వెంకట్రావు గారు సాయిని గుండెలకి ప్రేమగా హత్తుకున్నారు, కనుకొనకులనుంచి జారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ. అప్పటితో రాజా కి అర్థమైంది నిజమైన స్నేహితుడెవరో.

-సమాప్తం-

## జోక్స్&జోక్స్

పంకజం: వదినా.. నేను విన్నది నిజమేనా.. నీకెంత కష్టం వచ్చింది

సుందరి: నా కర్మ అలా ఉంది. ఎవరు మాత్రం ఏం చేస్తారు

పంకజం: ఆరోగ్యంగా ఉండే అన్నయ్యగారు ఎలా పోయారు

సుందరి: తలకి దెబ్బ తగిలి కాస్త పిచ్చిపిచ్చిగా మాట్లాడారు

పంకజం: మతిస్థిమితం కోల్పోతేనే ప్రాణాలు పోయావా..

సుందరి: తలపై గట్టిగా ఒకటిస్తే సినిమాల్లోలాగ మామూలు మనిషవుతాడని రోకలిబండతో ఒక్కటి ఇచ్చాను.. అంతే వదినా!

## జోక్స్&జోక్స్

వెంగళప్ప: కడుపులో నొప్పి సార్.. గత కొన్ని రోజులుగా ఇలాగే ఉంది.

డాక్టర్: మీరు ఫాస్ట్ ఫుడ్, రోడ్డు పక్కన చేసే ఫుడ్ తింటారు కదా..

వెంగళప్ప: అవును డాక్టర్.. అందుకే ఈ సమస్య

డాక్టర్: టెస్టులు చేశాను. నేను రాసిచ్చే ట్యాబ్లెట్లు మూడు రోజులు వాడితే సరిపోతుంది..

వెంగళప్ప: డాక్టర్ గారు.. సైడ్ ఎఫెక్ట్స్ ఏవీ రావు కదా?

డాక్టర్: ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిసీ.. బయట అడ్డమైనవి తింటారు. స్మోకింగ్, డ్రింకింగ్ కూడా చేస్తారు.. కానీ డాక్టర్ మెడిసిన్ రాసిస్తే మాత్రం ఎక్కడ లేనన్ని అనుమానాలొస్తాయి మీకు..

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# తియ్యటి తోడు

కథ



రాచపూటి రమేష్

నింగి నుండి నేలకు జాలువారుతున్న ఆకాశగంగలా సహ్యాద్రి కొండల నుండి పరవళ్లు తొక్కుతూ, రాతిబండల నడుమ నుండి వయ్యారాలు పోతూ, నేలకు దుముకుతూందా జలపాతం.

నీటి ధారలు పడేచోట నిల్చుని, సుడులు తిరుగుతూ కిందికి జాలువారుతున్న జలపాతం కిందికి వెళ్లాలంటే భయపడుతూ, చేతులను నీళ్లకింద వుంచి, వుత్సాహంతో వురకలేస్తూ కేరింతలు కొడుతున్న వనకన్యలాంటి రాధను చూస్తూ పరవశిస్తున్నాడు వంశీ.

నీటిలో తడిసిన పైట అందాలను దాచలేకుండా వుంది. లేడికళ్లలాంటి నయనాలు, కొనదేరిన నాసిక, చెర్రీ పళ్లవంటి బుల్లి పెదవులు, ఎర్రటి బ్రౌజ్‌లోంచి కవ్విస్తూ కనిపిస్తున్న ఎద ఎత్తులు, సన్నటి నడుముతో చూడగానే సహజసుందరిలా వూరిస్తున్నది ఆటవిక సుందరి రాధ.

నవ్వుతూ వంశీని జలపాతం కిందికి రమ్మని పిలుస్తూ వుంది రాధ. కానీ, తాను ధరించిన అలన్‌సోలీ టీ షర్టు, జీన్సును తడుపుకోవడం వంశీకి బొత్తిగా ఇష్టం లేకుండా పోయింది. జవహార్ కోటను చూడవస్తూ మరొక జత బట్టలు కూడా తెచ్చుకోలేదు. కోటను ఫోటోలు తియ్యడానికి తెచ్చిన కెమెరా, స్పైరల్ నోట్ బుక్, కొన్ని హిస్టరీ పుస్తకాలు, టవల్, ఛార్జర్ వగైరాలు మాత్రమే వంశీ బ్యాగ్‌లో వున్నాయి.

పాల్ఘార్ కొండల నడుమ కోయగూడెంలో పుట్టి పెరిగిన చలాకీ కన్నె రాధ ఇక్కడ ఇలా పరిచయమౌతుందని కలలో కూడా అనుకోలేదు వంశీ.

తమ పరిచయానికి పరోక్షంగానైనా సహాయపడిన తండ్రి రమణారెడ్డికి థ్యాంక్స్ చెప్పుకున్నాడు వంశీ. రాయలసీమలో ఇంకా ఫ్యాక్షన్ మంటలు సమసిపోని ఒక నియోజకవర్గానికి శాసనసభ్యుడిగా వున్న రమణా రెడ్డి ఎప్పుడూ పార్టీ ప్రజల కార్యక్రమాల్లో బిజీగా వుంటాడు. ఆయన వంశీ, రాధల పరిచయానికి కారణ భూతుడయ్యాడంటే అది గమ్మత్తైన విషయమే. అది ఎలా జరిగిందో తెలుసుకోవాలంటే నాలుగురోజులు వెనక్కి వెళ్ళాలి.

★ ★ ★

ఢల్లీ యూనివర్సిటీలో పీజీ డిగ్రీ హిస్టరీ విభాగంలో తీసుకున్న వంశీని రాజకీయాల్లోకి రమ్మని ఒత్తిడి చేశాడు రమణారెడ్డి.

కానీ వంశీ తండ్రి మాటలు లక్ష్యపెట్టకుండా తనకిష్టమైన చరిత్ర విభాగంలోనే పీహెచ్.డీ. పూర్తి చేశాడు. అతని ప్రతిభ ఆధారంగా పురావస్తు శాఖలో పరిశోధకుడిగా వెంటనే ఢల్లీలోనే ఉద్యోగం లభించింది.

కొడుకును రాష్ట్రానికే బదిలీ చేయించి, పెళ్లి చేయాలని రమణారెడ్డి ప్రయత్నిస్తూనే వున్నాడు

ఈలోగా సంస్థ డైరెక్టరు వంశీని మహారాష్ట్రలో మహాబలేశ్వర్ ప్రాంతంలో వున్న కొన్ని గిరిజన దుర్గాలపై పరిశోధించి, ఫోటోలు తీసుకురమ్మని పురమాయించాడు.

కొడుకు పడమటి కనుమల్లోని గిరిజన ప్రాంతానికి వెళ్తున్నాడని తెలిసిన రమణారెడ్డి మనసు ఒకింత కీడు శంకించింది. ఎన్నికలలో తనతో పోటీపడి ఓటమి చవిచూసిన ఫ్యాక్షనిస్టు కొండారెడ్డి తనను దెబ్బ తీయడానికి

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# తియ్యటి తోడు

అవకాశం కోసం ఎదురుచూస్తూ వున్నాడని రమణారెడ్డికి తెలుసు, అదను చూస్తున్న ప్రత్యర్థి ఏమైనా చేయగలడు.

అందుకే పార్టీ మీటింగ్‌కు వెళ్తూ వంశీకి అతడు వెళ్లిన ప్రాంతంలో రక్షణ కల్పించమని, ఏ సెక్యూరిటీ ఏజెన్సీకో చెప్పమని తన పి.ఏ. శంకరరావుకు చెప్పి వెళ్లాడు.

కానీ శంకరరావు అప్పటికే కొండారెడ్డి కాసులకు లొంగిపోయాడు. తమ బాస్‌కు చెందిన ఎన్నో ఆంతరంగిక విషయాలను ప్రత్యర్థికి చేరవేస్తూ వున్నాడు.

కాబట్టి వెంటనే వంశీ పడమటి కనుమలకు ఒక్కడే వెళ్లిన విషయాన్ని కొండారెడ్డికి ఫోన్లో చేరవేశాడు.

కానీ బాస్ చెప్పిన పని చెయ్యకపోతే తన పదవికే ముప్పు. కాబట్టి రమణారెడ్డికున్న సిమెంటు గోడౌన్లు తనిఖీ చెయ్యడానికి వెళ్తూ, సెక్యూరిటీ ఏజెన్సీ విషయం మరొక సహాయకుడు పట్టాభికి అప్పజెప్పాడు.

పట్టాభి ఏ పనీ తిన్నగా చెయ్యడని శంకరరావుకు తెలుసు. కాబట్టే ఆ పనిని పట్టాభికి అప్పజెప్పాడు.

వంశీ వెళ్తున్న జవహర్ రాజ్ వాడాలో సెక్యూరిటీ ఏజెన్సీ గురించి ఇంటర్‌నెట్లో వెతికాడు పట్టాభి. కానీ అక్కడ ఏ భద్రతా సంస్థ వున్నట్లుగా అతనికి తెలియరాలేదు. ఒక ఎస్కార్ట్ సంస్థ మాత్రం వుంది.

ఎస్కార్ట్ అంటే ఎవరని పట్టాభి డిగ్రీ చదువుతున్న మేనల్లుడిని అడిగితే, "ఎస్కార్ట్ అంటే అదీ ఒక సెక్యూరిటీ సంస్థేనని" చెప్పాడా బాల మేధావి.

ఎవరెస్ట్ ఎస్కార్ట్స్ సంస్థకు ఫోన్ చేశాడు పట్టాభి. ఆ సంస్థ రెండు, మూడు రాష్ట్రాలలో పర్యటనలకు వెళ్లే టూరిస్టులకు కావలసిన తోడును సమకూరుస్తుంది. ఆ తోడు ఆడైనా, మగైనా కస్టమర్ అభిరుచిని బట్టి వుంటుంది. ఆ ఎస్కార్ట్‌లు కస్టమర్‌కు గైడ్‌గానే వున్నా, అవసరమైనప్పుడు కస్టమర్ల మిగతా అవసరాలు తీర్చి డబ్బులు సంపాదిస్తూ వుంటారు.

డిగ్రీ పాసైన గూడెం పిల్ల రాధపై పాల్ఘర్‌లోని ఎస్కార్ట్ సంస్థ ఏజెంటు కన్ను పడిరది. మాయమాటలు చెప్పి రాధను తమ కంపెనీలో ఎస్కార్టుగా తీసుకున్నాడు. నెలకు పదిహేనువేల జీతంతోపాటు, పైన రాబడి వుంటుందనే సరికి, అనారోగ్యంతో వున్న తల్లి వైద్యానికా డబ్బు పనికొస్తుందని రాధ వెంటనే వుద్యోగంలో చేరింది.

ఢల్లీనుండి కుర్రవాడు వస్తున్నాడనే సరికి ఏజెంట్ కాంతిలాల్ రాధకు వంశీతోబాటు ఎస్కార్ట్‌గా వెళ్లే పని అప్పజెప్పి "కస్టమర్ అభిరుచిని బట్టి నడుచుకోవాలనీ, అతడున్నన్ని అతడితోనే వుండాలని చెప్పాడు.

రాధ మొదట భయపడ్డా, వంశీ కలుపుగోలుతనం చూసి ఒక్కరోజులోనే అతడితో చనువుగా వుండసాగింది.

★ ★ ★

"పదండి సార్, ఇంకా షిర్‌గాన్ కోట, వసై దుర్గం చూసి రావాలని చెప్పారు కదా" రాధ మాటలకు ఇహలోకంలోకి వచ్చిన వంశీ బ్యాగ్ సర్దుకొని పైకి లేచాడు.

పచ్చటి ప్రకృతి, కనువిందైన కొండలూ, జలపాతాల నడుమ అలరారే జవహర్ కోట వర్లీ పెయింటింగ్స్‌కు ప్రసిద్ధి చెందింది. రసాయనాలేవీ వాడకుండా బియ్యంపిండీ, సహజ రంగులతో చిత్రించిన ఆ చిత్రపటాలు వందేళ్ళైనా చెక్కు చెదరకుండా వున్నాయి. పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయవి.

కోటతోబాటూ ఆ పెయింటింగులనూ కెమెరాలో బంధించిన వంశీ శివాజీ మహరాజ్ పాలించిన షిర్‌గాన్ కోటను చూడడానికి వెళ్తున్నాడు టాక్సీలో.

దారి పొడవునా రాధ వసపిట్టలా హిందీలోనే కబుర్లు చెప్తూ వస్తోంది.

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# తియ్యటి తోడు

ఆ మాటలతో వంశీకి టైమే తెలియరాలేదు.

"మీరు మా కులదేవత వుత్సవంలో తార్ప నృత్యం జరిగే సమయంలో వచ్చి వుండవలసింది వంశీ సాబ్, ఆ సందడే వేరు. హనుమాన్ జయంతి నుండి ప్రారంభమయ్యే మహాలక్ష్మి యాత్రలో మా గూడెం అమ్మాయిలంతా ఒక పొద్దులు చేస్తూ నిష్ఠగా పూజలు చేస్తుంటాం" అంది రాధ.

"ఐతే నువ్వూ ఆ జాతరలో తార్పా డాన్స్ చేస్తావన్నమాట" అన్న వంశీ మాటలకు సిగ్గుల మొగ్గైంది రాధ.

మరాఠాలు, పోర్చుగీసువారు తమ నౌకా కేంద్రంగా ఉపయోగించిన వసై, షిర్‌గాన్ కోటలను చూసి, చీకటి పడుతుండగా రాజ్‌వాడలోని హోటల్ రూంకు చేరుకున్నారు రాధ, వంశీ.

"నువ్వు ఇంటికి వెళ్లావేమో వెళ్లు" అన్నాడు వంశీ రాధకు రెండు ఐదు వందల నోట్లు అందిస్తూ.

"ఈ టైంలో మా వూరికి బస్సులుండవు" అంది రాధ కంగారుగా.

"ఐతే నీకు వేరే గది తీస్తాను" అన్నాడు వంశీ.

కానీ ఎస్కార్ట్ సంస్థ ఏజెంట్ మన్నాలాల్ ఆ హోటల్ పరిసరాల్లో కనిపించేసరికి రాధ కంగారు పడిరది. తనను వేరే గదిలో వుండక, క్లైంట్‌ను అంటిపెట్టుకొని వుండమని మన్నాలాల్ చెప్పాడని గుర్తొచ్చిందామెకు.

"మరొక గది ఎందుకు? మీ గదిలోనే నేలపై పడుకుంటాను" అంది రాధ. హోటల్లో ఖాళీ రూములు కూడా లేవు.

"సరే నా గదిలోనే మరొక మంచం వుంది, నువ్వక్కడ పడుకో" అన్నాడు వంశీ.

రెస్టారెంట్లో టిఫిన్ చేశాక, గదికి తిరిగొచ్చి నిద్రకుపక్రమించారు ఇద్దరు.

★ ★ ★

రమణారెడ్డి కొడుకు ఒంటరిగా పడమటి కనుమలు పోయుండాడంట. వాడిని వేసేస్తే, రమణారెడ్డి బేలగా ఐపోతాడు, మనకింక తిరుగుండదు. మన చేతికి మట్టంటుకోకుండా పని పూర్తి చేసుకోని రావాలి" తన దగ్గర పనిచేసే యాదవ్, నరసింహుల చేతికి ముప్పై వేలు అందిస్తూ చెప్పాడు కొండారెడ్డి.

యాదవ్ ఆ డబ్బు చాలదన్నట్లు చూశాడు, బాస్ వంక.

"ఇది అడ్వాన్స్ మాత్రమే, పని పూర్తయ్యాక చెరొక రెండు లక్షలు ఇచ్చేస్తాను. ఐతే మన పేరెక్కడా బయటకు రాకూడదు. ఎవరో రౌడీలు లెక్కకోసం చేసిన ఖూనీ మాదిరి పోలీసులకు అగుపడాల" అన్నాడు కొండారెడ్డి చిన్నగా.

"అదంతా మేం చూసుకుంటాంలే అన్నా" అన్నాడు నరసింహ, జులపాలలు సవరించుకుంటూ.

"వాడు ఏ వూరికి పోయుండాడో శంకరాన్ని అడిగి తెలుసుకుంటా, మీరు ఈ రాత్రికే బయల్దేరాల" అన్నాడు కొండారెడ్డి సాలోచనగా.

★ ★ ★

వంశీకి నిద్ర ఒక పట్టాన పట్టలేదు, "మొదటిసారిగా తానున్న గదిలో యుక్తవయసులో వున్న ఒక అమ్మాయి వుంది" ఆ ఆలోచన అతణ్ణి కలవర పరుస్తూ వుంది.

అప్రయత్నంగా రాధవంక చూశాడు. అతనివైపే చూస్తున్న రాధ తల పక్కకు తిప్పుకుంది. వంశీ ముఖంపై ఒక కొంటె నవ్వు వెలిసింది.

రాధకు కూడా టెన్షన్‌గా వున్నట్లున్నది. ఆదుర్దాకు సూచనగా ఆమె వక్షభాగం ఎగసెగసి పడ్తూ వుంది. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు వేగవంతమయ్యాయి.

వంశీ వుండబట్టలేక పోయాడు. రాధను సమీపించి చిన్నగా ఆమె చేతిని తాకాడు. రాధ అతని వంక చూసి చిరునవ్వు నవ్వింది. వంశీ ఆమె పెదవులపై సుతారంగా

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# తియ్యటి తోడు

ముద్దు పెట్టాడు. రాధ అతడిని లతలా అల్లుకుపోయింది. వంశీకి తొలిసారి యుక్తవయసులోని అమ్మాయి స్పర్శ పులకింతలు లేపింది. ఆగలేక రాధను గట్టిగా హత్తుకున్నాడు వంశీ.

పాలరాతి శిల్పం వంటి రాధ మెడ, వక్షోజాలు, నాభి ముద్దులతో నింపేశాడు వంశీ.

సముద్రపు తాకిడికి నునుపుదనం సంతరించుకున్న బండరాళ్లలా వున్న మెత్తటి ఆమె శరీర భాగాలు వంశీలోని పురుషత్వాన్ని పులకింప చేస్తున్నాయి. ఆమె చేతులు అతడి భుజం చుట్టూ వేసి గట్టిగా హత్తుకుంటూ వున్నాయి.

సమాగమంలో ఇద్దరికీ సమయమే తెలియరాలేదు. మన్మధలీలతో రెండు శరీరాలు అలసి సొలసి సేద తీరాయి.

హఠాత్తుగా కల నుండి లేచిన వంశీ కంగారుగా రాధ వంక చూశాడు. ప్రయాణపు బడలికతో ఆమె సుకుమార దేహం అలసిందేమో, హాయిగా నిద్రపోతోంది.

తన వూహకు తానే సిగ్గుపడ్డాడు వంశీ. తనను నమ్మి తలదాచుకున్న యువతిపట్ల ఇటువంటి ఆకర్షణ పెంచుకోకూడదనుకున్నాడు. ఇంతకు మునుపు పెళ్లిచూపుల్లో ఇద్దరమ్మాయిలను చూసినా వారిలోని ఆడంబరతత్వం, కృత్రిమ వేషధారణ అతనికి నచ్చలేదు. కాబట్టే ఆ సంబంధాలు తిరగ్గొట్టాడు. రాధ నిర్మలత్వం వంశీని కట్టి పడేసింది. పల్లెటూరి ముగ్ధత్వంతో స్వచ్ఛమైన గూలాబీలాంటి రాధ అతడి మనసునాకట్టుకుంది.

★ ★ ★

"ఈరోజు మనం అర్నాలా ఫోర్ట్‌కి వెళ్లాలి" రెస్టారెంట్లో టిఫెన్ చేస్తుండగా రాధతో చెప్పాడు వంశీ.

"దాని గురించి మాకు పాఠాల్లో చెప్పారు. జలదుర్గమని కూడా అంటారు దాన్ని. కోటుచుట్టూ అగడ్త వుంటుందట. చాలా బాగుంటుందని మా ఫ్రెండ్స్ చెప్పారు" అంది రాధ.

వీరి మాటలు వింటున్న పక్క టేబిల్‌లోని పెద్దమనిషి లేచి వచ్చి, "మీ మాటలు వింటుంటే ఆ కోట చూడాలని నాకూ అనిపిస్తూ వుంది సార్, మీకు అభ్యంతరం లేకపోతే నేనూ మీతో వస్తాను" అన్నాడు.

"ఫర్వాలేదు రండి, మీరేం చేస్తూ వుంటారు?" అడిగాడు వంశీ.

"పూనేలోని అణుశక్తి కేంద్రంలో సైంటిస్ట్‌ని. మూడురోజుల హాలిడేస్‌కి ఇక్కడికి వచ్చాను. ఈరోజే మొదటి రోజు. నా పేరు సూర్య బెనర్జీ" అన్నాడు పైజామా బట్టల్లోని ఆ పిల్లిగడ్డం పెద్దాయన.

"మీ బ్రేక్‌ఫాస్ట్ పూర్తయ్యిందా?" అడిగాడు వంశీ.

"ఇప్పుడే చేశాను" అని బెనర్జీ వారితోబాటు నడిచాడు.

వంశీ, రాధ బ్యాక్ సీట్లో కూర్చుంటే, బెనర్జీ ఫ్రంట్ సీట్లో డ్రైవర్ పక్కనే కూర్చున్నాడు టాక్సీలో.

తమ కారును మరో రెండు వాహనాలు వెంబడిరచడం వంశీ గమనించలేదు.

★ ★ ★

చతురస్రాకారంలో వున్న అర్నాలా కోటలో జనం తక్కువగా వున్నారు. కోటచుట్టూ కందకం గగుర్పాటు కలిగిస్తోంది.

"కోట అద్భుతంగా వుంది. దీని వివరాలు మీకు తెలుసా?" అర్నాలా కోట చూసి వెలుపలికి వస్తుండగా వంశీని అడిగాడు బెనర్జీ. బెనర్జీకి కొంచెం వెనకగా సఫారీ సూట్లలో వస్తున్న ఇద్దరు ఆజానుబాహువులూ వంశీ చెప్పే చారిత్రక అంశాలను శ్రద్ధగా వింటున్నారు.

"1516లో ఈ కోటను సుల్తాన్‌బేగ్ నిర్మించాడు. మరాఠా పాలకులు, మొఘల్ చక్రవర్తులు, పోర్చుగీసువారు, పీష్వాలు పాలించారు దీన్ని" కెమెరాను బేగ్‌లో వుంచడానికి కొద్దిగా కిందికి

సాధరణ
ప్రచురణకు
ఎన్నికైన
కథ

# తియ్యటి తోడు

వంగాడు వంశీ, చెప్తూనే.

ఒక బుల్లెట్ వంశీ తలపైనుండి దూసుకెళ్లి ఒక చెట్టుబోదెలో ఇరుక్కుపోయింది. గుబురుగా వున్న చెట్ల వెనుక నుండి యాదవ్ వెలుపలికి వచ్చి రివాల్వర్ మళ్లీ వంశీకి గురిపెడ్తున్నాడు.

వంశీ నివ్వెరపోయాడు. యాదవ్ తిరిగి కాల్చేంతలో బెనర్జీ వెనుకే వున్న సఫారీసూట్‌వాలా జేబులోంచి రివాల్వర్ తీసి యాదవ్‌ను కాల్చాడు. చేయి రక్తమోడుతుండగా యాదవ్ బాధతో అరచి గన్ వదిలేశాడు. కింద పడిన యాదవ్ చుట్టూ కొందరు గుమిగూడారు.

"కమాన్ రన్'' అరిచాడు సూట్‌వాలా. వంశీకీ, రాధకూ జరుగుతున్నది అర్థం కాలేదు. ఐనా వారిద్దరూ బెనర్జీతో కలిసి కోట ప్రహరీగోడ అవతల పార్క్ చేసిన టాక్సీ వద్దకు పరుగెత్తారు. టూరిస్టులలో కలకలం రేగింది.

కారు సమీపిస్తూ రాధ వెనక్కు తిరిగి చూసింది. కోట ద్వారం నుండి బయటకు వచ్చిన నరసింహ వంశీకి గన్ గురిపెడ్తూ కనిపించాడు. "వంశీజీ'' అని అరుస్తూ రాధ వంశీని దూరంగా తోసేసింది.

నరసింహ కాల్చిన బుల్లెట్ రాధ భుజంలోకి దిగబడిరది. రక్తమోడుతూ రాధ కిందపడి స్పృహ కోల్పోయింది.

సఫారీసూట్‌వాలా నరసింహను ఎయిమ్‌చేసి షూట్‌చేశాడు. నరసింహ బాధతో అరచి నేలకూలాడు.

అంతలో అక్కడికి చేరుకున్న పోలీసు సిబ్బంది నరసింహ, యాదవ్ వారి అనుచరులను అరెస్ట్ చేశారు.

రాధ చిన్నగా కళ్లు తెరచింది. ఆమె కళ్లకు వంశీ, బెనర్జీ, డాక్టర్లు, నర్సులతో బాటూ మరొక పెద్దాయన కనిపించాడు.

"నీకేం భయంలేదు రాధా, నీకు ఫస్ట్ ఎయిడ్ చేయించి, దగ్గరలోని ముంబాయికి తరలించి హాస్పిటల్లో చేర్చాం. సర్జరీ చేసి బుల్లెట్ తీసేశారు'' చిరునవ్వుతో చెప్పాడు వంశీ.

"బెనర్జీ అణు రహస్యాలు తెలిసిన సైంటిస్ట్. అతడు బయటి ప్రాంతాలకు వెళ్లినప్పుడు అతనికి తెలియకుండానే భద్రతా సిబ్బందిని నియమిస్తుంది ప్రభుత్వం. అలా వచ్చిన సెక్యూరిటీ సిబ్బంది వారి ప్రాణాలు కాపాడారు. తమ కారు వెనుకే మరొక కారు రావడం చూసి ఆ సిబ్బంది స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు.

"నాన్నా, నేను రాధను పెళ్లాడదలచాను'' తనపై దాడి జరిగిందని తెలియగానే ఆఘమేఘాల మీద ఫ్లైట్‌లో ముంబాయి చేరుకున్న తండ్రి రమణారెడ్డితో చెప్పాడు వంశీ.

"నీ ప్రాణం కాపాడిన అమ్మాయి ఎవరైనా నువ్వు చేసుకుంటానంటే కాదంటానా?'' అన్నాడు రమణా రెడ్డి. తెలుగు తెలిసిన నర్సు ఆ మాటలను హిందీలోకి అనువదించి చెప్పింది రాధకు. సిగ్గుతో మొగ్గింది రాధ ఆనందంలో తేలియాడుతూ.

★ ★ ★

మన
పురాణాలు

మహాభారతంలో ఉపాఖ్యానాలు

# ఋశ్యశృంగుడి చరిత్ర



ఆచార్య ఇరపని మాధవి

పూర్వకాలంలో కశ్యపుడి కుమారుడైన విభాండకుడు అనే మహర్షి మొక్కవోని బ్రహ్మచర్య దీక్షతో తపస్సు చేస్తున్నాడు. అతడు ఒకరోజు ఒక చెరువులో స్నానం చేసే సమయంలో అతిలోక సౌందర్యరాశి అయిన ఊర్వశి కనిపించింది. వెంటనే అతడు మన్మథవికారానికి లోనవ్వగా అతడి వీర్యం జారిపడింది. విభాండకుని రేతస్సుతో కలిసిన నీటిని ఒక ఆడదుప్పి త్రాగి గర్భం ధరించింది. ఆ దుప్పికి ఋష్యశృంగుడు జన్మించాడు. ఆ ఋష్యశృంగుడు తండ్రిని, అతడి ఆశ్రమాన్ని తప్ప వేరొకటి ఎరుగక మిక్కిలి అమాయకుడై కఠోరతపస్సు చేస్తున్నాడు.

బలవంతుడైన రోమపాదుడు అంగ దేశానికి రాజు. అతడు పురోహితులకు చేసిన అపరాధం వల్ల బ్రాహ్మణులు అతడిని విడిచారు. అందువలన ఆ దేశంలో వానలు కురవటం మానివేశాయి. అనావృష్టికి భయపడి రోమపాదుడు బ్రాహ్మణులను ఆరాధించి వర్షాలెందుకు కురవటం లేదు, దానికి విరుగుడు ఏమిటో తెలుపమనగా వారు ప్రసన్నులై నీవు అధికగర్వం కలవాడివి కావటం చేత నిన్ను బ్రాహ్మణులు విడిచారని, వారు విడవటం చేత దేవతలు విడిచారని అందుకే వానలు కురవటం లేదని చెప్పారు. శాంత ప్రవృత్తిగల ఋశ్యశృంగుడనే మహాముని ఉన్నచోట ఎప్పుడూ వర్షాలు ఎక్కువగా కురుస్తాయని, అటువంటి వరం ఆ మునికి దేవేంద్రుడు ఇచ్చాడని, ఆ మునిని అంగ దేశం తేగలిగితే వర్షాలు పడతాయని తెలిపారు. రోమపాదుడు తన అపరాధానికి ప్రాయశ్చిత్తం చేసి వారు చెప్పిన విధంగానే తెలివైనవారితో ఆలోచించి, వేశ్యలలో చతురలు అయిన సుందరీమణులను పిలిపించి ' మీ చాకచక్యం ఉపయోగించి ఋశ్యశృంగుడి మనసు రంజింపజేసి ఇక్కడకు తీసుకురండి ' అని చెప్పాడు. ఆ వేశ్యాంగనలు తమతోపాటు రుచికరాలైన ఆహార పదార్థాలను, పరిమళాలు వెదజల్లుతున్న పువ్వులను, గంధం మొదలైన అనులేపనాలను తీసుకొని నావపై నిర్మించిన ఆశ్రమంలో అప్సరసల వలె వెళ్ళారు. ఆశ్రమంలో విభాండక మహాముని ఆశ్రమంలో విభాండక మహాముని తగినవేళలో అగ్నిహోత్రాన్ని జ్వలింపజేయటానికి ఋశ్యశృంగుడిని నియోగించి తాను అడవిలో దొరికే పండ్లు మొదలైన వాటిని తెచ్చేందుకు అడవిలోకి వెళ్ళాడు. ఆ అవకాశం కనిపెట్టిన ఒక ముసలి వేశ్య కొత్తగా యౌవనవతి అయిన తన కుమార్తెను ఋశ్యశృంగుడి దగ్గరకు పంపింది. ఋశ్యశృంగుడు తన దగ్గరకు వచ్చిన ఆమెను మునికుమారుడిగా భావించి

మన పురాణాలు

# మహాభారతంలో ఉపాఖ్యానాలు

ఆమెకు స్వాగతసత్కారాలు చేసేందుకు ఎదురువెళ్ళి " ఓ మునికుమారా! నీవు ఏ ఆశ్రమం నుంచి ఇక్కడకు వచ్చావు? నేను ఇంతకుముందు ఎప్పుడూ నీవంటి అందమైన రూపం గల ఋషిపుత్రుడిని చూడలేదు. నీవు ఇక్కడే ఉండు" అన్నాడు. అతడు ఆమెకు ఆసనం, అర్ఘ్యం, పాద్యం సమర్పించి రుచికరాలైన అడవిపండ్లను ఇచ్చాడు. ఆమె అతడితో మా ఆశ్రమం మీ ఆశ్రమానికి మూడు ఆమడల దూరంలో ఉంది. నువ్వు కూడా అక్కడికి రా, నాతో స్నేహం చేయి, నువ్వు మా ఆశ్రమానికి వస్తానంటే నీ అతిథి సత్కారాలు స్వీకరిస్తాను " అంది. అతడు అందుకు అంగీకరించాడు. ఆమె అతడికి తాను తెచ్చిన సుగంధ పుష్పాలను, వస్త్రాలను, తినుబండారాలను, పానియాలను సమర్పించగా అతడు వాటిని స్వీకరించాడు. ఆమె ఇంకా అతడి ముందు బంతి ఆటలో, నాట్యకళలో, పాటలు పాడటంలో తనకుగల చాతుర్యాన్నంతా ప్రదర్శించింది. ఋశ్యశృంగుడికి దేహేంద్రియ స్పృహను వికసింపచేసి ఆమె వెళ్ళిపోయింది.

ఋశ్యశృంగుడు ఆమె వెళ్ళినవైపే తన దృష్టిని నిలిపి,



అగ్నిహోత్రాలను వేల్చక పరాకుగా తారుమారైన బుద్ధితో అలాగే ఉన్నాడు. అడవి నుండి వచ్చిన విభాండకుడు తన కొడుకును చూచి ఎందుకలా ఉన్నావని, అగ్నిహోత్రాన్ని వేల్చకుండా కాలాన్ని ఎందుకు అతిక్రమించావని అడిగాడు. దానికి ఋశ్యశృంగుడు " నేడు నా దగ్గరకు ఒక బ్రహ్మచారి వచ్చి వెళ్ళాడు. అతడు చాలా అందగాడు. అందమైన జడలు కలవాడు, వక్షస్థలంలో రెండు గుండ్రని మాంసపిండాలు కలవాడు, అతడి కంఠంలో చక్కని జపమాల ఉంది. అతడి సన్నని నడుము వణుకుతుంది, అతడు నడుస్తుంటే మధురధ్వని వినిపిస్తుంది, అతడు మాట్లాడుతుంటే గండు కోయిల పాటలాగా ఉంది. ఆ షిపుత్రుడుకట్టిన వస్త్రాలు అద్భుతంగా ఉన్నాయి.

అతడి శరీరం నుంచి మంచి సువాసన వస్తుంది. ఆ ఋషికుమారుడి పట్ల నా హృదయం ఆకర్షితమైంది. అతడు అమృతంలాంటి పండ్లను, తీయని పానియాలను ఇచ్చాడు. అతడు పూలు వెదజల్లితే అవి

# మహాభారతంలో ఉపాఖ్యానాలు

ఎంతో సువాసనను ఇచ్చాయి. అవి అడవిపూలు కావు. ఆ ఋషికుమారుడితో కలిసి అతడి ఆశ్రమంలో ఏకాంతంగా తపస్సు చేయాలని నా కోరిక " అని చెప్పాడు.

కుమారుడి మాటలకు విభాండకుడు ఆశ్చర్యపోయి ఋషుల తపస్సులకు అంతరాయం కలిగించటానికి రాక్షసులు అడవులలో అనేక రూపాలతో తిరుగుతుంటారని, వారిచ్చే ఆహారపానియాలు స్వీకరించకూడదని, ఎక్కువ సువాసన గల పువ్వులను మునులు ఉపయోగించకూడదని జాగ్రత్తలు చెప్పాడు. ఎప్పటిలాగే అడవిలో దొరికే పండ్లు తెచ్చేందుకు విభాండకుడు అడవికి వెళ్ళగా, ఆ వేశ్యచేత ఆకర్షితుడైన ఋశ్యశృంగుడు తన తండ్రికి తెలియకుండా మంచి ప్రవర్తనకు నిలయమైన తన ఆశ్రమం వదిలి మానవ సహజ నడవడికలో చిక్కుకొని ఆమె వెంట అంగదేశం వెళ్ళాడు. రోమపాదుడి ఆజ్ఞ మేరకు తోటలో ఉన్నాడు. అతడు నివసించటం వలన అంగదేశంలో విపరీతంగా వర్షాలు కురిసి సరస్సులు, నదులు పొంగిపోయాయి. రోమపాదుడు సంతోషించి తన కుమార్తె శాంతను ఋశ్యశృంగుడికిచ్చి వివాహం చేశాడు.

రోమపాదుడు కట్నంగా ధననిధులు, ఆభరణాలు, దాసీలను, బంగారు శయ్యలు, ఆసనాలను సమర్పించాడు. వేలకొద్దీ ఆవులను ఇచ్చాడు. వివిధ ప్రదేశాలలో ఆవులతో నిండిన గొల్లపల్లెలను నెలకొల్పి రోమపాదుడు ఋశ్యశృంగుడిని సత్కరిస్తున్నాడు. విభాండకుడు కొడుకు కనిపించక అతడిని వెదుకుతూ దేశదేశాలు తిరిగి

అంగదేశం చేరి ఆవులతో నిండిన ఒక గొల్లపల్లెలో గోపాలకుల చేత సత్కరించబడి ఇది ఎవరి ఆవులమంద అని అడిగాడు. ఇది నీ కుమారుడి ఆలమంద. ఇదొక్కటే కాదు, ఇలాంటివెన్నో ఋశ్యశృంగుడికి ఉన్నాయని చెప్పారు. విభాండకుడు పయనిస్తూ మధ్యమధ్యలో ఋశ్యశృంగుడి ఆవులమందలున్న దగ్గర విశ్రమిస్తూ చివరకు రోమపాదుడి రాజధాని చేరాడు. అక్కడ శాంతాదేవితో ఉన్న ఋశ్యశృంగుడిని చూచి సంతృప్తి చెందాడు. కొడుకును, కోడలిని వెంటబెట్టుకొని తన ఆశ్రమానికి వెళ్ళాడు.శాంతాదేవి తనను సేవిస్తుండగా ఋశ్యశృంగుడు సుఖంగా జీవించాడు.

## పరశురాముడి వృత్తాంతం

పూర్వకాలంలో కన్యాకుబ్జం అనే పట్టణంలో గాధి అనే రాజుకు కూతురు అయిన సత్యవతి అనే కన్యకను భృగు మహర్షి కుమారుడైన ఋచీక మహాముని పెళ్ళాడాలనుకుని గాధిని అర్థించాడు. దానికి గాధి కన్యాశుల్కంగా ఒక చెవి నల్లగా ఉండి శరీరం అంతా తెల్లగా ఉన్న గుర్రాలని తెచ్చిస్తే తన కూతురు సత్యవతిని ఇచ్చి వివాహం చేస్తానని, అది తమ వంశ సంప్రదాయం అని చెప్పాడు. ఋచీకుడు వరుణుడి దగ్గరికి వెళ్లి అలాంటి గుర్రాలను సంపాదించి తెచ్చాడు. వేయి గుర్రాలు కన్యాకుబ్జ నగరంలోని గంగానది నుండి అవతరించాయి. ఆనాటి నుండి కన్యాకుబ్జలోని గంగా నదికి అశ్వతీర్థం అనే పేరు ఏర్పడింది . కన్యాశుల్కాన్ని గాధి కోరిన విధంగానే సమర్పించగా కూతురు సత్యవతిని ఋచీకుడికిచ్చి వివాహం చేశాడు. కోడల్ని చూసి సంతోషించి ఒకరోజు కోడలితో "సత్యవతి! నీలోని మంచి గుణాలకు నేను చాలా సంతృప్తి చెందాను. సంతోషంగా నీవు కోరిన వరాన్ని ఇస్తాను కోరుకో "అన్నాడు దానికి సత్యవతి తనకి ఒక కొడుకు తన తల్లికి ఒక కొడుకు కలగాలని కోరుకుంది. ఆయన కరుణించి "నీవు కోరినట్లే జరుగుతుంది, మీరు పరిశుభ్రంగా స్నానం చేసి నీవు మేడి చెట్టును, నీ తల్లి రావి చెట్టును ఆలింగనం చేసుకోండి "అని చెప్పాడు. దానికి విరుద్ధంగా సత్యవతి రావి చెట్టును, ఆమె తల్లి మేడి చెట్టును కౌగిలించుకున్నారు.

# మహాభారతంలో ఉపాఖ్యానాలు

అది తెలిసి భృగు మహర్షి కోడలితో "బ్రాహ్మణులందరికీ పూజనీయుడైన కొడుకు నీకు పుడతాడు. కానీ అతడు క్షత్రియ ప్రవృత్తి కలవాడై గర్వంతో ప్రవర్తిస్తాడు. నీ తల్లికి క్షత్రియుడిగా పుట్టినప్పటికీ ఆ కొడుకు గొప్ప తపస్వి అయి పాప నివారకమైన బ్రాహ్మణ భావం, విజ్ఞానం, గొప్ప తేజస్సులను నిష్ఠతో పొందుతాడు" అని చెప్పాడు. సత్యవతి నమస్కరించి క్షత్రియ భావం తన కొడుకుకు కాక మనవడికి కలగాలని ప్రార్థించింది. అలాగే వరాన్ని పొంది జమదగ్ని అనే పుత్రుడిని కన్నది.



జమదగ్ని ప్రసేనజితుడు అనే రాజు కూతురు రేణుకను వివాహమాడి రుమణ్వంతుడు, సుషేనుడు, వసుడు, విశ్వావసుడు, రాముడు అనే ఐదుగురు పుత్రులను పొందాడు. జమదగ్ని ఒక పుత్రులను పొందాడు. జమదగ్ని ఒక రోజు అడవిలో తీవ్రమైన తపస్సులో నిమగ్నమై ఉన్నాడు. కొడుకులు పండ్లు తెచ్చేందుకు అడవికి వెళ్ళారు. వారితో పాటు రేణుక కూడా వెళ్లి అక్కడ ఒక సరోవరంలో భార్యలతో జలక్రీడలాడుతున్న చిత్రరథుడనే రాజును చూసింది .ఆమె మనసు చలించింది. మానసికమైన ఆమె చెడు నడవడిని తెలుసుకొని జమదగ్ని కోపగించి తన కొడుకులు నలుగురిని భార్యని చంపేందుకు వరుసగా నియోగించాడు. వారు తల్లిని చంపటం పాపమని ఆ పని చేయలేదు. జమదగ్ని కోపించి కొడుకులను భయంకరమైన అడవిలో బుద్ధి లేకుండ, జ్ఞాన శూన్యులై జంతువుల వలె, పక్షుల వలె ఉండమని శపించాడు.

గండ్రగొడ్డలి చేతిలో గల రాముడికి రేణుకని చంపమనగా అతడు ఆ క్షణంలోనే తండ్రి మాట ప్రకారం తల్లిని సంహరించాడు. కోపం తగ్గిన జమదగ్ని పరశురాముడు తన మాట జవదాటక పోవటానికి సంతోషించి వరాలు కోరుకోమన్నాడు. పరశురాముడు తన తల్లి తిరిగి బ్రతకాలని, ఆమెను సంహరించిన పాపం నుండి తనకు విముక్తి కలగాలని, తన సోదరులకు శాపం విమోచనం కలగాలని, యుద్ధాలలో తనకు ఎదురులేని బలం కలగాలని, చిరకాలం తాను జీవించి ఉండాలనే వరాలు కోరుకున్నాడు, వాటిని పొందాడు.

కొంతకాలానికి హైహయ

మన
పురాణాలు

# మహాభారతంలో ఉపాఖ్యానాలు

వంశంలో పుట్టిన కార్తవీర్యుడు ఆ అరణ్యంలో వేటాడుతూ అలసినవాడై జమదగ్ని ఆశ్రమానికి గొప్ప సైన్యంతో వచ్చాడు. జమదగ్ని అందరినీ పూజించి, ఆదరించాడు. కార్తవీర్యుడు రాజ్యమదంతో ఆ ఋషిని లెక్కచేయక ఆశ్రమంలో నివసించే వారిని అవమానించాడు. ఆశ్రమం లోని చెట్లను విరిచాడు, హోమధేనువును దాని లేగదూడతో సహా బంధించి తీసుకొని వెళ్ళాడు. అది జరిగిన కొంత సేపటికి అడవి నుండి వచ్చిన రాముడితో జమదగ్ని జరిగింది చెప్పి మనం ఏం చేయగలమన్నాడు. పరశురాముడు కోపించి వేగంగా కార్తవీర్యుడిని వెంటాడి వెళ్లి కార్తవీర్యుడి సైన్యాన్ని బాణపరంపరతో చంపాడు. కార్తవీర్యుడి వేయి భుజాలను, చేతులను నరికి అతడిని యుద్ధంలో సంహరించాడు. కార్తవీర్యుడి కొడుకులు పగబట్టి పరశురాముడు లేని సమయంలో జమదగ్ని ఆశ్రమానికి వచ్చి ఋషులను బాధించి, చెట్లను పెకలించి, జమదగ్నిని బంధించి అతడు రామా,రామా అని పిలుస్తుండగా అతడిని సంహరించారు. పరశురాముడు ఆశ్రమానికి తిరిగి వచ్చి తల్లి



రోదన,తండ్రి శవం చూసి కోపంతో “హైహయులు పాపరహితుడు, పుణ్యాత్ముడు, ప్రశాంతుడు అయిన జమదగ్ని మహర్షిని బుద్ధిపూర్వకంగా చంపారు . ఇది తెలియక చేసిన నేరం. కాదు. ఇలాంటి ఘోరకృత్యాలు చేయడానికి వెనుదీయని క్షత్రియ జాతిని అంతటినీ సంహరిస్తానని శపథం చేశాడు. క్షత్రియులందరినీ సంహరించి భూమండలం మొత్తాన్ని జయించాడు. శాస్త్రోక్తంగా యజ్ఞాన్ని చేసి, ఋత్విజుడికి సమర్పించే సంభావనా ద్రవ్యంగా సమస్త భూమండలాన్ని కశ్యపుడికి దానం చేశాడు. ఎలాంటి బంధాలు లేని వైరాగ్యంతో మహేంద్రగిరి అనే కొండమీద నిరంతర తపోనిష్టతో పరుశురాముడు ఉన్నాడు.

★★★

క్రీడా ప్రపంచం



# శీతల్ దేవి

**చే**తులు లేకున్నా సడలని విశ్వాసం.. రెండు స్వర్ణాలు, ఓ రజతంతో ఎందరికో స్ఫూర్తిగా..

చిన్నప్పటి నుంచే కష్టాలు తనను వెంటాడుతున్నాయి. ఓ రుగత్మ కారణంగా తన రెండు చేతులు పోయినా ఆమె అధైర్యపడలేదు. ఓ వైపు పేదరికం వెంటాడుతున్నా.. పట్టుదలతో విల్లును ఎక్కుపెట్టి పసిడి పతకాలు సాధించింది. చిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన తొలి పారా ఆర్చర్‌గా చరిత్రకెక్కింది. ఆమె పారా గేమ్స్ స్వర్ణ పతాక విజేత శీతల్ దేవి. ఈ 16 ఏళ్ల సూపర్ ఆర్చర్ విజయ గాథ గురించి తెలుసుకుందాం..

**వి**ల్లు ఎక్కు పెట్టి బాణం వదలడానికి రెండు చేతులే కీలకం కానీ అవి లేకుండానే ఆర్చరీలో రాణిస్తోంది శీతల్ దేవి. ఈమెది జమ్మూకశ్మీర్లోని మారుమూల పల్లె. నాన్న రైతు, అమ్మ మేకల కాపరి, పుట్టుకతోనే చేతుల్లేని కూతురిని చూసి బాధపడ్డా తను ఏం చేస్తానన్నా ప్రోత్సహించాలని ముందే అనుకున్నారట. అలాంటి శీతల్ని ఆర్చరీ ఆకర్షించింది చేతులేని ఆమె రికన్ ఆర్చర్ మాట్ స్టుమ్యాన్ని చూసి స్ఫూర్తి పొందింది. కాళ్లతో విల్లును పట్టుకొని మెడ, భుజం సాయంతో బాణం వదలడం సాధన చేసింది. ఆరునెలల్లోనే ఆరి తేరింది. ఇప్పటికి తను సాధన చేయడం మొదలు పెట్టి ఏడాదిన్నరే అవుతోంది. కానీ దేశీయంగానే కాదు.. యూరోపియన్ పారా ఆర్చరీ కప్, ప్రపంచ పారా అర్చరీ ఛాంపియన్ షిప్ వంటి అంతర్జాతీయ పోటీల్లోనూ పత కాలు సాధించింది.

పేద కుటుంబంలో పుట్టిన శీతల్ దేవికి ఫొకోమేలియా అనే రుగ్మత కారణంగా రెండు చేతులు ఎదగలేదు. చిన్నతనం నుంచి కాళ్లతోనే పనులు చేసుకోవడం నేర్చుకుంది. ఇండియన్ ఆర్మీ నిర్వహించిన ఓ క్రీడా శిబిరంలో పాల్గొనడం ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. శీతల్ దేవి చిన్నతనంలోనే ఇండియన్ ఆర్మీ ఆమెను దత్తత తీసుకుంది. ఆటలపై ఆసక్తి పెంచుకున్న శీతల్.. ఆర్చరీపై మక్కువ పెంచుకొని సాధన చేసింది.

శీతల్ దేవికి కోచ్ కుల్‌దీప్ వేద్వాన్.. ఆర్చరీలో శిక్షణ ఇచ్చారు. రెండు చేతులు లేకపోయినా కాళ్లతోనే బాణాలు వేయడం సాధన చేసింది శీతల్ దేవి. క్రమంగా సాధారణ ఆర్చర్లతో పోటీపడే స్థాయికి ఎదిగింది. ప్రపంచంలో ప్రస్తుతం రెండు చేతులు లేకుండా పోటీపడుతున్న ఏకైక ఆర్చర్ శీతల్ దేవీని కావడం విశేషం.

సాధారణంగా ఆర్చర్లు ఒక చేత్తో విల్లుని పట్టుకుని, మరో చేత్తో బాణాలు సంధిస్తారు. చాలా సార్లు గురితప్పుతారు. అలాంటిది రెండు చేతులు లేకుండా బాణాలు వేయడమంటే.. సామాన్య విషయం కాదు కదా. శీతల్ ఇలా అద్భుతం చేస్తోంది. కాలివేళ్లతో విల్లు అదిమిపట్టి ఆమె

## క్రీడా ప్రపంచం



బాణాలు సంధిస్తున్న దృశ్యాలు రోమాలను నిక్కబొడిచేలా చేస్తున్నాయి.

వరల్డ్ పారా ఆర్చరీ: చేరిన తొలి చేతుల్లేని మహిళా శిక్షణతోనే ఆర్చర్గా నిలిచింది. తాజా ఆసియన్ పారా గేమ్స్ లో మూడు పతకాలతో రికార్డునీ సాధించింది, 'ఆర్చరీ ఎంచుకున్నప్పుడు కృత్రిమ చేతులు పెట్టించు కుందామంటే వైద్యులు కుదరదన్నారు. దాంతో నాకు తగ్గట్టుగా విల్లును తయారు చేయించారు. చేతులేకపోతేనేం .చెట్లు, పర్వతాలను సునాయాసంగా ఎక్కగలను ఆ బలమే నన్ను విజేతగా నిలిపింది. అంటోన్నశీతల్ లక్ష్యం ప్యారిస్ పారాలింపిక్స్, ఇప్పటికేఆ అర్హతనూ సాధించింది. 16 ఏళ్ల శీతల్పట్టుదల, కృషి చూసి ప్రముఖ పారి శ్రామికవేత్త ఆనంద్ మహీంద్రమెచ్చుకోవడమే కాదు...ఆమెకు నచ్చిన కారును బహుమతిగా ఇస్తామన్నారు.

అంతర్జాతీయ వేదికల్లో భారత త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించిన క్రీడాకారులకు కార్లను బహుమతిగా ఇస్తూ.. తరచూ వార్తల్లో నిలుస్తుంటారు ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా. ప్రతిభను గుర్తించడంలో, సామాన్యులను ప్రోత్సహించడంలో ఆయన ఎప్పుడూ ముందుంటారు. 68 ఏళ్ల ఆనంద్ మహీంద్రా తాజాగా చేసిన ఓ పోస్టు అందరిలో స్ఫూర్తినింపుతోంది. నెటిజన్ల చేత ప్రశంసల వర్షం కురిపిస్తోంది.

చేతులు లేకున్నా.. పారా ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, భారత్‌కు రెండు స్వర్ణ పతకాలను సాధించిపెట్టిన శీతల్ దేవికి ప్రత్యేక కారును బహూకరిస్తామని ప్రకటించారు మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా. తమ కంపెనీ అందిస్తున్న కార్లలో దేన్నైనా ఆమె ఎంచుకోచ్చవని ఆఫర్ ఇచ్చారు. అంతేకాదు.. ఆమె ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా కారుకు మార్పులు చేసి అందజేస్తామని ప్రకటించారు.

# అడివి బాపిరాజు




"వేదంలా ఘోషించే గోదావరి, అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి. శతాబ్దాల చరిత గల సుందర నగరం, గతవైభవ దీప్తులకు కమ్మని కావ్యం..." అంటూ చాలా అద్భుతంగా ఆవిష్కరించారు గోదావరి నదీమతల్లి గురించి, ఆ పట్టణం గురించి ఓ సినీ మహాకవిగారు. నిజమే కదండి, ఇలా గతవైభవ దీప్తులకు కమ్మని కావ్యంగా నిలిచిన ఓ గొప్ప కళాకారుడు, సాహితీవేత్త మన గోదావరి జిల్లాలోనే మన ముందు తరంలో ఉదయించిన సూర్యుడు వీరు. వారే అడవి బాపిరాజుగారు. తన ప్రతిభతో తెలుగు సాహితీ కళామతల్లి ప్రతిష్ఠను ప్రపంచం నలుమూలల వ్యాపింపజేసిన గొప్ప తేజోమూర్తి. ఇంతటి గొప్ప కళా పిపాసిని కన్న భారతమాత కూడా ఆనంద పారవశ్యంలో మునిగి తేలుతూ జాతీయ జెండా రెపరెపలతో వీరి ఖ్యాతిని వినువీధుల్లో ఎగురవేసింది. ఇంతటి ప్రాధాన్యతను సంతరించుకొని బహుముఖ ప్రజ్ఞ అన్న పదానికి కొత్త అర్థాన్ని తెచ్చారు బాపిరాజుగారు. ఓ కవిగా, ఉత్తమ నవలాకారుడిగా, ప్రసిద్ధ కథకుడిగా, వ్యాసకర్త, రేడియో నాటక రచయిత, విమర్శకుడు, ఏకాంకిక రచయిత, అనువాదకుడు, మేటి పత్రిక సంపాదకుడు, ప్రముఖ చిత్రకారుడు చలన చిత్ర కళాదర్శకుడు, గాంధేయవాది, దళిత జనోద్ధారకుడు... ఇలా అనంతంగా అన్ని రంగాలలో మేలిమి బంగారంలా మెరిసిపోతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు.

అడివి బాపిరాజు (అక్టోబరు 8, 1895 – సెప్టెంబరు 22, 1952) బహుముఖ ప్రజ్ఞాశీలి, స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, కళాకారుడు, నాటక కర్త. చిన్నతనం నుంచే సాహిత్యంపై ఆసక్తి చూపేవాడు. 1922 లో భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అరెస్టయినాడు. జైలులో ఉండగా శాతవాహనుల నేపథ్యంలో సాగే హిమబిందు అనే నవల ప్రారంభించాడు. బందరు జాతీయ కళాశాలలో ప్రమోద్ కుమార్ ఛటోపాధ్యాయ దగ్గర శిష్యరికం చేసి భారతీయ చిత్రకళలో నైపుణ్యం సాధించాడు. తిక్కన, సముద్ర గుప్తుడు లాంటి చిత్రాలు గీశాడు. భీమవరంలో న్యాయవాద వృత్తి చేస్తూ నారాయణరావు అనే సాంఘిక నవల రాశాడు. ఈ నవలకు ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి బహుమతి లభించింది. 1934 నుంచి 1939 వరకు బందరు జాతీయ కళాశాల ప్రధానాచార్యుడిగా పనిచేశాడు. అదే సమయంలో కథలు రాశాడు. 1939 లో సినీరంగప్రవేశం చేసి అనసూయ, ధ్రువ విజయం, మీరాబాయి లాంటి సినిమాలకు కళాదర్శకత్వం చేశాడు. 1944 నుంచి 1947 వరకు హైదరాబాదునుంచి వెలువడే మీజాన్ పత్రికకు సంపాదకత్వం వహించాడు. ఈ సమయంలో తుఫాను, గోన గన్నారెడ్డి, కోనంగి నవలలు రచించాడు. 1952 సెప్టెంబరు 22 న మద్రాసులో కన్నుమూశాడు.

బాపిరాజు పశ్చిమ గోదావరి జిల్లా లోని భీమవరంలో అక్టోబర్ 8, 1895 న ఒక నియోగి బ్రాహ్మణ కుటుంబములో కృష్ణయ్య, సుబ్బమ్మ దంపతులకు జన్మించాడు. భీమవరం హైస్కూలులో చదివి, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ లో బి.ఏ

సాహితీ శిఖరాలు

# అడివి బాపిరాజు




చదివి, మద్రాస్ లా కాలేజ్ లో బి.ఎల్ పట్టం పొంది, కొంతకాలం న్యాయవాద వృత్తి నిర్వహించిన తరువాత తన ఇతర వ్యాసంగాలలో కృషిని సాగించడానికి ఆ పనిని విరమించాడు. 1934 నుండి 1939 వరకు బందరు నేషనల్ కాలేజిలో అధ్యాపకునిగా (ప్రిన్సిపాల్ గా) పనిచేశాడు. 1944లో హైదరాబాదు నుండి వెలువడే తెలుగు దినపత్రిక మీజాన్ సంపాదకునిగా పనిచేశాడు. తరువాత విజయవాడ ఆకాశవాణి రేడియో కేంద్రంలో సలహాదారునిగా ఉన్నాడు. 'నవ్య సాహిత్య పరిషత్' స్థాపించినవారిలో బాపిరాజు ఒకడు. చిత్రకళను నేర్పడానికి గుంటూరులో ఒక ఫౌండేషన్ ప్రారంభించాడు.


వీరు అత్యధికంగా 44 కథలు రాశారు. "తూలికా నృత్యం, శైలబాల, వీణ, నాగలి, నేలతల్లి, సోమసుత" కథలు బహుళ ప్రచారం పొందాయి. "అడవి శాంతిశ్రీ నవల, కోనంగి, హిమబిందు, నారాయణరావు, జాజిమల్లి, గోన గన్నారెడ్డి".. నవలలు పాఠకులకు అందించారు. అలాగే రేడియో నాటకాల్లో "దుక్కిటెద్దు, ఉషా సుందరి, భోగిరలోయ, నారాయణరావు, శైలబాల, పారిజాతం".. నాటికలు అద్భుతంగా రేడియోలో ప్రదర్శింపబడి శ్రోతల మదిని దోచుకున్నాయి. కథల సంపుటాలలో "తరంగిణి, రాగమాలిక, అంజలి, వింధ్యాచలం".. ప్రసిద్ధి చెందినవి. ఇంకా "శశికళ పాటల సంపుటి" అద్భుత ప్రాచుర్యం పొందింది. లెక్కకు మిన్నగా గేయాలు కూడా రాశారు. వీరు రాసిన గ్రంథాలలో "వడగళ్ల వాన" అద్భుతమైన గ్రంథము. ఈ గ్రంథానికి సుమారుగా 75 ఏళ్లు. ఈ గ్రంథంలో అడవి బాపిరాజు గారు రాసిన కథలు, రాస్తున్న కథలు, పాటలు అన్నీ దీనిలోనే ఉండేవి. ఈ గ్రంథాన్ని వీరు ఎక్కడికి వెళ్లినా తన వెంట తీసుకు వెళ్లేవారు. ఈ గ్రంథం అంటే వీరికి అంత ఇష్టం.

బాపిరాజుకు చిన్ననాటినుండి కవితలు రాసే అలవాటు ఉండేది. బాపిరాజు నవల నారాయణరావుకు ఆంధ్ర విశ్వకళా పరిషత్ అవార్డు లభించింది. ఆయన చిత్రించిన చిత్రాలలో సముద్ర గుప్తుడు, తిక్కన ప్రసిద్ధమయ్యాయి. విశ్వనాథ సత్యనారాయణ గేయ సంపుటి కిన్నెరసాని పాటలు బాపిరాజు చిత్రాలతో వెలువడింది.

ఒక సమగ్రమైన పరిధిలో రాసిన అంతే విశేషమైన విలక్షణమైన కథ ఈ "వడగళ్ళు" ఈ కథలో మూడు రకాలైన వడగళ్ళు ఉన్నాయి. తెలంగాణాను, హైదరాబాదును ప్రముఖంగా చూపిస్తూ రచనను అద్భుతంగా మలిచారు. ఈ రచనలోని కథానాయకుడు హైదరాబాదులో జీవించడం ఒక భాగం. జనగామలో కథానాయకుడికి ఐదు ఎకరాల పొలం ఉంది. అది ఒకసారి వడగళ్ల వాన కురిసి బాగా నష్టం వచ్చింది. దాంతో అతను హైదరాబాదు వలస వచ్చాడు. సుల్తాన్ బజార్ లో ఒక కాంగ్రెసువాది తన కొట్టులో కొంత భాగం, అంటే వీధి అరుగు మీద అద్దె లేకుండా ఇచ్చాడు. దాంట్లో కథానాయకుడు పాన్ షాప్ పెట్టుకుని సుఖంగా జీవించాడు. ఆ రోజుల్లో భారతీయ సైనికదళాల విముక్తిని సముపార్జించి స్వేచ్ఛను నెలకొల్పిన ప్రజా కళాకారుల దురహంకారం తొలగిపోయి కాంగ్రెస్ లోనే మరో వడగళ్ల వాన కురిసింది అంటారు రచయిత. కథలో రెండవ వడగళ్ల వాన ఇది. పంజాబ్ లో జరిగిన బీభత్సం లో భార్య, కుమారుడు మరణిస్తే కూతుర్ని తీసుకుని పండిట్ కృష్ణకుమారి గాయత్రి అనే అయోధ్య వంశం అతను హైదరాబాదు వలసవచ్చారు. ఈ కథలో పతంజలి శాస్త్రి వీరికి 200 గజాల స్థలం ఇచ్చాడు. చిన్న కుటీరం నిర్మించుకొని

**సాహితీ శిఖరాలు**

# అడివి బాపిరాజు



నివాసం ఉంటారు పండిట్. పతంజలి పండిట్ గారి కూతుర్ని ఇష్టపడతాడు. కవి అంటారు, "పంజాబ్ నుంచి వచ్చిన ఉత్తర హిందూ దేశ సంప్రదాయంలో పుట్టి పెరిగిన అమ్మాయి దక్షిణ భారతదేశంలో ఉన్న ఒక వ్యక్తి పట్ల ఆకర్షితురాలవడమనేది ఉత్తర, దక్షిణ దేశ సంస్కృతుల సమన్వయం" అంటూ చెప్పారు బాపిరాజు గారు. బాపిరాజు గారు పతంజలికి అద్భుతమైన ప్రశంస కూడా ఇచ్చారు. "జీలం నది తీరం నుంచి వచ్చిన ఓ జాతరాహ, యవ్వన హృదయానికి ఈ ముచుకుంద నదీతీర వాసులైన పతంజలి బాలికను కష్టాల నుంచి రక్షించే వెలుగులా కనబడగలడు". రచయిత ఇంకా అంటారు, "ఆమె జీవితానికి పతంజలి ఆగస్టు 15 అయ్యాడు. అంటే ఆగస్టు 15న దేశానికి స్వాతంత్రం స్వాతంత్రం వచ్చింది, పతంజలి ఆమె జీవితంలోకి రాకతో వడగళ్ళు అమృత బిందువులై కురిసి ఆమెకు స్వాతంత్ర్యం వచ్చింది" అంటారు కవి . త్యాగనిరతి, ఆర్ధత, దేశభక్తి, వినయ శీలత, ఉదాత్తత అన్ని కలగలిపి అద్భుతంగా మలచారు ఈ వడగళ్ల వాన గ్రంథాన్ని.అలాగే బాపిరాజుగారి కలం నుండి జాలువారిన మరో ఆణిముత్యం లాంటి నవల "నారాయణరావు". నిజ జీవితంలోని వ్యక్తుల జీవితాలను ప్రధాన ఇతివృత్తంగా స్ఫురింపజేసే సాహితీ ప్రక్రియ ఈ నవల. ఈ నవలని బాపిరాజు గారు 1934 లో రాశారు.ఈ "నారాయణరావు" నవలలో జీవితాలు, అభిరుచులూ ఆంధ్రుల గుణశీలాలు, గ్రామీణ జీవితాలు, రాజ్యాంగ వ్యవస్థలు, విదేశీ విశేషాలు స్థల పురాణాలు, శాస్త్రాల గురించిన విశేషాలు... ఇలా అనేక అనేక కొత్త విషయాలను ఈ నవలలో అక్షరీకరించారు. ఈ నవలలో అన్ని యదార్ధ సంఘటనలే చూపించారు. ఇందులో నారాయణరావు పాత్రని బాపిరాజుగారు పోషించారు. ఇందులో చదువురాని శారద పాత్రని, చదువుకున్న శ్యామల పాత్రని అద్భుతంగా చూపించారు. ఈ శారద, శ్యామల పాత్రల ద్వారా స్త్రీలకి చదువు ఎంత ముఖ్యమైనదో ఈ నవల ద్వారా బాపిరాజుగారు చాలా చక్కగా చెప్పారు. అలాగే ప్రాపంచిక విషయాలు బాపిరాజు గారిని ఏమీ చెయ్యలేక అవే కథావస్తువులుగా ముస్తాబై బాపిరాజు గారి ఎదుట నిలబడేవి. వాటినే కథలో ప్రవేశ పెట్టేవారు. అలాగే కవితా హృదయం ఉన్న ప్రతి ఒక్కరిని ఈ నవల చదివిస్తుంది. ఇలా ఆద్యంతం ఎంతో ఉత్కంఠంతో బాపిరాజుగారి ప్రతి రచన కూడా పాఠకుల్ని మొదటి నుండి చివరి వరకు చదివిస్తుంది. ఈ నారాయణరావు నవల ఆంధ్ర, చెన్నపురి విశ్వవిద్యాలయాల్లో పాఠ్యగ్రంధంగా ప్రవేశపెట్టారు. అలాగే ఈ నవలని 'ఆంధ్ర విశ్వకళా పరిషత్తు' వారు పెట్టిన పోటీకి పంపారు. అదే సమయంలో విశ్వనాథ సత్యనారాయణగారి "వేయి పడగలు" నవల కూడా పోటీలో నిలిచింది. న్యాయనిర్ణేతలు ఎవరికి ఇవ్వాలో తేల్చుకోలేక ఇద్దర్ని విజేతగా ప్రకటించి పారితోషికం 750 + 750 రూపాయల్ని ఇద్దరికీ సమానంగా అందజేశారు. అడవి బాపిరాజుగారి నవల విశ్వనాథ సత్యనారాయణగారి నవల వేయిపడగలు నవలకి ధీటుగా నిలిచి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది.

వీరు స్వాతంత్ర్య సమరయోధునిగా జాతీయోద్యమంలో పాల్గొని ఒక సంవత్సరం జైలు జీవితం కూడా గడిపారు. బాపిరాజు గారు జైలులో ఉన్నప్పుడు భార్య వీరిని చూడడానికి వస్తే ఆమె ఖద్దరు చీర కట్టుకొని రాలేదని ఆమెతో మాట్లాడలేదు. దాంతో ఆమె ఇంటికి వచ్చి చాలా బాధపడ్డారు. ఇది ఆయన దేశ


సాహితీ శిఖరాలు

# అడివి బాపిరాజు

భక్తికి నిదర్శనంగా చెప్పవచ్చు. అలాగే తాను అనుభవించిన జైలు జీవితాన్ని "తొలకరి" అనే ఒక నవలగా మలచి చిత్రీకరించారు. ఈ నవలలో తన పాత్రని బాపిరాజుగారు అద్భుతంగా పోషించారు. అలాగే సినిమా రంగంలో కూడా వీరు ఎంతో గొప్పగా రాణించారు. "మీరాబాయి, ధ్రువ విజయం, పల్నాటియుద్ధం, అనసూయ" సినిమాలకు 1930–1940 మధ్యకాలంలో కళాదర్శకుడిగా తనదైన శైలిలో అద్భుతంగా మలచి ఆ చిత్రాలకు మంచి పేరు తెచ్చి పెట్టారు. అలాగే వీరు రేడియో నాటకాలు కూడా అద్భుతంగా రాసి వాటిలో నటించారు. ఇంకా వీరు ఆకాశవాణి సలహాదారునిగా కూడా పనిచేశారు. వీరు "మీజాన్" దినపత్రిక "త్రివేణి" పత్రికలకు సంపాదక వర్గం బాధ్యతలు చేపట్టి అన్ని విధాల పోటీ ప్రపంచంలో ముందుండి నడిపించి కళ్ళముందు కదలాడే వార్తలను కథనాలను ప్రచురించి మంచి పేరు సంపాదించారు. అలాగే మరో అద్భుతం తెలుగుసాహిత్యంలో ఆనాటి నుంచి ఈనాటి వరకు ఎవర్ గ్రీన్ గా అందరూ ఎంతో అద్భుతంగా పాడుకునే "బావా బావా పన్నీరు / బావను పట్టుకు తన్నేరు / వీధి వీధి తిప్పేరు / వీశెడు గంధం పూసేరు / చావిడి గుంజకు కట్టేరు /చప్పిడి గుద్దులు గుద్దేరు". అనే పాటని



అడవి బాపిరాజు గారు రాశారు. ఈ పాట ఆబాలగోపాలాన్ని ఎంతో గొప్పగా ఆకర్షించింది. ఇంకా అందరిని అలరించే ఉత్తేజపూరితమైన గీతాలను ఎన్నో రాశారు. ఈ బావా బావా పన్నీరు పాట రాసినప్పటినుండి వీరి సమకాలికులంతా కూడా వీరిని "బాపిబావ" అని ఎంతో ముద్దుగా పిలుచుకుంటూ ఆ




పాటపై వారికున్న అభిమానాన్ని చూపించేవారు. ఇలా అందరి అభిమానాన్ని చూరగొని బాపిరాజుగారు సృష్టించిన సాహిత్యంలో స్పృశించని అంశం లేదు.

బాపిరాజుగారు ఎక్కడ ఉంటే అక్కడ కళాపీఠం, ఎక్కడ మాట్లాడితే అక్కడ ఒక సాహిత్య నందనం వెల్లివిరిసేది. వీరి ఉపన్యాసం వినడానికి విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చేవారు. వీరి ఉపన్యాసంలో మాట, పాట, ఆట అన్ని కలగలిసి అద్భుతమైన పదబంధాలతో ప్రేక్షకులకు గొప్ప ఆనందాన్ని ఇచ్చేది. వీరి అభిమానులు ఎవరైనా ఆటోగ్రాఫ్ అడిగితే బొమ్మ వేసి మరీ సంతకం చేసేవారు. వీరికి బొమ్మలంటే అంత ప్రాణం.

చిత్రకళ అంటే వీరికి ప్రాణం. చిన్నతనం నుండి చిత్రకళ మీద ఉన్న మక్కువతో బందరు జాతీయ కళాశాలలోని ప్రమోద్ కుమార్ చటోపాధ్యాయ దగ్గర శిష్యునిగా చేరి భారతీయ చిత్రకళలో నైపుణ్యం సాధించారు. ఆ నైపుణ్యంతో చిత్రకళలో

సాహితీ శిఖరాలు

# అడివి బాపిరాజు

ఆకాశమంత ఎత్తు ఎదిగారు. కిన్నెరసాని ఎలా ఉండాలి, నాయుడు బావ ఎలా ఉండాలి అని ఊహించి నండూరివారి కవితలకి చక్కని చిత్రాలను గీసారు బాపిరాజుగారు. కిన్నెరసాని ఎలా ఉండాలి అని ఊహించి విశ్వనాథ సత్యనారాయణ గారికి కవితలకి కూడా చిత్రలేఖనం గీసింది బాపిరాజు వారే. ఇంక విశ్వనాధవారి గేయ సంపుటి కూడా చిత్రాలన్ని బాపిరాజు వారే గీశారు. ఇంకా వీరు చిత్రించినటువంటి ప్రసిద్ధిపొందిన రెండు చిత్రాలు "సముద్రగుప్తుడు, తిక్కన". వీరు గీసిన "శబ్దబ్రహ్మ" చిత్రం నేటికీ డెన్మార్క్ ప్రదర్శనశాలలో ఉంది. "భాగవత పురుషుడు, ఆనందతాండవం" మొదలగు చిత్రాలు తిరువనంతపురం మ్యూజియంలో ఉన్నాయి. మద్రాసు ప్రభుత్వం కోరికమేరకు సింహళంలోని "సిగేరియా కుడ్య చిత్రాలు" బాపిరాజు గారే చిత్రించారు. మీరు వేసిన "త్రివేణి భంగము" అంటే "ద్రౌపది వస్త్రాపహరణము, కురులు విరుచుకున్న బొమ్మ, భారతి" ప్రసిద్ధి చెందిన పెయింటింగ్స్. అలాగే సరస్వతి దేవి ఒక చేతితో వీణ పట్టుకుని, రెండు చేతులతో వేదాలు పట్టుకొని, ఒక చేతితో త్రివర్ణ పతాకము పట్టుకున్న భారతమాత బొమ్మని ఎవరి ఊహకందనంత అందంగా, మాటలకు అందనంత గొప్పగా చిత్రీకరించి తనలోని చిత్రకళా ప్రతిభను వినువీధుల్లో ఎగరవేశారు.

అడవి బాపిరాజుగారు ప్రతిభాపాటవాలకు మెచ్చి ప్రముఖులంతా వీరిని "ఆంధ్ర రవీంద్రుడు" అంటారు. బాపిరాజు వారి గురించి రాయప్రోలువారు ఇలా అన్నారు "మీ అమ్మ ఏ తార చాయలో నిను గాంచె. పయోసదుల పాల పాయసంబులుగిడి పెంచె. లేకుండా నీకు ఈ శిల్పకళా రుచి రాదు,కాకున్న సాధు కంఠమబ్బక పోదు. అడవి వారి చిన్నాడా – అమృతధార లవాడా..." అంటూ అద్భుతంగా ప్రశంసించారు రాయప్రోలు సుబ్బారావుగారు. విశ్వనాథవారు వీరి బొమ్మల గురించి చెప్తూ గీసిన గీత బొమ్మె, చూసిన చూపు మెరుపై, అతడు పలికిన పలుకు పాటై, తలపు వెలుగై అతని హృదయములోన సుతిమెత్తన" అంటూ గొప్పగా అభినందించారు. ఇంకా నండూరివారు ఇలా అంటారు, "ఆయన బొమ్మలలో పాటలే కారణమైతే, నేను ధన్యుడను" అంటారు. అలాగే దాశరథి కృష్ణమాచార్యుల వారు "ఓ సాహితీ హిమాలయోత్తమ, హిమాలయ శిఖరమ్ము వలె గంగా, యమునా నదుల వలె ఉత్తమ శాశ్వతత్వమును పొందిన ఉత్తమ సాహితీ పుష్పాలలో అడవి బాపిరాజుగారు అగ్రగణ్యులు" అంటూ ప్రశంసించారు. ఇలా అందరి చేత అద్భుతమైన ప్రశంసలు అందుకుని పేరుకు తగ్గట్టుగా అన్ని రంగాల్లో రారాజులా వెలిగిపోతూ చిత్రకళ, సాహిత్యరంగాలలో విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచి అందరిచేత "బాపిబావ" అని పిలిపించుకున్న అడవి బాపిరాజుగారు 1952 సెప్టెంబర్ 22 న తెలుగు కళామతల్లి పాదాల చెంతకు చేరారు. వీరు మన మధ్య లేకపోయినప్పటికీ "బావా బావా పన్నీరు పాట" రూపంలో మన ముందు కదలాడుతూనే ఉండాలని కోరుకుంటూ... అడవి బాపిరాజుగారికి ఘన నివాళి.

★★★

పుస్తక వీక్షణం

మానవతా విలువలకు అద్దం పట్టిన

# జీవితం పేరు..

## కవితా సంపుటి



**పింగళి భాగ్యలక్ష్మి**


షేక్. కాసింబి గారి కలం నుండి జాలువారిన "జీవితం పేరు...." కవితా సంపుటి మానవీయ విలువలకు అద్ధం పట్టింది. ఇందులోని కవితలన్నీ కూడా మాతృత్వపు ప్రేమ, అమ్మాయిల ప్రేమైక జీవన సందేశం, పర్యావరణం, కరోనా వేత్తలు, నేటి యువతరం, సైనికుల సేవ, వలస కార్మికుల వెతలు, ఇంకా తెలుగు భాష పై ఉన్న మమకారాన్నంతా రంగరించి మరీ ఈ కవితా సంపుటిని అందంగా మలచారు. ఈ కవితా సంపుటిలో ప్రతి కవిత మెదడుకు పదును పెడుతూ మళ్లీ మళ్లీ చదవాలనిపిస్తాయి. "జీవితం పేరు..." కవితా సంపుటి రచయిత్రి మంచి విద్యావేత్త. అటు వృత్తిని, ఇటు ప్రవృత్తిని సమపాళ్ళలో మేళవించి రెండింటికి సమన్యాయం చేకూర్చారు. విద్యార్థులకు పాఠాలు చెప్తే మనసుకు ఎలా హత్తుకుంటాయో అలానే ఈ కవితా సంపుటిలోని కవితలన్నింటిని అమ్మ ప్రేమలోని మమకారానంత రంగరించి మనసుకు హత్తుకునేలా కవితా మాలలల్లారు. ఆమెలోని స్నేహశీలత, సహృదయత, సున్నితత్వం, మమకారం, మాధుర్యం అన్నింటిని కలిపి అక్షర తూటాలుగా మలిచి సాహితీ ప్రియులకు అందించారు.

మొదటగా "ఔషధం" కవితలో బిడ్డల బంగారు భవితకోసం అమ్మ పడే ఈతి బాధల్ని ఎంతో ఆవేదనంగా చెప్పారు. ఆకలి కేకలు వినిపిస్తున్నా, అపనిందల పాలవుతున్నా, గండాలు ఎదురైనా కూడా ముందుకు సాగుతుంది అమ్మ అంటారు కవయిత్రి. వయసు మీద పడ్డా గుండె దిటవు చేసుకుని కష్టాల్ని భరిస్తూ ఆపదల్ని అధిగమించడం వల్లే ఇందరు అమ్మలు, బిడ్డల్ని కాపాడుకుంటూ చూపే ప్రేమే అమ్మ ఆయుష్షుని పెంచే దివ్య 'ఔషధం' అంటారు కాశీంబి గారు. "సరిహద్దు సైనికుడు" కవితలో కర్తవ్యాన్ని మార్గంగా ఎంచుకొని, ధైర్యాన్ని ఆయుధంగా ధరించి శత్రువుల్ని తరిమికొడుతూ విజయకేతనం ఎగరవేసిన సైనికుల్ని జాతి రత్నాలుగా పోల్చి చెప్పారు. "వలసలు" కవితలో వలస కార్మికుల ఈతి బాధల్ని ఆవేదనగా చెప్పారు. పొట్ట కూటి కోసం ఒకప్పుడు కార్మికులు, పేదలు పట్టణానికి వలస వచ్చేవారంటారు. కానీ ఇప్పుడు అగ్రవర్ణాల, పెత్తందారుల ఆగడాలు, ఊరి పెద్దల చెప్పు చేతుల్లో ఉండలేక, దొరల దౌర్జన్యాలు తట్టుకోలేక, కుల మతాలకతీతంగా స్నేహబంధం కోసం వారి నైపుణ్యాల గుర్తింపు కోసం బడుగు జీవులు ప్రతిరోజు వలస వెళ్లాలని వరుస కడుతున్నారని ఎంతో హృద్యంగా చెప్పారు.

"అమ్మవో!.... నాన్నవో!" కవిత కూడా ఎంతో ఆర్ద్రతగా ఉంది. పిల్లల ఎదుగుదల కోసం అన్నింటిని సర్దుకుపోయే మనస్తత్వం గల అమ్మ మనసుని చాలా చక్కగా ఆవిష్కరించారు కవయిత్రి. చుట్టూ ఎన్ని సుఖాలు, విలాసాలు ఉన్నా వాటిని కాదని చిన్ని సొంత కుటీరంలోనే ఉంటూ పొంగిపొర్లే దుఃఖాన్ని కనురెప్పల మాటల దాస్తు కారుణ్యపు చెమ్మ కోసం, ఓదార్పు కోసం

పుస్తక వీక్షణం

# జీవితం పేరు..




ప్రతి మనసుని ఆప్యాయంగా తడుముతున్నారంటే ఇదంతా కన్నబిడ్డల కోసమేనని బంధీగా వున్న ఒంటరి "అమ్మవో!..... నాన్నవో!" అంటూ ఎంతో ఆవేదనా భరితంగా చెప్పారు. "జీవితం పేరు..." కవితలో అమ్మతనం గురించి చాలా అద్భుతంగా చెప్పారు. అమ్మ ఒక అణువు. ఇందులోనే అమ్మ తత్వాలన్నీ జన్మించాయంటారు. అమ్మ ఒక పదం కాదు, కాదు అమ్మ ఓ పాట, ఓ కవిత అంటూ చెప్పారు. అలాగే కొండలు, నదులతో పాటు పనిముట్లన్నీ అమ్మనే జెపిస్తాయి కాబట్టి జీవితం పేరు అమ్మ అంటారు. అంటే సమస్తం అమ్మతోనే ముడిపడి ఉందని కవయిత్రి చెప్పకనే చెప్పారు. "ఎలా" అనే కవితలో మనుషుల పైపై మెరుగుల్ని చాలా చక్కగా తెలియజేశారు. ముఖ కవళికళకు, పెదవులకు మేకప్ లు, కళ్ళకు అద్దాల అడ్డుతెర, జిలుగు వెలుగుల వేషధారణ... ఇలా శరీరమంతా మేకప్ ల ముసుగుతో ఉన్న మనిషిని కలుసుకునేదెలా? అంటూ ప్రశ్నించడంతో ఇలా ఆర్భాటాల మేకప్ తో మనిషి అనారోగ్యం పాలవుతున్న విషయాన్ని మనం అర్థం చేసుకోవచ్చు.

"సంపద" కవితలో భవ బంధాలన్ని కరుడు గట్టిపోతుంటే చూస్తూ ఊరుకుంటావేం నేస్తం అంటూ ప్రశ్నించారు. కన్నవారిపై కారుణ్యం, గురువాత్సల్యం, సోదర బంధం, నెచ్చలి బంధం... ఇలా అన్ని ఛిద్రమైపోతుంటే నేస్తాన్ని ముందుకు నెట్టి కార్యాచరణకు ఉద్యమింప చేశారు రచయిత్రి. ముందుకు కదిలి మమతల దీపాన్ని వెలిగించి పర సేవా పరాయణుడవై అందరినీ ఆదరించమని హితవు చెప్పారు. ఇంకా మోడువారిన ఇళ్ళలోని తల్లిదండ్రులకు పెద్దపీట వేసి పచ్చదనాన్ని నింపి సహనం అనే పెట్టుబడితో స్నేహ ఫలాల్ని అందుకుంటుంటే అదే గొప్ప 'సంపద' అంటూ చాలా చక్కగా కవిత్వీకరించి చెప్పారు. "కరాళ యుద్ధం' కవితలలో ఎవరికి వారు సైన్యమై స్వీయ నిర్బంధంలో ఉంటూ మాస్క్, శానిటైజర్, భౌతిక దూరం పాటిస్తూ స్నేహితుల్ని, సన్నిహితుల్ని ఎలర్టు చేస్తూ ఆరోగ్య, పారిశుద్ధ్య, రక్షక భటుల్ని కీర్తించాలని చెప్పారు. ఇలా కరోనాతో కడదాకా పోరు సాగించి



కరాళ యుద్ధం చేసి దేశాన్ని ఆరోగ్యవంతం చెయ్యమని చక్కని మెసేజ్ ని ఇచ్చారు ఈ కవితలో.'

తెలుగు భాష" కవితలో కన్నతల్లి భాష అయిన తెలుగు తరతరాలు చరిత్రకు సాక్ష్యమిస్తూ జాతి సంస్కృతికి నిలువుటదమైన తెలుగు వెలుగుల్ని నలుమూలల వెదజల్లారు. "స్పర్శ" కవితలో ప్రేమ, నమ్మకంతో ధైర్యం నింపి వెన్ను తట్టేది స్పర్శ అంటారు. అలాగే విషం కక్కుతూ వంకరగా చూసే స్పర్శ తేడాని తెలుసుకొనేట్లు ఆడ బిడ్డలకు అవగాహన కలిగించాలని చక్కని మెసేజ్ ఇచ్చారు తల్లులకు రచయిత్రి. చివరిగా "చెలిమి చిరునామాలు" కవిత స్నేహానికి చక్కని భాష్యం చెబుతూ అద్భుతంగా ఉంది. ఆస్తులన్నీ కరిగిపోతూ, అనారోగ్యం వెన్నంటే ఉండి, దిగులుతో గుండె బరువెక్కినా, నమ్మకాలు ఒమ్మయినా, బంధుత్వాలు ఛిద్రమైనా, నీలాపనిందలు మనసుని గాయపరుస్తున్నా కూడా మన వెన్నంటే ఉండి ప్రేమను పంచుతూ కడదాకా

పుస్తక
వీక్షణం

స్నేహం హస్తాన్ని అందించే
వారే స్నేహ ప్రతిరూపాలు!,
చెలిమి చిరునామాలు! అంటూ
స్నేహబంధంలోని మాధుర్యాన్ని
ఎలుగెత్తి చాటారు కాశింబి గారు.

ఇలా ఆద్యంతం ఎంతో
ఉత్కంఠ భరితంగా, ఆహ్లాదంగా,
సందేశాత్మకంగా సాగిపోతూ
"జీవితం పేరు..." కవితా సంపుటి
అమ్మ ప్రేమలోని మాధుర్యాన్ని
పంచింది. ఇంకా ఈ కవితా
సంపుటిలో మమతలనది,
"ప్రేమ, వృద్ధులు, ప్లాస్టిక్,
జేజేలు, మురికి, ఈత, ఘన
కీర్తి, రుజువు, తెలుగమ్మాయి,
దుఃఖ గాధ..." లాంటి కవితలు
పాఠకుల్ని అలరింపజేస్తాయి.
ఇంత చక్కటి కవితా సంపుటిని
సాహితీప్రియులకు అందించిన
షేక్.కాసింబి గారికి అభినందనలు.

★★★

## కర్మ యోగి


నామాని సుజనాదేవి

కూలిపోతున్న గ్రామీణ కులవృత్తుల నేపథ్యంలో
కుగ్రామమైన విశ్వంలోని సాంకేతికాభివృద్ధి ధోరణులలో
పొట్టకూటికై పెరిగిన పోటీలో, పోరాటానికి పొద్దున్నే
కత్తిడాలూ పట్టుకుని యుద్ధానికి సిద్ధమైన సైనికుడిలా
భుజాన పంచె,చేతిలో సద్దిమూటతో సన్నద్ధమవుతాడు!
ఆకలిచూపులతో ఆకలి తీర్చే కూలీపనికై అడ్డాలో
అందరిలో ఒకడిగా ఇసుకేస్తే రాలనిజనంలో ఎదురుచూస్తూ
పనిలేకపోతే పస్తులు తప్పవన్న జీవనసత్యం కలవరపెడుతుంటే
కాయ కష్టం చేయడానికి కరుణించి కలత తీర్చమంటూ
కార్యం చూపించి కాపాడమంటూ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని
కనపడని ముక్కోటి దేవతలందరినీ వేడుకుంటాడు!
స్వయంవరంలో రాకుమారి వరించాలని
అంగసౌష్టవం చూపిస్తూ ఆశపడే రాకుమారుడిలా
కళ్ళనిండా ఆశలు నింపుకుని, కడుపు నింపే
కాంట్రాక్టర్ కోసం కళ్ళు కాయలు కాసేలా
చంద్ర నిప్పులు చెరిగే ప్రచండ మార్తాండుడు కూడా
చమట చుక్కలో ముత్యమై మెరవాలని ఆశ పడేలా
కండలు లేని శరీరంలో కానరాని బలాన్ని
కనబడేలా ఒంపు /నింపుకుంటూ ఎదురుచూస్తాడు!
వీపుకంటిన కడుపుతో ఉన్న కన్నబిడ్డలు
తలపుల్లో తచ్చాడుతుంటే తలరాత మార్చే మలుపుకోసం
బడుగువర్గాల బంగరు భవిత కై వెలుగు తెచ్చే నాయకుని కోసం
బతుకుపోరాటంలో అందని కలలాంటి గెలుపు కోసం
తరాలు మారినా తలరాత మారని తరుణిలా
జీవితకాలం నిరీక్షిస్తూండే నిష్కామ కర్మ యోగతడు !

ఈ నెల స్మరణీయులు

# అబుల్ కలాం ఆజాద్

1888-1958



స్వాతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం నవంబరు 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. స్వాతంత్ర సమర యోధుడిగా.. భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ పనిచేశారు. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు..'ఆజాద్' అనేది ఆయన కలంపేరు. 1888 నవంబరు 11న మక్కాలో ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ దంపతులకు అబుల్ కలాం జన్మించారు. అనంతరం రెండేళ్ల తర్వాత ఆజాద్ కుటుంబం భారత్‌కు వచ్చి కలకత్తాలో స్థిరపడింది.

బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఒకరు. 1920లో ఆయన ఖిలాఫత్ ఉద్యమంలో భాగమయ్యారు. అప్పుడే మన జాతిపిత మహాత్మగాంధీతో కలిసే అవకాశం వచ్చింది. ఆయన సారథ్యంలోని సహకారేతర ఉద్యమంలో సైతం పాల్గొన్నాడు. కొన్నేళ్లు జైలు శిక్ష సైతం అనుభవించారు.

అరబిక్, ఇంగ్లిష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ మొదలైన భాషలలో ప్రావీణ్య కలిగిన ఆజాద్.. భారత జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించారు. గాంధీజీ ప్రారంభించిన 'సహాయ నిరాకరణ' ఉద్యమాన్ని సమర్థించి 1920లో భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 1923లో ఢిల్లీ కాంగ్రెస్ ప్రత్యేక సమావేశాలకు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఖిలాఫత్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 ఏళ్లపాటు జైలుశిక్ష అనుభవించాడు. స్వయంగా సాహితీవేత్త అయిన మౌలానా 'ఇండియా విన్స్ ఫ్రీడమ్' అనే పుస్తకాన్ని రాశారు.

స్వాతంత్ర్యం అనంతరం నెహ్రూ సారథ్యంలో ఏర్పడిన మొదటి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. సుదీర్ఘంగా 11 సంవత్సరాలపాటు ఆ పదవిలో కొనసాగారు. ఈ సమయంలో దేశంలో విద్యా సంస్కరణలకు విశేష కృషిచేశారు. దేశంలో సమగ్ర విద్యా విధాన రూపకల్పనకు పునాదులు వేశారు. బ్రిటిష్ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, సంగీతం, సాహిత్యాల వికాసానికి చేయూతనిచ్చారు. స్వాతంత్ర్యానంతరం 1948లో ప్రాథమిక, ఉన్నత విద్యకు, 1952లో సెకండరీ విద్య కోసం ప్రత్యేక కమిషన్‌లు ఏర్పాటు చేశారు. ఆయన విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన తొలి ఐదేళ్లల కాలంలోనే UGC, ICCR, AIC-TU, CINR వంటి ప్రతిష్ఠాత్మక

ఈ నెల స్మరణీయులు

# అబ్దుల్ కలాం

సంస్థలతోపాటు ఖరగ్‌పూర్‌లో సాంకేతిక విద్యాసంస్థను ఏర్పాటు చేశారు. ఈయన మార్గదర్శకత్వం మరియు నాయకత్వంలో విశ్వవిద్యాలయ గ్రాంట్ కమిషన్ (యుజిసి)ని విద్యా మంత్రిత్వ శాఖ 1953లో స్థాపించింది. అలాగే 1951లో అబుల్ నాయకత్వంలో మొదటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్థాపించబడింది. అతను ఒక దూరదృష్టిగల వ్యక్తి మరియు భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఐఐటిల సామర్థ్యాన్ని నమ్ముతారు. "ఈ ఇన్స్టిట్యూట్ స్థాపన దేశంలో ఉన్నత సాంకేతిక విద్య మరియు పరిశోధనల పురోగతిలో ఒక మైలురాయిగా మారుతుందనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు" అని మౌలానా ఆజాద్ పేర్కొన్నారు

వీటితోపాటు సంగీత, సాహిత్య, లలితకళల సర్వతోముఖాభివృద్ధికి అకాడమీలను నెలకొల్పారు. స్వయం ప్రతిపత్తి సంస్థలైన భారతీయ సాంస్కృతిక సంబంధాల మండలి, సంగీత నాటక అకాడమీ, సాహిత్య అకాడమీ, ఆరట్స్ అకాడమీలను స్థాపించారు. భారత విద్యారంగానికి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన విశేష సేవలకు గుర్తుగా 1992లో ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న'తో గౌరవించారు. అంతేకాకుండా విద్యారంగాన్ని పరిపుష్టం చేసి.. విద్యావిధానంలో కొత్త పోకడలు సృష్టించి దేశాభివృద్ధికి బాటలు వేసిన ఆ మహనీయుడి జన్మదినమైన నవంబరు 11ను జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవాలని 2008లో తీర్మానించారు. 1958 ఫిబ్రవరి 22న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కన్నుమూశారు.

ఈయన కేవలం విద్యకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వలేదు. మన దేశంలో హిందూ మరియు ముస్లిం వర్గాలలో సామరస్యాన్ని పెంపొందించేందుకు వారిలో ఐక్యతను తీసుకొచ్చేందుకు చాలా కృషి చేశారు. అలాగే వివిధ మతాల ప్రజలు ప్రేమ మరియు సామరస్యంతో కలిసి జీవించగల దేశంగా భారతదేశం కలలు గన్నవారిలో అబుల్ కలామ్ ఆజాద్ కూడా ఒకరు.

అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. ఈయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గౌరవార్థం మౌలానా ఆజాద్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజ్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ వంటి వివిధ సంస్థలు ఏర్పడ్డాయి. ఈయన విద్యారంగానికి చేసిన సేవలకు గుర్తుగా 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారత రత్న' ఇచ్చి గౌరవించింది.

★★★

జ్ఞాపకాలు

# గుర్తుకొస్తున్నాయి ..

1950-75 లో పుట్టిన వాళ్ళు ఒక ప్రత్యేక తరానికి చెందిన వాళ్ళం. చాలా సాధారణ స్థాయి బళ్ళో చదువుకున్నా, దాదాపు ఆ తరం వాళ్ళు అన్ని విషయాలలో నిష్ణాతులుగా కనిపిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోకున్నా, ఆ భాష మీద ఉండే పట్టు అమోఘం. ఒక్క ఆంగ్లమే కాదు చదువుకొన్న ప్రతి విషయంలో ఎంతో ప్రతిభ చూపించేవాళ్ళు లెక్కలు, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం ఇంకా అనేక విషయాలు ఎంతో శ్రద్ధతో నేర్చుకునేవాళ్ళు.పోటీ చాలా ఎక్కువ ఉన్న ఈ రోజుల్లో అదేమంత గొప్ప విషయంగా కనపడకపోవచ్చు, కానీ ఆనాడు ఉన్న సామాజిక -ఆర్థిక పరిస్థితులకు సాధించింది చాలా ఎక్కువ అనే చెప్పుకోవాలి. దాదాపు ప్రతీ కుటుంబంలో కనీసం నల్గురు నుండి ఆరుగురు పిల్లలు ఉండేవాళ్ళు. ఇంత పెద్ద కుటుంబం కేవలం తండ్రి సంపాదన పైనే ఆధార పడేది... అంటే అందరికీ కడుపునిండా తిండి దొరకటమే కష్టం అయ్యేది.

పొద్దున్నే చద్దన్నం, మధ్యాహ్నం మామూలు భోజనం ఉండేది. రాత్రికి కూడా అంతే.
పండగ రోజుల్లో మాత్రం కాస్త ప్రత్యేకంగా ఉండేది. బొగ్గుల కుంపటిలోనో, కట్టెల పొయ్యిలోనో వంటలు చేసి, ఇంత మంది పిల్లలను పెంచిన ఆ నాటి తల్లుల ఋణం ఎంత ఇచ్చినా తీర్చుకోలేరు .దాదాపు అందరం దుంపల బడిలోనో ప్రభుత్వ ఉచిత పాఠశాలలోనో చదువుకొన్న వాళ్ళే. చాలా మంది డిగ్రీ చదువులకు వెళ్లేవరకూ చెప్పులు లేకుండా నడిచిన వాళ్ళే. ఆ రోజుల్లో చాలా సాధారణంగా ఉండేది. బడి చదువులు అయిన వెంటనే తల్లి-దండ్రులు తమ బిడ్డలకు ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలు అనుకునేవాళ్ళు.
ఆ రోజులల్లో ప్రభుత్వ డిగ్రీ చేసి PG చేసిన వాళ్ళు తక్కువే.ఆ తరం వాళ్లకి సినిమా, రేడియో తప్ప వేరే వినోదం ఉండేది కాదు. మూడు అణాలు ఇచ్చి తెరకు దగ్గరగా కూర్చొని చూసిన సినిమాలు ఎన్నో. అదీ కాకుండా, రేడియోలో పాత కొత్త పాటలు వినటం ఎంతో ఇష్టంగా ఉండేది. ఘంటసాల వెంకటేశ్వరరావు, పితాపురం నాగేశ్వరరావు , మాధవపెద్ది సత్యం, సుశీల, లీల, జిక్కీ గార్లు పాడిన తెలుగు పాటలు అంటే పడి చచ్చేవాళ్ళు . ఇక హిందీ పాటల విషయానికొస్తే, పాటల ట్యూన్ ని బట్టి సంగీత దర్శకులెవరో చెప్పేవాళ్ళు . SD బర్మన్, నౌషాద్, మదన్ మోహన్, శంకర్ జైకిషన్, లక్ష్మీ కాంత్ ప్యారేలాల్,కళ్యాణ్ జీ ఆనంద్ జీ ... ఒకరేమిటి, ఎన్ని పేర్లు చెప్పుకోవాలో తెలియదు. ఈ సంగీత సామ్రాట్టులు అందించిన పాటలు ఈనాటికీ శ్రోతల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయి.

ఆ తరం వాళ్ళకు ఉన్న మరో వినోదం పగలు గూటిబిళ్ల గోళీలాట ఏడుపెంకులాట బుచ్చలాట రాత్రికి హరికథలు బుర్ర కథలు నాటకాలు చూడటం ఇదే వినోద కాలక్షేపం. ఈ నాటికీ దాదాపు అందరూ 48-70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాళ్ళే అయ్యుంటారు ..అయినా ఉత్సాహం ఏమాత్రం తగ్గక ఇంకా యువకుల్లా కనిపిస్తున్నవాళ్ళే . ఈ వయసులో కూడా చిన్నప్పటి స్నేహితులను పేరు పేరునా గుర్తుంచుకొని పిలుస్తున్న వాళ్ళే .

వాళ్ళల్లో మీరు ఒకరైఉండి,ఆ తరానికి మీరు చెందిన వాళ్ళైతే , ఇంకేముంది , కాగితం కలం పట్టండి , మీ జ్ఞాపకాలన్నీ పోగేయ్యండి . మీ చిన్ననాటి తమాషా సంఘటనలు , తీయని మధురానుభూతులు , మీ అందమయిన ఫోటోలు మాకు పంపండి ప్రచురిస్తాం . ఉత్తమ జ్ఞాపకాల దొంతరకు బహుమతి కుడా ఉంది సుమా !

# దీపావళి



దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం సర్వతమోపహమ్ |

దీపేన సాధ్యతే సర్వమ్ సంధ్యా దీప నమోస్తుతే ||

హిందువుల పండుగలలో దీపావళి ప్రత్యేకమైంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళిని జరుపుకుంటారనేది పురాణ ప్రాశస్త్యం. ఆశ్వయుజ అమావాస్య రోజునే దీపావళి పండగ.

ఆశ్వయుజ అమావాస్య రోజునే దీపావళి పండగ. పూర్తి అమావాస్య నాడు జరుపుకునే పండగలు రెండు ఉన్నాయి. అవి మహాలయ అమావాస్య, రెండు దీపావళి. స్య! భాద్రపద బహుళ అమావాస్య మహాలయ అమావాస్య, ఆశ్వయుజ బహుళ అమావాస్య దీపావళి. రాత్రివేళలో ఈ పండగను జరుపుకుంటారు. ఇంటిని శుభ్రం చేసి, రకరకాల పండి వంటలు తయారుచేస్తారు. సంధ్యా సమయంలో గోగు కర్రలకు గుడ్డ పీలికలతో కాగడాలు కట్టి, వెలిగించి, గుమ్మాల్లో నేల మీద కొడుతూ... 'దిబ్బి దిబ్బి దీపావళి, మళ్ళీ వచ్చే నాగులచవితి, పుట్ట మీద జొన్నకర్ర, పుటుక్కు దెబ్బ! అని పాడతారు. గోగు కర్రల్ని



ఎవరూ తొక్కని చోటవేసి, వెనక్కి తిరిగి చూడకుండా కాళ్లు కడుక్కుని లోపలికి వెళ్లి శుభానికి మిఠాయి తింటారు. ఇలా చేస్తే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారని నమ్మకం.

తర్వాత ఇంటిని దీపాలతో అలంకరిస్తారు. మట్టి ప్రమిదలు, నువ్వుల నూనె వాడటం మంచిది. లక్ష్మీదేవికి ఇష్టమైన నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తే అమ్మ అనుగ్రహం లభిస్తుంది. గుమ్మం, తులసి దగ్గర మాత్రం తప్పనిసరిగా మట్టి ప్రమిదలో నువ్వుల నూనె లేదా ఆవు నేతితో దీపాలు వెలిగించాలి. ప్రదోష సమయంలోనే లక్ష్మి దేవి పూజ చేస్తారు. ధనలక్ష్మి పూజ ఈ రోజు చేస్తే ధన ధాన్యాలు, అష్టైశ్వర్యాలు సంప్రాప్తిస్తాయి. దీపావళి రోజున లక్ష్మీపూజతో తమ వ్యాపారం వృద్ధి చెందుతుందని వ్యాపారులు నమ్ముతారు. కొత్త బంగారు, వెండి ఆభరణాలు పూజలో పెడితే శుభప్రదం.

దీపజ్యోతిని పరబ్రహ్మ స్వరూపంగా, మనోవికాసానికి, ఆనందానికి, నవ్వులకు, సజ్జనత్వానికి, సద్గుణ సంపత్తికి నిదర్శనంగా భావిస్తారు.



మహిళామణులంతా ఆశ్వీయుజ బహుళ చతుర్దశి నుండి కార్తీక మాసమంతా సంధ్యా సమయంలో మట్టి ప్రమిదలలో దీపాలను వెలిగిస్తారు. చివరకు ఈ దీపాలను ముత్తయిదువులు కార్తీక పౌర్ణమికి సముద్ర స్నానాలను ఆచరించి జీవనదులలో వదులుతారు. ఇవి సౌభాగ్యానికి, సౌశీల్యానికి, సౌజన్యానికి ప్రతీకలుగా భావిస్తారు. పైగా ఈ దీపావళి శరదృతువులో అరుదెంచటం విశేషం. మనోనిశ్చలతకు, సుఖశాంతులకు అనువైన కాలమిది.

దీపావళి చుట్టూ అనేకానేక కథలు ఉన్నాయి. శ్రీకృష్ణుడు సత్యభామ సహకారంతో నరకాసురుణ్ణి వధించాడు గనుక ప్రజలు ఆనందంతో మరునాడు దీపావళి సంబరం చేసుకుంటారని ఒక కథ. ఇంకో కథకూడా ఉంది. లంకలో రావణుని సంహరించి, రాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు ఆనందంతో ఈ పండుగ జరుపుకున్నారని చెబుతారు. ఉత్తరాదివారు ముఖ్యంగా వ్యాపారులు దీపావళి రోజును కొత్త సంవత్సరంగా పాటిస్తారు. ఆ రోజు లక్ష్మీదేవి పూజచేసి కొత్త ఖాతా పుస్తకాలు తెరుస్తారు. దీపావళి పండుగల్లాంటివే ప్రపంచంలోని అన్ని సమాజాల్లోనూ ఉన్నాయి.

దీపాలపండుగ అయిన దీపావళి రోజున మహాలక్ష్మీ పూజను జరుపుకోవడానికి ఓ విశిష్టత ఉంది. పూర్వం దుర్వాస



మహర్షి ఒకమారు దేవేంద్రుని ఆతిథ్యానికి సంతసించి, ఒక మహిమాన్వితమైన హారాన్ని ప్రసాదించాడు. ఇంద్రుడు దానిని తిరస్కార భావముతో తన వద్దనున్న ఐరావతం అను ఏనుగు మెడలో వేస్తాడు అది ఆ హారాన్ని కాలితో తొక్కివేస్తుంది. అది చూచిన దుర్వాసనుడు ఆగ్రహము చెంది దేవేంద్రుని శపిస్తాడు. తత్ఫలితంగా దేవేంద్రుడు రాజ్యమును కోల్పోయి, సర్వసంపదలు పోగొట్టుకుని దిక్కుతోచక శ్రీహరిని ప్రార్థిస్తాడు. ఈ పరిస్థితిని గమనించిన శ్రీ మహావిష్ణువు దేవేంద్రుని ఒక జ్యోతిని వెలిగించి దానిని శ్రీ మహాలక్ష్మీ స్వరూపంగా తలచి పూజించమని సూచిస్తాడు. దానికి తృప్తిచెందిన లక్ష్మీదేవి అనుగ్రహంతో తిరిగి త్రిలోకాధిపత్యాన్ని, సర్వసంపదలను పొందాడని పురాణాలు చెబుతున్నాయి.

నరకాసురుడు నే రాక్షసుడు చెలరేగి సాధు జనాలను పీడిస్తూ దేవ, మర్త్య లోకాలలో సంక్షోభాన్ని కలిగిస్తుంటాడు. కృతయుగంలో హిరణ్యాక్షుని వధించిన వరాహస్వామి కి, భూదేవికి అసుర సంధ్యా సమయంలో జన్మిస్తాడు నరకుడు. అతడు లోక కంటకుడైనా

మహావిష్ణువు వధించరాదని, తల్లియైన తన చేతిలోనే మరణించేలా వరం పొందుతుంది భూదేవి. మహావిష్ణువు ద్వాపరయుగంలో శ్రీకృష్ణ భగవానునిగా అవతరించినప్పుడు భూదేవి సత్యభామగా జన్మిస్తుంది.

అప్పటికి నరకాసురుడు లోక కంటకుడై చేస్తున్న అధర్మకృత్యాలను అరికట్టడానికి సత్యభామా సమేతంగా తరలి వెళ్తాడు శ్రీకృష్ణుడు. వారి మధ్యజరిగిన భీకర సంగ్రామంలో భూదేవి అంశ అయిన సత్యభామ శరాఘాతాలకు మరణిస్తాడు నరకుడు. తన పుత్రుని పేరైనా కలకాలం నిలిచి ఉండేలా చేయమని సత్యభామ ప్రార్థించడంతో ఆ రోజు నరక చతుర్థశిగా పిలువబడుతుందని వరం ప్రసాదిస్తాడు శ్రీకృష్ణుడు. నరకుని చెరనుండి సాధుజనులు,' పదహారువేలమంది రాజకన్యలు విడిపించబడ్డారు, ధర్మం సుప్రతిష్ఠమైంది.

నరకాసురుని పీడ విరగడైందన్న సంతోషంతో ఆ మరుసటి రోజు ప్రజలు సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాలు జరుపుకునే రోజు అమవాస్య కావడంతో, చీకటిని పారద్రోలుతూ ప్రజల దీపాలతో తోరణాలు వెలిగించి, బాణాసంచా కాల్చి వేడుక చేసుకున్నారు. కాలక్రమంలో అదే దీపావళి పర్వదినంగా మారింది.

రామాయణంలోనూ దీపావళి ప్రస్తావన ఉంది. పురాణ కథనం ప్రకారం.. భూదేవి, వరహా స్వామికి అసుర సమయంలో జన్మించిన నరకాసురుడు.. శ్రీహరి చేతిలో చావులేని విధంగా తల్లి చేతిలోనే మరణించేలా వరం పొందుతాడు. వరగర్వంతో లోకకంటకుడిగా తయారైన నరకుడు ముల్లోకాలను పట్టిపీడించాడు. నరకాసురుడి బాధలు భరించలేని దేవతలు, మునులు, గంధర్వులు శ్రీహరికి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వారి మొర ఆలకించిన శ్రీమహావిష్ణువు ద్వాపర యుగంలో కృష్ణుడిగా అవతరించి సత్యభామతో నరకాసురుని సంహరింపజేశాడు. నరకాసుర సంహారంతో అందరూ ఆనందంగా పండుగ చేసుకున్నారు. చతుర్దశి నాడు నరకుడి మరణించగా, ఆ తర్వాత రోజు దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారు. దీపావళి అంటే దీపాల వరుస అన్ని అర్థం. కొన్ని ప్రాంతాల్లో దీపావళిని ఐదు రోజుల పండుగగా జరుపుకుంటారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశితో ప్రారంభమైన దీపావళి వేడుకలు.. కార్తీక శుద్ధ విదియ 'భగినీహస్త భోజనం"తో ముగుస్తుంది

## జోక్స్&జోక్స్

"రాత్రి తాగి లేటుగా వెళ్లినందుకు నా భార్య తలుపు తీయలేదు రా.. రోడ్డుపైనే పడుకున్నాను..!" అంటూ చెప్పాడు సుందర్

“మరి తెల్లారిన తర్వాత నీ భార్య తలుపు తీసిందా?” అడిగాడు వినోద్

“లేదురా… తాగింది.. దిగిన తర్వాతే తెలిసింది… నాకసలు పెళ్లి కాలేదని.. తాళం నా జేబులోనే వుందని..!” షాకిచ్చాడు సుందర్.

## జోక్స్&జోక్స్

భార్య: ఏవండోయ్ జ్యోతిష్కులు ఏం చెప్పారో తెలుసా?

భర్త: ఏం చెప్పారేంటి?

భార్య: మీరు దీర్ఘాయుష్షులట, తర్వాత స్వర్గానికి వెళ్తారట, మీ వెంట నేనూ వుంటానట.

భర్త: నువ్వు నా పక్కనుంటే ఇక అది స్వర్గమెట్లా అవుతుందే?!!

సీరియల్

# విధి విన్యాసం

## సీరియల్



రాయప్రోలు సుజాతా

పద్దెనిమిదేళ్ళ పిల్ల ఇంత ప్లానింగ్ తో మమ్మల్ని మోసం చేస్తుందని తెలుసుకోలేకపోయాం. ఎంత అవివేకం! ముందు ఏం చెప్పినా కాదని తరువాత అన్నీ వింటుంటే నా నచ్చ చెప్పడమే కారణం అనుకున్నాను. కానీ ఒక తప్పుడు మార్గంలో నడవడానికి ఈ నటనతో మంచి రోడ్ వేసుకుంటోందని తెలీదు. అంజు, తను ఒకటే అన్నాను. ఎంత తేడా ఉంది? అంజు గానీ, శివ గానీ, మా దగ్గర ఏమీ దాచలేదు. వాళ్ళ ఫ్రెండ్స్ అందరూ మాకు ఇద్దరికీ తెలుసు. ఎన్నోసార్లు రేణూ తో వాళ్ళ ఫ్రెండ్స్ ని తీసుకురమ్మని ఓపెన్ గా ఉండమని, ఎటువంటి విషయమైనా నాతో షేర్ చేసుకోవచ్చని చెప్పాను. చదువు పూర్తి కాకుండా ఈ ప్రేమ ఏమిటి? ఆవేడిలో ఆవేశంతో ఏ నిర్ణయం తీసుకుంటుందో, అనే భయంతోనే తన మాటలు నేను విననట్లే, నాకు తెలియనట్లే ఉండిపోయాను. రఘు తో మాట్లాడాలి. రఘు చాలా జాగ్రత్తగా హాండిల్ చేయగలరు. మా మరిది, తోడికోడలు ఈ విషయాన్ని ఎలా రిసీవ్ చేసుకుంటారో? రకరకాల ఆలోచనలతో నిజంగానే తల బద్దలయేంత నొప్పి ప్రారంభం అయింది. రజని నన్ను చూసి ఆగకుండా వెళ్ళిపోయిందన్న బాధ, రేణు ప్రవర్తన తో పెద్దగీత ముందు చిన్న గీతలా అయింది.

దొడ్డమ్మా ఎలా ఉంది? అని గంట, గంటన్నర పోయాక రేణూ వచ్చి అడిగింది. తను కాస్త కంగారు పడినట్టు అనిపించింది. కారణం, తను వచ్చిన ఇన్నాళ్ళలో నేను పడుకున్నది లేదు." పెదనాన్న కూడా వచ్చే వేళయిపోతోంది. రేణూ! కాస్త అన్నం వండి ఏదన్నా కూర చేసి పెట్టు. నేను లేవలేక పోతున్నాను. "అన్నాను. తను కాస్త అయోమయంగా చూసింది. ఎందుకంటే తనెప్పుడూ వంటింట్లోకి వచ్చిన పాపాన పోలేదు. తన స్థితి చూసి " నీకు ఇబ్బంది అయితే మానెయ్! ఫర్వాలేదు. పెదనాన్నని వచ్చేటపుడు హొటల్ నుంచి తెమ్మని చెప్తాను" అన్నాను.

" నాకు పెద్దగా వంట చేయడం రాదు దొడ్డమ్మా! కానీ హొటల్ నుంచి వద్దులే! అసలే నీకు ఒంట్లో కూడా బావులేదు. కొంచెం డైరక్షన్స్ ఇస్తే చేస్తాను. ఈ రోజు నా చేతా వాతా కాని వంట తిందురు గాని! అంది. తన మనసంలో నా పట్ల ఆ మాత్రం సాఫ్ట్ కార్నర్ ఉన్నందుకు సంతోషించాను. ఆ ప్రేమ అనే భ్రమో, ఆకర్షణో జీవితంలో రానంతవరకూ పిల్లలు మర్మానికి ఆ తరువాత మోసానికి అలవాటు పడరేమో! రేణు చెప్పినట్టుగానే అన్నీ నన్ను అడుగుతూ వంట చేసింది. ఆయనా విషయం తెలుసుకుని రేణు వంట తింటూపొంగిపోయారు. సాయంత్రానికి జ్వరం వచ్చింది. ఆ రోజంతా ఇంటిని రేణూయే సంబాళించింది. పేరాసెట్మాల్ వేసుకుని పడుకున్నాను. రఘు త్వరగా ఇంటికి వచ్చారు.

ఆ రాత్రి పడుకునే ముందు ఆయనతో "మీతో ఓ మాట చెప్పాలి." అన్నాను. రజనీ విషయమే ఆలోచించి తలనొప్పి జ్వరం తెచ్చుకున్నావా? తను నాకు ఫోన్ చేసిందిలే! చాలా అర్జంటైన పని ఉందని వెళ్ళిపోయిందట. నీ ఫోను కలవలేదట. ఏంటిది? చెప్పు? ఇంత సున్నితమైతే ఎలా? "అన్నారు. నా పక్కనే కూచుని

సీరియల్

# విధి విన్యాసం

**జరిగిన కథ** రజనీ గురించి శుభవార్త విని ఆనందించిన విజయ తమ పరిచయాన్ని జ్ఞాపకం చేసుకుంటుంది.......
పెళ్లి అయి ఇద్దరు పిల్లలు ఉన్న విజయ, టెన్త్ చదువుతున్న రజని ఒకరి వ్యక్తిత్వం పట్ల ఒకరు ఆకర్షింపబడతారు.ఆ వయసులో రజని ప్రేమలో పడటం విజయకు నచ్చదు. రజని పెళ్లయినా తను చదువును కంటిన్యూ చేస్తానని చెప్తుంది. కొన్ని సంవత్సరాల పాటు వారిద్దరి మధ్య ఎటువంటి కనెక్షన్ ఉండదు. భర్త రఘు వ్యాపారం దెబ్బ తినడంతో విజయ సునాబేడ వదిలి ఆంధ్రాలో టీచర్ ఉద్యోగానికి జాయిన్ అవుతుంది. అదే మండలంలో పనిచేస్తున్న రజనీని కలుస్తుంది. ఇద్దరి మధ్య బంధం మళ్లీ గట్టి పడుతుంది. రజనీకి శ్రీధన్య, శ్రీ నిధి ఇద్దరు పాపలు. విజయ పిల్లలు అంజు, శివ అంటే రజనీకి చాలా ఇష్టం. విజయకు శివకు ఉన్న అనుబంధం చూసి తనకు కూడా ఒక బాబు ఉంటే బాగుండును అంటుంది రజని. ఈకాలంలో మూడవ బిడ్డను చూడడం అసాధ్యం కాబట్టి ఇదొక తమాషా కోరిక అని విజయతో అంటుంది. రజని భర్త మధుకి యాక్సిడెంట్ అయి హాస్పిటల్లో ట్రీట్మెంట్ తీసుకుంటాడు. తమ ఇంట్లో ఇంజనీరింగ్ చదువుతున్న మరిది కూతురు రేణు ప్రేమలో పడినట్లుగా విజయ తెలుసుకుంటుంది.. **ఇక చదవండి**

నా చేతులు తన చేతుల్లోకి తీసుకున్నారు. కాదన్నట్లు తల తిప్పాను. మరొకప్పుడైతే తన దగ్గర మీ నంబరుందా? అని విసుగుపోయేదాన్ని. కానీ ఇప్పుడు విషయం పరిస్థితి వేరు. రేపు మీరొకసారి కాలేజీ కి వెళ్ళి రేణు అటెండన్స్ గురించి కనుక్కుని రండి. అన్నాను. ఆయన కనుబొమలు ముడిపడ్డాయి. “పెద్దగా ప్రశ్నలు వెయ్యకుండా రోజూ కాలేజీకి వస్తోందా. అన్ని పిరీయడ్స్ ఉంటోందా అని తెలుసుకోండి.”. విసుగ్గా అన్నాను. ఆయన కాసేపు మౌనం వహించారు. తరువాత

“వెళ్ళి తెలుసుకోడానికి ఇబ్బంది ఏమీలేదు. ఏ ఆధారం లేకుండా నువ్వీ మాట అనవని తెలుసు. అదేమిటో మనసు విప్పి నాకు చెబితే పూర్తి స్థాయిలో ఎంక్వయిరీ చేయగలను..” అన్నారు.

ఆ మాటలకి కన్విన్స్ అయి” సారీ! చాలా డిస్టర్బ్ అయ్యాను.” అని జరిగినదంతా చెప్పాను. ఆయనకి నోట మాట రాలేదు తేరుకుని “ నిన్ను ఎలా మెచ్చుకోవాలో తెలియడం లేదు. ఎంత బాలన్స్ తో సిట్యువేషన్ హాండిల్ చేసావు?

ఇది ఆరంభం మాత్రమే! ఇద్దరం కలిసి రేణూని ఈ పెళ్ళి అనే ప్రమాదం నుంచి బయటపడెయ్యాలి. నువ్వు రేపు సెలవుపెట్టి రెస్ట్ తీసుకో! దాన్ని నీకు సాయంగా ఉండమని రేపు మద్యాహ్నం నేను తన కాలేజీకి వెళ్ళి వస్తాను. ఎక్కువ ఆలోచించి ఆరోగ్యం పాడుచేసుకోకు.” అన్నారు.

మర్నాడు ఆయన కాలేజీ నుంచివచ్చాక “పెదనాన్నా! నేను కాసేపు మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి వస్తాను. బోర్ కొడుతోంది” అంది. మా కళ్ళు తొందరగా కలిసి విడిపోయాయి.

“వెళ్లి రా! వచ్చేటపుడు ఆలయానికి వెళ్ళు. గంటలో నేనక్కడ ఉంటాను. నిన్న దొడ్డమ్మ దర్శనం చేసుకోలేదు. ఈ రోజు మనం వెళ్లి దర్శిద్దాం” అన్నారాయన. కొంచెం ఇబ్బందికరంగా చూసినా సరే నని తను వెళ్ళిపోయింది.

“విజ్జీ! నిన్న రజని అలా వెళ్ళి పోయి చాలా మేలు చేసింది. నువ్వు వెంటనే తిరిగి రాకపోయి ఉన్నట్లైతే ఈ సంగతి మనకి తెలీక పూర్తిగా మునిగిపోదుము. ఇప్పటికైనా సేఫ్ అని చెప్పలేము. అది పీకల్లోతు ప్రమాదం లో ఉంది. కాలేజీకి వారంలో రెండు రోజులు మినిమమ్ డుమ్మా కొడుతోంది. అది తిరిగే అబ్బాయి సరైనవాడు కాదు. ఏ లెక్చరర్ కీ అతని మీద సదభిప్రాయం లేదు. వాళ్ళ నాన్న ఈ ఊరి రాజకీయ నాయకుడికి చెంచా. ఆ నాయకుడి పేరు చెప్పి అందర్నీ ఇబ్బంది పెట్టే టైపు. ఈ శశాంక్ పూర్తిగా తండ్రిని పోలాడు. కాలేజీలో దాష్టికం చేస్తూ నాయకుడినని ఫీల్ అయిపోతాడు. పైకి చాలా బాగుంటాడు. నైస్

సీరియల్

# విధి విన్యాసం

గా మాట్లాడి ఎవరినన్నా బుట్టలో వేయగలడు. ఒకేసారి చాలామంది గర్ల్ ఫ్రెండ్స్ ని మెయిన్ టెయిన్ చేస్తున్నాడు..” అని తెలుసుకున్న వివరాలు పూస గుచ్చారు. కాసేపు ఆలోచించి ఈ రోజే తనతో మాట్లాడాలని నిర్ణయించుకున్నాం.

“ఈ రోజు మీ కాలేజీ నుంచి ఫోన్ వస్తే వెళ్ళానమ్మా! వాళ్ళేమో నీకు అటెండన్స్ చాలలేదు. ఇలాగే కంటిన్యూ అయితే సెకండ్ సెమిస్టర్ ఎగ్జామ్స్ కి అలవ్ చేయమన్నారు. నువ్వసలు మానిందెపుడు? నిన్ను తీసికొచ్చి మాట్లాడతానని చెప్పాను. ఇంకా చాలా విషయాలు చెప్పారు. నీకెవరో బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని కూడా అన్నారు. రేపు నీ మీద నిందలేసిన వాళ్ళకి నువ్వు జవాబు చెప్పాలి. మనం కలిసి వెళాం.” భోజనాల దగ్గర రేణుతో అన్నారు. మీకు ఫోన్ రావడం అసలు నిజమా పెదనాన్నా? అడిగింది రేణు సీరియస్ గా! ఆయన వెంటనే ఫోన్ తీసి తన రిసీవడ్ కాల్స్ చూపించారు. నేను తెల్లబోయాను. బానే జాగ్రత్త పడ్డారనిపించింది. “వాళ్ళు చెప్పినది నిజమే! నేను, శశాంక్ ఒకరినొకరం బాగా ఇష్టపడ్డాం. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. అతనికి చాలామంది గర్ల్ ఫ్రెండ్స్ ఉన్నారు. అయినా నన్నే చేసుకుంటానన్నాడు. ఎంత మంచివాడో తెలుసో? అతని మైనస్ పాయింట్స్ అన్నీ నాతో ఓపెన్ గా చెప్పాడు. అప్పుడప్పుడు స్మోక్ చేస్తానని, ఫ్రెండ్స్ తో తప్పనిసరి అయితే తాగుతానని చెప్పాడు. ఇంత ఓపెన్ మైండ్ ఎవరికి ఉంటుంది? అందుకే అలాంటి నిర్ణయం చేసుకున్నాను. రేణు తెగించినట్లు, తెగేసినట్లు మాట్లాడుతుంటే, మేము చెప్పాల్సిన మైనస్ లన్నీ తను ప్లస్ లుగా చెప్తుంటే. ఇద్దరి పరిస్థితి అయోమయమయిపోయింది. తను మాట్లాడిన వాటిల్లో కనీసం స్మోకింగ్, డ్రింకింగ్ మైనస్ పాయింట్స్ గా గుర్తించడం కొంచెం ఊరట అనిపించింది. ఇద్దరిలోను ముందుగా తేరుకున్నది ఆయనే!

“సరే! అలాగే చేసుకుందువుగానీ! ముందు ఇద్దరూ బాగా చదివి మంచి కంపెనీలలో ఉద్యోగాలు సంపాదించండి. అప్పటివరకూ. ఇక ఈ తిరగడాలు అవీ వద్దు.” అన్నారు తన మాట అంగీకరిస్తున్నట్లుగా!

“ అదెలా? మేము అలా దూరంగా ఉండలేము. ఈ రోజు నేను కనబడనందుకే ఎంత ఫీల్ అయ్యాడో! ఎన్ని మెసేజ్ లు పెట్టాడో? మీకేం తెలుసు? “ అంది.! “అయితే ఇప్పుడే పెళ్ళి చేసుకుంటారా? ఇది వయసా పెళ్ళికి? చదువు, ఉద్యోగం లేకుండాఎలా బతుకుతారు?

ఎంత వద్దనుకున్నా కోపం ఆగలేదు నాకు.

“నాకంటే చిన్న వయసు లోనే పెళ్ళి చేసుకున్న రజని టీచర్ అంటే ఎంతో ఇష్టం మీకు. ఆవిడ పెళ్ళయాక కూడా బాగా చదివారని ఓహో హో! అని ఎంతో మెచ్చేసుకున్నారు. ఆవిడ బావున్నారుగా? మేమూ అలాగే చదువుకుని బావుంటామని ఎందుకనుకోరు? “కోపంగా అడిగింది. ఒకదాన్ని మించి ఒకదానికి ఓల్టేజి పెంచుతూ రేణూ ఇస్తున్న షాకులకు వణికు పుడుతోంది. ఏదో కాజువల్ గా నేను చెప్పిన మాటలు తన మీద ఇలాటి ప్రభావాన్ని చూపుతాయని నేను ఊహించలేదు. అయినా తేరుకుని “ మధు,రజనీకి క్లాస్ మేట్ కాదు. అప్పటికతను సంపాదిస్తున్నాడు. ఫర్ యవర్ కైండ్ ఇన్ఫర్మేషన్! స్వంత కాళ్ళమీద నిలబడకుండా, సంపాదన అనేది లేకుండా చేసుకునే పెళ్ళిళ్ళకి ఎప్పుడూ నేను సపోర్టు చెయ్యలేదు, చెయ్యను! ఆ తరవాత ఆరు నెలలకే ఇబ్బందులని మీద పడితే మేమే కాదు ఏ తల్లిదండ్రులూ సపోర్టు గా నిలబడరు. అది తెలుసుకో! “భవిష్యత్తుని చూపిస్తే వెరుస్తుందేమో అని చెప్పాను.

“ఆహా! ఏమి తల్లిదండ్రులు! మీరు చెప్పిన సంబంధం చేసుకుంటేనే ప్రేమ! లేదంటే వదలేస్తారా? ఇదా పిల్లల మీద ప్రమంటే?

కొత్త సీరియల్

# విధి విన్యాసం

వ్యంగ్యంగా అంది రేణు. నేను విస్తుపోయాను.ఇదేమి తర్కం? తెలుపుని, నలుపుగా, చెడుని మంచిగా చూస్తోంది. మాకూ చూపించడానికి, నిరూపించడానికి ప్రయత్నిస్తోంది.

"రేణూ! సరే! రేపే మీ నాన్నకి ఫోన్ చేస్తాను. వాళ్ళిద్దరినీ రానీ! అప్పుడు చూదాం " అన్నారాయన. ఆయన మాట పూర్తి కానేలేదు. "మా అమ్మ, నాన్న వచ్చి ఏం పీకుతారు? వాళ్ళేమీ చేయలేకే మీరేదో అద్భుతం చేస్తారని ఇక్కడికి పంపించారు." నిర్లక్ష్యంగా అని లోపలికి వెళ్ళిపోబోయింది.

అతి భయంకర నిజాలు అన్నీ మూకుమ్మడిగా మీద దాడికి దిగినట్లయింది. ఆయనకి అంత కోపం రావడం నాకు తెలీదు. ఒక్కసారిగా లేచి వెళ్ళిపోతున్న రేణు చేయి పట్టి కూచోబెట్టారు. " నీ నిర్ణయం నువ్వు చెప్పావు. నా చివరి మాట విని వెళ్ళు. నీకు అమ్మ, నాన్న, మేము, నీ చదువు ఇవేమీ అక్కరలేదు. కావలసింది ఆ శశాంక్ మాత్రమే! కదా! అతను నీకు దక్కకుండా, నీకు కనబడకుండా చేయగల సత్తా నా దగ్గరుంది. శశాంక్ వాళ్ళ నాన్న ఈ మధ్య చేరాడు ఆ లీడర్ దగ్గర. కానీ ఆ లీడర్ నా క్లాస్ మేట్. నేనంటే చాలా ఇష్టం, గౌరవం. ఎలాటి పరిస్థితి లోను నేను ఈ రోజు వరకూ వాడని ఆ ఇన్ఫ్లుయన్స్ ని ఇప్పుడు వాడతాను. నీకిష్టం ఉన్నా, లేకున్నా నేను చెప్పినట్లు వినాల్సిందే. కాలేజీకి సరిగ్గా వెళ్ళి వేషాలు వెయ్యకుండా ఉండాల్సిందే! ప్రతీ నిమిషం నిన్ను వాచ్ చేసే కళ్ళు ఉంటాయని తెలుసుకో! నీ ఫోన్ ఈ క్షణం నుంచి అబ్జర్వేషన్ లో ఉంటుంది.. నాలుగు రోజుల్లో నేనేమిటో, నేనేం పీకగలనో చూపిస్తాను. వెళ్ళి పడుకో"! గట్టిగానూ, ఛాలెంజింగ్ గానూ చెప్పారు.

రేణు నిజంగానే భయపడింది. మరేం మాట్లాడకుండా వెళ్ళిపోయింది. ఇంట్లో.ఒక శ్మశాన నిశ్శబ్దం అలుముకుంది. ఆ పూట ఎవరికీ భోజనాలు లేవు. మా మరిది "దీనికీ మంచి దారి చూపెట్టు" అనడంలో ఇంత అంతరార్థం ఉందని తెలీలేదు. కనీసం వాళ్ళ అన్నయ్య తో నైనా ఒక్క మాట ముందుగా చెప్పి ఉంటే పరిస్థితి ఇలా వచ్చేది కాదు. ఆయన ఎవరెవరితోనో ఫోన్లో మాట్లాడుతున్నారు. రఘు పూర్తిగా రంగం లోకి దిగారని అర్థమయింది. ఆయన సామర్థ్యం బాగా తెలుసు నాకు. అలుగుటయే ఎరుంగని అజాతశత్రువు అలిగితే ఎలా ఉంటుందో రేణు తెలుసుకుంటుంది.

మర్నాడు రేణుకని ఆయనే కాలేజీ లో దింపారు, వెళ్ళేటపుడు, ఉక్రోషం, ఉడుకుమోత్తనం, కోపం తన మోహంలో పోటీ పడుతున్నాయి. ఇంట్లో వాతావరణం అశాంతికి ఆలవాలం అయిపోయింది. ఆయన ఏం చేస్తున్నారో నాకు తెలియదు. నేను అడగలేదు. మళ్ళీ సాయంత్రం వెళ్ళి తీసుకొచ్చారు. తిరిగి వచ్చేటప్పుడు రేణు వేరేగా ఉంది. స్తబ్దంగా, నిశ్శబ్దంగా, షాక్ కి గురయిన మనిషి లాగ ఉంది. రాత్రి డిన్నర్ కి వచ్చేసరికి బాగా ఏడ్చినట్లు కళ్ళు ఉబ్బిపోయి ఉన్నాయి. అందరం కతికినట్లు తిని లేచాం. అలవాటు కి విరుద్ధంగా రేణూ కంచాలు తీసేసి డైనింగ్ టేబుల్ సర్దేసి వెళ్ళిపోతూ "శశాంక్ గురించి నా నిర్ణయం చెప్పేందుకు ఒక్క నాలుగయిదు రోజులు టైమ్ ఇవ్వండి పెదనాన్నా! తరువాత మీ ఇష్టం. వచ్చినట్లు చేయచ్చు." చాలా నెమ్మదిగా, ఓ విధంగా జాలి కలిగించే స్వరంతో అని తన రూమ్ లోకి వెళ్ళింది.. ఆ రోజే కాదు, మరో ఐదారు రోజులు ఇలాగే ఇంట్లో అడగకపోయినా నాకు సాయం చేస్తూ, ఏమీ మాట్లాడకుండా మౌనంగానే ఉంది. ఇది నటనా? ఏమో తెలియలేదు. తనని ఆయన పూర్తిగా, జాగ్రత్తగా వాచ్ చేస్తున్నారు. మళ్ళీ ఆదివారం వచ్చింది..ఉదయాన్నే తెమిలి గుడికి వెళ్ళి వద్దామా పెదనాన్నా? అని అడిగి ఆయనతోనే వెళ్ళి వచ్చింది.

సీరియల్

# విధి విన్యాసం

వాళ్ళు తిరిగి వచ్చేసరికి టిఫిన్ రెడీ చేసి రమ్మన్నాను. రేణూ ఆయన్ని నా పక్కకి రమ్మని ఇద్దరికీ కాళ్ళకి దండం పెట్టింది. నన్ను మనస్ఫూర్తిగా క్షమించండి దొడ్డమ్మా! అంటూ ఆ కాళ్ళ మీద పడి ఏడవడం ప్రారంభించింది. మేము బిక్కచచ్చిపోయాం. గబగబా లేపి నా పక్కనే కూచోబెట్టుకుని దగ్గరగా తీసుకుని ఊరుకో బెట్టడానికి ప్రయత్నించాను. అంతకంతకీ ఆ ఏడుపు ఉధృతం అయింది కానీ తగ్గలేదు. తన తలమీద రాస్తూ మౌనంగా ఉన్నాను. మేము ఒకరినొకరం ప్రశ్నార్ధకంగా చూసుకున్నాం. ఓ పది నిమిషాల తరువాత తనని బలవంతంగా లేపి మొహం కడిగి, మంచినీళ్ళిచ్చి కూచోబెట్టాను. "ఇప్పుడు చెప్పు ఎందుకింతలా ఏడ్చావు? ఏమయింది?" శాంతంగా అడిగాను.

"పెదనాన్నా! శశాంక్ మరి నా జీవితంలో లేడు. శశాంకే కాదు నేను బాగా చదువుకని నేనేంటో ప్రూవ్ చేసుకునే వరకూ ఇక ఏ మగాడు నా జీవితంలోకి రాడు. ఉండడు. ఇది నా నిర్ణయం."అంది రేణు.

మాకు వేయి పున్నమల వెలుగు మా ఇంట్లో కుమ్మరించినట్లయింది. కానీ ఈ మార్పుకి కారణం తెలిసే వరకు ఇది నమ్మలేం. మా మీద కోపంతో వాడితో వెళ్ళిపోడానికో, పెళ్ళికో ప్లాన్ చేసేంత ఉక్రోషంతో ఉన్న పిల్ల ఇంత వివేకంతో ఎలా ప్రవర్తించింది? అర్ధం కాలేదు. మా అపనమ్మకాన్ని చూసిఇప్పుడే వస్తానుండండి. అని తన గది లోకి వెళ్ళి ఒక లెటరు తెచ్చి ఇచ్చింది. ఇది చూడండి. మీ డౌట్ క్లారిఫై అవుతుంది." అంది.

ఆ ఉత్తరం తీసుకుని మేము ఇద్దరం ఒకేసారి చదవడం మొదలుపెట్టాం. కింద సంతకం చూస్తే "రజని " అని ఉంది. మేము మొహమొహాలు చూసుకున్నాం.

డియర్ రేణూ!

నేను రజని టీచర్ని. ఏ రజనీని నువ్వు ఆదర్శంగా తీసుకుని, ప్రేమించడమో లేదా చిన్నపుడే పెళ్ళి చేసుకోవడం తప్పు కాదనుకుంటున్నావో ఆ రజనీని. నిన్న రాత్రి దొడ్డమ్మ గారికి ఒంట్లో బావులేదని తెలిసి చూడడానికి వచ్చాను. నేను తలుపు దగ్గర ఉన్నపుడే ఇంట్లో డిస్కషన్ స్టార్ట్ అయింది. నా పేరు నీ నోట రావడంతో నేను పూర్తిగా అంతా విన్నాను. ఉన్న రక్షణ స్థానం నుండి జారిపోవడానికి, పతనమయిపోవడానికి నీకేమీ సంబంధం లేని నేను కారణమవడం సహించలేక, భరించలేక, బాగా ఆలోచించి అర్ధరాత్రి కూచుని ఈ ఉత్తరం రాస్తున్నాను. ఉత్తరం సుదీర్ఘంగా ఉన్నా ఓపిక చేసుకుని పూర్తిగా చదువు."

నువ్వనుకున్నట్లు నేను బాగా లేను. సరికదా! చాలా వరస్ట్ కండిషన్ లో ఉన్నాను. ఇది దొడ్డమ్మ గారికి తెలియదు. నేనే చెప్పలేదు. దానికి కారణాలు రెండు. ఒకటి ఆవిడ ఎన్ని రకాల వారించినా, జాగ్రత్తలు చెప్పినా ఎంతో ఆత్మ విశ్వాసంతో, నా ప్రేమ మీద నమ్మకంతో నా బాల్య) వివాహానికి ఆవిడని కూడా కన్విన్స్ చేసాను. రెండవది, నేనెంత హీన స్థితిలో ఉన్నానో తెలుసుకుని ఆవిడ పడే బాధని ఊహించలేక.. ఆవిడ తలుచుకుంటే పదే పది నిమిషాల్లో నా గురించి తెలుసు కోగలరు. కానీ ఆవిడ ఆ పని చెయ్యరు. ఎందుకంటే నా మీద ఉన్న విశ్వాసం. దాన్నే నేను ఆసరాగా చేసుకుని ఇన్నాళ్ళు నాటకాలాడాను. ఇక దానికి తెర వేసే సమయం వచ్చింది.

(ఇంకా ఉంది)

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# దాగని నిజం

మంగారత్నం.పి

అది కర్ణాటక రాష్ట్రం ..

బళ్ళారి జిల్లాలోని, ఓ చిన్న పల్లెటూరు. ఒకప్పుడు ఆ బళ్ళారి ఆంధ్ర ప్రాంతంలోది కావడంతో,కన్నడీగులతో పాటు తెలుగువారు కూడా అక్కడ ఎక్కువగానే ఉంటున్నారు.

ఆ ఆదివారం ..

బస్టాండ్లో.. బస్సు దిగిన మల్లికార్జున ఇంటికి కాలినడకనే బయలుదేరాడు.

పది నిమిషాలు నడిస్తే చాలు .. వీధి మలుపులో ఉన్న పెద్ద మండువా లోగిలి దూరం నుంచే కనిపిస్తుంది.

అతను ఊర్లోకి అడుగుపెట్టడం చూసిన బంధువుల అమ్మాయి పదేళ్ళ పిల్ల పెద్ద బుజ్జి " అమ్మా! ఆ పెద్ద 'పెంకుటింటి తాతయ్య' మళ్ళీ వస్తున్నాడే" అంది నెమ్మదిగా తల్లికి రహస్యం చెబుతున్న దానిలా.ఆ మాటకి తల తిప్పి చూసిన తల్లి చిన్నగా నవ్వింది.అంటే, ఈరోజూ గొడవలు తప్పవన్న మాట అన్నట్లు. ఎందుకంటే, ఆ అరుపులూ, కేకలూ నాలుగు ఇళ్ళ అవతల ఉన్న వాళ్ళ ఇంటికి కూడా వినిపిస్తుండడంతో.

" ఆయన్ని గురించి అందరూ 'ఏవో' అనుకుంటూ ఉంటారు నిజమేనా! అత్తయ్యా!" అడిగింది బావి గట్టు మీద అత్తగారితో పాటు బట్టలు ఉతుకుతున్నకొత్త కోడలు వాసవి.ఆ మాటకు చిన్నమ్మలు " ఏదో అనుకుంటారులే. అతని భార్యకి ఎవడితోనో పరిచయం అనీ,చివరికి వాడితోనే వెళ్ళిపోయిందనీ"

" పక్కింటి అమ్మాయి పద్మజ ఇంకోలా చెప్పిందే"

" ఆ పిల్లకి అయినా ఏం తెలుసు? ఏదో వాగి ఉంటుంది. అవేం పట్టించుకోకు " అంది తేలిగ్గా చిన్నమ్మలు.

★★★

ఇంట్లోకి వస్తూ ..

'ఈ రోజు తాడోపేడో తేలిపోవాలి ' గట్టిగా నిర్ణయించుకున్నాడు మల్లికార్జున.

పెద్దగా ఎవ్వరి పలకరింపులూ లేవు. ఏదో పేరుకి ' అన్నయ్యా!' అని తమ్ముళ్ళు అనడం తప్పించి.

అతను అలా తరచు గ్రామంలోకి వస్తుండడానికి కారణం .. తాత తండ్రులు సంపాదించిన ఆస్తులను 'వాటాలు' వేసుకునేందుకు.

అతను అక్కడికి చాలా దూరంగా ..

ఒక విధంగా జిల్లాకు బోర్డర్లో ఉన్న చిన్న పల్లెటూరిలో, టీచరుగా పని చేస్తున్నాడు. బస్సు సౌకర్యం కూడా సరిగ్గా ఉండదు.

రెండు బస్సులు మారి, నాలుగు గంటలు ప్రయాణం చేస్తే గాని. అక్కడికి చేరుకోలేడు. అందుకే, వచ్చినప్పుడే పని నెరవేర్చుకు పోవాలన్నది తాపత్రయం.

మల్లికార్జునకి ఇప్పుడు ' ఏభై అయిదేళ్ళు'. ఇన్నాళ్ళూ ఆస్తులు తమ్ముళ్ళ దగ్గరే ఉన్నా తనకంటూ కొంత స్వంతంగా ఉండాలన్నది అతని ఆలోచన. అదే, ఇప్పుడు గొడవలకి దారి తీసే అంశం అయ్యింది. తమ్ముళ్ళు ఇద్దరికీ చదువులు అబ్బక పోవడం వలన ఉన్న ఊర్లోనే ఉండి తోటలూ, దొడ్లూ చూసుకున్నారు.

పెద్దవాడు తమ్ముడు చలపతికి ముగ్గురు పిల్లలు అయితే. చిన్నవాడైన సత్యమూర్తికి ఇద్దరు పిల్లలు.

కాలక్రమంలో పిల్లలు చదువులో

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# దాగని నిజం

ఎదుగుతూ పెళ్ళిళ్ళకి వచ్చారు.

ఎటొచ్చీ ..

మల్లికార్జునకే భార్యా లేదు .. పిల్లలూ లేరు, అందుకే, ప్రభుత్వం ఎక్కడికి ట్రాన్స్ఫర్ చేస్తుంటే .. వెళ్లి అక్కడే ఉంటున్నాడు.

ఆస్తి మొత్తాన్నీ మూడు భాగాలు చేసి, పంచుకోవాల్సిన విషయమే అయినా .. ఎందుకనో! తమ్ముళ్ళకి ఈ ఆలోచన రుచించడం లేదు.

ఏమైనా అంటే " నీకు ఎవరున్నారు?" అన్నట్లు మాట్లాడుతున్నారు.

ఎప్పటిలానే " మాకు పిల్లలున్నారు. వాళ్ళ పెళ్ళిళ్ళు కావాలి. డిగ్రీలు చదువుకున్నా ఎవ్వరికీ ఉద్యోగాలు లేవు. అందుకే, ఆ మెరకలో ఉన్న 'ఎకరం పొలం' నువ్వు తీసుకుంటే .. సర్పంచి గారింటి వైపు ఉన్న మామిడి తోటా, సరుగుడు తోటా మేము తీసుకుంటాం. లెక్కలు బాగుంటాయి " చెప్పాడు చలపతి.

తమ్ముళ్ళు ఇద్దరూ కలిసి అలాంటి నిర్ణయం తీసేసుకోవడం నచ్చలేదు మల్లికార్జునకి. తను కుటుంబం లేని ఒంటరి వాడు.లోకమనే ఎడారిలో ఏకాకి. తన తరువాత అదీ వాళ్ళదే అయినా, ఇప్పటి నుంచే పరాధీనంగా తమ్ముళ్ళ మీద ఆధారపడాలని అనుకోవడం లేదు.

" అంతే, పెదనాన్నా! నీకా ఉద్యోగం ఉంది, ముందు ముందు పెన్షన్ కూడా వస్తుంది. రిటైర్అయిపోయిన తర్వాత మా దగ్గరే ఉంటూ, ఆ పొలం చూసుకోవచ్చు" సమర్థించాడు చలపతి కొడుకు చంద్రకాంత్.

అతను ఎంబీఏ వరకూ చదివాడు. కాస్త ఎక్కువ చదివాడేమో ఇంట్లో వాడి మాటే చెల్లుతుంది.

చంద్రకాంతు వైపు అయోమయంగా చూస్తూ " అంటే, ఏమిట్రా మీ ఉద్దేశం, ఆ మామిడి తోటా, సరుగుడు తోటా మొత్తం కలిపి ఆరు ఎకరాలు. మీ నాన్నా, చిన్నాన్నా ఇద్దరూ కలిసి చెరి మూడెకరాలూ తీసుకుంటే .. నేనేనా? తక్కువ తిన్నది. ఒక్క ఎకరం పొలంతో సరి పెట్టుకోవాలా? నాకు జీతం ఉంటే మాత్రం ఏమిటి? అది మా పిత్రార్జితం. అందుకే, అందరితో పాటు నాకూ సమాన వాటా రావాల్సిందే " అంటూ ఉగ్రుడయ్యాడు మల్లికార్జున.

" మేము ఎండనకా, వాననకా తోటను చూసుకుంటున్నాం " గట్టి పట్టు మీదే ఉన్నారు వాళ్ళు. దాంతో, మాటా మాటా పెరిగిపోయింది. కొట్టుకునే వరకూ వెళ్ళింది. చుట్టుప్రక్కల వాళ్ళకి వినోదం అయ్యింది.

★★★

అయితే..అదే వివాదం చిలికి చిలికి గాలివాన అయి, మెడకు చుట్టుకుందని అనుకోలేదు మల్లికార్జున.

పిల్లలందరూ పట్నంలో ఉండి చదువుకోవడంతో, ఓ అడుగు ముందుకు వేసారు. పెదనాన్న నోరు మూయించడానికి అదే సరిఅయిన మార్గం అనుకున్నారు. అక్కడికీ చలపతి వారించాడు.

ఏదైనా కలిసి వస్తుంది అంటే, ఎవరికైనా ఆశే కదా! దాని ఫలితమే.

ఆ మరునాడు జూన్ నెల ఒకటో తేదీ 2021 న ..

బళ్ళారి పోలీస్ స్టేషన్లో ' మిస్సింగ్ కేసు' నమోదైంది మల్లికార్జున మీద. 'అతను భార్యను చంపి సాక్ష్యాలు మాయం చేసాడన్నట్లు '.

పోలీసులకు తీగ అందిస్తే .. డొంక కదలకుండా ఉంటుందా?

ఎప్పుడో, పది సంవత్సరాల క్రిందట నుండీ కనిపించకుండా పోయి, ఊరు మరచిపోయిన మల్లికార్జున భార్య ' ప్రియాంక ' విషయం తెర మీదికి వచ్చింది. అంటే 2011 లో కనిపించకుండా పోయిన మనిషి గురించిన ఆరా బయటకి వచ్చింది.

★★★

గతంలోకి ..

సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ

# దాగని నిజం

అంటే, పది సంవత్సరాలు వెనక్కి వెళితే ..

పెద్దలు కుదిర్చిన పెళ్ళే చేసుకున్నాడు మల్లికార్జున. ప్రియాంక అందం అతన్ని సంమోహితుడ్ని చేసింది. తనకి అంత అందమైన భార్య దొరకడం పూర్వ జన్మ సుకృతం అనుకునేవాడు. కొన్నాళ్ళు ఆనందంగానే గడిచింది జీవితం.

ఇలాంటి, నేపథ్యంలో..

చదువునే రోజుల్లో పరిచయం అయిన ‘ అనుదీప్’ మళ్ళీ కనిపించడంతో .. ప్రియాంక మనసు కొత్తపుంతలు త్రోక్కడం ప్రారంభించింది.

“ ఎవరితో అంతంత సేపు ఫోన్లో మాటలు? ” విసుక్కున్నాడు మల్లికార్జున.

“ మా కాలేజీ ఫ్రెండు అని చెప్పాను కదా! ”

“ అయితే, మాత్రం అంతంత సేపు కబుర్లేమిటీ? మరో పనేం లేనట్లు” అప్పటికి మౌనం ప్రియాంక వహించినా ..

మల్లికార్జున లేని సమయంలో యదేచ్చగా వచ్చి, కలిసేవాడు అనుదీప్. సినిమాలకీ షికార్లకూ వెళ్ళేవారు. చుట్టుపక్కల వాళ్ళు నోర్లు నొక్కుకున్నారు.విషయం తెలిసి కోపం తెచ్చుకున్నాడు మల్లికార్జున.నయాన్నా, భయాన్నా చెప్పిచూసాడు. ఖాతరు చెయ్యలేదు ప్రియాంక.

ఊరి నుంచి అత్తమామల్ని పిలిచి పంచాయితీ పెట్టించాడు.

“ బిడ్డా! నీకిదేం పనే. ఇంక వానితో ఆ తిరుగుళ్ళు బందు పెట్టి, అల్లుడితో మంచిగ ఉండు”మొత్తుకుంది తల్లి.

“ మంచి ఉద్యోగస్తుడు, నెమ్మదస్తుడు అని చూసి పెండ్లి చేసినం. పక్క సూపులు సూడకు. మెదగాలు ఆ సెల్లు ఫోను నుంచి వాడి నెంబరు తీసెయ్యి” మందలించాడు తండ్రి.

“ అలాంటిది ఏమీ లేదు. అంతా ఆయన అనుమానం” కొట్టిపారేసింది ప్రియాంక.

“ మరైతే, రోజూ ఆ తిరుగుళ్ళు ఏమిటీ? ఊరిలో వాళ్ళ మాటలు వినలేకపోతున్నాను. ఈడకే పోయ్యొస్తనని పోతున్నావు. ఎప్పటికో వస్తున్నావు. నా కొడుకు నీకేం లోటు చేసిండని” విసుగు తెచ్చుకుంది అత్త శారదమ్మ.

“ నీకూ అంత అనుమానం అయితే, ఎలా అత్తమ్మా! ఇక పోనులే ఇంట్ల నుంచి” నచ్చ చెప్పింది అత్తకి.

★★★

నాలుగు రోజులు బాగానే ఉంది. మళ్ళీ ఎప్పటి పరిస్థితే.

తల పట్టుకున్నాడు మల్లికార్జున.

రోజులు గడిచి, నెలలు గడుస్తున్నా ప్రియంకలో మార్పు రాలేదు. తన తిరుగుళ్ళూ ఆపలేదు.

తల్లిదండ్రులూ, అయినవాళ్ళు చెప్పినా ఫలితం లేకపోయింది.

చాలా చెప్పి చూసి విసిగిపోయాడు మల్లికార్జున,

★★★

అనుకోకుండా ‘ శ్రీశైలం’ యాత్ర అంటే సంబరపడింది ప్రియాంక. అందునా కారు ప్రయాణం. మరిది చలపతికి కారు నడుపుతుంటే ప్రయాణం సాగింది.

దైవదర్శనం అనంతరం ..

2011వ సంవత్సరం జూలై 25 వ తారీకు అర్ధరాత్రి వేళ ‘ప్రకాశం జిల్లా’ సమీపంలోకి రాగానే ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తమ్ముడు సహాయంతో ప్రియాంకను ఆమె చున్నీతో గొంతుకు బిగించి చంపేసాడు మల్లికార్జున.

ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు ఒంటిపై ఉన్న దుస్తులు తొలగించి, రోడ్డు పక్కనే ఉన్న పొదల్లో పడేసి ఇంటికి చేరుకున్నారు ఇద్దరూ.

**సాధరణ ప్రచురణకు ఎన్నికైన కథ**

★★★

ఎన్నాళ్ళకీ కూతురి క్షేమ సమాచారం తెలియక పోవడంతో..

ప్రియాంక తల్లిదండ్రులు మల్లికార్జునని నిలదీశారు.

" మీ కూతురికి ఎవడితోనో స్నేహం ఉందిగా .. వచ్చే దారిలో నా కళ్ళు గప్పి .. వాడితోనే వెళ్లి పోయింది" అంటూ వీరంగం సృష్టించాడు. చేసేది లేక వెనుదిరిగారు. కుమార్తె ప్రవర్తనతో విసిగి పోయిన వారు కూడా మౌనంగానే ఉండిపోయారు.అది నిజమే కావచ్చని.

ఈ క్రమంలో పరిచయం ఉన్నవారు " మీ భార్య ఏదీ?" అంటే ..

" అది ఎవడితోనో వివాహేతర సంబంధం పెట్టుకుంది. వచ్చేదారిలో వాడితోనే వెళ్ళిపోయింది"చెప్పేవాడు.

హత్య జరిగిన మరునాడు అంటే ..

జూలై 26 వ తారీకున స్థానికుల సమాచారంతో ..విషయం తెలుసుకున్న ప్రకాశం జిల్లా పోలీసులు 'గుర్తు తెలియని శవం' గా కేసు నమోదు చేసుకుని,విచారణ చేపట్టారు. చుట్టుప్రక్కల పోలీసు స్టేషన్లు అన్నిటికీ సమాచారం అందించారు. అయినా కేసు ఓ కొలిక్కి రాలేదు. అసలు వాళ్ళు రాష్ట్రేతరవాళ్ళు కావడంతో.

★★★

ప్రియాంకను భర్తే హతమార్చిన విషయం బంధువులు అందరికీ చూచాయగా తెలిసినా.. ఆమె ప్రవర్తనా నడవడిక కారణంగా ఎవరూ ఆ విషయాన్ని బయట పెట్టకుండా మనసులోనే దాచుకున్నారు.

ప్రస్తుతం, ఆస్తుల పంపకాలలో నెలకొన్న విభేదాల కారణంగానే ..చిన్నతమ్ముడు సత్యమూర్తి పిల్లల ఫిర్యాదుతో 'ప్రియాంక హత్య' కేసు వెలుగు చూసింది.

ఈ నేపధ్యంలో కర్నాటకలోని .

బళ్ళారి జిల్లా పోలీసులు విచారణ చేపట్టి, నిందితులు చెప్పిన ఆధారాలతో, ప్రకాశం జిల్లా పోలీస్ స్టేషన్ను చేరుకోవడంతో, ఏడాది తరువాత ..

పదకొండేళ్ళ నాటి కేసు బయటికి వచ్చి అసలు విషయం బయటపడింది.

దీంతో మల్లికార్జునతో పాటు, చలపతి పైనా కర్నాటక పోలీసులు కేసు నమోదు చేశారు, వార్త ఆగదూ, నిజం దాగదు అన్నట్లు.

(సమాప్తం)

## జోక్స్&జోక్స్

టీచర్: "సైన్స్", "ఆర్ట్స్" మరియు "కామర్స్" మధ్య తేడా ఏమిటి?

విద్యార్థి:

కరోనాకు మందు లేదు, ప్రస్తుతానికి, అదే "సైన్స్" !!

వైద్యం లేకపోయినా లక్షల్లో ఆసుపత్రి బిల్లులు వస్తున్నాయి. ఇదొక "కళ"!!

పేషెంట్ చనిపోయాడు కానీ హాస్పిటల్ బతికేస్తుంది.

అది "వాణిజ్యం." అంటూ బదులిచ్చాడు.

వస్తావ
కథ

# అవ్యక్తం

ఈదరశ్రీనివాస రెడ్డి

ఆరేళ్ళ వయసులో

“నీమొఖం,నీకేం తెలుసు. చక్కగా నానమ్మ చెప్పినట్టు చిలకాకు పచ్చ జాకెట్టు, దానిమ్మ రంగు పట్టు పెరికిణీ కొనుక్కో. అవి వేసుకుంటే మహాలక్ష్మిలా వుంటావు” నాయనమ్మ సణుగుడికి అమ్మ ముక్తాయింపు

ఊహ తెలియని వయసులో నా ఇష్టాఇష్టాలపై జరిగిన మొదటి దాడి అది .

పదేళ్ళ వయసులో

" నీమొఖం నీకేం తెలుసు. ఇప్పుడు ఆ కర్రాట నేర్చుకుని ఎవరిని ఉద్ధరించాలి. చక్కగా సంగీతం నేర్చుకో రేపు ఆ వచ్చేవాడు కళ్ళు మూసుకుని మెడలోఆ మూడు ముళ్ళు వేస్తాడు “ అమ్మమ్మ సలహా కాదనలేక నన్ను కరాటే మాన్పించి సంగీతంలో చేర్చింది అమ్మ

ఊహ తెలిసిన తరవాత నా ఆత్మస్థైర్యం మీద జరిగిన మొదటి దాడి అది

పదిహేనేళ్ళ వయసులో

" నీ మొఖం నీకేం తెలుసు. ఎమ్. పి.సి తీసుకుని ఏం చేస్తావు. ఆడపిల్లలకు బై.పి.సి.నే సుఖం. ఆడుతూ పాడుతు చదివేయచ్చు" అత్తయ్య అనుభకానికి మౌనంగా ఓటేసింది అమ్మ

భవిష్యత్తు గురించి అప్పుడప్పుడే ఊహించుకుంటున్న నా ఆలోచనలపై జరిగిన మొదటి దాడి అది

పదిహేడేళ్ళ వయసులో

' నీ మొఖం నీకేం తెలుసు. డాక్టరం అంటే మాటలా? పదేళ్ళు పడుతుంది. ఉన్నదంతా నీకే ఖర్చు పెడితే రేపు వాడి గతేంటి . చక్కగా బిఎస్సీ, హోంసైన్సు తీసుకో. తక్కువ ఖర్చులో అయిపోతుంది. పైగా, రేపు వంటా వార్పు ఎలా చేయ్యాలో దిగులే వుండదు " పిన్ని ఉచిత సలహానే నచ్చినట్టుంది అమ్మకు

సమాజానికి ఎదో ఒక రకంగా ఉపయోగ పడాలనే నా లక్ష్యంపై జరిగిన మొదటి దాడి అది.

ఇరవై ఏళ్ళ వయసులో

“నీ మొఖం నీకేం తెలుసు, అసలు ఇటువంటివి మన ఇంటావంటా వున్నాయా? హవ్వ ! హోటల్లో వంటలు చేసి మీ నాన్న పరువు తీస్తావా? రేపు మీ నాన్న రోడ్డు మీద తల ఎత్తుకునితిరగ గలడా ?' మొదటి సారి తాతయ్య గొంతులో అసహనం గుర్తించింది ,పెద్దరికాన్ని గౌరవించక తప్పలేదు అమ్మకు

నా కాళ్ళ మీద నేను నిలబడాలనుకునే నా ఆశయం మీద జరిగిన మొదటి దాడి అది

ఇప్పటిదాకా ఆడదానికి ఆడదే శతువు అనే మాట గట్టిగా నమ్ముతూ వచ్చాను. ఇప్పుడు వాళ్ళతో ఓ మగాడు తోడయ్యాడు తానేమి తక్కువ తినలేదన్నట్లు

ఇరవై ఐదేళ్ళ వయసులో

“ నీమొఖం నీకేం తెలుసు, పెళ్లిపెటాకులు లేకుండా ఎన్నాళ్ళని తిరుగుతావు. ఓ అయ్య చేతిలో పెట్టి మేం కాస్త “కృష్ణా –రామా “అనుకుందామనుకుంటే ,తీసుకొచ్చిన ప్రతి సంబంధాన్ని ఏదో వంక చెప్పి తిరగ్గొడుతున్నావు. “మొదటి సారి నాన్న గొంతు విప్పాడు. ఆయనకు ఎదురు చెప్పలేక పోయింది అమ్మ

పాతికేళ్ళుగా నేను పోగేసుకున్న కలలన్నీటిపై ఒకేసారి జరిగిన అతిపెద్ద దాడి అది .

## వస్తావ కథ

ముప్పయేళ్ళ వయసులో

"నీ ముఖం నీకేం తెలుసు, ఆడపిల్లను పెంచటం అంటే మాటలా ? కంటే మగపిల్లాడ్ని కనాలి లేదా అసలు పిల్లలె వద్దు "' అత్తగారి ఆంక్షలకు వత్తాసు పలికాడు శ్రీవారు.

పుట్టినిల్లు అయినా అత్తిల్లైనా ,ఎక్కడైనా నీ విలువ ఇంతే అని తెలియ చెప్పటానిక జరిగిన మొదటి దాడి

ముప్పై ఐదేళ్ళ వయసులో

నీ మొఖం నీకేం తెలుసు, ఇప్పుడు నువ్వు ఉద్యోగం చేసి ఏ ఊళ్ళు ఏలాలి? చక్కగా ఇంటి పట్టునే వుండి పిల్లల చదువుల సంగతి చూసుకో చాలు "నా మీద ప్రేమతో అన్న శ్రీవారి మాటలు కాదన లేక పోయాను

నా వ్యక్తిత్వాన్ని ఎదగనీయకుండా , నా ఆర్థిక స్వేచ్ఛను అడ్డుకుంటూ జరిగిన తీయని దాడి అది

యాభై ఏళ్ళ వయసులో

"నీ మొఖం నీకేం తెలుసు, కోడలు , కొడుకు చెప్పినట్టు వినచ్చు కదా? ఎందుకు ఇంట్లో గొడవలు" పెళ్ళాన్నివెనకేసు కొచ్చే కొడుకు అసంతృప్తిని చల్లార్చటానికి వంతపాడారు శ్రీవారు

నా పెద్దరికం మీద నమ్మకం లేక , దానికి ఏ విలువ లేదని తెలియచెప్పటానికి జరిగిన మొదటి దాడి అది.

అరవై ఏళ్ళ వయసులో

'నీమొఖం నీకేం తెలుసు, నీకన్నా నేనే ముందువెళ్ళాలి" అంటూ నన్ను ఒంటరిని చేసి వెళ్ళి పోయారు శ్రీవారు.

ఆస్తులన్నీ పిల్లల పేరున పెట్టి, నాకంటూ ఏమి మిగల్చకుండా, నా బతుకు ఇప్పటికైనా బతుకు దామంటే నా అస్తిత్వం పైన జరిగిన మెదటి దాడి అది,

డెబ్బై ఏళ్ళ వయసులో

"నీ మొఖం నీకేం తెలుసు, ఇంక ఇక్కడ వుండి నువ్వు ఉద్ధరించేది ఏముంది, రావచ్చేయ్ నాతో", జీవన్నాటకంలో నాపాత్ర ముగిసినట్లు రమ్మంటున్నాడు ఆ భగవంతుడు

"ఎందుకు రావాలి? మొదటిసారి గొంతు తెరిచాను.

ఆశ్చర్యపోయాడు దేవుడు.

"ఇన్నాళ్ళు ఎవరేమన్నా నోరు ఎత్తని దానివి, ఇప్పుడు చావు భయం పట్టుకుండా మాట్లాడు తున్నావు" అడిగాడు వెక్కిరిస్తున్నట్లు

" లేదు, ఏదో ఒక రోజు అందరం పోవాల్సిందేగా?".

"మరి ..." అర్థం కాని మొఖం పెట్టాడు దేవుడు.

"నేనడిగే ఒకే ఒక ప్రశ్నకు సరైన జవాబు చెప్పు, అప్పుడు నీతో వస్తాను' "

అడగ మన్నట్టు సైగ చేసాడు దేవుడు

"అసలు నన్నెందుకు పుట్టించావు?."

బహుశా అటువంటి ప్రశ్న ఎప్పుడు ఎదురు కాలేదేమో ,ఏం జవాబు చెప్పాలో అర్థం కాక మౌనంగా ఉంది పోయాడు దేవుడు

ఓ రెండు నిమిషాల తరువాత, ఎదో గుర్తుకు వచ్చిన వాడిలా

'అది మీ అమ్మను అడగాల్సిన ప్రశ్న " అంటూ జవాబిచ్చాడు

."అడుగుదామనే అనుకున్నా? అమ్మా కుడా నాలాంటి ఆడదే కదా! ఆవిడ కూడా ఏరోజు నోరెత్తి మాట్లాడిన పాపాన పోలేదు. ఇంక నా ప్రశ్నకు జవాబు ఏం చెపుతుంది" వాస్తవాన్ని తెలియ చెప్పాను.

నిజాన్ని తోసి పుచ్చలేక పోయాడు దేవుడు, "పోనే నీ తండ్రిని అడిగాల్సింది' అన్నాడు.

## వస్తావ కథ

"అసలు నేను పుట్టటమే దండగ అని భావిస్తున్న ఆయన ఏం జవాబు చెబుతాడు " మరో నిజాన్ని బయట పెట్టాను

""పోనే నీ భర్తనో, కొడుకునో అడగాల్సింది" నసిగాడు దేవుడు

"వాళ్ళు ఏం జవాబు చెపుతారు. వాళ్ళు నీలాంటి మగాళ్ళే కదా? మహా అయితే పిల్లల్ని పెంచటానికో

లేక ఇంటికి కాపలా కుక్కలా వుండటానికో అని చెప్తారు ." అంటూ ఓ పెద్ద నవ్వు నవ్వాను

" అవును కదా..." బయటకు అనకూడదు అనుకుంటూనే అనేశాడు దేవుడు

" ఏమిటి ఆవును, మీ శ్రీమతి కూడా కేవలం. వంటా వార్పూ ,ఇంటెడు చాకిరీ కేనా వుంది " గట్టిగా ప్రశ్నించాను ఈసారి కోపంపట్టలేక

" అదెలా కుదుర్తుంది. ఆవిడ శక్తి స్వరూపిణి, కారణజన్మురాలు .." అంటూ గొణిగాడు.

మీ శ్రీమతి శక్తి స్వరూపిణి, కారణజన్మురాలు . ఆవిడకు ఓ వ్యక్తిత్వం, అస్తిత్వం వున్నాయి. మరి మాకెందుక లేవు? అలాంటప్పుడు మమ్మల్నెందుకు పుట్టించావు" నిలదీశాను

. ఏం జవాబు చెప్పాలో దేవునికి అర్థం కాలేదు.

సతీ సావిత్రి ), సతీ సుమతులు కూడా ఇలాంటి ప్రశ్నలు వేయ లేదు. వాళ్లకులా ఈమెకు కూడా ఏదో ఒక వరం ఇచ్చి వదిలించుకుందామని నిర్ణయించుకున్నాడు దేవుడు.

"సరే ఈ గోలంత ఎందుకు, ఇంతకీ నీకేం కావాలి.. " ప్రాధేయపడుతున్నట్టు అడిగాడు .

" ఇంత కాలం నేనెందుకు బతికానో నాకే తెలియదు . కొంత కాలం నాకు నేనుగా బతకాలి, నన్ను నన్నుగా ఈ సమాజం గుర్తించాలి. అంతవరకూ నువ్వు నా జోలికి రావద్దు" స్థిరంగా నా నిర్ణయాన్ని చెప్పాను

"నా అనే వాళ్ళు లేరు. ఆస్తిపాస్తులు లేవు, వయసు కూడా లేదు ఎలా నిరూపించుకుంటావు.." అనుమానంగా అడిగాడు

"ఏవి లేక పోయినా, నామీద నాకు నమ్మకం ఇంకా చావలేదు. నా లాంటి అభాగ్యులు ఈ లోకంలో ఎంతమంది వున్నారు. ఇకనుండి వాళ్ళ గొంతుకను నేనౌతాను. వాళ్ళకు నా ధైర్యాన్ని పంచుతాను.

వాళ్ళందరూ కారణజన్ములే అని తెలియ చెప్పి, వాళ్ళకు మార్గాన్ని నిర్దేశిస్తాను, వాళ్ళ లక్ష్యాన్ని చేరుకోవటం లో సాయపడతాను" ఇంకా ఏదో అంటున్నాను.

" ఏమిటో పట్టపగలే ఈ పలవవరింతలు .పని పాత లేకపోతే ఇలాగె ఉంటుంది " కోడలి మాటలు సన్నగా వినపడుతున్నాయి.

నన్ను చూసి భయపడ్డాడో ఏమొ, నా ఒక్కగా నొక్క మనవడు," నానమ్మ, నానమ్మ... "అంటూ నిద్ర లేపాడు

కళ్ళు పెద్దవి చేసుకుని చుట్టూ చూసాను, ఎక్కడా దేవుడు కనపడ లేదు. ఇంతకాలం ఎప్పుడూ నోరుతెరిచి అడగని నేను ఇన్నాళ్ళకు వ్యక్తపరిచిన నా కోరికని కాదనలేక పోయాడెమో?

"ఏదైతేనేం, నా కిప్పుడు నా కర్తవ్యం తెలిసొచ్చింది . నా మార్గం నాకు స్పష్టంగా కనపడుతోంది " అని మనసులోనే అనుకుంటూ ఇంట్లో నుండి అడుగు బయట పెట్టాను.

(సమాప్తం)

ఆధ్యాత్మికం



# ధర్మ సందేహాలు

సహస్ర వ్యాస కవి


## నమస్కారంలో వున్న పరమార్థం



ఇద్దరు వ్యక్తులు కలుసుకున్నప్పుడు ఒకరినొకరు నమస్కరించుకోవడం భారతీయ సంస్కారం. ఇలా పలకరించుకునే పద్ధతి ఒక్కొక్క జాతిలో ఒక్కో విధంగా వుంటుంది. అవి.. వారివారి సంస్కృతీసంప్రదాయాలు, నాగరికతపై ఆధారపడి వుంటుంది. అయితే.. ఈ పలకరింపులన్నింటిలో భారతీయులది ఒక ప్రత్యేక శైలి. ఈ పలకరింపు శాస్త్రీయతతో మేళవించిన సంప్రదాయం. పెద్దవారిని చూడగానే చిన్నవారు చేతులు జోడించి నమస్కరించడం భారతీయులు చేసే పని. 'నమస్కారం'లో 'నమ' అంటే వంగి వుండటం. అంటే.. పెద్దల ఎదుట అహంకరించకుండా వుండట.

అసలు ఎందుకు నమస్కరించాలి..? ప్రస్తుతరోజుల్లో ప్రతిఒక్కరు పలకరించుకునేవిధంగా 'హాయ్', 'హలో' అని చెప్పుకుంటే సరిపోతుంది కదా అనే సందేహం కలగవచ్చు. కానీ.. అలా చేయకుండా నమస్కారం కచ్చితంగా చేయాలని జ్యోతిష్య నిపుణులు అంటున్నారు. అందుకు బలమైన కారణం కూడా వుంది. మానవ శరీరం ఒక విద్యుదయస్కాంత ఘటం. ధన, ఋణ ధృవాలు కలిస్తే విద్యుత్ ప్రవాహ మార్గం (సర్క్యూట్) పూర్తి అవుతుంది. మనిషి శరీరంలో అటువంటి ధృవాలు చేతి వ్రేళ్ళు. వాటిని కలపటం వల్ల సర్క్యూట్ పూర్తి అవుతుంది. విద్యుదయస్కాంత ఘటంలో విద్యుత్ చలనం మొదలవుతుంది. రెండు ఘటాలు దగ్గరైనప్పుడు ఒకదాని ప్రభావం మరొక దానిమీద ఉంటుంది. ఎక్కువ శక్తివంతమైన ఘటం సమక్షంలో తక్కువ శక్తివంతమైన ఘటంలో ప్రకంపనలు కలుగుతాయి. అవి సరిగా మేలు కలిగించే విధంగా ఉండటానికి చేసిన ఏర్పాటు ఈ నమస్కారం.

నమస్కరించటంలో కూడా ఎదుటివారిని బట్టి పద్ధతి మారుతుంది. దేవతలకు రెండు చేతులు సహస్రారంపై జోడించాలి. పెద్దలకు నుదుటిపై అంజలి ఘటించాలి. సాటి వారికి అభివాదం చేయటానికి రెండు చేతులను హృదయ స్థానంలో జోడించాలి. తల్లి, తండ్రి, గురువు, దైవం, ఆ స్థాయిలో గౌరవించదగిన వారెంకెవరైనా వారికి సాష్టాంగ నమస్కారం చేయాలి. దీనినే దండప్రణామమ్ అని కూడా అంటారు. అంటే, కర్ర లాగా నేలమీద పడి ,ఎనిమిది అవయవాలు భూమిని తగిలేట్టుగా నమస్కరించటం. స్త్రీలు పంచాంగాలతో చేస్తే సరి పోతుంది. స్త్రీల ఉదరం, వక్షస్థలం మనిషి అస్తిత్వానికి, పోషణకి నిలయాలు కనుక అవి నేలకు తగులరాదు. నిజానికి ఇలా చేయటం వల్ల నమస్కరించిన వ్యక్తికి ఎదుటివారి నుండి శక్తి ప్రసారం జరుగుతుంది.



పిల్లల కథ

# విజయ తంత్రం కథలు -3

## తెలివైన తాబేలు



ఒక అడవిలో ని చెరువులు ఒక తాబేలు ఉండే ది. ఒకరోజు సాయంత్రం అది నీటిలోంచి బయటకు వచ్చి ఒడ్డున నెమ్మదిగా తిరగసాగింది.

ఇంతలో అక్కడికి ఒక నక్క వచ్చింది దాన్ని చూసి నీటిలోకి వెళ్ళిపోవాలనుకుంది తాబేలు. కానీ ఇంతలో నక్క దాన్ని చూసింది. వెంటనే తాబేలు కాళ్లు తల లోపలికి లాక్కొని కదలకుండా ఉండి పోయింది.

నక్క-తాబేలు దగ్గరికి వెళ్లి దాన్ని పట్టుకొని చూసింది పైన డొప్ప గట్టిగా తగిలింది. తాబేలును తిరిగేసి మూతిని దగ్గరగా పెట్టింది ఇలా నక్క తనని పరీక్షిస్తున్న ఎంతసేపు తాబేలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఊపిరి బిగపట్టుకొని ఉన్నది. ఊపిరి బిగపట్టుకొని ఉన్నది ఇంతలో దానికి ఒక ఉపాయం తట్టింది. దాంతో ధైర్యం చేసి తలా కొంచెం బయట పెట్టింది అయ్యో నక్క బావ నువ్వు ఎన్ని తిప్పలు పడ్డా నా శరీరంలో ఇతర మాంస మైనా తినలేవు అంది తాబేలు. ఎందుకలా అన్నదో అర్థం కాక నక్క అయోమయంగా చూసింది. తాబేలు మళ్లీ నా శరీరం తీరే అంత నా అక్క బావ నీటిలోనుంచి పైకి రాగానే గాలి తగిలి గట్టిపడి పోతాను, మళ్లీ నీళ్లు తగిలాయి అనుకో వెంటనే మెత్తబడ్డ తాను అందుకే నువ్వు నన్ను కాసేపు ఆ నీటిలో నానబెట్టి ఆ తర్వాత కడుపారా తినొచ్చు అని చెప్పింది.

అసలే జిత్తులమారి నక్క మహా తెలివైనది కదా తాబేలు మాటలు నమ్మి నమ్మి అన్నట్టుగానే తల ఊపింది తాబేలు ను నీటిలో ఉంచి పారిపోకుండా కాలితో నొప్పి పెట్టింది. కాసేపయ్యాక తాబేలు తెలివిగా నక్క బావ నేను పూర్తిగా నాను కానీ నువ్వు కాలు పెట్టిన చోట నాన్న లేదు అన్నది. దాంతో నక్క కాలు రవ్వంత పక్కకు జరుపుతామని కాస్త పైకి లేపింది. అందుకోసమే కాచుకుని కూర్చున్న తాబేలు బతుకు జీవుడా అనుకుంటూ చటుక్కున నీటిలోకి జారిపోయింది..

★★★





**దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి**



**బొమ్మకు రంగులు వెయ్యండి**



## తేడాలు కనిపెట్టండి




తెలుగు
పదబంధం

# సాహితీ పద సుమతి – 9

**నిర్వహణ: దినవహి సత్యవతి**






* ఈ పేజీ ప్రింట్ తీసి జవాబులు వ్రాసి పంపండి.
* కరెక్టుగా వ్రాసి పంపిన వారిలో లాటరీ తీసి ఇద్దరికి రూ.116/– నగదు బహుమతి
* పంపవలసిన చివరి తేది :25 నవంబర్

**అడ్డం**

1.గజల్స్ ప్రక్రియలో ప్రసిద్ధి ఈ మల్లీశ్వరి (6)
6. విప్లవ కవి (2)
7. పారిపోవడంలో ...తికమక (5)
8. వైభవము (2)
9. అగ్ని పురుగులు చెల్లాచెదురు (5)
11. పిల్లలు మొదటిసారి అడుగులు వేస్తే వండేది (3)
12. పుడమా? అట్నించిటు (3)
13. మన పత్రిక (3)
14. కృష్ణుడు తడబడ్డాడు (3)
15. వరుస (3)
18. ముగ్గురు (2)
19. రావిశాస్త్రిగారి నవల (5)
21. అలనాటి కవయిత్రి విశ్వసుందరమ్మ ఇంటిపేరు (5)
23. పీఠిక / ఆరంభము (4)

**నిలువు**

1.నవ్య కవితా పితామహుడు (8)
2. ప్రఖ్యాత రచయిత రాజారావు యింటి పేరు (3)
3. సంస్కృతంలో అజమోదా / యామిని (2)
4. దురద అటూ ఇటూ (4)
5. తిరగబడి 'చెయ్యిరె' (4)
6. సరస్వతి గంగాధర రచన (6)
10. బానిస (3)
11. ఉల్లంఘనము (6)
16. ఆంగ్ల డబ్బు (2)
17. దొంగలింపబడినది (4)
20. చెడు ఆచారము (3)
22. భరిణ (2)

చిత్ర కవిత

# చిత్ర కవిత



ఈ క్రింద చిత్రానికి కవిత రాయండి , ఉత్తమ కవితకు రూ 116 బహుమతి ఇవ్వబడును

**సాహితీ పద సుమతి -7 ఫలితాలు**

నగదు బహుమతి విజేత

**తోట బలజికుమార్**

సాధారణ బహుమతి విజేత

ఎస్ .శ్రీనివాస రావు

సమాధానాలు సుమతి పత్రిక లోని పేజిలో మాత్రమే రాసి పంపాలి


| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| అ | బ్యా | రి | ధా | యా | రే | వి | |
| ర్థం | | | | మి | | 4 తా | 5 నా |
| 6 కి | రా | 7 తా | ళ్లు | ని | యం | | రా |
| గం | | ళ | | | | 8 పా | యు |
| 9 గా | 10 జు | వ | డు | | 11 ఆ | | ణ |
| 12 ధ | రి | త్రా | | 13 జ | హ | నా | రా |
| 14 ర | వా | లు | | 15 ర | వ | | వు |
| క | | | 16 శో | | 17 ము | 18 రా | |
| 19 వి | క | ట | క | వి | | 20 బా | అ |

సుమతి పాఠకుల అభిప్రాయాలకు అత్యంత విలువను ఇస్తుంది. మీ మంచి సలహాలే మా అభివృద్ధికి సోపానం. పాఠకుల సలహాలను, అభిప్రాయాలను ఈ క్రింది మెయిల్ కు పంపడి.

sumathi.salahalu@gmail.com

రాశి ఫలాలు

# ఈ నెల మీ అదృష్టం....



కొలుకుల చంద్ర శేఖర్




ఆత్మవిశ్వాసంతో కార్యసిద్ధి. అభివృద్ధికి సంబంధించినవ్యవహారాలులాభిస్తాయి. ఆదాయనికి తగిన వ్యయం ఉంటుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం. అనవసర విషయాల్లో కలుగజేసుకోకండి. బాధ కలిగించే వార్తలు వినాల్సి రావచ్చు. మానసిక ప్రశాంతత తగ్గకుండా చూసుకోండి. ప్రయాణాల్లో జాగ్రత్తలు అవసరం.సంతానపరంగా శుభవార్తలు వింటారు.




గ్రహబలం అనుకూలంగా ఉంది. శుభయోగాలున్నాయి. లక్ష్యసాధనలో అనుకున్నది సాధిస్తారు. బంధుమిత్రులు – కుటంబసభ్యుల సహకారం లభిస్తుంది. ఆర్థికంగా కూడా బాగుంటుంది. నలుగురిలో మంచి పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు. వృత్తిఉద్యోగాల్లో అధికారుల మెప్పు పొందుతారు సుభాకార్యాల్లో పాల్గొంటారు . ఆరోగ్యం పై శ్రద్ద అవసరం




సకాలంలో పనులు పూర్తవుతాయి .ఆత్మవిశ్వాసంతో కుటుంబసభ్యులతో సంతోషంగా గడుపుతారు. స్థిరాస్తి కొనుగోలు యత్నాలు కొలిక్కి వస్తాయి. స్వగృహ యోగానికి సరైన కాలం. ప్ర–యాణాలు అనుకూలిస్తాయి. ఆరోగ్య–పరంగా స్వల్ప జాగ్రత్తలు అవసరం. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. కార్తికమాస నియమాలు పాటించండి.




శుభయోగాలు కొనసాగుతాయి. మంచికాలం నడుస్తోంది. ఆర్థికంగా మాత్రం ఇబ్బందులు ఎదురుకాకుండా మాసుకోవాలి. అదనపు రుణాల జోలికి వెళ్లకండి. భవిష్యత్ ప్రణాళికలకు అనుకూల కాలం. విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆటంకాలను తెలివిగా అధిగమిస్తారు. స్థిరాస్తి కొనుగోలు వ్యవహారాలు అనుకూలిస్తాయి. ప్రయాణాలు కలిసివస్తాయి.




మీ మీ రంగాల్లో మంచి ఫలితాలు. శత్రువులపై విజయం సాధిస్తారు. శుభకార్యాల్లో పాల్గొంటారు. కొన్ని వ్యవహారాలు మాత్రం చికాకు కలిగించవచ్చు. ఆర్థికంగా మాత్రం బాగున్నప్పటికీ శ్రమకు తగిన *ప్రతిఫలం మాత్రం లభించకపోవచ్చు. పెద్దల సహకారంతో ముఖ్యమైన పనినిపూర్తి చేస్తారు. ఆరోగ్యం అనుకూలిస్తుంది. ఒక సమాచారం ఊరటనిస్తుంది.




మీ రంగాల్లో అభివృద్ధికి సంబంధించి ప్రత్యేక శ్రద్ధ అవసరం.వాయిదాపర్వానికి దూరంగా ఉండి పనులు పూర్తిచేసుకోండి. ముఖ్యమైన వ్యవహారాల్లో కుటుంబసభ్యుల సహకారం తప్పనిసరి. నిర్లక్ష్యం కారణంగా ఆరోగ్య సమస్యలు కాస్త ఇబ్బంది కలిగించవచ్చు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వ్యాపారంలో మిశ్రమ ఫలితాలు .

# ఈ నెల మీ అదృష్టం...






గొప్ప శుభ ఫలితాలు, వృత్తి ఉద్యోగంలో అనుకూలం శుభకార్యాల్లోపాల్గొంటారు. స్థిరాస్తికి సంబంధించిన వ్యవహారాలు ుకూలిస్తాయి.కుటుంబసభ్యులకు మంచి కాలం. నెల మధ్యలో మరిన్ని శుభాలు. ప్రయాణాలు కలిసివస్తాయి. భవిష్యత్ ప్రణాళిలకు సరైన సమయం.




భవిష్యత్ ప్రణాళికలు అమలు చేసే విషయంలో ఆటంకాలు ఏర్పడవచ్చు. స్థానచలన సూచనలు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకండి. కొన్ని సమయాల్లో అస్థిరబుద్ధితో వ్యవహరిస్తారు. ఆగ్రహావేశాలకు లోనుకావద్దు. ఆర్థికంగా బాగానే ఉంటుంది. నిత్యం నవగ్రహ ధ్యాన శ్లోకం పఠించండి.




అభీష్టాలు నెరవేరతాయి. సాహసోపేత నిర్ణయాలతో గొప్ప విజయాలు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. మిత్రుల వల్ల మేలు జరుగుతుంది. స్థిరాస్తి వ్యవహారాల్లో అనుకూల ఫలితాలు. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు.వృత్తి ఉద్యోగాలాలో పొరపాట్లు జరుగకుండా చూడండి. ఆరోగ్యం పై శ్రద్ధ వహించండి .




అన్ని విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. సమయానికి నిద్రా హారాలు అవసరం. చేపట్టిన పనుల్లో విఘ్నాలు రాకుండా చూసుకోవాలి. ఆర్థికపరంగ ఆచితూచి వ్యవహరించాలి. కీలకమైన విషయాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి ఇబ్బంది పెట్టే వాళ్లకు దూరంగ ఉండండి. కలహాలకు దూరంగ ఉండండి. నెల చివర్లో శుభాలు జరుగుతాయి. ఆరోగ్యం సహకరిస్తుంది.




మిశ్రమ కాలం . ప్రతిది అలోచించి నిర్ణయం తీసుకోండి . కొన్ని పరిస్థుతులు మీ ఉత్సాహాన్ని నీరుగారుస్తాయి. మీపై విమర్శలు చేసేవారు.ఎక్కువవుతారు. బంధుమిత్రుల వ్యవహారాల్లో అతిచొరవ తీసుకోవద్దు. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఆసక్తి చూపుతారు. ఆరోగ్యంపై శ్రద్ధను కొనసాగించాలి.




ముఖ్య వ్యవహారాలలో అప్రమత్తత అవసరం . చేపట్టిన పనుల్లో ఆటంకాలు చూసుకోవాలి. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. ఆత్మీయుల సహకారం అవసరం. మనస్థాపానికి గురిచేసే అంశాలకు దూరంగా ఉండండి. రుణభారాలు పెంచుకోకండి. కుటుంబసభ్యులతో సఖ్యతగా ఉండండి. నవగ్రహ శ్లోకాలు పఠించండి.

# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com

**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల.

**రూ. 25 /-** రూపాయలు


సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**


ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక

రూ.200 విలువచేసే పుస్తకాలను

ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది

నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే

చెయ్యండి

7 8 5 3 1 1 1 9 8 5

చందా కట్టిన వారికి ప్రతి నెల

flip బుక్ పాస్ వర్డ్ తో

పంపబడును

# సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# దసరా కవితల పోటీ ఫలితాలు

## సుమతి దసరా కవితల పోటీలలో రూ.250 బహుమతి పొందిన కవితలు

| | |
|---|---|
| 1. మాక్కొంచం సమయమివ్వండి | –బి .కళగోపాల్ |
| 2.కరచరవాణి | –వాడపల్లి పూర్ణ కామేశ్వరి |
| 3.పునరపి | – డి.నాగజ్యోతిశేఖర్ |
| 4. అమానవీయం | –పూజితా చరణ్ |
| 5. కార్పొరేట్ కొడుకు | –పొత్తూరి సీతారామరాజు |
| 6. ఆమె | –కోరాడ. అప్పలరాజు |

## సుమతి దసరా పోటీలలో రూ.116 బహుమతి కి ఎంపికైన కవితలు

| | |
|---|---|
| 1. నిను చూడాగానే | –వద్దాది రవికాంత్ శర్మ |
| 2.కర్మయోగి | – నామని సుజనాదేవి |
| 3. ధీర సైనికులు | –శ్రీదేవి విన్నకోట |
| 4. వర్షానికి ఒక లేఖ | –ప్రభా జ్యోత్స్న ఖండాపు |
| 5. | |
| 6. జులుం | –చిట్టేల. శ్రీధర కుమార్ |
| 7.ప్లాస్టిక్ పలకరింపులు | –కె.వి.సూర్యనారాయణ |
| 8. ఛిద్రం | – యర్రాబత్తిన మునీంద్ర |
| 9. ఋతువును ముద్దాడని శైశవం | –దాకరపు బాబూరావు |
| 10. యజ్ఞం | –శింగరాజు శ్రీనివాసరావు |
| 11. నంగనాచి నగరం | –చిలుకూరి ఉషారాణి |
| 12. తూకం | –పెనుమాక నాగేశ్వరరావు |

# సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

## దసరా కవితల పోటీ ఫలితాలు

### సుమతి దసరా కవితల పోటిలలో రూ.250 బహుమతి పొందిన కవితలు

1. మాకొంచం సమయమివ్వండి –బి .కళగోపాల్
2. కరచరవాణి –వాడపల్లి పూర్ణ కామేశ్వరి
3. పునరపి – డి.నాగజ్యోతిశేఖర్
4. అమానవీయం –పూజితా చరణ్
5. కార్పొరేట్ కొడుకు –పొత్తూరి సీతారామరాజు
6. ఆమె –కోరాడ అప్పలరాజు

### సుమతి దసరా పోటిలలో రూ.116 బహుమతి కి ఎంపికైన కవితలు

1. నిను చూడాగానే –వద్దాది రవికాంత్ శర్మ
2. కర్మయోగి – నామని సుజనాదేవి
3. ధీర సైనికులు –శ్రీదేవి విన్నకోట
4. వర్షానికి ఒక లేఖ –ప్రభా జ్యోత్స్న ఖండాపు
5. సాయమయ్యేదెపుడని –శ్రీధర్ బాబు అవ్వారు
6. జులుం –చిట్టేల. శ్రీధర కుమార్
7. ప్లాస్టిక్ పలకరింపులు –కె.వి.సూర్యనారాయణ
8. ఛిద్రం – యర్రాబత్తిన మునీంద్ర
9. ఋతువును ముద్దాడని శైశవం –దాకరపు బాబూరావు
10. యజ్ఞం –శింగరాజు శ్రీనివాసరావు
11. నంగనాచి నగరం –చిలుకూరి ఉషారాణి
12. తూకం –పెనుమాక నాగేశ్వరరావు



